# nallagoṇḍa jillā kathalu - pariśīlana
# (2010-2015)

(A Thesis submitted to the University of Hyderabad in partial fulfillment of the Degree of Doctor of Philosophy in Telugu)


**Researcher**

**DEVAIAH CHINTHAPALLY**

**15HTPH10**

**Supervisor**

**Prof. S. SARATHJYOTHSNA RANI**

**Department of Telugu**

**School of Humanities**

**University of Hyderabad**

**Hyderabad-500046**

**TELANGANA, INDIA**


**DECEMBER-2020**

# నల్లగొండ జిల్లా కథలు - పరిశీలన

## *(2010-2015)*

(పిహెచ్.డి. పట్టాకోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం)


**పరిశోధన**

**దేవయ్య చింతపల్లి**

**15HTPH10**

**పర్యవేక్షణ**

**ఆచార్య ఎస్. శరత్‌జ్యోత్స్నారాణి**

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు-500046

తెలంగాణ, భారతదేశం



డిసెంబర్-2020

# DECLARATION

I, **Devaiah Chinthapally,** hereby declare that this Thesis entitled ***"nallagoṇḍa jillā kathalu - pariśīlana (2010-2015)"*** Submitted by me under the guidance and supervision of **Prof. S Sarathjyothna Rani** is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodganga/ INFLIBNET.

Date: DEVAIAH CHINTHAPALLY

Place: Hyderabad Regd. No.15HTPH10

# CERTIFICATE

This is to certify that the Thesis entitled **"nallagoṇḍa jillā kathalu - pariśīlana (2010-2015)"**submitted by **Mr. Devaiah Chinthapally,** bearing **Regd. no.15HTPH10** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

Parts of this thesis have been: (NOT EXACT PARTS. Issues discussed in the following papers have been presented elaborately in the chapter 2nd and 4th of the thesis.

1. **"nallagoṇḍa jillā kathāsāhityaṁ"** (ISSN 2456-4702), Pg. no: 117-123, October, 2020.Edited byKolla Sri Krishnarao& Chief Editor. Published by 'Bhava Veena'- Talugu Monthly Magazine, Guntur dist., A.P.

2. **"nallagoṇḍa jillā raitukathalu-vastuviślēṣaṇa"** (ISSN 2582-7294), Pg. no: 16-19, December 2020. edited by Gudipaati. Published by 'Palapitta'- Talugu Monthly Magazine, Hyderabad.

and

**B. Presented in the following conferences:** (Issues presented in the following papers have been discussed elaborately in the chapters 2& 4 of the thesis)

1. **"nallagoṇḍa jillākathalu-daḷita udyamaṁ"** (National Seminar),by The Department of Telugu & Translation Studies, Dravidian University, Kuppam, A.P. On 1st- 2nd March, 2019.

2. **"nallagoṇḍa jillāka thāsāhityaṁ-vasturūpa vaividhyaṁ"** (Inter National Webinar), by The Department of Telugu, School of Indian Languages, Madurai Kamaraj University, Madurai, Tamilnadu. On 7th –8th September, 2020.

Further, the Student has passed the following courses towards fulfillment of coursework requirement for Ph.D. passed during his Ph.D. Course Work.

| **Course Code** | **Name** | **Credits** | **pass/fail** |
|---|---|---|---|
| 1. HT700 | Research Methodology | 4.00 | PASS |
| 2. HT701 | History of Telugu Research | 4.00 | PASS |
| 3. HT702 | Studies in Specialized Area | 4.00 | PASS |
| 4. HT703 | Broad Field | 4.00 | PASS |

Prof. S. Sarathjyoshna Rani
**Research Supervisor**

Prof. G arunakumari
**Head, Telugu**

Prof. S. Sarathjyoshna Rani
**Dean, Humanities**

# విషయసూచిక


**కృతజ్ఞతలు**

**ప్రవేశిక** **(i-vi)**

1. పరిశోధనాంశ వివరణ i

2. పరిశోధన లక్ష్యం i

3. పరిశోధన పరిధి ii

4. పూర్వ పరిశోధనలు ii

5. పరిశోధన ప్రణాళిక iii

6. ముగింపు v

**అధ్యాయం-1**

**1. నల్లగొండ జిల్లా చరిత్ర-భౌగోళిక, సామాజికాంశాలు (1-28)**

**1.1. నల్లగొండ జిల్లా చరిత్ర 1**

1.1.1. చరిత్ర పూర్వయుగం 1

1.1.2. శాతవాహనుల కాలం (క్రీ.పూ. 231–2255) 2

1.1.3. ఇక్ష్వాకులు (క్రీ.శ. 225–300) 3

1.1.4. విష్ణుకుండినులు 3

1.1.5. బాదామి చాళుక్యులు (క్రీ.శ. 546–755) 4

1.1.6. రాష్ట్రకూటులు (క్రీ.శ. 757–973) 4

1.1.7. కందూరి చోడులు (1040–1290) 4

1.1.8. కాకతీయులు (1000–1324) 5

1.1.9. కాకతీయ సామంతులు 5

1.1.10. బహమనీ సుల్తానులు (1357–1537) 5

1.1.11. కుతుబ్ షాహీలు (1518–1687) 6

| | | |
|---|---|---|
| 1.1.12. | మొఘలులు (1687–1724) | 6 |
| 1.1.13. | అసఫ్ జాహీలు (1724–1948) | 6 |
| **1.2.** | **భౌగోళిక అంశాలు** | **7** |
| 1.2.1. | హద్దులు | 7 |
| 1.2.2. | వైశాల్యం | 7 |
| 1.2.3. | నదులు, వాగులు | 8 |
| 1.2.4. | అడవులు | 8 |
| 1.2.5. | ఖనిజ సంపద | 8 |
| 1.2.6. | రవాణా | 8 |
| 1.2.7. | మండలాలు | 9 |
| 1.2.8. | ఉష్ణోగ్రత–వర్షపాతం | 10 |
| 1.2.9. | నేలలు | 10 |
| 1.2.10. | ఆనకట్టలు | 11 |
| 1.2.11. | వ్యవసాయం | 11 |
| 1.2.12. | గ్రామాలు–పట్టణాలు | 12 |
| 1.2.13. | పరిశ్రమలు | 12 |
| **1.3.** | **సామాజికాంశాలు** | **12** |
| 1.3.1. | జనాభా | 13 |
| 1.3.2. | భాషలు | 14 |
| 1.3.3. | కుల–మతాలు | 14 |
| 1.3.4. | కుటుంబ విధానం | 15 |
| 1.3.5. | ఆహారం | 16 |
| 1.3.6. | విద్యా | 16 |
| 1.3.7. | సంతలు | 17 |
| 1.3.8. | వృత్తులు | 17 |
| 1.3.9. | దేవాలయాలు | 18 |

1.3.10. ఆర్థిక స్థితి 19
1.3.11. తిరునాళ్ళు–జాతరలు 19
1.3.12. పండగలు 20
1.3.13. వస్త్రధారణ–ఆభరణాలు 20
1.3.14. విరామ సమయాలు–వినోదాలు 21
**1.4. నల్లగొండ జిల్లాలోని కవులు–పండితులు–రచయితలు 21**
**1.5. నల్లగొండ జిల్లా జానపద లలిత కళలు 25**

## అధ్యాయం-2

**2. నల్లగొండ జిల్లా కథా సాహిత్యం (29-52)**
2.1. కథావిర్భావ వికాసాలు 29
2.2. తెలుగు కథ–పుట్టుక 30
2.3. కథానిక లక్షణాలు–నిర్వచనాలు 31
2.4. తెలంగాణ కథాక్రమం 34
2.5. నల్లగొండ జిల్లా కథ–ప్రావిర్భావ వికాసాలు 35
2.6. నల్లగొండ జిల్లా కథలు–వికాస దశలు 38
2.7. నల్లగొండ జిల్లాలో — సాహిత్య పత్రికలు 48
2.8. నల్లగొండ జిల్లాలోని సాహితీ సంస్థలు 50

## అధ్యాయం-3

**3. నల్లగొండ జిల్లా కథలు-కథకుల పరిచయం (53-101)**
3.1. అంబటి వెంకన్న 53
3.2. అనసూయ 54
3.3. ఎం. రత్నమాల 56
3.4. ఎలికట్టె శంకర్ రావు 56
3.5. ఏనుగు నర్సింహారెడ్డి 58
3.6. కంచర్ల సత్యపాల్ రెడ్డి 59

3.7. కాటేపల్లి లక్ష్మీనరసింహమూర్తి 60
3.8. కాసుల ప్రతాపరెడ్డి 61
3.9. కె. కవిత 63
3.10. కొలనుపాక మురళీధర రావు 63
3.11. కోటమర్తి రాధాహిమబిందు 64
3.12. కోట్ల వనజాత 65
3.13. గాదె వెంకటేశ్ 66
3.14. గుడిపాటి వెంకటేశ్వర్లు 66
3.15. చందు తులసి 67
3.16. తాయమ్మ కరుణ (పద్మ) 68
3.17. తెలిదేవర భానుమూర్తి 68
3.18. దేవరాజు మహారాజు 70
3.19. దేవులపల్లి కృష్ణమూర్తి 74
3.20. నీరుడు సంజీవరెడ్డి 75
3.21. పి. చిన్నయ్య 76
3.22. పిట్టల శ్రీనివాస్ 76
3.23. పెండెం జగదీశ్వర్ 77
3.24. పెరుమాళ్ళ ఆనంద్ 79
3.25. బెల్లి యాదయ్య 79
3.26. బోధనం నర్సింహారెడ్డి 81
3.27. బోయపల్లి నర్సయ్య (నిర్మల్) 82
3.28. భూతం ముత్యాలు 84
3.29. ముదిగంటి సుజాతారెడ్డి 85
3.30. మేరెడ్డి యాదగిరిరెడ్డి 88
3.31. మోహన్ రుషి 90
3.32. యెన్నం ప్రభాకర్ 91

3.33. రమేష్ హజారి 93
3.34. వి. మల్లికార్జున్ 93
3.35. వేణు సంకోజు 93
3.36. వేముల ఎల్లయ్య 95
3.37. శిరంశెట్టి కాంతారావు 96
3.38. షాజహానా 97
3.39. సుజాత సూరేపల్లి 98
3.40. స్కైబాబ 99

## అధ్యాయం-4

**4. నల్లగొండ జిల్లా కథలు-సామాజికాంశాలు (102-288)**

4.1. మానవ సంబంధాలు 102
4.1.1. కుటుంబ సంబంధాలు 102
4.1.2. స్త్రీ-పురుష సంబంధాలు 116
4.1.3. భార్యాభర్తల సంబంధాలు 119
4.1.4. వివాహేతర సంబంధాలు 124
4.1.5. స్త్రీల గృహ, ఉద్యోగ హింస కథలు 131
4.1.6. ప్రేమ కథలు 137
4.1.7.విషాద కథలు 144
4.2. వికలాంగుల కథలు 148
4.3. సంస్కృతి సంప్రదాయాలు 153
4.3.1. ఆహారం, ఆటలు, పండుగలు, కళలు 153
4.3.2. మూఢ నమ్మకాలు 163
4.3.3. విద్య 169
4.3.4. నిరుద్యోగం 174
4.4. రైతు కథలు 176
4.5. కరువు-వలస జీవిత చిత్రణ కథలు 203

4.6. కుల వృత్తులు 212
4.7. భూస్వాములు/దొరలు–వెట్టిచాకిరి కథలు 222
4.8. ఉద్యమ కథలు 228
4.8.1. తెలంగాణోద్యమ నేపథ్య కథలు 228
4.8.2. విప్లవోద్యమ నేపథ్య కథలు 233
4.9. బహుజన కథలు 246
4.10. దళిత కథలు 253
4.11. మైనారిటి కథలు 263
4.12. పర్యావరణం కథలు 269
4.13. ఇతరసామాజిక సమస్యలు 271

**అధ్యాయం-5**

**5. నల్లగొండ జిల్లా కథలు-భాషాంశాలు (289-319)**

5.1. నామ పదాలు 290
5.2. క్రియా పదాలు 300
5.3. ధ్వన్యనుకరణ పదాలు 301
5.4. జంట పదాలు 303
5.5. అన్యదేశ్యపదాలు 305
5.6. సామెతలు, జాతీయాలు 311

**ముగింపు (320-327)**

**ఉపయుక్త గ్రంథసూచి (328-332)**

**అనుబంధం (333-336)**

**పుస్తకాల్లో ముద్రితమైన పరిశోధన పత్రాల నకళ్ళు (337-351)**

**జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువపత్రాల నకళ్ళు (352-353)**

*****

# కృతజ్ఞతలు

నేను పిహెచ్. డి. చేసేందుకు అవకాశం కల్పించినహైదరాబాద్ విశ్వవిద్యాలయానికీ, తెలుగుశాఖకూ...

అరక పట్టినోడికి అన్నం దొరకని పరిస్థితిలో తమలాగే తమ పిల్లలు కూడా కర్షకులుగా మారకూడదని, చదువుకొని తమ బతుకులు చక్కదిద్దుకోవాలని, అక్షరం ముక్క రాకున్నా ఆది గురువులై తమకు తెలిసిన రీతిలో మమ్ములను పెంచి పెద్ద చేసిన అమ్మ నాన్నలు వెంకటనరసమ్మ రాములుగారికి పాదాభివందనాలు.

నా పరిశోధనకు అన్ని వేళల్లోనూ అండగా ఉంటూ విలువైన సూచనల్ని అందించి పరిశోధన చేయించిన సహృదయులు, ప్రస్తుత స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ డీన్, మా అమ్మ లాంటి గురువు ఆచార్య యస్. శరత్ జ్యోత్స్నారాణిగారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

నా ఈ పరిశోధనకు డాక్టరల్ కమిటీ మెంబర్స్‌గా వ్యవహరించి, అమూల్యమైన సలహాలందించిన ఆచార్య రేమిల్ల వేంకట రామకృష్ణశాస్త్రి(పూర్వ ఆచార్యులు), ఆచార్య పిల్లలమర్రి రాములు గార్లకు...

తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య అరుణ కుమారిగారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మిగారికి, ఆచార్య గోనానాయక్‌గారికి, ఆచార్య ఎండ్లూరి సుధాకర్‌గారికి, డా. బాణాల భుంజంగరెడ్డిగారికి, డా. విజయకుమారిగారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

నా పరిశోధనకు సంబంధించిన పుస్తకాలను అందించడంతోపాటు చిన్నచిన్న సందేహాలను కూడా పెద్ద మనసుతో తెలియజేసిన నల్లగొండ జిల్లా కథకులు ఎలికట్టె శంకరరావు, మేరెడ్డి యాదగిరిరెడ్డి, డా.యెన్నం ఉపేందర్, డా.ఏనుగు నరసింహారెడ్డి, భూతం ముత్యాలు, సంగిశెట్టి శ్రీనివాస్, వేముల ఎల్లయ్య, జి. అనసూయ, వేణు సంకోజు, కోట్ల వనజాత, ఎన్. సంజీవరెడ్డిగార్లకు...ఇంకా నా పరిశోధనకు సంబంధించిన కథలు రాసిన రచయితలందరికీ....

పరిశోధనకు అవసరమైన పుస్తకాలను సేకరించుకోవడానికి సహకరించిన ఇందిరాగాంధీ మెమోరియల్ హైదరాబాదు విశ్వవిద్యాలయ గ్రంథాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, వివిధ గ్రంథాలయాల సిబ్బందికి, ఆయా పుస్తకాలయాల యాజమాన్యాలకు, గ్రంథకర్తలకు...

తెలుగు శాఖ బోధనేతర సిబ్బంది బాలాజీ, రాజశేఖర్, కృష్ణ, మధు, సంజీవయ్యగార్లకు...

వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని, పరిశోధన పత్రాలను సమర్పించటానికి అవకాశం కల్పించిన వివిధ విశ్వవిద్యాలయాల, కళాశాలల యాజమాన్యాలకూ, ఆయా సదస్సుల సంచాలకులకు...

ఎప్పుడు కలిసినా ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగే పెద్దలు శ్రీ వి.వి. రమణగారికీ, ఎల్లప్పుడు తన మోములో చిరునవ్వును చెరగనీయకుండా నన్ను ప్రోత్సహించి, ఉత్సాహపరుస్తూ, తగు సూచనలు ఇస్తూ, నాకు ఎం.ఫిల్‌లో ధైర్యాన్ని అందించిన తెలుగు విశ్వవిద్యాలయం భాషాభివృద్ధి పీఠం ఆచార్యులు జి.యస్. గేబ్రియల్‌గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

నేను ఎప్పుడు అడిగినా లేదనకుండా నన్ను ఆర్థికంగా ఆదుకున్న మా అన్నలు బాబు, వెంకటరత్నం, అక్కలు మేరి, పద్మలకు...

నా జీవన ప్రయాణంలో కడదాక తోడుగా నిలుస్తూ నా అభ్యున్నతికి ప్రత్యక్ష, పరోక్ష సహకారాన్ని అందిస్తున్న నా జీవిత భాగస్వామి శ్రీమతి హరితకు ప్రత్యేకంగా... కూతురు రితికకు ఆశీస్సులు.

నన్ను అమితంగా అభిమానించే వదినలు, అల్లుండ్లు, కోడలు, అన్నల కూతుర్లకు ఆశీస్సులు. అదేవిధంగా నాకు సహకరించిన మా బంధువులందరికీ పేరుపేరునా... శతకోటి వందనాలు.

ఎప్పటికప్పుడు తమ సహాయసహకారాలు అందించిన సీనియర్ అన్నలు, డా. గౌడిచర్ల జనార్థన్, డా. జక్కుల రాయమల్లు, డా. లింగమల్లు, డా. చిరంజీవి, డా. శ్రీనివాసరావు, డా. బొలుగాని శోభన్ బాబు, ధీరావత్ లక్ష్మణ్‌లకు...

నా బాధలు సంతోషాలను పాలు పంచుకొని నిరంతరం సలహాలిచ్చి ముందుకు ప్రోత్సహించి అండగా నిలిచిన మిత్రులు గడ్డం లింగరాజు, శ్రీహరి, భామండ్లపల్లి నరేందర్, ఎడ్ల శ్రీను, ఇస్రం శ్రీను, శ్రీలత మొదలైన సహపరిశోధకులకు....

అక్షరాలు అందంగా టైపు చేసి పరిశోధన గ్రంథాన్ని ఈరకంగా తీర్చిదిద్దిన డా. మంత్రి మల్లేశ్ అన్నగారికి,

అలాగే నాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ఎందరెందరో మహానుభావులు అందరికి పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

దేవయ్య చింతపల్లి

15HTPH10

*****

# ప్రవేశిక

## 1. పరిశోధనాంశ వివరణ

విప్లవాల పోరుగడ్డ నల్లగొండ జిల్లా, ఎన్నో ఉద్యమాలకు పుట్టినిల్లు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి, నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాటానికి నాంది పలికింది ఇక్కడే. ఆంధ్రమహాసభ, గ్రంథాలయోద్యమాల ద్వారా సాహితీ చైతన్యం వెల్లివిరిసింది. పై సంఘటనలు ఎంతోమంది రచయితలకు స్ఫూర్తినిచ్చాయి. నాటి జిల్లా తొలి కథకురాలు బండారు అచ్చమాంబ నుండి నేటివరకు వందేండ్లు నల్లగొండ కథ ఎన్నో మలుపులు తిరిగింది.

నల్లగొండ జిల్లా కథ, నవల, కవిత్వంలోనూ తన విశిష్టస్థానం సంపాదించుకున్నది. ఇక్కడ గర్వించదగ్గ రచయితలు ఎందరో ఉన్నారు. ఈ జిల్లా నుంచి కథ రాశిలోను, శిల్పంలోను, శైలిలోను, వస్తువులోను అనాకానేక మార్పులు పొందింది. భాష, యాస, మాండలికంలోను ప్రత్యేకతను చాటుకుంది.

కథా సాహిత్యం పట్ల నాకున్న అభిరుచి, ఆసక్తి కారణంగా కథా ప్రక్రియపై పరిశోధన చేయాలన్న పట్టుదల నాలో అధికమై నా పర్యవేక్షకులు ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి గారికి నల్లగొండ జిల్లా కథలపైన పరిశోధన చేస్తాను అని తెలియజేయడంతో నాకు 'నల్లగొండ జిల్లా కథలు-పరిశీలన'(2010-2015) అనే అంశాన్ని ఇవ్వడం, నల్లగొండ నుంచి అనేక మంది కథా రచయితలు సామాజిక అంశాలపైన కథలు రాస్తున్నారని చెప్పడం జరిగింది. కావున ఈ జిల్లాలోని కథా రచయితలు రాసిన కథలను సేకరించి, వారి పూర్తి బయోడేటాను సేకరించి, ఆ కథలలోని వస్తువును, సామాజికాంశాలను, భాషాంశాలను తీసుకొని అధ్యయనం చేయడం జరిగింది.

## 2. పరిశోధన లక్ష్యం

నల్లగొండ జిల్లా కథా సాహిత్యం ద్వారా ప్రతిబింబించే అంశాలు, అందులోని సమస్యలు, గ్రామీణ జీవితం, ప్రజల జీవన పోరాటం, ఉద్యమాలు, దళితుల సమస్యలు, వ్యవసాయంలో

ఆటుపోట్లు, ఫ్లోరిన్ నీటి సమస్యలు, నల్లగొండ జిల్లా ఆర్థిక, రాజకీయ, సామాజిక మార్పులు ఈ కథలల్లో చోటు చేసుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న అనేక మార్పులు ఈ కథలల్లో కనపడతాయి. ఇలాంటి కథలను సాహిత్య పరంగా అన్వయించి చెప్పడమే ఈ పరిశోధన లక్ష్యం.

## 3. పరిశోధన పరిధి

నల్లగొండ కథా రచయితలు రాసిన కథలను, నల్లగొండ జిల్లా కథలు-పరిశీలన' (2010-2015 వరకు) అనే అంశాన్ని తీసుకున్నాను. నా ఈ పిహెచ్.డి. పరిశోధనకున్న కాల పరిమితిని దృష్టిలో పెట్టుకొని ఆరు సంవత్సరాలలో వచ్చిన కథలను తీసుకోవడం జరిగింది. చాలా కథలు వచ్చినా ఒక పద్ధతి ప్రకారం 100 కథలను తీసుకొని విశ్లేషించాను. నేను నల్లగొండ జిల్లా ప్రాంతం నుంచి వచ్చిన కథలలోని వస్తువు, ఇతివృత్తం, సామాజిక, భాషా సాహిత్య అంశాలను తదితర రంగాలలోని విషయాలను చర్చించడం నా పరిశోధన పరిధిగా నిర్ణయించుకున్నాను.

## 4. పూర్వ పరిశోధనలు

నల్లగొండ జిల్లా సాహిత్యం, ప్రాంతం పై విశ్వవిద్యాలయాలలో జరిగిన పరిశోధనలు:

1. 'నల్లగొండ జిల్లా జానపద గేయాలు-సమగ్ర పరిశీలన' ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎం. ఉమారెడ్డి.
2. 'నల్లగొండ జిల్లా ఉయ్యాల పాటలు-ఒక పరిశీలన' ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఎన్. కల్పన.
3. 'నల్లగొండ జిల్లా దంపుడు పాటలు, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఎల్. చంద్రమౌళి.
4. 'నల్లగొండ జిల్లా జానపద గేయ గాథలు' ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఎం.శత్రుఘ్నురెడ్డి.
5. నల్లగొండ జిల్లా ఎల్లమ్మ కథలు-ఒక పరిశీలన' తెలుగు విశ్వవిద్యాలయం. కె.పద్మాచారి.
6. 'నల్లగొండ జిల్లా లంబాడీల పండుగలు-పరిశీలన'-తెలుగు విశ్వవిద్యాలయం. నాగయ్య భూక్యా.
7. నల్లగొండ జిల్లా నూతనకల్ మండలంలోని లంబాడీల జానపద వివాహ ఆచారాలు వ్యవహారాలు: ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఎ. సిల్మానాయక్.
8. 'నల్లగొండ జిల్లా యక్షగానాలు-ఒక పరిశీలన' హైదరాబాద్ విశ్వవిద్యాలయం. బి. కొండయ్య.

9. నల్లగొండ జిల్లా కథలు-ఉద్యమ చిత్రణ్' (1901-2005) ఉస్మానియా విశ్వవిద్యాలయం కందుల శ్రీను.

మొదలగున పరిశోధనలు తెలుగులో నల్లగొండ సాహిత్యంలో వచ్చాయి. పై పూర్వ పరిశోధనలు వివిధ విశ్వవిద్యాలయాల్లో జరిగాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని 'నల్లగొండ జిల్లా కథలు-ఉద్యమ చిత్రణ(1901-2005) పై కందుల శ్రీను పరిశోధన చేశాడు. కాని అతడు ఉద్యమ నేపథ్య కథలను మాత్రమే తీసుకొని పరిశీలించాడు. నేను ఆ తర్వాత 2010 నుండి 2015 వరకు వచ్చిన కథలపై పూర్తిగా అన్ని కోణాల నుండి వచ్చిన కథలను తీసుకొని, అన్ని సామాజికాంశాలను పరిశీలించి పరిశోధన చేశాను. నా పరిశోధనాంశం 'నల్లగొండ జిల్లా కథలు పరిశీలన'(2010-2015)పై అనేక అంశాలను చర్చించాను. ఈ పరిశోధనా గ్రంథంలో నేను ఆరు సంవత్సరాలలో వచ్చిన కథలను మాత్రమే తీసుకొని సేకరించి పరిశోధన చేశాను.

## 5. పరిశోధన ప్రణాళిక

పరిశోధనలో విషయ సేకరణ అనేది ప్రధానాంశం. పైన పేర్కొన్న పూర్వ పరిశోధనలను గమనించిన తర్వాత నల్లగొండ జిల్లా కథా సాహిత్యంపై అనుకున్న స్థాయిలో పరిశోధనలు జరగనందున కథా సాహిత్య విషయంపై పరిశోధన చేయదలచుకున్నాను. ఈ పరిశోధన కాల పరిమితిని దృష్టిలో ఉంచుకొని 2010-2015 మధ్య వచ్చిన కథా సాహిత్యంపై మాత్రమే పరిశోధన చేశాను. ఇందులో ప్రధానంగా ప్రత్యేక అంశాలను మాత్రమే స్థూలంగా చర్చించాను. విషయ సౌలభ్యం కోసం పరిశోధన విషయాన్ని అయిదు అధ్యాయాలుగా విభజించాను. అవి:

మొదటి అధ్యాయం:

నల్లగొండ జిల్లా చరిత్ర-భౌగోళిక, సామాజికాంశాలు. ఈ అధ్యాయంలో ఈ జిల్లా చారిత్రక, భౌగోళిక, సామాజిక, రాజకీయ అంశాలను విద్య, వైద్య, వ్యవసాయం, పరిశ్రమలు, ఆనకట్టలు, రవాణా సౌకర్యాలు, కుటుంబ విధానం, వేష భాషలు, మత విశ్వాసాలు, రాజకీయ చైతన్యం విపులంగా వివరించడమైంది.

రెండవ అధ్యాయం:

'నల్లగొండ జిల్లా కథా సాహిత్యం'న్ని రెండవ అధ్యాయంగా పెట్టుకున్నాను. ఇందులో నల్లగొండ జిల్లాలో జరిగిన అనేక ఉద్యమాలకు స్పందించి, కథా నేపథ్యం నుంచి సాహిత్య నేపథ్యం నుంచి రచనలు చేసిన రచయితలు ఎందరో ఉన్నారు. ఇక్కడ జరిగిన తెలంగాణ సాయుధ పోరాటాలు, జమీందారులు, భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా ఉద్యమాలు, నిజాం నిరంకుశ పాలన ఇవన్నీ ఇక్కడి రచయితల మనస్సులపై బలమైన ముద్ర వేశాయి. పై సంఘటనలు ఎంతోమంది రచయితలు మేల్కొనడానికి కారణమయ్యాయి. నల్లగొండ జిల్లా తొలి కథకురాలు బండారు అచ్చమాంబ నుండి నేటివరకు ఎంతోమంది కథకులు కథలు రాశారు. వారు రాసిన కథా సాహిత్యాన్ని విశ్లేషించాను.

మూడవ అధ్యాయం:

'నల్లగొండ జిల్లా కథలు–కథకుల పరిచయం'న్ని ఈ అధ్యాయంలో చర్చించాను. ఇందులో 2010 నుండి 2015 వరకు కథలు రాసిన రచయితలను మాత్రమే తీసుకొని వారియొక్క జీవిత విశేషాలు, రచనలు, అవార్డులు మొదలైన అంశాలను పరిచయం చేయడం జరిగింది. అందులో అంబటి వెంకన్న, అనసూయ, ఎం. రత్నమాల, ఎలికట్టె శంకర్ రావు, ఏనుగు నర్సింహారెడ్డి, కంచర్ల సత్యపాల్ రెడ్డి, కాటేపల్లి లక్ష్మీనరసింహమూర్తి, కాసుల ప్రతాపరెడ్డి, కె. కవిత, కొలనుపాక మురళీధర రావు, కోటమర్తి రాధాహిమబిందు, కోట్ల వనజాత, గాదె వెంకటేశ్, గుడిపాటి వెంకటేశ్వర్లు, చందు తులసి, తాయమ్మ కరుణ (పద్మ), తెలిదేవర భానుమూర్తి, దేవరాజు మహారాజు, దేవులపల్లి కృష్ణమూర్తి, నీరుడు సంజీవరెడ్డి, పి. చిన్నయ్య, పిట్టల శ్రీనివాస్, పెండెం జగదీశ్వర్, పెరుమాళ్ళ ఆనంద్, బెల్లి యాదయ్య, బోధనం నర్సింహారెడ్డి, బోయపల్లి నర్సయ్య (నిర్మల్), భూతం ముత్యాలు, ముదిగంటి సుజాతారెడ్డి, మేరెడ్డి యాదగిరిరెడ్డి, మోహన్ రుషి, యెన్నం ప్రభాకర్, రమేష్ హజారి, వి. మల్లికార్జున్, వేణు సంకోజు, వేముల ఎల్లయ్య, శిరంశెట్టి కాంతారావు, షాజహానా, సుజాత సూరేపల్లి, స్కైబాబ మొదలైన వారు ఉన్నారు.

నాలుగవ అధ్యాయం:

నల్లగొండ జిల్లా కథలు–సామాజికాంశాలు' అనే విభాగాన్ని ఈ అధ్యాయంలో చేర్చాను. ఇందులో 2010–2015 మధ్య కాలంలో వచ్చిన కథల్లోని సామాజికాంశాలను పరిశీలించాను. అవి: రైతు కథలు, మూఢనమ్మకాలు, కులవృత్తులు, మానవ సంబంధాలు, సంస్కృతి సంప్రదాయాలు,

విద్య, కరువు–వలస జీవిత చిత్రణ కథలు, స్త్రీ సంబంధ కథలు, ఉద్యమ కథలు, మైనారిటీ కథలు, బహుజన కథలు, దళిత కథలు, వికలాంగుల కథలు, ప్రేమ కథలు, విషాద కథలు, నిరుద్యోగం, వెట్టిచాకిరి కథలు, ఇతరాలు మొదలైన సామాజికాంశాలను విశ్లేషించాను.

అయిదో అధ్యాయం:

'నల్లగొండ జిల్లా కథలు–భాషాంశాలు' అనే విభాగాన్ని అయిదో అధ్యాయంలో విశ్లేషణ చేశాను. ఇందులో 'నల్లగొండ జిల్లా కథలు(2010–2015)'లోని భాషా పదజాలాన్ని నామపదాలు, క్రియా పదాలు, జంట పదాలు, ధ్వన్యనుకరణ పదాలు, అన్యదేశ్య పదాలు, సామెతలు, జాతీయాలు మొదలైన భాషా విశేష పదాలను పరిశీలించాను.

ఈ పరిశోధన గ్రంథ రచనకు ఉపయోగించుకున్న గ్రంథాల వివరాల (Bibliographic Information & Citations)ను కూర్చడంలో APA (American Psychological Association) వారిపద్ధతిని అనుసరించడమైంది.

### 6. ముగింపు

నల్లగొండ జిల్లా కథకులు ప్రజలతో మమేకమై వారి భాషలోనే విప్లవాలను, సామాజిక సమస్యలను, మానవ సంబంధాలలోని విలువలను గూర్చి తెలుపుతూ అనేక కథలు రాశారు. 2010 నుండి 2015 సంవత్సరాల మధ్యలో 400 కథలు వచ్చాయి. వాటన్నింటినీ పరిశీలించిన మీదట 100 కథలు మాత్రమే పరిమితి, పరిధిలోకి వచ్చాయి. నల్లగొండ కథల్లోని వస్తువులు దళిత, స్త్రీ, మైనారిటీ, బహుజన వాదాలతో కథలొచ్చాయి. అదేవిధంగా మానవ సంబంధాలు, రైతు, సంస్కృతి సంప్రదాయాలు, మూఢ నమ్మకాలు, కరువు, నిరుద్యోగం, వృత్తులు, ప్రేమ, విషాద మొదలైన వస్తువులతో నల్లగొండ కథలు వచ్చాయి. వేగంగా మారుతున్న సమాజ పరిస్థితులకు అనుగుణంగా ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన ఎన్నో రంగాల సమస్యలపై ఎంతోమంది రాసిన కథలు వెలుగులోకి వచ్చాయి.

ఈ సిద్ధాంత గ్రంథాన్ని విశ్లేషణకు అవసరమైన కథలను సేకరించడం జరిగింది. రచయితల దగ్గరకు వెళ్ళి వారితో మాట్లాడి, వారి నుండి వివిధ కథా పుస్తకాలను సేకరించాను. అదేవిధంగా

వివిధ పుస్తక విక్రయ కేంద్రాలనుండి, వివిధ విశ్వవిద్యాలయాల నుంచి కూడా అనేక పుస్తకాలను సేకరించి ఈ పరిశోధన గ్రంథాన్ని రాసాను.

'నల్లగొండ జిల్లా కథలు–పరిశీలన(2010–2015)' అనే అంశంపై నాకున్న సమయంలో, నాకున్న పరిధిలో, నా శక్తిమేరకు లభించిన సమాచారంతో, ఆధారాలతో సమగ్రంగా విశ్లేషించాను అనే తృప్తి కలిగింది. ఒక ప్రణాళిక ప్రకారం చేసిన ఈ పరిశోధన సహృదయులకు ఆమోదయోగ్యమవుతుందని విశ్వసిస్తున్నాను.

చివరగా ముగింపులో పరిశోధనా క్రమాన్ని, పరిశోధనా లక్ష్యాలను పరిశోధనా ఫలితాలను తెలియజేశాను.

అనుబంధంలో కథలపై ఇతర పండితుల అభిప్రాయాలను పొందుపరిచాను. పరిశోధనకు ఉపకరించిన ప్రధాన సమాచార ఆకరాలను, ఉపయుక్త గ్రంథ సూచికను అకారాది క్రమంలో పొందుపరిచాను.

సిద్ధాంత గ్రంథ రచనలో భాగంగా నా పరిశోధనకు సంబంధించిన అంశాలను వివిధ మాస పత్రికల్లో ప్రచురితమైన పత్రాలను పొందుపరిచాను. అలాగే వివిధ జాతీయ సాహిత్య సదస్సులలో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువ పత్రాల సమాచారాన్ని ఇచ్చాను.

ఈ మొత్తం పరిశోధనలో సాధ్యమైనంత వరకు సైద్ధాంతికత, శాస్త్రీయత, సహేతుకతలను పాటిస్తూ, పరిశోధన గ్రంథాన్ని రచించాను.

*****

# అధ్యాయం-1

# నల్లగొండ జిల్లా చరిత్ర-భౌగోళిక, సామాజికాంశాలు

## 1.1. నల్లగొండ జిల్లా చరిత్ర

తెలంగాణ రాష్ట్రంలో విప్లవాల ఖిల్లాగా పేరొందింది నల్లగొండ జిల్లా. పీడిత ప్రజల పక్షాన పోరాడిన తెలంగాణ సాయుధ పోరాటంలో వేలమంది మాన, ప్రాణాలు బలిదానం చేసిన పోరుగడ్డ నల్లగొండ జిల్లా. "నల్లగొండ పట్టణానికి అతి ప్రాచీనమైన పేరు 'నీలగిరి'." (వై.వి.కృష్ణారావు, ఏటుకూరి బలరామమూర్తి(సంపాదకులు). ఆంధ్రప్రదేశ్ దర్శి, పుట: 897). చాలాకాలం వరకు ఇది పానగల్లు పట్టణంలో భాగంగా ఉండేది. ఈ పట్టణం లతీఫ్‌సాహెబ్ గుట్ట, కాపురాల గుట్ట అనే రెండు నల్లరాళ్ళ గుట్టల మధ్యన ఉంది. రెండు నల్లరాళ్ళ గుట్టల మధ్యలో ఉండటం వలన దీనికి 'నల్లకొండ' అని పేరువచ్చి వాడుకలో 'నల్లగొండ' అయినట్లు భావించబడుతుంది. అల్లావుద్దీన్ బహమనీషా పరిపాలన తర్వాత నల్లగొండ అనేపేరు వచ్చింది. తొలుత ఇది కరీంనగర్ సుభాలో ఉండేది. "1905 సవంత్సరంలో 6వ నిజాం మహబూబ్ అలీ పాదుషా కాలంలో మెదక్ సుబాలోకి మార్చబడింది. అప్పుడు ఈ జిల్లాలో నల్లగొండ, భువనగిరి, సూర్యాపేట, దేవరకొండ, పెద్దదేవులపల్లి తాలుకాలు ఉండేవి. ఆ సంవత్సరంలోనే చేర్యాల, కోదాడ తాలుకాలు వరంగల్ జిల్లా నుండి విడిపోయి నల్లగొండ జిల్లాలో చేరాయి. 1953లో ఖమ్మం జిల్లా ఏర్పడ్డప్పుడు నల్లగొండ జిల్లాలోని జనగామ తాలుకా మొత్తం వరంగల్ జిల్లాకు మార్చబడింది." (బి.ఎన్. శాస్త్రి. నల్లగొండ మండల సర్వస్వం. పుట: 7) 1956లో కష్ణా జిల్లాలోని 23 గ్రామాలు గల మునగాల పరగణా హుజూర్‌నగర్ తాలుకాలోకి చేర్చబడింది. ఆది నుంచి అనేక వంశాల రాజులు ఈ జిల్లాను తమ రాజ్యంలో భాగంగా పరిపాలించారు. కొన్ని రాజ్యాలకు ఈ జిల్లాలోని కొలనుపాక, ఆమనగల్లు, పానగల్లు, తుమ్మలగూడెం, రాచకొండలు రాజధానులుగా కూడా ఉన్నాయి.

### 1.1.1. చరిత్ర పూర్వయుగం

పాతరాతియుగం నాటి మానవ చిహ్నాలు ఈ జిల్లాలో నాగార్జునకొండ, ఏలేశ్వరం, ఇంద్రపాలనగరం, జానకీపురం, రామగిరి, నార్కట్ పల్లి, వలిగొండ, సిరిపురం మొదలగు

ప్రాంతాలలో ఉన్నాయి. కొత్తరాతి యుగం (క్రీ.పూ. 4000-2000) నాటి అవశేషాలు నాగార్జునకొండ, ఏలేశ్వరం, దేవరకొండ తాలుకాలోని హుమంతాలపల్లి ప్రాంతాలలో ఉన్నాయి. "ఏలేశ్వరంలో నాగటికర్రు అనేకంగా లభించాయి. ఈ కాలంలో రాగులు, ఉలువలు, పెసలు పండించి ఆహారంగా వాడారు." (బి.ఎన్. శాస్త్రి. నల్లగొండ మండల సర్వస్వం. పుట: 27). "లోహయుగం (క్రీ.పూ. 2000-500) నాటి రాక్షసగుళ్ళు (సమాధులు) వాడపల్లి, వెల్లటూరు, శిరిపురం, చిట్యాల, తిప్పర్తి, నల్లగొండ, ఏలేశ్వరం, ముదిగొండ, జానకీపురం, వలిగొండ, రామగిరి, తుమ్మలగూడెం, నార్కట్‌పల్లి, వేములకొండ, అర్వపల్లి మొదలగు ప్రాంతాలలో కన్పిస్తుంది. ఈ యుగంనాటి ప్రజలు వరిపంట పండించడం నేర్చుకున్నారు. కొన్ని సమాధుల్లో త్రిశూలం కనిపించడాన్ని బట్టి ఆనాటి ప్రజలు శైవమతానుయాయులని భావించవచ్చు." (సుంకిరెడ్డి నారాయణరెడ్డి. నల్లగొండ జిల్లా సాహిత్య చరిత్ర. 2007, యూ.జి.సి.కి సమర్పించిన రిపోర్ట్, పుట:5).

బౌద్ధ, జైన మతాలు జిల్లాలోని నాగార్జునకొండ, ఫణిగిరి, గాజులకొండ, రామిరెడ్డిపల్లి, కొలనుపాక, సిరికొండ, ఇంద్రపురి మొదలగు ప్రాంతాల్లో వ్యాపించినట్లు చెప్పవచ్చు.

మౌర్యుల కాలంలో ఆంధ్రులు 30 దుర్గాలను కలిగి మౌర్య సామ్రాజ్యంలో భాగంగా ఉన్నారు. ఈ దుర్గాలలో జిల్లాలోని విజయపురి, ఫణిగిరి, గాజులకొండ, ఇంద్రపురి ఉండవచ్చునని పరిశోధకుల అభిప్రాయం.

### 1.1.2. శాతవాహనుల కాలం (క్రీ.పూ. 231-225)

శాతవాహనులు అశోకుని అనంతరం స్వతంత్రులయ్యారు. ఖారవేలుని సైన్యం పితుండ నగరం వెళ్ళేదారిలో నల్లగొండ జిల్లా ఉంది. తూర్పు, పశ్చిమ తీరరేవులను కలుపుతూకేంద్రంగా ఉన్న మూషిక నగరమే ఇంద్రపురి కావొచ్చని పరిశోధకుల అభిప్రాయం.

శాతవాహనుల నాణాలు ఏలేశ్వరం, నాగార్జునకొండ ప్రాంతాల్లో లభించడాన్ని బట్టి నాగార్జునకొండలో వారి శాసనాలు లభించడాన్ని బట్టి నల్లగొండ శాతవాహన సామ్రాజ్యంలో

భాగంగా ఉండేదని చెప్పవచ్చు. వాడపల్లి ప్రముఖ ఓడరేవుగా ఉండేది. ఇంద్రపురి, ఫణిగిరి, గాజులబండ, తిరుమలగిరిలలో బౌద్ధ స్తూపాలు ఉండేవి. సిరికొండ, కొలనుపాక, జైనపల్లి ప్రాంతాల్లో జైనమత సంబంధమైన బసదులు, జైనాలయాలు ఉండేవి. ప్రాకృతం ఆనాటి రాజభాషగా ఉండేది.

### 1.1.3. ఇక్ష్వాకులు (క్రీ.శ. 225-300)

శాతవాహన సామ్రాజ్యం పతనం తరువాత సామంత రాజ్యాలు స్వతంత్ర్యం ప్రకటించుకున్నాయి. వారిలో ఇక్ష్వాకులు ఒకరు. వీరు ప్రాచీన గణాలలో ఒకరైన 'ఇక్షు'గణంవారు. ఈ రాజులలో శాంతమూలుడు స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. నల్లగొండ జిల్లా కూడా ఇతని రాజ్యంలో ఉంది. "ఏహువుల శాంతమూలుని (క్రీ.శ. 265–290) యొక్క సేనాని 'ఎలిసిరి' పేర ఏర్పడిందని అంటారు." (బి.ఎన్. శాస్త్రి. నల్లగొండ మండల సర్వస్వం. పుట: 42).

ఇక్ష్వాకులనే శ్రీ పర్వతీయులంటారు. వీరి శాసనాలు నాగార్జునకొండ, కేసానుపల్లిలో లభించాయి. సింహపు ముద్రగల వీరి నాణాలు నల్లగొండ జిల్లాలో లభించాయి.

### 1.1.4. విష్ణుకుండినులు

ఈ వంశానికి చెందిన ఆద్యుడు మహారాజేంద్రవర్మ (క్రీ.శ. 358–390) శాలంకాయన, ఆనందగోత్రిక, పల్లవరాజులు యుద్ధాలలో మునిగి ఉన్నప్పుడు ఏలేశ్వరం అమరాబాద్, నల్లగొండ, కీసర, ఇంద్రపాల నగరం ప్రాంతాలను ఆక్రమించి ఇంద్రపాలనగరం రాజధానిగా క్రీ.శ. 358 ప్రాంతంలో రాజ్యాన్ని స్థాపించాడు.

ఇంద్రపురిని ఇంద్రపాలనగరం (తుమ్మలగూడెం, రామన్నపేట) అని బి.ఎన్.శాస్త్రి చెప్పగా ఇంద్రపురి, అమరపురి అని అమరపురి అమరావతి అని కొందరన్నారు. ఇంద్రభట్టారకవర్మ (క్రీ.శ.528–556) నెలకొల్పిన అనేక ఘటికాస్థానాలలో కీసర వద్ద ఘటకేశ్వరం ఒకటి. విష్ణుకుండిన నాణాలు నల్లగొండ జిల్లాలోని దొండపాడు, ఏలేశ్వరం, భువనగిరి, ఇంద్రపాల నగరం, ఫణీగిరి ప్రాంతాల్లో దొరికాయి.

### 1.1.5. బాదామి చాళుక్యులు (క్రీ.శ. 546-755)

చరిత్రకు అందిన ఆధారాలను బట్టి నల్లగొండ బాదామి చాళుక్యుల ఏలుబడిలో ఉందని భావించవచ్చు.

### 1.1.6. రాష్ట్రకూటులు (క్రీ.శ. 757-973)

తెలంగాణ ప్రాంతం బాదామి చాళుక్యుల తర్వాత రాష్ట్రకూటుల వశమైంది. రాష్ట్రకూట వంశీయుల పాలనలో నల్లగొండ జిల్లా సుమారు రెండు వందల సంవత్సరాలు ఉంది. వారి సామంతులు ఈ ప్రాంతాన్ని పాలించి, శాసనాలు వేయించారు. రాష్ట్రకూట వంశాన్ని నిర్మూలించి రెండవ తైలపుడు కళ్యాణి చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు. వీరికాలంలో నల్లగొండ జిల్లా వారి సామంతుల, దండనాయకుల మహాబలేశ్వరుల ఆధీనంలో ఉంది. ఈ వంశానికి సంబంధించిన అనేక శాసనాలు నల్లగొండ జిల్లాలో దొరికాయి. మాన్యఖేట రాజధానిగా పాలించే రాష్ట్రకూట రాజు కర్కలుని ఓడించి నల్లగొండ జిల్లాలోని కొలనుపాక రాజధానిగా చాళుక్య రాజ్యాన్ని పాలించాడని అంటారు. కొలనుపాక కళ్యాణిచాళుక్యుల తొలి రాజధాని అని కొందరి అభిప్రాయం.

### 1.1.7. కందూరి చోడులు (1040-1290)

కందూరి చోడులు నల్లగొండ జిల్లాను సుమారు 250 సంవత్సరాలు పరిపాలించారు. వీళ్ళ ఏలుబడిలో నామం ఏఋవచోడులు, నల్లగొండ దుర్గానికి ఏఋవ సింహాసనమని, ఏఋవ పీఠమని పేరు. దీని పరిధిలో మొదట అనేక ప్రాంతాలున్నా కాలక్రమంలో కృష్ణానదికి ఉత్తర, దక్షిణ భూములకే ఏఋవనాడు పరిమితమైంది. ఈ ప్రాంతాన్ని పాలించినందున వీరికి ఏఋవచోడులనే పేరు వచ్చినట్లైంది. కళ్యాణిచాళుక్య చక్రవర్తి అయిన ఆరవ విక్రమాదిత్యుని నుండి కందూరు నాడును పొందినప్పటి నుంచి వీరికి కందూరు చోడులనే పేరు వచ్చింది. వీళ్ళ కరికాల చోదుని సంతానం ఏఋవ మొదటి భీముని నుంచి రామనాథదేవ చోడమహారాజు వరకు 17మంది రాజులు (క్రీ.శ. 1040–1290) వరకు నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం ప్రాంతాలను పాలించారు.

### 1.1.8. కాకతీయులు (1000-1324)

కాకతీయులు ఆంధ్ర దేశమంతటిని తమ ఏలుబడిలోకి తెచ్చుకొని సుమారుగా 350 సంవత్సరాలు పరిపాలించారు. రాష్ట్రకూట తూర్పు, పశ్చిమ చాళుక్య రాజుల సైన్యాధ్యక్షులుగా, సామంతులుగా ఉండి స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పర్చుకున్నవారు కాకతీయులు.

గణపతి దేవుడు (1199–1263) తన కుమార్తె రుద్రమదేవిని నిడదవోలును పాలించే తూర్పు చాళుక్యునికి ఇచ్చి పెళ్ళి చేసినప్పుడు కొలనుపాక సీమను అరణంగా ఇచ్చాడు. రుద్రమదేవి 1289లో మరణించినట్లు నకిరేకల్ సమీపంలోని చందుపట్ల శాసనంవల్ల తెలుస్తుంది.

### 1.1.9. కాకతీయ సామంతులు

రేచర్లరెడ్డి వంశం, రేచర్ల పద్మనాయకులు, చెఱకురెడ్డి వంశం, కాయస్థులు, మాల్యాలవంశం, విర్యాలవంశం, యాదవరాజ్యం, నతవాడి వంశం, వెన్గొండ వంశం, పోలవాసపాలకులు, నాగ వంశీయులు, బాణవంశం, వైదుంబులు, కాకతీయ సామంత మాండలికులలో ముఖ్యులు. వీరిలో చివరిదాక అత్యంత విశ్వాసపాత్రులుగా ఉన్నవారు రేచర్ల పద్మనాయకులు. వీరు నల్లగొండ జిల్లాలోని పిల్లలమర్రి, నాగులపాడు ప్రాంతాలను మహాసామంతులుగా పాలించారు.

### 1.1.10. బహమనీ సుల్తానులు (1357-1537)

ఢిల్లీ ప్రభువుల నుంచి స్వతంత్రించిన హసన్ గంగు (1357–1358) బహమనీ రాజ్యం స్థాపించాడు. కాపయనాయకుని రాజ్యంపై దండెత్తి పానగల్లు కోటను ఆక్రమించి వాడపల్లి ప్రాంతం స్వాధీనపర్చుకున్నాడు. నీలగిరి కోటను ఆక్రమించాడు. అప్పటినుంచి దీనికి నల్లగొండ అనే పేరు వాడుకలోకి వచ్చింది. ఈ కాలంలో నల్లగొండ జిల్లా పద్మనాయకుల, విజయనగర రాజుల, బహమనీ చేతులు మారుతూ వచ్చినా, ఎక్కువ కాలం పద్మనాయకుల చేతుల్లోనే ఉంది. మూడవ మహమ్మద్‌షా (1463–1482) కాలంలో తీరాంధ్రతోపాటు తెలంగాణ బహమనీల వశమయ్యింది. కాబట్టి నల్లగొండ కూడా వీరి పాలనలోకి వచ్చింది.

### 1.1.11. కుతుబ్ షాహీలు (1518-1687)

1500 ప్రాంతంలో బహామనీ రాజ్యం 5 రాజ్యాలుగా రూపొందింది. ఇందులో కుతుబ్ షాహీలు ఒకరు. వీరు తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాలను పాలించారు. సుల్తాన్ కులీకుతబ్‌షా (1496–1453) గోల్కొండ రాజ్య స్థాపకుడు. ఇతడు (1496–1518) తెలంగాణ సుబేదారుగా ఉన్నాడు. రాచకొండ, పానగల్లు, దేవరకొండ, నల్లగొండ, ఉర్లుగొండ, ఉంద్రుఉగొండ, అనంతగిరి దుర్గాలను జయించి రాజ్య ఎల్లలను విస్తరించాడు. ఇతని ఆరవ కొడుకు అయిన ఇబ్రహీం కుతుబ్ షాను దేవరకొండ ప్రాంత పాలకునిగా నియమించాడు. ఈ కుతుబ్‌షాహీల పాలనా కాలంలో నల్లగొండ జిల్లా సర్వతోముఖాభివృద్ధి పొందింది.

### 1.1.12. మొఘలులు (1687-1724)

1687లో కుతుబుషా వంశం అంతమైంది. మెఘలులు గోల్కొండ కోటతోపాటు తెలుగు ప్రాంతాన్నంతటిని వశపర్చుకున్నారు. దక్కన్ రాజ్యాన్ని ఆరు సుబాలుగా విభజించారు. అందులో హైదరాబాద్ ప్రముఖమైంది. నల్లగొండ జిల్లా తొలుత మచిలీపట్నం సుబాలో ఉండి తర్వాత హైదరాబాద్ సుబాలో  చేరింది. ఔరంగజేబు కాలంలో నిర్మించిన రాచబాట (దండుబాట) హైదరాబాద్ నుండి మచిలీపట్నం వరకు ఉంది. ఈ బాట వెంట మైలు, మైలుకు నిర్మించిన గుమ్మటాలు, మసీదులు, విశ్రాంతి భవనాలు నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్, గుండ్రాంపల్లి, చిట్యాల, నార్కట్‌పల్లి, పామనగుండ్ల, సూర్యాపేట, మునగాల, వాడపల్లి వద్ద నేటికీ ఈ చిహ్నాలు ఉన్నాయి. ఈ కాలంలో నల్లగొండ జిల్లాలో సాంస్కృతికంగా మార్పులు జరిగాయి. ఉర్దూభాష రూపొందింది. దక్కన్, మొఘల్ సంస్కృతి కలిసి మిశ్రమ సంస్కృతి ఏర్పడింది. సర్వాయి పాపన్న మొఘల్ సర్ధార్‌లను హడలగొట్టి నల్లగొండ, గోల్కొండ, ఓరుగల్లు ప్రాంతాలను ఏలాడు. ఇతడు దాదాపు 20 సంవత్సరాలు పాలించాడు.

### 1.1.13. అసఫ్ జాహీలు (1724-1948)

నిజాం ఉల్ ముల్క్ ఈ వంశా స్థాపకుడు. ఇతని అసలు పేరు మీర్ ఖమ్రుద్దీన్‌ఖాన్ తెలంగాణా అంతా కూడా వీళ్ళ ఏలుబడిలో ఉంది. కాబట్టి నల్లగొండ జిల్లా కూడా వీళ్ళ రాజ్యంలో ఉన్నట్లే. వీరి

తిరుగుబాటు దురాక్రమణలకు నల్లగొండ జిల్లాలోని అనేక ప్రాంతాలు గురయ్యాయి. అనేక ఉద్యమాలు, వేలమంది మాన, ప్రాణత్యాగ ఫలితంగా 1948లో జరిగిన సైనిక చర్యద్వారా నిజాం రాజ్యం భారతదేశంలో విలీనమైంది. అప్పటినుండి నల్లగొండ జిల్లా హైదరాబాద్ రాష్ట్రంలో ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో భాగమయ్యింది.

## 1.2. భౌగోళిక అంశాలు

భౌగోళికాంశాలలో హద్దులు, వైశాల్యం, అడవులు, వాతావరణం, వర్షపాతం, కొండలు, నదులు, పట్టణాలు, గ్రామాలు, పంటలు, ఖనిజాలు, మండలాలు మొదలగు వాటి గురించి చెప్పుకోవచ్చు.

### 1.2.1. హద్దులు

నల్లగొండ జిల్లా 7 జిల్లాల మధ్యన ఇంచుమించు త్రిభుజాకారంగా ఉంది. దీనికి ఉత్తరాన మెదక్, వరంగల్ జిల్లాలు, దక్షిణాన గుంటూరు, మహబూబ్‌నగర్ జిల్లాలు, తూర్పున ఖమ్మం, కృష్ణా జిల్లాలు, పశ్చిమాన రంగారెడ్డి మరియు మహబూబ్ నగర్ జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి.

### 1.2.2. వైశాల్యం

"నల్లగొండ జిల్లా దాదాపు $16^0$-$25^0$ నుండి $17^0$-$50^0$ ఉత్తర అక్షాంశాల మధ్య మరియు $78^0$-$40^0$ నుండి $80^0$-$50^0$ తూర్పు రేఖాంశాల మధ్య 14, 242 చ.కీ.మీ. విస్తీర్ణంలో విస్తరించి ఉంది." (బొంతల చంద్రారెడ్డి, సాగునీటి వనరుల్లో-నల్లగొండ జిల్లా, పుట: 7. 2003). ఈ జిల్లాలోని భూమి వాయువ్య దిశ నుండి ఆగ్నేయ దిశ వైపుకు దిగిపోతుంది. దేవరకొండ మండలంలో ఒక గుట్టల వరుస వ్యాపించి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రవేశించింది. జిల్లాలో నైరుతి మూలాన బయలుదేరిన మరొక గుట్టల వరుస 'డిండి' నదిని ఆనుకొని ఈశాన్య దిక్కుకు వ్యాపించి వరంగల్ రెండుగా చీలింది. నాలుగో వరుస పసునూరు పడమట దిశనుండి బయలుదేరి సిరికొండ వరకు. అక్కడి నుండి నారాయణపురం, ఇబ్రహీంపట్టణం మధ్యనుండి ముందుకు పోయి వేములకొండ వైపు మరలి వంగి ఉంది.

### 1.2.3. నదులు, వాగులు

ఈ జిల్లాలో కృష్ణానది ముఖ్యమైంది. ఇదిగాక మూసి, ఆలేరు, డిండి, అహల్య (హోలియా) అను నదులు కృష్ణానదికి ఉపనదులు తూర్పు దిక్కుగా ప్రవహించి కృష్ణాలో కలుస్తాయి. ఈ జిల్లాలో కృష్ణానది పొడవు 53 మైళ్ళు. ప్రధానమైన ఉపనది మూసి. ఆలేరు (బిక్కేరు) కలుపుకొని 153 కి.మీ. ప్రవహించి వాడపల్లి దగ్గర కృష్ణానదిలో కలుస్తుంది. అహల్యనది ఆగ్నేయదిశగా 45మైళ్ళు ప్రవహించి కనగల్లు వాగును కలుపుకొని 82 మైళ్ళు ప్రవహించి కృష్ణానదిలో కలుస్తుంది.

ఈ జిల్లాలో ఆలేరు వాగు, వసంతవాగు, హోలియావాగు, శామీర్ పేటవాగు, పెద్దవాగు, శేశిలేటి వాగు, పాల్వాయివాగు, చింతపల్లివాగు, చిన్నపాలేరువాగు, వేములూరువాగు, పాలేరువాగు, కనగల్లువాగు ముఖ్యమైనవి.

### 1.2.4. అడవులు

జిల్లాలో అడవి ప్రాంత విస్తీర్ణం 2 లక్షల 36వేల 116 ఎకరాలు. సామాన్యంగా ఈ అడవుల్లో టేకు, తునికి, యిప్ప, నల్లమద్ది, సండ్ర, తుమ్మ, మామిడి, చింత, మట్టి మొదలైన వృక్షాలు ఉన్నాయి. కృష్ణానదితీర ప్రాంతంలో పర్వతారణ్యాలలో వృక్షసంపద ఎక్కువగా ఉంటుంది. మిగిలిన భాగంలోగల అడవులు చెప్పుకోదగ్గవి కావు.

### 1.2.5. ఖనిజ సంపద

జిల్లాలో సున్నపురాయి ఎక్కువగా లభ్యమవుతుంది. నందికొండ ప్రాంతంలో వజ్రాలు దొరుకుతాయని చెప్పడమే కాని ఆధారాలు లేవు. నాపరాయి కూడా కొద్దిపాటిగా లభిస్తుంది. ఈ మధ్యకాలంలో యూరేనియం నిక్షేపాలు కూడా ఈ జిల్లా పరిసర ప్రాంతాలలో విరివిగా ఉన్నాయని పరిశోధకులు నిర్ధారించారు.

### 1.2.6. రవాణా

నిజాం కాలంనుండి ఈ జిల్లాలో తాలుకా కేంద్రం నుండి జిల్లాకేంద్రానికి, జిల్లాకేంద్రం నుండి రాజధానికి రోడ్డు సౌకర్యం ఉంది. 1959లో జిల్లా పరిషత్‌లు, పంచాయతీ సమితులు

ఏర్పడ్డనాటినుండి అన్ని ముఖ్య గ్రామాలనుండి మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రాలకు రోడ్ల నిర్మాణం జరిగి ప్రయాణికులకు ఎంతో సౌకర్యం కలిగింది. ధాన్యం, రవాణా, నిత్యావసర వస్తువుల రవాణా ఈ మార్గాల ద్వారానే ఎక్కువగా జరుగుతుంది. ఇటీవల కాలంలో జిల్లా పరిషత్తు, గ్రామ పంచాయతీల నిధుల ద్వారా ప్రతి మారుమూల పల్లెకు సిమెంటు రోడ్లు, తార్ రోడ్లు ఏర్పాటు చేయబడ్డాయి. 9వ నెం. జాతీయ రహదారి ఈ జిల్లా మీదుగా వెళ్తుంది. హైదరాబాద్ నుండి ఈ జిల్లాలోని బీబీనగర్, భువనగిరి, ఆలేరు ప్రాంతాలమీదుగా ఖాజీపేట వరకు రైలు మార్గం ఉంది. అదేవిధంగా హైదరాబాదు నుండి జిల్లా కేంద్రం, మిర్యాలగూడ ప్రాంతాలమీదుగా గుంటూరు, అక్కడి నుండి విజయవాడ, తిరుపతి వరకు రైలు మార్గాలు ఉన్నాయి. జిల్లా కేంద్రం నుండి నాగార్జునసాగర్‌ను కలుపుకొని మాచర్ల వరకు రైల్వేలైను ప్రభుత్వ ఆలోచన ఉన్నప్పటికీ జిల్లా వాసులకు ఇది ఇప్పుడు కలగానే మిగిలిపోయింది. ఈ రైలు మార్గాల ద్వారా నిత్యం అనేక మంది వివిధ అవసరాల నిమిత్తం రాష్ట్ర రాజధానికి ప్రయాణం సాగిస్తున్నారు. అనేక నిత్యావసర వస్తువులు కూడా వివిధ ప్రాంతాలకు సరఫరా చేయబడుతున్నాయి.

### 1.2.7. మండలాలు

నల్లగొండ జిల్లాలో మొత్తం 59 మండలాలు ఉన్నాయి.

| | | |
|---|---|---|
| 1. ఆలేరు | 21. నకిరేకల్ | 41. గరిడేపల్లి |
| 2. ఆత్మకూరు | 22. నల్లగొండ | 42. హుజూర్‌నగర్ |
| 3. భువనగిరి | 23. నార్కట్ పల్లి | 43. జాజిరెడ్డిగూడెం |
| 4. బీబీనగర్ | 24. తిప్పర్తి | 44. కోదాడ |
| 5. బొమ్మల రామారం | 25. అనుముల | 45. మునగాల |
| 6. చౌటుప్పల్ | 26. చందంపేట | 46. మేళ్ళచెర్వు |
| 7. గుండాల | 27. దేవరకొండ | 47. మఠంపల్లి |
| 8. మోత్కూరు | 28. దామరచర్ల | 48. మోతె |
| 9. పోచంపల్లి | 29. గుర్రంపోడ్ | 49. నేరెడుచర్ల |
| 10. రాజాపేట | 30. మర్రిగూడ | 50. నడిగూడెం |

| | | |
|---|---|---|
| 11. రామన్నపేట | 31. మిర్యాలగూడ | 51. నూతనకల్ |
| 12. తుర్కపల్లి | 32. నాంపల్లి | 52. తుంగతుర్తి |
| 13. వలిగొండ | 33. నిడమనూరు | 53. తిరుమలగిరి |
| 14. యాదగిరిగుట్ట | 34. పెద్దవూర | 54. సూర్యాపేట |
| 15. చండూరు | 35. పి.ఎ. పల్లి | 55. పెన్ పహాడ్ |
| 16. చిట్యాల | 36. త్రిపురారం | 56. కేతపల్లి |
| 17. కట్టంగూరు | 37. వేములపల్లి | 57. డిండి (గుండ్ల పల్లి) |
| 18. కనగల్లు | 38. ఆత్మకూరు | 58. చింతపల్లి |
| 19. మునుగోడు | 39. చివ్వెంల | |
| 20. నారాయణపూర్ | 40. చిలుకూరు | |

### 1.2.8. ఉష్ణోగ్రత-వర్షపాతం

నల్లగొండ జిల్లా ఉష్ణమండలంలో ఉంది. ఇచ్చట విస్తారంగా ఉన్న కొండలు, పర్వతాలు. గుట్టలు, బోడులు ఉష్ణాన్ని గ్రహించి వేడి ప్రాంతంగా పరిగణించడానికి దోహదపడుతున్నాయి. నైరుతి రుతుపవన ప్రభావం ఉండే కాలంలో ఉష్ణం అంతగా ఉండదు. తక్కిన మాసాలలో వేడి అధికంగా ఉంటుంది. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసాంతం నుండి ఉష్ణోగ్రత దినదినాభివృద్ధి చెంది మే మాసంలో తారాస్థాయికి చేరుతుంది. అప్పటి దిన ఉష్ణోగ్రత $40^0$ c నుండి $48^0$ c వరకు కూడా ఉంటుంది. కనీస ఉష్ణోగ్రత $28^0$ ఉంటుంది. సాయంకాలం మబ్బు ఆకాశాన్ని కమ్ముకొని చల్లని గాలులు వీస్తాయి. చిరుజల్లులు పడతాయి. జూన్ మాసారంభం నుండి ఎండలు తగ్గి వర్షం పడుతుంది. డిసెంబర్ నుండి శీతాకాలం ఆరంభమవుతుంది.

### 1.2.9. నేలలు

జిల్లాలో ప్రధానంగా చాలా బలహీనమైన ఎర్రనేలలు ఉన్నాయి. "సారవంతమైన నల్లరేగడి నేలలు 9 శాతం మాత్రమే కృష్ణానది ఒడ్డు వెంబడి మరియు అక్కడక్కడ ఉన్నాయి. ఎర్రనేలలకు తోడు

ఇసుకనేలలు 47 శాతం ఉన్నాయి. చెలక భూములు 44శాతం ఉన్నాయి. (బొంతల చంద్రారెడ్డి, సాగునీటి వనరుల్లో-నల్లగొండ జిల్లా. పుట: 5, 2003)

### 1.2.10. ఆనకట్టలు

జిల్లా ప్రజలు ప్రధాన వృత్తి వ్యవసాయం. కృష్ణానదిపై నందికొండ వద్ద నిర్మించిన నాగార్జున సాగర్ ఆనకట్ట ప్రపంచ ప్రసిద్ధమైంది. ఈ ఆనకట్ట కుడికాలువ నుండి గుంటూరు జిల్లాలో సేద్యపు పొలాలకు, ఎడమకాలువ ద్వారా ఈ జిల్లాలోని హాలియా, నిడ్మనూర్, మిర్యాలగూడ, హుజూర్ నగర్, దామరచర్ల, నేరేడుచర్ల, వేములపల్లి, గరిడేపల్లి, కోదాడ, మేళ్ళచెరువు, చిలుకూరు మొదలగు మండలాలలో 3,06,240 ఎకరాల విస్తీర్ణం భూమి సాగు చేయబడుతుంది.

"మూసి ప్రాజెక్టు సూర్యాపేట మండలం సోలిపేట గ్రామ సమీపంలో మూసినదిపై 1954లో నిర్మాణం చేపట్టి 1958లో పూర్తి చేసారు. ఈ ప్రాజెక్టు ఎడమకాల్వ 41 కి.మీ. కుడికాల్వ 34 కి.మీ. ఉంటుంది. 42 గ్రామాల వ్యవసాయ భూములకు 30, 183 ఎకరాల సాగుకు నీరందిస్తుంది." (బొంతల చంద్రారెడ్డి, సాగునీటి వనరుల్లో-నల్లగొండ జిల్లా, పుట: 13, 2003)

డిండి ప్రాజెక్టు నల్లగొండ, మహబూబ్ నగర్ జిల్లాల సరిహద్దు గుండ్లపల్లి గ్రామ సమీపాన డిండి (దుందుభీ) నదిపైన 1943లో నిర్మించారు. దీనికింద 5061 ఎకరాల విస్తీర్ణానికి నీటిపారుదల సౌకర్యం లభిస్తుంది. (బొంతల చంద్రారెడ్డి, సాగునీటి వనరుల్లో-నల్లగొండ జిల్లా, పుట: 16, 2003) ఇదిగాక ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ, మోత్కూర్ బృందావన ఆనకట్ట, ఉట్కూర్-మారెపల్లి ఆనకట్ట, వేములకొండ ఆనకట్ట, రుద్రవెల్లి, సంగెం మొదలైన ఆనకట్టల ద్వారా వేల ఎకరాలు సాగుచేయబడుతున్నాయి. వీటితోపాటు అనేక చెరువులు, కుంటల ద్వారా కూడా సాగునీరు అందుతుంది. అయినప్పటికీ జిల్లాలో అనేకవేల ఎకరాలకు సాగునీరు అందటం లేనందున మరిన్ని ఆనకట్టలు జిల్లాలో నిర్మించాల్సిన ఆవశ్యకత ఉంది.

### 1.2.11. వ్యవసాయం

జిల్లాలోని ప్రజల ముఖ్యవృత్తి వ్యవసాయం. ఇక్కడ భూమిని నల్లభూమి, ఎర్రచెల్క భూమి, నల్లరేగడి భూమి అని పిలుస్తారు. ఈ భూములు పంటలకు ప్రశస్తమైనవి. ఇక్కడ సంవత్సరంలో ఆచి,

లూచి (వానకాలం, వేసంగి) అనే రెండు పంటలు పండిస్తారు. చెలక పంటలలో జొన్నలు, సజ్జలు, వేరుశనగ, ఆముదం, పెసలు, కందులు మొదలైనవి ప్రధానమైనవి. ఒకప్పుడు ఆముదం సాగుచేసే భూమి అత్యధికంగా ఉండి రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. అనాదిగా వస్తున్న సజ్జ, జొన్న, ఆముదం పంటలు ఈ మధ్య కాలంలో వెనుకపడుతున్నాయి. ఇటీవల కాలంలో మామిడి, నిమ్మ, బత్తాయి తోటలను అధిక మొత్తంలో పెంచటం ఈ జిల్లాలోని వ్యవసాయాభివృద్ధికి నిదర్శనం. కూరగాయలు ఇతర చిల్లర పంటల విషయంలో ఈ జిల్లాకు అంత ప్రాముఖ్యత లేదు. ఈ జిల్లాలో ఫ్లోరిన్ శాతం ఎక్కువగా ఉన్నందున పంటల దిగుబడి కూడా ఆశాజనకంగ లేదు.

### 1.2.12. గ్రామాలు-పట్టణాలు

నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం 2 పార్లమెంటు స్థానాలు(లోక్‌సభ), 12 అసెంబ్లీ (విధానసభ) స్థానాలు, 4 మున్సిపాలిటీలు, (నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరి) 59 మండలాలు, 1178 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటితోపాటు హుజూర్ నగర్, కోదాడ, దేవరకొండలను, హాలియా, నేరెడు చెర్లను మున్సిపాలిటీలుగా గుర్తించారు.

### 1.2.13. పరిశ్రమలు

జిల్లాలో చెప్పుకోదగిన పరిశ్రమలు లేనప్పటికీ ఇటీవల కాలంలో జిల్లా సరిహద్దు ప్రాంతాలైన బీబీనగర్, చౌటుప్పల్ మరియు జిల్లాలోని అనేక ప్రాంతాలలో పరిశ్రమలు స్థాపించబడ్డాయి. జిల్లాలో నాపరాయి, సున్నపురాయి విరివిగా లభించడంవల్ల దామరచర్ల మండలంలోని వాడపల్లి వద్ద రాశి సిమెంట్ కర్మాగారం, మేళ్ళ చెరువు వద్ద దక్కన్ సిమెంట్ కర్మాగారం, కోదాడ సమీపంలో ప్రియా సిమెంట్ కర్మాగారాలు స్థాపించబడి వేలకొలది స్త్రీ, పురుషులకు జీవనోపాధి కల్పించబడుతుంది.

### 1.3. సామాజికాంశాలు

పూర్వం 'నీలగిరి'గా పేరున్న ఈ జిల్లా నేడు నల్లగొండగా వ్యవహరించబడుతుంది. చరిత్ర పూర్వయుగంలో కూడా ఈ జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు కనబడుతున్నాయి. శాతవాహన తదనంతర రాజవంశాల ఏలుబడిలో ఉండి 1724 లో ఢిల్లో సామ్రాజ్యం నుండి విడిపోయి నిజాం

రాష్ట్ర భూభాగమయ్యింది. అప్పటినుండి 1948 వరకు నిజాం సంస్థానంలో అంతర్భాగమైంది. పోలీస్ చర్య తర్వాత హైదరాబాద్ రాష్ట్రంలో చేరింది. భాషాప్రయుక్త రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ సందర్భంలో నవంబర్ 1956లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ జిల్లా అంతర్భాగమైంది.

ఒకవైపున దేవాలయ సాంస్కృతిక విజ్ఞానం విస్తరిస్తున్నా, మరొకవైపు విప్లవోద్యమ భావాలకు నిలయమై వీర తెలంగాణ నిర్మాణానికి కేంద్రంగా నిలిచింది. ఒకవైపు కృష్ణానది ప్రవహిస్తున్నా, మరొకవైపున తొండలు గుడ్లుపెట్టే భూములున్నాయి. ఈ జిల్లాలో హిందువులు, ముస్లీంలు, క్రిష్టియన్లు, లంబాడీలు అధిక సంఖ్యలో ఉన్నారు. తమిళులు, గుజరాతీలు, పంజాబీలు, మళయాళీలు మహారాష్ట్రులు, ఒరియా ప్రజలు తక్కువ సంఖ్యలో ఉన్నారు. ప్రాజెక్టులు, కాలువల కింద వ్యవసాయం ఎక్కువగా సాగుచేయబడుతునందున స్థానిక కూలీలు సరిపోక గుంటూరు, మహబూబ్ నగర్ జిల్లాల నుండి మరియు ఇతర ప్రాంతాల నుండి కూలీలు వలస వచ్చి కొన్ని దినాలు పనిచేసి వెళ్తారు. ఈ జిల్లా నుండి జీవనాధారం కొరకు వలసపోయేవారి సంఖ్య కూడా గణనీయంగా ఉంది. భూదానోద్యమానికి నాంది పలికిన 'పోచంపల్లి' గ్రామం ఈ జిల్లాలోనే ఉంది. పల్లెల్లో వివిధ వృత్తులవారు వ్యవసాయం, అనుబంధ వృత్తులు కమ్మరి, కుమ్మరి, నేత, చాకలి, మంగలి, బుట్టలు అల్లుకునేవారు, గోనెసంచులు నేసేవారు మొదలైన వృత్తులను అంటిపెట్టుకొని జీవనాధారం సరిపోక జీవిస్తున్నారు.

వ్యవసాయరంగం క్షీణదశ పట్టడంవల్ల పెట్టిన పెట్టుబడులు రాక అనేకమంది ఆత్మహత్యలతో ఆహుతైపోతున్నారు. మరోదిక్కు దేవరకొండ దాని పరిసర గిరిజన తండాలలో ఆడపిల్లల అమ్మకాలు జరుగుతున్నాయి. భూగర్భ జలాలు అతిలోతుకు పోవడంవల్ల నీటి నాణ్యత మారి ఫ్లోరైడ్ సమస్యతో ముప్పై సంవత్సరాలకే వేలాదిమంది రోగపీడుతులై ఏ పని చేయలేక జీవచ్ఛవాలుగా మిగిలిపోతున్నారు. ఈ జిల్లా ప్రజల కుటుంబ విధానం, ఆర్థికస్థితి, వస్త్రధారణ, ఆహారపు అలవాట్లు మొదలైన విషయాలను క్లుప్తంగా పరిశీలిద్దాం.

**1.3.1. జనాభా**

"2001 సంవత్సరపు జనాభా గణన ప్రకారం 32,47,982 జనాభా కలిగి ఉంది. గ్రామీణ జనాభా 28,14,163 కాగా పట్టణ జనాభా 4,29,458గా ఉంది. పురుషులు 16,51,990, స్త్రీలు

15,95,992 ఉన్నారు. ప్రతి వెయ్యిమంది పురుషులకు 966 స్త్రీలు ఉన్నారు. చ.కీ.మీ. 227 జనసాంద్రత ఉంది." (fifth economic senus - Nalgonda district, 2005. పుట: 6-10)

### 1.3.2. భాషలు

ఈ జిల్లాలో తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలు ప్రధానంగా వాడబడుతున్నాయి. జిల్లాలో ఎక్కువగా హిందువులు ఉండటం వలన తెలుగు మాట్లాడేవారి సంఖ్య ఎక్కువ. గ్రామీణ ప్రాంతాలలో ఈ భాషను ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ జిల్లా ముస్లీం రాజుల ఏలుబడిలో ఉండటంవల్ల హిందీ, ఉర్దూ భాషలు కూడా ఈ జిల్లా వాసులు మాట్లాడుతున్నారు. విద్యా ప్రాధాన్యత పెరగటంవల్ల ఇంగ్లీష్ భాషను విరివిగా నేర్చుకున్నప్పటికీ ఈ భాష మాట్లాడేవారి సంఖ్య తక్కువనే చెప్పవచ్చు. ఇక్కడి నుండి బతుకుదెరువు కోసం వివిధ రాష్ట్రాలకు వెళ్ళొచ్చిన జనాలకు మరాఠి, కన్నడ, తమిళ భాషలతో కూడా పరిచయం ఏర్పడుతుంది. ఈ జిల్లాలో స్థిరపడిన పంజాబీలు, గుజరాతీలు, మరాఠీలు, ఒరియావారు, నేపాలీలు వారివారి భాషలనే మాట్లాడతారు. ఇక్కడ లంబాడీలు మాట్లాడే భాషను 'లంబాడీ' భాష అంటారు. ఈ భాషకు లిపిలేదు. ముస్లీంలలో ఒక వర్గంవారైన 'కాశె' వారు మాట్లాడే భాష కూడా ప్రత్యేకమైంది.

### 1.3.3. కుల-మతాలు

ఈ జిల్లాలో ప్రధానమైన మతాలు మూడు. హిందువులు, ముస్లీంలు, క్రైస్తవులు. జిల్లాలో అధిక సంఖ్యగలవారు హిందూమతస్తులు. హిందూ మతస్తులలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే వర్ణాశ్రమ ధర్మాలను అనుసరించి నాలుగు కులాలు ఉన్నాయి. వీరుగాక హరిజనులు, గిరిజనులు కూడా హైందవ జాతికి చెందినవారే. పూర్వం బౌద్ధ, జైన, మతాలు ఈ జిల్లాలో ఉన్నట్లుగా నందికొండ, కొలనుపాక అనే యాత్రాస్థలాల వలన తెలుస్తుంది. కాని ఆ రెండు మతాలవారు లేరనే చెప్పవచ్చు. అప్పుడప్పుడు బౌద్ధ సన్యాసులు, జైనులు ఈ స్థలాలకు చూడడానికి రావడం మాత్రమే జరుగుతుంది. నేటికీ పల్లెల్లో వివిధ కులాలవారు ఆయా కులాల వృత్తులనే అంటిపెట్టుకొని ఉన్నారు.

ఉదా. వడ్రంగి కట్టెపని, చాకలి బట్టలుతుకుట, కుమ్మరి కుండల పని, వడ్డెర్లు తవ్వుడు పని, హరిజ్జనులు తోళ్ళపని మొదలైనవి చేస్తున్నారు.

ఈ జిల్లాలో 'లంబాడీ' జనుల సంఖ్య కొంత ఎక్కువే. వీరినే 'బంజారాలు' అని కూడా అంటారు. "ఈ బంజారాలు అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో, వరంగల్ జిల్లాలోనూ, ఆ తర్వాత స్థానంలో నల్లగొండ జిల్లాలోనూ నివసిస్తున్నారు." (సూర్యధనుంజయ్, నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం–జీవన చిత్రణ, పుట: 20). వీరు పొట్టపోసుకోవడానికి ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వెళ్ళి చిన్నచిన్న గుంపులుగా గుడిసెలు వేసుకుంటారు. ఇట్టి గుడిసెల సమూహాలను 'తండాలు' అంటారు. వీరి వస్త్రాధారణలో కూడా ప్రత్యేకత ఉంది. ఇటీవల కాలంలో విద్యావంతులై నాగరికత పెరిగి ఆచారవ్యవహారాలలో, వస్త్రాధారణలో మార్పులు వచ్చాయి.

హిందువుల తర్వాత జనాభాను బట్టి జిల్లాలో మహమ్మదీయులు రెండవ స్థానాన్ని ఆక్రమించారు. ముస్లింలలో అధిక సంఖ్యాకులు 'సున్ని' తెగకు చెందినవారు 'షియా' తెగకు చెందినవారు కూడా ఉన్నారు. వీరిలో షేక్, సయ్యద్, మొగల్, పఠాన్, బోరి, దూదేకుల జాతులవారు ఉన్నారు. ఈ జిల్లాలోగల క్రైస్తవ మతస్తులంతా దాదాపు ఎప్పుడో ఒకప్పుడు హిందువులుగా ఉండి క్రైస్తవులుగా మారినవారే. క్రైస్తవులలో క్యాథలిక్స్, ప్రొటెస్టెంట్స్ అనే రెండు వర్గాలవారున్నారు. మూడు మతాలవారు మత విషయాలలో భిన్న మార్గాలను అనుసరించినా, మానవజాతి ఒకటియే అనే భావం కలిగి ఐకమత్యంగా జీవించటం జిల్లా ప్రజలు గర్వించదగిన విషయం.

### 1.3.4. కుటుంబ విధానం

పూర్వం సమిష్టి కుటుంబాల సంఖ్య అధికంగా ఉంది. భూపరిమితి, ఆస్తిపరిమితి చట్టాల వలన సమిష్టి కుటుంబాల స్థానాన్ని వ్యష్టికుటుంబాలు తీసుకున్నాయి. జీవనాధారానికి యువతీ యువకులు ఉద్యోగం చేయటం వలన, ఇతర ప్రదేశాలకు వెళ్ళటం వలన వ్యష్టి కుటుంబాల సంఖ్య పెరిగింది. కుటుంబ వ్యవస్థకు వివాహపు కట్టుబాట్లు అన్ని మతాల ప్రజలలోనూ ఉంది. హిందువులలో ఒకే భార్య సిద్ధాంతం చట్టబద్దమైతే ముస్లీంలలో బహుభార్య సిద్ధాంతం చట్టబద్ధమైంది.

క్రైస్తవులు ఒకే భార్య సిద్ధాంతాన్ని పాటిస్తున్నారు. పురుషులు ఉద్యోగం, వ్యవసాయం, వ్యాపారం తదితర పనులు నిర్వహిస్తూ, స్త్రీలు ఇంట్లో వంటవార్పు, పిల్లల పెంపకం తదితర ఇంటి పనులు చేస్తున్నారు. విద్యావంతులైన యువతీ యువకులు అమెరికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, సింగపూర్, అరబ్ దేశాలలో, దేశంలోని మహా నగరాలైన ఢిల్లీ, ముంబాయి, చెన్నై, బెంగళూర్ మొదలైన ప్రాంతాలలో ఉద్యోగ జీవితం గడుపుతున్నారు. పల్లెలలో స్త్రీలు ఇంటిపనులు చేయటమేకాక బయటి వ్యవసాయ పనులు (నాట్లు, కోతలు మొదలైనవి) చేయటానికి వెళ్తారు.

### 1.3.5. ఆహారం

జిల్లాలో ప్రజల ప్రధాన ఆహారంగా వరి అన్నం, పల్లెల్లో కొంతమంది వ్యవసాయ కూలీలు సజ్జ, జొన్న, రాగి అన్నం, రొట్టెలను నేటికీ ఆహారంగా స్వీకరిస్తున్నారు. పట్టణ ప్రాంతపు జనాలతోపాటు, పల్లెటూరి గ్రామీణులు కూడా గోధుమను విరివిగా వాడుతున్నారు. పూర్వకాలంలో 'గంజి'ని కూడా వాడినప్పటికీ నాగరికత పెరిగిన ఈ కాలంలో గంజి వాడకం కనుమరుగైపోయిందని చెప్పవచ్చు.

### 1.3.6. విద్య

ఈ జిల్లాలో విద్యారంగం ప్రగతి పథంలోనే ఉందని చెప్పవచ్చు. విశ్వవిద్యాలయం, వృత్తివిద్యా కోర్సు కళాశాలలు కూడా ఉండటంవల్ల ఉన్నత విద్య కూడా ఈ జిల్లాలో అందుబాటులో ఉంది. "ఈ జిల్లాలో 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. 2 పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి." (Hand book of statistics-Nalgonda District, 2009, పుట: 223, 224) "639 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 311 ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు, 2500 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి." (Hand book of statistics-Nalgonda District, 2009, పుట: 208 నుండి 215) 2 ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలతోపాటు అనేక ప్రైవేటు విద్యాసంస్థలు విద్యాభివృద్ధిలో తోడ్పడుతున్నాయి. బాల కార్మికుల నిర్మూలనకోసం ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా (రెసిడెన్సియల్ బ్రిడ్జికోర్సు క్యాంపులు, యం.వి.ఎఫ్. సంస్థ) విద్యనందిస్తుంది. వయోజనులలో అక్షరాస్యత పెంచటానికి నిరంతర విద్యాకేంద్రాలు కృషి చేస్తున్నాయి. 'మహిళా శిశు

సంక్షేమంకోసం జిల్లాలో 18 ఐసీడీఎస్ పరిధిలో 3,646 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ అంగన్‌వాడీ కేంద్రాలలో 1 నుంచి 3 సంవత్సరాల పిల్లలు 83, 709 ఉన్నారు. 3 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలు 1,08,346 మంది ఉన్నారు. (అంగన్‌వాడీ అంతా బురిరి, సెప్టెంబర్ 01, 2009, జిల్లా పేజి: 8, సాక్షి దినపత్రిక).

ఈ జిల్లాలో గ్రంథాలయ సంస్థ పక్షాన మొదటి గ్రేడు గ్రంథాలయాలు మూడు (నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి), రెండవగ్రేడు గ్రంథాలయాలు మూడు (దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్) ఉన్నాయి. వీటితోపాటు మూడవ గ్రేడు గ్రంథాలయాలు కూడా ఉన్నాయి.

### 1.3.7. సంతలు

ఈ జిల్లాలో ప్రతి పెద్ద గ్రామాలలో, పట్టణాలలో వారానికి ఒకరోజు సంత జరుగుతుంది. ఈ సంతకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దర్శించి వాళ్ళకు కావాల్సిన వస్తువులు కొనుక్కుంటారు. రైతులు పండించిన కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువులు తెచ్చి అమ్ముతుంటారు.

### 1.3.8. వృత్తులు

నల్లగొండ జిల్లాలో ప్రజలు జీవించడానికి చేస్తున్న వృత్తులు ప్రధానంగా కాపులు (రెడ్లు) వ్యవసాయం, వైశ్యులు, వ్యాపారం, బ్రాహ్మణులు అర్చక వృత్తి క్షత్రియులు వివిధ రకాల వృత్తులు చేస్తున్నారు. ఇవిగాక కొన్ని యాచక వృత్తులు కూడా ఉన్నాయి. గంగిరెద్దుల, బుడబుక్కల, బుడగజంగాల, పగటివేశాల్లాంటివి. పూర్వం ఈ కులవృత్తులను నమ్ముకొని అనేక కుటుంబాలు జీవనం సాగించాయి. ప్రస్తుతం ఈ యాంత్రిక యుగంలో ఇవి అంతరించిపోతున్నాయి. జిల్లా ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం అయినప్పటికీ వ్యవసాయంతోపాటు అనేక వృత్తులవారు ఈ జిల్లాలో ఉన్నారు. వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, బుట్టలు అల్లేవారు, పండ్లు అమ్ముకునేవారు, గోనెసంచులు నేసేవారు, చర్మకార వృత్తులు మొదలైనవారు ఉన్నారు. ఆధునిక నాగరికత పెరిగిన తర్వాత శాస్త్ర విజ్ఞానం వ్యాపించిన తరువాత ఆయా వృత్తులవారు ఆ వృత్తులను వదిలి వారి కులానికి, వారు చేసే వృత్తికి సంబంధం లేకుండా

పోయింది. అయినప్పటికీ పల్లెల్లో వివిధ కులాలవారు ఆయా కులవృత్తులను అంటిపెట్టుకొని ఉన్నారు. తండాలలోని లంబాడీలు వ్యవసాయం, పశు పెంపకం, గొర్రెల పెంపకంతోపాటు ఇటీవల కాలంలో వీరు రోడ్ల పనులు, రిక్షా తొక్కటం తదితర కూలీపనులు కూడా చేస్తున్నారు. ఎరుకలజాతివారు జీవనాధారం కొరకై ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వెళ్తారు. వీరు పందుల పెంపకం, ఈత కట్టెలతో తట్టలు, బుట్టలు, గుమ్ములు, జల్లలు, అల్లుకొని జీవిస్తున్నారు. వీరి స్త్రీలలో కొందరు సోదె చెప్పుకొని జీవిస్తున్నారు. జిల్లాలోని ముస్లీంలు ప్రత్యేకంగా ఒక వృత్తిని అంటిపెట్టుకొని ఉన్నవారు కారు. సంఘంలో వివిధ రంగాలయందు పనిచేస్తున్నారు. జిల్లాలోని క్రైస్తవులు ముఖ్యంగా ఉపాధ్యాయ వృత్తి మరియు నర్సింగ్ వృత్తిలో ఉన్నారు. వ్యవసాయం ఇతర వృత్తులలో కూడా వీరు ఉన్నారు. జిల్లాలోని అన్ని మతాల, కులాల విద్యావంతులు అనేక ఉద్యోగాలలో స్థిరపడ్డారు.

### 1.3.9. దేవాలయాలు

జిల్లాలోని వివిధ మతాలవారు, వివిధ కులాలవారు వారివారి మతాల, కులాల సంస్కృతి సంప్రదాయాలు అనుసరించి దేవాలయాలు, గుళ్ళు, గోపురాలు, మసీదులు, దర్గాలు, చర్చీలు నిర్మించబడ్డాయి. హిందువులు వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భగవద్గీత పవిత్ర గ్రంథాలుగా భావించి ఇందులో బోధించిన మార్గాన్ని అనుసరిస్తారు. పల్లెల్లో, పట్టణాలలో వైష్ణవాలయాలు, శివాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు నిర్మించుకొని విగ్రహాన్ని ప్రతిష్టించి ఉత్సవాలు జరుపుకుంటారు. జిల్లాలోని ప్రతి పల్లెల్లో భేతాళుడు, మైసమ్మ, మారమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ అనే దేవతల గుళ్ళు (చిన్నవి) కనిపిస్తాయి. జిల్లాలో యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం రెండో తిరుపతిగా పేరు గాంచింది. నార్కట్‌పల్లి సమీపంలోని చెరువుగట్టు మీద ఉన్న శ్రీ జడల రామలింగేశ్వరాలయం, జిల్లా కేంద్ర సమీపంలో ఉన్న పానగల్లు శివాలయం, పచ్చల సోమేశ్వర, ఛాయాసోమేశ్వరాలయాలు, మఠంపల్లిలో కృష్ణానది తీరంలోని పంచ నృసింహ క్షేత్రాలలో ఒకటై బాసిల్లుతున్న మట్టపల్లి నృసింహాలయాలు ప్రధానమైనవి. ఈ జిల్లాలోని నేరేడుచర్ల సమీపంలో ఉన్న 'జాన్ పహడ్' దర్గా ప్రసిద్ధమైంది. ఈ దర్గాను ముస్లీంలతోపాటు హిందువులు కూడా జిల్లా వాసులేకాకుండా, ఇతర జిల్లావాసులు కూడా దర్శిస్తుంటారు. జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి లతీఫ్‌సాబ్ గుట్ట చారిత్రక ప్రసిద్ధమైంది. ప్రతి సంవత్సరం ఈ గుట్టపై ఉర్సు ఉత్సవాలు ఘనంగా

నిర్వహిస్తారు. క్రైస్తవులల్లో రెండు వర్గాలైన క్యాథలిక్స్, ప్రొటెంట్స్ లకు వేర్వేరుగా పట్టణాలలో చర్చీలున్నాయి. ప్రొటెస్టెంటుల కొరకు జిల్లా కేంద్రంలో ఒక అమెరికన్ బాప్టిస్టు చర్చి ఉంది. రోమన్ క్యాథలిక్‌లకు గోవిందాపురం (కమ్మగూడెం) ఫణిగిరి, కేతెపల్లి మొదలైన ప్రదేశాలలో వీరి ప్రధాన పూజా మందిరాలు ఉన్నాయి.

### 1.3.10. ఆర్థిక స్థితి

జిల్లాలోని ప్రజలలో ఎక్కువమంది ఆర్థికంగా మిక్కిలి వెనుకబడి ఉన్నారు. నూటికి 75 శాతం మంది రెక్కాడితేగాని, డొక్కాడని పరిస్థితి నెలకొని ఉంది. కొందారు వ్యాపారస్తులు, ఉన్నతోద్యోగులు ఆర్థికంగా బలపడి విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. వీరి సంఖ్య స్వల్పమే అయినప్పటికీ సంఘంలో వీరి మాటకి ఎదురులేదు. మధ్యతరగతి కుటుంబీకులు, చిన్న ఉద్యోగులు ఉన్నదానితో సరిపెట్టుకునే పరిస్థితి తప్పటంలేదు. కార్మికులు, వ్యవసాయ కూలీలు, తదితర వెనుకబడిన వర్గాలవారు దినమంతా పనిచేసినా వీరి ఆర్థిక స్థితిగతులు పెంచటానికి ప్రయత్నించిన దురలవాట్లకు లోనై వీరు ఏమాత్రం ఆర్థికంగా బలపడటంలేదు. దీనికి మూలకారణం వీరిలోగల నిరక్షరాస్యత అని చెప్పవచ్చు. ఇంతేగాక వీరి అమాయకత్వాన్ని తరతరాల నుండి ధనికవర్గం అలసుగా తీసుకొని వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. ఇటీవల కొంత మార్పు వచ్చినా, శ్రమకు కొంత ఉపకారం చేసింది. వ్యవసాయ రంగంలో ఇటీవల కాలంలో వరుసగా అనావృష్టి ఫలితంగా గ్రామీణ రైతులు నీటి కొరత వలన పంటలు పండించలేక పెట్టుబడులు అధికమై చేసిన అప్పులు తీర్చలేక అర్థికంగా మిక్కిలి చితికిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

### 1.3.11. తిరునాళ్ళు-జాతరలు

ఈ జిల్లాలో తిరునాళ్ళు, జాతరలు, ఉత్సవాలను ప్రజలు భక్తి విశ్వాసాలతో జరుపుకుంటారు. గ్రామదేవతలైన గంగమ్మ, పోలేరమ్మ, ఉప్పలమ్మ, అంకాలమ్మ, ఎల్లమ్మ వంటి జాతరలు చేసుకుంటారు. లక్ష్మీనరసింహస్వామి, రాఘవేంద్రస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి, కోదండరామస్వామి మొదలైన ఉత్సవాలను జరుపుకుంటారు.

### 1.3.12. పండగలు

ఈ జిల్లాలో పండగలు దేవతలకు, ప్రకృతికి సంబంధించినవి చేస్తారు. ముఖ్యంగా దసరా, దీపావళి, ఉగాది మొదలైన పండగలు చేస్తారు. వినాయక చవితి, శ్రీరామనవమి, శరత్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వేడుకగా జరుపుకుంటారు. అన్ని కులాలవారు ఈ పండగలను వైభవంగా చేస్తారు. శ్రీ కృష్ణాష్టమి, శివరాత్రి, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, హనుమాన్ జయంతి మొదలైన పండగలు ఊరూరా ఘనంగా చేస్తారు. స్త్రీలు నాగులచవితి, వరలక్ష్మీవ్రతం, గౌరినోములు వంటి వాటిని భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు. రంజాన్, బక్రీద్, క్రిష్టమస్ పెద్దల పండగలను ముస్లిం, క్రైస్తవులు జరుపుకుంటారు. కొన్నిచోట్ల ముస్లీంల పండుగైన మొహర్రాన్ని హిందువులు కూడా కలిసి చేస్తారు. తెలంగాణలో ప్రాముఖ్యత వహించిన 'బతుకమ్మ' పండగను ఈ జిల్లా స్త్రీలు అత్యంత వైభవంగా జరుపుకుంటారు.

### 1.3.13. వస్త్రధారణ-ఆభరణాలు

పల్లె ప్రాంతీయులలో పురుషులు, దోతి, అంగి, రుమాలు ధరిస్తారు. స్త్రీలు చీరరైక ధరిస్తారు. పట్టణ ప్రాంత విద్యావంతులు (నాగరికులు) ఉద్యోగస్తులు వారివారి స్తోమతను బట్టి ఫ్యాంట్లు, షర్టులు వేసుకుంటారు. ముస్లిం పురుషులు పైజామా, అంగి, టోపి, షేర్వాని ధరిస్తారు. ముస్లిం స్త్రీలలో పరదా పద్ధతి ఇంకా ఆచరణలో ఉంది. బొట్టు విషయంలో తప్పా హిందూ, ముస్లిం, క్రైస్తవ వస్త్రాధారణలో ఎలాంటి భేదంలేదు. లంబాడి స్త్రీ, పురుషులు పూర్తిగా నాగరికతా ప్రపంచంలో అడుగుపెట్టకపోయినా విద్యావంతులైన కొందరు స్త్రీ, పురుషులు హిందువుల వేషధారణనే అనుసరిస్తున్నారు. నిరక్షరాస్యులు మాత్రం ఇంకా వారి గిరిజన జాతి వేషధారణను అనుసరిస్తూనే ఉన్నారు. ఇటీవల కాలంలో వచ్చిన మార్పులకనుగుణంగా స్త్రీ, పురుష భేదంలేకుండా అందరూ ధరిస్తున్నారు.

ఆభరణాల్లో స్త్రీలు ముఖాన బొట్టు, చేతికి గాజులు , తలలో పూలు, జడకుచ్చులు, జడబిల్ల, చమికీలు, ముక్కుపుడకలు, కాళ్ళగజ్జెలు, కడియాలు, మెడకు గొలుసులు, చెవి రింగులు, గంటీలు వంటి వాటిని అలంకరించుకుంటారు. పెళ్ళైన స్త్రీలు మెడలో తాళిబొట్టు, కాళ్ళకు మెట్టెలను

తప్పనిసరిగా పెట్టుకుంటారు. మగవాళ్ళు పూర్వం చెవిపోగులు, ముక్కుపుడకలు, కాళ్ళకడియాలు, చేతి కడియాలు పెట్టుకునేవాళ్ళు. కాని ఇప్పుడు వాటిని అంతగా ఉపయోగించట్లేదు.

### 1.3.14. విరామ సమయాలు-వినోదాలు

ఈ జిల్లాలోని ప్రజలు ఎక్కువ శాతం వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్నారు. దాదాపుగా ఎనిమిది, తొమ్మిది నెలలు పనుల్లోనే నిమగ్నమై ఉంటారు. విరామ సమయాల్లో సినిమాలకు, పార్కులకు, ఎగ్జిబిషన్స్ కు, విహార యాత్రలకు వెళ్తుంటారు. విరామ సమయం దొరికినప్పుడు బుర్రకథలు, హరికథలు డబ్బులిచ్చి చెప్పించుకుంటారు. కోలాటం, చెక్కభజన, పండరిభజన నేర్చుకోవడం చేస్తారు. ఇవన్నీ ఎక్కువగా పల్లెల్లో చేస్తారు. వీటితోపాటు సంగీతం, నృత్యం కూడా నేర్చుకుంటారు. కాని వీటిని ఇప్పుడు ఏ పండగరోజుల్లోనో ప్రదర్శిస్తున్నారు. ఇప్పుడు టి.వీలలో కేబుల్ నెట్‌వర్కులు ఎక్కువగా వచ్చినందున ఈ ఆటలన్నీ క్రమక్రమంగా కనుమరుగైపోతున్నాయి.

## 1.4. నల్లగొండ జిల్లాలోని కవులు-పండితులు-రచయితలు

తెలంగాణ జిల్లాల్లో నల్లగొండ జిల్లాది ప్రత్యేక స్థానం. అటు సామాజికోద్యమాలైనా, ఇటు సాహిత్యోద్యమాలైనా ముందుగా స్పందించేది నల్లగొండ వాళ్ళే. ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి నేటి సాహిత్యోద్యమాలైనా, దళిత, మైనారిటీ, బిసి వాదాలలో నల్లగొండ కవులు, రచయితల కాంట్రిబ్యూషన్ బలంగానే ఉంది.

నల్లగొండ జిల్లా సాహితీసంపన్నమై తెలుగు సంస్కృతి భాషలకు గొప్పసేవ చేసింది. సురవరం ప్రతాపరెడ్డిగారి గోలకొండ కవుల ప్రత్యేక సంచిక'లో (1934) నల్లగొండ జిల్లా కవుల గురించి సవివరంగా పేర్కొనడం జరిగింది. ఇందులో పేర్కొన్న జొన్న ఎల్లారెడ్డి భువనగిరిలో జన్మించాడు. ఇతడి ముద్రిత రచన కాశీశతకం, శ్రీగురుమానస పూజావిధానం, శివ పూజావిధానం, సద్బ్రాహ్మణ శతకం మొదలైనవి.

క్రీ.శే. కేశవపట్నం నర్సయ్య భువనగిరి తాలుకా రామన్నపేటలో జన్మించాడు. ఇతని రచనలు వానకొండ నృసింహ శతకం, నిరోష్ఠ్య రామాయణ సంఖ్య మొదలైనవి. ఉత్పల వెంకటరాఘవరావునే హజరి వెంకటరాఘవరావని అంటారు. ఈయన భువనగిరిలోనే జన్మించాడు. ఎన్నో గ్రంథాలను రచించాడు. 'శ్రీరామ పూజావిధానం పైడిమర్రి వెంకటసుబ్బారావుగారు అన్నెపర్తి గ్రామంలో జన్మించాడు. ఇతను ఎన్నో రచనలు చేసాడు. సింగపూరీ నృకేసరి శతకం, బాలరామాయణం, కాలభైరవుడు (నవల) మొదలైనవి. యం.వై. జీవరత్నం సూర్యాపేట తాలుకాలోని తిరుమలగిరిలో 1898లో జన్మించాడు. వీరి గ్రంథం "మోనా చరిత్ర. చిదిరెమఠం వీరబద్రయ్య నల్లగొండ సమీపంలోని మునీకుంటలో జన్మించాడు. వీరి రచనలు శ్రీకృష్ణ శతానందీయం భల్లాణచరిత్ర శరభవిజయం నాటకం మొదలైనవి. నరహరిగోపాలాచార్యులు హుజూర్ నగర్ దగ్గరలోని తమ్మారం గ్రామంలో జన్మించాడు. వీరి రచనలు జానకీనామ శతకం, శ్రీకృష్ణ శతకం మొదలైనవి. ఆత్మకూరు అంజనిదాసు సహజకవిగా పేరొందాడు. ఆత్మకూరులో జన్మించిన ఈయన రచనలు శ్రీరామకృష్ణ భజనావళి, పరమాత్మ భజనావళి మొదలైనవి. శేషభట్టార్ వేంకటరామానుజాచార్యులు నల్లగొండ జిల్లావాసి. ఈయన రచనలు ప్రాకృత దాంపత్యం, నల్లగొండ చారిత్రం మొదలైనవి. రామకవచం కృష్ణయ్య సంస్థాన్ నారాయణపూర్‌లో 1863లో జన్మించాడు. అపరభానుమతీ పరిణయం (యక్షగానం), హరిప్రియ నాటకం, శాకుంతలం, సంస్థాన చరిత్ర మొదలైన రచనల్ని రచించాడు. షబ్నవీషు వేంకట నరసింహరావు నల్లగొండలో జన్మించి నీలగిరి పత్రికను నడిపాడు. కొండప్రోలులో జన్మించిన తుమ్మగోటి సోమశేఖరకవి అముద్రిత తృణావర్తుని కథ. చిదిరెమఠం వీరభద్రశర్మ నల్లగొండ దగ్గరలోని చర్లపల్లి గ్రామంలో జన్మించాడు. ఇతను ఎన్నో గ్రంథాలను రచించాడు. వీరశైవ వివాహ విధి (తెనుగు), ఆంధ్ర వీరశైవులు (కన్నడం), కాశీపీఠ ప్రాచీనత (మరాఠి) మొదలైన రచనలు వివిధ భాషల్లో రచించారు.

"సంస్కృతాలంకార శాస్త్ర గ్రంథాలలో ముమ్మటుని కావ్యప్రకాశం ప్రసిద్ధి చెందింది. దానికి 'బాల చిత్తాను రంజన' అనే పేరుగల వ్యాఖ్య రాసిన నరహరి కవి కూడా భువనగిరి ప్రాంతంవాడు. అలాగే సుప్రసిద్ధమైన ఆంధ్రమహాభాగవతంలోని షష్ఠమ స్కందాన్ని రాసిన ఏర్చూరి సింగన రామన్నపేట దగ్గరలోని ఏర్చూరి వాడు.

క్రీ.శ. 1700 ప్రాంతంలో భువనగిరి సమీపంలోని ఉద్దెమర్రి గ్రామంలో వేంకటరాయడనే కవి ఉండేవాడు. తెలుగు సాహిత్యంలో నారాణి అని ఘంటాపథంగా చెప్పి ప్రసిద్ధుడైన పినవీరనది సూర్యాపేట సమీపంలోగల పిల్లలమర్రి గ్రామం. అప్పలాచార్యులుగారు సుప్రసిద్ధమైన మరింగంటివారు. వీరి సోదరుడు సింగరాచార్యుడు దశరాధరాజ నందన చరిత్ర అనే నిరోష్ఠ్య రామాయణాన్ని రచించాడు. సింగరాచార్యులుగారి అన్నగారు జగన్నాథాచార్యులు ఉండేవాడు. అతనుకూడా మంచికవిగా పేరొందాడు. ఈ మరింగంటి కవులు నల్లగొండ జిల్లాలోని కనగల్లు గ్రామం వారు. తమ కృతులను నర్సింగడ్ల నర్సింహస్వామికి అంకింతం చేశారు. 1710 ప్రాంతంలో హుజూర్‌నగర్ దగ్గరలోని యాత వాకిళ్ళలో ఉన్న అసూరి మరింగంటి వేంకట నర్సింహాచార్యులు శోడష ప్రబంధ నిర్మాణ పారీణుడు వీటిల్లో గోదావరిధీటి పరిణయం, క్షత్రబంధూపాఖ్యానం అనేవి మాత్రమే ముద్రితమయ్యాయి. అదే గ్రామంలోని చెన్నూరు రామన్న అనే కవి సంస్కృత రామాయణాన్ని ఆంధ్రీకరించి చిలుకూరులోగల శ్రీరామ చంద్రస్వామికి అంకితమిచ్చాడు.

హుజూర్ నగర్ తాలుకాలోని పొనుగోడు గ్రామంలోజగన్నాథరావు అనే కవి 1790 ప్రాంతంలో ఉండేవాడు. పన్నిద్దరాళ్వారులలో ఒకరైన తిరుమంగైళ్వారుల చరిత్రను కుముదవల్లీ విలాసం అనే పేర చక్కని ప్రబంధంగా రాసాడు.

చర్లపల్లి వాసి అయిన కర్పూరం కృష్ణమాచార్యులు భగవద్గీతను ద్విపదగా రాసి కేశవస్వామికి అంకితం చేశాడు. ఇదే గ్రామానికి చెందిన 1823 ప్రాంతం వాడైన చిత్తూరు గంగాధరయ్య ద్విపదలో కొలిపాక మహాత్మ్యం, శృంగార సిరియాళ చరిత్ర మొదలైన గ్రంథాలను రాసాడు. సూర్యాపేట సమీపానగల అన్నవరంలో దొంతర మల్లేశం అనే కవి అలవాలక్షేత్ర మహాత్మ్యాన్ని రాసాడు. దేవరకొండలో సయ్యదలీ, అజ్మతుల్లా సోదరులు చక్కని కవిత్వాన్ని చెప్పేవాడు. వీరు ఎన్నో ప్రబంధాలు, శతకాలు, నాటకాలు రాసాడు. సత్యసింధు చరిత్ర, తత్వపుష్పం, మార్కేండేయ జననం, జలంధరాసుధ మొదలైనవి. వీరి కృతుల్లో కొన్ని దేవరకొండ కవి ద్వయంపేర అజ్మతుల్లా, నీలా జంగయ్యగార్లు కలిసి తమ పద్యాలను 'విప్లవ స్వరాలు' అనే పేరుతో పుస్తకాన్ని ప్రచురించారు." (నల్లగొండ మండల సర్వస్వం–బి.ఎన్. శాస్త్రి. పుట: 225–228).

"సూర్యాపేటలో ప్రసిద్ధిగాంచిన గవ్వాసోదరులు ముఖ్యులు. వీరు గవా అమృతరెడ్డి, గవ్వా జానకిరామరెడ్డి, వీర మురహరిరెడ్డిలు. తమ గ్రంథమాల ద్వారా ఎన్నో నాటకాలను కావ్యాలను ప్రచురించారు. ఇదే కాలంలో కోదాటి నారాయణరావు మంచి కథకుడిగా పేరొందాడు. సాహిత్య నేపథ్యం ఉన్న పులిజాల వెంకటరంగారావు నల్లగొండవాసి. 3వ ఆంధ్రమహాసభకు అధ్యక్షత వహించాడు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాడు. నకిరేకల్లుకు సమీపంలోగల మాధవరం గ్రామస్తుడైన వట్టికోట ఆళ్వారుస్వామి చాలాకాలం గోలకొండ పత్రికలో పనిచేసి అనేక ఉద్యమాలలో పాల్గొన్నాడు. రావినారాయణ రెడ్డి, ఆరుట్ల సోదరులతో కలిసి తెలంగాణ పోరాటంలో పాల్గొని, 'తెలుగుతల్లి' పత్రికను నడిపాడు. 'జైలు లోపల' కథా సంపుటి, 'ప్రజలమనిషి', 'గంగు' అనే నవలలను రచించాడు. కేతన, మారన, అయ్యనబయ్యనలు, అయ్యలార్యుడు, ఏలేశ్వరోపాధ్యాయుడు, మడికి సింగన, కుమార సింగభూపాలుడు, ఏలేశ్వర కవి, పశుపతి పండితుడు, నాగనాథుడు చెప్పుకోదగ్గ విద్వత్కవులు.

ఎన్.వెంకటయ్య, ఫణికుమార్, ఎన్.కె. రామారావు, ఎం. కృష్ణమూర్తి, బి.రాములు, ఎన్.యాదగిరి, నాగార్జున రామమూర్తి, అక్కిరాజు వాసుదేవరాజు, సంజీవదేవ్, జగన్నాథం, నాగరాజు, శేషమనాల మేహన్‌రావు, శ్రీరామశేషయ్య, అల్గుబెల్లి రాంచంద్రారెడ్డి, ముదిగొండ వీరభద్రయ్య వంటి వారందరూ ఈ ప్రాంత కవులే. ప్రముఖ చారిత్రక పరిశోధకులైన 'మూసీ' పత్రిక వ్యవస్థాపకులు బి.ఎన్.శాస్త్రిగారు నల్లగొండ జిల్లాకు చెందినవారే. కండ్లకుంట పాపయ్య ప్రౌఢశైలిలో రాచకొండ గోదాదేవి స్తుతిని రాసాడు. ఇది మూసీ పత్రికలో ప్రచురితమైంది. బి.ఎన్. రెడ్డి 1976లో 'సామాన్యుడి సందేశం' పేరిట తన కవితలను సంకలనంగా వేసి పెద్దల ప్రశంసలను పొందాడు. శ్రీ చింతాపట్టణ శ్రీరంగాచార్యులు విమర్శకుడు. కవి వీరి అనేక వ్యాసాలు పత్రికల్లో ప్రచురించబడ్డాయి. ధరణికోట శ్రీనివాసులు 'అన్నంలోకి' అనే కథా సంపుటిని తీసుకొచ్చాడు. 1934లో అంబడిపూడి వెంకటరత్నం 'సాహితీమేఖల' అనే సాహిత్య సంస్థను చండూరులో స్థాపించి ఎందరినో కవులుగా రచయితలుగా మార్చాడు.

జిల్లాలోని హుజూర్‌నగర్, సూర్యాపేట, నల్లగొండ, దేవరకొండ మొదలైన ప్రాంతాల్లో ఎన్నో సాహితీ సంస్థలు వెలసి వాటికున్న వనరులతో సాహిత్య కార్యక్రమాలను, కవి సమ్మేళనాలను నిర్వహిస్తూ, ఎందరికో వినూత్న చైతన్యాన్ని కలిగించాయి.

నల్లగొండలోని సాహితీ సంస్థల ద్వారా సమర్పణ, సంఘర్షణ, దర్పణం, సైరన్, మాలిక అనే కవిత సంకలనాలు ప్రచురించబడ్డాయి. 'స్వాతంత్ర్యం వచ్చాక' మోదుగు పూలు', 'ద్రాక్ష గుత్తులు' మొదలైన సంకలన గ్రంథాలేకాక జిల్లా రచయితల సంఘం తరుపున దీనారాణిగారి 'సరయూ' అనే పుస్తకం, జిల్లా రచయితల మహాసభల సందర్భంగా ప్రత్యేక సంచికలు ప్రచురించబడ్డాయి. సూర్యాపేట బానుపుర సాహితీ సమితి తరపున ప్రత్యేక సంచికలు వెలువడ్డాయి. ఈ సంస్థలో డా. శర్మ, మరింగంటి పురుషోత్తమాచార్యులు, విద్వాన్ నాగం, ఊరె నరసింహారావుగార్లు ఎందరినో కవులుగా, వక్తలుగా తీర్చిదిద్దుతున్నారు." (నల్లగొండ మండల సర్వస్వం–బి.ఎన్.శాస్త్రి, పుట: 246–26).

ఈ రకమైన సాహితీ నేపథ్యమున్న నల్లగొండ జిల్లాలో ఆధునికంగా కాంచనపల్లి చినవెంకటరామారావు, బోయ జంగయ్య, ముదిగంటి సుజాతారెడ్డి, ఎన్.కె. రామారావు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, బోధనం నర్సిరెడ్డి, యెన్నెం ఉపేందర్, ఎలికట్టె శంకర్రావు, సుద్దాల అశోక్‌తేజ, పి.చిన్నయ్య, పుష్పాల కృష్ణమూర్తి, నిఖిలేశ్వర్, కాసుల ప్రతాపరెడ్డి, దేవరాజు మహారాజు మొదలైన అనేకమంది కథా రచయితలు విరాజిల్లుతూ తెలంగాణ సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు.

### 1.5. నల్లగొండ జిల్లా జానపద లలిత కళలు

జిల్లా ప్రజలు జన్మతః కళాకారులు. జిల్లాలోని చాలా గ్రామాలలో కోలాట దళాలున్నాయి. ఏ గ్రామానికి ఆ గ్రామమే చేప్పుకోదగ్గ ప్రత్యేకతను కలిగి ఉంది. కోలాట దళంలో 11 జతల వారుంటారు. వీరు తమ తమ కోలాటాలతో మెరుపువేగంతో ఆడుతూ, చూపరులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తారు. ఇప్పటికీ ఇదే జిల్లాకు చెందిన జువ్విగూడెం అనే గ్రామంలో మల్లికార్జునస్వామి దేవస్థానం వార్షికోత్సవ సందర్భంగా బాలికలు వేసే కోలాట ప్రదర్శన అత్యద్భుతంగా ఉంటుంది. ఈ కళను

చలనచిత్రంగా నిర్మించి చరిత్రలో భద్రపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భువనగిరిలో కూజాల పరిశ్రమ ఎంతో ప్రసిద్ధి చెందింది. వీటికి దేశంలో మంచి గిరాకీ ఉంది. చండూరు ఇత్తడి పరిశ్రమ అత్యంత ప్రఖ్యాతిగాంచింది. నగిషీ చెక్క వస్తువులకు ఖ్యాతి తెచ్చిన వారెందరో ఇక్కడున్నారు. ఇక బొమ్మలు గీసేవారు జిల్లాలో కొన్ని వందల మంది ఉన్నారు. జిల్లాలోని మిర్యాలగూడలో జన్మించి ప్రస్తుతం అర్ట్ టీచర్‌గా పనిచేస్తున్న పి.సుదర్శన్ అనే కళాకారుడు దేశంలోనే ప్రసిద్ధి చెందాడు. 'దాసి' చిత్రంలో కాస్ట్యూమ్ డైజైనర్‌గా ఈయనకు ఉత్తమ కళాకారుడిగా కేంద్రప్రభుత్వం ఉత్తమ అవార్డు ఇచ్చి సత్కరించింది.

అలాగే నాగార్జున సాగర్‌లో ఉన్న మరొక చిత్రకారుడు కొండిపర్తి శేషగిరిరావు కూడా గొప్ప కళాకారుడు. వీరి చిత్రాలు అనేకచోట్ల ప్రదర్శించబడ్డాయి. మిర్యాలగూడలో ఆర్టిస్టులుగా పనిచేస్తున్న విఘ్నేశ్వరాచారి మంచి కళాకారుడు. 'చిత్ర' అనే పేరుతో ఈయన కళాఖండాల్ని సృష్టించాడు. ఇక్కడే శిక్షణ పొందిన నరసింహా అనే కళాకారుడు ప్రస్తుతం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో చక్కటి కార్టూన్లు వేస్తున్నాడు. ఇక ఛాయాచిత్రరంగంలో దేశంలోనేకాక ఇతర దేశాలలో సైతం ఈ జిల్లాకు చెందిన దశరథకుమార్ ప్రఖ్యాతి పొందాడు. లండన్‌కు చెందిన రాయల్ ఫోటోగ్రఫీ కౌన్సిల్ వారు వీరిని తమ సభ్యుడిగా నియమించుకున్నారు. గతంలో ఒక సినిమాకు కెమెరామెన్‌గా పనిచేసాడు. అలాగే సంగీతంలో కూడా జిల్లాలో గొప్ప గాయనీ, గాయకులున్నారు. అడవి దేవులపల్లికి చెందిన పదమూడేళ్ళ బాలుడు చక్కని గాయకుడిగా గుర్తింపు పొందటమేగాక హరికథల్ని కూడా ప్రచారం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఇతను ప్రదర్శించిన ఒక హరికథను టెలివిజన్ వారు సైతం ప్రసారం చేసారు. సంగీత మాస్టారుగా వివిధ గ్రామాలు తిరిగి డ్రామాలు నేర్పిన శేఖర్ మిర్యాలగూడలో ఉన్న ఒక మంచి గాయకుడు. కొత్త పాటలకు బాణీలు కూర్చి పాడగల దిట్ట. (నల్లగొండ జిల్లా చరిత్ర–వసంతరాయ్, పుట: 17, 18)

ఉత్తేజ్, వేణుమాధవ్, జయప్రకాశ్ రెడ్డి, ఎన్, శంకర్, సుద్దాల భారతి, ఎన్.ఎ.ఎ. ఖలీమ్, ఏలే లక్ష్మణ్, జగిని నాగభూషణం, బి.శశిధర్, పొట్టి వీరయ్య, ఈశ్వర్ మొదలైనవారు సినీ, టీవీ రంగస్థల కళాకారులుగా రాణిస్తున్నారు. అలాగే గద్దం స్వామి, ఆంజనేయులు, బాల నర్సయ్య, మాదయ్య,

ఏర్పుల యతిరాజం, ఏర్పుల ముత్తయ్య, ఏర్పుల బాలస్వామి అనేవారు చిందు కళాకారులుగా తమ ఉనికితోపాటు జిల్లా కీర్తిని సైతం నలుదిక్కులా చాటుతున్నారు. మిమిక్రీ కళాకారులుగా ఆకారపు లింగయ్య, ఎస్.ప్రవీణ్‌లు ప్రసిద్ధిచెందిన కార్టూనిస్టులుగా క్రాంతివర్ధన్, నర్సిం, వేలాపూర్, శేఖర్, మృత్యుంజయ్, రవినాగ్, మధు, రాజు, కూరెళ్ళ శ్రీనివాస్ మొదలైనవారు వివిధ ప్రదర్శనలు ఇస్తున్నారు.

జిల్లాలోని పల్లెటూళ్ళలో మనకు బహురూపాలవారు దర్శనమిస్తారు. పెద్దమ్మలవారు, పోచమ్మలవారు, ఘంటా నృత్యాలవారు, ఖడ్గాలవారు, లత్కోరువారు, బుడబుక్కలవారు, మేచువాణీలు, డబ్బులవారు, పులివేశాలవారు,బింగివారు, జంగాలవారు, దాసర్లు అక్కడక్కడా కనిపిస్తుంటారు. అలాగే బుడిగె జంగాలు, భజనవారు, సాతానిజియ్యరులు, బైరాగులు, బుర్రకథలవారు, జడకొప్పులవారు, చిరుతల భజనవారు, కోలాటాలవారు, చెక్కభజనవారు, రుంజకళలవారు, ఒగ్గుకథలవారు, శారదకాండ్రు, హరికథ భాగవతార్లు, ఎరుకల జోష్యాలవారు మనకు జిల్లాలో పురాతన సంప్రదాయ ప్రతిబింబాలుగా అక్కడక్కడ కనిపిస్తారు. ఇంకా డక్కలివారు, వీరముష్టివారు, పిచ్చుకుంట్లవారు, కొమ్ములవారు, జంగం కథలవారు, తప్పటడుగుళ్లవారు, తోలుబొమ్మలలాటవారు, చిరుతల రామాయణ కథకులు, గొల్ల భాగవతాలవారు కూడా తక్కువ సంఖ్యలో అక్కడక్కడా కనిపిస్తారు." (నల్లగొండ జిల్లా చరిత్ర–వసంతరాయ్, పుట: 18).

నల్లగొండ జిల్లా ప్రసిద్ధమైంది. కంప్యూటర్లు, టి.విలు, సినిమాలు వచ్చిన తర్వాత ఈ కళలు ఇంకా మరుగున పడ్డాయి. తెలంగాణా ప్రాంతంలో నల్లగొండ జిల్లా జానపద కళలను అనుసరించి జీవించే కళాకారులు ఎందరో ఉన్నారు. ఆయా జానపద కళాకారులు ప్రస్తుతం ఇతరుల వల్లనే తమ జీవనాధార నిమిత్తం సంఘాలను ఏర్పర్చుకున్నారు. తమ భాగోగులను విచారించుకున్నారు. ఏది ఏమైనా సరైన ఆదరణలేకపోవటం వల్ల ప్రభుత్వంవారు సరిగ్గా ఆదరించక పోవటంవల్ల, జానపద కళలు కనుమరుగవుతున్నాయి. జానపద భిక్షుకగాయక కళాకారులు తెరమరుగవుతున్నారు. వారి సంఖ్య అల్పమైపోతుంది.

కావున జిల్లాలోని పెద్దలు, కళాభిమానులు, జానపద కళలకు తగిన ప్రోత్సాహాన్నిచ్చి కళాకారులను ఆదరిస్తారని ముమ్ముందు ఇతోధివృద్ధిగా నల్లగొండ జిల్లా జానపద కళానిలయంగా అభివృద్ధిపరుస్తారని ఆశిస్తున్నాను. సంవత్సరానికొకసారి కళాకారులను కొందరినైనా సత్కరించడం మన కర్తవ్యం.

ఈ విధంగా ఇందులో నల్లగొండ జిల్లా చారిత్రక–భౌగోళిక, జానపద, సామాజికాంశాలు, కళలు మొదలైన వాటి ప్రాథమిక సమాచారం తెలపటం జరిగింది.

*****

# అధ్యాయం-2

# నల్లగొండ జిల్లా కథా సాహిత్యం

**పరిచయం**

విప్లవాల పోరుగడ్డ నల్లగొండ జిల్లా. ఎన్నో ఉద్యమాలకు పుట్టినిల్లు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి, నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాటానికి నాంది పలికింది ఇక్కడే. ఆంధ్రమహాసభ, గ్రంథాలయోద్యమాల ద్వారా సాహితీ చైతన్యం వెల్లివిరిసింది. పై సంఘటనలు ఎంతో మంది రచయితలకు స్ఫూర్తినిచ్చాయి.

ఇక్కడి స్థానిక సమస్యలైన సాంఘీక దురాచారాలు, పేదరికం, నిరక్షరాస్యత, భూసమస్య, వెట్టిచాకిరి, చాలీచాలని వ్యవసాయం, అణచివేత, బాల్యవివాహాలు, నిరాదరణకు గురైన స్త్రీ విద్య, మూఢాచారాలు, దళితులపై చిన్నచూపు, ఫ్లోరోసిస్ వ్యాధి పీడన, ప్రపంచీకరణ వల్ల ధ్వంసమైన మానవసంబంధాలు మొదలైన విషయాలు నల్లగొండ జిల్లా కథల్లో మనకు మౌలిక వస్తువులుగా కనిపిస్తాయి. అందుకే పై సంఘటనలు ఎంతోమంది రచయితలకు స్ఫూర్తినిచ్చి కథలు రాయడానికి ఉత్ప్రేరకాలయ్యాయి.

**2.1. కథావిర్భావ వికాసాలు**

మానవుడు మాట నేర్చిన దగ్గరినుంచి కథ ప్రారంభమై ఉంటుందని ఊహించవచ్చు. తన అనుభవాలను తరువాత తరాలకు పూస గుచ్చినట్టు చెప్పే విధానమే కథగా రూపొంది ఉంటుంది. ముందుతరం వారి అనుభవాలు తరువాత తరం వారికి మార్గదర్శకంగా, గుణపాఠంగా ఉంటాయి. ఆటవిక జీవనం నుంచి అత్యున్నత నాగరికతకు మానవుడు ప్రయాణం చేయడానికి కథ నిర్వహించిన పాత్ర తక్కువేమి కాదు. తన ఆనందం కోసం కథను ఆశ్రయించిన మానవుడు తన చరిత్రకు తానే నిర్మాతననే విషయాన్ని స్పృహలో లేకుండానే కథకు బీజాలు వేసి ఉంటాడు. మానవ జీవితంతో మమేకమైన కథ ఏ రూపంలో చెప్పినా, అది మనిషి చరిత్రను తెలియజేసేదనే అభిప్రాయముండవచ్చు. మానవ సమూహం ఉన్న ప్రతిచోట కథలు పుట్టి ఉంటాయి. "ప్రపంచ కథా సాహిత్యంలో

భారతదేశానికి అగ్రస్థానమే ఉంది. అంతేకాదు ప్రపంచానికి కథాభిక్ష పెట్టింది భారతదేశమేనని అనేకమంది విశ్వాసం." అని పోరంకి దక్షిణామూర్తి తెలియజేసారు. (కథానిక స్వరూప స్వభావాలు, పోరంకి దక్షిణామూర్తి, పుట: 45).

## 2.2. తెలుగు కథ-పుట్టుక

కథ అనే తెలుగుమాట సంస్కృత ధాతువు అయిన కథ్ నుంచి పుట్టింది. 'కథ అంటే సంస్కృతంలో చెప్పడం, సంభాషించడం అనే అర్థాలు ఉన్నాయి. కథకుడు, కథనం, కథానిక అనే మాటలు ఈ మూలధాతువు నుంచే వచ్చాయి. (తెలుగు కథారామం ఈ శతాబ్ది తెలుగు కథ, తెలుగుదనం, శ్రీ విరించి, పుట: 15) ఒకరి వృత్తాంతాన్ని మరొకటి చెప్పుకోవడమే నాటి కథ. ఒకప్పుడు వినోదానికి, విజ్ఞానానికి సుబోధకమైన అనుకూల ప్రక్రియ కథ. నేడు తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రమై విలసిల్లుతుంది.

తెలుగుదేశం కథలకు కాణాచి, విశ్వాసాలకు, నమ్మకాలకు, ఆదర్శాలకు ఇక్కడ కథ ఒక వాహికగా పనికి వచ్చింది ఇక్కడ. జానపదుల జీవితమంతా కథారూపంలో ప్రక్షిప్తమై ఉందంటే అతిశయోక్తి కాదు. జాతి జీవనంలో అంతర్భాగంగా ఉన్న కథ సంప్రదాయాలకు తోబుట్టువుగా నిలిచింది. మానవుల పుట్టుక, మనుగడ, పరిణామం, జీవనక్రమంలో వారు ఎదుర్కొన్న ఒడిదుడుకులు క్రమాభివృద్ధి వికాసంలో సాపల్య వైపల్యాలను కథలు ప్రతిబింబిస్తూ ఉంటాయి. నిరూపమానమైన ప్రజాధారణ పొందిన కథ జాతి జీవనాన్ని ప్రతిబింబిస్తుంది.

సామాజిక మార్పులతోపాటు సాహిత్య ప్రక్రియల్లో మార్పు అనివార్యమైంది. ఒకప్పుడు ప్రజలు చెప్పుకునే దీర్ఘ, సుధీర్ఘ కథలు క్రమంగా క్లుప్తతలోకి ఒదిగిపోయాయి. అంటే ఒక విస్తృతమైన కాన్వాస్‌పై నిర్మితమైన మౌఖిక కథలు రోజుల తరబడి, వారాల తరబడి చెప్పుకోవడం జరిగింది. ఆధునిక ప్రపంచంలో ఇందుకు భిన్నంగా కథ నడుస్తుంది. మౌఖిక సంప్రదాయం నుంచి లిఖిత సంప్రదాయంలోకి కథ కథానికగా రూపం మార్చుకోవడం ఈ దశలో కన్పిస్తుంది.

ప్రారంభంలో కాశీమజిలీ కథలు, బాల నాగమ్మ కథ, దేశింగు రాజు కథ, పల్నాటి యుద్ధం, లక్ష్మమ్మ కథ, ఎల్లమ్మ కథ, కాంభోజరాజు కథ వంటి కథలకే కథా వాఙ్మయం పరిమితమై ఉండేది. 19వ శతాబ్దంలో సంస్కరణోద్యమ ప్రభావంతో సాంఘిక రంగంలో నూతన చైతన్యం ఏర్పడి కథానిక వస్తువిషయంలో మార్పు వచ్చింది. వ్యవహారిక భాషోద్యమ ప్రభావంతో భాషారంగంలో వచ్చిన శాస్త్రీయ దృష్టి వలన కథానిక అదే మార్గంలో పయనించింది. ప్రపంచవ్యాప్తంగా కథలున్నా ఆధునిక కాలంలో కొన్ని ప్రత్యేక లక్షణాలతో రూపొందిన కథానిక అశేషమైన పాఠకులను సంపాదించుకుంది. విలక్షణమైన వస్తువైవిధ్యంతో అపూర్వమైన సంవిధానంతో సాహితీ ప్రపంచంలో చెరిగిపోని ముద్ర వేసింది.

## 2.3. కథానిక లక్షణాలు-నిర్వచనాలు

కథకు, కథానికకు ఉన్న నిశిత వ్యత్యాసాన్ని శ్రీ పోరంకి దక్షిణామూర్తి ఇలా వివరించారు. “ఒక నిర్థిష్ట సాహిత్య ప్రక్రియగా రూపొందిన ఆధునిక వచన రచనా విశేషం కథానిక, మామూలు కథ కంటే ఇది సినిశితం, సూక్ష్మతరం. ప్రతి కథానికా ఒక కథేకాని, ప్రతి కథా కథానిక కాదు. కథ విషయ ప్రధానం అయితే కథానిక శిల్పప్రధానం. రచయిత ఏం చెప్పాడానేది రెండింటికీ వర్తిస్తుంది. కానీ ఎలా చెప్పాడనేది కథానికకే వర్తిస్తుంది. కథ ముడి వజ్రం, కథానిక సానబట్టిన వజ్రం, దీని అందం దానికి లేదు. దీని పనితనం దాంట్లో లేదు.” (కథానిక స్వరూప స్వభావాలు, పోరంకి దక్షిణామూర్తి, పుట: 131) మనం ఎలా వ్యవహరించినా కథానిక స్చరూప, లక్షణం ఇదీ అని తెలుస్తుంది.

ఏకాంశ వ్యగ్రమై స్వయంసమగ్రమైన

కథాత్మక వచన ప్రక్రియ ‘కథానిక’

సాహిత్యం కథాసహితం కావచ్చు, కథారహితం కావచ్చు. కథాసహితమైన రచన వచనాత్మకమైనా కావచ్చు, పద్యాత్మకమైనా కావచ్చు. కథా సహితమై వచనాత్మకమైనదాన్నే పై నిర్వచనంలో కథాత్మక వచన సాహిత్యం (prose-fiction) అని చెప్పడం జరిగింది. దీని ప్రధానమైన రూపాల్లో ‘కథానిక ఒకటి.

కథానిక ప్రక్రియ లక్షణాలను గురించి సంగ్రహంగానైనా చక్కగా వివరించిన ప్రతిష్ఠ అగ్ని పురాణానికి దక్కింది. అగ్నిపురాణంలో కథానిక ప్రస్తావన 337వ అధ్యాయంలో ఇలా ఉన్నది.

"భయానకం సుఖపరం గర్భేచ కరుణోరసః

అద్భుతో అంటే సుక్ల్ ప్తార్థా నోదాత్తా సా కథానికా."

కథానిక క్లుప్తంగా, పొందికగా ఉండాలి. దీర్ఘ సమాసాలు, వర్ణనలతో కాక అనుదాత్తంగా ఉండాలి. కథానికలో పాఠకులను సంభ్రమాశ్చర్యాలలో ముంచే విచిత్ర సంఘటనలు ఉండాలి. కథాగర్భంలో హృదయాన్ని కదిలించే కరుణరసాత్మకమైన సన్నివేశం ఉండాలి. వీటితోనే కథానికా కమనీయ శిల్పంగా భాసిస్తుంది." (కథానిక స్వరూప స్వభావాలు, పోరంకి దక్షిణామూర్తి, పుట: 137, 142).

కథానికను గురించి ఆచార్య జి. నాగయ్య "ఒకరకమైన ఎత్తుగడ, నడకతీరు, ముగింపు, పరిమిత పాత్రలకు తగ్గ పోషణ, వస్తు విన్యాసం, జీవిత సత్యాన్ని వివరించడం అన్నింటికి మించి వినోదమో, విజ్ఞానమో, వికాసమో కలిగించగల చిన్న కథానిక." (తెలుగు కథకు ప్రాచీన మనుగడ, యం.సింహాద్రి వ్యాసం, వార్త 'అనంతం', 8.7.2005, పుట: 15) అనడాన్ని కథానికకు మంచి ప్రారంభం, చక్కని ముగింపు నిండుతనాన్ని ఇస్తామని చెప్పవచ్చు. వస్తువు, పాత్ర చిత్రణ చిన్నచిన్న వర్ణనలు, ఎత్తుగడ, ముగింపు శైలి వంటి ప్రధాన అంగాలతో భాష వ్యావహారికమై సుమనోహర భావాలతో నేటి కథ సజీవంగా, సహజంగా విలసిల్లుతుంది.

★ "ఏ కళైతే, ఏ శాస్త్రమైతే మనిషిని మనిషిగా చేయటానికి తోడ్పడుతుందో అదే ఉత్తమ కళ, అదే ఉత్తమ 'కథ' అని అన్నారు." (అందాల తెలుగు కథ–సంజీవ్ దేవ్ వ్యాసం, పుట: 7)

★ ఒక మనిషిని మనిషిగా చేయటానికి ఏ కళ, శాస్త్రం తోడ్పడుతుందో అదే ఉత్తమ కథ అని సంజీవ్ దేవ్ తెలిపారు. "అసలు జీవితమే ఒక కథ" (అందాల తెలుగు కథ – సంజీవ్ దేవ్ వ్యాసం, పుట: 7) జీవితంలోని అనేక సంఘటనల ఇతివృత్తమే కథ అని సంజీవ్ దేవ్ అన్నారు.

★ ".......కథను నిర్వచించలేం....భగవంతుని నిర్వచించడం కష్టమే" (తెలుగు కథ అనువాదాలు" విద్వాన్ విశ్వం, పుట:11) అని సంజీవ్ దేవ్ గారు కథను దేవుడితో పోల్చారు.

"it may be laid down as a role te which so far as lsee. There can be no exception that a short must contain one and only informing idea and that this idea must be worked out to its logical conclusion with absolute singleness of aim and directness of method..." (కథానిక స్వరూప స్వభావాలు, వ్యాసం–జానకీ జానీ, పుట: 67)

పై నిర్వచనాలన్నీ ప్రముఖ రచయిత హెచ్. వుడ్సన్ "singleness of and directness of method" గురించి వివరించడం జరిగింది.

"A short story is a prose narrative requiring golf an hour to one or two hours in its perusal" (కథానిక స్వరూప స్వభావాలు–వ్యాసం–జానకీ జానీ, పుట–66)

Edgar Allalpole అనే రచయిత కథను ప్రస్తావిస్తూ "one or two hours in its perusal" అని చెప్పారు.

తెలుగు కథ రచయిత మధురాంతకం రాజారాం కథను ప్రస్తావిస్తూ మానవ నాగరికత ఎంత పాతదో కథ కూడా అంతే పాతదని తెలిపారు. అంతేకాకుండా అడవి బాపిరాజుగారు శిల్పం కొత్తదైతే కావచ్చుగానీ కథా కథనం ఆది నుండి ఉన్నదే అని అన్నారు.

".....పాఠకుని గుండె గుడిలో గంట మ్రోగించేదే కథ. మరీ మరీ మోగితే మంచి కథ. మరైతే గుడిలో గంట మోగాలంటే అక్కడా దైవమైతే ఉందని కదా! సత్యం, శివం, సుందరం అంటూ భగవత్స్య రూపాన్ని నిర్వచిస్తారు. నేనా భగవత్స్వరూపానికి ప్రతిరూపంగా మానవతను సృష్టించుకొని దానిని నేననుకున్న కథాకుసుమాలతో పూజిస్తున్నాను......"అంటారు.(మధురాజారాం కథలు–మధురాంతకం రాజారాం–ముందుమాట).

మధురాంతకం రాజారాం 'మధురాజారాం' కథలలో 4వ సంపుటిలో పాఠకుడి గుండెల్లో మోగించేదే కథ అని మరీ, మరీ మోగితే మంచి కథ అని అతను ఎందుకున్న కథలను భగవంతుని రూపంతో పోల్చాడు. మధురాంతకం రాజారాంగారు కథను సత్యం, శివం, సుందరం అనే భగవత్స్వరూపానికి ప్రతిరూపమైనా మానవతను పూజించేందుకు ఉపయోగపడే పుష్పాలే కథ అని తెలిపారు.

## 2.4. తెలంగాణ కథాక్రమం

నైజాం రాజ్యంలో తెలుగు మాట్లాడే ప్రజల్లో కవిత్వం, పాట తర్వాత ఇష్టమైన ప్రక్రియ కథ. తెలుగు కథ ఇంగ్లీష్ షార్ట్ స్టోరీ, బెంగాలి సాహిత్యంలో ప్రభావితమైతే తెలంగాణా కథ ప్రేమ్‌చంద్, కిషన్ చందర్ మొదలైన రచయితల ప్రభావంతో మొదలవుతుంది. తెలంగాణ కథ మీద ఉర్దూ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది.

సమస్త తెలుగు సాహిత్యంలో గురజాడ అప్పారావు రాసిన 'దిద్దుబాటు' మొదటి కథగా భావించబడుతూ వస్తుంది. అయితే ఈ విషయంలో అనేక వాదప్రతివాదాలున్నాయి. దిద్దుబాటు 1910 ఫిబ్రవరి ఆంధ్రభారతిలో అచ్చైంది. ఇదే ఆంధ్రభారతి పత్రిక 1910లోనే వెలువరించిన సంవత్సరాది సంచికలో ఏబదివేల బేరం కథ అచ్చైంది. కొమర్రాజు వెంకట లక్ష్మణరావుగారు, రామానుజారావనే మారు పేరుతో ఈ కథ రాసారు. అట్లాగే తెలుగు వచన రచనల సూచిప్రకారం మాడపాటి హనుమంతరావు రాసిన నవనాగరికత కథ ఆంధ్రభారతి పత్రికలోనే 1911లో అచ్చైంది. తిరిగి 1912లో అదే పత్రికలో ఇదే రచయిత రాసిన 'హృదయశల్యం కథ ప్రచురించబడింది.

ఇక ఇటీవలి పరిశోధనల ప్రకారంగా బండారు అచ్చమాంబ సమస్త తెలుగు కథ సాహిత్యంలో మొదటి కథా కర్తగా ప్రకటించబడింది. 1902లోనే హిందూసుందరి పత్రికలో అచ్చమాంబ రాసిన 'స్త్రీవిద్య', ధనత్రయోదశి' అనే రెండు కథలు అచ్చయ్యాయి. భార్గవీరావు కృషితో స్త్రీ విద్య, లలిత కృషితో ధనత్రయోదశి కథ వెలుగులోకి వచ్చాయి. సంగిశెట్టి శ్రీనివాస్ మరింత దీక్షగా పరిశోధించి తెలుగు జనానా పత్రికలో 1892లో అచ్చమాంబ రాసిన మూడు కథలు అచ్చైన విషయం కనుగొని 'గణపతియగు స్త్రీ' అనే కథగల పత్రికాప్రతిని వెలికితీసి అదే తెలుగులో మొదటి కథ అని నిరూపించారు.

"బండారు అచ్చమాంబ–తొలి తెలుగు కథలు' పది కథల సంకలనాన్ని వెలువరించారు." (బండారు అచ్చమాంబ తొలి తెలుగు కథలు–సంగిశెట్టి శ్రీనివాస్ ముందుమాట) ఈ అన్వేషణ తెలుగులో ఏది మొదటి కథ అన్న మీమాంసకు పరిష్కారం దొరికింది.

★ ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో తెలంగాణ కథా సాహిత్యానికి ఒక ప్రత్యేకత ఉంది. ఎందుకంటే స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నైజాం పరిపాలన, రజాకార్ల దురాగతాలు, రైతు ఉద్యమాలు, తిరుగుబాట్లు, భూస్వాముల ఆగడాలు, నక్సల్‌బరీ ఉద్యమం తెలంగాణ ప్రజల సామాజిక, ఆర్థిక, సాంఘిక పరిస్థితులు, ప్రజల బాధలు, కష్టాలను ఆధారంగా చేసుకొని తెలుగు నుడికారంతో కథలను రాసి అందరినీ ఆకర్షించారు. తెలంగాణ కథకులు. భారతదేశానికే పోరాటాలను నేర్పి, ఆ వారసత్వాన్ని అందించిన ఘనత ఒక్క తెలంగాణాకే దక్కుతుంది.

తెలంగాణాలో సాయుధ పోరాటాన్ని అక్షరబద్ధం చేస్తూ వందల సంఖ్యలో వచ్చిన కథలన్ని ప్రయోజన దృష్టికోణంతో వచ్చినవే. వాటిలో తెలంగాణాలో స్వాతంత్ర్యానికి ముందున్న పరిస్థితులను వాస్తవికంగా చిత్రించారు తొలితరం తెలంగాణా రచయితలు.

## 2.5. నల్లగొండ జిల్లా కథ - ఆవిర్భావ వికాసాలు

"ఒక జాతి జీవన స్థితిగతులను, ఆచార వ్యవహారాలు, మెరుగైన జీవితంకోసం చేసిన పోరాటాలు వాటి ద్వారా సాధించిన ఫలితాలు సాహిత్యంలో ప్రతిఫలించిననాడు వాటికి శాశ్వతత్వం ఏర్పడుతుందని సంగిసెట్టి శ్రీనివాస్ పేర్కొంటాడు." (బండారు అచ్చమాంబ తొలితెలుగు కథలు– సంగిశెట్టి శ్రీనివాస్, సంపా. ముందుమాట. పుట: xxxv).

తెలుగు కథకు ప్రభావాలు ఎక్కడివైనా కథా నిర్మాణం రచనా పద్ధతివంటి వాటిలో స్థానిక పరంపరకు చెందిన అంశాల ప్రమేయం కూడా ఉంటుంది. తొలినాటి తెలుగు కథలన్నింటిలో సంవాద సంభాషణా ధోరణి అధికంగా కనిపిస్తుంది. వర్ణనలు తక్కువగా ఉంటాయి. తెలుగులో నూతన సంస్కార భావాలు బెంగాలు నుంచి ఆంధ్రాకు దిగుమతి అయ్యేవని, అవే తెలుగువారి సాహిత్య, సాంస్కృతిక వికాసాలకు ప్రేరకాలు అనుకోవడం కూడా పొరపాటే.

1910లో వెలువడిన గురజాడ 'దిద్దుబాటు' కథను తెలుగులో తొలి కథానికగా చాలాకాలం చెబుతూ వచ్చారు. తరువాత గురజాడ 'దిద్దుబాటు' కంటే ముందు ఆచంట సాంఖ్యాయన శర్మ

'లలిత' (1903) కథను పరిగణించటం జరిగింది. దానికి ఆధునిక లక్షణాలు ఉన్నాయా? లేదా? అన్న మీమాంసకు అది గురైంది. మొట్టమొదటిది ఏదన్న ప్రశ్న కాలక్రమానికి సంబంధించే తప్ప సాహిత్య అంతర్లక్షణాలు చర్చకు అందులో ఆస్కారం తక్కువ.

బండారు అచ్చమాంబ రాసిన పరి కథలు 20వ శతాబ్దం అంతా కథా చరిత్ర చర్చలో స్థానం సంపాదించుకోకపోవడానికి గురజాడ ప్రాథమ్యం తిరుగులేదన్న విశ్వాసంతోపాటు సాహిత్య రంగంలో వికాసం మొదట ఉత్తరాంధ్ర తరువాత దక్షిణాంధ్రలో జరిగిందన్న అభిప్రాయం కూడా కారణం అంటాడు కె.శ్రీనివాస్' (బండారు అచ్చమాంబ తొలి తెలుగు కథలు–సంగిశెట్టి శ్రీనివాస్, సంపా. పుట: xviii).

"తెలుగువారి జీవితాల్ని సాంస్కృతిక పునర్వికాస కథ సాహిత్యంలో రికార్డు చేసినవారిలో అగ్రగణ్యురాలు, ఆద్యురాలు బండారు అచ్చమాంబ. ఆధునిక కథానిక ప్రక్రియకు అక్షరం అంకురార్పణ చేసింది. పునాది వేసింది అచ్చమాంబ. తొలి తెలుగు కథకురాలు బండారు అచ్చమాంబ. ఈమె నల్లగొండ జిల్లా వాసి. నిజాం పాలనలోని పరిటాల పరగణాకు చెందిన మహిళ. అచ్చమాంబ వివాహం తరువాత ఆమె పెద్దన్న కొమర్రాజు శంకరరావు ఇంట్లో ఆమె మేనమామ మాధవరావుతో దేవరకొండలో జరిగింది. 1903లో వెలువడ్డ 'అబల సచ్చరిత్ర రత్నమాల'లో 'రుద్రమదేవి గుణపాంబల' జీవిత చిత్రణ చేసి ఆధునిక కాలంలో తెలంగాణా మహిళకు సముచిత స్థానమిచ్చిన రచయిత్రి అచ్చమాంబ.

అచ్చమాంబ కథలు సరళగ్రాంథిక భాషలోనే ఉన్నాయి. కథకున్న లక్షణాల్లో వ్యవహారిక భాషలో ఉండాలనడం వల్ల గురజాడ 'దిద్దుబాటు' తెలుగులో మొదటి కథ అని అంటున్నాం. కాని తర్వాతి కాలంలో 1930 దశకంలో విశ్వనాథవంటి వారు కథల్లో గ్రాంథిక భాషను ప్రయోగించారు. అయినా వాళ్ళను ఆధునిక కథా రచయితలుగానే పరిగణిస్తున్నాం కదా! కాబట్టి భాష గ్రాంథికం, వ్యవహారికం అనటం కథా లక్షణాల్లో ప్రధాన విషయం కాదు. అప్పుడు అచ్చమాంబ కథలు ఆధునిక ప్రక్రియకు చెందిన కథలుగానే కనిపిస్తాయి.

తెలుగులో మొదటి కథను రాసాడనే గురజాడకు పూర్వమే ప్రయోజనంగల సామాజిక ఇతివృత్తంతో ఉన్న అన్ని కాలాలకు అవసరమయ్యే సందేశాలను అందించే కథలను అచ్చమాంబ రాసింది. అందుకే అచ్చమాంబ కథలే తెలుగులోనూ, తెలంగాణాలోనూ, నల్లగొండలోనూ 'తొలి కథలు' 1898-1904 కాలంలో గురజాడకు పూర్వమే సంఘ సంస్కరణ భావాలతో రచించిన అచ్చమాంబయే తొలి కథకురాలను చెప్పాలి. 1901లో ఆమె రచించిన 'గుణవతియగు స్త్రీ' తెలుగులో మొదటి కథ అని గుర్తించాలని ముదిగంటి సుజాతారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. (బండారు అచ్చమాంబ తొలి తెలుగు కథలు-సంగిశెట్టి శ్రీనివాస్, సంపా. పుట: xiii).

"రాయసం వేంకట శివుడు వెలువరించిన 'తెలుగు జనానా' పత్రికలో 1898 జూలై సంచికలో 'ప్రేమ పరీక్షణ' అనే కథ, సెప్టెంబర్ సంచికలో 'ఎరువు సొమ్ము పరువు చేట' కథలను రాసిందని తెలియజేసాడు సంగిశెట్టి." (మన తెలంగాణ-నల్లగొండ జిల్లా ప్రత్యేక సంచిక-కర్ర ఎల్లారెడ్డి, సంపా. పుట: 30) అయితే ఈ రెండు కథలు ఇంకా దొరకవలసి ఉంది. 'గుణవతియగు స్త్రీ' కథ తెలుగు జనానా(1901మే), 'లలిత శారదలు' కథ తెలుగు జనానా (1902 మే), 'దంపతుల ప్రథమ కలహం' కథ హిందూ సుందరి (1902 జూన్), 'సత్పాత్ర దానము' కథ, హిందూ సుమ్దరి (1902 ఆగస్టు), 'స్త్రీ విద్య' కథ హిందూ సుందరి-1902, 'ధన త్రయోదశి' కథ 1902 నవంబర్, 'భార్యాభర్తల సంవాదము' కథ 1903, 'అద్దమును సత్యవతియును' కథ 1903, బీద కుటుంబం' కథ సావిత్రి పత్రిక 1904 ఫిబ్రవరిలో వచ్చాయి.

"అచ్చమాంబ సోదరుడు కొమర్రాజు లక్ష్మణరావు 'యేబదివేల బేరము' కథ 1910లో రాసాడు. శేషబట్టార్ వెంకట రామనర్సింహారావు 'నైజగుణం' కథలో మనుషుల స్వభావాలను సమయానుకూలంగా మారే తీరును విమర్శిస్తూ రక్తి కట్టించాడు." నల్లగొండ నుంచి విస్తృతంగా కథా సాహిత్యం రావడానికి జిల్లాలో విస్తృతంగా వెలువడిన పత్రికలు కూడ దోహదపడ్డాయి. పత్రికలు కథల ప్రచురణకు పూనుకోవడంవల్ల కథా రచయితలకు విరివిగా కథలు రాసే అవకాశం, ఆకాంక్ష ఏర్పడింది.

## 2.6. నల్లగొండ జిల్లా కథలు-వికాస దశలు

నల్లగొండ జిల్లా నుంచి తొలిదశలో రాయబడిన కథలు ఇటీవల కొన్ని దొరికినా మరికొన్ని అలభ్యంగానే ఉన్నాయి. దొరికిన కథల వివరాలను పొందుపరచడం జరిగింది. పులిజాల వెంకటరంగారావు కథలు ఇప్పటికీ దొరకటంలేదు. బాల్య వివాహాలను నిరసిస్తూ షబ్నవీసు వెంకటరామ నర్సింహారావు 1921లో 'బాలికా విలాపం' అను కథను వెలువరించాడు. కోదాటి శ్రీనివాసరావు 'నాకల' కథ 1925లో అచ్చయింది. 1926-1930 మధ్య కాలంలో దాదాపు పది కథలు రాసిన బి.వెంకోబరావు ఇప్పటివరకు వెలుగులోకి రాని కథకుడు. సమాజంలోని వివిధ విషయాలను వస్తువులుగా తీసుకొని కథలుగా మలిచాడు. భువనగిరిలో ఉన్నతోద్యోగం నిర్వర్తిస్తూ 'కళంకము' హృదయ పరివర్తనము (భమరము కాదు భ్రమ', 'ఇరువురు పాపఫలము', 'పూర్ణిమ', 'మత్స్యరపిశాచము, 'దేవదాసి', 'పందెము', 'అభిశాపము మొదలైనవి ఆయన కలం నుండి జాలువారిన కథలు. 1927లో కే.రాములు రాసిన చారిత్రక కథ 'విపరీత సాహసము' ఎన్నదగింది. 1927లో 'యౌవన బ్రాంతి' పేరిట కథ రాసిన కట్టంగూరి నారసింహారెడ్డి నల్లగొండవాడే. మూటుపూరు వెంకటేశ్వరరావు నారదుని యాత్ర పేరిట 'జగడాల కథ' 1935లో 'గోలకొండ' పత్రికలో అచ్చయింది. తెలంగాణాలో నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు ఊపందుకొని రాజకీయ చైతన్యం వెల్లివిరిస్తున్న తరుణంలోనే రెండో ప్రపంచ యుద్ధం చోటుచేసుకోవడం వలన కొన్ని పత్రికలు మూతపడడంతో 1930-40 మధ్య నల్లగొండ కథా నిర్మాణం అంతగా జరగలేదు. 1909లో పుట్టిన ఎస్.బి. సీతారామారావు 1939లో రాసిన 'గరీబోన్ని' కథ తెలంగాణా భాషలో రాసిన మొదటి కథల్లో ఒకటి. ఈయన నల్లగొండవాడని గోలకొండ కవుల సంచికలో ఉంది. 1940లో వెలువడ్డ 'కమ్మ తెమ్మెరలు' సంకలనంలో నల్లగొండ రచయితల కథలున్నాయి. చెరుకుపల్లి హరికృష్ణారావు 1940లో రాసిన 'పల్లెబడి', చెరుకుపల్లి రఘోత్తమరావు 1940లో వెలువరించిన 'కోవిల్లో', బోయినపల్లి రంగారావు కథ 1940లో వచ్చిన 'వారం రోజుల అవస్థ' కథలు తెలంగాణా భాషా మాధుర్యాన్ని అందునా నల్లగొండ యాసను ఆ కథల్లో అంబటిపూడి వెంకటరత్నాలు మొదలైన వారు 1940లో గోలకొండ పత్రికలో కథలు వెలువరించారు. దాదాపుగా ఇదే సమయంలో ఆర్య సమాజ భావాలతో ప్రభావితులైన మంత్రి ప్రగడా వెంకటేశ్వరరావు, కోదాటి శ్రీనివాసులు కొన్ని కథలు వెలువరించారు. వీరి కథలు ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి స్వాతంత్ర్యం కోసం పోరాడేందుకు సిద్ధం చేసాయి. ఇదే

కాలంలో పి.బి. ఆచార్య దామిడి రంగారెడ్డి, ఉన్నవ వెంకటారామయ్య అనే వాళ్ళు కథలు రాసారు. 1942, 43 ప్రాంతాల్లో నల్లగొండలో కమ్యూనిస్టు ఉద్యమం ఊపిరిపోసుకుంది. రావి నారాయణరెడ్డి నేతృత్వంలో భువనగిరిలో జరిగిన ఆంధ్ర మహాసభ మొత్తం తెలంగాణా దిశనే మార్చేసింది. ఈ ఉద్యమ స్ఫూర్తితో కథలు రాసిన వారిలోఆళ్వారుస్వామి, కాంచనపల్లి చిన వెంకటరామారావు, ఆవుల పిచ్చయ్యలు ప్రముఖులు. ఆళ్వారుస్వామి 1944లో 'చిన్నప్పుడే' కథను కథా ప్రక్రియలో మొదటగా తన రచనా వ్యాసాంగాన్ని ఆరంభించాడు. ఆ తర్వాత ముస్లిం జీవితాలను, రజాకార్ల కాలాన్ని, మాల మాదిగల బతుకులను, స్త్రీల వ్యథభరిత జీవితాలను రచయితల సంఘం పెద్ద దిక్కుగా ఉండిన కాంచనపల్లి చిన వెంకటరామారావు 'మన ఊళ్ళో కూడానా' అనే పేరిట స్వాతంత్ర్యానంతరం తొమ్మిది కథలతో వెలువడ్డ ఈ సంపుటి కూడా పేదల దుర్భరమైన బతుకులను చూపించింది. కాంతం కథల స్ఫూర్తితో కనకం కథలు రాసి ముణిమాణిక్యం నరసింహారావు మన్ననలందుకుంది. ధరణికోట శీనివాసులు 'చల్లపులుసు' కథ అన్నంలోకి, మాఇంట్లో సంపుటాల ద్వారా నల్లగొండ కథకు ఇందులో పుస్తకరూపమిచ్చాడు. ప్రజల పేదరికాన్ని నల్లగొండ బతుకులకు అక్షరరూపమిచ్చాడు.

బూర్గుల రంగనాథరావు 1945లో ఉద్యోగరీత్యా నల్లగొండలో ఉండేవాడు. ఆయన పూనిక మేరకు 'ఉషస్సు' కథా సంకలనం వెలువడింది. ఇది నల్లగొండ నుంచి వెలువడ్డ తొలి సంకలనం. మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన మేడిపల్లి ఆంజనేయులు 1946లో 'పాడియావు' లాంటి కథలు వెలువరించారు. సూర్యాపేట ప్రాంతానికి చెందిన ఆవుల పిచ్చయ్య సాయుధ పోరాటంలో స్వయంగా పాల్గొనడమే కాకుండా ఎందరికో శిక్షణనిచ్చి గెరిల్లాలుగా మార్చాడు. వెట్టిచాకిరీకి, భూస్వాముల, ప్రభుత్వ అధికారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఈయన రాసిన కథలు సాయుధపోరాటం నాటి నల్లగొండ జిల్లా జీవితాన్ని చిత్రించాయి. పిచ్చయ్య కథలు ఈతగింజ ఇచ్చి లాటిగింజ లాగిన జమీందారు, ఊరేగింపులు, చపరాసి దినచర్య, వెట్టిచాకలి దినచర్య మొదలైన కథలను ఒక సంపుటిగా తీసుకొచ్చినవారు సంగిశెట్టి శ్రీనివాస్.

లింగగిరి పరగణాకు చెందిన సి.వి. కృష్ణారావు రాసిన 'నోటీసు', 'గీయని అక్షాంశ రేఖ' కథలు చెప్పుకోదగ్గవి. గోలుకొండ పత్రికలో రచనా వ్యాసాంగాన్ని ఆరంభించిన దవళా శ్రీనివాసరావు ఆనాటి పత్రికల్లో తన కథల్ని వెలువరించాడు. 'నేను ఏడ్పు మానలేదు అనేది ఆయన కథల్లో ఒకటి.

పుల్లబొట్ల వేంకటేశ్వర్లు నల్లగొండలో పుట్టినప్పటికీ ఉద్యోగరీత్యా ఖమ్మంలో ఉండేవాడు. అక్కడ్నుంచి తన కథల్ని పలు సంపుటాలుగా వెలువరించారు. 1950లో తొలి కథ 'పుట్టుమచ్చ' వెలువరించిన ఈయన 'జ్ఞానస్రవంతి', మూడు వాక్చిత్రాలు, పుల్లబొట్ల కథలు, గాడితప్పిన జీవితాలు, పిన్ని చాలామంచిది, వెన్నెల కిరణాలు, క్రాస్ట్ చెక్ ద్వారా దాదాపు 50 కథల్ని సంపుటీకరించారు. మధ్యతరగతి మనుషుల జీవితాలు కన్నీటి గాథలు. అంతర్మథనాలే ఈయన కథలకు జీవనాధారాలు. 1952లో 'జైలు లోపల' కథా సంపుటి ద్వారా మొత్తం తెలుగు సమాజానికి సంబంధించిన కడగండ్లను కండ్లకు కట్టినట్టుగా చూపించాడు ఆళ్వారుస్వామి. ఒకవైపు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తూ, నిరంతరం సాహిత్య సేవకే జీవితం అంకితం చేసాడు. అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేసిన మరో ప్రతిభావంతమైన కథా రచయిత 'నాయినగారు'గా పిలువబడ్డా కోదాటి లక్ష్మీనరసింహరావు 1953లో 'శాంతి ప్రకటనలు' కథ రాసాడు. ఆయన ఎన్నో మారుపేర్లతో రాసిన కథలు మొదట్లో కమ్యూనిస్టు ఉద్యమాలను, అనంతరం కాంగ్రేస్ పాలనను చిత్రించాయి. 1954లోనే కథా సంపుటి తీసుకురావాలని దానికి 'చీకటి దొరలు' పేరు పెట్టాడు. అయితే వివిధ కారణాల వల్ల అది వెలుగు చూడలేదు.

పైడిమర్రి వెంకట సుబ్బారావు 1956లో 'నౌకరి' అనే కథను రాసాడు. 1961లోనే కథా రచయితగా ప్రాణం పోసుకొని సమాజ శ్రేయస్సుని కాంక్షిస్తూ, అనేక కథలు రాసిన వారిలో నిఖిలేశ్వర్ ఒకరు. ఆరంభంలో విరివిగా కథలు రాసిన ఈయన తర్వాత కవిత్వంపై శ్రద్ధ పెట్టడంతో వాటి సంఖ్య తగ్గింది. విరసం వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన ఈయన 22 కథలు 2002లో 'నిఖిలేశ్వర్ కథలు' పేరిట వెలువడింది. మండల్ రెడ్డి కొండల్ రెడ్డి 1962లో 'మూసిన తలుపులు' కథను తీసుకొచ్చాడు. అలాగే ఓరుగంటి పురుషోత్తం 1963లో 'అందగత్తె' కథను రాసాడు. ఈ కాలం తర్వాత పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు, నిఖిలేశ్వర్ కొన్ని కథల్ని వెలువరించారు. ప్రపంచంలోని వివిధ భాషల్లోగల కథా సాహిత్యాన్ని తెలుగువారికి సుపరిచితం చేసిన ముక్తవరం పార్థసారథి కూడా నల్లగొండ వారే. భువనగిరికి చెందిన ఈయన తొలి కథ 'చిట్టి ఏడుపు' 1965లో అచ్చయింది. ఆ తర్వాత కాలంలో ఈయన రాసిన కథలు 2002లో 'మిణుగురు' పేరిట వెలుగు చూశాయి. నటువా వెంకటయ్య 1968 'రామలక్ష్మి' అనే కథను రాసాడు. అదే సంవత్సరంలో ధరణికోట సమీర్ కుమార్

‘ఆడుమారిందు’ కథను వెలువరించాడు. పంతంగి లక్ష్మీకాంతం 1968లో వరుసగ ‘మెల్టింగ్ మైండ్’, కన్నీళ్ళలో కరుణ వ్యధిత హృదయం, చెదరని మమతలు, పసిడి హృదయం మొదలైన కథలను వెలువరించి మంచి కథకుడయ్యాడు. 1968లో కొండపల్లి వెంకటశేషగిరిరావు రాసిన ‘సంసార సాగరం’ కథ ఆయనకు మంచి గుర్తింపు తెచ్చింది. 1968లో మేరెడ్డి యాదగిరిరెడ్డి ‘నారాయణరావు’ కథ అత్యంత ఆదరణ పొందింది.

1966 ఆ ప్రాంతంలో స్థాపించబడ్డ యువరచయితల సమితి తరపున దర్పణం, మాలిక, సమర్పణ కథా సంకలనాలను వెలువరించడమే కాకుండా దాని తరపున ‘దర్పణం’ పత్రికను కూడా తీసుకువచ్చి ఎందరో యువ రచయితలను ప్రోత్సహించారు. ఈ పత్రికకు మారుపేరుతో కూడ కొన్ని కథలు రాసినట్టు యన్.కె.రామారావు చెప్పారు. అంటే ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం తెలంగాణా కథకు అంతగా ప్రోత్సాహం ఆదరణ దొరకలేదు. గోలుకొండ పత్రిక మూతపడడమే కాకుండా ప్రాంతేతరుల ఆధీనంలోని ‘తెలుగు స్వతంత్ర’ లాంటి పత్రికలు హైదరాబాదు నుంచి వెలువడ్డా ఆంధ్ర రచయితలకే అగ్రతాంబూలమిచ్చి ప్రచురించింది. దీంతో బయటి పత్రికలు కూడా వీరికి తగిన గుర్తింపు ఇవ్వలేదు. ఈ కాలంలో కథలు వెలువరించిన వారిలో కోలాహలం లక్ష్మణరాజు ముఖ్యులు. ఈయన 25కి పైగా నవలలు రాసి అఖిలాంధ్ర అభిమానాన్ని చూరగొన్నాడు. నవలాకారునిగా వచ్చిన గుర్తింపు కథకుడిగా దక్కలేదు. ఎన్నో సంకలనాలలో ఆయన కథలు చోటు చేసుకున్నా, ప్రత్యేక సంపుటిగా అచ్చుకాకపోవడంతో అవి అందుబాటులో లేకుండా పోయాయి.

1969 తర్వాత నల్లగొండ కథకు పక్కా దారులేసిన సంస్థగా చెప్పుకోదగింది యువ రచయితల సమితి. వ్యక్తులుగా బోయ జంగయ్య, దేవరాజు మహారాజు, మేరెడ్డి యాదగిరిరెడ్డి, వసంతరాయ్, బి. రాములు, యన్.కె. రామారావు, మూటుపూరి కృష్ణమూర్తి, నిఖిలేశ్వర్, చెరబండరాజు, ముక్తవరం పార్థసారధి మొదలైనవారు. వీరంతా ఈ కాలంలో వివిధ పత్రికల్లో కథలు వెలువరించారు.

1970లో టెర్లిన్ చీర, దారితప్పిన బాటసారి కథలతో రచనలకు శ్రీకారం చుట్టిన యన్.కె. రామారావుగా పిలువబడే నాగపరాజు కోదండ రామారావు ఈ మధ్య కాలంలో 'విద్యుల్లత' పేరిట కథల సంపుటాన్ని వెలువరించాడు. రాజకీయ నాయకుల దాష్టికాలను తెలంగాణా సమాజాన్ని తన కథల్లో చిత్రించాడు.

1970-80 మధ్య కాలంలో యువ రచయితల సమితి సభ్యులు మూతుపూరి కృష్ణమూర్తి 'తప్పు' కథ వచ్చింది. మేరెడ్డి యాదగిరిరెడ్డి చావుకోసం, ఓటన్న ఇంకా తన కథలను కలిపి 2004లో 'మట్టికథలు' అనే పేరిట సంపుటీకరించి వెలువరించాడు. రాహువు 'రాజ్యంలో రాజ్యం చచ్చింది', 'నిర్మల్ సమాధులపై పునాదులు', శ్రీకాంతి 'నీడలో దాగిన నిజం', అల్లుబెల్లి రాంచంద్రారెడ్డి 'విషం కక్కిన సంస్కారం', బోయినపల్లి కిషన్‌రావు 'తీరని కోరికలు', విద్వాన్ నాగం 'అధిక+అరి', యం కృష్ణమూర్తి 'ఎన్నికల రోజు', ఆగ్నేయ 'ఒక గుమాస్తా కథ', కాంచనపల్లి వెంకట కిషన్‌రావు 'ఉపమానం-ఉపమేయం', 'చిలక జోస్యం' మొదలైన కథలను వెలువరించారు. విప్లవ భావజాలం కలిగిన చెరబండరాజు 1971లో 'చిరంజీవి' అనే కథను వెలువరించాడు. కొలనుపాక మురళీధరరావు 1971లో 'బంధుప్రీతి' కథను రాసాడు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఉప్పెనలా విరుచుకుపడిన బి.యన్.రెడ్డి 1972లో ఆయువుపట్టు' కథ అత్యంత ప్రజాదరణ పొందిందిగా ప్రశంసలందుకుంది.

దేవులపల్లి శ్యాంసుందరరావు 1972లో రాసిన 'మనస్సు ఆంతర్యం' కథ మరియు వివిధ కాలాల్లో రచించిన తన కథలను కలిపి 'సంఘర్షణ', 'గూడుదొరకని పిట్ట' అనే కథ సంపుటాలుగా నల్లగొండ ముంగిట విరబూయించాడు. నల్లగొండ కథల వాకిట చిరస్మరణీయమైన ముద్ర బోయ జంగయ్యది. ఆయన వెలువరించిన 1973లో 'లోకం' కథల సంపుటి కాగా, ఆ తర్వాత కాలాల్లో 'గొర్రెలు', 'ఎచ్చరిక', 'దున్న', 'రంగులు', 'చీమలు', 'తెలంగాణ వెతలు', కొత్త పాఠాలు, బోజ కథలు, ఉప్పునీరు, ఇప్పపూలు' మొదలైన సంపుటాలను తీసుకొచ్చాడు. దళితుల జీవితాలను తెలంగాణా పోరాట కాల స్మృతులను, దౌర్జన్యాలకు బలైన బానిస బతుకుల్ని తన కథల్లో చిత్రించాడు. కే. వాసు 1974లో రంగు వెలసిన త్రికోణం, పి.సుదర్శన్ అదే సంవత్సరంలో 'అప్పుకోసం', చెన్నూరి

నాగరాజు 'పిచ్చి' అనే కథతోపాటు 'ముల్లగులాబి' అనే కథా సంపుటిని తీసుకువచ్చాడు. శేషవి కూడా 1974లో చందన, 1975లో బార్యోపహతుడు కథలు రాగా, ఇంకా కొన్ని కథలతో కలిపి 'శేషవాక్యం'గా ఒక పుస్తకం బయటికి వచ్చింది. 1976లో వివిధ రచయితలు తమ కథతో సాహితీ వనంలోకి చొచ్చుకొచ్చారు. నిర్మల్ 'ఓ మామూలు మనిషి కథ', మూటుపురి కృష్ణమూర్తి 'మల్లీశ్వరి–మల్లెపూలు', బి.రాములు 'వ్యత్యాసాలు', విద్వాన్ యానాల 'ఆవిడ భర్త పెళ్ళి', కొల్లు మధుసూదనరావు 'మోసం', దారితప్పితే', కొట్ర మల్లికార్జున శర్మ 'నాగరికం', దేవులపల్లి వెంకట ప్రభాకరరావు 'నాకొద్దు మంత్రి పదవి', ఇంకా భద్రసేన కాశావజ్జల వెంకట నరసింహమూర్తి ఈ కాలంలో కథానికలు వెలువరించారు. సాంస్కృతిక సాహిత్య చైతన్యంతో మూఢనమ్మకాలపై వేటుపడేలా కథలల్లిన తెలంగాణా (నల్లగొండ) కథల రారాజు దేవరాజు మహారాజు. 1977 లో 'కడుపు కోత' కథల సంపుటి 1991లో బి. విద్యాసాగర్‌తో కలిసి పాలు ఎఱ్ఱబడ్డాయ్, 1993లో 'దేవరాజు మహారాజు' కథల పేరిట పుస్తకాలను ప్రచురించాడు. తెలంగాణ భాషలో కథలు రాసిన వారిలో అగ్రగణ్యుడు దేవరాజు మహారాజు. ఈయన భువనగిరి వాడు. కె.శ్రీనివాస్ 1982లో కొన్ని కథల్ని వెలువరించాడు. అయితే అవన్నీ పత్రికల పుటల్లోనే ఉండిపోయాయి. సుంకిరెడ్డి నారాయణరెడ్డి 'నాగావళి' పేరుతో 1987లో 'రెండుగా చీలిన మాట' కథను రాసారు. అదే సంవత్సరంలో యస్.యస్. రాహుల్ 'ఒకే గూటి పక్షులు' కథను రాసారు.

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం స్థాపన, అధికారంలోకి రావడంతో పరిస్థితిలో స్పష్టమైన మార్పులు చోటుచేసుకున్నాయి. స్థానికులపై ప్రాంతేతరుల అజమాయిషీ పెరిగి తెలంగాణీయులు తమ ప్రాంతంపైనే పరాయికరణకు గురయ్యారు. 1988 వరకు ప్రాంత స్పృహ అస్తిత్వ ప్రకటన గుండెల్లోనే దాచుకున్న తెలంగాణ, ఆ తర్వాత బహిరంగంగా ప్రకటించింది.

1988 నుంచి కథలు రాసిన పుప్పాల కృష్ణమూర్తి 'రైలు ప్రయాణం' కాగా, ఆ తర్వాత 1993లో 'జీవిత చిత్రం' పేరిట సంపుటి తీసుకొచ్చాడు. 1989లో సగటు మనిషి యొక్క భావాలను తెలంగాణాలోని ఆర్తిని, అలజడిని, అనుభవాలను అక్షరీకరించి 'శిలువకు తొడిగిన మొగ్గ', ఆ తర్వాత 'ఎల్లమ్మ' కథ సంపుటాల ద్వారా అందరితో పంచుకున్న కథకుడు కాసుల ప్రతాపరెడ్డి. 1990లలో 'ఉదయం' పత్రికలో పనిచేస్తున్నప్పుడే దారితప్పిన తెలుగు కథకు 'నవకథ' సంకలనం ద్వారా బాట తీసాడు.

దొరలు దొంగలై దోచుకుంటున్న వారిని పయిలంగా ఉండమని చెబుతున్న కథకుడు పి.చిన్నయ్య, 1990లో 'వివక్ష' కథ వెలువరించాడు. అటు తర్వాత తాగేందుకు గుక్కెడు నీళ్ళులేక, ఫ్లోరోసిస్ వ్యాధితో నడ్డివిరిగిన నల్లగొండను తెలియజెప్పిన కథకుడు పి. చిన్నయ్య 'పయిలం' పేరిట ఒక సంపుటిని తీసుకొచ్చాడు.

నన్నురి సత్తిరెడ్డి 1993లో వాగొచ్చింది, దొంగలు, పోస్టొచ్చింది వంటి కథలు వెలువరించాడు. అలాగే వీ.ఆర్. నన్నూరి 1996లో 'పైరు', 'గడి', 'పట్నం బాబులు' లాంటి కథలు తీసుకొచ్చాడు. సూర్యాపేటకు చెందిన కొప్పరపు జ్యోతి 1996లో 'మరక' అనే కథను వెలువరించింది. ఆధునిక, అభివృద్ధి పేరిట జరుగుతున్న దోపిడీ, అన్యాయం, అందునా ఆడవాళ్లు ఇంటాబయట ఎదుర్కొంటున్న ఆగచాట్లు, వ్యాపారపరమైన మానవ సంబంధాలను తన కథల ద్వారా చిత్రికకట్టిన నల్లగొండ జిల్లా కథకురాలు ముదిగంటి సుజాతారెడ్డి 1997లో 'కబ్జా' అనే కథను తీసుకురాగా, అటు తర్వాత విసుర్రాయి, మింగుతున్న పట్నం, వ్యాపార మృగం వంటి కథల సంపుటాల ద్వారా తెలంగాణా జీవితంలోని విభిన్న పార్శ్వాలను తెలియజెప్పింది. ఎం.వెంకట్ 1998లో 'వల్లెక్కం' కథను రచించాడు.

ముస్లిం దీనావస్థలు, దిక్కార స్వరాలు అన్ని కలిపి రచించిన రచయిత్రి షాజాహానా 1999లో 'సిల్‌సిలా' కథను వెలువరించింది. అలాగే 2000లో గౌస్ మొహిద్దీన్ గుంగీడక్కన్, స్కైబాబా కథలు, చోటీబెహన్, ఖిబ్లా కథలు వచ్చాయి. 'ఆక్సిజన్ బార్'తో జీవచ్ఛవంలా ఉన్న తెలంగాణా అణగారిన బతుకులకు, భాషకు ఊపిరిపోసింది తెలిదేవర భానుమూర్తి. తెలంగాణా తల్లి పేగుబంధాన్ని, నల్లగొండ గోదుని, గోసని అమానవీయంగా మారుతున్న సంబంధాన్ని అక్షరీకరించిన కథకుడు బోధనం నర్సిరెడ్డి. ఇదే సంవత్సరంలో 'తశ్వ' కథను వెలువరించాడు. ఇటీవలే 'పేగుబంధం సంపుటి తీసుకొచ్చి ఎన్నో ఏండ్లుగా బాకీ ఉన్న పనిని తీర్చుకున్నాడు. పగడాల నాగేందర్ 2001లో 'ఉసురు' అనే కథను వెలువరించాడు. అలి 2001లో 'హరేఖ్ మాల్' కథల సంపుటిగా తీసుకువచ్చాడు. మందడి కృష్ణారెడ్డి 2001లో 'మారని సమాజం' కథను రాయగా అటు తర్వాత ఆయన రాసిన

కథలు మందడి కథలుగా సంపుటీకరించాడు. ఇండియన్ పోస్టల్ సర్వీసెస్‌లో పాండిచ్చేరిలో ఉద్యోగం చేస్తున్న తెలంగాణను కన్నతల్లి నల్లగొండను మరిసిపోకుండా కథలు రాస్తున్నది యెన్నం ఉపేందర్. 2002లో వచ్చిన 'రేషన్ కార్డు' కథతో కలిపి 32 కథలను 'ఎండమావి'గా 2003లో తీసుకొచ్చాడు. పల్లెతల్లి, అమ్మవడిలాగా వెచ్చంగా ఈయన కథలుంటాయి. జి. అనసూయ 2002లో ఉత్త(మ) ఉపాధ్యాయుడు, పనిపిల్ల కథలు రాసారు. ఆ తరువాత ఆమె రాసిన కథలన్నింటినీ కలిపి 'నిశ్శబ్ద చిత్రాలు' సంపుటిగా తీసుకొచ్చారు. దళిత చైతన్యానికి ప్రతీకగా దొడ్డి రామ్మూర్తి ఆరు కథల సంపుటి 'బొండిగె' (2002) నిలుస్తుంది. అణచివేతకు గురైన అట్టాడుగు వర్గాల వారి జీవితాలకు దర్పణం. వేణు సంకోజు 2003లో 'మొరం' కథ వచ్చింది. ఆయన రాసిన కథలు ఆ తర్వాత 'స్పర్శ' కథల సంపుటిగా బయటికి వచ్చింది. నల్లగొండలో కొలనుపాక మురళీధరరావు 2003లో 'ఇరుసు విరిగిన బండి' కథ వెలువరించాడు. ఆ తర్వాత 'అష్టాదశ కథలు' పేరిట ఆయన కథలు అన్నీ సంపుటీకరించబడ్డాయి.

నల్లగొండ 'వతన్' కథకులు స్కైబాబా, అలీ, నిఫార్, గౌస్ మొహియుద్దీన్, షాజాహానా, ఒకవైపు, తెలంగాణా మరోవైపు ముస్లిం అస్తిత్వం ఈ పోరాటంలో ఆటుపోట్లు అంచనాలకు అందని అగాధాలు వీటి యొక్క సమగ్ర సజీవ జీవిత చిత్రాల రూపం 2004లో 'వతన్' కథల సంకలనంగా వచ్చింది. 2004లో కరుణగారి కవులమ్మ ఆడదేనా, పులిపాటి గురుస్వామి ఐటికప్ప కథలొచ్చాయి. వైవిధ్యంగా తెలంగాణా భాషను, జీవితాన్ని ముఖ్యంగా గ్రామీణ వాతావరణాన్ని స్థితిగతులను చిత్రించిన కథకుడు ఎలికట్టె శంకర్రావు. 2005లో 'జారుడు బండ' పేరిట వెలువడ్డ ఈ కథల్లో తెలంగాణ మట్టి వాసన స్పష్టంగా కనిపిస్తుంది.' (మన తెలంగాణ-నల్లగొండ జిల్లా ప్రత్యేక సంచిక– కర్ర ఎల్లారెడ్డి, సంపా. పుట: 31–38).

పిట్టల శ్రీనివాస్ 2005లో 'వెలి', 'లచ్చిమి' తదితర కథలు రాసాడు. పి.చిన్నయ్య 2006లో 'జీవచ్ఛవాలు' కథను రాసాడు. నీరుడు సంజీవరెడ్డి 2007లో 'రాకాసి కోన' కథను రాసాడు. జి. అనసూయ 2007లో 'చెదిరిన బతుకులు' అనే కథను రాసింది. చిత్రం ప్రసాద్ 2007లో 'పల్లేరుగాయలు' కథను రాసాడు. మాళవత్ బాలాజీనాయక్ 2007లో 'జమిలి' కథను రాసాడు.

మేరెడ్డి యాదగిరిరెడ్డి 2008లో 'సెజ్' కథను రాసారు. కందుకూరి దుర్గాప్రసాద్ 2009లో 'దేవుళ్ళు' కథను రాసాడు. పున్న అంజయ్య 2009లో 'పగ' కథను రాసాడు.

దేవులపల్లి కృష్ణమూర్తి 2010లో 'మొదటి కథ' కథను, 2012లో 'కథల గూడు' కథల సంపుటిలోని కథలన్నీ తెలంగాణ సాయుధపోరాట కాలం నాటి కథలే రాసారు. అంబటి వెంకన్న 2010లో 'ఆనోస్తే....చెరువేది? కథను రాసాడు. పెరుమాళ్ళ ఆనంద్ 2010లో 'చివరికి...., 'మమేకం' తదితర కథలు రాసాడు. ముదిగంటి సుజాతారెడ్డిగారు 2010లో 'ఈ పెండ్లి నిలుస్తుందా!' కథను, 'మరోమార్క్స్ పుట్టాలె' కథల సంపుటిని వెలువరించారు. గుడిపాటి వెంకటేశ్వర్లు 2010లో 'గది' కథను రాసాడు. వేణు సంకోజు 2010లో 'అమ్మవాసన' కథను రాశాడు. తెలిదేవర భానుమూర్తి 2010లో 'ఆడ పాలపిట్టలున్నాయా!' కథను, ఆక్సిజన్ బార్, నెమలీక పేరుతో కథా సంపుటాలు వెలువరించాడు. కొలనుపాక మురళీధరరావు 2010లో 'చిలుకల దండ' కథను రాసాడు. భూతం ముత్యాలు 2010లో 'బతుకు తీపి' కథను 'బేగరి కథలు' కథా సంపుటిని వెలువరించాడు. పెండెం జగదీశ్వర్ 2010లో 'కన్నీటి బొట్టు' జానపద కథలు, బాలల కథలు రాసారు.

ఎలికట్టె శంకరరావు 2010లో 'రైతు పుట్క' కథను 'దుబ్బచెలక', 'పరిగెచేను' తదితర కథల సంపుటాలను వెలువరించారు. కోటమర్తి రాధాహిమబిందు 2010లో 'యుగాంతం', 'వంశవృక్షం', 'మానవాలి' కథలను రాసారు. జి. అనసూయ 2010లో 'రాకస క్రీడ' కథను, 'తెలంగాణ బతుకు చిత్రాలు' కథల సంపుటిలో రెండు రకాల కథలు ఉన్నాయి. గ్రామీణ నేపథ్యం, ప్రపంచీకరణ, కార్పోరేటీకరణల ప్రవేశంతో విధ్వంసమైన చేతివృత్తులు, వ్యవసాయం సెజ్‌ల రాకతో భూములను, భూమికను, ఉనికిని, ఆత్మగౌరవాన్ని పోగొట్టుకున్న రైతులు, రైతుల నిస్సహాయ ఆత్మాహుతులతో రోడ్ల పాలైన కుటుంబాలు మొదలైనవి దీనిలో కన్పిస్తాయి.

కంచర్ల సత్యపాల్ రెడ్డి 2010లో 'ఓ సిన్నోని కథ' రాసాడు. రమేష్ హజారి 2011లో 'వాన కురిసిన రాత్రి', 'మాణిక్యం', 'కర్తవ్యం' తదితర కథలను రాసాడు. సైబాబా 2011లో 'ఆధూరె'

ముస్లిం కథల సంపుటిని వెలువరించారు. వెన్నం ఉపేందర్ 2011లో 'నెట్‌వర్క్ ఫెయిల్యూర్', 'మా ఊళ్ళోసుత టవర్ బెట్టిండ్రు' తదితర కథలు, 'కొన్ని వెలుగు నీడలు' కథల సంపుటిని నవచేతన పబ్లిషింగ్ హౌస్‌వారు వెలువరించారు. కోట్ల వనజాత 2011లో 'మార్కెట్' కథను రాసింది.

శిరంశెట్టి కాంతారావు 2012లో 'ఊతకర్రలు', 'చొరబాటు', 'మా ఫణిగిరి గుట్ట కథలు' కథల సంపుటాలను వెలువరించారు. పి.చిన్నయ్య 2013లో 'అడిగెటోళ్ళు' కథను రాసాడు. గాదె వెంకటేష్ 2013లో 'బత్తెం', 'టోల్‌గేట్', 2104లో కథలను రాసాడు. సుజాత సూరేపల్లి 2013లో 'తెగిపడ్డ పల్లెలు' కథను రాసారు. షాజాహానా 2013లో 'బిల్లి' కథను రాసారు. నీరుడు సంజీవరెడ్డి 2013లో 'లంకె' కథను రాసారు. సంగిశెట్టి శ్రీనివాస్, స్కైబాబా 2013లో 'రంది' తెలంగాణా కథల సంపుటిని వెలువరించారు. బెల్లి యాదయ్య 2013లో 'ఎర్రెద్దు' కథను రాసాడు.

బోయపల్లి నర్సయ్య 2014లో 'నిజాయితీ' కథ, 'ఆబ్కారీ కథలు' ఆబ్కారీ శాఖలో జరిగే చిత్ర, విచిత్ర సంఘటనలు, స్టేషన్ల నిర్వహణ, నేర పరిశోధనకై జరిగే దాడులు, కేసులు, కోర్టు వ్యవహారాలు, గుడుంబా మాఫియాలు, ఆఫీసర్ల టార్గెట్లు, కింది తరగతి ఉద్యోగుల సాదక బాధకాలు, కాంట్రాక్టర్లు, అధికారుల మనస్తత్వాలు, అన్యాయాలు అన్నీ కళ్ళకు కట్టినట్లు ఈ కథా సంపుటిలో మనకు కన్పిస్తాయి. సంగిశెట్టి శ్రీనివాస్, స్కైబాబా, వెల్దండ శ్రీధర్ సంపాదకత్వం 2014లో 'తన్లాట' తెలంగాణా కథా సంపుటిలో కాసుల ప్రతాపరెడ్డి 'పూర్తికాని కథ', తాయమ్మ కరుణ 'అమ్మ కథ', మోహన్ రుషి 'థర్డ్ డిగ్రీ' కథలను వెలువరించారు. కోట్ల వనజాత 2014లో 'బహుముఖం' కథ, 'ఇత్తు' కథల సంపుటిని వెలువరించారు.

దేవులపల్లి కృష్ణమూర్తి 2015లో 'యక్షగానం', 'ఆశ', 'ఆమెచూపు', 'వలస పక్షులు', 'మా వదిన' కథలను, 'యక్షగానం', తారుమారు కథా సంపుటాలను వెలువరించారు. స్కైబాబా 2015లో 'అన్‌మోల్ రిష్తే' కథ, ఖబర్ కథ, బేబారె భగ్నప్రేమ కథలు, 'అలాయిబలాయి' బహుజన కథలు తదితర కథా సంపుటాలను వెలువరించారు. భూతం ముత్యాలు దళిత కథా నేపథ్యంలో రాస్తున్నారు. 2015లో 'ఈదురుగాలి', 'సదువు', 'ఆశిర్కం' కథలను, 'బుగాడ', 'బేగరి కథలు', 'దగ్దం' కథా

సంపుటాలను వెలువరించారు. దేవరాజు మహారాజు 2015లో 'మనిషి కతలు' కథా సంపుటాలను వెలువరించారు. వి. మల్లికార్జున్ 2015లో 'కారు చెప్పిన కథ', దృశ్యాదృశ్యం' (2014) కథలు, 'ఇరానీ కేఫ్' కథా సంపుటాన్ని వెలువరించారు. ఎం. రత్నమాల 2015లో 'ఇంద్రవెల్లి' కథను రాసారు. కాటేపల్లి లక్ష్మీనరసింహమూర్తి 2015లో 'బుక్కెడు బువ్వ', 'ఊరవతల ఊడల మర్రి', పిట్ట కథ', 'పాలపిట్ట పాట'....కథలను రాసారు. పి.చిన్నయ్య 2015లో 'అంటారాని బతుకమ్మ' కథను రాసారు. మేరెడ్డి యాదగిరి రెడ్డి రైతు సమస్యల గురించి కథలు రాస్తున్నారు. 2015లో 'మాయ', 'భూమి పుత్రుడు' కథలను 'బొడ్రాయి' కథల సంపుటిని వెలువరించారు. ఎలికట్టె శంకర్‌రావు నల్లగొండ జిల్లా రచయితల కథలను సేకరించి 2011లో నల్లగొండ కథలు మొదటి సంకలనం, 2015లో 'నల్లగొండ కథలు' రెండవ సంకలనాన్ని వెలువరించారు. ఇంకా ఎందరో రచయితలు నల్లగొండ కథను శైలితో సుసంపన్నం చేసారు. చేస్తున్నారు.

## 2.7. నల్లగొండ జిల్లాలో – సాహిత్య పత్రికలు

నల్లగొండలో షబ్నవీసు వేంకట నరసింహారావు 1922 ఆగస్టు 24న 'నీలగిరి' వార పత్రికను ప్రారంభించాడు. రేపాలలో కె.ఎల్.ఎన్. రావు 1942లో వెలువరించిన 'గ్రామ వెలుగు' పత్రిక, హుజూర్‌నగర్‌లో కె.వి.రెడ్డి 1970లో మొదలుపెట్టిన 'నాగార్జున వాణి' పత్రిక, పెరిక రాజారత్నం 1972లో నడిపిన 'తొలి వెలుగు', వార పత్రిక, కొమర్రాజు మురళీధరరావు 1972లో 'ప్రతిధ్వని' పాత్రిక, నల్లగొండ నుంచి వచ్చాయి. మిర్యాలగూడ నుంచి జయిని ఆదినారాయణ గుప్త 1972–80లో 'విశ్వాభ్యుదయ'ను నడిపాడు. అంతేకాకుండా 1975లో 'థాట్స్ ఆఫ్ యూత్' మిర్యాలగూడ నుంచే వచ్చింది. పున్నయల్లప్ప రామన్న పేట నుంచి 1980లో 'భగ్నభేరి' పత్రికను, సూర్యాపేట నుంచి దేవులపల్లి ప్రభాకరరావు 1980లో 'తేజోప్రభ' పక్ష పత్రికను, మిర్యాలగూడా నుంచి సూలూరి శివసుబ్రహ్మణ్యం 1980–90లలో 'సాహితీ మిత్ర' మాస పత్రికలను నడిపాడు.

నల్లగొండ వాసి అయిన బి.ఎన్. శాస్త్రి హైదరాబాదు నుంచి 'మూసీ' మాస పత్రికను, మిర్యాలగూడ నుంచి వసంతరాయ్ 1982లో 'ప్రపంచ శాంతి' పత్రికను, నల్లగొండలో యువ రచయితల సమితి ఆధ్వర్యంలో 1983లో 'దర్పణం' పత్రిక వెలువడింది. మిర్యాలగూడ నుంచి

నాగరాజు 19856లో 'విపంచి' పత్రికను, నల్లగొండ నుంచి పి.వి.బి.రాజు 1985లో 'షాడో' పత్రికను, అదే విధంగా నల్లగొండ నుంచి యూసుఫ్ బాబు 1987లో 'ప్రజాపోరు' దినపత్రికలు ప్రారంభించారు. యస్. జగన్నాథం 'మూఢ విశ్వాసాలు' పత్రికను వై.వీ.ఆర్. ప్రభాకర్ 1987లో 'గొడ్డలి' వార పత్రికను, రమణ విశ్వాం 1991లో 'పద్మశాలి' పత్రికను, పున్న అంజయ్య 1993లో 'సాహితీ మేఖల' మాస పత్రికలను నడిపారు. నల్లగొండ నుంచి 1993లో 'తెలుగు వారం', 1993లో 'వాయిస్ ఆఫ్ నల్లగొండ' అనే పత్రికలు వచ్చాయి. ఇంకా నల్లగొండ నుంచి కర్నాటి రవి 1994లో 'ప్రజామార్గం' దినపత్రికను, ఎస్.ఎం.ఎం.అలీ 1994లో 'ప్రజామార్గం' అనే పత్రికను, భూపతి రవీంద్రనాథ్ 1994లో 'రవితేజ' పత్రికను, శ్రవణ్ కుమార్ 1996–97లో 'వార్తా రేఖా' పత్రికను, రావూస్ 1999లో ఆంధ్రశక్తి అనే పత్రికను, పెందోటు సోము 1999లో 'విశ్వకర్మ తేజస్వినీ' అనే పత్రికను, గోలి విజయ్ కుమార్ 2000లో 'సత్య' దినపత్రికను, యండి రియాజ్ 2000లో 'పౌర స్వేచ్ఛ' అనే పత్రికను ప్రారంభించారు.

ఇంకా చాలామంది సాహితీకారులు, ఔత్సాహికులు సాహిత్య సేవలో భాగంగా వివిధ పత్రికలను నెలకొల్పారు. వారిలో సోమారపు యాదయ్య 2001లో 'ప్రజాభిప్రాయం' దిన పత్రికను, కోటగిరి దైవాదీనమ్ 2001లో 'నీలగిరి శంఖారావమ్' పత్రికను, సబితా 2002లో 'సంతకం' పత్రికను, భూపతి రాజు 2003లో 'భూపతి టైమ్స్' పత్రికను, అచ్చిన అయిలయ్య 2003లో 'గమనం' పత్రికను, చింతల వజ్రం గౌడ్ 2004లో 'గౌడవాణి' పత్రికను, ఎర్రమాదం వెంకన్న 2004లో 'నేత' పత్రికను, దోసపాటి ముత్తయ్య 2004లో 'నా నల్లగొండ' పత్రికను, చలసాని శ్రీనివాసరావు 2005లో 'వార్తాజ్యోతి' పత్రికను సూర్యాపేటలో ప్రారంభించారు.

పాశం యాదగిరి వెలువరించిన 'వర్తమానం' వంటి పెద్ద పత్రికలే కాక, చిన్న పత్రికలైనటువంటి తరంగాలు. హ్యాట్సాఫ్, ఈ నేల, ఈ సీమ, క్షణక్షణం, ప్రజాభిమాని, ప్రజాభిమానం, ప్రజాస్వామ్యం, ఆశయం, న్యాయం కావాలి, జనజ్యోతి, చిరంజీవి మొదలైన పత్రికలు వెలువడ్డాయి.

## 2.8. నల్లగొండ జిల్లాలోని సాహితీ సంస్థలు

నల్లగొండ జిల్లాలోని స్థాపించబడిన సాహితీ సంస్థలు కూడా కథ రచన చైతన్యానికి కారణమయ్యాయి. తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం ఏర్పడ్డ సాహిత్య సంస్థ 'సాహితీ మేఖల' ను 1934లో కవిరత్న అంబడిపూడి వెంకటరత్నం శాస్త్రి ఈ సంస్థను చందూరులో స్థాపించారు. చందూరు ప్రాంతంలో సాహిత్య చైతన్యానికి ఈ సంస్థ ఎంతో కృషి చేసింది. రేపాలలో దవళా శ్రీనివాసరావు 1942లో 'గ్రామ వెలుగు' అనే సాహితీ సంస్థను, నల్లగొండలో 1945లో 'నీలగిరి' సారస్వత సమితిని సూర్యాపేటలో 1948లో 'జనత' కళామండలిని, నల్లగొండలో 1970–80లలో 'యువరచయితల సమితి'ని సూర్యాపేటలో 1980లో 'విజయ భాను కళా సమితిని'ని అదే సూర్యాపేటలో 1980లో 'భానుపూరి కళా మండలి'ని, నవోదయ కళా మండళ్ళ'ను స్థాపించారు. ఇదే విధంగా మిర్యాలగూడలో జి.రామశేషయ్య 1981లో 'స్పందన సాహితీ లహరి'ని, నల్లగొండ నుంచి వి.వి.యన్. శర్మ 1982 'పరిశోధన మండలి'ని దేవరకొండలో వనం చంద్రమౌళి 1981–82లలో 'సాంస్కృతిక సాహితీ సమాఖ్య'లను నెలకొల్పి సాహితీ వాతావరణాన్ని ఏర్పాటు చేశారు.

జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్న రచయిత కాంచనపల్లి వెంకటరామారావుగారి ఆధ్వర్యంలో 1983లో 'జిల్లా రచయితల సంఘం నెలకొల్పబడింది. ఈ సంఘం తరపున కాంచనపల్లి స్మారక జిల్లా రచయితల మహాసభలు రెండురోజులపాటు జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డా. నోముల సత్యనారాయణ, డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఎన్.కె. రామారావుల సంపాదకత్వంలో 'కాంచనపల్లి స్మారక ప్రత్యేక సంచిక' వెలువడింది. పుల్లెంలలో డా. వడ్డేగాని అంజయ్య 1983లో 'సాహితీ చైతన్య కళాస్రవంతి'ని పోచంపల్లిలో యాదగిరి 1985లో 'త్రివేణి సాహితీ సంఘా'న్ని ఆలేరులో ఎం.డి. అబ్దుల్ 1990లో 'రచన కళావేదికను' నల్లగొండలో వున్న అంజయ్య 1990లో 'స్పందన జానపద కళాసమితి'ని నాగార్జున సాగర్‌లో పి.సుదర్శన్ 1990లో 'అలకళల వేదిక'ను ఆలేరులో రామోజు హరగోపాల్ 'సాహితి కళావేదికను' స్థాపించారు. సూర్యాపేటలో వనం సావిత్రీనాథ్ 1992లో 'సాహితీ మిత్రమండలి'ని ఏర్పాటు చేసాడు. నల్లగొండలో గీతా విజ్ఞాన సమితి పక్షాన లలిత కళా పరిషత్తు వారి వార్షికోత్సవాల సందర్భంగా

సాహిత్య సమావేశాలు జరిగి 'సావనీరు'ను విడుదల చేశారు. అలాగే అన్నమాచార్యుల కళాసమితి, త్యాగరాజోత్సవ మండలి ఆధ్వర్యంలో అనేక సాహిత్య సభలూ, పుస్తకావిష్కరణలు జరిగాయి. మిర్యాలగూడలో 'స్పందన సాహితి సమితి' పక్షాన 'ముళ్ళ గులాబి అనే కథా సంకలనాన్ని ప్రచురించింది. నల్లగొండలో ఎం. పురుషోత్తమాచార్యులు ఘంటసాల కల్చరల్ అసోసియేషన్‌ను అలాగే డా. శత్రుఘ్నురెడ్డి జాతీయ సాహిత్య పరిషత్తును ముందుండి నడిపించారు. నల్లగొండ పట్టణంలో డా.నోముల సత్యనారాయణ గౌరవాధ్యక్షులుగా, డా. సంకిరెడ్డి అధ్యక్షులుగా, బోధనం నర్సిరెడ్డి కార్యదర్శిగా, 1992లో 'నీలగిరి సాహితీ' ఏర్పడింది. నల్లగొండ సాహిత్య దృశ్యాన్నే మార్చివేసిన సంస్థ ఇది. ప్రతి సోమవారం గృహ సమావేశం, ప్రతినెలా సాహిత్య సభ రెండు మూడు నెలలకొకసారి సదస్సులను నిర్వహించింది. నల్లగొండలో బోయ జంగయ్య 'సాహితీ మిత్ర' అనే సాహితీ సంస్థను నిలబెట్టాడు. దేవరకొండలో 'సాహితీ సాంస్కృతిక సమాఖ్య' ఆధ్వర్యంలో సాహితీ కార్యక్రమాలతోపాటు అనేక పుస్తక ఆవిష్కరణల కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సంస్థ నిర్వాహకుల్లో డా.బండారు సుజాత శేఖర్, వనం చంద్రమౌళి ముఖ్యులు.

రామన్నపేటలో డా.కూరెళ్ల విఠలాచారి 'సాహితీ స్నేహితులు 'సాహితీ సాంస్కృతిక మిత్ర మండలి' అనే సంస్థల ఆవిర్భావానికి ప్రధాన కారకులు, వీరు చౌటుప్పల్, వలిగొండ, మోత్కూరు, భువనగిరి, ఆలేరులలో అనేక భారతులను స్థాపించి సాహిత్య కార్యక్రమాలను, పుస్తక ఆవిష్కరణలను చేపట్టి ఎందరినో ప్రోత్సహిస్తున్నారు. భువనగిరిలో సాహితీపరులు 'యువరచయితల సంఘాన్ని' 'నవ సాహితీ సమితి'ని 'సాహితి మిత్ర మండలి' సంస్థలను స్థాపించి అక్కడి రచయితలను (కవులను) ప్రోత్సహించి సాహిత్య వాతావరణాన్ని పెంచి పోషించారు.

యాదగిరిగుట్టలో గోవర్ధనం పురుషోత్తమాచార్యులు 'నవోదయ కళానిలయం' యువస్వరాలు, సాహిత్య వేదికలను నెలకొల్పారు. రామన్నపేటలో కొంగరి జగన్నాథం నెలకొల్పిన 'చైతన్య కళా స్రవంతి', చిట్యాలలో స్థాపించిన 'ప్రమోద సాహితీ' సంస్థలు ఇచ్చిన ప్రోత్సాహం ద్వారా సాహిత్య చైతన్యం వెల్లివిరిసింది. కొమర్రాజు లక్ష్మణరావు సాహితీ సంస్థ, మునగాల పరగణా సాహితీ సంస్థ, గ్రామ తెలుగు నాట మండలి, విశ్వశాంతి కళా నిలయం, గుంపు సాహితీ సంస్థ–నల్లగొండ జిల్లాలో స్థాపించారు. స్పృహ సాహితీ సంస్థ–కోదాడలో, రచనా సాహితీ వేదిక, ఆలేరులో స్థాపించారు.

**సంస్థల ఆశయాలు**

1. 'నిన్న' 'నేడు'లో సమీక్షించి, 'రేపు'తో భద్రపర్చడం
2. నవ్య సాహిత్య సంపదను సృష్టించడం
3. యువ, నవ రచయితలను ప్రోత్సహించడం
4. నల్లగొండ జిల్లా మండలి భాషా పరిశోధకులందరిని సంఘటిత పరిచి వ్యాసాలు వెలువరించడం
5. సాహిత్య సదస్సులు, వ్యాస పఠనం మొదలైనవి
6. సాహిత్యోపన్యాసాలు నిర్వహించడం
7. జిల్లాలోని ప్రగతిశీల రచయితలందరినీ ఒక వేదికమీదకి సమీకరించడం
9. ప్రగతిశీల సాహిత్య వాతావరణాన్ని కల్పించడం ఆ భావాలను జిల్లాలోనే కాకుండా రాష్ట్రం మొత్తంమీద నీలగిరి సాహితీ సంస్థకు శాఖలున్నాయి. తెలంగాణలో ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబ్ నగర్ జిల్లాలలో సంస్థకు శాఖలున్నాయి. 55మంది సభ్యులతో స్థాపించిన ఈ సంస్థకు ప్రస్తుతం 160 మంది సభ్యులు ఒక నల్లగొండ/జిల్లాలోనే ఉన్నారు.

ఈ ఆశయాలు సాధించుకోవడం కోసం ప్రతినెల సాహిత్య కార్యక్రమాలను చర్చాగోష్టులను, కవితా గోష్టులను సంస్థ నిర్వహించడం జరుగుతుంది.

**ముగింపు**

వివిధ కాలాల్లోని ప్రజల అనుభవాలను ఆశయాలను, ఆవేశాలను సుఖదుఃఖాలనన్నింటిని రంగరించి ఈ యుగ సాహితీ మూర్తులు అందించిన అమూల్యమైన మేధాసంపత్తి తెలుగు కథా సాహిత్య ప్రక్రియ విభాగంగా పురుడు పోసుకొని నల్లగొండ జిల్లా నేల కడుపులో పెరిగి పందొమ్మిదో శతాబ్ద ప్రారంభంలో పుట్టడం తెలుగు సాహిత్య ప్రపంచానికే ఒక గర్వకారణంగా చెప్పుకోవచ్చు. ఎన్నెన్నో మలుపుల తర్వాత ప్రపంచ సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పదిలపర్చుకొని అవిరామంగా కొనసాగుతూనే ఉంది ఈ నల్లగొండ జిల్లా కథా ప్రస్థానం.

*****

# అధ్యాయం-3

# నల్లగొండ జిల్లా కథలు-కథకుల పరిచయం

నల్గొండ జిల్లాలో కథా రచయితలు చాలామంది ఉన్నా, నా పరిశోధన పరిధిలోకి వచ్చే కథలను రాసిన రచయితల గురించి మాత్రమే ఈ అధ్యాయంలో చర్చించాను.

### 3.1. అంబటి వెంకన్న

పూర్తిపేరు: అంబటి వెంకట నరసింహ.

కలం పేరు: అంబటి వెంకన్న

జననం: 1974 ఏప్రిల్ 12న నల్లగొండ మండలంలోని దోమలపల్లిలో జన్మించారు.

తల్లిదండ్రులు: మణెమ్మ–గురువయ్య

కులం: బెస్త (బి.సి.ఎ)

విద్యార్హతలు: ఎం.ఎ. ఇంగ్లీష్, బి.ఎడ్., ఎం.ఎ. జానపద కళలు

ఉద్యోగం: 'తెలంగాణ సాంస్కృతిక సారధి' రచయిత

వివాహం: ఫిబ్రవరి 08, 1996

భార్య: సరోజ

పిల్లలు: వెన్నెల, వేకువ.

రచనలు: కవితలు: జిల్లెడుపూలు, కదురు, మబ్బులు, గోగుమల్లెలు తదితర కవితా సంపుటాలను వెలువరించారు. వడిసెల–సూటిబెట్టిన కవితం(కవితా సంపుటి)

కథలు: ఆనొస్తే..... చెరువేది (2010) (కథ) తదితర కథలను రాసారు. పూసపదులు తెగిన బతుకు (1999–11–1–కథ)

ప్రచురించిన పుస్తకాలు: కదురు, తుంగు, జిల్లెడుపూలు, మబ్బులు, గోగుమల్లెలు, వడిసెల, పొలిమెర, అంబటి వెంకన్న కవిత్వం.

పాటలు: అనేక తెలంగాణ పాటలు రాసాడు. తుంగు–తెలంగాణ పాటలు–2015, జిల్లెడుపూలు–తెలంగాణ, దళిత బహుజన జానపద పాటలు, గోగుమల్లుపూలు

(పాటల సంకలనం). పాటలను సీడీలుగా కూడా కూర్చారు. అవి: తెలంగాణ బతుకమ్మ పాటలు, తెలంగాణ గౌడ్ కల్లుపాట, జంభూరాజ్జెం, సందమామలు, బెస్తోల్ల పోరుబాట, సర్దార్ సర్వాయి పాపన్న పాటలు, తెలంగాణ దేవులాట, జైజై తెలంగాణ

సినిమా పాటలు: జైబాలాజి, నేను నాన్న అబద్ధం

నటుడిగా: కోహినూర్, పౌరుడు, హుష్‌కాకి, నైవేద్యం నాటికలు, జై బోలో తెలంగాణ సినిమా

అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు: 2006లో భారతీయ దళిత సాహిత్య అకాడమీ ఢిల్లీవారి చేత

శ్రమనుండి పుట్టిన పాటను తెలంగాణా రచయితలు ప్రజాచైతన్య కేతనంగా ఎగురవేస్తున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో కుల వృత్తులు ధ్వంసం కావడం చూసి చలించి, జ్వలించి ఎందరో గేయ రచయితలు అద్భుతమైన పాటలు రాస్తున్నారు. అలాంటి వారిలో అంబటి వెంకన్న ప్రజా చైతన్య గేయాలు రాస్తున్నారు.

### 3.2. అనసూయ

జననం: 1957 సెప్టెంబర్ 7న మహబూబ్ నగర్‌లో జన్మించారు. మెట్టినిల్లు నల్లగొండ జిల్లా, కట్టంగూర్, ముత్యాలమ్మగూడె గ్రామం.

తల్లిదండ్రులు: జిల్లెళ్ళ చెన్నారెడ్డి

భర్త: కట్టా భవంతరెడ్డి

విద్యార్హతలు: ఎం.ఏ. ఎం.ఫిల్., పిజిడిటిఎ, పిజిడిఎఫ్‌డిఆర్.

వృత్తి: ఉపన్యాసకులు, జూనియర్ కళాశాల. ప్రస్తుతం మాతృక పత్రికలో ఎడిటోరియల్ సభ్యులుగా ఉన్నారు.

రచనలు: కథలు: నిశ్శబ్ద చిత్రాలు–2007, తెలంగాణ బతుకు చిత్రాలు–2014, కథల సందుక–2018 మొదలైన కథా సంపుటాలు.

పురస్కారాలు: 'కథావేదిక' తెలంగాణ కళావేదిక–కరీంనగర్. 'రాష్ట్రస్థాయి సామల సదాశివ స్మారక సాహితీ పురస్కారం 2017లో 'తెలంగాణ బతుకు చిత్రాలు'

గ్రంథాన్ని రచించినందుకు ఈ పురస్కారాన్ని ప్రధానం చేసారు. 'సోమేపల్లి పురస్కారం' 2018లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గన్నవరం గ్రామం, ప్రకాశం జిల్లా. రమ్యభారతి సాహిత్య త్రైమాసిక పత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి చిన్న కథల పోటీలలో ఈమె రచించిన 'సమీనా' కథ ప్రోత్సాహక సోమేపల్లి పురస్కారం పొందారు.

నల్లగొండలో రెండు దశాబ్దాలుగా వారు నల్లగొండ సాహితీ, అధ్యయనవేదిక బాద్యులుగా మరియు పరివార్ లోక్ అదాలత్ కుటుంబ సలహా కేంద్ర సభ్యులుగా, మహిళా సంఘ కార్యకర్తగా బాధిత మహిళలకు సహాయ, సహకారాల అందిస్తున్నారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న అనేక రుగ్మతలకు, జాఢ్యాలకు ఎదురొడ్డి నిలబడే శక్తులకు వారు ఆత్మీయ బంధువు, నిబద్ధత కలిగిన అధ్యాపకురాలుగా ఎంతోమంది విద్యార్థులకు స్పూర్తిధాయకంగా నిలిచారు.

నల్లగొండ జిల్లా, విశ్రాంత జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు అత్యంత నిబద్ధతతో మూడున్నర దశాబ్దాలు వివిధ హోదాల్లో విద్యారంగంలో పనిచేసారు. విద్యార్థి దశ నుండి కథలు, కవితలు, వ్యాసాలు రాయడం అలవాటుగా ఉన్న అనేక బహుమతులు అవార్డులు పొందారు. పదవీ విరమణ అనంతరం సాహిత్య సామాజిక రంగాల్లో తనదైన పాత్రను పోషిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు 'కల'ను సాకారం చేసుకోవడానికి 1969, 1972లలో పాలమూరు జిల్లాలో, 2009నుండి 2014 వరకు నల్లగొండ జిల్లాలో మహిళా జేఏసి ఏర్పాటుచేసి, సారధ్యం వహించి, రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారు.

వృత్తితోపాటు ప్రవృత్తిరీత్యా వివిధ ప్రజాయుత కార్యక్రమాల్లో భాగంగా అనేక ప్రజాసంఘాలతో మమేకమై పనిచేసారు. మహిళా సాధికారత దిశగా ప్రగతిశీల మహిళా సంఘంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు.

గత నాలుగు దశాబ్దాలుగా రచనా వ్యాసాంగాన్ని కొనసాగిస్తున్నారు. తమ ముద్రిత కథల్లోని కొన్ని కథలను కథా సంపుటాలుగా ప్రచురించారు. 2007లో 'నిశ్శబ్ద చిత్రాలు' 2014లో 'తెలంగాణ బతుకు చిత్రాలు' 2018లో ప్రస్తుత 'కథల సందుక' కథా సంపుటాలను వెలువరించారు.

వీరు రాసిన కథలు సామాజిక అంశాల యదార్థతలను వెలువరించారు. ఫెమినిజం ఫ్యాషన్ విమెన్ ఊతపదం కాదని, అది ఆచరణాత్మక జీవన విధానమని సామాజిక ఉత్పత్తి ప్రక్రియలో స్త్రీ కీలక పాత్రదారి అనే విషయాలను అనసూయగారి రచనలు స్పష్టం చేస్తున్నాయి.

### 3.3. ఎం. రత్నమాల

జననం: నల్లగొండ జిల్లా, కుక్కడం గ్రామంలో జన్మించారు.

తల్లిదండ్రులు: శకుంతలమ్మ-ముక్కాల సత్యనారాయణరెడ్డి

వృత్తి: సంపాదకురాలు, నూతన పత్రిక

రచనలు: గమనం-ఘర్షణ-గమ్యం, ఇమ్మర్ష, తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాలు, తెలంగాణ రాష్ట్ర ఐక్య సంఘటనలు, పాఠకులతో 'నూతన' సంభాషణ, ధాక్షిణ్యవాదం నుంచి దండకారణ్యందాకా భారత మహిళా ఉద్యమం, మే డేకి ముందు -వెనక, ఇంద్రవెల్లి (కథ) మొదలైన గ్రంథాలు.

### 3.4. ఎలికట్టె శంకర్ రావు

జననం: 1968 ఏప్రిల్ 13న నల్లగొండ జిల్లా, నిడమనూరు మండలం ఎర్రగూడేం గ్రామంలో జన్మించారు.

విద్యార్హతలు: కళాశాల పట్టా

వృత్తి: ప్రైవేటు ఉద్యోగం

రచనలు: కథలు: ఉనికిపాట్లు-2007, జారుడుబండ-2005, దుబ్బచెలక-2010, నల్లగొండ కథలు-1&2-2015, పరిగెచేను-2015, తలగోరుకుండా-2005 మొదలైనవి కథా సంపుటాలు. కాంచనపల్లి చిన వెంకటరామారావు కథలు-2012. తెలంగాణ రాష్ట్ర చరిత్ర ఉద్యమాలు-2014, తెలంగాణ

సాయుధ పోరాట చరిత్ర–2015, యాది–దీర్ఘ కవిత–2004, చాకలి ఐలమ్మ–2014, భీమిరెడ్డి నరసింహారెడ్డి అనుభవాలు–2012, దేవుని రాజ్యం–2012, జల సాధన సమరం–2013, రావి నారాయణరెడ్డి 'తెలంగాణ నగ్న స్వరూపాలు'–2015, 'ప్రతిజ్ఞ' పదశిల్పి పైడిమర్రి–2011, ప్రతిజ్ఞ యాభైఏండ్ల వివక్ష–2013

తెలంగాణ సాహిత్య రంగంలో ఎలికట్టె శంకర్రావుకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. కవిత్వం, కథ, నవల, చరిత్ర, పరిశోధన వంటి సాహిత్య విభాగాల్లో ఆయన కృషి చేసాడు. ఇప్పటివరకు 20 పుస్తకాలను ప్రచురించాడు.

'భారతదేశం నా మాతృభూమి....' ప్రతిజ్ఞను రాసిన రచయిత పైడిమర్రి వెంకటసుబ్బారావును వెలుగులోకి తెచ్చాడు. వందేండ్ల నల్లగొండ కథలను సేకరించి 'నల్లగొండ కథలు' పేరుతో రెండు సంకలనాలుగా వెలువరించాడు.

నల్లగొండకు చెందిన తొలితరం కథకుడు కాంచనపల్లి చినవెంకటరామారావు కథలు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు 'భీమిరెడ్డి నరసింహారెడ్డి అనుభవాలు', 'నల్లగొండ జిల్లా 'జలసాధన సమరం', చాకలి ఐలమ్మ జీవితం లాంటి గ్రంథాలు అందించాడు.

1948 నుంచి 2014 వరకు తెలంగాణ చరిత్రను 'తెలంగాణ రాష్ట్రం చరిత్ర ఉద్యమాలు' పేరుతో అందించాడు. ఈ కాలపు చరిత్రను మొదట అందించిన ఘనత ఆయనదే.

వక్రీకరణకు గురైన సాయుధ పోరాట చరిత్ర వాస్తవాలను వెలికితీసి 'తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర' పేరుతో అందించాడు. కమ్యూనిస్టుల నిర్లక్ష్యానికిగురైన చాకలి ఐలమ్మ పోరాట చరిత్రను కూడా 'చాకలి ఐలమ్మ' పేరుతో అందించాడు.

శంకర్ రావు ప్రతిపుస్తకం కొత్తకోణాన్ని తడిమింది. కథ అయినా, చరిత్ర అయినా తెలంగాణ భాషలోనే రాయడం ఆయన ప్రత్యేకత.

### 3.5. ఏనుగు నర్సింహారెడ్డి

జననం: 1968 ఏప్రిల్ 6న నల్లగొండ జిల్లా భువనగిరి యాదాద్రి మండలం కల్లోనికుంట అనబడే మూసీతీర్థం గ్రామంలో జన్మించారు. చిట్యాలలో పెరిగారు.

తల్లిదండ్రులు: ఏనుగు లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి

విద్యార్హతలు: ఎం.ఏ. తెలుగు, ఎం.ఫిల్ తెలుగు, పిహెచ్.డి తెలుగు

భార్య: అరుణ

పిల్లలు: తేజస్విని, గీతాంజలి

వృత్తి: డిప్యూటి కలెక్టర్

రచనలు: కథలు: సమాంతర స్వప్నం-1995, నేను-2002, బండ్ల బాట-2014, ఇల్లు-2019. మట్టిపాట-2008 గేయాత్మక పద్యం, హైదరాబాద్ విషాదం-2016(మీర్ లాయక్ అలీ –చారిత్రక రచన-అనువాదం)

మూలమలుపు-2018(కవిత్వం), అంతరంగం-2018(ఆధునిక కవిత్వ విమర్శ), సమాహార సాహిత్య వ్యాసాలు, కొత్తపలక-వచన కవితా సంపుటి).

ములాఖత్-కవితా సంకలనం, గునుగుపూల పొద్దు, దుగులు వెన్నెల, అదే కల మొదలైన కవితా సంకలనాలకు సంపాదకత్వం వహించారు.

నవలలు: ఊరు మారింది, సినీ యాక్టర్ని, పగిలిన గుండెలు.

పురస్కారాలు: తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కారం-2014, బండ్ల సుబ్రహ్మణ్యం స్మారక బహుమతి-1995, రంజని-కుందుర్తి ఉత్తమ కవితా పురస్కారం-2016, నెలవంక నెమలీకవారి కలహంస పురస్కారం-2013, వర్కింగ్ జర్నలిస్టు కవిత్వ బహిమతి, నవ తెలంగాణ వట్టికోట ఆళ్వారుస్వామి ఉత్తమ కవితా పురస్కారం-2016, తెలంగాణ రాష్ట్ర స్థాయి తేజ సాహితీ పురస్కారం-2017, కళాంజలి విజ్ఞానపీఠం వారి గౌరవ పురస్కారం, జగిత్యాల బోయినపల్లి వెంకటరామారావు సాహిత్య పురస్కారం-2016, అక్షర కళాభారతి వారి అక్షర సాహితీ పురస్కారం-2018, రాజారాం

ఫౌండేషన్ రాష్ట్ర స్థాయి సాహితీ పురస్కారం–2018, మూల మలుపు కవితా సంపుటికి పాలమూరు సాహితీ పురస్కారం, కొత్తపలక కవితా సంపుటికి గేయ కవితకు ప్రత్యేక పురస్కారం–2014.

తెలుగు సాహితీ లోకానికి డా. ఏనుగు నరసింహారెడ్డి కవిగా చిరపరిచితుడు. పరిపాలన రంగంలో ఉన్నా, అవసరం కోసం కాక, ఇష్టంతో సాహిత్య వ్యాసాలు రాస్తారు. కవిత్వమైనా, విమర్శ అయినా, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో పనిచేసిన ఈయన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్. ప్రస్తుతం తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 2017 డిసెంబర్ 15 నుండి 19 వరకు హైదరాబాదులో జరిగిన తెలుగు మహాసభలకు నిర్వాహకుల్లో ఒకరు.

సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట, కరీంనగర్, నిజామాబాద్, హైద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని పట్టణాల్లో, పల్లెల్లో పనిచేసారు. సామాన్యుల్ని, అసామాన్యుల్ని, ప్రజల్ని, పరిపాలననీ, రాజకీయాల్ని బ్లాక్ అండ్ వైట్‌లో పరిశీలించారు. తెలియనిది రాయరు. అనుభవించనిది, అనుభూతి చెందనిది రాయరు. అది ఆయన నైజం. ఆ స్పష్టత ఆయన రచనల్లో కనిపిస్తోంది.

డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నా సాహిత్యమే ఆయన శ్వాస. నిరుద్యోగం, తెలంగాణ గ్రామీణ జీవన దైన్యం ఆయన కవితా వస్తువు కావడానికి కారణం ఆయన నేపథ్యమే. సాధారణమైన తెలంగాణ రైతు బిడ్డ నేపథ్యమే ఈయనది. కాలానుగుణంగా అది వామపక్ష భావజాలంగా కనిపించవచ్చు. తెలంగాణవాదంగా రూపుదాల్చవచ్చు. ప్రజా పక్షపాతం ఆయన సాహిత్య అంశంగా కనిపిస్తే అందుకు కారణం ఆయన నడిచొచ్చిన బాటలే. 1986 నుండి 1995 వరకు వామపక్ష విద్యార్థి యువజన ఉద్యమాలతో పనిచేయ్యడానికి ఆయన సాహిత్యానికి అదనపు అవగాహన కలిగించిందని భావిస్తుంటారు.

### 3.6. కంచర్ల సత్యపాల్ రెడ్డి

జననం: నల్లగొండ జిల్లా రాజాపేట మండలంలోని బొందుగులలో జన్మించారు.

రచనలు: ఓ సిన్నోని కథ (2011)

## 3.7. కాటేపల్లి లక్ష్మీనరసింహమూర్తి

జననం: 1953లో నల్లగొండ జిల్లా, త్రిపురారం మండలం, మర్రిగూడెం గ్రామంలో జన్మించారు.

తల్లిదండ్రులు: కీ.శే. సరస్వతమ్మ, కీ.శే. రామయ్య

భార్య, పిల్లలు: శ్రీమతి సామ్రాజ్యలక్ష్మి ; కుమారుడు, కోడలు–రవికుమార్, మల్లికా శ్రీదేవి

విద్యార్హతలు: ఎం.ఏ. ఇంగ్లీషు, ఎం.ఈ.డి., పిజిసిటిఇ.

వృత్తి: స్కూల్ అసిస్టెంట్‌గా (ఆంగ్లోపాధ్యాయుడు) 2009 రిటైరయ్యారు.

అభిరులు: పుస్తక పఠనం, కర్ణాటక శాస్త్రీయ సంగీతం, వయోలిన్ వాదన, చిత్రలేఖనం, పద్య రచన, కథా రచన.

రచనలు: 1. సన్యాసమే మేలురా! శతకం (శ్రీ సూలూరి శివ సుబ్రహ్మణ్యం, శ్రీమాన్ సంపన్ముదుంబై–కృష్ణమాచార్యుల గార్లతో తలా ఒక పాదంతో వ్రాసిన శతకం, 1975లో, 2. బ్రహ్మీ ప్రవరం(వంశ వృక్షాలు) 2012, 3. పద్యానంద లహరి (ఛందస్సు వివరాలతో సమస్యాపూరణల పోటీలో ఒక బహుమతి పొందిన సామాజిక ప్రబంధం–2020లో, 4. పద్యంవారు వారంవారం నిర్వహిస్తున్న 'పద్యవర్షం' శీర్షికకు 37 వారాల నుండి పంపబడుతున్న 'పద్యవర్షం' పద్య కవితలు. అంతేగాక వివిధ పత్రికలకు పద్య రచనలు, తెలుగు వెలుగులో తరచుగా 'మాటకట్టు, కూర్పు, నమస్తే తెలంగాణ వారి బతుకమ్మలో ప్రచురించబడిన కథ 'పచ్చీసు'. అముద్రిత గ్రంథాలు–కొన్ని కథలు, ఈశ్వర శతకం. సమస్యాపూరణలు కూడా చేస్తారు. చిన్నతనంలోనే వివిధ సాహితీ కార్యక్రమాలలో పాల్గొనేవారు.

అవార్డు: 2013లో జాషువా జయంతి పోటీలలో సన్మానం, 2009లో 'ప్రజ పద్యం' వారిచేత సన్మానం.

### 3.8. కాసుల ప్రతాపరెడ్డి

జననం: 1962 జూలై 10న నల్లగొండ జిల్లా, రాజాపేట మండలం, బొందుగుల గ్రామం.

తల్లిదండ్రులు: రాంరెడ్డి, సత్తెమ్మ

విద్యార్హతలు: ఎం.ఏ, ఎం.ఫిల్ ఉస్మానియా విశ్వవిద్యాలయం

వృత్తి: పాత్రికేయుడు, వన్ ఇండియా డాట్ కామ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ప్రవృత్తి: రచయిత, విమర్శకుడు.

రచనలు: కథలు: ఎల్లమ్మ ఇతర కథలు–2006, తెలంగాణ కథ–దేవులాట(సంపా.), శిలువకు తొడిగిన మొగ్గ–1999 మొదలైనవి కథా సంకలనాలు. అంతా ఉత్తదే–1995, అంతిమం–2004, ఆక్రోశం–1997, ఆఫ్టర్ ట్వంటీ–2001, ఇక్కడ ముద్రలు వేయబడును–1999, ఊపిచ్చుకలు–2007, ఎగిరిపోయిన తోట–2007, ఎచ్చులు–2004, ఒకరోజు–1995, కనకదాసు–1990, కొన్ని ప్రేమలు–2003, చేదుమందు–1996, దగ్ధం–2001, ద్వంద్వం–1995, నడుంనొప్పి–1993, నాలుగు కలయికల ఒకటే మనస్సు–1997, పగ–1998, పరాన్నజీవి–1991, పెనుగులాట–2001, ప్రాంతీయం–1998, బొద్దింక–1990, మానవత మాసిన చోట–1991, యాక్సిడెంట్–2001, రెండువైపులా పదును–2007, లవ్2020–2001, వెంటాడిన అవమానం–1997, వెన్నెల మెట్లు–2001, శిథిలం–2004, శిలువకు తొడిగిన మొగ్గ–1989, సిక్ నెస్–1999, స్టిల్ బర్త్–1995, హత్య–2001, ఎల్లమ్మ, పూర్తికాని కథ, బతుకు చిత్రం, అంతిమం, పారేసిన కథ మొదలైన కథలు.

కవితలు: 'గుక్క' దీర్ఘ కవిత(సంకలనం), ఇతర కథలు.

నవల: వ్యాపార ధోరణి

వ్యాసాలు: తెలంగాణ తోవలు, తెలంగాణ కథ–దేవులాట, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు–రాజకీయ, సాంస్కృతికోద్యమాలు, తెలంగాణ సాహిత్యోద్యమాలు,

మే31 మొదలైన వ్యాస సంకలనాలకు సంపాదకత్వం వహించాడు. ఇరుసు, భౌగోళిక సందర్భం, తెలంగాణ సందర్భాలు మొదలైన వ్యాసాలు.

మోనో(గ్రాఫ్: కొమురం భీమ్ (మోనో(గ్రాఫ్)

అనువాదాలు: జీవితమే ఉద్యమమై (శంకర్ గుహ నియోగి జీవితంపై అనువాదం).

పురస్కారాలు: ఎల్లమ్మ ఇతర కథల పుస్తకానికి సురమౌళి అవార్డు, 2013లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి అబ్బూరి రామకృష్ణారావు-అబ్బూరి వరదరాజేశ్వరరావు కీర్తి పురస్కారం.

బొందుగుల పరిసరాలలో ఉదయం పత్రిక రిపోర్ట్‌గా పనిచేస్తున్న ప్రతాపరెడ్డిగారు రచనలో అభినివేశం కలవారు. ముద్రితమైన వీరి నవల బాగా వ్యాప్తి చెందింది. ఈనాడు వెలువడుతున్న నవలల తీరుతెన్నుల గురించి, వాటి వ్యాపార పద్ధతిని గురించి వివరించిన ఈ నవల, నవలాకర్తలు తప్పక చదువదగింది. వివిధ తెలుగు పత్రికల్లో వీరి కథలు, కవితలు, వ్యాసాలు వచ్చాయి. ఇవన్నీ రెడ్డిగారి ఆలోచనా దృక్పథాన్ని తెలియజేస్తాయి.

కాసుల ప్రతాపరెడ్డి సుప్రబాతం అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేస్తున్న కాలంతో పలువురు కొత్త రచయితలను ఆయన వెలుగులోకి తెచ్చారు. ఆయన రాసిన వెంటాడిన అవమానం కథ హైదరాబాదు విశ్వవిద్యాలయంలోనూ, కాకతీయ విశ్వవిద్యాలయంలోనూ ఎం.ఏ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఉంది.

శిలువకు తొడిగిన మొగ్గ, ఎల్లమ్మ కథా సంకలనాలు, కొలుపు సాహిత్య వ్యాసాలు, భౌగోళిక సందర్భం తెలంగాణ వ్యాసాలు, ఇరుసు తెలంగాణ సాహిత్య వ్యాసాలు, గుక్క కవితా సంకలనం, తెలంగాణ సందర్భాలు (తెలంగాణ రాజకీయ వ్యాసాలు), కొమురం భీమ్, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు-రాజకీయ, సాంస్కృతికోద్యమాలు, తెలంగాణ సాహిత్యోద్యమాలు వెలువరించారు. తెలంగాణ తోవలు, తెలంగాణ కథ దేవులాట, కందుకూరి రమేశ్ బాబు సామాన్యశాస్త్రం కింద వేసిన

పలు పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. జీవితమే ఉద్యమమై శంకర్ గుహ నియోగి జీవితం, ఉద్యమం, పడిలేచిన తెలంగాణ అనువాదం మొదలైన వాటిని అనువాదం చేసారు.

## 3.9. కె. కవిత

జననం: 1975 జూలై 11న నల్లగొండ పట్టణంలో జన్మించారు

ఉద్యోగం: హైదరాబాదులో టీచర్‌గా పనిచేస్తున్నారు

రచనలు: మొదటి కథ–నా పుష్‌పుల్ రైలు ప్రయాణం (బతుకమ్మలో అచ్చయింది), సంగీత(2013) కథను రాసారు.

తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో పలు కథలు రాశారు. 'సంగీత' పేరుతో రాసిన కథ ప్రసిద్ధమైంది.

## 3.10. కొలనుపాక మురళీధర రావు

జననం: 1940 డిసెంబర్ 19న నల్లగొండ జిల్లాలోని నిడమనూరు మండలం కన్నెగల్లు గ్రామంలో జన్మించారు. ప్రస్తుతం నల్లగొండలో ఉంటున్నారు.

తల్లిదండ్రులు: వేణుగోపాలరావు, రాధాదేవి

విద్యార్హతలు: బి.ఎస్.సి, ఎల్.ఎల్.బి.

వృత్తి: న్యాయవాది

రచనలు: కథలు: ఇరుసు ఇరిగిన బండి–2003, దున్నపోతు ఈనింది–2006, శునక ప్రహసనం–2008, గన్‌మెన్–2004, సర్కారు తుమ్మ–2004, పట్నమా నీకో దండం–2006, పండుగ–2002, కూపస్థ మండూకం–2006, మమేకం–2008, తిరుగబడ్డా పొరకలు–2007, రాళ్ళ బతుకులు–2007, మారుతున్న తరం, థాంక్యూ చికున్ గున్యా–2006, మూసీ కినారే, కంచికి చేరని కథ, తెగిన బంగారం గొలుసు–2008, బంధుప్రీతి–1971, చెక్కు ఇచ్చువాడు, చిలుకల

దండ-2010, అష్టాదశ కథానికలు(2009) కథా సంపుటి పుస్తకాన్ని వెలువరించారు.

కవితలు: అంతర రవళి (కవితా సంపుటం) అచ్చైంది.

అవార్డులు: శ్రీమతి మాదిరెడ్డి సులోచన అవార్డు, కుందుర్తి స్మారక అవార్డు, ఆఫ్రా అవార్డులు లభించడం ఈ జిల్లాకే సంతోష కారణంగా సాహితీ ప్రియులు భావిస్తున్నారు.

వృత్తి వేరైనా ప్రవృత్తి మాత్రం సాహితీ పరంగా సాగిస్తున్న స్థానిక సహృదయులలో గణనీయమైన మురళీధరరావుగారు నల్లగొండలో యువరచయితల సమితిని స్థాపించి దానికి అధ్యక్షులుగాను, సాహితీ సమాఖ్య కార్యదర్శిగాను ఉంటూ ఎందరికో ప్రోత్సాహాన్ని కల్గించి వారిలో సాహితీ జిజ్ఞాసను అభివృద్ధి పథంలోకి పయనింపజేస్తూ, ఆయా సంస్థల అభివృద్ధికి పాటుబడుతున్నారు. స్థానికంగా జరిగే వివిధ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని, వాటిని నిర్వహిస్తూ తనదైన ఉపకార భావాన్ని వ్యక్తీకరించే కొలనుపాకవారు చురుకైన రచయిత. అభ్యుదయ కవి. స్వయంగా న్యాయవాది కావటం వలన వారి లేఖిని నుండి వెళ్ళే కవిత కూడా సంఘంలోని న్యాయాన్యాయాలను ప్రతిబింబింప చేస్తుంది. వివిధ సాహితీ సంస్థల ద్వారా సన్మానింపబడిన వారి సాహితీ కృషికి నిదర్శనంగా అవార్డులు ఇచ్చారు.

మంచివక్త, రచయిత, కవితా హృదయంగల మురళీధరరావుగారి రచనలు త్వరలో గ్రంథ రూపంగా వెలువడి సాహితీ లోకానికి ఆనందాన్ని కలిగించనున్నారు.

### 3.11. కోటమర్తి రాధాహిమబిందు

జననం: 1962 మే 19న నల్లగొండ జిల్లా కోదాడలో జన్మించారు. ప్రస్తుతం ఖమ్మంలో ఉంటున్నారు.

తల్లిదండ్రులు: కొండపల్లి తారాబాయి-రాఘవరావు

వాడుక నామం: హిమబిందు

రచనలు: కథలు: అదిరే అదిరే గుండె–2007, అవసరం–2006, అహల్య–2008, ఆటాడుకుందాంరా–2007, ఆత్మ బంధువులు–2007, ఆనందమే జీవిత మకరంధం–2004, ఆరిళ్ళలోగిలి–2007, ఆవూరు–1971, ఇది తొలిరాత్రి–1997, ఇదో కల–1983, ఉత్తర కుమారి ఓటమి–1956, ఉషోదయం–1986, ఋణానుబంధం–1989, ఎరలాగిన గాలం–1988, ఒక్కసారి ఊరు బోయిరా–2006, కడుపు తీపి–1981, మూడు కోణాలు–2001, వనమాలి–2010, రేపటికోసం–1995, శలవా శలవ్–1990, కాగితం దేవుళ్ళు–2007 మొదలైన కథలు రాసారు.

ఈమె ఇప్పటివరకు 150కి పైగా కథలు, నాలుగు నవలలు రాసారు. రేడియో మాధ్యమం ద్వారా కూడా అనేక కథలు, కథానికలు, నాటకాలు, నాటికలు రచించారు. ఇవన్నీ ఆకాశవాణి హైదరాబాదు, విజయవాడ, కొత్తగూడెం కేంద్రాల నుండి ప్రసారం అయ్యాయి. మహిళల కోసం ‘ఆడవాళ్ళు మీకు జోహార్లు అనే 16 వారాల ధారావాయిక నాటికను రాసారు.

### 3.12. కోట్ల వనజాత

జననం: 1967 ఏప్రిల్ 10న నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని తుమ్మడం గ్రామంలో జన్మించారు.

తల్లిదండ్రులు: శ్రీ కీసర రంగారెడ్డిగారు, తల్లి శ్రీమతి కీసర లక్ష్మమ్మగారు

ఉద్యోగం: గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

రచనలు: కథలు: సముద్రం, చివరి గుడిసెలో గాజుకళ్ళు, తార్నామ్ కాయిచోరి, రాజన్న, బహుముఖం, ఇత్తు, నల్లతేళ్ళు, బతుకు సంత, మార్కెట్, ప్రతి సగానికో దుఃఖం, ముచ్చట వెట్టాలె, స్వర్ణకోసం. ఇత్తు (2004) కథా సంపుటి వెలువరించారు.

కవిలాగే కోట్ల వనజాతకు కథ రాయనిది గుండె బరువు దిగదు. కల్మషం లేకుండా అచ్చమైన మనిషితనంలో తప్ప మరోరకంగా ఆలోచించలేని సహజ కథా రచయిత్రి కోట్ల వనజాత. ఈ సంపుటిలో ఏ కథను ముట్టుకున్నా, మనిషి తగలకపోడు. ఏ సంఘటనను తడిమినా మన

జీవితానుభవంలోకి వచ్చిందే మనల్ని ఎప్పుడో ఒకప్పుడు నిలదీసిందే అని అనిపించక మానదు. సహజత్వం కోట్ల వనజాత రచనాశైలిలోని నిరలంకారం. మన మధ్య ఇంకా ఎంతోమంది వ్యదార్థ జీవుల, యదార్థ రోదనలు ఎంత అమానవీయంగా వినిపిస్తున్నాయో ఈ కథలు కళ్ళకు కడుతున్నాయి. ఈ వ్యధలు కన్నీళ్ళకు దోసిలి పడుతున్నాయి. రచయిత్రిగా కోట్ల వనజాతకు ఈ సంపుటి తొలి అడుగు.

### 3.13. గాదె వెంకటేశ్

జననం: నల్లగొండ జిల్లా సిరిపురం గ్రామంలో జన్మించారు.

విద్యార్హతలు: ఇంజనీరింగ్(బి.టెక్), ఎంటెక్, ఎంబిఎ, పి.హెచ్.డీ–జె ఎన్ టి యూ హెచ్‌లో

వృత్తి: ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్

రచనలు: బత్తెం–2013, మొదటి కథ, టోల్ గేట్–2014, పొలి– కవితా సంపుటి పాటలు, వ్యాసాలు, చరిత్రలు కూడా రాసారు.

ఇతడు ఇప్పటివరకూ ఎనిమిది కథలు రాసాడు. అంబేద్కర్ ఆలోచనా విధానంతో నడుస్తున్న ఈయన 'పొలి కవితా సంపుటి వెలువరించాడు. ఈ పుస్తకాన్ని నెక్లెస్ రోడ్డులో యుద్ధ వాతావరణంలో సంగిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించబడింది. పల్లె భాషను తన కథల్లో నిక్షిప్తం చేస్తున్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తనవంతుగా పాల్గొన్నారు. 'సింగిడి' వ్యవస్థాపకుల్లో ఒకరిగా ఉండి ఎన్నో కార్యక్రమాల్లో భాగమయ్యారు. 'సింగిడి' తెలంగాణ అమరవీరుల స్థూపంవద్ద నిర్వహించిన సకల జనుల సమ్మెకు మద్ధతుగా కవి సమ్మేళనంలో భాగమయ్యారు. 'జాగో... జగావో', 'క్విట్ తెలంగాణ', 'దిమ్మిస' లాంటి సంకలనాలు తేవడంలో బాధ్యత పంచుకున్నారు.

### 3.14. గుడిపాటి వెంకటేశ్వర్లు

జననం: 1964 జనవరి న నల్లగొండ జిల్లా సూర్యాపేటలో జన్మించారు.

వాడుక నామం: జి.వెంకటేశ్వర్లు/శశాంక/ప్రణవ/అభిషేక్/కిరణ్

ఉద్యోగం: జర్నలిస్టు, హైదరాబాదు

రచనలు: కథలు: గది-కథ (2010)-మూలూయి వన్ పక్ష పత్రిక1631 మార్చి 2011సంచికలో ప్రచురితం, అంతులేని సా(రో)రా కథ -1994, ఆక్సిడెంటు-1985, ప్రేమలేఖ-1941, లాంగ్ లీవ్-1989.

కవితలు: కిటికీ- కవితా సంపుటం, గ్లోబలైజేషన్- వ్యాస సంకలనం వెలువరించారు. పాలపిట్ట ప్రచురణ సంస్థ ద్వారా పుస్తకాలను అచ్చువేస్తున్నారు.

ఉన్నతమైన ఆశయాలతో, ప్రమాణాలతో పాలపిట్ట మాసపత్రిక ప్రారంభించారు. ఈ పత్రిక తొలి సంచిక 2010, ఫిబ్రవరి నెలలో వెలువడింది. పాలపిట్ట బుక్స్ తరపున నడుపబడుతున్న ఈ పత్రికకు గుడిపాటిగారే సంపాదకులు, ప్రచురణ కర్త. ప్రచురణ కేంద్రం హైదరాబాదులో ఉంది. ఈ సాహిత్య పత్రికలో కథ, కవిత, నవల, విమర్శ వంటి ప్రక్రియలలో రచనలు వెలువడుతున్నాయి. తెలుగు రచనలేకాక అనువాద రచనలకూ ప్రాధాన్యత లభిస్తోంది. ప్రతి సంచిక ఒక ప్రముఖుని గురించిన విశేషాలతో ఒక ప్రత్యేక సంచికగా వెలువడుతుంది.

### 3.15. చందు తులసి

జననం: 1982 ఎప్రిల్, 8న నల్లగొండ జిల్లా, చివ్వెంల మండలం, బండమీది చందుపట్ల గ్రామంలో జన్మించారు.

వృత్తి: ఉపాధ్యాయుడు, హైదరాబాదులో

పూర్తిపేరు: చంద్రశేఖర్

కలంపేరు: చందు తులసి

రచనలు: కథలు: ఊడల మర్రి-2015, బుక్కెడు బువ్వ-2015, పాలపిట్టల పాట, పిట్ట కథ-2015, రంగు రెక్కల వర్ణ పిశాచం-2016, తల్లిగారిల్లు-2017, గడి-2019, ఫార్ములా ఆఫ్ ది టైం మెషిన్-2018.

ఈయన రాసే రచనలకు భార్య తులసి సహకారం ఉంటుంది. కాబట్టి చందుతులసి పేరుతో కథలు రాస్తుంటారు. ఏబిఎన్-ఆంధ్రజ్యోతిలో ప్రసారమైన 'అంటరాని బతుకమ్మ' (బెస్ట్ ఇన్వెస్టిగేటివ్ స్టోరీ), బడిలో మెట్టెల సవ్వడి (బెస్ట్ ఫీచర్) చందు తులసి లాడ్లీ అవార్డును అందుకున్నారు.

### 3.16. తాయమ్మ కరుణ (పద్మ)

| | |
|---|---|
| జననం: | 1970 ఏప్రిల్ 4న నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో జన్మించారు. |
| తల్లిదండ్రులు: | మిర్యాల తాయమ్మ,పరమేశం |
| అసలు పేరు: | మిర్యాల పద్మ |
| కలంపేరు: | తాయమ్మ కరుణ |
| భర్త: | రవి |
| విద్యార్హతలు: | బి.ఎస్సీ, పిజి డిప్లొమా ఇన్ జర్నలిజం |
| వృత్తి: | విప్లవోద్యమ కార్యకర్త. ఇప్పుడు జర్నలిస్టుగా సాక్షి దిన పత్రికలో పనిచేస్తున్నారు. |
| రచనలు: | కథలు: కవులమ్మ ఆడిదేనా-2004, తాయమ్మ కథలు (కథల సంపుటి)-2009, అమ్మ కథ-2014, జీవితం కథల సంపుటి-2018. ఇప్పటివరకు 30 పైగా కథలు రాసారు. |

ఈమె ఒకప్పుడు తుపాకీ పట్టిన ఆ చేతులు తర్వాత కలం పట్టాయి. ఆయుధం ఏదైనా గళం మాత్రం ప్రజానికమే. అప్పుడు దండకారణ్యం, ఇప్పుడు జనారణ్యం...సందర్భం ఏదైనా సవాళ్ళు ఎదుర్కొంటూ సాగే ప్రయాణమే. అప్పుడు సమాజానికి దూరంగా ఉద్యమ జీవితం...ఇప్పుడు నగరం నడిబొడ్డున ఒంటరి పోరాటం. ఆమెనే తాయమ్మ కరుణ.

14 ఏళ్ళపాటు దళ సభ్యురాలిగా ఉద్యమంకోసం పనిచేసారు. ఆ తర్వాత గత దశాబ్ద కాలం నుంచి పాత్రికేయురాలిగా కొనసాగుతున్నారు. అయితే జర్నలిస్ట్ కావటానికి ముందే రచయిత్రిగా ఉన్నారు. అసలు పేరు మిర్యాల పద్మ అయినా, సంచలనం రేపిన తొలి కథతోనే 'తాయమ్మ కరుణ'గా గుర్తింపు పొందారు. ఇప్పటివరకు 30కి పైగా కథలు రాసారు.

### 3.17. తెలిదేవర భానుమూర్తి

| | |
|---|---|
| జననం: | 1953 నవంబర్ 16న నల్లగొండ జిల్లా భువనగిరిలో జన్మించారు. |

తల్లిదండ్రులు: తెలిదేవర వెంకట్రావు, సీతమ్మ

విద్యార్హతలు: డిగ్రీ, పి.జి, ఉస్మానియా విశ్వవిద్యాలయం

ఉద్యోగం: పత్రికారంగంలో పనిచేస్తున్నారు.

రచనలు: కథలు: ఆక్సిజన్ బార్-2004 (కథా సంపుటం), నెమలీక పేరుతో 2009 ఫిబ్రవరి కథా సంపుటాలు వెలువరించారు. చల్నేదో బాల్ కిషన్-1992(ఫీచర్-కథా సంపుటి). ఊరోళ్ళు-కవితా సంకలనం. పలుకుబడి-1994 (ఫీచర్), గిల్లిదండ(హాస్య రచనలు), గులేరు-2005. ఎన్‌కౌంటర్, ఆక్సిజన్, గుంత, కబ్జా, తిన్నది అర్గక, హుక్ హుక్ అరే, అంతరంగాలు, అడిగి చావండి, నటి, మమ్ములను గిట్ల బతకనీయండి, ఎంత బాగుండు, గిట్లాయితే ఎట్లుండెనో ఇవన్నీ ఆక్సిజన్ బార్ కథా సంపుటిలోనివి), ఆడ పాలపిట్టలున్నాయా?-2010, ఎంత పనాయె-2004, ఎక్కడున్నాడో-1999, చాటింపు-1996, టామి-2002, డ్రామ-2004, తలాక్-2004, తెల్లకాగితం-2002, దీవెన-2002, దొంగెవడురో-1994, నిండమునిగిండ్రు, పోలీస్ బాయ్-2006, బద్నాం-2004, బాగోతం-2003, మంలార్తి-2004, సేవ్ రాక్స్-2004 మొదలైనవి

తెలిదేవర భానుమూర్తి కవి, కథకుడు, కాలమిస్ట్. తెలిదేవరకు సొంత శైలి, సొంత నడక, సంతకం ఉన్నాయి. ఇవి విశిష్ట లక్షణాలు.

1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో స్నేహితులతో కలిసి ఈయన నల్లగొండ జైల్లో ఉన్నాడు. అప్పటి నుంచే ఈయన తెలంగాణ బాసలో కవితలు రాయడం మొదలుపెట్టాడు. ఆ కవితలను 'ఊరోలు' అనే పేరుతో 'అరసం' ఓ సంకలనంగా తెచ్చింది. 'ఉదయం' దిన పత్రికలో తెలంగాణ బాసలో రాజకీయ వ్యంగ్య రచనలకు శ్రీకారం చుట్టాడు. ఈయన ఎన్టీఆర్ ప్రభుత్వంపై, చంద్రబాబు ప్రభుత్వంపై సంధించిన వ్యంగ్య బాణాలు 335 పలుకుబడి పుస్తకరూపంలో వెలువడ్డాయి. 'ఉదయం' వారపత్రికలో 'చల్నేదో బాల్ కిషన్' శీర్షికను ఇతడు రాసిన వ్యంగ్య, హాస్య రచనలు అదే పేరుతో విశాలాంధ్ర ప్రచురణాలయం పుస్తకం వెలువరించింది. ఆంధ్రప్రదేశ్ మాస పత్రికలో ఇతడు రాసిన హాస్య రచనలు గిల్లిదండ అనే పేరుతో పుస్తకంగా వచ్చింది. ఆక్సిజన్ బార్,

నెమీక, గులేర్ అనే కథా సంపుటాలు ఇతని కలం నుండి వెలువడ్డాయి. తన వ్యాసాంగాన్ని-అవార్డులు, రివార్డులకోసం కాకుండా జనంకోసం జనం బాసలో రాసే ఆయన రచనల్లో క్లుప్తతతో పాటు స్పష్టత ఉంటుంది. వీరి కలం నుండి హాస్యం, వ్యంగ్యం కలగలిపి వెలువడిన మరో సంపుటి ఈ గ్రంథం. ఈ గ్రంథంలో 33 హాస్య, వ్యంగ్య కథలు ఉన్నాయి.

### 3.18. దేవరాజు మహారాజు

జననం: 1951 ఫిబ్రవరి 21న నల్లగొండ జిల్లా భువనగిరిలో జన్మించారు.

తల్లిదండ్రులు: నరసింహరాజు, యశోదాదేవి

విద్యార్హతలు: ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎస్సీ., పి.హెచ్.డి-1979 తీసుకున్నారు.

ఉద్యోగం: కళాశాల అధ్యాపకుడు

రచనలు: కవిత్వం: గుడిసె గుండె-1974-తెలంగాణ ప్రజల భాషలో తొలి కవితా సంపుటిగా 2015లో తీసుకొచ్చారు. గాయపడ్డా ఉదయం-1990(వచన కవితకు తెలుగు విశ్వవిద్యాలయ ప్రధాన అవార్డు 1991), కవితా భారతి-1991, తెలుగులో భారతీయ కవిత్వం, మట్టిగుండె చప్పుళ్ళు-1996, మరాఠీ దళిత కవిత, రాజముద్ర-2007, నీకు-నాకు మధ్య ఓ రంగుల నది-2009, కవితా ప్రపంచం, మధుశాల-2010, హరివంశ్ రాయ్ బచ్చన్ కావ్యం, సమయ్ పర్ హస్తాక్షర్-2010, హిందీలో రాజముద్ర, జీవితమే ఒక కవిత-2011, కవితా సర్వస్వం, కాలాన్ని వెనకేసిన మనిషి-2014, మానవ జీవన పరిణామ పదచిత్రం, జీవన్ హే ఏక్ కవితా-2014.

కథలు: కడుపుకోత-1977, పాలు ఎర్రబడ్డాయ్-1991, దేవరాజు మహారాజు కథలు-1993, ఆరు బయట ఆకాశం కోసం:భారతీయ భాషల్లో స్త్రీవాద కథలు-2012-విశాలాంధ్ర ప్రచురణలు, ప్రపంచ ప్రసిద్ధ కథానికలు-2013, భారతీయ కథా ప్రతిబింబం-2014, మనిషి 'కవ'లు-2015, ఒక జీవితం:కొన్ని కథలు-కథా సర్వస్వం

బాల సాహిత్యం: బుడుంగు-1984, గురువుకు ఎగనామం-1984, చిన్నోడి ప్రయాణం-2006, బుడుంగు-23006, అనగనగా కథలు-2006, అపూర్వ జానపద కథలు-2013, పొన్నపూలచెట్టు, బలవంతుడి న్యాయం

నవల: మంచి ముత్యం-2008, (the pearl స్టెయిన్ బెక్ నవల)

సాహిత్య విశ్లేషణ: ఆధునిక యుగంలో జానపద సాహిత్యం-1987, స్మృతి సుగంధం-2008(సాహితీవేత్తల పరిచయాలు, జ్ఞాపకాలు), స్త్రీ దరహాసం దోచిన ఇతిహాసం-2009, తొలితరం స్త్రీవాదుల జీవిత కథలు, ఆత్మనుంచి అక్షరానికి 2010, సాహిత్య వ్యాసాలు, స్త్రీ అక్షరాలు, శిలాక్షరాలు-2012, భారతీయ రచయిత్రుల విజయకేతనం, కవిత్వంలో సమాంతర రేఖలు-సంక్షోభాలు-2014, జానపద సాహిత్యం-ఆధునిక స్పృహ-2014, కొన్ని కలాలు-కొన్ని సమయాలు (రచయితల పరిచయాలు)

నాటికలు: మూఢ నమ్మకాల్ని వదిలిద్దాం-2006, లైఫ్ టానిక్, ఇతర నాటికలు-2007

సినిమా: పథేర్ పాంచాలి-2009 తెలుగులో సత్యజిత్ రే సినిమా స్క్రిప్టు, ప్రయోఓ'జన' సినిమా 'భారతీయ సమాంతర సినిమా: పరిశీలన

పాపులర్ సైన్స్: మూఢనమ్మకాలు-సైన్స్, ఎయిడ్స్-1992, భారతీయ వైజ్ఞానిక వికాసం-2006, విజ్ఞానపథంలో విజయ ఘట్టాలు-2010, జీవన పరిశ్రమలు-2011, సామాజిక జీవనంలో వైజ్ఞానిక స్పృహ, నువ్వేమిటో నీ ఆహారం చెబుతుంది, నేనంటే ఏమిటీ?

సంపాదకత్వం: భారతీయ వారసత్వం-సంస్కృతి విజ్ఞాన నాగరికతలు-2006-తెలుగు అకాడమి ప్రచురణ (డిగ్రీ పాఠ్య గ్రంథం), తెలంగాణ సాహిత్యం: తెలుగు సాహితీ మూర్తులు-2008 డి.రామలింగం సాహిత్య వ్యాసాలు.

వీరి సాహిత్య కృషిపై: ఆవరణం 2011, ప్రముఖుల వ్యాసాలు, సాహితీ స్వర్ణోత్సవ సంచిక.

అవార్డులు: ప్రాంతీయస్థాయి నుండి జాతీయ స్థాయి దాకా ఎన్నోసార్లు, ఎన్నో అవార్డులకు న్యాయనిర్ణేతగా, జ్యూరీ మెంబర్ గా ఉన్నారు. అవార్డులు తీసుకున్నారు.

ప్రముఖ అనువాదకులు కీ.శే. దండిమూడి మహేందర్ ఈయనను 'అభినవ కొడవటిగంటి కుటుంబరావు' అని పిలిచేవారు. 'పట్టుపాగపై మరొక పట్టుపాగ/చుట్టినట్టుగా నీపేరు తట్టెనోయి' అని కవిత రాసారు పొట్లపల్లి రామారావు. భిన్న భిన్న ప్రక్రియా నిర్వహణాదక్షుడు అని

అభినందించారు పోరంకి దక్షిణామూర్తి. 'పాలు ఎర్రబడ్డాయ్' కథకు ఆంధ్రజ్యోతి వారపత్రిక బహుమతి–1973, 'జీవిత పోరాటం' కథకు జ్యోతి మాస పత్రిక బహుమతి–1982, 'తొలి ఎక్స్ రే' కవిత్వ అవార్డు–1983, జాతీయ సమావేశాలకు రెండుసార్లు, భారత్ భవన్, భోపాల్ వారి ఆహ్వానం–1987,89. రంజని రజతోత్సవాల సన్మానం–1989, 'గాయపడ్డ ఉదయం' వచన కవితా సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం–1991–92, దాశరథి దంపతుల సత్కారం–1994, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది సత్కారం–1996, ఆంధ్రా అసోషియేషన్, న్యూఢిల్లీ, (ఎ.పి. భవన్) సన్మానం–1997, జీవియస్ కథా సత్కారం–1997, మారసం–సురమౌళి కథా పురస్కారం–2002, డా. పరుచూరి రాజారామ్ సాహితీ పురస్కారం–2006, మానస ఉగాది పురస్కారం–2007, అనువాదానికి సాహితీ మేఖల జాతీయ అవార్డు–2009, వచన కవితకు నవ్యసాహితీ సమితివారి వసంతోత్సవ పురస్కారం–2015 అందుకున్నారు. ఇందూరు భారతి–నిజామాబాద్, సాహితీ మేఖల నల్లగొండ సంస్థల ద్వారా తొలి సాహితీ జీవన సాహిత్య పురస్కారాలు–2012, 2015లలో స్వీకరించారు.

జీవశాస్త్రానికి సంబంధించి తాను కనుగొన్న కొత్త పరాన్నజీవులకు తెలంగాణా, నిజామాబాద్‌ల పేర్లు పెట్టి జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పరిశోధనా పత్రాలు సమర్పించి ప్రచురించారు. మరోవైపు కేంద్ర సాహిత్య అకాడమీ–2007, ఆకాశవాణి–2014, కునూర్ అసాన్ మెమోరియల్–2015, జాతీయ కవి సమ్మేళనాలలో పాల్గొన్న సృజనశీలి, బహుగ్రంథకర్త.

వృక్ష పరాన్నజీవులపై పరిశోధనలు చేయిస్తూ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, పరిశోధక విద్యార్థులకు జువాలజీ ప్రొఫెసర్‌గా ముప్పై ఏళ్ళు మార్గదర్శనం చేసారు. ఒకవైపు వృత్తిరీత్యా జీవనం గురించి పరిశోధన, మరోవైపు ప్రకృతి రీత్యా జీవితం గురించి శోధన, పరాన్న జీవశాస్త్రంలోంచి సామాజిక పరాన్నజీవులపైకి దృష్టి సారించడం ఒక తాత్విక భూమికను రూపొందించుకొని రెండింటి మధ్య వారధిలా నిలబడగలగడం ఈయన ప్రత్యేకత. సాహిత్యంలో నిత్య శోధనా యాత్రికుడు, బాధ్యతెరిగిన కవి, బహుముఖ ప్రజ్ఞాశాలి.

డాక్టర్ దేవరాజు మహరాజు సమకాలీన తెలుగు సాహిత్యరంగంలో తనదైన 'రాజముద్ర' వేసుకొని, సాహితీ స్వర్ణోత్సవం జరుపుకున్న సుప్రసిద్ధ సాహితీవేత్త తెలుగు వచన కవిత్వంలో తెలంగాణా ప్రజల భాషను ప్రవేశపెట్టి, తొలి కవితా, కథా సంపుటాలు ప్రకటించిన వాడిగా గుర్తింపు ఉంది. వీరి సారస్వత కృషి (1960–2010) గురించి కాలక్రమేణా స్పందించిన సుమారు ఎనభైమంది సాహితీవేత్తల వ్యాసాలు 'ఆవరణం' సాహితీ స్వర్ణోత్సవ సంచికలో నమోదు చేయబడ్డాయి. వివిధ ప్రక్రియల్లో ఇప్పటివరకు వెలువరించిన 52 పుస్తకాలు విశాలాంధ్ర ప్రచురణాలయం, ఎమెస్కో, తెలుగు అకాడమీ హైదరాబాదు బుక్ ట్రస్ట్ వారు ప్రచురించాయి. తెలుగు అకాడమీకి రచయితగా, సంపాదకుడిగా సహకరించి, డిగ్రీ పాఠ్యగ్రంథాలు వెలువరించడానికి దోహదం చేసారు. జాతీయస్థాయి సాహిత్య సమావేశాలలో పాల్గొన్న వీరు దశాబ్దకాలంపాటు నేషనల్ బుక్ ట్రస్ట్–న్యూఢిల్లీ వారికి సలహాసంఘ సభ్యులుగా ఉన్నారు. 'వీరి గుడిసె గుండె', 'గాయపడ్డ ఉదయం' కవితా సంపుటాలపై పరిశోధనలు జరిపి ఒకరు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి మరొకరు హైదరాబాదు విశ్వవిద్యాలయం నుండి డిగ్రీలు తీసుకున్నారు. వీరి కవితలు బెంగుళూరు విశ్వవిద్యాలయం ఎం.ఏ సిలబస్‌లో చోటుచేసుకున్నాయి.

భారతీయ భాషల, ప్రపంచ భాషల కవిత్వాన్ని, కథల్ని తెలుగులోకి అనువదించి తెలుగు కళ్ళకు ఇరుగుపొరుగు దృశ్యాల్ని చూపించారు. ఒక కొత్త కిటికీ తెరిచారు. వెండితెర కవిత్వంగా కొనియాడబడుతున్న భారతీయ సమాంతర సినిమాను విశ్లేషించారు. ఆధునిక యుగ వైజ్ఞానిక స్పృషతో జానపద సాహిత్య పరిశీలన చేసారు. సమాజంలో శాస్త్రీయ అవగాహనను పెంచడానికి సరళ విజ్ఞానశాస్త్ర గ్రంథాల్ని ప్రచురించారు. బాల సాహిత్యంలోనూ, రేడియో నాటకరంగంలోనూ కృషి చేసారు. ప్రయోగాత్మకతకు తన ఆత్మను జోడించగలవాడని ఆయన కవితలు, డాక్యుమెంటరీ స్టోరీస్, మనిషి కథలు, కాలాన్ని వెనకేసిన మనిషి వంటి రచనలు చదివితే తెలుస్తుంది. ఫ్రెంచ్ గడ్డంతో విలక్షణంగా కనిపించే ఈ ఏకైక తెలుగు కవికి అనేక ప్రత్యేకతలున్నాయి. వచన కవిత్వంలో తెలంగాణా జీవద్భాష ప్రవేశపెట్టడం, కవిత్వానువాదంలో విషేషంగా కృషి చేయడం, మూఢనమ్మకాల నిర్మూలనకు కలం పట్టడం అందులో కొన్ని. ఎయిడ్స్‌పై అవగాహనకోసం తెలుగులో తొలి పుస్తకం రాసింది వీరే. నేనంటే ఏమిటి? అనే ప్రశ్నకి వైజ్ఞానిక వివరణనిచ్చిందీ వీరే. రచనే

ఆయన గుర్తింపు కార్డు. రచనే ఆయన ఊపిరి. తానొక బాధ్యతగల రచయితనని ఆయన ఎప్పుడూ మరిచిపోరు.

### 3.19. దేవులపల్లి కృష్ణమూర్తి

జననం: 1940 జూన్ 14న నల్లగొండ జిల్లా సూర్యాపేట తాలుకా పెన్ పహాడ్ మండలం (నాగులపాడు) పరగణాలోని అనంతారం గ్రామంలో జన్మించారు.

తల్లిదండ్రులు: రాములమ్మ, పెద్ద నర్సింహా

విద్యార్హతలు: బి.ఎ. (1968)

ఉద్యోగం: మండల రెవెన్యూ అధికారిగా 1998లో ఉద్యోగ విరమణ చేసాడు. ప్రస్తుతం నకిరేకల్‌లో నివాసముంటున్నాడు.

రచనలు: కథలగూడు (కథా సంపుటం), ఊరువాడ బతుకు(నవల), మా యాత్ర (ఉత్తరదేశ యాత్ర కథనం), బయటి గుడిసెలు (నవల), లూరుమారు (కథా సంపుటం), యక్షగానం (కథా సంపుటం–జనవరి–2016) మొదలైన పుస్తకాలను ప్రచురించారు.

తాను చిన్ననాటి నుండి విన్నవి, కన్నవి భద్రపర్చాలనే ఆలోచనతో రచనలు ప్రారంభించారు దేవులపల్లి కృష్ణమూర్తి. బడుగు బలహీనవర్గాల జీవన చిత్రాలపై కథలు, నవలలు రాస్తున్నారు. తహసీల్దార్‌గా పదవీ విరమణ పొందిన తర్వాత 2009 నుండి రచనను చేయడం ప్రారంభించారు. గ్రామీణ వాతావరణం, ప్రజల జీవన స్థితిలపై 2009లో ఊరువాడ బతుకు (నవల) రచించారు. 2011లో మా యాత్ర అనే పుస్తకం, 2012లో కథలగూడు (కథా సంకలనం) రచించారు. 2013లో సంచార జాతులకు సంబంధించి బయటి గుడిసెలు (నవల), 2014లో తారుమారు అనే కథా సంకలనం రాసారు. యక్షగానం 2016లో కథా సంకలనం రాసారు. కవి బోయజంగయ్య స్వర్ణోత్సవ సంచికకు సంపాదకీయం వహించారు. కృష్ణమూర్తి రాసిన కథలు పలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. కవులు, కళాకారులు, రచయితలు మంచికి ప్రాధాన్యం ఇచ్చి, చేడును దూరంగా పెట్టాలని ఆయన సూచిస్తున్నారు.

కృష్ణమూర్తిగారు ముందుగా ఉత్తమ సాహిత్య పాఠకుడు. అనేక సాహిత్య సంస్థలతో సంబంధాలున్న కార్యకర్త. ఆ తర్వాత సాహిత్య విమర్శను చదువుకున్న వివేకి. ఆధునిక సాహిత్యంలో వారు చదవని పుస్తకం లేదంటారు. వారికి కళలతో కూడా తగుమాత్రం పరిచయం ఉంది. వీటన్నిటి మూలంగా వారు ముందుగా మనస్విగా రూపొంది, ఉద్యోగ విరమణ తర్వాత రచయిత పాత్రలోకి సహజంగా ప్రవేశించారు. ఇందుకు ప్రధాన కారణం ఇతరులు చెప్పింది, తాను చెప్పవలసింది కొంత ఉందని వారు భావించడమే. డెబ్బై సంవత్సరాల వయస్సు తనకు తెలిసిన జీవితాన్ని చెప్పాలన్న కుతూహలం ఎక్కువగా ఉంటుందే తప్ప, కీర్తిప్రతిష్టల యావ ఉండదు.

### 3.20. నీరుడు సంజీవరెడ్డి

జననం: 1964 డిసెంబర్ 6న నల్లగొండ జిల్లా, నార్కట్‌పల్లి మండలంలోని ఔరవాణి గ్రామంలో జన్మించారు.

తల్లిదండ్రులు: యశోదమ్మ, గోపాల్ రెడ్డి

భార్య: సభిత–'సంతకం పత్రిక' నడుపుతున్నారు.

విద్యార్హతలు: ఎం.ఏ. తెలుగు, బిఇడి, బిఎల్ఐసి

వృత్తి: ఉపన్యాసకులు, జూనియర్ కళాశాల. ప్రస్తుతం పాత్రికేయుడుగా.

రచనలు: కథలు: మసిబారిన నిజాలు–2011, రాకాసి కోన–2011, కలగంటినా?–2010, ఉత్తరాభిముఖం–2010, జీవనాడి–2012, మూలమలుపు–2012, చిత్తయ్యల కథ–2012, భారతి భర్త–2012, లంకె–2013, నాదగ్గర సమాధానం లేదు–2016, పిచ్చయ్య కాలేజీలో పిల్లలకు పేడవాసన–2016, నిత్యం చెప్పిన సత్యం కథ–2017, విధేమిటి?–2017, ఓ పొద్దుగూక–2017, పాలమూరు రామన్న తదితర కథలు రాసారు. కలవరపాటు–వ్యాస సంకలనం–2011

తెలంగాణ ఉద్యమంలో సంజీవరెడ్డి సంపాదకత్వంలో 'కలవరపాటు' అనే వ్యాస సంకలనం వెలువడింది.

సృజనాత్మక రచయితగా కొనసాగుతున్నారు. 16 సంవత్సరాల నుండి 'సంతకం' అను మాస పత్రికను నిరంతరంగా నడుపుతున్నారు. దాదాపు 30 కథలు రాసారు. సమర పేర్లతో రచనలు చేస్తున్నారు.

### 3.21. పి. చిన్నయ్య

జననం: 1965 అక్టోబర్ 10న నల్లగొండ, వలిగొండ మండలం వెలువర్తి గ్రామంలో జన్మించారు. ప్రస్తుత నివాసం మోటకొండూరులో, జిల్లా యాదాద్రి.

వృత్తి: ఉపాధ్యాయుడు

అసలు పేరు: పెదకోట్ల చిన్నయ్య

కలం పేరు: చిన్న

రచనలు: కథలు: పయిలం–2005 (కథా సంపుటి), బండ పగిలింది–1996, ఈత–2006, జీవచ్ఛవాలు–2006, మెట్ట భూమెదు–2005, శివార్లల్ల–2008, రూప విక్రయ–1990, వారసులు–1997, పంద్రాగస్టు–1998, పంపకాలు–2010, అంటరాని బతుకమ్మ–2015, దలాల్ స్ట్రీట్–2013, అడిగెటోళ్ళు–2013, పాలన–1999, బాయిగడ్డ మీద– 2000, సాగుదారు–2019, మారిగాడు–మల్లప్పగుట్ట–2001, పాంజ–2002, చక్రవర్తి కూర–2002, పీర్ల పండుగ–2003, ఇంటి దొంగలు–2004, పరిష్కారం–2005, నీలాంటోడు–నా లాంటోడు–2005

బాధితుల జీవితాలను కథనం చేస్తున్న వర్తమాన రచయిత. విరసం కార్యవర్గ సభ్యులు. దాదాపు 30కథలు రాసారు. ప్రముఖ కథా సంకలనాల్లో వీరి కథలు చోటుచేసుకున్నాయి.

### 3.22. పిట్టల శ్రీనివాస్

జననం: 1974 ఆగస్టు 8న నల్లగొండ పట్టణంలో లైన్ వాడి ప్రాంతంలో జన్మించారు.

తల్లిదండ్రులు: పిట్టల రామచంద్రం, భారతి

విద్యార్హతలు: బి.టెక్. మెకానికల్ కంప్యూటర్

రచనలు: వెలి–2005, లచ్చిమి–2011 కథలు, ఆయన రాసిన ఇంకా 10 కథలు అముద్రితంగానే ఉన్నాయి.

కవితలు: ఉచ్చు, ఓపం, కుందెన, మరమనిషి, 'అలుగు' పేరుతో కవితా సంపుటిని వెలువరించారు.

ఇతడు తండ్రి ప్రోత్సాహంతో సాహిత్యంవైపు ఆసక్తి చూపాడు. దళితుల సమస్యలపై అనేక కథలు, కవిత్వాలు రాస్తున్నారు. దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా, అక్కడ ప్రత్యక్షమవ్వడం, వారి

సమస్యలపై సృజన చేయడం శ్రీనివాస్‌కు వెన్నతోపెట్టిన విద్య. వేముల ఎల్లయ్య ప్రోత్సాహంతో ఆయన ముందుకెళ్తున్నారు.

శ్రీనివాస్ తండ్రి పిట్టల రామచంద్రం ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఆయన సాహిత్య అభిమాని. కవి, రచయిత నోముల సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణమూర్తులు రామచంద్రం ఇంట్లో కూర్చొని సాహిత్యం మీద చర్చలు జరుపుతుండేవారు. చర్చలు జరుగుతున్నప్పుడు శ్రీనివాస్ వారి మాటలు విని సాహిత్యంవైపు మక్కువ పెంచుకున్నారు. అప్పటి నుంచే చిన్నచిన్న కథలు, కవిత్వాలు రాయడం ప్రారంభించారు.

భవిష్యత్‌లో దళితుల సమస్యలపై ఓ పుస్తకాన్ని తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొంటున్నారు. తన సమయాన్ని ఎక్కువగా దళితుల సమస్యలపై ఖర్చు చేస్తానని, వారి సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని ఆయన పేర్కొన్నారు. సన్మానాలు, సత్కారాలు, బహుమతులు తీసుకోవడానికి తాను ఎల్లప్పుడూ దూరంగా ఉంటానన్నారు. అలాంటివి తనకు ఇష్టం ఉండవని స్పష్టం చేసారు.

### 3.23. పెండెం జగదీశ్వర్

| | |
|---|---|
| జననం: | 1976 జూన్ 28న నల్లగొండ జిల్లా రామన్నపేట మండలం కొమ్మాయిగూడెం గ్రామంలో జన్మించారు. |
| మరణం: | 2018 జూలై 17, ఆత్మహత్య |
| తల్లిదండ్రులు: | సత్తమ్మ, నరసింహ |
| భార్య: | రాణి సుధ |
| పిల్లలు: | హరిచందన్, వికాస్ తేజ |
| వృత్తి: | ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు |
| రచనలు: | జానపద కథలు, కన్నీటి బొట్టు–2010, గమ్మతి గమ్మతి కథలు–2016, దోస్తులు చెప్పిన కథలు–2018, చెట్టు కథ, ఉపాయం, గజ్జెల దెయ్యం, |

బాలల కథలు, నూటపదహారు నవ్వులు, తాను తీసిన గోతిలో, ముగ్గురు అవివేకులు, విముక్తి, కన్నీటి బొట్టు–2010, ఆనంద వృక్ష్యంం (పర్యావరణ కథల సంపుటి), విద్దూరాల బుడ్డోడు, బడిపిలగాళ్ళ కథలు, ఆంధ్రప్రదేశ్ జానపద కథలు, మాతో పెట్టుకోకు మొదలైన పుస్తకాలు.

గుర్తింపులు:

ఈయన 1994 నుండి రచనలు చేస్తున్నారు. తెలంగాణ మాండలికంలో పిల్లలు చెప్పుకునే ఇరవై జానపద, హాస్య కథలతో 'బడి పిలగాళ్ళ కథలు(2015) అనే పుస్తకాన్ని రాసారు. ఇది తెలంగాణ మాండలికంలో వచ్చిన తొలి బాలల కథా సంకలనంగా ప్రశంసలందుకుంది. ఇందులోని 'నాకోసం యెవలేడుస్తరు?, వొంకాయంత వొజ్రం కథలు మహారాష్ట్రలో ఆరవ తరగతి తెలుగు పాఠ్యపుస్తకాలలో 2016–17 విద్యాసంవత్సరం నుండి పాఠ్యాంశాలుగా ప్రవేశపెట్టబడ్డాయి. వయోజనులు, నూతన అక్షరాస్యుల కోసం స్టేట్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పలు పుస్తకాలు రాసారు.

సాక్షరభారత్ వాచక రూపకల్పనలో పాలు పంచుకున్నారు. బాల సాహిత్య గ్రంథాల ప్రచురణలో రాజీవ్ విద్యా మిషన్‌కు సేవలందించారు. నల్లగొండ జిల్లా ఆర్వీయం బాలల మాస పత్రిక 'జాబిలి' కి సంపాదకవర్గ సభ్యునిగా పనిచేసారు. తెలంగాణ మాండలికంలోనే 'గమ్మతి గమ్మతి కథలు, దోస్తులు చెప్పిన కథల పుస్తకాలను కూడా ప్రచురించారు.

పురస్కారాలు:

1. బాల సాహిత్య పరిషత్ 'బాల సాహితి రత్న' పురస్కారంతో గౌరవించింది.

2. సాహితీ మేఖల, అక్షర కళాభారతి, చింతల స్వచ్ఛంద సంస్థలు 'ఉగాది' పురస్కారాలు అందజేశాయి.

3. మహాకవి శ్రీశ్రీ పురస్కారం

4. వాసాల నర్సయ్య బాల సాహిత్యం–పురస్కారం

5. గాడేపల్లి యువ సాహిత్య పురస్కారం అందుకున్నారు.

6. ఉత్తమ బాల సాహిత్య గ్రంథ పురస్కారం–గజ్జెల దెయ్యం–తెలుగు విశ్వవిద్యాలయం–2005

7. తెలంగాణ ప్రతిభా పురస్కారం–2017, (నటరాజ్ డ్యాన్స్ అకాడమీ, హైదరాబాద్), తెలుగు వికీపీడియా కృషి

8. ప్రభుత్వ తెలుగు పాఠ్యపుస్తకాల (3వ తరగతి ప్రథమ భాష, 6, 7 తరగతులు ద్వితీయ భాష) రచనలో పాల్గొన్నారు.

9. వీరు రాసిన 'చెట్టుకోసం' కథ 2007 నుండి 2016 వరకు మహారాష్ట్రలో ఆరవతరగతి తెలుగులో పాఠ్యాంశంగా కొనసాగింది. తమకు చల్లని నీడనిచ్చే వేపచెట్టును నరికివేయకుండా కాపాడుకునేందుకు ఒక పాఠశాల విద్యార్థులు పడిన తాపత్రయాన్ని అద్భుతంగా చిత్రించిన ఈ కథ పలువురి ప్రశంసలందుకుంది.

### 3.24. పెరుమాళ్ళ ఆనంద్

జననం: 1965 జనవరి 8న నల్లగొండ జిల్లా నూతనకల్ మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలో జన్మిచారు.

తల్లిదండ్రులు: తిరుపతమ్మ, మదార్

విద్యార్హతలు: ఎం.ఏ. హిస్టరీ, ఎం.ఏ తెలుగు, ఎం.ఏ. ఇంగ్లీషు, ఎం.ఏ. ఫీలాసఫీ, ఎం.ఈ.డి. పిజిడిఈఎల్‌టి

వృత్తి: అధ్యాపకుడు, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు

రచనలు: కవితా సంపుటి: కాలస్పర్శ, కథలు: మమేకం, చిట్లాల, ఉరుమడ్ల, చివరికి, కొత్తలోకం, కన్నీళ్ళూ నవ్వాయి, కొత్త చిగురు, జీవితం ఎటెళ్ళదో; సంపాదకత్వం వహించిన పుస్తకాలు: ఒక సందర్భం, ఒక జ్ఞాపకం, ఆకుపచ్చ అమ్మ, అవని–అక్క–ఆకాశం, నిత్య కృషీవలుడు, జనం మనిషి, బాల సాహితీ రత్న, రెక్క విప్పిన బాల్యం మొదలైనవి. ప్రస్తుతం 'సూర్యాపేట టైమ్స్' దిన పత్రికలో 'లిటరరీ టైమ్స్' అనే సాహిత్య కాలమ్ నిర్వహిస్తున్నాడు.

### 3.25. బెల్లి యాదయ్య

జననం: 1968 జూన్ 20న నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని పాలెం (నోముల గ్రామం) జన్మించారు.

తల్లిదండ్రులు: సాయిలు, చంద్రమ్మ.

విద్యార్హతలు: ఎం.ఏ, పి.హెచ్.డి

ఉద్యోగం: ఎన్.జి. కళాశాలలో తెలుగు శాఖలో విభాగాధిపతిగా పని చేస్తున్నారు.

రచనలు: ఎర్రెద్దు (కథ), నేను గొర్రెలు కాస్తుంటాను, బోధివృక్షం, విభాజకం పేరుతో కవిత్వాన్ని అందించారు. తర్జుమా, సాల భంజిక (సాహిత్య వ్యాసాలు), లొళ్ళి (అధిక్షేప సాంఘిక శతకం), సీసాలు...సిత్రాలు (ప్రభావశీల వ్యక్తులపై గ్రంథం), మీ స్కోర్ ఎంత (వ్యక్తిత్వ వికాస గ్రంథం), చేంజ్ మేకర్స్ (విద్యా వ్యాసాలు), మావూరు....అట్లాలేదు (వచన కవితలు), యాది (పాట నవల), మూడో కన్ను (పిల్లలతో ఇంటరాక్షన్), మై పాయింట్ (తరగతి గది అనుభవాలు), చెంచుల జీవన దృశ్యం (నల్లమలపై పరిశోధన), బొట్టు రాసిన జీవితాలు (చెంచు విండోస్ ఆత్మకథ) వంటి రచనలు/పుస్తకాలు రాసారు.

**అవార్డులు, బిరుదులు:**

1997లో లోహయజ్ఞం (బిటి కమ్మరి జీవితాలపై రాసిన కవితు) అత్యంత ప్రతిష్టాత్మకమైన కుందుర్తి అవార్డు వచ్చింది. పి.హెచ్.డి.లో చేసిన పరిశోధనలకు గాను, తెలుగు విభాగంలో స్వర్ణపతకం వచ్చింది. ఎం.ఏ తెలుగులో జాతీయ సాహిత్య ప్రతిభ పరీక్ష, విద్య సంవర్ధిని పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు దేశ స్థాయిలోనే 1994లో ఆంధ్ర భాషా భూషణ స్వర్ణ పతకం ఆయనను వరించింది. 2003లో నల్లగొండ పట్టణంలో ఇంటర్మీడియట్ ఆర్.జె.డి చేత జిల్లా స్థాయిలో ఉత్తమ అధ్యాపక అవార్డును యాదయ్య పొందారు.

**గోల్ ఫౌండర్ పేరుతో సంఘసేవ:**

యాదయ్య గోల్ ఫౌండర్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్టాల్లోని 247 విద్యా సంస్థలను సందర్శించి పిల్లల్లో ఉన్న అభ్యాసన మార్గాలు తెలుసుకొని వారి అభివృద్ధికోసం తమ సంస్థ ద్వారా లక్ష నిర్దేశ కార్యక్రమాలు చేస్తున్నారు. ఏపి, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలోని విద్యార్థులను కలిసి తాను రచించిన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసారు.

బెల్లి యాదయ్య రచించిన పది కవితా సంపుటాలను తెలుగు నుండి హిందీ, ఇంగ్లీష్ భాషల్లోకి అనువదించారు.సుజనాపీఠం, గోల్ అనే సంస్థలను స్థాపించి రచనా పరంగా ఎదురయ్యే సమస్యలు, ఇతర సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. ఇప్పటి వరకూ ఆయన రచించిన రచనలు, గ్రంథాల్లోని అంశాలపై తెలుగు విశ్వవిద్యాలయం, వెంకటేశ్వర, కాకతీయ, ఉస్మానియా, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో పలువురు పరిశోధనలు వివిధ అంశాలపై చేస్తున్నారు. ఎం.ఏ తెలుగు డిస్టెన్స్ కోర్సు ఉస్మానియా యూనివర్సిటీకి కొన్ని కవితలు రాసాడు. సృజనాత్మకంగా రచనలు చేయడం, పఠనం, పరిశోధన, బోధన అనేవి ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఇప్పటికీ ఆయన ఎన్.జి కళాశాలలో తెలుగు డిపార్ట్‌మెంట్ విభాగాధిపతిగా పని చేస్తూనే రచనలవైపు తన దృష్టిని మరలిస్తున్నారు. సాహిత్యం సమాజాన్ని మార్చగలుగుతుంది. విద్య సామాజిక మార్పుకు పునాది అనే ప్రచారం చేయడం ఆయన నమ్ముకున్న విశ్వాసం,ఆశయాలు.

### 3.26. బోధనం నర్సింహారెడ్డి

జననం: 1958 జూలై 4న నల్లగొండ జిల్లా అన్నారెడ్డిగూడెం గ్రామంలో జన్మించారు.

విద్యార్హతలు: ఎం.ఏ తెలుగు

వృత్తి: ఉపాధ్యాయుడు

రచనలు: కథలు: పేగుబంధం–2007(కథా సంపుటి), బోరు పొక్కలు–2003, ఓడలు ఓడలే–2002, ఆమె–2009, కాడుకెళ్ళిపోయిండు–2008, తశ్వ–2000, పంచనామ–2010 మొదలైన కథలు. బతుకుపోరు కవితా సంపుటి–1979

ఎం.ఏ పరీక్షలో 1982లో ప్రథమ శ్రేణిలో నెగ్గిన నర్సిరెడ్డిగారు విద్యార్థిదశ నుండే కవితా రచన చేస్తున్నారు. 1979లోనే ఒక కవితా సంకలనాన్ని వెలువరించారు. పత్రికా రచయితగా జిల్లాలోని వివిధ సమస్యలను అందరి దృష్టికి తెస్తూ, ప్రసిద్ధ విలేఖకరిగా పేరుగాంచిన వీరు వచన కవితలు, కథలు, కథానికలు రాయటంలో మంచి నైపుణ్యం సంపాదించారు. వివిధ కవి సమ్మేళనాల్లో పాల్గొని ప్రశంసలందుకున్న నిరంతర కవితాలోచనాపరులు.

అవినీతిని రూపుమాపాలనే ఉద్దేశ్యంతో, జనం మనం, మనంజనం అనే పద్ధతికి నిదర్శనంగా పాటలను రాసి, కవిత్వాన్ని ప్రజల మధ్యకు తీసుకువెళ్ళగలిగిన వ్యధార్థజీవుల యదార్థ గాథలను వాటిల్లో చిత్రించగలిగారు.

'నీలగిరి సాహితీ సమాఖ్య' కార్యదర్శిగా సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉద్యోగ జీవితం సాహితీ జీవితాన్ని చక్కగా గడుపుతున్న నర్సిరెడ్డిగారు మరింత కవితా వ్యవసాయం చేసే పట్టుదలతో ఉన్నారు.

### 3.27. బోయపల్లి నర్సయ్య (నిర్మల్)

| | |
|---|---|
| కలంపేరు: | నిర్మల్ |
| జననం: | నల్లగొండ సూర్యాపేటలో 1948 ఆగస్టు 21న |
| తల్లిదండ్రులు: | శ్రీమతి ఎల్లమ్మ, శ్రీ పరశురాములు |
| విద్యార్హత: | బి.కామ్. |
| వృత్తి: | ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్(రైటైర్డు) |
| ప్రవృత్తి: | నటన, సాహిత్యం |
| రచనలు: | సగటు బతుకులు, ఇదీ మన కథ, ఆబ్కారి కథలు, ఈ చరిత్రను చెరిపేద్దాం (డాక్యుమెంటరీ ఫిలిం), మామూలు మనిషి, సమాదులపై తొలి కథా సంకలనం, పునాదులు నాటికలు. ఇలా చాలా కథలు వివిధ పత్రికల్లో ప్రచురించబడ్డాయి.<br>అముద్రిత రచనలు: ఈ ప్రశ్నకు బదులేది, ఈ నేరం మాదికాదు–వ్యవస్థది(నాటికలు), జీవిత సత్యాలు (కవితలు)<br>రాబోయే రచనలు: లోకం పోకడ–కవితా సంకలనం, నాలుగు నాటికల సంకలనం, తెలంగాణ నాటకరంగ వైతాళికుడు–కె.ఎల్.నర్సింహారావు జీవితం–సాహిత్యం. |

తన వృత్తిలో అసలు సమయం దొరకడమే కష్టం. అయినా సమయం కుదుర్చుకొని సాహిత్య సృజనను ప్రవృత్తిగా ఎంచుకున్నారు. ఈ విధమైన పద్ధతిని ఏ కొందరిలోనో చూడగల్గుతాం.

'నిర్మల్' కలంపేరుతో ఎన్నో నాటికల్లో, నాటకాల్లో నటించి బహుమతులను పొందిన నర్సయ్యగారు పాఠశాల జీవితం నుండే (1966 ప్రాంతం) ముఖానికి రంగు వేసుకున్నారు. అప్పట్లో 'వరుడికి తగిన వధువు' నాటికలో నటించి, జనరంజకంగా 'బుర్రకథ'ను చెప్పిన ఈయన 1959లో నల్లగొండ జిల్లా సాంస్కృతిక పోటీల్లో బుర్రకథా కథనానికి ప్రథమ బహుమతిని పొంది, అత్యుత్సాహంతో, తమ గురువుగారైన కోటరామశాస్త్రిగారి ప్రోత్సాహంతో ఆ కళను బాగా అభివృద్ధి చేసుకున్నారు. కాలేజీ విద్యార్థిగా 1965లో వరంగల్‌లోని కాకతీయ కల్చరల్ ఫేర్ ద్వారా 'జననీ జన్మభూమి' నాటికను ప్రదర్శించి ఉత్తమ హాస్య నటునిగా అక్కినేని వారిచేత బహుమతి పొందారు. 1968లో సూర్యాపేటలో 'విజయభాను కళాసమితి'ని స్థాపించి దాని ద్వారా నాటకాలు, నాటికలు వేయించారు. ఉద్యోగరీత్యా నల్లగొండకు చేరి 1969లో 'యంగ్ స్టార్ సిండికేట్' ఏర్పాటుచేసి, ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘంవారు తెలంగాణ జోన్‌లో నిర్వహించిన నాటిక పోటీల్లో 'కొడిగట్టిన దీపాలు' ప్రదర్శించి, పెద్దల ప్రశంసలు అందుకోవడమేగాక, సూర్యాపేట పబ్లిక్ క్లబ్ వారు నిర్వహించిన పోటీల్లో 'ఏక్ దిన్‌కా సుల్తాన్' ప్రదర్శించి ఉత్తమ బహుమానాలను పొంది, ఇదే నాటికకు రేపాలలో ఉత్తమ ప్రదర్శన అవార్డును అందుకున్నారు. రాష్ట్రస్థాయి 'ఏకపాత్రాభినయం' పోటీల్లో గెలుపొంది (1983-84) అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారి చేతుల మీదుగా సత్కరించబడ్డారు. ఈ విధంగా నటనలోనేగాక, 'ఈ చరిత్ర చెరిపేద్దాం' ప్రగతి పథంలో నల్లగొండ అనే డాక్యుమెంటరీ రూపకాలకు ర్చయిత, దర్శకుడుగా ఉండి మంచి పేరు తెచ్చుకున్నారు. వీరి 'సగటు బతుకులు' కుటుంబ నియంత్రణను ఉద్దేశించి రాయబడిన రూపకం. దీన్ని జిల్లా వైద్యశాఖవారు జిల్లా అంతటా ఎన్నోసార్లు ప్రదర్శింప చేసారు.

ఇట్లా నాటిక, నాటకాల్లోనేగాక నర్సయ్యగారు కవితా రచనలోను మెలకువలు తెలిసిన రచయిత. నిర్మల్ కలం పేరుతో ఎన్నో కవితలు, కథానికలు వెలువడ్డాయి. నల్లగొండా యువ రచయితల సంఘం నిర్వాహకులుగా పనిచేస్తూ, ఆ సంస్థ ద్వారా ప్రచురించిన, కథా సంపుటాల్లోను, కవితా సంకలనాల్లోను, తమ లేఖినీ బలాన్ని ప్రదర్శించిన వీరికి, 'సమాధులపై పునాదులు' అనే కథా రచనకు 'కొడవటిగంటి' వంటి ప్రముఖ రచయితల ప్రశంసలు లభించాయి.

తీరికలేని ఉద్యోగంలో ఉంటూ, తనదైన ప్రత్యేక రీతిలో వివిధ రీతుల రచనా వ్యాసాంగాన్ని కొనసాగిస్తున్న నర్సయ్యగారు కార్యదీక్షాపరులు, ఉత్సాహంగా ఉంటూ, ఎందరినో ప్రోత్సాహపరుస్తూ, తమ జీవిత నౌకను నడుపుతున్నారు. 'కాంతం క్రతుంచాక్షుమ్' అన్న సూక్తిని వీరు తమ నాటికల ద్వారా నిరూపిస్తున్నారు. నర్సయ్యగారి సాహితీ జీవితమే ఒక నాటకరంగం.

### 3.28. భూతం ముత్యాలు

| | |
|---|---|
| జననం: | 1971 జూన్ 10న నల్లగొండ జిల్లా, నాంపల్లి మండలంలోని తిరుమలగిరి గ్రామంలో జన్మించారు. ప్రస్తుతం నల్లగొండలో నివాసం ఉంటున్నారు. |
| తల్లిదండ్రులు: | మల్లమ్మ, మల్లయ్య |
| విద్యార్హతలు: | డిగ్రీ(బి.ఎ.), బి.ఎడ్ |
| వృత్తి: | ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. |
| రచనలు: | నవలలు: దుగిలి, సూర-2005, పురుడు-2007, ఇగురం-2012<br>కథలు: బేగరి కథలు (కథా సంపుటి)-2010, బుగాడ-2014, దగ్దం కథలు-2017, బతుకులాట, ఉరుసు, పేగుపాశం, ఓపిక, బేగరి, పచ్చనోటు, గ్లోబల్ కితుకు, రజియా, బతుకు తీపి, బుగాడ కథల సంపుటిలోని కథలు: ఊరి బోనం, బుగాడ, ఆకరి ఉత్తరం, జేజి, రుక్మతి, పొద్దుపొడ, దూదిపింజె, మాలోకం, జోగి, బొందల గడ్డ, లోగిలి, మాయమ్మ మల్లమ్మ, స్నేహం విలువ, జాలుబాయి, కుటిలం, అంటరాని నిర్భయ; దగ్దం కతహాలు: జాలి, మీన, గుప్పెడు గూడు, ఈదురు గాలి, దగ్దం, కన్నపేగు, బలి, గుడ్సెలంటుకుంటున్నయ్, వెలి, కర్రోడు, ఈడుజోరు, సదువు, ఆశయ్య కల, కేన్సర్ గౌరమ్మ, ఆశిర్కం, ఆరోజు, గోస దక్కన్, జాడ మొదలైన కథలు రాసారు.<br>కవితలు: దుగిలి-2003(కవితా సంపుటి), తడసిర్స్ (దీర్ఘ కవిత)<br>పదకోశాలు: మాండలీకం (తెలంగాణ కుల వృత్తి పదకోశం)<br>'నియతి' పేరుతో నా ఆటోగ్రఫి ని రాసుకున్నారు. |

అవార్డులు: 2003లో మునుగోడు మండలంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు

జీవితంలో ఎదురయ్యే కష్టాలను కవితలు, రచనల రూపంలోకి మల్చడంలో దిట్ట. కవి, రచయిత. దళితుల సమస్యలను వెలికి తీసి ఆయన కలంతో అనేక రచనలు చేసాడు. కటిక పేదరికంలో పుట్టిన ఆయన కష్టాలు చూసి భయపడకుండా ముందుకు వెళ్ళారు. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించారు. అయినా రచనలు మాత్రం కొనసాగిస్తూనే ఉన్నారు. ఈయన రచనలు కొన్ని విశ్వవిద్యాలయాలలో ఎం,ఏ తెలుగు పాఠ్యాంశాల్లో భాగంగా చేర్చారు. సకల జనుల సమ్మెలో పాల్గొనడంతో 'తడ' సిర్స్ తెలంగాణ దీర్ఘ కవిత ప్రకటించారు. తెలంగాణపై 'పొద్దుపొడ' కథ రాసాడు. వివిధ ఉద్యమ సభల్లో భాగమయ్యారు. తెలంగాణ ఉద్యమ అమరులకు నివాళులర్పిస్తూ గుంపు సాహితీ సంస్థనుంచి సభ పెట్టారు. 2005లో హైదరాబాదులో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన దళిత సాహిత్య సదస్సులో ఆయన రాసిన రచనలకు సన్మానం పొందారు. ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో నిర్వహించే గ్రంథాలను వారోత్సవాల్లో జిల్లా కలెక్టర్ చేత ఆయన సన్మానం అందుకుంటూనే ఉన్నారు. ప్రస్థానం పత్రికలో భూమి స్కరించాడు అనే వ్యాసానికి ఆయనకు బహుమతి వచ్చింది. ఆయన ఎంతగానో అభిమానించే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, గౌతమ బుద్ధుని చిత్రాలను పెయింటింగ్ రూపంలో వేసి భద్రపర్చారు. దళితుల సమస్యలను వెలికితీసి రచనల రూపంలో తెలపడంలోనే తనకు ఆత్మ సంతృప్తి ఉందంటారు ఆయన.

### 3.29. ముదిగంటి సుజాతారెడ్డి

జననం: నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం ఆకారం గ్రామంలో జన్మించారు. ప్రస్తుతం హైదరాబాదులో ఉంటున్నారు.

అసలు పేరు : మిట్టా సుజాతారెడ్డి

ప్రసిద్ధి: గొప్ప పరిశోధకురాలు, విమర్శకురాలు, కథా రచయిత్రి, నవలా రచయిత్రి

తల్లిదండ్రులు: మిట్టా రాంరెడ్డి, వెంకటమ్మ

భర్త: ముదిగంటి గోపాల్ రెడ్డి

పిల్లలు: వాసవిక (కుమార్తె), ఉదయన (కుమారుడు)

వృత్తి: విశ్రాంత అధ్యాపకురాలు

రచనలు: కథా సంపుటాలు: విసుర్రాయి కథలు–1998, తెలంగాణ తొలితరం కథలు–2002, మింగుతున్న పట్నం–2001, వ్యాపార మృగం, తొలినాటి కథలు–2005, మళ్ళీ మార్క్స్ పుట్టాలి–2010, నూరేండ్ల తెలుగు కథలు (సంపాదకత్వం–సంగిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి),

నవలలు: సంకెళ్ళు తెగాయి, ఆకాశంలో విభజన రేఖల్లేవు, మలుపు తిరిగిన రథచక్రాలు.

యాత్రా రచనలు: నైలునదీ యాత్ర, అద్భుత చైనా

ఇతర రచనలు:సంస్కృత సాహిత్య చరిత్ర–1997, 'బాణుని కాదంబరి పరిశీలనం, అలంకార శాస్త్ర గ్రంథాలు'–గోపాల్ రెడ్డితో కలిసి, ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర, రసచర్చ ఆధునికత, వేమన–నాథ సంప్రదాయం, ముద్దెర (వ్యాస సంకలనం),ముసుగు (ఆత్మకత).

పురస్కారాలు: చాసో అవార్డు, రంగినేని ఎల్లమ్మ పురస్కారం–2007, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ద్వితీయ వార్షికోత్సవాలలో ప్రభుత్వ విశిష్ట ప్రతిభా పురస్కారం–2016

తెలంగాణ కవయిత్రుల్లో ముదిగంటి సుజాతారెడ్డిగారు ఒక గొప్ప విధుషీమణి. కథ, నవల వంటి సృజనాత్మక ప్రక్రియలలో, సాహిత్య విమర్శలో, సాహిత్య చరిత్రలో, తెలంగాణ చరిత్రలో ఇప్పటికే అనేక రచనలు చేసి ఆమె సుప్రసిద్ధులయ్యారు. ఆమె ఆత్మకథ తెలంగాణ మధ్యతరగతి రైతు కుటుంబాల జీవన పరిణామాన్ని హృద్యంగా చిత్రించింది.

సుజాతారెడ్డిగారు తమ భర్త ముదిగంటి గోపాలరెడ్డిగారితో కలిసి రాసిన గొప్ప పుస్తకం–'సంస్కృత సాహిత్య చరిత్ర'. దీనిని 1997లో తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించింది. నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అప్పటి వాతావరణాన్ని చిత్రించిన అద్భుత నవల–'మలుపు తిరిగిన రథ చక్రాలు'. ఈమె రాసిన 'వేమన–నాద సంప్రదాయం' అనేది కొత్త చూపుకి నిదర్శనం.

ఈమె బహుముఖ ప్రజ్ఞాశాలి. అనేక ప్రక్రియల్లో రచనలు చేసారు. చాలా పత్రికలకు వ్యాసాలు రాసారు. ఈమె తన రచనలలో తెలంగాణ భాషలో, తెలంగాణ జీవితాన్ని, రైతుల, సామాన్య జనుల

ఛిద్రమైన జీవితాలను చిత్రించింది. సాఫ్ట్ వేర్ రంగపు జీవితాలను, సన్నగిల్లుతున్న మానవ జీవితాలను, కుటుంబ వ్యవస్థలను, ప్రపంచీకరణం, వ్యాపారీకరణం, మార్కెట్ వాదం కళ్ళకు కట్టేటట్లు తన రచనల్లో వర్ణించింది. తెలంగాణ సాయుధ పోరాటాన్ని, చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలంగాణ సాహిత్య చరిత్రను వెలువరించడంలో మహిళగా ఈమె అగ్రస్థానంలో ఉంది. రస చర్చ– ఆధునికతలో సుజాతారెడ్డి 'రస సిద్ధాంతాన్ని' నవలకు కూడా వర్తింపజేయచ్చునని ప్రతిపాదించింది.

**విశేషాలు:**

ఈమె కుటుంబం ఈమె చిన్న వయసులో ఉండగా, కమ్యూనిస్టు పోరాట ఉద్యమ ప్రభావం వలన వీరి కుటుంబం ఆంధ్రాప్రాంతానికి వలస వెళ్ళింది. కొన్నాళ్ళు గుంటూరు జిల్లా అద్దంకిలోనూ, ఆ తర్వాత నరసరావుపేటలోనూ ఈమె కుటుంబం నివసించింది." (ముసురు–ముదిగంటి సుజాతారెడ్డి ఆత్మకథ)–జంపాల చౌదరి.

తెలంగాణ విమోచనం జరిగి, కమ్యూనిస్టు పోరాటం ఉధృతం తగ్గాక, ఈమె కుటుంబం తమ ప్రాంతానికి తిరిగివచి నల్లగొండలో స్థిరపడింది. సుజాతా 1950లో నల్లగొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నాల్గవ తరగతిలో చేరింది. అప్పుడే 'వెల్లోడి' ప్రభుత్వంలో స్కూళ్ళలో ఉర్దూ బదులు తెలుగు మాధ్యమం వచ్చింది. హెచ్.ఎస్.సి. (పదవ తరగతి) పాస్ అయ్యాక అతికష్టం మీద కాలేజీలో చేరడానికి ఇంట్లో అంగీకరించారు. 1956లో హైదరాబాదులోని రాజబహద్దూరు వెంకట రామారెడ్డి మహిళా కళాశాలలో పి.యు.సి లో చేరింది. అక్కడే రెడ్డి హాస్టల్ లో వసతి. ఇంగ్లీషు మాధ్యమంలోనూ, నగర సంస్కృతితోనూ ఇబ్బందులు ఎదుర్కొని పియుసి పూర్తి చేసింది. బి.ఎ. మొదటి సంవత్సరంలో గోపాల్‌రెడ్డితో వివాహమైంది. ఈ దంపతులకు వాసవిక, ఉదయన అనే పిల్లలు ఉన్నారు.

పెళ్ళైన తర్వాత సుజాతాగారు ఉస్మానియా యూనివర్సిటీలో ఉమెన్స్ కాలేజీలో బి.ఎ. రెండో సంవత్సరంలో చేరింది. అక్కడే ఎం.ఏ పుర్తి చేసింది. నృపతుంగ మల్టిపర్పస్ స్కూల్‌లో తెలుగు టీచర్‌గా పని చేయడం మొదలు పెట్టింది. 1966లో జర్మనీలో ట్యూబింగెన్ విశ్వవిద్యాలయంలో జర్మన్ భాషలో పోస్ట్ గ్రాడ్యుయేషన చేయడానికి భర్త గోపాల్ రెడ్డికి స్కాలర్‌షిప్ వచ్చింది. అతనితోపాటు ఈమె కూడా అక్కడికి వెళ్ళింది. అక్కడ టుబింగన్ విశ్వవిద్యాలయం గ్రంథాలయంలోని ఓరియంటల్ విభాగంలో భారతాధ్యయన గ్రంథాలను 'సబ్జెక్టు క్యాటలాగ్'

చేయడంలో సహకారం అందించింది. అప్పుడు సేకరించిన సమాచారంతోనే 'సంస్కృత సాహిత్య చరిత్రను రాసింది. 1969లో జర్మనీ నుంచి తిరిగివచ్చాక కొన్నాళ్ళు మేక్స్ ముల్లర్ భవనంలో లైబ్రేరియన్‌గా పని చేసింది. తాను పియుసి చదువుకున్న కాలేజీలో పార్ట్ టైం లెక్చరర్‌గా ఉద్యోగం వస్తే, ఉపాధ్యాయ వృత్తిమీద ఆసక్తితో జీతం తక్కువైనా చేరింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 'మను, వసు చరిత్రల తులనాత్మక పరిశీలనం' అనే సిద్ధాంత వ్యాసానికి 1976లో పి.హెచ్.డి. పట్టా పొందింది. ఈమె 2000లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యింది. ఈమె భర్త గోపాల్ రెడ్డి ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా పదవీ విరమణ చేశాక కొన్నాళ్ళకు హృదయ సంబంధమైన శస్త్ర చికిత్స కాంప్లికేషన్స్ వల్ల మరణించాడు. ఈమె ప్రామాణికంగా 6 సాహిత్య గ్రంథాలను, 3 నవలలను, 4 కథా సంపుటాలను, 4 సాహిత్య చరిత్ర గ్రంథాలను, 2 యాత్రా కథన రచనల్ని, మానవ సంబంధిత గ్రంథాలను వెలువరించింది. ఈమె తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన సిలబస్ కమిటీలో సలహాదారుగా, పాఠశాల టెక్స్ట్‌బుక్ కమిటీలో సభ్యురాలిగా, తెలంగాణ సారస్వత పరిషత్తులో ఉపాధక్షురాలిగా ఉంటూ సాహిత్య కృషి చేస్తుంది. ఇప్పటికీ ఆమె రచనలపై ఒక పి.హెచ్.డి., రెండు ఎం.ఫిల్. గ్రంథాలు వచ్చాయి. ఇంకా ఎందరో పరిశోధకులు ఆమె కథలు, నవలలపై పరిశోధనలు సాగిస్తున్నారు. (అనుపమ అక్షర కృషీవలురు తెలంగాణ తేజాలు– మన తెలంగాణ retrieved 10 April 2017).

### 3.30. మేరెడ్డి యాదగిరిరెడ్డి

| | |
|---|---|
| జననం: | 1947 జూలై 16న నల్లగొండా తిప్పర్తి మండలంలోని గడ్డికొండారం గ్రామంలో జన్మించారు. |
| తల్లిదండ్రులు: | లక్ష్మీనరసింహారెడ్డి, వెంకటమ్మ |
| వృత్తి: | ఉపాధ్యాయుడు, 2005లో ఉద్యోగ విరమణ చేసాడు |
| రచనలు: | మట్టి కథలు(కథా సంపుటి), కొలిమి కథా సంపుటిలోని కథలు– డ్రాపౌట్, బోరు బిక్కింది, బతుకు, కొలిమి, బి.టి.విత్తనం, సెజ్, తలగోరు కుండ, ప్రమోషన్, విలువలు, హార్వెస్టర్, రుణమాఫీ, వలసలు; |

బొద్దాయి కథా సంపుటిలోని కథలు: బొద్దాయి, చేనుమేసిన కంచె, వీలునామా, విషపు నీళ్ళు, తోలు బొమ్మలు, బడి, బంద్, డయల్ యువర్..., భూమి పుత్రుడు, రైతుయాత్ర, మాయ, తీర్పు, కరువు

మొత్తంగా ముద్రిత కథలు 200, 100 కవితలు ఉంటాయి. అముద్రితాలు కూడా కొన్ని ఉన్నాయి.

అవార్డులు:

అక్కినేని నాగేశ్వరరావు లిటరరీ అవార్డు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు. నల్లగొండ జిల్లాలోని యువ రచయితలందరినీ ఒక వేదికమీదకి తెచ్చే ప్రయత్నంలో ఏర్పడ్డ 'యువ రచయితల సమితి' వ్యవస్థాపకులు. జిల్లా రచయితల కార్యవర్గ సభ్యులైన యాదగిరిరెడ్డిగారు విరామమెరుగని రచయిత. ఎందరికో ప్రోత్సాహకుడు. యువ ఆంధ్రజ్యోతి, ప్రజామత, వేకువ, ప్రతిధ్వని, విశ్వసాహితి, కృష్ణా, దర్పణం మొదలైన పత్రికల్లో వీరివి శతాధిక రచనలు ముద్రింపబడి ప్రశంసాపాత్రమైయ్యాయి.

దర్పణం' కథా సంపుటిలో చోటుచేసుకొన్న వీరి 'చావుకోసం' అనే కథ 1970లో అక్కినేని నాగేశ్వరరావుగారి లిటరరీ అవార్డు పొంది గోల్డ్ మెడల్ సంపాదించింది.

ఆలోచన ప్రభోధాత్మకంగా ఉండే వీరి రచనలపై శ్రీశ్రీ, కొడవటిగంటి రావిశాస్త్రి వంటి సాహితీవేత్తల ప్రభావం ఉంది. వృత్తి అధ్యాపకత్వమైనా ప్రవృత్తిమాత్రం రచనా వ్యాసాంగంగా జీవితాన్ని నడిపిస్తున్న శ్రీ యాదగిరిరెడ్డి చైతన్యంగల రచయిత.

నల్లగొండ జిల్లా రచయితల మూడవ మహాసభల నిర్వహణ కమిటిలో ఉపాధ్యక్షుడిగా ఉండి, కృషి చేసి సభలను ఫలవంతమొనర్చిన రెడ్డిగారు ఈ సభల విశేష సంచిక–1983 ముందు 'అభ్యుదయం' శీర్షికన ఒక వచన రచన కవితను రాసి సంఘంలోని స్థితిగతులను బాగా వివరించారు.

ప్రముఖ సంఘసేవకురాలు దుర్గాబాయిదేశ్‌ముఖ్ గారితో కలిసి 'రైతువాచకం' వయోజన విద్యా వాచక రచనలో పాల్గొనడం. దాని కొనసాగింపుగా ఆంధ్ర మహిళాసభ హైదరాబాదు (యస్.ఆర్.సి) వారు నూతన అక్షరాస్యుల కొరకు పది పుస్తకాలను ప్రచురించారు.

2004 సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున న్యూఢిల్లీలో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాంగారి చేతులమీదుగా 'జాతీయ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం మరుపురాని సంఘటన.

'బొంద్రాయి కథా సంపుటిలో సంఘం కథలు, రైతులకు, వ్యవసాయానికి సంబంధించిన కథలు ఉన్నాయి. ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందిన అనంతరం అటు వ్యవసాయం, ఇటు సాహితీ వ్యవసాయం కొనసాగిస్తున్నారు. అందుకే వ్యవసాయంలో వచ్చిన మార్పులు, ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన ఆటుపోట్లు, అప్పుల ఊబిలో ఇరుక్కొని ఆత్మహత్యలవైపు పరుగులు తీస్తున్న రైతులు, వారి కథా వస్తువులు. ఆయన జీవితం ఉపాధ్యాయునిగా, రైతుగా గ్రామీణ జీవితంతో ముడిపడి ఉన్నందున అవే అతని కథా వస్తువులయ్యాయి.

### 3.31. మోహన్ రుషి

జననం: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జన్మించారు.

తల్లిదండ్రులు: రాజమల్లమ్మ, భావనా రుషి

విద్యార్హతలు: ఎం.ఏ, ఇంగ్లీష్ లిటరేచర్, బి.ఇడి. పూర్తిచేసాడు

వృత్తి: హైదరాబాదులో ఒక యాడ్ ఏజెన్సీలో కాపీ రైటర్‌గా పనిచేస్తున్నారు.

అవార్డులు: రొట్టమాకురేవు కవిత్వ అవార్డు

రచనలు: కథలు: థర్డ్ డిగ్రీ–2014, జీరో డిగ్రీ–2014(కవితా సంపుటి) 90 కవితలున్నాయి. దిమాగ్ ఖరాబ్–2017(విమర్శకులు దీన్ని అధిక్షేప్త కవిత్వం అని పిలిచేవారు).

తొలి కథ 'థర్డ్ డిగ్రీ'తో ప్రారంభించి, గత ఇరవై ఏండ్లుగా రాస్తున్న సాహిత్యాన్ని జీరో డిగ్రీగా పుస్తకంగా తీసుకొచ్చాడు. ఈ పుస్తకం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అస్తిత్వవాద కవిత్వాన్ని గౌరవిస్తారు. తెలంగాణ ఉద్యమకాలంలో కొంత అస్తిత్వవాద కవిత్వం రాసారు. ఈయన 2001 నుంచి ఉదృతంగా కవిత్వం రాస్తున్నారు. రవితేజ నటించిన 'మనసిచ్చా' సినిమాలో ఒక పాట రాసారు. నాజర్, రేవతి, సోనాలి, కులకర్ణి నటించిన 'ఎల్లమ్మ' చిత్రానికి ఒక సంభాషణ రచయితగా ఉంటూ, అందులో ఒక పాట కూడా రాసారు. సరైన బ్రేక్ త్రూ లేకపోవడంతో 2001లో ఈటీవీ2లో చేరాడు. పేస్ బుక్‌లో 'కవి సంగమం' వేదిక అతనికి మంచి స్ఫూర్తినిచ్చాయి.

### 3.32. యెన్నం ప్రభాకర్

జననం: 1971 డిసెంబర్ 14న నల్లగొండ జిల్లా తుంగతుర్తి మండలంలోని 'గుమ్మడవల్లి'లో జన్మించారు.

తల్లిదండ్రులు: అనసూర్య, వెంకటేశం

విద్యార్హతలు: హైస్కూలు స్థాయి విద్యవరకూ మద్దిరాలలోనూ, కళాశాల విద్య సూర్యాపేటలోనూ, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో బి.ఇ. (మైనింగ్ ఇంజనీరింగ్ గోల్డ్‌మెడల్) పూర్తయింది.

ఉద్యోగం: మూడేళ్ళు సింగరేణి కాలరీస్ బెల్లంపల్లి ఏరియాలో అసిస్టెంట్ ఇంజనీరుగా ఉద్యోగ నిర్వహణ. కానీ ఇంకా ఏదో చదవాలి, ఏదో చేయాలన్న తపనతో సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావటం–పాండిచ్చేరి, విశాఖపట్నం, నెల్లూరు, హైదరాబాదు, ముంబయిలలో పనిచేసి, ప్రస్తుతం హైదరాబాద్‌లో డైరెక్టర్, పోస్టల్ సర్వీసెస్‌గా ఉద్యోగ బాధ్యతల నిర్వహణ, చదవాలన్న జిజ్ఞాసతో ఉద్యోగం చేస్తూనే ఎం.బి.ఏ. (మార్కెటింగ్), పి.జి. డిప్లొమా ఇన్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, పి.జి. డిప్లొమా ఇన్ ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్, డిప్లోమా ఇన్ క్రియేటివ్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్, సర్టిఫికేట్ కోర్స్ ఇన్ కంప్యూటర్స్‌లతోపాటు, మేనేజ్‌మెంట్‌లో పి.హెచ్.డి. సాధించాడు.

అలవాట్లు: చిన్నప్పటినుంచి పుస్తకాలు చదవటం–మహాభారతం, భాగవతం, చందమామ, వారపత్రికలు లాంటివి చదవటంతో సాహిత్యంపైన ఎనలేని ఇష్టం ఏర్పడింది.

సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష కోసం తెలుగు సాహిత్యం తీసుకోవడంతో తెలుగు భాష, సాహిత్యాలపైన కొంత అధికారం ఏర్పడింది. మూడు సాహిత్య పుస్తకాలు, ఒక పరిశోధన గ్రంథం ముద్రితమయ్యాయి.

ఎన్నో కథలకు, కవితలకు బహుమతులు, పురస్కారాలు వచ్చాయి. రంజని–కుందుర్తి రాష్ట్రస్థాయి అవార్డుతోపాటు మ్దు గురుమూర్తి స్మారక పురస్కారం, నెలవంక–నెమలీక కలహంస

సాహిత్య పురస్కారం, శిలపరశెట్టి రాములునాయుడు స్మారక సాహిత్య పురస్కారం, డా.నోముల సత్యనారాయణ కథా పురస్కారం, వివిధ పత్రికలు పెట్టినటువంటి పోటీల్లో బహుమతులూ వచ్చాయి.

రచనలు: రేషన్ కార్డు–2002, తరిమేసి ఉరూ–2002, వలస పక్షులు–2002, ఊరు కాలింది–2002, ఎదురీత సూరీళ్ళు–2002, అమ్మతనం–2002, పాదముద్రలు–2002, ఎండమావి–2002, కరువైన జీవితం–2002, అమ్మమాట–2002, కాలం కన్నెర్ర చేస్తే–2002, మర్రిచెట్టు–2002, పొమ్మని రమ్మంది ఊరు–2002, ఖర్చు–జమ–2002, ప్లాస్టిక్ ఆకులు–2002, టూరింగ్ టాకీసు–2002, మన్సిర్గింది–2002, నిర్ణయం–2003, సైనికులు–2003, సైదులు అండ్ పార్టి–2003, డైరి కాగితం–2003, గ్లోబర్ ఉప్పెన–2003, చిరుగువస్త్రం–2003, గ్లోబల్ నగరం–2003, అమ్మవడిలోకి–2003, స్కైలాబ్–2003, విలీనం–, అర్థభాగం, మరోముఖం, పేర్లు ఒరిగినై, శిలాజాం, పత్రిక. మానాయన కాని నాయన–2010, కొన్ని వెలుగు నీడలు (కథలు) నవచేతన పబ్లిషింగ్ హౌస్ వారు ప్రథమ ముద్రణ జూలై, 2016లో పుస్తకం ముద్రించారు. తదితర కథలు ‘ఎండమావి’ కథల సంపుటిని వెలువరించారు.

కొన్ని వెలుగు నీడల్లోని కథలు: అనాధెవరు, ఉగ్గు గిన్నె, ఏడు రంగులు, క్రిరు చెప్పులు, కొత్తగాలి, గద్ద–కోడిపిల్ల, గురుభ్యోనమః, చెత్తోడు, జంట పావురాలు, జారిపోయిన నేను, అంతరాలు, జీవిత రహస్యం, దాపటెద్దు, ధాత్రి, నిమజ్జనం, నిశ్శబ్ద దోపిడి, నెట్‌వర్క్ ఫెయిల్యూర్, పాలక కుటుంబాలు, పుట్టిన రోజు, ప్రయాణం, మా ఊళ్ళో సుత టవర్ బెట్టింద్రు, ఈయన మా నాయన కాదు, మేన, విధ్వంసం, సంకల్పం, అన్నరాలె, మార్పు, ఆసుపత్రి గాయం, వెలుగు, స్కార్పియో బండి, ఉత్తరం కథ, మట్టి మనిషి.

కవితలు: కర్రు పుట్టింది, నారుమడి (కవితా సంపుటాలు)

### 3.33. రమేష్ హజారి

జననం: 1971 జూన్ 20న నల్లగొండ జిల్లా తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామంలో జన్మించారు. ప్రస్తుతం హైదరాబాదులో నివసిస్తున్నారు.

విద్యార్హతలు: పి.జి. సెంట్రల్ యూనివర్సిటీ సామాజిక శాస్త్రం

వృత్తి: హైదరాబాదులో 'ప్రోగ్రెసివ్ మీడియా సెంటర్' న్యూస్ ఏజెన్సీని నిర్వహిస్తున్నాడు. గోరుకొయ్యలు పేరుతో హైదరాబాదు మిర్రర్ పత్రికలో కాలం రాస్తున్నారు.

రచనలు: కథలు: వాన కురిసిన రాత్రి, మాణిక్యం, కర్తవ్యం, మట్టిబండి

కవితలు: చాయి...చాయమ్మా చాయి, రేపటి కొరకు–నీప్రతి జాడ వేకువ గాలై నాలో ఆశల వూపిరిలూదేది. పాటలు కూడా రాస్తాడు.

### 3.34. వి. మల్లికార్జున్

జననం: 1992 అక్టోబర్ 31న నల్లగొండ జిల్లాలో జన్మించారు.

తల్లిదండ్రులు: ముత్యాలు, మారయ్య

వృత్తి: 'సాక్షి'లో ఉద్యోగం

రచనలు: ఇరానీ కేఫ్–2018, కాగితం పడవలు–2019 (కథా సంపుటాలు); దృశ్యాదృశ్యం–2014, కారు చెప్పిన కథ–2015, తను నేను–2016, పాప్ కార్న్–2017, మొన్నొచ్చిన కల–2017, ఎంతెంత దూరం నుంచో... ఇంతింత దగ్గరకు–2017, ఆ ఒక్క మనిషి–2018, ఉర్సు–2018, ఇరాని కేఫ్–2018, ఆమె ఆకాశం–2018, డ్రాఫ్ట్ బాక్స్–2018, అర్బనూరు–2018 మొదలైన కథలు రాసారు.

### 3.35. వేణు సంకోజు

జననం: 1951 జనవరి 1న వేణు సంకోజుగా ప్రాచుర్యం పొందిన సంకోజు యాదగిరి జిల్లాలోని చండూరు గ్రామంలో జన్మించారు.

తల్లిదండ్రులు: శాంభవి, వీరబ్రహ్మం

విద్యార్హతలు: ఎం.ఫిల్, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం( తెలుగు నవలల్లో చిత్రితమైన రాజ్యం-రాజ్యాంగ యంత్రం అనే అంశం), ఎం.ఏ (రాజనీతి శాస్త్రం),ఎం.ఫిల్,పిజిడిసిఎ,పిజిడిజే.

ఉద్యోగం: జూనియర్ లెక్చరర్‌గా, డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసారు. 2008 డిసెంబర్ 31వ తేదీన ఉద్యోగ విరమణ చేసారు. ప్రస్తుతం నల్లగొండలో ఉంటున్నారు.

రచనలు: కథలు: మొరం-2003, కేసు-2007, ఫంక్షన్-2006, తడి, తడి-2005, సోమనాథోపాఖ్యానం-2005, అమ్మవాసన-2010 స్పర్శ-2004(కథా సంపుటి)

కవితలు: మనిషిగా పూచేమట్టి, మనం, నేలకల, ప్రాణప్రదమైన మొదలైన కవితా సంపుటాలను అందించారు.

సుద్దాల హన్మంతు జీవిత చరిత్ర, పీఠికలు

చలనం, వీర తెలంగాణ, ప్రజల పక్షాన ప్రతిజ్ఞ (శ్రీశ్రీ శతజయంతి సంచిక)- వీటికి సంపాదకత్వం వహించారు.

కాళోజీ ఉత్సవ్ (కాళోజీ శతజయంతి సందర్భంగా), మరో కొత్తవంతెన ఏక్ ఔర్ నయాపూర్ (ఆధునిక తెలుగు ఉర్దూ సాహిత్యాల్లో తొలి ద్విభాషా కవితా సంకలనం), మంజర్ మెహదీ ఉర్దూ కవితలకు తెలుగు అనువాదం మొదలైనవి.

సుప్రసిద్ధ కవితాపంక్తులు:

సముద్రమై పొంగిపొరలుతూనే నేను దాహంలో ఉన్నాను. దుఃఖాన్ని తాగుతాను కనుకనే, నిలిచి గెలుస్తూ ఉన్నాను (అన్వేషణ), నిశ్శబ్దమొక్క శక్తివంతమైన శాతఘ్ని, చల్లారని నిప్పు-ఒక బతుకు శావస(బతుకు శ్వాస)

నిర్వహించిన సంస్థలు:

1985లో జయమిత్ర సాహితీ సంస్థను స్థాపించి అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 100 పుస్తకాలను ప్రచురించడమే కాకుండా 150 పుస్తకాలను ఆవిష్కరించారు. శ్రీశ్రీ, కాళోజీల

శతజయంతి సందర్భంగా నల్లగొండలో నెలనెలా సాహిత్య కార్యక్రమాలను నిర్వహించి వారికి ఘన నివాళి అర్పించారు. 2001లో తెలంగాణా రచయితల వేదికను స్థాపించి నందిని సిధారెడ్డి, ఆయన అధ్యక్ష, కార్యదర్శులుగా ఆరేండ్లు పనిచేసి తెలంగాణ అస్తిత్వంకోసం ఎన్నో సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో పొలిటికల్ జేఏసీ జిల్లా అధికార ప్రతినిధిగా ఉంటూ జిల్లా ప్రజలను ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో కీలకపాత్ర పోషించారు.

పురస్కారాలు:

మనం కవితా సంకలనానికి 2002లో తెలుగు యూనివర్సిటీ పురస్కారం, సాహిత్య గౌతమి కరీంనగర్ వారిచేత పురస్కారం, పలు సాహిత్య సంస్థలచేత జీవన సాఫల్య పురస్కారం మొదలైనవి అందుకున్నారు. ఆయన కథలపై పచ్చిమట్ల రాజశేఖర్ హైదరాబాదు విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి ఎం.ఫిల్ పట్టా పొందారు. ఆయన సమగ్ర రచనలపై ద్రవిడ విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి చేస్తున్నారు.

### 3.36. వేముల ఎల్లయ్య

| | |
|---|---|
| జననం: | 1973 జూలై 6న వరంగల్ జిల్లా జనగామా తాలుకాలో జన్మించారు. |
| ప్రస్తుత నివాసం: | నల్లగొండ |
| విద్యార్హతలు: | ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'గోసంగుల జీవిత చరిత్ర 'అనే అంశంపై పరిశోధన (పి.హెచ్.డి.) చేస్తున్నారు. |
| వృత్తి: | రచయిత, కవి |
| రచనలు: | కక్క, సిద్ధి నవలలు, తిరుగుబాటు కవిత్వం, అవిటి కథలు సంకలనం, కుష్టాది కిష్టయ్య కథ, ముల్కి కవిత్వం |

వేముల ఎల్లయ్య తన మాదిగ జాతికి సమాజంలో జరుగుతున్నటువంటి అన్యాయాలు, అవమానాలు, హీనంగా అవమానింపబడుతున్న స్థితిని, మాదిగ సంస్కృతి, ఆచార వ్యవహారాలను తన కక్క నవలలో తెలంగాణ మాండలికంలో సాధారణ ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాడు. ఎల్లయ్య దండోరా ఉద్యమంలో కీలకంగా పనిచేస్తూ మరొకవైపు తనదైన శైలిలో విమర్శనాత్మకమైన

నవల, కవిత్వం, కవితలు, సాహిత్యం, కథలు రాస్తూ, తెలుగు సాహిత్యం, దళిత సాహిత్యాల్లో చర్చ మొదలుపెడుతూ, దళితుల సాహిత్యం, మాదిగల సాహిత్యంలో తమదైన శైలిలో రాయాలని చాలామందిని ప్రోత్సహిస్తూ తెలుగు సాహిత్యరంగంలో ముందుంటున్నారు. అంతేగాక ఇతను తిరుగుబాటు సాహిత్యాన్ని కూడా తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారు. దానితోపాటు మాదిగ జీవితాన్ని అవపోసన పట్టిన ఎల్లయ్య మాదిగ జాతి యొక్క భాష, సంస్కృతి, చరిత్రలపై కూడ నిరంతరం కృషి చేస్తున్నారు. సాహిత్య సభలు, సాహిత్య సమీక్షలు, సాహిత్య పత్రికలతో మాదిగ సమాజాన్ని తనదైన శైలిలో చైతన్యపరుస్తున్నాడు. ఈరోజు కక్క నవల ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన యూనివర్సిటీలో పరిశోధన పత్రంగా గుర్తించబడింది. 'వేముల ఎల్లయ్య 'కక్క' నవల: భాషా వైవిధ్యం'–2012 అనే పరిశోధాంశంతో హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో మంత్రి మల్లేశ్ ఎం.ఫిల్. పరిశోధన వ్యాసాన్ని సమర్పించాడు. కొన్ని యూనివర్సిటీల్లో కక్క నవలను పాఠ్యాంశంగా కూడా బోధిస్తున్నారు. మాదిగ జాతి యొక్క ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాడు. చెప్పులు కుట్టిన చేతులే చరిత్రను తిరగరాస్తాయి అనడానికి వేముల ఎల్లయ్య నిదర్శనం.

### 3.37. శిరంశెట్టి కాంతారావు

| | |
|---|---|
| జననం: | 1958 జూలై 25న నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలంలోని ఫణిగిరి గ్రామంలో జన్మించారు. |
| తల్లిదండ్రులు: | శిరంశెట్టి పిచ్చమ్మ, అనంతయ్య |
| భార్య: | అనసూయ |
| విద్యార్హతలు: | ఎస్.ఎస్.సి.–1975 |
| వృత్తి: | యన్.యం.డి.సి. లిమిటెడ్‌లో దాదాపు ముప్పైఏడు సంవత్సరాలు ఉద్యోగం చేసారు. 2018లో పదవీ విరమణ చేసారు. |
| రచనలు: | కథలు: కంచి మేకలు, మట్టితాళ్ళ వల, ఊత కర్రలు, జంగ్, చొరబాటు, మా ఫణిగిరి గుట్ట కథలు మొదలైనవి కథా సంపుటాలు. నవలలు: ఆకుపచ విధ్వంసం, వ్యూహం, పూలకుండీలు, వాళ్ళు గెలవాలి, పరంపర మొదలైనవి. |

రచయితగా కాంతారావుకున్న బలం జీవితాన్ని దగ్గరగా ప్రత్యక్షంగా చూసి అనుభవించి అర్థం చేసుకున్న తీరు. రచయితలకు ఈ జీవితానుభవమే ప్రధానం. వస్తురీత్యా రచయితను అగ్రశ్రేణిలో

నిలబెట్టేది 'జీవితానుభవం' దీనిని కథగా మలచడంలో రచయిత ఎన్నుకునే శైలీ, శిల్పాలు ఆ కథను మరింత మెరుగుపెడతాయి. కథకు ప్రధానమైన లక్షనమైన 'కథ మాత్రమే చెప్పాలి. కథ తప్ప మరేమీ చెప్పకూడదు' అన్న సూత్రాన్ని కాంతారావు అక్షరాలలో పాటించారు. కథను సాకుగా తీసుకుని ఇతరేతర విషయాలు, తనకు తెలిసిన, తను చెప్పదల్చుకున్న విషయాలు చెప్పకుండా నిగ్రహం పాటించారు. పాత్ర వృత్తిని ప్రవృత్తిని చాలా వాస్తవికంగా వర్ణించారు. పాఠకులను ప్రమాదపెట్టలేదు. భాష విషయంలోనూ రచయితను అభినందించాలి. మాండలికాన్ని పాత్రలకు వాడుతూ, అన్ని ప్రాంతాలవారికి తేలికగా ఉండే భాషలో కథ నడుపుతూ మంచి వ్యూహాన్నే ఎంచుకున్నారు.

### 3.38. షాజహానా:

| | |
|---|---|
| జననం: | 1974 జూన్ 14న ఖమ్మం జిల్లా కమలాపురం గ్రామంలో జన్మించారు. మెట్టినిల్లు నల్లగొండ-స్కైబాబగారి భార్య. |
| తల్లిదండ్రులు: | యాకూబ్‌బీ, దిలావర్ |
| విద్యార్హతలు: | ఎం.ఏ తెలుగు, పిహెచ్.డి-'తెలుగులో ముస్లింవాద సాహిత్యం'పై పరిశోధన. |
| రచనలు: | కథలు: సిల్ సిలా-1999, బిల్లి, కంచెకాకర, వతన్(కథా సంకలనం స్కైబాబతో కలిసి), లద్దాఫ్ని-కథా సంపుటి<br>కవితలు: నఖాబ్-ముస్లిం స్త్రీ కవిత్వం, చాంద్ తార-2009(మినీ కవిత్వం స్కైబాబతో కలిసి), దర్జీ-2012, అలావా-స్కైబాబతో |
| పురస్కారాలు: | రంగవల్లి మెమోరియల్ కథా అవార్డు, సంస్కృతి పురస్కారం, రంగనేని ఎల్లమ్మ అవార్డు అందుకుంది.<br>భారత ప్రభుత్వం తరపున గౌరవ అధితిగా ఫ్రాంక్ ఫర్ట్ బుక్ ఫేర్ (జర్మనీ) కి వెళ్ళింది. మా స్కో బుక్ ఫేర్ (రష్యా లో కవితా పఠనం గావించింది. |

షాజహాన సమకాలీన తెలుగు ముస్లింవాదకవయిత్రిగా ప్రసిద్ధురాలు. ఈమె మార్చి 2017లో తెలంగాణ ప్రభుత్వం నుండి తెలంగాణ రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారం అందుకుంది.

అస్మిత, షాహీన్ లాంటి స్వచ్ఛంద సంస్థల్లో పనివేసిన షాజహానా అన్వేషి సంస్థ నుంచి దూదేకుల స్త్రీలమీద ప్రాజెక్టు చేసారు. వెనకబడ్డ ముస్లిం బతుకులను దగ్గరినుండి చూసిన ఈమె, ఆ మహిళల బతుకును తన కవిత్వం రూపంలో రాసారు. కోఠీ ఉమెన్స్ కాలేజీలో ఎం.ఏ చదివి రాజమండ్రి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య ఎండ్లూరి సుధాకర్ పర్యవేక్షణలో ఎం.ఫిల్ చేసి గోల్డ్ మెడల్ సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ పర్యవేక్షణలో తెలుగులో ముస్లింవాద సాహిత్యంపై పీహెచ్.డీ చేసారు. షాజాహానా కవిత్వం ఇంగ్లీష్, హిందీ, జర్మనీ, భాషల్లోకి అనువదించబడింది. నఖాబ్ కవిత్వం కూడా రాసారు. దేశవ్యాప్తంగా జరిగిన వందల కవి సమ్మేళనాల్లో పాల్గొని కవితా పఠనం చేసారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు కూడా షాజహానాను వరించాయి.

### 3.39. సుజాత సూరేపల్లి

| | |
|---|---|
| జననం: | 1970లో నల్లగొండ జిల్లాలో జన్మించారు |
| తల్లిదండ్రులు: | సూరేపల్లి వరలక్ష్మి –కృష్ణయ్య |
| విద్యార్హతలు: | ఎం.ఏ, సోషియాలజీ, బీఈడి. |
| వృత్తి: | ప్రొఫెసర్, శాతవాహన విశ్వవిద్యాలయం, ప్రవృత్తి: సామాజిక ఉద్యమకారిణి, రచయిత |
| రచనలు: | తెగిపడ్డ పల్లెలు కథ, వ్యాసాలు: తెలంగాణ ఉద్యమ వ్యాసాలు, ఇసుకచక్ర బండిలో తెలంగాణ, తెలంగాణ లాంగ్ మార్చ్, ఇంకెన్నాళ్ళీ చిక్కుముడులు–నాలుగు సంపుటాలుగా ప్రచురించారు. |

పోలేపల్లి సెజ్‌ల వ్యతిరేక ఉద్యమం అనుభవాలతో వ్యాసాలు, ఆంగ్లంలో 'పోలెపల్లి సెజ్ ఉద్యమం' ప్రచురించారు. 'తెలంగాణలో దళితుల జీవనోపాధి' అంశంపై సంపుటి ప్రచురించారు. సూరేపల్లి సుజాత...విద్యావేత్తగా, ఉద్యమకారిణిగా... జీవితమే పోరాటంగా, పోరాటమే జీవితంగా

బతుకుతుంది. సంప్రదాయంగా పెరిగినా...చదువు నమ్మకం కలిగించింది. ఉద్యోగం భరోసానిచ్చింది. చదివిన చదువును సమాజానికి అన్వయించింది. ఉద్యమం అంటేనే త్యాగం. పాతుకుపోయిన వ్యవస్థలను దిక్కరించడం ఆ క్రమంలో తనదైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటూనే నవ సమాజ నిర్మాణంలో పాలుపంచుకుంటోంది. తెలంగాణ ఉద్యమం, పోలేపల్లి భూపోరాటం నుంచి నేటి దళిత ఉద్యమాల వరకు ఆమెలేని పోరాటం లేదు. యూనివర్సిటీని సైతం ఉద్యమ క్షేత్రంగానే భావించి పనిచేస్తుంది.

### 3.40. స్కైబాబ

| | |
|---|---|
| జననం: | నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం కేశరాజుపల్లి గ్రామంలో 1972, ఆగస్టు 4న జన్మించాడు. ప్రస్తుత నివాసం హైదరాబాదు |
| అసలు పేరు: | షేక్ యూసుఫ్ బాబ |
| కలం: | స్కైబాబ |
| వృత్తి: | పాత్రికేయుడు, ప్రవృత్తి: కవి, కథకుడు |
| భార్య: | షాజహానా |
| మామ: | దిలావర్, ఇతడు ప్రముఖ రచయిత |
| రచనలు: | కథలు: వతన్, రంది, జగ్‌నేకీ రాత్, ఏక్ కహానీకే తీన్ రంగ్, అధూరె, బేగూరె, అలాయి బలాయి, తన్లాట మొదలైనవి కథా సంపుటాలు. లోహం కథా సంకలనం.<br>కవితలు: జల్‌జలా, అజా(కవితా సంకలనం)–అన్వర్‌తో కలిసి, అలావా (కవితా సంకలనం)–షాజహానాతో కలిసి, చాంద్ తారా (మినీ కవితా సంకలనం), జగ్ నే కీ రాత్ (ముస్లీం కవిత్వం)<br>నవల: ఆపా (ముస్లిం స్త్రీల నవల)<br>వ్యాసాలు: జాగో (వ్యాస సంపుటి) (ముస్లిం సాహిత్య వ్యాసాలు)<br>తెలంగాణ సాహిత్యం:– పత్రిక: ముల్కి (వేముల ఎల్లయ్యతో కలిసి రెండు సంచికలు తీసుకువచ్చారు. |

పురస్కారాలు:		అధూరె-కథల సంపుటికి సాహితీ పురస్కారం వచ్చింది.

మొదటి కథ 'ఛోటీ బహెన్'-2000లో ఆదివారం ఆంధ్రజ్యోతిలో అచ్చైంది. అధూరె, 'ఏక్ కహానీ కె తీన్ రంగ్' కథా సంపుటాలు వెలువరించాడు. 'లోహం' కథ వేసాడు. 'అలాయిబలాయి' బహుజన కథలు, బేచారె భగ్నప్రేమ కథా సంపుటాలు వెలువరించాడు. 38 కథలు రాసాడు. 39మంది ముస్లింల కథలతో 'వతన్' సంకలనాన్ని తన సంపాదకత్వంలో వెలువరించారు.

తెలుగు సాహిత్యంలో ముస్లిం, తెలంగాణ వాదాల్లో కృషి చేసారు. 'జల్‌జలా', 'ముల్కి', 'అజా', 'అలావా' సంకలనాలకు సంపాదకత్వం వహించారు. 'జగ్‌నే కీ రాత్', 'చాంద్ తార', కవితా సంపుటాలు వెలువరించారు. 'నసల్' కితాబ్ ఘర్ ప్రచురణలుగా పై పుస్తకాలతోపాటు 'నఖాబ్', 'పాచికలు', దర్జీ', 'ఈ కిటికీ తెరుచుకునేది ఊహల్లోకే' తీసుకొచ్చారు. ముస్లిం సాహిత్యోద్యమ వ్యాసాల సంకలనం 'జాగో', ఒక నవల 'ఆపా' రావలసి ఉంది. 'చమన్' ముస్లిం సామాజిక పత్రిక తెచ్చారు.

తెలంగాణ ఉద్యమంలో భాగంగా 'జాగో...జగావో', క్విట్ తెలంగాణా' 'దిమ్మిస' కవితా సంకలనాలు తీసుకువచ్చారు. 'రజ్మియా' పేరుతో ఖుతుబ్ సర్‌షార్‌తో కలిసి ఉర్దూ, తెలుగు ముస్లిం తెలంగాణ కవితా సంకలనం తీసుకువచ్చారు. 'జఖ్మీ ఆవాజ్' పేర తెలంగాణ సొంత కవితలు, వ్యాసాలు వేసారు. తెలంగాణ బహుజన కథా కచ్చీరు రెండు సమావేశాలు (రెండవది జోడేఘాట్‌లో) నిర్వహించడంలో ప్రధాన భూమిక పోషించారు. తెలంగాణ సాహిత్య పత్రిక 'ముల్కి' రెండేసి సంచికలు తీసుకొచ్చారు. 'సింగిడి' తెలంగాణ పత్రిక రెండు సంచికలకు సహ సంపాదకత్వం వహించారు. 'హర్యాలి' ప్రధాన కార్యదర్శిగా, 'సింగిడి' కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. ఆరేళ్ళు ఆంధ్రజ్యోతి సాహిత్య పేజీ 'వివిధ చూశారు. తెలంగాణకు వ్యతిరేకంగా తయారవడం, ఆర్ ఎస్ ఎస్ పత్రికగా పరిణామం చెందుతూ ఉండటంతో ఆ విషయం ప్రకటిస్తూ ఆంధ్రజ్యోతికి రాజీనామా చేసారు. ఈ మధ్యే హైదరాబాదు విశ్వవిద్యాలయంలో 'స్కైబాబ రచనలు-ఆవిష్కరణ'పై రెండు రోజులపాటు సెమినార్ జరిగింది. 'అధూరె' కథలను 'వెజిటేరియన్స్ ఓన్లీ' స్టోరీస్ ఆఫ్ తెలుగు పేర ఓరియంట్ బ్లాక్ స్వాన్ సంస్థ ఇంగ్లీషులో వెలువరించింది.

‘తెలంగాణ వివక్షకు ఇప్పుడు ఎవర్ని నిందించి ప్రయోజనం లేదు. దాన్ని అధిగమించడానికి ఏం చేయాలో ఆలోచించి ‘రోడ్ మ్యాప్’ గీసుకోవాలి. కథకులు సంకలనాలను, కథలను చిక్కగా తేవాల్సిన ఆవశ్యకతను వివరించాలి. కథలను తెలంగాణ భాషలో రాసేటట్టు ప్రోత్సహించాలి. ఒక పేరున్న పత్రికలో కథ వెలువడ్డప్పుడు కథకుడు పొందే గౌరవానికి ప్రత్యామ్నాయంగా అంతే గౌరవం ఏ పత్రికలో ప్రచురించబడ్డా కల్పించగలగాలి. ఈ బాధ్యతను కవులు, రచయితలు కథకులతోపాటు వివిధ సాహిత్య సంఘాలు, తెలంగాణ సాంస్కృతిక శాఖ స్వీకరించాలి.” అని అన్నారు.

*****

# అధ్యాయం-4

# నల్లగొండ జిల్లా కథలు-సామాజికాంశాలు

### 4.1. మానవ సంబంధాలు

మానవ సమాజం నేడు సాంకేతికంగా, వైజ్ఞానికంగా ఎంతో అభివృద్ధి చెందుతూ ఉంది. కాని మానవ విలువలు మాత్రం గతంలో లాగా, దిగజారిపోతున్నాయి. ఇవి ప్రధానంగా మానవ మనుగడకే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదాన్నితెచ్చిపెడుతున్నాయి. మనుషులు మానవ సంబంధాలు మరిచిపోయి, డబ్బుమీద వ్యామోహాన్ని పెంచుకుంటున్నారు. వీరికి నా, తన, పర అనే బేధాలేమి లేకుండా అందరి పట్ల నీచంగా ప్రవర్తించి మానవత్వాన్ని మంటగలుపుతున్నారు. పురుషులు ఒక్క అడుగు ముందుకేసి స్త్రీలను అవమానించి, హత్యాచారం చేసి అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు. యంత్రాలుగా మారి తాము మనుషులం, ఇతర ప్రాణులకంటే బుద్ధిమంతులం అనే ప్రాథమిక అంశాన్ని మరిచిపోతున్నారు.

ప్రకృతి మానవ సమాజంపై మిక్కిలి ప్రభావం చూపుతుంది. "మనిషి తాను జన్మించడంతోనే తనకు తెలియకుండానే ప్రకృతిలో తాను నివసించబోయే సమాజంతో సంబంధాన్ని కలిగి ఉంటున్నాడు. మనిషి ప్రకృతితో, తోటి వ్యక్తితో, తన వ్యక్తిత్వంతో తన సంస్కృతితో క్రమంగా సంబంధంలోకి వస్తున్నాడు." (దక్షిణామూర్తి, పోరంకి. 255). అంటే మానవుని స్వభావంలో మార్పు రావడానికి, సమగ్ర వ్యక్తిత్వంగల మనిషిగా గుర్తింపు తెచ్చుకోవడానికి మన చుట్టూ వున్న పరిసరాలు, సమాజం, సంస్కృతి అన్ని దోహదం చేస్తాయి. నల్లగొండ జిల్లా కథల్లో మానవ సంబంధ కథలను కింది ఉపవిభాగాలుగా విభజించాను. అవి: కుటుంబ సంబంధాలు, స్త్రీ-పురుష సంబంధాలు, భార్యాభర్తల సంబంధాలు, వివాహేతర సంబంధాలు, అక్రమ సంబంధాలు, స్త్రీల గృహ హింస కథలు, ప్రేమ కథలు, విషాద కథలు మొదలైనవి.

#### 4.1.1. కుటుంబ సంబంధాలు

కుటుంబం మానవ జీవితంలో అతి ముఖ్యమైనది. మానవుడు కుటుంబ వ్యవస్థ నుండే సంఘంలోకి అడుగుపెడతాడు. ఆటవిక దశనుండి, ఆహారవేట నుండి, సంచార జీవితం నుండి,

స్థిరనివాసం ఏర్పర్చుకున్న విధానంలో కుటుంబ వ్యవస్థ ప్రారంభమైంది. మానవునికి కుటుంబమే మొదటి అనుబంధంగా ఉంటుంది. అందులోని తల్లిదండ్రుల సంబంధాలు, అక్కాచెల్లెల్ల సంబంధాలు, అన్నదమ్ముల సంబంధాలు, వివాహ సంబంధాలు మొదలైనవన్నీ కుటుంబంతోనే ప్రారంభమవుతాయి. అటువంటి కథలను ఈ విభాగంలో చర్చించాను.

**1.ఆశ**

డబ్బుమీద ఉన్న ప్రేమ కన్న తల్లిదండ్రుల మీద లేదనే కొడుకుల నిరాదరణకు గురవుతున్న వృద్ధుల/వ్యధలకు అర్థం పట్టే కథ. 'ఆశ' కథలో రచయిత దేవులపల్లి కృష్ణమూర్తిగారు చిత్రీకరించారు.

మట్టారెడ్డి కలక్టరేటులో యల్.డి.సిగా టెంపరరీ ఉద్యోగం చేస్తూ తన వ్యవసాయ పనులు చేసుకుంటాడు. కొంత కాలానికి పర్మినెంట్ అయింది. కాని జాబు నచ్చక వూరిలో వున్న పది ఎకరాల భూమి కొని వ్యవసాయం మొదలుపెట్టిండు. అది బాగానే కలిసివచ్చిందని, అందులోనే ఇల్లు కట్టుకొని వుంటూ దాన్ని పెంపుజేసి తోటపెడితే నీళ్ళులేక బావి, తోట ఎండిపోయింది. కలక్టరేటు రోడ్డుకు కట్టడంవల్ల ఏ ఉద్యోగం దొరకలేదు. ఆడపిల్లలకు పెండ్లిజేసి, కొంత కట్నంకింద ఇచ్చాడు. మిగతా భూమిని కొడుకులకు పంచిచ్చి కొంత తను ఉంచుకున్నాడు. కొడుకులు ఇండ్లు కట్టుకొని, మిగతా భూమి ఫ్లాట్లు చేసి అమ్ముకున్నారు. తండ్రి కూడా అమ్మి వచ్చిన డబ్బును బ్యాంకులో వేశాడు.

నల్లగొండలో అడ్వాన్సు ఫైనాన్సు కంపెనీ దాంట్లో పెట్టుబడి పెట్టిదే నూటికి పదిశాతం నెలసరి వడ్డి ఇస్తామని చెప్పడంతో కొడుకులిద్దరు బ్యాంకులో ఉన్న డబ్బుతీసి ఆ ఫైనాన్సు కంపెనీలో పెట్టితే, రెండు మూడు నెల్లు నెలనెల వడ్డీ ఇచ్చి, గెట్టుగెదరు పార్టి ఇచ్చి మట్టారెడ్డి కొడుకులు మంచి సౌండు పార్టి అని తెలుసుకొని వాళ్ళకు గాలం వేయడంతో, అన్నదమ్ములిద్దరు తమ బంధువుల కాడ వడ్డీకి తెచ్చి ఫైనాన్సులో తమ పేరున పెట్టుబడి పెట్టారు. నెలనెల వడ్డీ ఇస్తే వీళ్ళు తెచ్చిన కాడ ఇచ్చారు. నమ్మకం కుదిరింది. ఇది చూసి ఇంకా కొంతమంది వడ్డికి తెచ్చి ఈ ఫైనాన్సులో పెట్టుబడి పెడితే, పెట్టుబడిదార్లు ఎక్కువ అయ్యారు వద్దంటే కూడా వినలేదు. సంవత్సరం తర్వాత ఫైనాన్సు బోర్డు ఎత్తేసిండు. వీళ్ళను ఆ ఫైనాన్సు కంపెనీ యం.డి. మోసం చేసి వెళ్ళిపోతాడు. వడ్డికి ఇచ్చిన వాళ్ళంతా

మా డబ్బులు మాకియ్యమని మట్టారెడ్డి కొడుకుల ఇంటిముందు కూర్చుంటే వారికి ఎటూతోచక తలకాయ పట్టుకొని ఆలోచించగా, తండ్రివద్ద బ్యాంకులో ఉన్న డబ్బు గుర్తువచ్చి, తండ్రికి తను బాధలు చెప్పి బతిమిలాడితే అతడు లొంగకపోయేసరికి పంచాయతికి దిగి, ఆకరికి కొట్టబోతే తల్లి అడ్డమొస్తే ఆమెను నెట్టేవరకు పక్కన ఉన్న రోటిమీద పడి తల నరానికి దెబ్బతగిలి వెంటనే ప్రాణం పోతుంది. చుట్టుపక్కలవాళ్ళు వచ్చి పోలీసులకు తెలిస్తే కేసు అవుతుందని, చచ్చిన మనిషి ఎలాగు తిరిగిరాదు. కాని కొడుకులు అన్యాయమై పోతారని తండ్రికి నచ్చజెప్పి ఆ డబ్బంతా కొడుకులకు ఇప్పించారు. వెంటనే బాకిలోల్లకు కొంత కొంత సర్దుబాటు చేసి ఇంకా డబ్బు కావాలె గదా అని ఆడపిల్లలకు కట్నం ఇచ్చింది చాలక చెల్కలు ఎందుకిచ్చినవని మరల తండ్రిమీద గొడవ చేసి ఇంటినుండి బయటకు ఎల్లగొడితే, పెద్దమనుషులతో చెబితే తండ్రికొడుకుల పంచాయతీ మేమేం చెబుతామంటూ జారుకున్నారు. దానితో ఆడపిల్లలు తండ్రిని తమ ఇంటికి తీసుకుపోయారు. డబ్బుమీద ఆశతో ఆ కొడుకులు అట్లా అయ్యారు. (కృష్ణమూర్తి, దేవులపల్లి. 'ఆశ': 42).

మట్టారెడ్డి కొడుకులు బ్యాంకులో ఉన్న పైసలు తెచ్చి ఫైనాన్సు కంపెనీలో పెట్టుబడి పెడితే ఎక్కువ వడ్డీ వస్తుందని 'ఆశ' పడితే ఆ ఫైనాన్సు వాడు వీళ్ళను మోసం చేస్తే, వీళ్ళు తమ తల్లిదండ్రులను మోసం చేస్తారు. తల్లిదండ్రులకు రక్షణగా, చేదోడువాదోడుగా ఉండాల్సిన కొడుకులు తల్లిని చంపేసి తండ్రిని ఇంటినుండి వెళ్ళగొడతారు. కొడుకులకు లేని ప్రేమను, కూతుళ్ళకు ఉందని, తండ్రిని తీసుకెళ్ళి పోషించే విధానం రచయిత ఈ కథలో చూపించాడు.

**2. కన్నీటి బొట్టు**

అమ్మమ్మ మరణించినప్పుడు ఆమె జ్ఞాపకాలను, ఆమెతో గడిపిన సందర్భాలను గుర్తు చేసుకోవడం, శ్మశానంలో చితికి నిప్పు అంటించే ముందు అతని కండ్ల నుండి ఓ నీటిపొర (చుక్క) సన్నగా వచ్చిన విధానాన్ని రచయిత 'కన్నీటి బొట్టు' కథలో పెండెం జగదీశ్వర్‌గారు వివరించారు. ఈ కథ 'నల్లగొండ కథలు' సంకలనంలోనిది.

రచయిత పెండెం జగదీశ్వర్ అమ్మమ్మ చనిపోతే అతని కండ్ల నుండి చుక్క నీరు కూడా రాలేదు. బంధువులు వచ్చి ఏడుస్తున్నారు. అక్కడ నుండి లేచి వరండాలో కుర్చీలో కూర్చొని ఆమెతో గడిపిన జ్ఞాపకాలు, ఆలోచనలోకి వస్తాయి అతనికి. చిన్నప్పుడు వాళ్ళ అమ్మను ఎప్పుడు గుర్తు పట్టిండో అప్పటినుండి అమ్మమ్మను కూడా అంతే. అమ్మ కంటే ఎక్కువగా అమ్మమ్మ చూసుకునేదని, గోరుముద్దలు తినిపించేదని, వంటకాలు బాగా వండి పెట్టేదని, తనమీద ఎక్కువ ప్రేమ చూపించేదని, ఊళ్ళో ఉన్నప్పుడు వెళ్తే తనని ముద్దాడేదని, ఆమెకోసం ఏమైనా తినుబండారాలు తీసుకెళ్తే తను తినకుండా తనకే తినిపించేదని, చిన్నప్పుడు జ్వరం వస్తే రాత్రి అంజనేయ దండకం చదివి పడుకోబెడితే ఉదయాన్నే తక్కువైందని, ఆమె చనిపోయేనాటికి 90 సంవత్సరాల వయస్సు. నాలుగు నెల్ల క్రితం బాగానే ఉండె. ఆమెకు ఇద్దరు కొడుకులు, ఒకోనెల ఒక్కో కొడుకు దగ్గర ఉండేది. ఉన్నట్టుండి పక్షపాతం వచ్చి ఏ మందులూ పనిచేయని దశలో, ఇతన్ని కల్వరిస్తుందంటే వెళ్ళినప్పుడు అరటిపండు కూడా తినిపించానని, తనతో తొందరగా వెళ్లిపోతే బాగుండునని చెప్పిందని, ఆ తర్వాత నెలలోపే ఆమె కోరిక తీరిందని అనుకుంటుండగా, శవయాత్ర ప్రారంభమైతున్నప్పుడు డప్పు కొట్టడంతో ఆలోచనలో నుంచి బయటకు వస్తాడు. శవాన్ని తీసుకెళ్ళేటప్పుడు అతను కూడా పాడె పట్టి శ్మశానానికి మోసుకెళ్ళిన తర్వాత చితికి నిప్పు అంటించే ముందు అతని మేనమామ బాగా పెద్దగా ఏడ్వడంతో పెద్దమనుషులు ఓదార్చుతున్నప్పుడు అతని హృదయంలో ఏదో కదలిక కదలడంతో కళ్ళలో ఓ సన్నటి నీటి పొర రావడం, శ్మశానం నుండి ఇంటికి నడుస్తూ అమ్మమ్మకోసం ఏమిచేయలేక పోయానన్న అసంతృప్తి అతనిలో గందరగోళాన్ని సృష్టించింది. మట్టిమీద నడిచినంత కాలం ఆలోచించాను, ఆవేదన పడ్డాను అని, ఏవేవో చేసి ఆమె రుణం తీర్చుకోవాలని కలలుగన్నాడు. నిజంగా అతని మనసు నిండా ఆమె ఉండిపోయింది.

ఆధునిక జీవితంలో ఎప్పుడు ఉరుకులు పరుగులు "నా ఉద్యోగం, నా జీవితం, నా జీతం ఉన్న పరిస్థితిని చూసి పొంగిపోయి, ఇంకా ఏదో సాధించాలి. అంతకు మించిన స్థాయిని అందుకోవాలి అదే జీవితానికి పెద్ద లక్ష్యం. ఆ లక్ష్యం కోసం లేచిన దగ్గర్నుంచి పడుకునేవరకు అలుపెరుగని ప్రయత్నం. ఆకరికి నిద్రలో కూడా అవే కలవరింతలు. అవే కలలు ఎల్లప్పుడూ పక్కవాడిని గమనిస్తూ, వాడికంటే ఉన్నత స్థాయికి చేరుకోవాలనే ఆరాటం పోరాటమేనా! సంతృప్తి అనే పదాన్ని మరిచిపోయి

ఎంత కాలమయ్యిందో! మనీ (డబ్బు) సంబంధాలకు తప్ప మానవ సంబంధాలకు మెదడులో చోటివ్వక ఎన్ని క్యాలెండర్లు మారిపోయాయో? ఎంతోకొంత ప్రయోజనం వుంటేనే తప్ప ఎదుటివారితో గడిపెందుకు, కనీసం మాట్లాడేందుకు కూడా సమయమివ్వని 'బిజీ'తనం మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని ఎవరన్న అప్పట్లో అంటే ఖండించేది."(నల్లగొండ కథలు: 517).

ప్రపంచంలో అందరిలాగే అమ్మమ్మ కూడా పుట్టింది, చనిపోయిందని, రచయిత కళ్ళల్లో సన్నటి కన్నీటిధార, ఎన్నెన్నో జ్ఞాపకాలు మిగిలాయి అని గుర్తు చేశాడు.

మనిషి బ్రతికి ఉన్నప్పుడు ఆ విలువేంటో తెలుస్తలేదు. మరణించాక ఏమి తీసుకెళ్తాడు. జీవితంలో ఎంత సంపాదించామా, పక్కవాడిని చూసి వానికంటే ఇంక ఎక్కువగా ఎదగాలి, సంపాదించాలన్నదే తప్ప మానవ సంబంధాలను, బంధాలను, బంధుత్వాలను మరచిపోతున్నామని వాటిని మరిచిపోవద్దని రచయిత ఈ కథలో తెలియజేశాడు.

**3. ఓ సిన్నోని కథ**

ముగ్గురు తల్లుల పిల్లలు నలుగురు అన్నదమ్ములు చిన్నోని తెలివి తక్కువతనాన్ని చూసి పెద్దోల్లు వాని దగ్గర ఎట్లా దోచుకుతింటారో 'ఓ సిన్నోని కథ' ద్వారా తెలుస్తుంది. ఈ కథను రచయిత కంచర్ల సత్యపాల్ రెడ్డి రాసారు. ఈ కథ 'నల్లగొండ కథలు'–రెండవ సంకలనంలోనిది.

ఓ అయ్యకు ముగ్గురు భార్యలు. తీరం–కోస్తాతీరం, సీమ–రాయలసీమ, తెలంగి–తెలంగాణ. పెద్దామెకు ఇద్దరు కొడుకులు. రెండో ఆమెకు ఒక కొడుకు. చిన్నామెకు కూడా ఒక కొడుకు. భర్త మాత్రం చిన్నామె కన్నా ఇద్దరు పెద్ద భార్యలనే మంచిగ చూసెటోడు. చిన్నామెను సరిగ్గా పట్టించుకోకపోతే కొంతకాలం ఓపిక పట్టి కొడుకుతో కలిసి వేరుగా ఉండి, ఒక పెద్ద ఇల్లు కట్టుకున్నారు. చిన్నోని ఇల్లు, చెలక పరాయివాళ్ళు ఆక్రమించుకుంటే, ఎదురుతిరిగి ఊరివాళ్ళ సహాయంతో వాళ్ళను ఎల్లగొట్టి ఇల్లు దక్కించుకొని, తన చెలక దున్నుకుంటూ వ్యవసాయం చేసుకుంటూ స్వతంత్రంగా బతుకుతున్నాడు. చిన్నోని ఇల్లు, చెలకలను చూసి పెద్దోళ్ళకు కన్నుపడింది. అతని ఇంట్లో ఉండటానికి, మనం మనం ఒక్క తండ్రి పిల్లలమని కలిసి ఉందామని రాయబారం

పెట్టిన, ఇష్టంలేకపోతే ఊరిపెద్దని కలిసి మీరు ఎట్లయినా చేసి కలుపురని బతిమిలాడారు. వీళ్ళ మాటలు నమ్మి చిన్నోన్ని పిలిచి నువు చిన్నవానివి ఆల్లకు ఉన్నంత చదువు, తెలివి, బలం, డబ్బులు నీకాడ లేవు ఆల్లతో కలిసి ఉంటే నీకు నీ పిల్లలకు మంచిదని బుజ్జగించి, అంత అనుమానం ఉంటే ఒప్పంద పత్రం రాసుకోరని అన్నాడు. అతని మాటలు కాదనలేకపోయిండు.

చిన్నోని ఇంట్లోనే అందరు ఉండడం, అధికారం గూడా పెద్దోళ్ళదే. తీరపోల్లు, సీమోడు కలిసి చిన్నోని చెలకల సారం, బలం, నీళ్ళు వాళ్ళ పొలాల్లోకి మలుకున్నారు. పెద్ద చదువులు, పెద్ద ఉద్యోగాలు ఆల్ల పిల్లలకే. చిన్నోనికి తెలివి వచ్చేసరికి చాలా ఆలస్యం అయింది. ఇదేంటి అన్నలూ, నాకూ నా పిల్లలకు అన్యాలం జరుగుతున్నది. నా పిల్లలకు చదువులు లేవు. ఉద్యోగాలు లేవు. చెలకలకు నీళ్ళు కూడా సరిగ్గా రావు అని కొట్లాడితే, చిన్నోని పిల్లలు చాలామంది ప్రాణాలు పోయాయి. ఊరి పెద్దలు కలిసి ఇంకో ఒప్పంద పత్రం రాసి ఇచ్చారు. ఎవరి పొలాలు వాళ్ళకే, ఎవరి నీళ్ళు వాళ్ళకే, ఎవరి ఉద్యోగాలు వాళ్ళకే అని. చిన్నోనికి ఇష్టం కాకున్నా పెద్దమనుషుల మాటలకు ఒప్పుకున్నాడు. పెద్దోళ్ళు మాత్రం వంకర బుద్దులు మానుకోలే. పది సంవత్సరాలు గడిసినాయి. దోపిడి ఇంకా పెరిగింది. అట్లయితే పంచాయతీ తెగదని కొట్లాటకు దిగితే పెద్దోళ్ళు అధికారం చేతిలో ఉందని చిన్నోని పిల్లలను కొట్టించారు. అయినా వాళ్ళు ఊరుకోలే పెద్దోళ్ళను వాళ్ళ ఇంటికి వాళ్ళ జాగలకు పోరని, మా బతుకు మేము బతుకుతం. మీ అధికారం మాకు వద్దు. 'ఏదో పాలోడే గద అని ఇసుంట రమ్మంటే ఇల్లంత నాదే నంటున్నరు. సుట్టమై వొచ్చి దయ్యమై పట్టిరు. చీ పోండ్రా అంటే సూరు బట్టుకొనేల్లాడ్తాండ్రు.' మా బతుకులు మేము బతుకుతమంటే అన్నలం పాలోల్లం కలిసి ఉందం అని నాటకాలాడి నక్క ఇనయాలు వొలకబోసి ఆక్రమించుకుంటిరి. మమ్ములను గొరగాకుంట చేస్తిరి. ఇన్ని సంవత్సరాలు తిన్నది చాలు ఇక గోసులు సగబెట్టుకొని వచ్చిన తోవనేపోండ్రి అని ఇక మీ దుకానం బంద్ అని చిన్నోని పిల్లలు ఎగబడ్డారు.

తిన మరిగినోల్లు సిగ్గుశెరం లేనివాళ్ళు అంత అలకగా పోతారా... పోతే ఊరి పెద్దలు ఒక పంచాయతీ కమిటి వేసినరు. కమిటోల్లు సంవత్సరం ఎలా తిరిగి ఓ కాగితం తయారు చేసి, ఏరుపడడం మంచిది కాదు ఏరుపడితే చిన్నోడు ఆగమైతడని, కలిసి ఉండాలని రాసి ఇచ్చారు. కథ

మల్ల మొదటికొచ్చింది. పంచాయతీ కమిటి మాటలు ఒప్పుకోలేదు. కలిసి ఉండె ముచ్చటేలేదని చిన్నోడు, ఆని పిల్లలు లొల్లిపెట్టారు. కొన్ని ఆగు(రని నిర్ణయం చేస్తం అని పెద్దలు. నాస్త నాస్త అని నా ఇల్లు ముంచితివి. కూడి ఎప్పుడు ఉంటావురా అన్నట్లు ఎన్ని ఒప్పందాలు పాయె, ఎన్ని కమిటీలు పాయె, ఏరుపడే ఒకటిపాయె, పెద్దవాళ్ళ ఒప్పందం పాయె, ఆరు సూత్రాలు పాయె, ఆరుపది పాయె, పంచాయతీ కమిటి చెత్తకాగితం పాయె. ఇక ఇప్పుడు పంచుడు చేస్తరో ఏమో ఈ ఊరి పెద్దలు. పరాయివోన్ని అయితే కొట్లాడి ఎల్లగొట్టినం. పాలోన్ని ఎల్లగొట్టేందుకు ఎన్ని ప్రాణాలు పోవాలే! వాల్లకేమో ఒకనికి పైసలున్నయి. టక్కరి బుద్దులున్నై. పైసలతోని మనుషులను కొంటున్నరు. ఊరి పెద్దలు గూడా అమ్ముడు బోతారా? చిన్నోనికి ఏమో పెద్దలమీద నమ్మకం ఉన్నదా? తప్పకుండా తనకు తన పిల్లలకు న్యాయం జరుగుతుందని ఆశతోని ఎదురుచూస్తున్నాడు. నిజాయితీ ఉన్నోనికి న్యాయం జరుగుతుందన్న ఆశ అదే ధైర్యం.

ఈ కథ కోస్తా తీరం, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలతో ముడిపడిన కథ. తీరపోల్లు, సీమోడు ఇద్దరు కలిసి తెలంగాణ ప్రాంతంలోని నీళ్ళు, ఉద్యోగాలు, చదువులు అన్ని మలుపుకున్నారు. తెలంగాణ న్యాయంకోసం ఎదురుచూస్తుందని రచయిత ఈ కథ ద్వారా చూపించాడు.

**4. బాధ్యత**

భర్తను కోల్పోయి, అత్త ఆమెను ఇంట్లో నుంచి వెల్లగొట్టితే, ఆ చిన్న పిల్లలను తీసుకొని పుట్టింటికి వచ్చి, వారికి కూడా భారం కావద్దని, పక్కన ఓ ఇల్లు కిరాయికి తీసుకొని, చిన్నపాటి ఉద్యోగం చేస్తూ చాలి చాలని జీతంతో, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ ఆఫీసు నుంచి ఇంటికి వచ్చాక కుట్టుమిషన్ కుట్టి తన కుటుంబాన్ని పోషించుకున్న విధానాన్ని 'బాధ్యత' కథలో చూడవచ్చు. తాయమ్మ కరుణ రాసిన 'జీవితం' కథా సంపుటంలోనిది ఈ కథ.

వాణీ, రఘు భార్యభర్తలు. వీరికి ఒకబాబు, ఒక పాప. వాణి అత్త వాళ్ళవి కూడా అంతంత మాత్రపు జీవితాలే కావడంతో భర్త చేసే కష్టం మీదనే ఇల్లు గడుస్తుండేది, కాని మామ గారిది చిన్న వయస్సే ఎందుకనో పనిచేసేవాడు కాదు. ఇల్లు కిరాయికి తీసుకొని ఉండేవారు. ఆమెకు బాబు పుట్టడంతో ఆర్థిక ఇబ్బందులు మొదలై, నెలల బాబును కూడా వదిలేసి ప్రైవేటు స్కూల్ టీచర్‌గా ఉద్యోగం చేస్తూ బాబును చూసుకోవడం, ఏడాదికే పాప పుట్టడంతో రెండు నెలలు ఆగి మళ్ళీ

ఉద్యోగంలో చేరుతుంది. కొడుకు, కోడలు కష్టపడుతున్నాగాని, మామగారు మాత్రం ఇల్లు కదిలేవాడు కాదు. అత్తనోరు మాత్రం పెద్దది. కోడలికి వంటలు వండరాదని, తల్లి ఏం నేర్పిందని, మగరాయుడులా పెంచిందని సతాయిస్తూ ఉండేది. వాణీ భర్త ఉద్యోగం నుంచి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో, అత్త మాత్రం కోడలివల్లే కొడుకు చనిపోయాడని, నష్టజాతకురాని శాపనార్థాలు పెడుతుంటే ఆమె అవి ఏవి పట్టించుకునే పరిస్థితిలో లేదు కాని ఊహించని ఘటనకు షాక్‌లో ఉండిపోయి, కనీసం ఏడ్వకూడా ఏడుస్తలేదు. వాణీ తల్లిదండ్రులకు ఈ విషయం తెలిసి తల్లిదండ్రులు, అక్కలు, అన్నయ్య వస్తారు. పదవరోజు కర్మకాండలన్ని పూర్తి అయ్యాక తిరుగు ప్రయాణం అయ్యి వాణీని అమ్మవాళ్ళు తీసుకెళ్తామంటే అంతకంటే భాగ్యం ఏముంది" (పుట:107) అని దీర్ఘం తీసి అంటుంది అత్త.

మూడు నెలల తర్వాత తిరిగి వచ్చిన కోడలిని తిట్టి పోసింది అత్త. ఒక చిల్లి గవ్వ కూడా ఇవ్వను అని కోడలు ఉన్నన్నీ రోజులు వెళ్ళిపొమ్మని పోరు పెడితే పిల్లలను తీసుకొని, కట్టుబట్టలతో తల్లిగారింటికి వస్తే తన అన్న ఆమెను ఆదరించి అక్కున చేర్చుకుంటాడు.

అన్నా వదినలకు భారం కాకూడదని, ఉద్యోగానికి వెళ్లడం మొదలు పెడుతుంది. ఓ రెండు నెలలకు అన్నయ్య వాళ్ళ ఇంటి దగ్గర్లోనే ఇల్లు అద్దెకు తీసుకుంటుంది. దగ్గరే ఉన్న తల్లిదండ్రులు వాణి పిల్లలను కనిపెట్టుకుని ఉంటారు. ఇక్కడ కథకురాలు తల్లిగారింటికి వచ్చింది వాణీ అంటుంది కానీ, నిజానికి ఆ తల్లిదండ్రులే ఉంటున్నది కొడుకువద్ద.

"భర్త చనిపోయిన దుఃఖం ఎప్పుడూ వెన్నంటి ఉన్న, పిల్లల భవిష్యత్తు...ఎడతెగని ఆలోచనలు ఎలా పెంచిపెద్ద చేయాలి. రెక్కలు తప్ప ఏమీలేవు. తండ్రీలోటు లేకుండా చూసుకోవాలి. ఈ ఉద్యోగంలో నెట్టుకురావడం కష్టం. డిగ్రీ చదివే రోజుల్లోనే టైపు షార్ట్ హ్యాండ్ నేర్చుకుంది. వాణికి అవి ఇప్పుడు పనికి వచ్చాయి. జర్నలిస్టుగా ఉద్యోగంలో చేరింది. ఐదువేల జీతం నుంచి ఎనిమిది వేలకు చేరింది. కాని ఆఫీసు దూరం కావడంతో రాత్రిళ్ళు ఇంటికి రావడం కష్టంగా ఉంది. అందుకని ఆఫీసుకు దగ్గరలో అద్దె ఇల్లు తీసుకుంది. తను ఉద్యోగానికి వెళితే పిల్లలను తీసుకువచ్చేవాళ్ళు, తను

వచ్చేవరకు చూసుకునే వాళ్ళు కావాల్సి వచ్చింది."(పుట: 107). ఇంట్లో పిల్లలను చూసుకోవడానికి ఇంట్లో ఎవరైనా ఉండాలి అన్నయ్య" అని అడుగుతుంది. ఆమె అవస్తను అర్థం చూసుకుని అమ్మ నాన్నను తీసుకెళ్ళు అని అంటాడు.

అమ్మ నాన్నలు, పిల్లలతో ఇల్లు మారింది వాణి. భర్త చనిపోయిన రెండు సంవత్సరాలకు చిన్న వయస్సు కదమ్మ మళ్ళీ పెండ్లి చేసుకొమ్మ, అని తల్లి చెప్పినప్పటికి మొదటిసారి పెళ్ళికి అప్పు చేశారు. ఇంకా రెండో పెళ్ళి కూడానా! అసలు భర్తను మర్చిపోవడం సాధ్యమేనా? వచ్చేవాడు పిల్లలను ఎలా చూసుకుంటాడు అని అనేక అనుమానాలతో అమ్మ మాటలను కాదంటుంది వాణి. పిల్లలకు ఎలాంటి లోటు రాకుండా చూసుకోవాలి. అదే నిశ్చయంతో ఆఫీసుల్లో పని అయ్యాక ఇంటికి వచ్చి మిషన్ కుట్టడం పనిలో మునిగిపోయింది.

సమాజంలో ప్రతి ఒక్కరికి కష్టాలు అనేవి వస్తుంటాయి. కాని వాటిని ఎదుర్కొని జీవించినప్పుడే తనకంటూ ఓపేరు ఉంటుందని రచయిత ఈ కథ ద్వారా సమాజానికి, ఇటు పాఠకులకు తెలియజేశారు.

**5. బహుముఖం**

తండ్రి తన కొడుకులకు భూమి పంచి ఇచ్చే విధానం, పొలం గెట్ల పంచాయతీ, లంచం తీసుకునే విధానం 'బహుముఖం' కథలో వర్ణించారు రచయిత్రి. కోట్ల వనజాత రాసిన 'ఇత్తు' కథా సంపుటంలోనిది ఈ కథ.

రవికి ప్రమోషన్ వచ్చి జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న మండలానికి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా వెళ్తాడు. రవి ఆఫీస్‌కు రాగానే కొండయ్య వచ్చి 'అయ్యా! కొడుకులు నలుగురు భూమి పంచమని పట్టుపడుతున్నారు. సరే అని మొన్ననే సర్వేయర్‌తో కొలత చేపిచ్చిన, పక్కన గెట్టు చివరి నా పొలం పక్కనే ఉన్న రామన్న పొలంలో కలిసిందని తేలింది. అదేమంటే తండ్రి కొడుకులు నామీదనే కలబడ్డారు. ఈ పంచాయితీ పెంచితే యర్కటికి భూమి పిల్లల పేర్న చేస్త సారూ! తలవంచి అడుగుతున్నాడు కొండయ్య.

రవి కొండయ్యను ఊరు అడిగి, తన బండిమీద ఎక్కించుకోని, మాట్లాడుకుంటు వెళ్తారు. నీకు ఎంత భూమి ఉందని అడుగుతాడు. యాభై ఎకరాల పైమాటనే ఉందని అంటాడు. అంతా నీ పూర్వికులు ఇచ్చిందేనా! అంతా నా కష్టార్జితం. ఎట్లా సంపాదించావు అని రవి అడిగాడు.

నేను పుట్టినప్పుడే మా అమ్మ చచ్చిపోయింది. నాకు కొద్దిగా ఎరుకయినంక మానాన్న గత్తరొచ్చి పోయిండు. మా మేనమామ ఇంట్లనే పెరిగిన. మానాన్న జీవాలమందనే నేను పెంపు చేసిన. ఇంగ పోతం చెయ్యలేనంత పెద్ద మద్ద అయ్యింది. వాటిని అన్నిటిని ఒకసారే బక్రీద్ పండుగకు అమ్మినం. లెక్కపెట్టలేనన్ని రూపాయలొచ్చినయి. గప్పుడు మా ఊళ్ళో ఒక బడిపంతులు ఉండే. రూపాయలన్నీ గాసారుతోనే దాసుకున్నం. మా ఊర్లో ఒక ఆసామి ఊరు వదిలి పోతుంటే పంతులే బేరమాడి ఇరవై ఎకరాలు భూమి నాపేర్న కొనిపెట్టిండు. అయ్య కొడుకు సల్లగుండు. ఆ ఇరువై ఇయ్యాల యాభై అయింది.

మరి నీ కొడుకులకు ఏలెక్కన పంచుతావు అని అడిగాడు. ఉన్నకాడికి నాలుగు భాగాలు చేస్తా దొర! ఇంగెట్ల పంచుట కొండయ్య అన్నాడు. నేనోమాట చెప్త ఇంటావా చెప్పు దొరా. "ఆస్తి ఐదు భాగాలు చేసుకో, కాలు రెక్కలు ఆడనినాడు ఎవడు ఎవరికైతడో తెల్వదు కదా! అర్థమయ్యే భాషలో సున్నితంగా చెప్పిండు కొండయ్యకు.

పొలం గెట్లు పంచాయితీ ప్రత్యక్షంగా చూసి పెద్దమనుషుల సమక్షంలో పరిష్కారం చేసి పంచనామాలు, స్టేట్‌మెంట్‌లు అయ్యేసరికి మధ్యాహ్నం అయింది. బయల్దేరబొయ్యేటంతల బండిదగ్గర కొచ్చిన కొండయ్య రవి చేతుల చిన్నకట్టంత రూపాయలుంచిండు. ఏమిటిది ప్రశ్నార్థకంగా చూశాడు. దొరా ఏదో చాతనైనంత గునిశాడు. రెండు వేలిస్తున్న దొర! మిగిలింది పనైనంక ఇస్త దొర! వినయంగా చెప్పాడు కొండయ్య. ఆఫీసుకొచ్చి రిపోర్టు ఇచ్చి అందరి లాగా తాను భాగ పంపకాలు చేశాడు.

ఈ కథలో తండ్రి కొడుకుల సంబంధాల, వారి ఆస్తి పంపకాల గురించి చర్చించబడింది.

**6. జీవన మాధుర్యం**

కుటుంబంలో తల్లిదండ్రులు పిల్లలతో ఎట్లా మెలగాలో వారిని ఎట్లా పెంచాలో, అన్ని ఉన్నగాని పిల్లలకు సుఖం అనేది తెలియకుండా, కష్టమనేది కూడా వారికి తెలిసేటట్లు చేయాలని 'జీవన మాధుర్యం' కథలో రచయిత కోటమర్తి రాధాహిమబిందు విశ్లేషించాడు. ఈ కథ ఆదివారం–ఆంధ్రప్రభ పత్రికలో (7 నవంబర్–2010) ప్రచురితమైంది.

శ్రీనివాస్, లలిత భార్యాభర్తలు వీరి పిల్లలు అంజలీ, అశోక. శ్రీనివాస్ మంచి ఉద్యోగం చేస్తున్నాడు. జీతం కూడా బాగానే వస్తుంది. పెళ్ళి అయిన కొత్తలో వీళ్ళ ఇంటి ఎదురుగ ఒక కుటుంబం ఉండేవి. వాళ్ళ పిల్లలు వీళ్ళ అయిన కొత్తలో వీళ్ళ ఇంటి ఎదురుగ ఒక కుటుంబం ఉండేవి. వాళ్ళ పిల్లలు వీళ్ళ పిల్లల వయసులోనే ఉండేవాళ్ళు. వాళ్ళ డిసెన్సీ....ఓసిస్లెయిన్ వీళ్ళకెంతో నచ్చి, వీళ్ళకు పిల్లలు పుట్టిన తర్వాత వాళ్ళలాగానే తీర్చిదిద్దుకోవాలనేవారు. పిల్లలను మంచి మార్గంలో నడిపించాలని శ్రీనివాస్ తన ప్రేమతో అనుకుంటారు. మేము నలుగురం ఒకే బెడ్‌పై పడుకుంటాం. అలా వాళ్ళకు ఎంతో ఇష్టం. ఎవరి రూం వాళ్ళకు అన్న సంస్కృతి వాళ్ళ ఇంట్లో లేదు. ఇంకా చిన్న పిల్లలు అంత అంత దూరం అవసరమా? మా మా అనే బేధం మనమే సృష్టిస్తూ ఎప్పటికో తలలు పట్టుకోవడం ఎందుకు? అది మనం నేర్పిందేగా? పాపం పిల్లలకేం తెల్సురా...ఏ పాత్రలో నీటిని పోస్తే ఆ ఆకారమే మలచుకుంటుంది. మంచి చెడుల తేడా...సంస్కృతీ సంప్రదాయాల అర్థం. తరిగిపోతున్న విలువలు, పెరిగిపోతున్న అనర్థాలు, ఇలా ఎన్నో ఎన్నో తెలియజెప్పాలని, కొంత సమయం ఇలాంటి టీచింగ్ కోసం కేటాయించుకోవాలి. పిల్లల్ని సన్మార్గంలో నడిపించే టాపిక్స్ మాట్లాడుకోవాలి. బెడ్ రూం...లివింగ్ రూం లాగా వాటినే క్లాస్ రూంలాగా కూడా మార్చుకోవాలని అంటాడు.

పిల్లలకు ఫ్రీడమ్ ఇవ్వాలి. ఫ్రీగా వదిలేయాలి. సేమ్...అదే సమయంలో కంట్రోల్‌లో కూడా ఉంచగలగాలి. డబ్బు సంపాదిస్తున్నాం. బాగానే సంపాదిస్తున్నాం మంచిదే...మే అంటే ఇంతకంటే గొప్పగా, క్లాస్‌గా బ్రతకొచ్చు. కానీ ఆ స్థాయికి వెళ్ళటం నిజంగా మాకిష్టంలేదు. విచ్చలవిడిగా ఖర్చుపెట్టే విధానం పిల్లలపై ఎంతో ప్రభావం చూపిస్తుంది. నా ఉద్దేశ్యంతో వాళ్ళ ఇంట్లో ఎ.సి. వుంది

వాళ్ళ పిల్లలు అంత ధరగల డ్రెస్ వేసుకున్నారు. మనం ఇలా ఎందుకుండాలి అన్న ప్రశ్న పిల్లలు వేయకూడదు. అలా వాళ్ళు వుండాలంటే కష్టం అంటే ఏమిటో ఎలా ఉంటుందో వాళ్లకు తెలియజేయాలి. పిల్లల్ని సుఖ మార్గాలవైపు నడిపిస్తూ హీనంగా బతకాల్సిన అవసరం కూడా లేదు అంటూ విర్రవీగుతూ సంపాదించేది ఎవరికోసం అంటే నేను ఒక్కటే చెప్పగలను. సేవింగ్ అంటే ఏంటో నేర్పాలి. మనం సేవ్ చేయాలి. ఎమౌంట్ సేవింగ్ చేస్తే పిసినితనం ఎలా అవుతుంది? కల్చర్ అనేది ఆడంబరంలో లేదు. కల్చర్ అనేది మన సంస్కృతిలో వుండాలి. పిల్లలు భావాలు ఆలోచనలలో ఆధునికత ఉండాలి. కానీ వాటి వెనుక నీడలా మనమూ వుండాలి. మన ప్రోత్సాహం వుండాలి. ఎంత వరకు కరెక్టే వాళ్ళకు అర్థం చేయించాలి. ఎ.సి. రూముల్లో క్రోటన్ మొక్కల్లా పిల్లల పెంపకం వుండకూడదు. పిల్లలు పెరిగి పెద్దయిన తర్వాత మనం ఏం మార్చగలం? ఏదైనా మనల్ని చూసే వాళ్ళు నేర్చుకునేది అహంకారం ఓర్వలేనితనం నిర్లక్ష్యపు ధోరణి...హేళన చేయడం.. ఇలాంటివి పిల్లలకు కావాలని కూర్చోబెట్టి నేర్పుతున్నారని కాదు. కానీ వాళ్ళు మనల్ని గమనించి నేర్చుకుంటారన్నదే నేను చెప్పుకొచ్చిందని స్నేహితునితో అంటాడు.

ఈ కథలో రచయిత సమాజంలో పిల్లలకు, సుఖమే కాకుండా కష్టమనేది తెలవాలని తల్లిదండ్రులు చెప్పాలని, భార్యభర్తలు కూడా మంచిగా ఉండాలని, వారి ముందు అనవసర మాటలను మాట్లాడకూడదని, పెద్దల ఏది మాట్లాడితే పిల్లలు కూడా అలాగే వాటిని నేర్చుకొని మాట్లాడుతారని, పిల్లలకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలని తల్లిదండ్రులకు తెలియజేయడం జరిగింది.

**7. మూల మలుపు**

తన కొడుకు, కోడలు, మనుమండ్లు, మనుమరాళ్ళు పట్నం నుంచి వస్తారు. తాతయ్య మనుమండ్లు, మనుమరాళ్ళ కోసం బావి దగ్గర నుండి పండ్లు ఫలాలు, తినేవాటిని తెస్తారు. మరుసటిరోజు వాళ్ళు తిరిగి పట్నం బస్సు ఎక్కి పోతుంటే ఆ తాతయ్య. నాయనమ్మలు ఆ బస్సు మూలమలుపు తిరిగిందాక అటువైపే చూస్తూ బాధపెడుతున్న విధానాన్ని రచయిత 'మూలమలుపు' కథలో ఎన్. సంజీవరెడ్డి రాసిన 'సంతకం' పత్రికలో (ఏప్రిల్–2012) విశ్లేషించాడు.

లింగారెడ్డి తన కొడుకు రామిరెడ్డి పట్నం నుంచి భార్య పిల్లలను తీసుకొని వస్తాడు. లింగారెడ్డి మనుమండ్ల, మనుమరాళ్ళ కోసం బావి దగ్గర చెలకలో పండిన బుడుమదోస కాయలు, జొన్నకంకులు, చింతపాల కాయలు, బొబ్బర కాయలు తీసుకువచ్చి అక్కడ పెట్టి, కాల్లు కడుక్కుకోవడానికి వెళ్ళగానే పిల్లలు తాతయ్య పండ్లుతేలేదని, అవి ఎంటివో వారికి తెలియక బుడుమలు బయట పడేస్తారు. జొన్న కంకులను ఏంచేయాలో తెలియక విరుస్తుంటే తాతయ్య వచ్చి వారిని కసిరిచ్చి, వాటిని తీసుకొని వలిచ్చి వారికి పెడతాడు. వారు అవి తినుకుంట తాతయ్య ఇవి ఏంటివి, టేస్టుగలేవు, మానాన్న ఎన్నడు ఇలాంటి తేలేదు. ఇవి ఎక్కడ పండుతాయని రకరకాల ప్రశ్నలు వేస్తారు. తాతయ్య వాటిని ఎక్కడ తెచ్చాడో చెప్పడంతో వాళ్ళు కూడా వెళ్దామని గోల చేస్తే, వారిని బావి దగ్గరికి తీసుకెళుతుంటాడు. నలుగురు పిల్లలను తీసుకొని అందులో చిన్నపాపను సంకన ఎత్తుకొని డొంక దారిన వెలుతుంటే పూలచెట్ల బావి కనిపిస్తే ఈ బావి మనదేనని మీ మేనత్త పెళ్ళి అమ్మినం, ఇందులో నీళ్ళు ఉన్నప్పుడు చిన్నప్పుడు మీనాన్నలు ఈతలు కొట్టేవారు. ఇక్కడ పూలచెట్టు పూలు బాగా పూసేదని, చింతచెట్టు చింతకాయలు బాగా కోసేదని, చింతపాల చెట్లు కట్టయమ్మటి ఉండేవి. పండు బాగా పండేవని మీ నానమ్మ పాములు ఉంటాయి వద్దన్నకాని అందులో జోరబడి కాయలు తెచ్చేవారని, చెట్లు ఎక్కుతుంటే మీ నానమ్మ తిట్టేదని, ఎవర్ని పండ్లను కోయనిచ్చేది కాదని చెప్తాడు పిల్లలకు లింగారెడ్డి. తాతయ్య ఇప్పుడా సెట్టేది? బాయిల నీళ్ళు లేవుగా! ఎక్కడ బోయినయి! మా నాన్నకు ఈతవొస్తదా? నీళ్ళెప్పుడుంటాయి? మాకు కూడా నేర్పించవా ఈత అని తాతయ్యను రకరకాల ప్రశ్న అడుగుతారు. ఈ డొంకలో నీళ్ళు ఉంటే మీ నాన్న చిన్నప్పుడు తప్ప తప్ప నడుచుకుంట, పడుకుంట, లేచుకుంట బాయికాడికి వచ్చేవాడు. తాతయ్య నీళ్ళు ఎప్పుడు ఉంటాయి. మేము కూడా నడుస్తాము అంటారు.

బావి దగ్గరికి వెళ్ళగానే చిన్నపాపను దించి, అక్కడ ఉన్న బావులు చూపించి, జామచెట్లకు కాయలు తెంపుతుంటే, పిల్లలు ఆ చెట్లు ఎక్కి పండ్లకోసుకొని తిని ఆడుకొని నీళ్ళు తాగుతారు. చెలకలో శేనులోకి పిల్లలు ఉరుకుతుంటే తాతయ్య వారికి బుడమ దోసకాయలను, జొన్నకంకులను చూపెట్టి వాటిని కొని, తెంపుకొని, పశువుల కొట్టం దగ్గరికి తీసుకెళ్ళి అందులో మీనాన్నవాళ్ళు చిన్నప్పుడు ఆడుకునేవారని, అప్పుడు మనకు పశువులు, ఆవులు బాగా ఉండేవని ఇప్పుడు బర్లు

ఉన్నాయని చెప్పుతాడు. తాతయ్య అవి కరుస్తాయా మమ్మల్ని అంటే కరువవు పొడుస్తాయి. తాతయ్య ఈగుడు ఏంటి అని అడిగితే అది గుడిసే అని చూపెట్టి అందులో రాత్రిపూట పడుకునేవాన్ని అప్పుడు. ఇప్పుడు అంతకూలి ఉత్తి కట్టెలే మిగిలిపోయాయి అని లింగారెడ్డి చెప్పుతాడు. అప్పటికే సాయంత్రం అయి చీకటి పడుతుంటే పశువులను ఇప్పుతాడు లింగారెడ్డి. పిల్లలు తలా ఒక కర్ర పట్టుకొని వాటిని ఇంటికి తోలుకుంటు వస్తుంటే డొంకలో చింతపాల చెట్లకు రెండు పండ్లు దొరికితే వాటిని సగం సగం చేసి నలుగురికి ఇస్తాడు. అవి తినుకుంట ఇంటికి వస్తారు. రాత్రి అన్నం తిని నిద్రపోతారు. ఉదయం కొడుకు, కోడలు పిల్లలు మళ్ళీ పట్నం వెళ్ళిపోవడానికి తయారై, బస్సు ఎక్కి వెళుతుంటే తల్లిదండ్రి ఆ బస్సు మూలమలుపు తిరిగిందాక అక్కడే వుండి వారిని చూస్తూ బాధపడుతుంటారు. అది వారికి కనిపించకుండా దుమ్ములేపుతూ వెళ్ళిపోతుంది.

ఈ కథలో రచయిత పట్నంలో పెరిగే పిల్లలకు, పల్లెటూరిలో పండే పంటల గురించి, పండ్ల చెట్ల గురించి, అవి ఏ చెట్లకు కాస్తాయో, ఎట్ల పండుతాయో, పశువుల గురించి, బావులల్లో నీళ్ళ గురించి, లింగారెడ్డి పట్నం నుంచి వచ్చిన మనుమండ్లకు, మనుమరాళ్ళకు బావిదగ్గర పండే పంటలను, జొన్న కంకులను, బొబ్బెర కాయలను, దోస కాయలను, పండే ఫలాలు, జామ కాయలు, సీతపాల పండ్లు కాయలు, సింత కాయలు మొదలైన వాటిని బాయి దగ్గరికి తీసుకొని వెళ్లి వారికి చూపించి, వాటిని తినిపించి, వారిని తీసుకొస్తాడు. సమాజంలో పుట్టిపెరిగి పట్నం వెళ్ళి బతుకుతారు. వారి పిల్లలను కూడా అక్కడే చదివిస్తుంటారు. వారికి రోడ్లు, బస్సులు, వెహికిల్స్ తప్ప ఏమి తెలియదని, వారిని అప్పుడప్పుడు గ్రామాలకు తీసుకువచ్చి చూపించాలని సమాజానికి తెలియజేశాడు. మానవుడి, ప్రకృతి మధ్య సంబంధాలను ఎలా పెంచుకోవాలో రచయిత ఇందులో తెలియజేశాడు.

పైన పేర్కొన్న ఆశ, కన్నీటి బొట్టు, ఓ సిన్నోని కథ, బాధ్యత, బహుముఖం, జీవన మాధుర్యం, మూల మలుపు కథలలో మానవ సంబంధాలలో ప్రధానమైన కుటుంబా సంబంధాలు చర్చించబడ్డాయి.

### 4.1.2. స్త్రీ-పురుష సంబంధాలు

సమాజంలో స్త్రీ–పురుష సంబంధాలు అనేక రకాలుగా ఉన్నాయి. భార్యా భర్తల సంబంధాలు, అన్నా చెల్లెళ్ళ సంబంధాలు, బావ మరదళ్ల సంబంధాలు, ప్రేయసి ప్రియుల సంబంధాలు, స్నేహితుల సంబంధాలు మొదలైనవి ఉంటాయి. నల్లగొండ జిల్లా కథల్లోని స్త్రీ–పురుష సంబంధాలు కనిపించిన కథలను ఇందులో చర్చించాను.

**1. మనిషి పగిలిన రాత్రి**

నాలుగు గోడలమధ్య ఒంటరితనంతో మగ్గిపోయే మహిళల ఆక్రోశానికి అక్షరరూపం 'మనిషి పగిలిన రాత్రి' కథ రచయిత్రి షాజహానా. 'లద్దాప్ని' కథా సంపుటిలోనిది.

ఈ కథలో రచయిత్రి మనో విశ్లేషణకు పెద్దపీట వేసి వివాహిత స్త్రీ పురుషుల సాంస్కృతిక, మానసిక అస్తిత్వ సంక్షోభాలను చైతన్య స్రవంతి రూపంలో చిత్రీకరించారు. ఒంటరితనం పోగొట్టుకునేందుకు తోడుకోసం ఆడైనా, మగైనా పెళ్ళి చేసుకుంటారు. కనీసం అట్లా అనుకుంటారు. కానీ పెళ్ళి తరువాత కొద్ది కాలానికే ఆలుమగలు తిరిగి తమ పూర్వపు ఒంటరితనాన్ని అలవర్చుకోక తప్పని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఒకరి నుంచి ఒకరం తప్పించుకు తిరుగుతున్నారు. "అసలు నీ మొగడేడి? ఏం చేస్తున్నాడు...ఎక్కడ తప్పిపోయినాడు. ఏ గుర్రాలమీద తిరుగుతున్నాడు? అదిగో మళ్ళీ వాడి గురించి..?(పుట:91) ఇంకో చోట... "ఏక్ బార్ ఆజా ఆజా...ఎందుకొస్తాడు? ఎందుకొస్తుంది నిద్ర...నిద్రపో తల్లి సుఖంగా వాడు రాలేదు, రాకపోతే పోనీ"(పుట:96) ఇది మన కథానాయకి అంతఃస్రవంతి. ఆ భర్త క్యారెక్టర్ అక్కడెక్కడో కేవలం మగవాళ్ళు మాత్రమే సంచరించే చోట, తోటి 'మగల'తో కలిసి తాగి తందనాలాడుతుంటాడు. బహుషా అతడు కూడా ఒంటరితనం బాధితుడే కాబోలు. ఏ వివాహమైనా వైఫల్యం చెందక తప్పదని, అది అనివార్యమని ఈ కథ మనకు చెప్పకనే చెబుతుంది.

జీవితంలో ఒంటరితనం నాచు ఎంతలా పేరుకుపోయిందంటే నేను అసలు కనపడనంత. నిజమే యివ్వాలిటి అభివృద్ధి అని చెప్పుకుంటున్న సమూహాలు ఒంటరివాళ్ళుగా వుంటున్న పరిస్థితుల్ని విస్ఫోటించింది ఈకథ. ఎన్నో సంఘటనలు, సమాధానాలు, సంఘర్షణలు, ఒంటరి జెండర్ ధిక్కరణ తాత్వికతలు, తాత్పర్యాలు విస్ఫోటించినట్లుగా దృశ్యీకరించింది. మనసులో రగిలే మంటను ఒక

వెలుతురుగా మారటానికి జరిగే రసాయనక చర్యలో శరీరక ఆరోగ్యం పణంగా మారుతుందనే విషయం చాలామందికి తెలియదు. ఇది చేతనా స్రవంతి కథ. మనసు లోపలి పొరలు కాక్టస్ పువ్వులా విప్పుకున్న కథ ఇది.

**2. ఈ పెండ్లి నిలుస్తుందా**

సాఫ్ట్ వేర్ ఉద్యోగాల పని ఒత్తిడిలో భగ్నమైపోతున్న స్త్రీ పురుష సంబంధాల సున్నితత్వం 'ఈ పెండ్లి నిలుస్తుందా!' కథలో చిత్రీకరించారు. ముదిగంటి సుజాతారెడ్డిగారు రాసిన 'మరో మార్క్స్ పుట్టాలె!' కథా సంపుటంలోనిది ఈ కథ.

మానసి, సందీప్‌లు భార్యాభర్తలు. పెద్దలు కుదిరించిన సంబంధాన్ని, వారి ఇష్టానుసారంగా పెండ్లి చేసుకుంటారు. సందీప్ ముంబైలో కంప్యూటర్ కంపెనీలో పెద్ద హోదాగల ఉద్యోగం చేస్తుంటాడు. కంపెని అతనికి బంగళా, కారు డ్రైవర్ కూడా వాళ్ళే ఇస్తారు. ఇంట్లో అన్ని ఖరీదైన వస్తువులు, ఇంట్లో పనులన్ని పనిమనుషులే చేస్తుండేవారు. సందీప్ రోజూ ఆఫీస్‌కు మధ్యాహ్నం వెళ్ళి రాత్రి పన్నెండు తర్వాత వస్తుండేవాడు. భార్య ఇంట్లో ఒక్కతే ఉంటుంది. ఆమెకు సుఖం, సంతోషం ఉండేవి కావు. ఇసిగి పోతుంది. పెండ్లి అయి సంవత్సరం దాటుతుంది. ఇక లాభం లేదనుకొని, ఆమె విడాకులు కావాలని తమ తల్లిదండ్రులను, మేనమామను పిలిపిస్తుంది. భర్త అతని తల్లిదండ్రులను, అక్క బావను పిలుస్తాడు. అందరూ హాల్లో కూర్చుంటారు. వచ్చిన వారికి అంతుపట్టడంలేదు. 'ఇష్టపడినంకనే కదా! పెండ్లి జరిగింది. ఇప్పుడే భేదాభిప్రాయాలేమిటి ఇద్దరి మధ్య, అని అనుకుంటారు.

మానసి మొదలుపెడుతుంది. భర్త రోజు ఆలస్యంగా అర్ధరాత్రి ఇంటికి వస్తాడని, తిండి తినేవాడు కాదు. తిన్నావా అని అడిగేవాడు కాదని, అడిగితే అక్కడే ఆఫీస్‌లోనే తినివచ్చాను అనేవాడు. ఆమె అతనికోసం రాత్రి అంతా ఎదురుచూస్తుంది. కాని కనీసం ఒక మాటయిన మాట్లాడేవాడు కాదని, అలసిపోయినాను, పనిచేసి కంప్యూటరు ముందు కూర్చొని పడుకునేవాడు. తలంతా దిమ్మెక్కిపోయిందని అర్థం చేసుకోమని అంటుండేవాడు. ఒక్కరోజు కూడా సెలవుపెట్టి ఆమెతోటి గడిపేవాడు కాదు. ఒక ముద్దులేదు, మురిపెంలేదు, ఒక ప్రేమ, శృంగారం లేదు, బయటికి పోవడం

లేదు. ఎప్పుడో ఒకసారి హోటల్‌కో, స్నేహితురాలింటికో పోతే, అక్కడ అతనికి పది ఫోనులు వస్తే, పని ఉందని అక్కడినుండి ఆఫీసుకు వెళ్ళిపోయేవాడు. కనీసం శనివారం, ఆదివారం కాని ఆమెతో గడపకుండా నిద్రపోయేవాడు. లేపితే చిరాకు పడేవాడు. సంవత్సరం దాటుతుందిగాని ఆమెతో రాత్రిల్లు గడిపింది లేదు. షాపింగ్‌కు వెళ్తామంటే స్నేహితురాలితో వెళ్ళమనేవాడు. కాని ఆమెకు తనతో పోవాలని ఉంటుంది. అడిగితే టైమ్ లేదు అనేవాడు. ఎక్కడికి తీసుకుపోక, ఆఫీసు పని, ప్రాజెక్టుపని ఉందని రాత్రనక, పగలనక కష్టపడక తప్పదని అంటుండేవాడు. ఎప్పుడు కంప్యూటర్ ముందే కూర్చొనేవాడు. భర్త అంటే కంప్యూటరా అసలు నా పెండ్లి కంప్యూటరుతో అయిందేమో! అనిపించేదని, విసిగిపోతుంది మానసి. మాటలేదు, మంచిలేదు, ఓ సరసం లేదని, నవ్వుతూ మాట్లాడేవాడు కాదు. ఎప్పుడైన సెలవురోజు ఇంట్లో వుంటాడు కదా అనుకుంటే నిద్ర లేచిన్నుంచి ల్యాప్‌టాప్ ముందు ఏసుకుంటే అక్కడికే బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ అన్ని. బయటికి పోదాం అంటే పోదాం అయిపోయింది అంటాడు. కానీ అక్కడే కూర్చుంటాడు. ఇక నేనెందుకు అని మానసి నాకు విడాకులు కావాలె! అని అంటుంది.

సందీప్ కాపురం పెట్టినదగ్గరనుంచి ఆమెతో కలవలేదు. ప్రేమగా దగ్గరికి తీసుకోలేదు. మనస్సులేదు. ఓ రసం లేదు. శృంగారం లేదు అతని మనస్సులో ఎప్పుడూ ఆఫీసుపని కంప్యూటరు తప్ప ఏమైనా ఉండేది కాదు. ఆమెతో మాట్లాడే ఉల్లాసం, ఆమెతో కలిగే కోరిక లేవు. అతనికి అసలు మగతనమే లేదు అని గట్టిగా అరిచింది మానసి.

మానసి మాటలు విన్న అందరూ నిశ్శబ్దంగా ఒకరి మొకాలు ఒకరు చూసుకొని, ఎవరికి ఏమనాలో తెలియటంలేదు. సందీప్‌కి నోట్లో నుంచి మాట రాలేదు. అందుకే నాకు విడాకులు కావాలె! అంది మానసి. నిశ్శబ్ద వాతావరణాన్ని ఆమె మాటలు ఛేదిస్తూ గట్టిగా వినిపించాయి.

ఈ కథలో భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆఫీస్‌కు వెళ్ళి, అక్కడే అలిసిపోయి మధ్యరాత్రి ఇంటికి వచ్చి పడుకుంటాడు. సంవత్సరంపాటు అలానే జరుగుతుంది. భార్య అలసిపోయి, విసిగిపోయి విడాకులు కావాలని అంటుంది. భర్త ఎప్పుడు ఆఫీసు పనులే చేస్తూ ఉంటే ఎట్లా తనకంటూ ఓ సంసారం

ఉందని, తనకోసం భార్య ఇంట్లో ఎదురుచూస్తుందని, ఆమెతో ఒకరోజు కాకపోయినా ఒకరోజైన గడపాలని, ఆమెకంటూ కోరికలనేవి ఉంటాయని, భర్త అనేవాడు ఆమె కోరికల తీర్చాలి అని, భార్యభర్తల మధ్య బంధాలనేవి ఏర్పాడాలని, వారి మనసులు కలిసిపోయి వారిలో ఐక్యతాభావం ఏర్పడాలని, వారి మధ్య ప్రేమ, ఆప్యాయతలనేవి ఉండాలని, ఎప్పుడు ఆపీసు పనులేకాకుండా, ఆ ఒత్తిడి తగ్గించుకొని, తనలో సగభాగమై భార్యను కూడా చూసుకుంటే జీవితాలు బాగుపడతాయని, అలా చూసుకోకపోతే ఈ వ్యవహారం విడాకుల దాకా వస్తుందని రచయిత్రి ఈ కథ ద్వారా సమాజానికి, ఇటు పాఠకులకు తెలియజేశారు.

పైన పేర్కొన్న మనిషి పగిలిన రాత్రి, ఈ పెండ్లి నిలుస్తుందా అనే కథల్లో స్త్రీ–పురుషుల మధ్య ఉండే సంబంధాల గురించి చర్చించబడింది.

### 4.1.3. భార్యాభర్తల సంబంధాలు

సంసారం ఒక సాగరం లాంటిది అన్నారు మన పెద్దలు. సాగరాన్ని ఈదడం ఎంత కష్టమో అలాగే సంసారాన్ని ఈదడం అంతే కష్టం. అలాగే భార్యాభర్తలిద్దరు ఒకరికొకరు సహకరించుకొని సర్దుబాటు చేసుకుంటూ బతికితే ఆ సంసారం సుఖంగా ఉంటుంది. భార్యా భర్తల మధ్య అనురాగాలు, గొడవలు మొదలైన విషయాలు నల్లగొండ జిల్లా కథల్లో చర్చించబడ్డాయి. వాటిని మనం ఇందులో గమనించవచ్చు.

**1. భయం పెద్ద జబ్బు**

హెచ్ఐవీ తనకు తగిలించింది పురుషుడైనా తన భర్తే అయినా దాని ప్రభావం ఫలితం మహిళమీద ఎంత హృదయవిదారకంగా ఉంటుందో చెప్పే కథ ‘భయం..పెద్ద జబ్బు’. తాయమ్మ కరుణ రాసిన ‘జీవితం’ కథా సంపుటిలోనిది ఈ కథ.

విజయ, సంతోష్ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు కూతురు రష్మి, కుమారుడు రాహుల్. సెకండ్ క్లాస్, ఎల్.కె.జి చదువుతున్నారు. భర్త లెక్చరర్ ఉద్యోగం చేస్తుంటాడు. ఆడపడచు వనజ ఎంబీఏ చదువుతుంది. మామ చనిపోయాడు. అత్త రాజ్యలక్ష్మి ఇంట్లోనే ఉంటుంది. అత్త మొదట్లో కోడలిని బాగానే చూసుకునేది. భర్త కూడా ఆమెను ప్రేమగా చూసేవాడు. విజయ డిగ్రీవరకు

చదువుకుంటుంది. పాప తరువాత బాబు పుట్టినప్పుడు ఆఫరేషన్ కావడంతో పుట్టింట్లోనే ఉండి ఆరునెలల తర్వాత వస్తుంది. విజయ పురుడు కోసం పుట్టింటికి వెళ్ళినప్పుడు, భర్త ఫ్రెండ్ ఒత్తిడితో బయట తిరిగితే అతనికి హెచ్ఐవీ వస్తుంది. కాని అత్త కోడలు బయట తిరగటం వల్ల వచ్చిందని ఆమెకు ఒక రకంగా చూడటం మొదలుపెడుతుంది.

భర్త ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్ సోకిన భార్య విజయని దూరంగా పెట్టి అత్తింటివారు చూసే చిన్నచూపు తెలిసీ భర్త మౌనంగా బాధపడటం, తర్వాత విజయ నిలదీయడంతో తల్లికి విషయం చెప్పిన భర్త సంతోష్ షుగర్, బి.పిల్లాగే మందులతో జీవితకాలం పొడగించవచ్చని వైద్యులు చెప్పిన విషయాలు వినిపించుకోకుండా పిల్లలను తన దగ్గరికి రానివ్వని అత్త, దూరమవుతున్న పిల్లలు, చదువుకున్న తానే మానసికంగా నలిగిపోతుంటే...మరింత అనారోగ్యానికి గురవుతుంటే మరి ఏమీ తెలియని వారి పరిస్థితి ఏంటి? అని ఆలోచించిన విజయ తన న్యూనత నుండి బయటపడి హెచ్ఐవీ అన్న అపోహల్ని తొలగించాలనుకుకోవడంతో కథ ముగుస్తుంది.

సమాజంలో చాలామంది హెచ్ఐవీ/ఎయిడ్స్ వచ్చిన వాళ్ళను సమాజం చిన్నచూపు చూస్తుందని, వారు కూడా కొంతవరకు భయంగా ఉన్నారని, అలా భయపడవద్దని, హెచ్ఐవీ/ఎయిడ్స్ వచ్చిన వారికి మందులు వచ్చాయని, వాటిని వాడుతుంటే సమాజంలో మనుషులు ఏవిధంగానైతే తిరుగుతున్నారో, జీవిస్తున్నారో వారుకూడా అలాగే జీవించవచ్చని, షుగర్, బి.పి. వచ్చినవాళ్ళు కూడా స్వేచ్ఛగా బ్రతకవచ్చని, వీరిని చిన్నచూపు చూడవద్దని, హెచ్ఐవీ/ఎయిడ్స్ గురించి ప్రజలలో అవగాహన కల్పించాలని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు.

**2. కేన్సర్ గౌరమ్మ**

భర్త సుట్ట, బీడీలు, గుడుంబా (సారా), బ్రాంది మొదలగు వాటిని తాగడంవల్ల భార్య ఆ వాసన పీల్చినందుకు తాగిన భర్తకు రాని జబ్బు, భార్యకు వస్తుంది. ఊపిరితిత్తులు కరాబై, రొమ్ము క్యాన్సర్ వచ్చి, ఆపరేషన్ చేయించడానికి డబ్బులు లేక భార్యను ఇంటికి తీసుకువస్తాడు భర్త. అతను బాధపడ్తుంటే ఆమె అతనికి ధైర్యం చెప్పిన విధానం 'కేన్సర్ గౌరమ్మ' కథలో విశ్లేషించాడు రచయిత. భూతం ముత్యాలు రాసిన 'దగ్ధం' కథా సంపుటంలోనిది ఈ కథ.

పోచాకు ఎంకులు, గౌరమ్మ భార్యాభర్తలు. వీరికి నలుగురు కుమార్తెలు. అందరి పెండ్లీలు చేశారు. ఒకరోజు గౌరమ్మకు ఊపిరికుట్టు నొప్పితోటి ఆయాసపడుతుంటే భర్త ఆమెను ఆటోల ప్రైవేటు హాస్పటల్‌కు తీసుకెళ్తాడు. ఎమర్జెన్సీ కేసు కావడంతో డాక్టర్ ఆమెను చూసి ఒక చిట్టిమీద టెస్టులన్నీ రాసి గంటలో చేయించుకు రమ్మని పంపిస్తాడు. పరీక్షలన్నీ చేయించుకొని రిపోర్ట్స్ ను తీసుకెళ్తే ఆమెకు 'రొమ్ము క్యాన్సర్' వచ్చిందని చెప్పి, మీ భర్త చుట్ట, బీడి తాగుతాడా అంటే, తాగుతాడని చెప్పడంతో, సుట్టతాగిన అయిన బాగానే ఉండుగాని, దాని పొగబీల్చి నీకు లోపల ఊపిరితిత్తులు, లివర్ చెడిపోయాయని, రొమ్ములు కేన్సర్ గడ్డలయినాయి. అది పూర్తిగా తక్కువ అయితదని, మళ్ళీ మీ భర్త సుట్ట, బీడి, మందు, సార, ఇస్కి, బ్రాంది అసలే ముట్టొద్దు, నువ్వు ముట్టకు. ఆయనకు దూరంగా ఉండి చెప్పిన పత్తెం చేస్తే నాలుగు రోజులు బతుకుతావని చెప్పి, పైసలు బాగా కర్చు అవుతాయని ఉంటే చూపించుకో, లేకపోతే మందులు రాస్తా వాడమంటాడు. భర్తతోటి నీ కాడ పైసలు లేకుంటే ఈమెను సర్కార్ దవఖానకు తీసుకుపో, లేకపోతే ఇంటికి తీసుకుపో అని చెప్తాడు.

గౌరమ్మ తన పిల్లలు ఏమైన ఆసర అవుతే బతుకుతాను అని ఆశపడుతుంది. వారం రోజుల తర్వాత భర్త వారి పిల్లలకు తెలియజేశాడు. వారికి కట్నాలు, సొమ్ములు చేసివ్వలేదని పెద్దబిడ్డలు, ఇద్దరూ రాలేదు. చిన్నబిడ్డలు ఏదో చూడలేదన్నట్టుగా వచ్చి చూసి వెళ్ళిపోతారు. భర్త ఆమె గోసను చూడలేక తల్లడిల్లిండు. బత్తె సాదుకుంట, సస్తే బొందపెడ్తనని ఆమెను ఇంటికి తీసుకువచ్చి పసిబాలను చూసినట్టుగా చూసుకుంటూ పూట గడుపుతుంటాడు.

అతనికి భార్యను చూసినప్పుడల్ల గుండెకలుక్కుమంటుండేది. "తనవల్ల తన భార్యకు ఈ దుర్గతి పట్టిందని మతిల అనుకోసాగిండు. తను తాగుడుకు బానిసై గౌరమ్మను నిర్లక్ష్యం చేసినందుకు మాకీ దుస్థితి దాపురించింది" అని తనలో తానే కుమిలిపోతుండేవాడు. అది గమనించి భార్య "ఎందుకయ్య బాధపడతావు భూమిమీద పుట్టినందుకు అందరూ ఏదో ఒకనాడు చావాల్సిందే. కాకుంటే నేను నీకంటే ముందల పోతనేమ్. అయినా పుట్టినోడల్ల సావకుంటుంటే ఈ భూమి సాలుతదా. గిప్పుడే మనుషులు కల్మషంతో గిట్టుంటే అప్పుడు ముందలిపొట్ట ఒకన్ని ఒకడు పీక్కొని

తినడు మరి" అంటూ నిట్టూర్పు విడిచింది. అదికాదే నా బాధ నిన్ను లగ్గమాడ్నకాన్నుంచి ఎన్నడన్న సుఖపెట్టనైతి పండ్గలొస్తే కొత్త చీరన్న కోనియ్యనైతి ఎంతసేపూ నా కడ్పు సూస్కున్నగని నీగురించి గింతన్న ఆలోచించనైతి. మూరెడు మల్లెలన్న తేనైతి గదనే నేనైతే సీసలకు సీసలే నాలొట్టల కొట్టుకుంటిగని ఎవల్కేం తక్వ జేస్నం కుడ్తమంటే పండ్గజేస్తి. నీ రెక్కలు ముక్కలు జేస్కొని పిల్లలగని సాదిత్వి నువ్ సుఖపడలే. ఒకరిసొమ్ముల కాషపడ్తొళ్ళు అయి ఉంటే మనల ఉద్దరిస్తారు. నువ్వా నీ ఇల్లు ఇడ్సిన సంది సుఖమెర్గవైత్వి. కన్నోళ్ళు నిన్ను నాకిచ్చి, వాళ్ళ బర్వు దింప్కుంద్రుగని మారుమళ్ళీ ఇటు సూడలే. పిల్లలు రెక్కలొచ్చి ఎగిరిపోయిరి. గీ ఈడున నీకు నేను, నాకు నువ్వే, నేను తాగి తందనాలాడి బజాట్ల పన్యా దేవులాడుకుంట్వి. మరి నేనేం జేసినే. నీకున్న గా కేన్సరేదో నాకన్న రాకపాయే పొడ్గాను. ఇగో గౌరి ఈ తారీకు నుంచి పొవాకు ముట్ట సారకల్లు తాగ. ఉంటే తిందాం లేకుంటే పందాం. ఇప్పుడన్న నా రెక్కలు కర్గించి నీకు అయిసు పోస్తా. అట్లన్న నీరుణం తీర్చుకుంటనే"(పుట: 106) అని ఏడుస్తూ ఎంకులు భార్యతో అంటాడు.

ఏందయ్య నా గురించి సింత జేయకు. మనుంటే మిన్నిర్గిమీద పడ్డా సావం, సచ్చేదాన్నయితే దవకాండ్లకు పోతుంటేనే సద్దును. నువ్ నీ గుతితీర దమ్ము గుంజుతూ సుట్ట తాగితే నేను సూడాలే గుల్గుతూ నీకు కూడెట్టాలె. అప్పుడే నాకు తుర్తి. పిల్లలంటావ్ రేపు ఆళ్లకు సాలు దప్పదు. ఎడ్లన్కనే ముడ్లు, ముడ్లెన్కనే ఎడ్లు" ఇది లోకంమీద ఉన్నదేనాయె" అంటూ అతనికి ధైర్యం నూరిపోసింది. తను సావుకు దగ్గరైతున్నా కూడా!

ఈ కథలో కన్న కూతుర్లు కూడా తల్లిదండ్రులు మాకేం ఇవ్వలేదని, ఆకరికి చావు బతుకుల్లో కొట్లాడుతున్న తల్లిని చూడడానికి కూడా రాక, ఆమెను ఆదుకోలేకపోయిన బిడ్డలు కూడా ఈ దేశంలో ఉన్నారని తెలియజేశాడు. చివరికి భర్త నావల్ల నీకు ఇన్ని కష్టాలు వచ్చాయని క్యాన్సర్ తన కన్నరాలేదని బాధపడుతూ ఏడుస్తూ, ఇక నుంచి సార, కల్లు మందు తాగనని, పశ్చాత్తాపపడిన విధానం. భార్య భర్తమీద ప్రేమతో అతని అలవాట్లను మానకుండా నీవు అలాగే బతకాలని, ఆమె చావుకు దగ్గరలో ఉండి కూడా భర్తకు ధైర్యం చెప్పిన విధానాన్ని, భార్యాభర్తల అనుబంధాన్ని రచయిత వర్ణించిన తీరు పాఠకులను కదిలించాయి.

**3. అతడు**

భార్యా భర్తలు చిన్నచిన్న సమస్యలను పరిష్కరించుకోలేక పెండ్లి అయి పన్నెండు సంవత్సరాలు కాపురం చేసి కూడా విడిపోవడం 'అతడు' కథలో చూడవచ్చు. రచయిత స్కైబాబ రాసిన 'అలాయి బలాయి' బహుజన కథా సంపుటంలోనిది ఈ కథ.

భార్య, భర్తలు ఇద్దరు పెండ్లి అయినంక హైదరాబాద్‌కు వస్తారు. వీరికి ఒక కుమారుడు. భర్త ఉద్యోగం చేసేవాడు. అతడు డిఫరెంటుగా ఆలోచిస్తాడు. ఎవరితో ఎక్కువగా మాట్లాడడు. తన సమస్యను ఇతరులకు చెప్పేవాడు కాదు. అతడు ఎవరితోను తన ఆలోచనలు పంచుకునేవాడు కాదు. ఊఁకొడుతూనే ఒక్కోసారి మాట మార్చేసి వారిని డైవర్ట్ చేసి వారేదో మాట్లాడుతుంటే పట్టించుకోకుండా తన ఆలోచనల్లో తాను ఉండేవాడు. అందరూ ఒకలా ఆలోచిస్తుంటే అతడు భిన్నమైన కోణంలో పయనించేవాడు. అతడి ఆలోచనలు అర్థంకాక పోయేవి భార్యకు. చాలా సమస్యలను అతనితో ఎదురుకొనేది.

ఒకరోజు చిన్న విషయంలో గొడవ మొదలై మాటమాట అనుకొని, కొట్లాడుకుంటారు. ఆమె లాభం లేదు విడిపోదాం అని వెనుక ముందు అనేక మాటలు కలిపి అంటూ, విడిపోదాం అని నాలుగుసార్లు అనేసరికి అతడు కూడా సరే అలాగే విడిపోదాం అని అంటాడు. ఇంట్లో ఉన్న సామాను అంతా తనవేనని, ఒక వ్యాను మాట్లాడి ఎక్కించి పంపించు నేను వెళ్ళిపోతాను అని కఠినంగా అనడంతో, అతడు కాసేపు వెనుక ముందు ఆడిగి, వెంటనే వెళ్ళి మాట్లాడితే తర్వాత ఇద్దరూ రాజీకొస్తే అని అతడి ఆలోచన కావొచ్చు, కానీ ఆమె రెట్టించింది. ఆగిపోయావేం! వెళ్ళి తీసుకురా!" అని మరి మన బాబు! అని సందిగ్దంగా ఏదో అనబోయాడు. "వాణ్ణి నవమాసాలు మోసి, కని పెంచింది నేను. వాడు నా కొడుకు నాతోనే వస్తాడు"(పుట:127) అని అంటుంది. అతడు కదిలాడు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. తర్వాత ఇబ్బందులు పడతావు. నువ్వు కూడా మొండితనానికి పోకు అని అంతరాత్మ అంటుంది. కాని అతడు పట్టించుకోలేదు.

పెద్దవ్యాను ఒకటి, దాంతోపాటు నలుగురు మనుషుల్ని మాట్లాడుకొచ్చిండు. ఆమె సీరియస్‌గా అన్ని సర్దుకోవడం మొదలుపెట్టింది. సామాన్లన్ని కొంచెం వ్యాన్లోకి ఎక్కించమని, ఇదొక్క సాయం

చెయ్యి అంటుంది. అంతటితో బాబు వచ్చాడు బైటినుండి. వాడికేమి అర్థంకాక 'పప్పా' ఏమైంది! అని అడిగాడు. వెంటనే ఆమె అరేయ్! మనం వెళ్ళిపోతున్నం, నీబట్టలు, సామాన్లు సర్దుకో అన్నది. వాడు అయోమయంగా చూశాడు. 'ఉc జల్దీ కానియ్' అని మళ్ళీ గద్దించింది ఆమె. వాడు అయిష్టంగా కదిలాడు. సామాన్లన్ని అతడు వెంట ఉండి వ్యాను ఎక్కించాడు. ఒకటి రెండు వస్తువులను తీసుకెళ్ళవద్దని వారించబోయాడు. ఆమె వినలేదు. ఆ వస్తువులు తాను కొన్నవేనని అతడు వాదించలేదు. హాల్లో బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్లతో సహా విప్పించి తీసుకెళ్ళిపోయింది. చివరికి బాబును దగ్గరికి తీసుకొని గుండెలకు హత్తుకున్నాడు. గుండెల్లోంచి ఏడుపు తన్నుకొచ్చింది. కాని ఓర్చుకున్నాడు. పప్పా! రెండ్రోజులాగి నువ్వు కూడా రా పప్పా.. నేను ఫోన్ చేస్తాను అంటూ వాడు ఏడ్వబోయాడు అతడు ఓదార్చాడు. వ్యాను కదిలి వెళ్ళిపోతుంటే అతడు ఆమెవైపు చూశాడు. ఆమె కూడా అతడివైపు చూసి వెంటనే చూపు తిప్పేసుకుంది. అతడు చూస్తూనే ఉండిపోయాడు.

భార్యాభర్తలు  ఒకరినొకరు అర్థం చేసుకోవాలని, కలిసిమెలిసి అన్యోన్యంగా ఉండాలని, ప్రేమ, ఆప్యాయతలు ఉండాలని, ఏ సమస్యనైనా ఇద్దరు పరిష్కరించుకోవాలని, బందాలు, బంధుత్వాలు లేకపోవడం వల్ల సమాజంలో ఎన్నో కుటుంబాలు విడిపోతున్నాయని, పిల్లలు తల్లిదండ్రుల ప్రేమలకు దూరమవుతున్నారని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

భయం పెద్ద జబ్బు, కేన్సర్ గౌరమ్మ, అతడు కథల్లో భార్యాభర్తల మధ్య ఎంత పెద్ద గొడవలు ఉన్నా, తర్వాత వారు ఒకటై ఒకరిమీద ఒకరు ప్రేమ చూపుంచునే విధానం కనిపిస్తుంది.

### 4.1.4. వివాహేతర సంబంధాలు

మన వివాహ వ్యవస్థలో భార్యా భర్తలు మాత్రమే కలిసి ఉండి సంసారం సాగిస్తారు. కాని వివాహం ఒకరితో అయినా, మరొకరితో సంబంధాలు కొనసాగిస్తే అటువంటి వాటిని వివాహేతర సంబంధాలు అంటారు. ఇంటువంటి సంబంధాల వల్ల కొన్ని కుటుంబాలు, జీవితాలు నాశనం అవుతాయి. వారి పిల్లల భవిష్యత్తు కూడా గందరగోళంగా తయారవుతుంది. వివాహ సంబంధంతో ఎంతో హాయిగా గడపాల్సిన వారి కుటుంబాలలో పరాయివాళ్ళు ప్రవేశించి వారి సంసారంలో చిచ్చు రాజేసి వెళ్తారు. ఆ రకమైన సమస్యల గురించి నల్లగొండ జిల్లా కథల్లో చర్చించబడ్డాయి.

**1. వలస పక్షులు కథ**

నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతానికి బతుకుతెరువుకోసం వచ్చి, కాల్వగట్టున గుడిసెలేసుకొని కాపురాలు చేస్తూ జీవిస్తున్నారు. భర్తను వదిలిపెట్టి, ఇష్టమైనవానితో లేచివచ్చిన కుటుంబాలే ఎక్కువ. వెంకటయ్య పటేలు నాలుగు వూర్లకు పట్వారీగ పనిచేస్తుంటాడు. ఇతన్ని పటేలు అని పిలుస్తారు. అబ్కారి సారా మామ్లా (వ్యవహారం) తీసుకుంటాడు. ఆయన భార్య పిల్లలు కాల్వకు అటుపక్కన వున్న వూర్లె ఉంటారు. ఇంకో పెండ్లం కూడా వుంటుంది. పేరు చిలకమ్మ. ఈమె కాలువ అవతల పక్కఊరే కావడం. ఆ వూరికి వెంకటయ్య పట్వారీగా, అబ్కారి ముస్తాజరుగా చేస్తుంటే అక్కడా పరిచయం అవుతుంది. చిలకమ్మకు చిన్నతనంలో పెండ్లి అవుతుంది. ఒక పిల్ల పుట్టినంక భర్త కాపురం చేస్తలేదని, విడగాతం(విడాకుల కాగితం) తీసుకొని తల్లిగారి ఇంటికాడ ఉంటుంది. ఆ ఊరిలో పట్వారీ యాపచెట్టుకింద అరుగుమీద కూర్చోని 'సర్కారీ రఖాలు' వసూలు చేస్తూ ఉంటాడు. ఇతను ఎప్పుడైనా అవసరం వస్తాడేమో అని చాయిచేసి పంపేవాడు చిలకమ్మ తండ్రి. ఎండలుకొడుతున్నాయని, ఇంట్లోకి రమ్మని, వరండాలో మంచంవేస్తే కాసేపు పడుకునేవాడు. అప్పుడప్పుడు చిలకమ్మ తండ్రికి సారా పోయిస్తుండటం, ఇద్దరికి స్నేహం ఏర్పడి, వస్తాపోతా పటేలు చిలకమ్మను చూస్తూ ఉండే. చిలకమ్మ విడాకుల పంచాయితీలో పటేలు కూడా పెద్దమనిషే. అప్పుడప్పుడు ఓర చూపులు చూస్తూ, అట్టిట్లని చూపులు కల్వడం. కండ్లతోనే మాట్లాడుకోవడం ఓ ముసలిదానితో రాయబారం నడిపి, చిలకమ్మను రాత్రికి రాత్రే తీసుకొని కాల్వగట్టుకు చేరాడు. అప్పటికే తాను తీసుకున్న జాగలో గుడిసేవేసి ఉంచడంతో ఇద్దరి కాపురం కాలువ వొడ్డున సాగుతూ, సారబేరం నడుపుతూ ఆమె నిగ రానిలోనే మూడుపువ్వులు ఆరుకాయలుగా వుంది. అక్కడ వెంకటయ్య అసలు భార్యకు చాతగాకుంటే భర్త ఎటుపోతే నాకేందని ఆస్తిపాస్తులకు డోకాలేదని ఆమె వ్యవసాయం చూసుకుంటుంది. చిలకమ్మకు ఇద్దరు మగపిల్లలు పుడతారు. వూర్లే మొదటి సంబంధం పిల్లను తీసుకొచ్చుకుంది. చూస్తుండగానే పది సంవత్సరాలు గడిచాయి. పటేలు సారా మామ్లా జోరగుతుంది. చుట్టుపక్కల గుడిసెలోల్ల పంచాయితీలు తీర్పు చేస్తుండేవాడు.

ఈ రోజులల్లో ప్రజలు సభ్య సమాజం తల దించుకునేలా జీవిస్తున్నారని, భర్త ఉండి, భార్య ఉండి కూడా వేరే వ్యక్తులతో అక్రమ సంబంధం పెట్టుకొని, వారికి పుట్టిన పిల్లలను వదిలేసి, వాళ్ళకు

నచ్చిన వ్యక్తితో లేచిపోయి, వేరొకచోట కాపురాలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇంకా ఎక్కువ సంవత్సరాలు ఉన్న అబ్బాయికి, తక్కువ సంవత్సరాలు ఉన్న అమ్మాయికి పెండ్లి చేయడం వల్ల తప్పిదాలు(అనర్థాలు) జరుగుతున్నాయని, ఇలాంటి తప్పిదాలు జరగకుండా ఇద్దరికి వయస్సుదగ్గట్టు చూసి పెండ్లి చేస్తే బాగుంటుందని రచయిత యొక్క భావన.

**2. సక్రమ సంబంధాలు**

భార్య చనిపోయినంక, భర్తకు మరోకామెతో వివాహం ఏ సందర్భంలో, ఎట్లా జరిగిందో రచయిత 'సక్రమ సంబంధాలు' కథలో దేవులపల్లి కృష్ణమూర్తిగారు చిత్రీకరించారు. ఈ కథ 'కథలగూడు' కథా సంపుటంలోనిది.

సక్కుబాయి భర్త చనిపోయినంక, కొడుకుతో కలిసి తెలుగోల్ల బజారులో ఉంటుంది. వయస్సుమీద ఉంటుంది. పోలీసు పటేలుకి భార్య చనిపోయి ఒక సంవత్సరం అయింది. ముసలివాడు ఏం కాదు గదా, సక్కుబాయి మీద మనస్సుపడింది. కాని ఆమె గర్వం చూపించి ఇతన్ని లెక్కచేయలేదు. చీకటి పడినంక పోలీసు పటేలు బజారునుండి పోతుంటే, ఒకడు సక్కుబాయి ఇంట్లోకి జొరపడింది చూసి, బయట గొళ్ళెం పెట్టి దొంగలు దొంగలు అంటూ మొత్తుకోగానే అంతలోనే లోన వున్నోడు గోడ దునికిండు. సక్కుబాయి తలుపు తీయడంతో పటేలు లోపలికి పోగానే, గోడ దునికినోడు ఇంటిముందు కొచ్చి గొళ్ళెం పెట్టి దొంగ దొంగ అంటూ మొత్తుకోగానే, పోరగాలు అంతా జమయ్యి తలుపు తీస్తే పోలీసు పటేలు ఇంట్లో ఉండు. ఏంది పటేల ఈ రాత్రి పూట దీని ఇంట్లో ఎందుకున్నవంటే నోరెల్లబెట్టే సరికి, తెల్లారి ఊర్లో పంచాయితీ పెట్టి, పెద్ద మనుషులంతా కూడి, వాడొకమాట, వీడొకమాట అంటూ, ఆఖరికి సక్కుబాయి కోసమే పటేలు ఇంట్లో జొరబడ్డడు అని తీర్మానించారు. బదనాం అయింది సక్కుబాయి. నీకు నీభార్య కూడా లేదు కదా. ఆమె సంరక్షణ బాధ్యత అంతానీదే అని పెద్దలు తీర్పు ఇచ్చారు.

"ఈ ఊరి ఆనవాయితీ ఒకటుంది. అక్రమ సంబంధాలకు పాల్పడ్డోల్లకు తాళి కట్టించడమే పరిష్కారం. చాలాకాలం నుండి అమలవుతుంది. దీన్ని కాదని ఎవరు ఊరిలో వుండలేరు. అందరు సహాయ నిరాకరణ చేస్తారు. మంగలి క్షౌరం చేయడు. చాకలి బట్టలుతకడు. పొలం కోయడానికి

కూలీలు రారు. కనీసం మంచి నీళ్ళు కూడా ఇవ్వరు. పెండ్లీల్లకు పిలువరు. దీన్ని తట్టుకోలేక ఎంతటి మొనగాడైనా తలవొగ్గక తప్పదు."(సక్రమ సంబంధాలు: 36). అందుకని అతడు దేవుని గుళ్ళో పెద్దల సమక్షంలోనే తాళి కట్టిండు. ఆ రోజు నుండి సక్కుబాయి సతీ సక్కుబాయి అయింది. పటేలు మోజుపడ్డదే భార్య అయింది. కొత్త జీవితంలోకి ఇద్దరు అడుగుపెట్టారు.

ఈ కథలో సక్కుబాయికి భర్త చనిపోవడంవల్ల ఒంటరిగ జీవిస్తుంది. ఆ ఊరిలో పోలీస్ పటేలుకు భార్య చనిపోయి ఒక్కడే ఒంటరిగా జీవించేవాడు. సక్కుబాయి వయసులో ఉండటంతో పటేలుకు ఆమెమీద కన్ను పడుతుంది. ఆమెను ఎప్పుడు ఒక కంట కనిపెట్టుకుంటూ తిరుగుతాడు పటేలు. అనుకోకుండా ఒక రోజు సక్కుబాయి ఇంట్లోకి మరో వ్యక్తి వెళ్లింది చూసి, పటేలు లోపలికి వెళ్ళగానే లోపలున్న వ్యక్తి గోడు దూకి బయటకు వచ్చి బేడం పెట్టి అందరిని పిలిచి చూపించి, వారిద్దరికి అక్రమ సంబంధం అంటకడతాడు. ఆ ఊరి ఆచారం ప్రకారం వారికి పెళ్ళి జరిపిస్తారు. ఇలా సమాజంలో చాలా ప్రాంతాలలో జరుగుతున్నాయని, ఇలాంటి అక్రమ సంబంధాలు పెట్టుకుంటున్నారని రచయిత తెలియజేశాడు.

**3. మార్కెట్**

భార్యా భర్తలు ఇద్దరు కూలికి పోతారు. అక్కడ మగవాళ్ళు కూడా ఉంటారు. వాళ్ళతో మాట్లాడుకున్న మాట్లాడినావని, చూడకున్నా చూసి నవ్వినావని, వీన్ని జూసి నవ్వినావని రంకులు గట్టి అనుమానించి, కొట్టి, తిడుతుంటే భార్య నిజంగానే మరొక వ్యక్తితో లేచిపోయి కాపురం పెట్టి జీవించే విధానం 'మార్కెట్' కథలో రచయిత కోట్ల వనజాత చిత్రీకరించారు. ఈ కథ 'ఇత్తు' కథా సంపుటంలోనిది.

రాములుకి ఇద్దరు పిల్లలు అయినంక కూడా భార్యను అక్రమ సంబంధం పెట్టుకుంటుందని హింసించేవాడు. టౌన్‌లో బిల్డింగ్ పనికి పోయినకాడ రాములుకి, నర్సిగాడు పరిచయం అయి ఆమెను దొంగచూపులు చూడడం, నర్సిగాడు భర్తకు కల్లు తాపించడం, తాగిన తాగకున్నా ఆమెను కొట్టడం, రంకులు గట్టడం, పనికాడ ఇటుకల గంప కాల్లమీద పడడం, మూడు కాళ్ళ వేళ్ళు చితికితే డాక్టర్ కట్టుగట్టి పదిరోజులు పనికి పోవద్దని అనడం, భర్తలేనప్పుడు నర్సిగాడు పండ్లు తెచ్చి ఇవ్వడం, మాట్లాడటం, అతనిమీద ఆమెకు ప్రేమ కల్గి నర్సిగానెంట పిల్లల్ని దీస్కొని పట్నం పోయింది.

మార్కెట్ వెనుక చిన్న రూమ్ తీసుకున్నారు. నర్సిగాడు మార్కెట్ కూలిపనికి పోతుండేవాడు. అది ఒకటేగాకుంట చిన్నచిన్న దొంగతనాలు చేసి జైలుకు పోయివస్తుండేవాడు. ఆమె పెండ్లి చేసుకొమ్మని అడిగింది. నవ్వుకుంట ఇప్పుడు గాదులే అని దాటేస్తుండేవాడు. కోరినవన్ని దొరుకుతుంటే వాడెందుకు పెండ్లి చేసుకొని రొచ్చుల దిగుతడు. కాలం గడుస్తుంటే తెలిసొచ్చింది ఆమెకు. నేను నర్సిగానికి మొదటిదాన్ని గాదు. చివరిదాన్ని గూడా కాదు అనుకుంది. ఎల్లకాలం వీడ్నే నమ్ముకొని ఉంటే కడుపు నిండదూ, కాలం గడవదని ఆమె పక్కింటుండే పున్నెమ్మ దగ్గర కమ్మలు కుదవబెట్టగా వచ్చిన పైసల్తోటి కూరగాయల వ్యాపారం మొదలు పెట్టింది. బిడ్డను, కొడుకును బడిల చేర్పిద్దామని బడికి తీసుకపోతే తండ్రి పేరు అడిగారు. నర్సిగాడని చెప్పింది. కొడుకు కాదు, రాములు అని గట్టిగా అరిసిండు.

నర్సిగాడు ఏడ తిరిగొచ్చినా చివరికి ఆమె ఇంటికే చేరేవాడు. వాడు రావడం పిల్లలకు నచ్చేదికాదు. నర్సిగాడు తాగినప్పుడు, పిల్లల్ని తిట్టేది, అప్పుడప్పుడు కొట్టేది. కాలం గడుస్తుంటే ఆమెకు మార్కెట్ లోకమైంది. కూరగాయలు అమ్మి చిన్న చిట్టిలల్ల చేరి పైసలు జమచేసుకోవాలే పట్నం వచ్చి రెండు సంవత్సరాలు అయింది అనుకుంది.

ఒకరోజు రాములు మార్కెట్ వచ్చిండు. మనిషి బక్కగా అయి, మొకమంతా పీక్కపోయి గడ్డాలు, మీసాలు పెంచుకున్నాడు. ఆమెను చూడంగనే కండ్లనిండా నీళ్ళొచ్చినయి. ఆమె కాళ్ళు పట్టుకోబోయిండు. అయిందేదో అయింది. మంచిగ చూస్కుంట ఇంటికి పోదాం రమ్మన్నాడు. పక్కనే కూరలమ్ముతున్న పున్నమ్మ ఎవరని అడిగింది. కతంతా చెప్పింది ఏం చేయమంటవని అడిగింది.

“బొంది పొయ్యిన్నాడే నిండపోతదే, నువ్విప్పుడు రాముల్ని నమ్మి వానెంటపోతే వాని బతుకంతా పండగే. నిన్ను రోజుకో తీరుగ కాల్చుకొని తింటడు. నువ్వు అయింత బక్రవైతవు. యాన్నో ఓకాడ కండ్లు మూసుకొని బతుకీడ్చు” (పుట: 92) అన్నది. రాములుకు రాను పొమ్మని చెప్పింది. ఈ కథలో రాములు తన భార్యను అనుమానించడం వల్ల ఆమె నిజంగానే నర్సయ్య అనే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకొని, పిల్లలతో సహా పట్నం వెళ్ళి, మార్కెట్లో కూరగాయలు అమ్ముకొని జీవిస్తుంది.

ఒకరోజు భర్త రాములు పట్నం వచ్చి జరిగిందేదో జరిగింది, ఇంటికి రమ్మని అంటాడు. ఆమె రానని చెప్తుంది. ఆమె అనుమానం ఉన్నచోట బతకటం కన్నా ప్రేమ ఉన్నచోట బతకడం ఉత్తమమని అనుకుంటుంది. ఇలా సమాజంలో కొంతమంది భర్తలు చీటిమాటికి భార్యలను అనుమానించడం వల్ల వాళ్ళు తట్టుకోలేక నిజంగానే వారికి నచ్చిన వ్యక్తితో లేచిపోయి జీవిస్తున్నారని రచయిత సమాజంలో జరుగుతున్న సంఘటనల గురించి తెలియజేశాడు.

**4. ఆడ పాలపిట్టలున్నాయా**

భర్త ఊరికి ఎల్లింది సూసి, భార్య వేరొక వ్యక్తితో రాత్రి గడుపుతుంది. భర్త ఉదయం వచ్చినంక భార్యను ఎట్లా, ఎందుకు కొడతాడో, 'ఆడ పాలపిట్టలున్నాయా?' కథలో తెలిదేవర భానుమూర్తి చిత్రీకరించారు. 'నల్లగొండ కథలు' సంకలనంలోనిది ఈ కథ.

ఉప్పరి యాదయ్య ప్రతిరోజు తాపీమేస్త్రీ పని చేస్తుంటాడు. రాత్రిపూట బాగోతం ఆడుతాడు. క్రిష్ణుని వేషం కట్టుట్ల ప్రసిద్దుడు. బొనగిరిల చిన్నపోరగాల్ల కానుంచి ముసలోల్ల దాంక క్రిష్ణుడు ఎవరు అని అడిగితే ఇంకెవ్వరు ఉప్పరి యాదయ్య అని అంటారు. మున్నూరోల్ల చెంద్రమ్మకు యాదయ్య వేషం అంటే ప్రాణం. ఊరి వాడకట్టు చౌరస్తల శంకరయ్య హోటలు ఉంటుంది. రాత్రిపూట ఆ హోటల్ ముందటనే బాగోతం ఆడుతుంటారు.

ఆరోజు శంకరయ్య హోటల్ ముంగట బల్లపీట వేశారు. దానికి మూడు వైపుల పర్దాలు కట్టి, కరెంటు బుగ్గలు బెట్టి, రాత్రి పది గంటలకు బాగోతం మొదలవుతుంది. యాదయ్య ఎప్పటి లాగానే క్రిష్ణుడి వేషం వేస్తాడు. రెండు గంటలకు బాగోతం అయిపోతుంది. యాదయ్య వేషం ఇడ్వబోతుంటే చంద్రమ్మ అతని కాడికిపోయి, వేషం ఇడవకు అని అంటుంది. అతడు ఎందుకు ఇడవద్దు అని అడుగుతాడు. ఆ వేషంతోనే ఒకసారి మా ఇంటికి రా అని ఆమె అతనితో అంటుంది. ఇంట్ల నీభర్త లేడా? అంటే పట్నం పోయిండు అని చెంద్రమ్మ అంటుంది. ఆమె నల్లగున్నా అందంగా ఉంటుంది. ఇగ ఆమెతోటి యాదయ్య క్రిష్ణుని వేషంతోనే ఆల్ల ఇంటికి పోయి, రాత్రంతా వాళ్ళిద్దరు గడుపుతారు. చెంద్రమ్మకు శరీరం అంత నీలం రంగు అంటుకుంటుంది. తెల్లవారకుండ యాదయ్య ఇంటికి పోయాడు. గాని "కండ్లు మూసుకొని పిల్లి పాలుదాగితే ఎవ్వరు సూడకుంట ఉంటారా?"

(పుట:411) బాగోతం అయిపోయినంక అతడు చెంద్రమ్మతోని పోతుంటె కొంతమంది చూడనే సూస్తారు. ఏడు గంటలకు కూడా చెంద్రమ్మ నిద్ర తెల్వలేదు. ఆమె భర్త పట్నం నుంచి వచ్చి, గుడిసె హోటల్ల ఛాయ్ తాగుతుంటె "జెల్ది బోతివా అంటే మీ ఇంట్ల కిష్నలీల బాగోతం సూడొచ్చు"(పుట: 492) అని కొంటె పోరగాడు అంటాడు.

చెంద్రమ్మ భర్త ఇంటికి పోయి చూస్తే పెండ్లాం శరీరం అంతా నీలం రంగుతోని ఉంటుంది. అతనికి అంత అర్థమైంది. కడుపు మసిలింది. శిగమూగుకుంట చింత బరిగె తీసుకొని చెంద్రమ్మను మెత్తగా కొట్టిండు.

ఈ కథలో చెంద్రమ్మ భర్త ఊరికి వెళ్ళింది చూసి వేరొక వ్యక్తిని ఇంటికి రమ్మని రాత్రి అతనితో గడపటం జరుగుతుంది. ఈ విషయం ఎవరికి తెలువదు అనుకుందేమోగాని, భర్తకు ఉదయమే ఒక అల్లరి పోరగాడు చెప్పడంతో భర్త ఇంటికి వెళ్ళి చూస్తే ఆమె శరీరం అంతా నీలిరంగు, చూసేసరికి అంతా అర్థమై ఆమెను మెత్తగా కొడతాడు. సమాజంలో చాలామంది తానుచేసే తప్పు ఎవరికి తెలువదు అని అనుకుంటారు. కాని ఆ విషయం ఎవరో ఒకరివల్ల, ఎప్పుడో ఒకరోజు వాళ్ళ కుటుంబానికి తెలుస్తుంది. ఆ బాధను వారు తట్టుకోలేక కొందరైతే భార్యలను చంపుతున్నారు. మరి కొందరి భార్యలు, భర్తలను కూడా చంపి వేరొక వ్యక్తితోనే కాపురాలు పెడుతున్నారు. భర్తలో లేనిది పరాయి మొగోనిలో ఏముంటుంది. భార్యలో లేనిది పరాయి స్త్రీలో ఏముంటుంది. అది అర్థం చేసుకుంటలేదు ఈ సమాజం. ఇద్దరిలో ఏమైన ప్రాబ్లాలు, సమస్యలు, లోపాలు, ఏ ఇతర కారణాలుగాని ఉంటే డాక్టర్లను సంప్రదించండి. వారు సాల్వ్ చేస్తారు. కాని ఇలాంటి అక్రమ సంబంధాలు పెట్టుకోవడం వల్ల జీవితాలు నాశనమైతాయని, ఇలాంటివి పెట్టుకోవద్దని రచయిత ఈ కథ ద్వారా పాఠకులకు తెలియజేశాడు.

వలస పక్షులు, సక్రమ సంబంధాలు, మార్కెట్, ఆడ పాలపిట్టలున్నాయా కథల్లో వివాహేతర సంబంధాలు ఏ విధంగా అక్రమ సంబంధాలు పెట్టుకుంటున్నారో, వాటి వల్ల వచ్చే పరిణామాలు ఏమిటో తెలుసుకోవచ్చు.

## 4.1.5. స్త్రీల గృహ, ఉద్యోగ హింస కథలు

కుటుంబంలో స్త్రీల పట్ల పురుషుల ఆధిపత్యం, తాగుడు మొదలైన వాటివల్ల స్త్రీలు గృహహింసకు గురవుతున్నారు. మహిళలు దినదినాభివృద్ధి చెందుతూ ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. అందులో వారి పై అధికారుల వల్ల ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారు. స్త్రీలు గృహహింస మాత్రమే కాదు, ఉద్యోగ జీవితంలో కూడా ఎన్నో రకాల కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆ సమస్యలు ఎలా ఉన్నాయో నల్లగొండ జిల్లా కథల ద్వారా మనం తెలుసుకోవచ్చు. అటువంటి కథలను ఈ ఉపవిభాగంలో చర్చించాను.

**1. అమ్మవాసన:**

చెడు వ్యసనాలకు అలవాటు అయిన భర్త, బాగా తాగివచ్చి, భార్యను చిత్రహింసలు పెట్టి, కొట్టడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంటుంది. తమ్ముడు అమ్మలేని లోటును అక్కలోన అమ్మను చూస్తున్న విధానాన్ని రచయిత వేణు సంకోజు 'అమ్మ వాసన' కథలో చిత్రీకరించారు. ఈ కథ 'నల్లగొండ కథలు' సంకలనంలోనిది.

సత్తయ్య, శాంతమ్మ భార్యా భర్తలు. వీరి పిల్లలు కూతురు అరుణ, కుమారుడు శివయ్య పుట్టు గుడ్డివాడు. సత్తయ్య రెడియోలు తర్వాత, టీవీలు తర్వాత, వాచీలు రిపేరింగులు నేర్చుకోవడం, వదిలేయడం. కొంతకాలం తర్వాత సాడిస్టుగా మారి పూర్తిగా దిగజారిపోయి, తాగుడుకు బానిస అవుతాడు. తాగివచ్చినప్పుడల్లా భార్యను ఎక్కడబడితే అక్కడ కొట్టడంతో, ఆమెకు వంటిమీద దెబ్బలకు వాతలు తేలేది. ఆ దెబ్బలకు ఓర్చుకోలేక ఏడుస్తూ మూలుగుతుంటే కూతురు చూడలేక చితికిపోయేది. ఒకసారి తల్లిని కొడుతుంటే అడ్డుపోయినందుకు తాగినమైకంలో తండ్రి బిడ్డను గొంతుపిసికితే తల్లి హాస్పటల్‌కి తీసుకెళ్ళి డాక్టర్ల కాళ్ళు పట్టుకొని బాగుచేపిస్తుంది. తర్వాత ఆమెకు కొడుకు పుట్టడంతో దేవుడు మేలు చేశాడు అనుకుంది. కాని పుట్టిగుడ్డివాడు కావడంతో కుమిలి కుమిలి ఏడ్చింది. అందుకు కారణం భర్తే. నన్ను తన్నడం, గుద్దడం వల్ల వాని కండ్లు పోయాయని ఆమె అనుకుంటుంది. భర్త పెట్టే బాధలు భరించలేక కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకొని మొత్తం కాలిన శరీరం, సావుబతుకుల మధ్య హాస్పిటల్లో ఉంటే పోలీసులు లాయర్లు వచ్చి ఆమెతో వాంగ్మూలం తీసుకుంటారు. అందులో తనను భర్తే కిరోసిన్ పోసి కాల్చాడని చెప్పి ఉన్నది. భార్యతోటి

ఇంతకు ముందు ఒకటిరెండు సార్లు కాల్చి సురుకులు పెట్టినకాని సంపేటట్లు గాదు. ఇప్పుడు అసలే చెయ్యలేదు. నువ్వు కాలబెట్టుకుంటేనే ఆర్పపోయిన నా చేతులు కూడా కాలి బొబ్బలు ఎక్కినాయి అంటూ ఏడ్చాడు సత్తయ్య.

బస్తివాసులు వచ్చి చూసి ఎట్లా జరిగిందని, భర్త కాలబెట్టిండా అని బతిమిలాడిన కాని ఆమె కండ్ల నుండి నీళ్ళు వచ్చాయి తప్ప ఏమీ చెప్పలేదు. అతన్ని జైల్లో పెట్టారు. ఐదు రోజులకు మల్ల పోలీసులు, లాయర్లు వచ్చి కూతురిని వాగ్మూలం మీద సంతకం పెట్టమంటే 'అతనికి కటినాటి కఠినమైన శిక్ష ఎయ్యండని' సంతకం పెడుతుంది. తల్లి ఆప్యాయంగా కూతిర్వైపు చూసి తన పక్షాన నిలిచినందుకు కాళ్ళు మొక్కాలనుకుంది. కాని శక్తి లేదు కనుక కళ్ళతోనే దండాలు పెట్టుకుంది. అంటే అట్లనే మరణిస్తుంది.

అరుణ అంధుల పాఠశాలకు వెళ్తే తమ్ముడు 'అమ్మ' అని పలకరిస్తే అమ్మను కాదుర అక్కను అంటే, ఇంతకుమునుపు నిన్ను, అమ్మను వేరువేరుగా గుర్తుపట్టిన, ఇప్పుడు నీదగ్గర 'అమ్మవాసన కూడా అక్క' అని అనడంతో దుఃఖం ఆపుకోలేక తమ్ముణ్ణి బిగ్గరగా అల్లుకుంటూ నేలమీద చతికిల పడింది అరుణ. అనుకోకుండా పైకి చూసింది. ఆకాశవీధిలో ప్రతి మబ్బులోనూ అమ్మబొమ్మ కరుణామయి, అమ్మ రూపురేఖలే, నింగినేలను కలుపుతూ కూడా అమ్మే సర్వత్రా అమ్మే అనుకుంటారు.

ఈ రోజులల్లో ప్రతి మగవాడు చెడు వ్యసనాలకు అలవాటు పడి, భార్యను కొట్టడం, చిత్రహింసలు పెట్టడంతో ఆమె ఆత్మహత్య చేసుకోవడం, అతడు జైలుకు వెళ్ళడం జరుగుతుంది. కాని పిల్లల పరిస్థితి ఏంటి? తల్లిదండ్రులు లేక అనాధలుగా మిగిలిపోతున్నారు. తల్లి దండ్రి ప్రేమలకు దూరమవుతున్నారు. వారికి వారే అక్కలో అమ్మని, అన్నలో నాన్నను చూసుకుంటూ పిలుచుకుంటున్నారు.

ఈ కథలో తల్లి మరణిస్తుంది. తండ్రి జైలుకెళ్తాడు. ఇక మిగిలింది అక్క, తమ్ముడు. అమ్మలేదు, అక్కలోనే అమ్మ ఉందని తమ్మునితోటి 'అమ్మా' అని పిలిపించిన విధానం చాలా అద్భుతంగా వర్ణించారు రచయిత.

**2. సంగీత:**

చదువుకునే అమ్మాయికి మంచి సంబంధమని పెళ్ళి చేస్తే భర్త డ్రగ్స్‌కు అలవాటై ఆమెకు రోజుకు నరకం చూపించడం, హింసించడం, గృహనిర్భంధం వంటివి 'సంగీత' కథను రచయిత్రి కె.కవిత రాసారు.

సంగీత వాళ్ళ కుటుంబంలో అమ్మ, నాన్న, ఇద్దరు అన్నలు, ఒక అక్క. ఆమె చిన్నామె కావడంతో గారాబంగా పెంచారు. పదవతరగతి ఫస్ట్ క్లాస్‌లో పాసవడంతో ఇంటర్ బోనగిరిలో చదవడం, డిగ్రీ కూడా అక్కడే పూర్తి చేస్తుంది. అప్పటికే ఇద్దరు అన్నలకు, అక్కకు పెళ్ళిళ్ళు అవుతాయి. పెళ్ళి చేస్తాను అంటే పి.జి. చేశాక చేసుకుంటాను అని గొడవపెట్టి మరి ఎంట్రన్స్ రాసి కాకతీయ యూనివర్సిటీలో జాయిన్ అవ్వడం, యూనివర్సిటీలో ఎన్నో విషయాలు తెలుసుకుంటుంది. గ్రూప్స్, బ్యాంకు ఎగ్జామ్‌ల గురించి తెలుసుకొని, యం.ఆర్.వో కావాలని ఆశయం పెట్టుకొని చదువు కొనసాగిస్తుంది. పి.జి. సెకండియర్‌లో ఉండగా వాళ్ళ చిన్నాన అత్తగారు తరపున ఈ పెళ్ళి సంబంధం తెచ్చారు. చిన్నన్న అత్త వాళ్ళకు మేనత్త కావడం వల్ల తండ్రి ఆ సంబంధంవైపు తెలుగు చూపాడు. తండ్రి కాంట్రాక్టర్ అబ్బాయి ఇంజనీరు చదివి, తండ్రికి సాయంగా ఉంటాడని బాగా సంపాదించారని, బోలెడంత ఆస్తి, తోటలున్నాయని మధ్యవర్తులు చెప్పడంతో అన్నలు ఇద్దరు పోయి లగ్గం పెట్టుకొని వచ్చారు. పి.జి. అయిపోయినంకనే పెళ్ళి అంటే అందరు ఒప్పుకొని పరీక్షలు అయిపోగానే పెళ్ళి చేశారు.

పెళ్ళి అయ్యాక తెలిసింది. అత్తమామ వాళ్ళు బయటకు కనిపించేంత మంచివాళ్ళేంకాదని భర్తకు లేని అలవాటంటూ లేదని, ఒక పద్ధతిలో పెరిగి వచ్చిన ఆమె అక్కడ తట్టుకోలేకపోయింది. వీళ్ళలాగే ఇద్దరి ఆడపిల్లలకి పెళ్ళి అయి వెళ్ళిపోయారు. ఈమె, అత్త, మామ, భర్త, మరిది కుటుంబ సభ్యులు. కాని ఇంట్లో ఎవరూ సమయానికి వచ్చేవారు కారు. ఎక్కడికి వెలుతున్నారో తెలిసేది కాదు.

ఎవరితో మాట్లాడనిచ్చేవారు కాదు. ఒక రకంగా గృహనిర్బంధం అన్నమాట. పుట్టింటితో సంబంధం తెగిపోయినట్లేనా ఆమెకి ఆరు నెలల్లోనే తెలిసి వచ్చింది. భర్త ఇంటికి వస్తున్నాడంటే ఆమెకి భయం జొరపడేది. డ్రగ్స్‌కు ఎడిక్ట్ అయి ఆమెకు నరకాన్ని చూపిస్తాడు. మూడవ నెల తప్పిందని తెలిసి వాళ్ల పెద్దనాన్న వచ్చి తీసికెళితే ఇంట్లోవాళ్ళు బాగా ఏడ్చారు. భర్తను మార్చుకోవాలనుకుంటుంది. పాప పుట్టినంక అక్కడికి వెళ్ళింది. అయినా వాళ్ళలో ఏ మార్పు లేకపోగా ఆడపిల్ల పుట్టిందనే సాకుతో హింస పెట్టడం, ఇంకా ఆమెపై హత్యాయత్నం చేసేదాకా రావడంతో తనని పాపను తీసుకొని బస్టాండుకు వచ్చి, బస్సు ఎక్కి పుట్టింటికి వచ్చింది. అప్పటికే రెండోసారి నెలతప్పి ఉంది. ఐదు నెలల్లో బాబు పుట్టాడు. అత్తగారు వాళ్ళు ఎవరు రాలేదు. చుట్టుపక్కల వాళ్ళు, ఇంట్లోవాళ్ళు ఎంతోమంది వెటకార మాటలు అన్నాగాని వాటిని భరించింది.

పెద్దన్న సహాయంతో బి.ఎడ్. చేస్తూ, ఇంట్లో ట్యూషన్‌లు చెప్పడం, క్రమక్రమంగా మామూలు మనిషిగా మారింది. కొద్ది రోజులలో సిటీకి చోటు మార్చింది. స్కూల్‌లో టీచర్‌గా జాయిన్ అయింది. పిల్లలు పెద్దవాళ్ళు కావడంతో స్కూల్ లో చేర్చి, తనతోపాటే తీసుకెళ్ళింది. పిల్లల ఇద్దరికీ ఫీజులు రాయితీ ఇచ్చింది. ఇన్ని కష్టాలు పడి జీవితంలో నిలదొక్కుకుంది సంగీత.

స్త్రీలు ఎటువంటి పరిస్థితుల్లోనూ మనోధైర్యం కోల్పోకూడదని ఈ కథ నొక్కి వక్కాణిస్తుంది. స్త్రీ విద్య యొక్క ఆవశ్యకత ఇందులో మరో కోణం.

దేశంలో చాలామంది పిల్లలు చదువుకునే దశలో పెళ్ళిలు చేస్తే వారి ఉన్నత చదువులు దెబ్బతిని, జీవితాలు ఆగమవుతున్నాయని, అత్త వారింట్లో గృహహింసకు బలి అవుతున్నారనే విషయాన్ని రచయిత ఈ కథలో చెప్పాడు.

**3. చర్విత చర్వణం**

పెండ్లి చేసుకున్న తర్వాత భర్త భార్యను ఎట్లా హింసిస్తాడో 'చర్విత చరణం' కథలో దేవరాజు మహారాజు వివరించాడు.

చర్విత చరణం కథలో భార్యాభర్తల మధ్య ఉన్న అనుబంధాన్ని పెండ్లినాడు ఆ జంట గురించి పెద్దలన్న మాటలకు భర్తలోని మరో మనిషి బయటకు వస్తాడు. అది భార్యపై ఆధిపత్యం ప్రదర్శిస్తూనే ఉంది. ఆఫీసు మొదలు అన్నింటా బయట మాటలు, అనుమానాలు ఏమీ చేయలేని భర్తలోని మరో మనిషి భార్యపై ప్రతాపం చూపిస్తాడు. ఫలితం పెళ్ళినాడు 'అమ్మాయి చక్కగా ఉంటుంది. చిదిమి దీపం పెట్టుకోవచ్చు" అన్న పెద్దల మాటలే నిజం అవుతాయి. దీపమే మిగులుతుంది. ఈ చిరుకథలో భార్యాభర్తల మధ్య అనుబంధాన్ని చెబుతారు. ఎదుట మనిషిని అంటూ ఆనందించే మనుషులను చూపుతారు.

భర్తలో మంచి మార్పుకోసం ఎదురు చూసిన భార్యకు కాలం గడిచినా నిరాశే మిగలడం వల్ల బతకడం వ్యర్థమని భావించి ఈ లోకాన్ని విడిచి వెళ్తుంది. భర్తలో మార్పురాక చివరికి భార్య ఆత్మహత్య చేసుకున్న విధానం ఈ కథలో కనబడుతుంది.

పురుషుల ఆధిపత్యం, అహంకారం, మొండితనం, తాగే వ్యసనం మొదలైన వాటివల్ల స్త్రీలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారో ఈ పైన పేర్కొన్న అమ్మవాసన, సంగీత, చర్విత చరణం మొదలైన కథల్లో గమనించవచ్చు.

**4. ప్రజాస్వామ్యమా వర్థిల్లు**

ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి ఎలక్షన్ డ్యూటీ వేయడంతో ఆమె తనకు చిన్నపిల్లలు ఉన్నారని, ఆ పాఠశాలలోని హెడ్ మాస్టర్‌ను, ఎమ్మార్వోను డ్యూటి క్యాన్సిల్ చేయమని బతిమిలాడిన విధానం రచయిత్రి జిల్లేళ్ళ అనసూయ 'ప్రజాస్వామ్యమా వర్థిల్లూ' కథలో విశ్లేషించారు. ఈ కథ 'తెలంగాణ బతుకుచిత్రాలు' కథా సంపుటిలోనిది.

జ్యోతిర్మయి, శ్రీకాంత్ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు చిన్న కవల పిల్లలు ఉంటారు. జ్యోతిర్మయి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. భర్త వేరోచోట ఉద్యోగం చేస్తుంటాడు. ఎమ్మార్వోగారు ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులందరికీ ఎలక్షన్ డ్యూటీ వేస్తాడు. జ్యోతిర్మయి తన పిల్లలను వదిలిపెట్టి పోవడానికి ఇష్టంలేక ఆమె పని చేస్తున్న పాఠశాలలోని హెడ్ మాస్టర్‌ని డ్యీటీ క్యాన్సల్ చేయమని బతిమిలాడుతుంది. అతడు "నా చేతిలో ఏమీ లేదమ్మా.

పంపమన్నట్టు పేర్లు పంపకుంటే నామీద యాక్షన్ తీసుకుంటారు. అందుకే ఉన్నయి ఉన్నట్లు పేర్లు పంపించాను. ఇప్పుడు డ్యీటీ క్యాన్సల్ చేయడం నా చేతుల్లో లేదు. కావాలంటే ఎమ్మార్వోను కలిసి నీ సమస్య చెప్పుకో. ఆయన తలచుకుంటే డ్యూటీ క్యాన్సల్ అవుతుంది."(పుట:50) అని హెడ్ మాస్టర్ ఆమెతో అంటాడు.

జ్యోతిర్మయి ఎలక్షన్ ఆర్డర్ పట్టుకొని ఎమ్మార్వో ఆఫీసుకు వెళ్ళి సూపరిండెంట్‌తో "సార్ ఇంట్లో ఇద్దరు చిన్నపిల్లలను చూసేవాళ్ళెవరు లేరు. నా డ్యూటీ క్యాన్సల్ చేయండి." అని అతనితో చెప్తుంది. అందరూ ఏదో ఒక సాకుచెప్పి డ్యూటీ క్యాన్సల్ చేయమంటే ఇంక డ్యూటీలు ఎవరు చేస్తారమ్మా! ఇది ఎలక్షన్ కమిషన్ ఆర్డర్. డ్యూటీ చేయకపోతే యాక్షన్ తీవ్రంగా ఉంటుంది. అరెస్టు కూడా చేయవచ్చు. అయినా ఉద్యోగులు అన్నాక ఇలాంటి డ్యూటీలు లేకుండా ఎలా ఉంటాయి." (పుట:50) అని మందలింపుగా ఆమెను అంటాడు. ఎమ్మార్వోని కలిసి తన పరిస్థితిని చెప్పి బతిమాలుతుంది. అతడు నో నో అలా కుదరదు అని కఠినంగా ఎమ్మార్వో అనడంతో ఆమె ఇక లాభం లేదని ఈ పైరవీలు ప్రాధేయాలు పడటం కంటే డ్యూటీ చేయడమే నయం అనుకొని తన పిల్లలను ఆడబిడ్డ ఇంట్లో వదిలిపెట్టి నాలుగు రోజులు వెళ్ళి ఎలక్షన్ డ్యూటీ చేసి వస్తుంది.

ఈ కథలో జ్యోతిర్మయి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. ఆమె తన చిన్నపిల్లలను వదిలేసి ఎలక్షన్ డ్యూటి చేసిన వచ్చిన విధానం కనిపిస్తుంది. ప్రభుత్వం ఉద్యోగం చేస్తే సొంత నిర్ణయాలు ఉండవని, అన్ని వారిపైన ఉన్న అధుకారుల ఆర్డర్ ప్రకారమే చెప్పినట్లు చేయాలని, లేకపోతే వారిపై యాక్షన్ తీసుకుంటున్నారని ప్రభుత్వ ఉద్యోగులలో, అందులో మహిళా ఉద్యోగుల ఆటుపోట్లు ఎలా ఉంటాయనేది రచయిత్రి ఈ కథ ద్వారా సమాజానికి తెలియజేశారు.

అమ్మవాసన, సంగీత, చర్విత చరణం, ప్రజాస్వామ్యమా వర్ధిల్లు కథల్లో పురుషాధిపత్యం, తాగుడు వ్యసనాలకు లోనై స్త్రీలను ఎలా గృహహింసకు గురిచేస్తారో ఈ కథల ద్వారా తెలుస్తుంది. అదే విధంగా స్త్రీ ఉద్యోగ చేసే సందర్భంలో కూడా ఆ పై అధికారుల ఒత్తిడి, కుటుంబ వ్యవహారాలు, పిల్లలను చూసుకునే వీలును కల్పించడంలో అధికారులు చొరవ చూపక ఉద్యోగ హింస కూడా స్త్రీలను బాధిస్తుంది.

### 4.1.6. ప్రేమ కథలు

సమాజంలో అనేక విషయాలతోపాటు రచయితలు ప్రేమ వ్యవహారాలను కూడా కథల్లో చిత్రించారు. ప్రేమ అనేక రకాలుగా ఉన్నా ముఖ్యంగా స్త్రీ–పురుషుల మధ్య ఉన్న ఆకర్షణ అవగాహన త్యాగాన్నే ప్రేమగా చెప్పుకోవచ్చు. స్త్రీ, పురుషుల మధ్య ఉండే ప్రేమ సంబంధాన్ని నల్లగొండ జిల్లా కథల్లో చిత్రించారు. ఆ కథల్లో ఉన్న ప్రేమ, వైపల్యాలు, సమస్యలు, గొడవలు మొదలైన వాటిని కింది విభాగంలో విశ్లేషించాను.

**1. అంటు**

ముస్లిం యువతి, మాదిగ (దళిత) యువకుడు ప్రేమించి పెళ్ళి చేసుకున్న విధానం 'అంటు' కథలో కనిపిస్తుంది. రచయిత స్కైబాబ రాసిన 'అలాయి బలాయి' బహుజన కథల సంపుటిలో వివరించారు.

మాదిగ ఇద్దయ్య కొడుకు సురేష్ యూనివర్సిటిలో ఎమ్మెస్సీ ఫస్టియర్ చదువుకొంటున్నాడు. ఊర్లో ముస్లిం అమ్మాయి రేష్మా, సురేశ్ ని ప్రేమిస్తుంది. ఒకరోజు రాత్రి ఇద్దరు కలిసి యూనివర్సిటీలోకి లేచిపోయి స్టూడెంట్ లీడర్స్ ని కలిసి పెండ్లి చేయమని, వారిని వత్తిడిచేసి ఒప్పించి, వారి సమక్షంలో ఆర్ట్స్ కాలేజి ప్రక్కన గుళ్ళో దండలు మార్చుకుంటారు. ఈ విషయం తండ్రికి తెలియనివ్వరు.

రేష్మా కుటుంబానికి వీళ్ళు ఎక్కడ ఉన్నారని తెలుస్తుంది. తండ్రి బంధువులు యూనివర్సిటీ అంబేద్కర్ హాస్టల్‌కి వచ్చి స్టూడెంట్ లీడర్స్ ను కలిసి రేష్మా, సురేశ్‌లతో మాట్లాడమంటారు. రేష్మా తండ్రిని హాస్టల్ వెనుక గ్రౌండ్‌లో కూర్చోబెట్టి, బంధువులు మాత్రమే రూంకి వెళ్లి ఇద్దర్ని విచారించి మాట్లాడుతారు. సరే అయిందేదో అయిందిగాని వాళ్లపద్ధతి ప్రకారం పెండ్లి చేసుకోవాలని అంటే అతడు పెండ్లిమాత్రం వాళ్ళ ప్రకారం చేసుకుంటానని అంటాడు. "అయితే ఒక చిన్న పని చెయ్యాల్సొస్తది. మా ఇండ్లల్ల ఒట్టిగా మజేదుల నిఖా చదివించడానికైనా ముస్లిం పేరు పెట్టుకోవాలె, అట్లనె నిఖాకు ముందే సున్తీ చేయించుకోవాల్సి ఉంటది." (పుట: 94) అని వారు అనడంతో సురేశ్ కొంచంసేపు ఆలోచించి, స్నేహితులతో, లీడర్స్ తో చర్చించి రెండు రోజులు టైమ్ కావాలని అంటాడు. వాళ్ళు కూడా సరే అట్లనే కానివ్వమని అంటారు.

తండ్రి కూతురుతో మాట్లాడాలని అక్కడికి వెళ్తాడు. రేష్మ తండ్రి కాళ్లమీద పడి బోరున ఏడుసుకుంట తనని క్షమించమని వేడుకుంటుంది. తండ్రి ఆమెను పైకి లేపి గుండెలకు హత్తుకొని ఏడుస్తాడు. రెండు రోజులు టైము ఉందిగద మళ్ళావద్దామని తనతో రమ్మంటాడు. రేష్మా స్టూడెంట్ లీడర్ ఒప్పుకోకపోవడంతో వెళ్ళిపోయారు. సున్తి చేయించుకోవడానికి భయపడి నాలుగురోజుల తరువాత ఇద్దరు అక్కడ నుండి ఎక్కడికో వెళ్ళిపోతారు.

ఈ కథ ముస్లిం సమాజానికి, దళిత సమాజానికి మధ్య ఉన్న ఘర్షణను ఎత్తిచూపింది. కుల నిర్మూలన జరగాలంటే కులాంతర వివాహాలు జరగాలన్నది అంబేద్కర్ ఆలోచన. కానీ ఏకులం అందుకు సిద్ధపడి లేదు అని రచయిత ఈ కథ ద్వారా సమాజానికి తెలియజేస్తున్నాడు. దీనిలో కన్నతల్లి దండ్రుల బాధను కూడా చూపిస్తాడు రచయిత.

**2. గది**

కిరణ్ క్యాంపస్‌లో చదువుకునే రోజుల్లో ఉదయిని పరిచయమైతుంది. కిరణ్ పి.జి. అయిపోయిన తర్వాత క్యాంపస్ బయట ఒక గది కిరాయికి తీసుకుంటే, ఉదయిని అతని గదికి వస్తుంది. ఆమె వరంగల్‌లో ఎన్‌కౌంటర్ అయి చనిపోతుంది. కిరణ్ ఆమెతో గడిపిన జ్ఞాపకాలను, వారి కలలను రచయిత గుడిపాటి వెంకటేశ్వర్లు 'గది' కథలో 'నల్లగొండ కథలు' సంకలనంలోనిది ఈ కథ.

కిరణ్ ఆర్ట్స్ కాలేజీలో పి.జి. చదువుతున్నప్పుడు అనుకోకుండా ఉదయిని పరిచయమై అది వారి ఇద్దరి మధ్య స్నేహమో, ప్రేమోగాని నడుస్తుండేది. ఉదయిని పాటలు బాగా పాడుతుంది. కిరణ్ పి.జి. అయిపోగానే క్యాంపస్ బైట ఒక గది కిరాయికి తీసుకుంటాడు. ఉదయిని అతని గదికి వస్తుంది. అతనితో గడుపుతుంది. అనేక సార్లు ఏకాంతంలో గడుపుతారు. గంటల తరపడి కబుర్లతో కాలాన్ని దొర్లించారు. ఒకరికోసం ఒకరు తెలియకనే ఎదురుచూసుకునేవారు. సకలం మాట్లాడుకునేవారు. కలలు ఎన్నో కంటారు. చదివిన పుస్తకాల గురించి చర్చించుకుంటారు. క్యాంపస్‌లో ఉండే రోజుల్లో ఊరి నుంచి వచ్చిన ఉదయినితో ఆర్ట్స్ కాలేజీలో, ల్యాండ్ స్కేప్ గార్డెన్‌లో... క్యాంపస్

క్యాంటీన్‌లో...ఎన్నెన్ని మాటలో...కబుర్లో...! మధ్యమధ్యలో పాటలూ వాళ్ళలో వాళ్ళకే వినిపించేట్టుగా, ఉదయిని బాగా పాడుతుండేది. ఆమె పాటకు అందాన్ని ఇస్తుండేది, ఆమె కంఠస్వరం. ఆమె పాటలో విషాదమూ, విషాద మాధుర్యమూ ఉంటుంది.

ఉదయిని వరంగల్‌ల్లో 'లా' చదువుతున్నప్పుడు ఒకసారి కిరణ్ వారాసిగూడలో ఉన్న ఇంటి గదికి వస్తుంది. అది మేడమీద ఒక్కటంటే ఒక్కటే ఒంటరిగా ఉన్న గది. కిరణ్ పి.జి. ఫలితాల కోసం ఎదురుచూస్తూ, ఓ ఈవినింగ్ డైలీలో పనిచేస్తుండేవాడు. రిజల్ట్ రాగానే ఎం.ఫిల్. తర్వాత పిహెచ్.డి చేయాలనుకుంటాడు. ఈ లోగా వరంగల్‌లో లా పూర్తి చేసి ప్రాక్టీస్ మొదలుపెట్టాలనుకుంటుంది ఉదయిని.

ఒకసారి వారం, రెండు వారాలు, మూడు వారాలు దాటుతుంది. ఉదయిని జాడలేదు. తెల్లారి ఉదయిని కోసం వరంగల్ వెళ్ళాలనుకున్నాడు. తెల్లారక ముందే ఉదయిని ఎన్‌కౌంటరయ్యిందని వార్త. పాటలు పాడటం ఆమె నేరమయింది. మూడు రోజుల కిందట వరంగల్ ఆర్.ఇ.సిలో పాటలు పాడిన ఉదయిని తిరిగి హాస్టల్‌కు చేరలేదు. మూడు రోజుల తర్వాత అడవుల్లో ఎన్‌కౌంటరయిన ఉదయిని, నిచ్చెలిలేనితనం, స్నేహరాహిత్యం, మరల అతని గుహలోకి, కకావికలమైన కలలు...కలలని తాకిన మృత్యుశీతల స్పర్శ, వాళ్ళ వెచ్చటి కలలకు సాక్షిగా నిలిచిన గది బోరుమంది.

ఈ కథలో కిరణ్, ఉదయినిలు ప్రేమించుకున్నారనేది వాస్తవం. రచయిత వాళ్ళది ప్రేమో, స్నేహమో అని కథలో రాశాడు. ప్రేమ కానిదే ఇద్దరు ఒకే గదిలో ఎందుకు ఉంటారు? ఎందుకు గడుపుతారు? అది ప్రేమ కానప్పుడు కిరణ్ ఆమెకోసం ఎందుకు పరితపిస్తాడు. కలలు కంటాడు. ఉదయిని కూడా అప్పుడప్పుడు అతని గదికి వస్తుంది. వారు చదువుకోవాలన్న కోరికలు ఫలించలేదు. ఉదయిని పాటలు పాడుతుంది. ఆమె పాటలు పాడటం వల్ల ఎన్‌కౌంటరయి చనిపోవడంతో, కిరణ్ ఆమెతో గడిపిన జ్ఞాపకాలను తుడుపుకోలేకపోతున్నాడు. తన గది వారి కలలకు సాక్షిగా నిలుస్తుందనేది రచయిత పాఠకులకు తెలియజేశాడు.

**3. ఆశిర్కం**

ఒకరిని ప్రేమించి, ఇంకొకరిని పెండ్లి చేసుకోవడం ఇష్టంలేక, ప్రేమించిన వ్యక్తి ఆమెను పెండ్లి చేసుకోవడానికి ఒప్పుకోకపోవడంతో మందుతాగి ప్రాణాలు విడిచి, తల్లిదండ్రులను శోక సముద్రంలో ముంచివెళ్ళిపోయే యువతి దీనావస్థను 'ఆశిర్కం' కథలో కనిపిస్తుంది. రచయిత భూతం ముత్యాలు 'దగ్దం' కథా సంపుటంలో చిత్రించారు.

ఇద్దయ్య తన కూతురు స్వప్నను నల్లగొండలోని కాలేజిలో చదివిస్తాడు. ఆమె క్లాస్‌మెట్‌ను ప్రేమించి అతనితో తిరగడంవల్ల ప్రెగ్నెంట్ అవుతుంది. ఈ విషయం స్వప్న తమ తల్లిదండ్రులకు చెప్పకపోవడంతో, వారు వాళ్ళ మేనత్త కొడుకు మేనబావతో పెండ్లి చేయడానికి స్వప్నను ఒప్పిస్తారు. స్వప్న ఈ పెండ్లి చేసుకోవడం ఇష్టంలేక, తను ప్రేమించిన వ్యక్తి దగ్గరికి పెళ్ళి చేసుకొమ్మని అడుగుతుంది. అతడు నువ్వంటే ఇష్టమే అంటూ కాలేజిల ఇదంతా మామూలే అని అంటాడు. నీవల్ల నేను నీల్లుపోసుకున్న, నాకు ఇప్పుడు నాలుగోనెల, నా బతుకు ఆగం చేయకు అంటే అతడు "నువ్వు నా ఒక్కడితోనే తిర్గినావే, అట్ల తిర్గినవని నమ్మకమేంది. నాతో తిరిగితే నీ బావతోని ఎట్ల పెళ్ళికి ఒప్పుకున్నవ్" (పుట:109) అని పెండ్లి చేసుకోవడానికి ఒప్పుకోకపోవడంతో ఇగ ఆమెకు ఏమి చేయాలో అర్థం కాలేదు. పొట్ట రోజురోజుకు పెరుగుతుంటే, తల్లిదండ్రులకు చెప్పితే వాళ్ళ పరువుపోతుందని, ఆమె వల్ల వాళ్ల విలువ పోకూడదని అక్కను చూడబుద్ది అవుతుందని తల్లిదండ్రులతో చెప్పి, స్వప్న మందుతాగి రాత్రి అక్క ఇంటికి వచ్చి ఆమెను లేపి జరిగిన విషయం అంతా చెప్పితే అక్క ఆశ్చర్యపోతుంది. ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పవద్దని స్వప్న అక్కతోటి చెపుతూ, అవస్తపడుతూ, గోసతీస్తూ అక్కఒడిలో తెలగండ్లేస్తూ, మెల్లగా నిద్రలోకి జారుకుంటుంది. అక్క పెద్దగా ఏడ్చేసరికి చుట్టుపక్కలవారు లేసి వచ్చి గుమికూడి చూసి అందులో ఒకడు నూటఎనిమిదికి ఫోన్ చేస్తే అరగంటల ఊర్లోకి రావడంతో అందులో అక్క భర్త వారిని ఎక్కిస్తాడు. చెల్లితల ఒళ్ళో పెట్టుకొని అక్క ఏడుస్తుంది. కడుపుల మందు కక్కలేక తనుకులాడి, తనకులాడి 108లో నల్లగొండకు పోయేసరికి స్వప్న జీవన్నా ఆగుతుంది.

స్వప్న మరణించిందని, పోలీసులు వచ్చి విచారణ జరిపితే బాడిని పోస్టుమార్టం చేసి అప్పగిస్తామని డాక్టర్లు చెప్తారు. ఆ రాత్రి అక్క తల్లిదండ్రులకు పోన్ చేసి చెప్పితే వారు వెంటనే వొల్లవొల్ల ఏడుస్తూ నల్లగొండకు వస్తారు. ఈ విషయం ఊరంతా తెలిసి ఎందుకిట్ల చేసిందోనని చుట్టుపక్కల వాళ్ళు అందరూ నల్లగొండ పెద్దాసుపత్రికి చేరి స్వప్న పోస్టుమార్టం కోసం శవాలగది దగ్గర కూర్చొని, ఊరిపెద్దలు తల్లిదండ్రులకు దైర్యం చెప్తారు. బిడ్డ ఎందుకు సచ్చిందో తల్లిదండ్రులకు అంతుచిక్కక తలలు పట్టుకున్నారు. అక్కకు విషయం తెలిసినా వారికి చెప్పకుండా గుక్కపట్టి ఏడుస్తుంది. డాక్టర్లు శవాన్ని పరీక్ష చేసి, స్వప్న పేరును, తండ్రిపేరును అడిగి "ఇగో ఇద్దయ్య నీ బిడ్డ పొట్టలో ఉంది ఏమన్న ఎర్కనా నీకు" అంటూ చిన్నగా డాక్టర్ అనగానే లబోదిబోమంటూ ఏడుస్తూ ముతక తువాలు మూతికి అడ్డం పెట్టుకొని "అమ్మ... ఓయమ్మ...ఎంతనైంది తల్లీ, మాతోని ఒక్క మాటన్న చెప్పవైత్వి తల్లి, మేం పరాయోల్లమైనామె, మమ్ముల ఎడబాప్తివి తల్లి, ఆడొవడో చెప్తె ఆనికి నిన్నిచ్చి లగ్గం జేద్దుగదనే, నా బంగారమా, నా లచ్చవరాల కోటా, నన్ను ముంచితివా తల్లి, నేనెట్ల తలెత్తి ఊర్ల తిరిగేది అమ్మ" (పుట: 110, 111) తండ్రి వొలపోత పోస్తుంటే, తల్లి కుములుతూ రొమ్ము బాదుకుంటూ గుండెలు అవిసేల ఏడుస్తుంటే చెల్లె చెప్పిన రహస్యం గుట్టు ఇప్పక వారితో సుతికల్పి అక్క కూడా ఏడుస్తుంది. చుట్టుపక్కలవారు కన్నీరు పెట్టుకొని, వాళ్ళను ఓదార్చుతున్నారు. పోలీసులు కేసు రాసుకొని, డాక్టరు పోస్టుమార్టం చేసి పీనిగెను అప్పగిస్తారు.

ఊరి పెద్దలు ఇద్దయ్యకు దైర్యం చెప్పి, పీనిగె సావుకర్సులు బరించి, పెళ్ళి కాని పిల్ల అని పీనిగెను ఒంటిపాడెన చితి వద్దకు స్వప్నను చేర్చారు. పద్సుగుండెల కలలు రేపి కలగా కరిగిపోయిన స్వప్నను చూడటానికి చుట్టుపక్కల ఉన్న ఊర్లలోని అందరు కదలివచ్చి చూశారు. చితికి మంట పెట్టడంతో ఆ మంటలో స్వప్న కాలి బూడిదగా మారుతుంటే, జనం చివరి చూపు చూసి ఎనుకకు మళ్ళారు. ఆ రోజంతా ఊరిలో స్వప్న గురించే మాట్లాడుకోవడం, పుట్టి ముంచిన దుఃఖంతో ఇద్దయ్య, అతని కుటుంబం మునిగిపోతుంది.

తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుకొమ్మని కాలేజికి పంపిస్తే, వారు తెలిసి తెలియక మగవాళ్ళ ఆకర్షణకు లొంగిపోయి ప్రేమలో పడి, వారి బతుకులను ఛిద్రం చేసుకొని, ఇట్లా

మరణించడం జరుగుతోందని, వారు చనిపోవడం వల్ల కుటుంబం ఎంత బాధపడ్తుందో రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు.

**4. మిస్ వహీదా**

వహీదాకు పెళ్ళి అయ్యి పిల్లలు ఉన్నాగాని, నిస్సార్ అనే వ్యక్తిని ప్రేమిస్తుంది. నిస్సార్‌కు కూడా పెళ్ళై ఇద్దరు పిల్లలు ఉంటారు. వహీదా, నిస్సార్‌తో తనకు పెళ్ళి కాలేదని చెప్పడం, తనను పెళ్ళి చేసుకోమ్మని ఫోన్‌లో చెప్పడం, పదే పదే అతనికి ఫోన్ చేయడం, చివరకు ఆమె ఫ్యానుకు ఉరేసుకొని మరణించిన విధానాన్ని రచయిత స్కైబాబ 'మిస్ వహీదా' అనే కథలో చిత్రీకరించాడు. ఈ కథ 'బేచారే' భగ్న ప్రేమ కథలు సంపుటంలోనిది.

నిస్సార్ తన ఫ్రెండుకి ఫోన్  చేస్తే అన్నుకోకుండా వహీదాకు పోతుంది. ఫోన్‌లో పరిచయమై అది చివరికి ప్రేమగా మారుతుంది. వహీదా రోజూ నిస్సార్‌కు ఫోన్ చేయడం, అతడు ఆమెతో మాట్లాడటం జరుగుతుండేది. నిస్సార్‌కు పెండ్లి అయ్యిందని ఇద్దరు పిల్లలు ఉన్నారని, ముందుగానే ఆమెతో చెప్తాడు. వహీదా మాత్రం పెళ్ళి అయి ముగ్గురు పిల్లలు ఉన్నాగాని, తనకు ఇంకా పెళ్ళి కాలేదని నిస్సార్‌కు చెప్పి తనను పెళ్ళి చేసుకొమ్మని అంటుండేది. కానీ, నిస్సార్ ఆమెను మరో వ్యక్తిని పెళ్ళి చేసుకో, నాకు పెళ్ళి అయ్యిందని చెప్తాడు. అయినా వినకుండా నిస్సార్ భార్యతోని మాట్లాడుతానని, తప్పంతా నాదేనని, నేను అతన్ని పెళ్ళి చేసుకుంటానని అందరం కలిసి ఉందామని అక్కతో మాట్లాడతానని వహీదా అంటుంది. నిస్సార్ అతనిని వదిలేయమని, మీవాళ్ళు చూసిన సంబంధం చేసుకొమ్మని అంటాడు. వహీదా తన గురించేగాని అక్క పేరును ఉపయోగించి మా అక్కకు మావాళ్ళు తక్కువ కట్నం అని ఒక మూర్ఖునికి ఇచ్చి పెళ్ళి చేస్తారు. అతడు ఇంట్లోనుంచి బయటకు వెళ్లనీయడు. చుట్టుపక్కల వాళ్లతోటి మాట్లాడనీయడు. ముగ్గురు ఆడపిల్లలు పుట్టినాగాని, మగ పిల్లవాడు కావాలని హింస పెట్టెటోడు అని, మా ఆచారంలో బురఖా వేసుకొని ఎవరికి అగుపించకుండా మొత్తం కప్పుకుంటే ఎవరు ప్రేమిస్తారు. అయినా ప్రేమిస్తే, ఆ ప్రేమను మా ఇంట్లో ఒప్పుకోరు. కనీసం మాట్లాడనీయరు. మనసుకు నచ్చిన వారితో ఎలా పెళ్ళి చేస్తారు మా వాళ్ళు అని నిస్సారుతో వహీదా అంటుంది.

ఒకసారి నిస్సార్ ఆఫీసులో మీటింగులో ఉండగా వహీదా ఫోన్ చేస్తుంది. అతడు ఫోన్ కట్ చేసి సైలెంట్‌లో పెడతాడు. ఫోన్‌కు వహీదా చాలాసార్లు ఫోన్ చేసి, మెసేజ్ పెడుతుంది. నిసార్

మీటింగ్ అయిపోయి తర్వాత చూస్తే మిస్ కాల్స్ చాలా ఉంటాయి. మెసేజ్‌లు ఉంటాయి. వహీదాకు ఫోన్ చేస్తాడు. స్విచ్ ఆఫ్ వస్తుంది. మెసేజ్‌లు చూస్తాడు. "నీతో మాట్లాడాలి, అర్జంట్ మళ్ళీ మాట్లాడే అవకాశం ఉండదేమో! అని ఏమి కనిపించని ఈ దుఃఖంలో ఏమని మెసేజ్ పెట్టను. నాకు నీతో ఒక్కసారి మాట్లాడాలని, నీ గొంతు వినాలని మనసు ఆరాటపడుతోంది. నిన్ను చాలా విసిగించాను కదా... ఓపికగా నన్ను వినేవాడివి. అందుకు చాలా కృతజ్ఞతలు. ఇకపై నిన్ను విసిగించను, గుడ్ బై నిసార్." (పుట: 91. బేచారె భగ్న ప్రేమ కథలు. స్కైబాబ) అని ఉంటుంది. నిసార్ వెంటనే ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తున్నగాని మళ్ళీ మళ్ళీ ఫోన్ చేస్తాడు. లాభం లేకపోతుంది. ఆ తర్వాత నుండి వహీదా నుంచి అతనికి ఫోన్ రాలేదు.

వహీదా ఫోన్‌లో మాట్లాడి చెప్పిన వివరాల ప్రకారం నిసార్ వాళ్ల ఊరికి వెళ్ళి కలిసి వద్దామని ఆదివారం కరీంనగర్ బస్సు ఎక్కి వహీదా ఊరికి వెళతాడు. ఒక చెట్టుకింద కూర్చున్న ముసలాయనను వహీదా ఇల్లు అడిగితే చెప్పడంతో అక్కడికి వెళ్ళగానే పిల్లలు ఇంటిముందు ఆడుకుంటారు. వహీదా ఇల్లు ఎక్కడ అని వారిని అడగగా ఇదేనని లోపలికి తీసుకెళతారు. ఇంట్లో ఎవరూ లేరా అంటే పిల్లలు నాన్న డ్యూటికి వెళ్ళాడని, నానమ్మ బయటకు వెళ్ళిందని చెప్పడంతో, అతడు వహీదా లేదా అంటే ఐదు సంవత్సరాల పాప వహీదా చచ్చిపోయిందిగా అని అంటుంది. నిసార్ ఒక్కసారిగా షాక్‌కు గురి అవుతాడు. ఎలాగని అడిగితే, ఫ్యాన్‌కు అని ఇంట్లో ఉన్న ఫ్యాన్ చూపెడుతుంది. అతను ఫ్యాన్ వైపు చూసేసరికి గోడకు ఈ మధ్యనే కొత్తగా ఫోటో తీయించి పెట్టిన ఫ్రేమ్‌ను చూసి ఈ ఫొటోలో ఉన్నది ఎవరని, వారిని అడుగుతాడు. ఆ ఫోటోలో ఉన్న ఆమెనే మా అమ్మ అని పెద్ద మాటలు చెప్పుతుంది. అమ్మనాన్న కొట్టుకున్నారు అని ఐదు సంవత్సరాల పాప అంటుంది. ఇంతలో చిన్న అమ్మాయి ఉరికి వచ్చి అతని కాళ్ళకు చుట్టుకుపోతుంది. అతడు వంగి ఆ అమ్మాయిని ఎత్తుకొని అచ్చం ఫోటోలోని వహీదా లాగా ముద్దుగా ఉందని, అతని కళ్ళలో నీళ్ళ సుడులు తిరుగుతాయి. ప్రేమతో ఆ అమ్మాయిని ముద్దు పెట్టుకుంటాడు.

ఈ కథలో పెండ్లి అయిన పిల్లలు ఉన్నాగాని, వహీదాకు సంసారంలో సుకమనేది లేదని, ప్రేమ ఆప్యాయతలు లేవని, స్వేచ్ఛ అనేది లేకుండా, తన భర్త చేయడంవల్ల ఆమె మనసు విరగడం, అనుకోకుండా నిసార్ ఫోన్‌లో పరిచయం కావడం, అతడు ప్రేమగా మాట్లాడడంతో అతని మాటలకు ఆమెకు ప్రేమ పుట్టుక వస్తుంది. కాని అతన్ని పెండ్లి చేసుకొమ్మని చెప్పుతుంది. కాని నిసార్‌కి పెండ్లి

అయి ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పినా వినిపించుకోదు. ఆఖరికి అతడు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో, మెసేజ్ వస్తుంది. భార్య భర్తలు గొడవపడి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోతుంది. ఆమె ప్రేమ విఫలమవుతుంది. అలాగే సమాజంలోఓ వహీదా లాంటివారు చాలామంది మహిళలు ఉన్నారని రచయిత పాఠకులకు తెలియజేశాడు.

అంటు, గది, ఆశిర్కం, మిస్ వహీదా కథల్లో ప్రేమకు సంబంధించిన సంబంధాలు మనం పరిశీలించవచ్చు.

### 4.1.7. విషాద కథలు

జీవితంలో అనుకోకుండా జరిగిన సంఘటనల, ప్రమాదాల వల్ల ఏర్పడిన బాధ, దుఃఖాలను గురించి కథా రచయితలు వారి కథల్లో సృజన చేశారు. ఆ కథల్లోని అంశాలనే విషాద కథలుగా ఈ ఉపవిభాగంలో చర్చించాను.

**1. దృశ్యాదృశ్యం**

చిన్న పిల్లడు అఖిల్‌ను కిడ్నాప్ చేసి చంపేస్తారు. అయితే చనిపోయిన తర్వాత జరిగిన సంఘటననలు మాత్రమే 'దృశ్యాదృశ్యం' కథలో కనిపిస్తాయి. రచయిత వి. మల్లికార్జున్ రాసిన 'ఇరానీ కేఫ్' కథా సంపుటంలోనిది ఈ కథ.

అఖిల్ తండ్రి మహేశ్, తల్లి రాజేశ్వరి. వీళ్ళ కారు డ్రైవర్ సాయిరాం. అఖిల్ సాయిరాంను అంకుల్ అని పిలుస్తుండేవాడు. ఒకరోజు సాయిరాం అఖిల్‌ను కిడ్నాప్ చేసి చంపుతాడు. ఈ విషయం న్యూస్ ఛానల్స్, ఫోన్స్, పేస్ బుక్‌లలో మారుమోగుతుంది. 1. ఛీ ఈ మనిషనేవాడు మారడారా? విసుగ్గా అజిత్, తన స్మార్ట్ ఫోన్‌లో న్యూస్ చదువుతూ విజయ్‌తో "పదేళ్ళ చిన్నపిల్లాడ్ని కిడ్నాప్ చేసి చంపేసారు" అని అంటాడు. అబ్బా! అని కోపంగా నిట్టూర్చాడు విజయ్. ఇద్దరు కాసేపు మౌనంగా ఉండిపోయారు. 2. ప్రముఖ పత్రిక ఇంటర్నెట్ విభాగంవారు "ఆ చనిపోయిన బాబు ఫోటోలు రెడీ చేస్కో గ్యాలరీల పెడదాం" అని అజయ్‌తోటి ఎడిటర్ రామారావు చెబుతాడు. అతడు ఓకేసార్ అంటాడు. 3. సౌమ్య తన పేస్ బుక్ బ్రౌజ్ చేస్తూ ఉంటే అఖిల్‌ను వాళ్ళ డ్రైవరే కిడ్నాప్ చేసి చంపేశాడని" ఉండటంతో సౌమ్య తన తల్లి లక్ష్మిని పిలిచి చూపించగానే "అయ్యో ఎంత ఘోరం,

పాపం అంటూ" ఇద్దరూ నిట్టూర్చారు. 4. వినయ్ వాళ్ళ అన్నకొడుకు కనిపించకపోతే భాస్కర్, రాజు వెతుకుతారు. తర్వాత వినయ్‌కి ఫోన్ వచ్చింది. కారు డ్రైవర్ కిడ్నాప్ చేసి చంపేశాడని తెలిసిందని ఈ విషయం భాస్కర్, రాజుతో చెబుతూ, బాడీని ఇంటికి తీసుకొచ్చారంట...మనం వెళ్దాం. నేను బయలుదేరుతున్న నేరుగా అక్కడికే వెళ్దాం అని చెప్తాడు. 5. స్కూల్‌కు ఆరోజు సెలవు ఇవ్వడంతో, ఒకే అపార్ట్‌మెంట్‌కి చెందిన చింటూ, బన్నూ ఇద్దరు అపార్ట్‌మెంట్ పార్కులో కూర్చొని మన ఫ్రెండ్స్ అఖిల్ గాణ్ణి మిస్సవుతాం కదరా! అని చింటూ, బన్నూ బాధపడతారు. అతన్ని చూడాలని వారికి ఉంటుంది. కాని వాళ్ళ మమ్మీలు పంపిస్తలేరని ఇద్దరు ఒకరి మొకం ఒకరు చూసుకొని ఏడుస్తుంటారు. 6. విలేకర్లు వచ్చి మహేశ్ మామతో మీరెలా ఫీలవుతున్నారు? అనే ప్రశ్నకు అతడు కంగుతిన్నట్టు చూస్తున్నాడు. పక్కన కొడుకు పోగొట్టుకొన్న బాధలో ఉన్న మహేశ్ కోపంగా అక్కడ నుంచి వెళ్ళిపోతాడు. విలేకర్లు పోలీసోల్లను ఈ హత్య ఎలా జరిగిందని భావిస్తున్నారు? హంతకుణ్ణి ఎప్పటిలోగా పట్టుకుంటారు? అక్కడే నిలబడి ఉన్న పోలీస్ ఆఫీసర్‌ను పశ్నలతో ముంచెత్తారు. పోలీసులేవో చెబుతూనే ఉన్నారు. ఏదో మాట్లాడుతున్నట్టే ఉన్నా, ఏమి వినబడట్లేదు. వాళ్లనే దీనంగా చూస్తున్న మహేశ్ తండ్రికి, మహేశ్ తలను గోడకు కొట్టుకుంటున్నాడు. పక్కనే నిలబడి బామమర్దితో ఏదో మాట్లాడుతుంటే, అప్పుడే అక్కడికి వచ్చిన అత్త రావటంతోనే కూలబడి పోయింది. "అప్పుడే నీకు నూరేళ్ళు నిండాయారా నానా" అంటూ ఏడుస్తుంటే అక్కడ ఉన్న వారంతా బోరున విలపిస్తున్నారు. 7. అఖిల్, సాయిరాంతో ఉదయం మాట్లాడిన మాటలను సాయంత్రం గుర్తుచేసుకుంటు 'అయ్యో... ఎంతపని చేశాను. అంత చిన్న పిల్లణ్ణి చంపేశానా? ముద్దు ముద్దు మాటలు చెప్పే అక్కిగాణ్ణి... నన్నిష్టపడే అక్కిగాణ్ణి...నా అక్కిగాణ్ణి ఈ చేతులతో చంపేశానా? కుమిలిపోయి ఏడుస్తూ, గట్టిగా అరుస్తూ, సాయిరాం ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. 8. ఆ రోజు అఖిల్ వాళ్ళ అమ్మ కంటే ముందు లేస్తాడు. తల్లి చేయిపట్టుకొని చూసి వేడిగా ఉందని అంటే ఆమె లైట్‌గా జ్వరమొచ్చిందంటే నానా అంటుంది. 'నేను పెద్దవాణ్ణైతే నీకు ఈ బాధలేం ఉండవ్ లేమ్మా! నేను డాక్టర్నవుతా కదా! అని తల్లితో అంటే, సంతోషించి, సరేపదా స్కూల్‌కి టైం అవుతుంది. రెడీ అవుదువుగానీ..నేనీరోజు స్కూల్‌కి వెళ్లనమ్మ" అంటాడు. స్కూల్‌కి తప్పకుండా వెళ్ళాలమ్మ...అయినా నీకీ రోజు క్విజ్ పోటీ కూడా ఉంది కదా! ఉమ్...సరేలేమ్మ అంటూ బుంగమూతి పెట్టిన అఖిల్ గుర్తుకువచ్చి మరింత ఏడుస్తోంది.

తల్లి ఆ మాటలను విని అప్పటికి సరిగ్గా ఐదు రోజులైంది. కళ్ళనుండి కన్నీళ్ళలాగే వస్తున్నాయి. ఫోటో ప్రేమంతా కన్నీళ్ళతో నిండిపోయి మసకబారిపోయింది. ఆ ఫ్రేమ్‌ని తన పైటతో తుడిచింది. కళ్ళంత చేస్తూ చూస్తున్న అఖిల్ ఫోటో అది. ప్రకృతి సంతోషమంతా తన నవ్వులో, ప్రశాంతత తన కళ్ళలో నింపుకొని ఆరోజు కలా మిగిలిపోయాడు. ఓ జ్ఞాపకంలా.

ఈ కథలో సాయిరాం అనే కారు డ్రైవర్. కారు ఓనర్ కొడుకును అఖిల్ అనే చిన్న పిల్లగాన్ని కిడ్నాప్ చేసి చంపుతాడు. ఈ వార్త స్మార్ట్ ఫోన్లో న్యూస్ చూసినవారు, ఫేస్ బుక్‌లో చూసినవారు, పత్రిక ఇంటర్నెట్ వారు, అఖిల్ బాబాయి, ఫ్రెండ్స్, అఖిల్ స్కూల్ ఫ్రెండ్స్ అందరూ బాధపడి, ఏడుస్తున్నారు. విలేకర్లు వచ్చి బంధువులను, పోలీసులను అఖిల్ ఎట్ల చనిపోయాడని, హంతకున్ని ఎప్పుడు పట్టుకుంటారని ప్రశ్నలమీద ప్రశ్నలు న్యూస్ చానల్స్‌లో వేయడానికి అడుగుతారు. అఖిల్ తండ్రి తలకాయ గోడకు గుద్దుకుంటూ ఏడుస్తుంటాడు. వాళ్ళ అమ్మమ్మ అప్పుడే నీకు నూరేళ్ళు నిండాయారా నాన్న అని ఏడుస్తుంటే అక్కడి జనం బోరున విలపిస్తారు. ఆకరికి అఖిల్‌ను చంపిన సాయిరాం కూడా అంత చిన్న పిల్లగాన్ని తన చేతులతో చంపినాని కుమిలిపోయి, ఏడుస్తూ ప్రాణాలు వదులుతాడు. అఖిల్ ఆరోజు తన తల్లితో మాట్లాడిన మాటలను గుర్తు చేసుకుంటూ కండ్ల అతని ఫోటోను చూసుకుంటూ ఏడుస్తూ ఉంటుంది. అఖిల్ అందరి కండ్ల ముందు తిరిగి నాడు కాబట్టి ప్రతి ఒక్కరు బాధపడుతుంటారు.

ఈ విషాద గాథను రచయిత సమాజంలో జరుగుతున్న పరిణామాలను తెలియజేస్తూ, ఎవరిని నమ్మవద్దని, మన జాగ్రత్తతో మనం ఉండాలని, రచయిత తన కండ్లముందు జరిగిన సంఘటనలను పాఠకులకు అందించడం జరిగింది.

**2. కారు చెప్పిన కథ**

డ్రైవర్ మందుతాగి కారును స్పీడుగా నడిపి, ఆగి ఉన్న లారిని గుద్దడంతో, అందులో ప్రయాణించేవారు, డ్రైవర్‌తో సహ నలుగురు అక్కడికక్కడే ప్రాణాలను కోల్పోయిన విషాద గాథను

'కారు చెప్పిన కథ'గా మలిచారు రచయిత. వి. మల్లికార్జున్ రాసిన 'ఇరానీ కేఫ్' కథా సంపుటంలోనిది ఈ కథ.

రాజేశ్, రాఘవ, రామయ్య కారు డ్రైవర్ నర్సింహ్మా వీరు కారులో ప్రయాణిస్తుంటారు. కారు డ్రైవర్ ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్‌కు కొద్దిదూరంలో బస్సును క్రాస్ చేయబోయి ఆగి ఉన్న లారీని డీ కొట్టడంతో క్షణాల్లో అందులో ఉన్న నలుగురు చనిపోతారు. వారు 'రాజేశ్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. చిన్నప్పుడే తండ్రిని కోల్పోయాడు. ప్రస్తుతం తన అక్క దగ్గర ఉంటూ చదువుకుంటున్నాడు. తల్లిని వదిలి నిమిషం ఉండేవాడు కాదు. మంచి చదువులు చదువుకొని తన వాళ్లకు గొప్పపేరు తీసుకురావాలని, ఇష్టం లేకున్నా ఇంత దూరం వచ్చి చదువుకుంటున్నాడు. "రాఘవ హైదరాబాదులోనే డాక్టరుగా పనిచేస్తున్నాడు. అమెరికాలో ఓ డాక్టర్స్ మీట్‌ను చూసుకొని నిన్నే హైదరాబాద్ వచ్చాడు. ఇతనికి భార్య, ఓ పదేళ్ళ పాప ఉన్నారు. తన సొంతూర్లో ఓ పెద్ద ఆసుపత్రి కట్టాలనేది ఇతడి కల. ఆపనిమీదే వెళుతున్నాడిప్పుడు. 'రామయ్య, రాఘవ తండ్రి. ఒక్కగానొక్క కొడుకును ఉన్నత స్థితిలో చూడాలని ఇన్నాళ్ళు కష్టపడ్డాడు. ఈ మధ్యే రైటైరై చక్కగా మనవరాలితో ఆడుకుంటూ తనకు కథలు చెబుతూ ఇంటిని చక్కపెడుతున్నాడు. 'నర్సింహ కారు డ్రైవర్ కొన్నేళ్ళ నుండి డ్రైవరుగా పని చేస్తున్నాడు. చాలీ చాలని జీతంతో నెట్టుకొస్తున్నాడు. సొంతంగా కార్లను కొని కిరాయికి తిప్పుతూ తన కాళ్ళమీద తాను నిలబడాలని కోరుకుంటున్నాడు. అందుకు డబ్బులు కూడా సిద్ధం చేసుకుంటున్నాడు.

"నా కొడుకు మంచి స్థితికి వస్తాడు అని కుటుంబానికి గొప్ప పేరు తీసుకొస్తాడని కలలు కంటున్న ఆ తల్లికి", ముప్పై రెండేళ్లకే తన భర్తను కోల్పోయిన రాఘవ భార్యకు, తాతయ్యా కథ చెప్పవా? అనడిగే పాపకు, నర్సింహ్మా కుటుంబానికి, వాళ్ళతో సంబంధమున్న ఓ ప్రపంచానికి, ఇంకా ఇంకా..ఇంత మందికి సమాధానం ఎవరు చెప్తారు.

యాక్సిడెంట్ జరగడానికి నిమిషం ముందు 'ఎహెయ్. ఓవర్టేక్ చేయ్ నర్సింహ్మా, సాలె అని బస్సోణ్ణి అన్న రాఘవ, ఏంటంకుల్ ఈ స్పీడ్, మరీ చిన్న పిల్లల్లా' అన్న రాజేశ్, యాక్సిడెంట్

జరగడానికి గంట ముందు రెండు పెగ్గులేసిన నర్సింహ్మా ఆ పెగ్గేయడానికి కారణమైన రామయ్య... వీళ్ళు కారును స్పీడుగా పొమ్మనడంతో యాక్సిడెంట్ జరుగుతుంది.

ఈ కథలో మందు తాగి కారు నడుపుతున్న డ్రైవర్ నర్సింహ్మాకు, బస్సును క్రాస్ చేయమని చెప్పడం, బస్సు డ్రైవర్ని హౌలే అని రాఘవ తిడతాడు. డ్రైవర్ కారును స్పీడుగా పోనిస్తుంటే అంకుల్ స్పీడు ఎందుకు పోనిస్తున్నారని, మరీ చిన్న పిల్లల్లా అని రాజేశ్ అంటే పట్టించుకోకపోవడం, రామయ్య రెండు పెగ్గుల మందు నర్సింహ్మాకు పోయడంతో ఆ మత్తులో స్పీడుగా పోనిచ్చి ఆగి ఉన్న లారీని గుద్ది యాక్సిడెంట్ చేయడంతో నలుగురి ప్రాణాలు స్పాట్‌లో పోవడం జరుగుతుంది. వీరిని నమ్ముకున్న కుటుంబ పరిస్థితి ఏంటని ఒకసారి ఆలోచించాలని, వాహనాలు నడిపే ప్రతి ఒక్క డ్రైవర్లకు మందు తాగి నడపవద్దని, అలా నడిపితే వారు, వారితోపాటు అందరూ చనిపోతారని, రచయిత సమాజంలో వాహనాలను నడిపే ప్రతి డ్రైవరును ఉద్దేశించి అందులో ప్రయాణించే వ్యక్తులను ఉద్దేశించి ఈ కథ ద్వారా వారికి తెలియజేయడం జరిగింది.

దృశ్యాదృశ్యం, కారు చెప్పిన కథల్లో విషాదకరమైన సంఘటనలను మనం చూడవచ్చు.

### 4.2. వికలాంగుల కథలు

మన సమాజంలో భిన్న రకాల మనుషులు ఉంటారు. శారీరకంగా వివిధ రకాలుగా ఉంటారు. కొందరు పుట్టుకతో శారీరకంగా లోపాలతో పుడతారు. వారిని వికలాంగులు అని అంటున్నాం. వారికి ఎన్నో సమస్యలు ఒడుదొడుకులు ఉంటాయి. వారి సమస్యల గురించి, వారి జీవిత చిత్రణ గురించి సాహిత్యంలో వస్తున్నాయి. నల్లగొండ జిల్లా కథల్లో వికలాంగుల జీవితం గురించిన కథలు ఉన్నాయి. వాటిని ఈ విభాగంలో పరిశీలించాను.

**1. జేజి**

ఫ్లోరిన్ నీళ్ళ సమస్యతో ఒక అమ్మాయి వికాలాంగురాలై బాధపడ్తున్న విధానాన్ని రచయిత భూతం ముత్యాలు 'జేజి' కథలో చిత్రీకరించారు. ఈ కథ 'అవిటి కథలు' సంకలనంలోనిది.

నల్లగొండ జిల్లాకు సమీపంలో ఉన్న భాష కూడా గ్రామంలో ఓ అందమైన అమ్మాయి జేజి. ఈమె తల్లిదండ్రులు కూలినాలి చేసుకొని జీవనం కొనసాగిస్తుంటారు. నల్లగొండ ప్రాంతం ఉప్పు నీళ్ళకు ప్రతీక. ఆ ప్రాంతం మొత్తం ఉప్పునీళ్ళు కావడం వల్ల పిల్లలకు పసితనంలోనే పోలియో వచ్చి,

కాళ్ళ రెక్కలు పని చెయ్యకపోయేవి. అలాంటి బాధితురాలే జేజి. జేజి బాల్యంలో కొంత బాగానే ఉన్నా, తర్వాత కొన్ని రోజులకు కాళ్ళు పూర్తిగా సన్నబడతాయి. బడికి వెళ్ళడం ఇబ్బంది అయ్యింది. అయినా బడికి ఇబ్బందిపడుతూనే వెళ్ళేది. అక్కడున్న బడి ఒక కుటుంబం లాంటిది. జేజి అంటే ఉపాధ్యాయులకు ఎంతో ఇష్టం. ఎందుకంటే జేజి తెలివికల్ల అమ్మాయి. జేజికి బడిలో ఏదన్నా తిందామన్నా తాగుదామన్నా భయమేసేది. తింటే మలం వస్తుందని, తాగుతే మూత్రం వస్తుందని, అందుకోసం నడుస్తే ఇబ్బంది అని, తినలేక తాగలేక ఒంటరిగా కుమిలిపోతూ ఉండేది.

ఇలా సమాజంలో ఫ్లోరిన్ నీళ్ళ వల్ల పోలియోతో చాలామందికి కాళ్ళు చేతులూ వంకర్లుపోయి, నడుములు వంగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నల్లగొండలో నీటి సమస్య ఎక్కువగా ఉందని, సాగర్ నీళ్ళు వచ్చినగాని సరిపోయే పరిస్థితి లేదని, ఈ ప్రాంతం ఎక్కడ చూసినా పిల్లలు పోలియోతోనే జన్మించడం, జన్మించిన తర్వాత కూడా పోలియో రావడంతో అందరూ వికలాంగులవుతున్నారని రచయిత ఈ కథలో జేజికి పోలియో వచ్చి బాధపడ్తున్న విధానాన్ని తెలియజేశారు.

**2. లచ్చిమి**

దొర కొడుకు ఊర్లో ఒక యువతిని హత్యాచారం చేసి ఆమె నాలుక కోసి వేస్తాడు. చివరికి ఆమె అతన్ని కోర్టుకు ఎక్కించి, జైలు శిక్షపడేలా చేస్తుంది. తర్వాత మిత్రులైన వికలాంగులకు తన భూమిలో ఉపాధి కల్పించిన విధానాన్ని రచయిత పిట్టల శ్రీనివాస్ 'లచ్చిమి' కథలో వివరించారు. ఇది 'అవిటి కథలు' సంకలనంలోనిది.

లక్ష్మి నల్లగొండ జిల్లాకు 20 కిలోమీటర్ల దూరంలో మాద్గులపల్లిలో ఉంటుంది. తల్లిదండ్రులకు ఒక్కతే కూతురు. ఆమె నల్లగున్నాగాని, అందంగా ఉంటుంది. ఎవరికి బయపడేది కాదు. చిన్నప్పుడే చదువు మానేస్తుంది. ఆమె పెద్దయ్యే కొద్దీ వాళ్ళ ఇంట్లో అన్ని పనులు, వ్యవసాయానికి సంబంధించినవి కూడా చూసుకుంటుంది. ఆ ఊరి దొర కొడుకు కన్ను లచ్చిమి మీద పడుతుంది. ఒకరోజు లచ్చిమి ఒంటరిగా ఉండటం చూసి ఆమెపై అత్యాచారం చేస్తాడు. ఆమె గిలగిల తన్నుకున్న గిత్తోలె అదిమి, కేకలెయ్యకుంట నోట్లో గుడ్డ పీలికలు నూకి మరి అనుభవించి, ఎవరికైనా చెబుతుందేమోనని గట్టుమీదున్న గొడ్డలి దీసుకొని నాలుక కోసి అక్కడ నుంచి వెళ్ళిపోతాడు. కొన్ని

గంటల తర్వాత లచ్చిమి స్పృహలోకి వచ్చి, తన అవతారం చూసుకుంటుంది. తన బట్టలు, తెగిన నాలుక, నోట్లో రక్తం ఇవ్వన్నీ చూసి ఆ ముసలి తల్లిదండ్రులు బతుకుతారా అని ఆ బాధలో ఇంటికి వెళ్ళలేక ఆమె అక్కడ నుండి రైలు పట్టా వెంబడి నడుచుకుంటూ నల్లగొండ టేషన్‌కు చేరుతుంది.

టేషన్‌లో నడుములు పోయి అడుక్కుతినే తండ్రి ముసలాయన ఆమె నోటికి నాటు వైద్యం చేయడం తర్వాత అతడు ఆమెతోటి ఇగ జూడు బిడ్డా గిట్లనే మనలెక్క కాలు, చెయ్యిలేనోల్లు, నోరు, కండ్లు లేనేల్లంతా గీడనే జమైతరు. గాళ్ళంత గిప్పుడు రైళ్ళల్ల అడుక్కుంటందుకు బొయ్యిండు. సాయంత్రానికి గీడికి వొస్తరు. గండ్ల నిన్ను గల్పుత. నువ్వుగూడ ఓ రైలు డబ్బల అడుక్కుతిందువు గానీ... (పుట: 59) అని ముసలాయన అనడంతో, ఆమె మూగవోయిన ఎవ్వరికి చెప్పిన వినబడదు, తప్పదు అనుకుంటుంది. సాయంత్రం కల్ల వికలాంగులు అందరు ఒక్క దగ్గరికి చేరుతారు. ముసలాయన ఆమెను అందరికి పరిచయం చేసి, ఆమెకు మూగసైగలు మూగ భాషలు నేర్పించాడు. ఒకరోజు క్యాంటీన్ రాజుకు జరిగిందంతా చెప్పడంతో అతడు తెల్లోల దవాఖానకు తీసుకపోయి చికిత్స చేయించి, మాట్లాడించే మిషన్ ఏర్పాటు చేయడంలో ఆమెకు మాటలు వచ్చి రాజు సహాయంతో లాయర్ దగ్గరకు వెళ్ళి కోర్టులో దొర కొడుకుమీద కేసు పెడుతుంది. దొర కొడుకు లచ్చిమి మూగదిగదా, అది తననేం చేస్తుందిలే అనుకొని దర్జాగా గల్లా ఎగిరేసుకుంటూ తిరుగుంటాడు. తర్వాత కోర్టులో లచ్చిమి మిషనుకు నాలుక పెట్టి జరిగిన విషయం అంతా చెబుతుంది. దొర కొడుకు అది చూసి బిత్తర పోతాడు. చివరకు అతనికి కోర్టు శిక్ష వేస్తుంది. ఆ తర్వాత తన మిత్రులైన వికలాంగులతో తన ఇంటికి వెళ్ళి, తన భూమిలో వారికి పనులు చూపించి ఉపాధి కల్పిస్తుంది. ఇలా వికలాంగుల బాధలను రచయిత లచ్చిమి కథ ద్వారా చూపించాడు.

సమాజంలో మగ మృగాలకు అమ్మాయిలను చూడగానే వారిని ఎప్పుడు అనుభవించాలని అనుకుంటారు. వారి కండ్లకు అమ్మాయిలు అందంగా కనిపిస్తే చాలు. వారిని ఎట్లాగైనా, ఎప్పుడైనా మోసం చేయాలని అనుకొని సమయం చూసి ఒంటరిగా ఉన్నప్పుడు వారిపైకి పశువుల్లాగా మీదపడి అత్యాచారం చేసి వారిని చంపేస్తుంటున్నారు. అలాగే ఈ కథలో దొర కొడుకు కూడా సమయం చూసి లచ్చిమిని అత్యాచారం చేసి, నాలుక కోస్తే, ఆమెకు మాటలు రావు ఎవరికి చెప్పదు అనుకొని దర్జాగా తిరుగుతుంటాడు. కాని ఆమె క్యాంటీన్ ఓనరు సహాయంతో నాలుకమీద మిషన్ పెట్టుకొని కోర్టులో అతనికి శిక్షపడేలా చేస్తుంది. వికలాంగులకు తన భూమిలో ఉపాధి కల్పిస్తుంది. ఈ కథ ద్వారా

సమాజంలో మగ మృగాలు ఉంటారని, మన జాగ్రత్తలో మనం ఉండాలని, ఎవరిని నమ్మవద్దని ఒకవేల మోసపోయినగాని ధైర్యంతో ముందుకు నడిచి వారికి శిక్షపడేలా చేయాలని, ఇలాంటివి చేస్తేనే కొందరు మృగాల్లాంటి మగపురుగుల బెడదనుండి కొంతవరకైనా అరికట్టవచ్చని రచయిత ఇందులో తెలియజేశారు.

**3. కుష్టాది కిష్టయ్య**

ఒకవ్యక్తి రోజు వారిపని చేసి చాలీచాలని తిండి తినడం వల్ల కుష్టురోగం వచ్చి అనేక ఇబ్బందులు పడుతూ, అందరిలో చీదరింపులకు గురి అయి, చివరకు పట్నం వచ్చి వికలాంగుల కోసం, కుష్టాదివాళ్ళ కోసం పోరాడి భిక్షగాడిగా మారిన విధానాన్ని రచయిత వేముల ఎల్లయ్య 'కిష్టాదికిష్టయ్య' కథలో చిత్రించాడు. ఈ కథ 'అవిటి కథలు' సంకలనంలోనిది.

కుష్టాది కిష్టయ్య, నర్సమ్మ భార్య భర్తలు. కిష్టయ్య మాదిగ కులస్తుడు. వారి తాత ముత్తాతలు నిజాం పాలనలో నిజాంకు చెప్పులు కుట్టి, కచ్చురాలకు మూగలు, పట్టీలు కుట్టి, తుపాకులకు పౌచులు వార్లు కుట్టినందుకు భూమి ఇనాంగా ఇస్తారు. కిష్టయ్య ముత్తాతలు అప్పుడు భూమిని సాగు చేసేవారు. తర్వాత తర్వాత కాపులు, కరణాలు భూమికి శిస్తు కట్టాలని మాదిగలను హింసిస్తారు. తర్వాత కొన్ని రోజులకు కరువు రావడంవల్ల భూమి చేసుకోవడానికి ఇబ్బందిపడి అందరూ కూలీలుగా మారుతారు. ఆ భూమిని కాపులు స్వాధీనం చేసుకుంటారు. తర్వాత కొన్ని రోజులకు రోజువారి పనిచేసి చాలీచాలని తిండి తింటూ కుష్టురోగం వచ్చి అనేక ఇబ్బందులు పడతాడు కిష్టయ్య. కిష్టయ్యకు ఇంటిపేరు మరొకటి ఉన్న కుష్టుపేరుతో, కుష్టాది కిష్టయ్యగా పిలుస్తారు. తర్వాత కిష్టయ్య పట్నం వచ్చి వికలాంగుల కోసం, కుష్టాదివాళ్ళ కోసం పోరాడి భిక్షగాడిగా మారుతాడు.

సమాజంలో బీదవారికే అన్ని రోగాలు వస్తాయి. ఎందుకంటే ఊర్లోని ఇతర కులాలవారు దళితులను ఊరికి దూరంగా వుంచడం వల్ల వారు మురికి కాలువల పక్కన, ఈగలకు, దోమలకు బతకడం వల్ల అనేక జబ్బులు వస్తుండేవి. వారికి చూపించుకోవడానికి డబ్బులు లేకపోవడం, వారి బతుకులు రెక్కాడితేనిగాని డొక్కాడని బతుకులు వాళ్ళవి కనుకవారు కష్టపడితేనే తినడానికి అంతంత మాత్రం వారి కుటుంబానికి సరిపొయ్యేది. అలాగే ఈ కథలో కూడా కిష్టయ్యకు చూపించుకోవడానికి

స్తోమత లేకపోవడంతో కుష్టువ్యాధి వస్తుంది. అనేక ఇబ్బందులు పడతాడు. పట్నం వెళ్ళి తెల్లోల్ల దవఖానలో చూపించుకుంటాడు. వికలాంగులకోసం పోరాడి భిక్షగాడిగా మారతాడు. రచయిత ఈ కథ ద్వారా సమాజంలో ఉన్నటువంటి వికలాంగులందరు నిరాశ, నిస్పృహలకు గురికావద్దు, బాధపడవద్దని ధైర్నంగా ముందుకు సాగాలని, అలా ముందుకు సాగితేనే సమాజంలో బతకవచ్చని వారికి తెలియజేశాడు.

**4. విషపు నీళ్ళు**

వర్షాలు లేక కరువు వచ్చి, నీళ్ళలో ఫ్లోరిన్ శాతం ఎక్కువగా ఉండటం, మూడు వంతుల మందికి అంగవైకల్యం రావటం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు 'విషపు నీళ్ళు' కథలో చిత్రించారు రచయిత. మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'బొంద్రాయి' కథా సంపుటిలోనిది ఈ కథ.

నల్లగొండ జిల్లాలో ఓ మారుమూల గ్రామం కంకణాపల్లి కరువు వచ్చి తినే తిండి, తాగేనీరు లేక బావులు బోరింగులలో నీళ్ళన్ని విషపునీళ్ళు కావడం, మోతాదు మించి ఫ్లోరిన్ ఉండటం వల్ల తాగవద్దని డాక్టర్లు ఎన్నిసార్లు చెప్పిన, గత్యంతరం లేక ఆ నీళ్ళే తాగేవారు. పంటలు కూడా ఫ్లోరిన్ నీళ్ళతో పండటం, జనాల బొక్కలల్ల కాల్షియంకు బదులు ఫ్లోరిన్ ఉండటం, చుట్టు పది కిలోమీటర్లు చూసినా ఇవే ఫ్లోరిన్ నీళ్ళు ఉండేవి. ప్రభుత్వం ఎన్ని పథకాలు పెట్టినా, నెదర్లాండు గవర్నమెంట్‌వారు ఫ్లోరిన్ రహిత వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసినా లాభం లేకపోయింది. జిల్లాలో సాగర్ ఆనకట్ట ప్రాంతం తప్ప మిగతా గ్రామాలన్ని ఫ్లోరిన్ మయమే. ఎన్ని ప్రభుత్వాలు మారినా వాళ్ళ తలరాతలు మారలేదు.

ఆ ఊరిలో మూడు వంతుల మందికి అంగవైకల్యం కావడం, "ఇరవై సంవత్సరాలకే అరవై సంవత్సరాల ముసలివాళ్ళలాగా మూడు కర్రల సాయంతో నడవడం, కాళ్ళు చేతులు (అష్టాదశ) పద్దెనిమిది వంకర్లు, బాణంలా వంగిపోయిన ఎముకల గూళ్ళు. చప్పిడి ముక్కులు. మెలితిరిగి చెవులు, గారపట్టిన పండ్లు, ఏ అవయవం ఎక్కడుందో తెలవని స్థితి. ఒళ్ళంతా నొప్పులు, సలుపులు. మోచేతులు, మోకాల్లు, కాలి గుత్తులు వాచి అడుగుతీసి అడుగుపెట్టలేని వైనం. నడుం వంగిపోవడం, నడవలేక కాళ్ళ బదులు చేతుల సాయంతో దేకడం, తీపులకు, నొప్పులకు తాళలేక, మోచేతులు,

మోకాల్లు కాల్చుకుంటున్న నాటువైద్యం. పిక్కలకు తాళుకట్టి ఉపశపనం పొందుతున్నవారు కొందరు. ఆ ఊరు భూలోక నరకంలా మారిపోయింది."(యాదగిరిరెడ్డి, మేరెడ్డి. విషపు నీళ్ళు: 29). కొందరికి మానసిక వైకల్యం, ఎదుగుదల లేకపోవడం వల్ల చాలామందికి పెండ్లీలు కాకుండా బ్రహ్మచారులుగానే ఉండిపోయారు.

నీళ్ళలో ఫ్లోరిన్ అధికంగా ఉండటం వల్ల నల్లగొండ జిల్లా కంకణాపల్లి గ్రామ ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రజలు వికలాంగుల మారి రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని రచయిత ఈ కథ ద్వారా చెప్పాడు.

జేజి, లచ్చిమి, కుష్టాది కిష్టయ్య, విషపు నీళ్ళు కథల్లో మనుషులు వికలాంగులుగా మారడానికిగల కారణాలు-జన్యుపరంగా, మానవ తప్పిదాల వల్ల అనేది మనకు తెలుసు. వాటి వల్ల వచ్చే సమస్యల గురించి వివరించారు. వాటిని ఈ భాగంలో పరిశీలించి చర్చించాను.

## 4.3. సంస్కృతి సంప్రదాయాలు

సమాజంలో నివసించే ప్రజల ఆచారాలు, నమ్మకాలు, ఆహారపు అలవాట్లు, ధరించే వస్త్రాలు, ఆభరణాలు, కట్టుబాట్లు, పండుగలు, వేషభాషలు, పెళ్ళిళ్ళు-పేరంటాలు, ముద్దుముచ్చట్లు, విందులు వినోదాలు, మూఢ నమ్మకాలు, విద్య, ఉద్యోగం, నిరుద్యోగం మొదలైనవన్నీ సంస్కృతిలో భాగంగానే ఉన్నాయి. అనేక కుటుంబాల జీవన విధానం ఒక జాతి సంస్కృతిని తెలుపుతుంది. సంస్కృతి అనేది చాలా విశాలమైంది. ఎంత విశాలమైనదైనా మొట్టమొదటగా ప్రారంభమైంది. నల్లగొండ జిల్లా కథల్లో ప్రజల జీవన విధానం, వేషభాషలు, కళలు మొదలైన వాటి గురించిన అంశాలున్నాయి. వాటి విశ్లేషణను ఈ విభాగంలో పేర్కొన్నాను.

### 4.3.1. ఆహారం, ఆటలు, పండుగలు, కళలు

#### 1. బుక్కెడు బువ్వ

పేదవాడు తనకు తోచిన 'బుక్కెడు బువ్వ' ను తినే స్వేచ్ఛ ఈ దేశ ప్రజాస్వామ్యం కల్పించలేకపోతుంది. అటు ముస్లిం మైనార్టీలను ఇటు దళితులను టార్గెట్ చేసి మత విద్వేషాలను రెచ్చగొట్టి అధికారాన్ని నిలుపుకోవాలనుకుంటున్నారని చందు తులసిగారు 'బుక్కెడు బువ్వ' కథలో చిత్రీకరించారు.

బిచ్చగాడు ఊరు ఊరు తిరిగి అడుక్కొని జీవనం కొనసాగిస్తాడు. ఒక ఊరిలో శిధిలమైన బస్టాపులో రెండుమూడు రోజులుగా ఒంట్లో బాగలేక, అవస్థలు పడుతూ, కనీసం నాలుగు మెతుకులు బిచ్చమెత్తుకునే ఓపిక లేక, ఈరోజన్న ఒక ముద్దతినాలని, సత్తుగిన్నె, చేతులో కర్ర తీసుకొని వంకర కాలుతో కుంటుకుంటూ దగ్గరలోని ఓ ఇంటికి వెల్లి "అమ్మా తల్లి... మూడు రోజులైందమ్మ బువ్వతిని... ఒక ముద్దుంటే ఎయ్యమ్మా అని అడిగితే"(చందు తులసి. బుక్కెడు బువ్వ: 103). ఆమె పొద్దున్నే తగలడ్డాడు అని తిట్టి బయటకు వెళ్లగొడుతుంది. ఇలా ఇంటి ఇంటికి వెళ్ళి అడిగితే తిడుతున్నారే కాని, అతని ఆకలి బాధను అర్థం చేసుకొని ఒకముద్ద బువ్వవేసిన వారులేరు. ఒక ముద్ద కడుపులో పడితే బాగుండు అని నడిచే ఓపిక లేక ఓ చెట్టుకింద కూలబడతాడు. ఏదో మైకు శబ్దం వినిపిస్తే మెల్లగా లేచి అక్కడ సభ జరుగుతుంటే, ఏమైనా దొరుకుతుందోనని వెళ్ళి మూడురోజులైంది బాబు అన్నం తిని ఒక్క రూపాయి ధర్మంచేయి బాబు అని బాధగా అడిగితే, ఈ మీటింగే కనబడిందా అని తిట్టి గడ్డం నాయకుని అనుచరుడు నెట్టేస్తే కిందపడిపోతాడు. నీరసం వచ్చి ఒక పాత గుడికాడ కూలబడి దయ ఉంచి ఒక ముద్ద బువ్వో, పది రూపాయలో దొరికేలా చేయి సామి అని దేవున్ని వేడుకుంటాడు.

తెల్లారి గుడిపక్కన తాగుబోతుల గుంపు పార్టీ చేసుకుంటుంటే బిచ్చగాడు అక్కడికి వెళ్ళి వారిని అడుగుతాడు. వాళ్ళు నవ్వుతారు. వారు తెచ్చుకున్న మందుతాగి, బిర్యాని తిని వెళ్తారు. ఏమైనా దొరుకుతుందోనని వెళ్ళి చూస్తే కాలిసీసాలు, నీళ్ళప్యాకెట్లు, సగంతిని వదిలిపెట్టిన పొట్లం. విప్పిచూస్తే అన్నంమెతుకులు కనిపించాయి. అన్నం చూడగానే ప్రాణం లేచివచ్చినట్లయి గుడి దగ్గర కుళాయికాడ కాళ్ళూ, చేతులు, సతుగిన్నె కడుక్కొని, తెచ్చుకున్న పొట్లం విప్పి దేవునికి దండం పెట్టి ముద్ద నోట్లో పెట్టబోతే గడ్డం నాయకుడు వచ్చి, ఎవడ్రా నువ్వు గుడి దగ్గరికి వచ్చావు. ఎవరిని అడిగి వచ్చావు, నిన్ను ఎప్పుడూ చూడలేదని, పార్శిల్ తెచ్చుకొని ఇక్కడ తింటున్నావని తిడుతాడు. అయ్యా మూడు రోజులైంది అన్నం తినక అని, తినే అన్నం తినకుండా ఆగి బతిలాడుతాడు. అది బీఫ్ బిర్యాని అని గొడ్డుకూర తినొద్దని ఈ దేశంలో ఉండాలంటే ఏ ఒక్క కొడుకు గొడ్డుకూర తినకూడదని, నీపేరు ఏందని బిచ్చగాన్ని అడిగితే ఆ ఊరు ఈ ఊరు తిరిగే బుట్టా ఫకీర్‌గాన్ని నాకు పేరు, ఊరు లేదు సామి అనగానే, ఫకీర్ అంటే తురుకోనివని, ముస్లింవి, ఉగ్రవాదివి, పాకిస్తాన్ ఏజంటువా అంటుంటే,

అతను ఏమంటున్నాడో అర్థంకాక, మూడు రోజులైంది సామి అన్నం తిని ముద్ద నోట్లో పెట్టుకోబోతే వద్దని చెప్పినా తింటున్నావని బిచ్చగాన్ని ఒక తన్ను తన్నితే బోర్లపడతాడు. సత్తుగిన్నె దూరంగా పడుతుంది. గొడవ అవుతుంటే భక్తులు, ఏమైందన్నా అనుకుంటూ నాయకుని అనుచరులు వస్తారు. వీడు గొడ్డుకూర తింటున్నాడురా.. ఎంతధైర్యం. "గొడ్డుకూర తినడానికి ధైర్నమెందుకు సామె..ఆకలైతే చాలదా..? ఐనా మీరు అడ్డుకోవాలంటే ఆ గొడ్డుకూరతో కోట్ల రూపాయల యాపారం చేసే వాళ్ళను అడ్డుకోండి. ఆకలికి కడుపు నింపుకుంటున్న నన్ను అడ్డుకుంటే ఏం లాభం..?(చందు తులసి. బుక్కెడు బువ్వ: 107) అని అంటే వకీల్ లాగా వాదన చేస్తున్నారా? గొడ్డుకూర తినాలంటే ఇండియాల ఉండొద్దు, పాకిస్తాన్ పోయి అక్కడ తిను అని చిన్ననాయకుడు, ఏ అన్నమో, ప్రసాదమో తినవచ్చుగా భక్తురాలు శాపనార్థాలు పెట్టడం. బిచ్చగాడు మౌనంగా చూస్తూ, వాళ్ళ మాటలు పట్టించుకోకుండా దూరంగా పడ్డ పళ్ళాన్ని, పొట్లం తీసుకోపోతే, మాటలతో చెబితే అర్థమవుతుందా...నాలుగు తన్నండి బుద్ధి వస్తుందని మరో భక్తురాలు కోపంతో అనగానే పెద్దగడ్డం నాయకుడు వెనకనుంచి తన్నితే బోర్లపడితే ముక్కు బండరాయికి బలంగా తగిలి, నోట్లోనుంచి రక్తం కారడం, ఆహారం నేలపాలు అవుతుంది. అతనికి కోపం వచ్చి నాయకుని తలపై చేతికర్రతో గట్టిగా కొడితే రక్తంతో కుప్పకూలాడు. చెంబాగాళ్ళు పారిపోయారు. జనం కూడా వెళ్తారు. మెల్లగా శక్తిని కూడదీసుకొని తన గొడ్డుకూర పొట్లాం, సత్తుపల్లెం తీసుకొని అక్కడ నుంచి కదిలి చీకట్లో సాగిపోతుంటే వెలుతురు అతనితో పాటే కదులుతుంది. ఈ కథలో బిచ్చగానికి అడుక్కొని తినే స్వేచ్ఛ లేదని, ఏ కూర తింటేందని రాజకీయ నాయకులు జోక్యం చేసుకొని, దళితులని హింసిస్తున్నారని ఈ విధంగా సమాజంలోని చాలా చోట్లల్లో ఇట్లా జరుగుతున్నదని రచయిత తెలియజేశాడు.

**2. పచ్చీసు**

ప్రపంచీకరణ నేపథ్యంలో తెలంగాణ ఆటలన్నీ పారిపోయి స్వర్గంలో దాక్కున్నాయి. అలాంటి స్వర్గం నుండి మనం మరచిపోయిన 'పచ్చీసు'ను తీసుకొచ్చి దానికి బాల్యాన్ని అద్ది, జీవితాన్ని ముడివేసి తెలంగాణ సంస్కృతిని తడిమిన కథ మళ్ళీ మనల్ని ఆరు దశాబ్దాల వెనుకకు తీసుకెళ్తుంది. ఈ కథను రచయిత 'కాటేపల్లి లక్ష్మీ నరసింహమూర్తి' గారు చిత్రీకరించారు.

యల్లయ్య, మల్లమ్మ భార్యాభర్తలు. కుమారుడు అంజి, కూతురు నయన. ఎండకాలం ఒంటిపూట బళ్ళు కావడం చేత మధ్యాహ్నం గంటకొడితే పిల్లలందరు ఇంటికి వెళ్తారు. యల్లయ్య గంట, సుత్తె లోపల పెట్టి తాళం వేసి ఇంటికి వస్తాడు. అంజి పుస్తకాల సంచి ఇంట్లో పెట్టి ఆడుకోవడానికి బజారుకు వెళ్తాడు. నయన తన సంచి బరువుగా ఉందంటే అన్నం తినలేదని తండ్రికి చెబుతుంది. మల్లమ్మ భర్తకి, బిడ్డకి అన్నం పెట్టి కొడుకు అన్నం తినలేదని దిగులుతో తాను తినకుండా పాత చీర కింద పరుచుకొని పడుకుంటుంది. యల్లయ్యకు ఆవలింతలు వచ్చి నిద్ర వస్తుంటే, పెద్దసారు బిడ్డపెళ్ళికి సరుకులు తెమ్మని చెప్పిండని, ఉతికిన అంగి వెతుక్కుంటు మల్లమ్మను చూసి, పిల్లలమీద పిచ్చి ప్రేమ. పిల్లలు తిననిది తినదని, భార్యను అన్నం తిందువులే. వాడు బళ్ళె తిన్నాడు. లే! మల్లీ!.. అన్నం తిను! ప్రేమగా చేయిపట్టి లేపి ‘పచ్చీసు’ ఆడక చాలారోజులైంది. ఆడుదాము అనగానే లేచి అన్నం తిని, పచ్చీసు ఆడుదామని పాత యాత సాపపరిచి పచ్చీసు పట్ట మూట విప్పి ఇద్దరు ఆడుతుంటే కూతురు వచ్చి అమ్మా! దుగ, తీని, చారు, పచ్చీసు ఇయ్యంటేంది అని అడుగుతుంది. తండ్రి వాటి గురించి చెబుతాడు. కొడుకు వచ్చి అమ్మ ‘అష్టాచెమ్మ’ ఆడుకోవాలె చింతగింజలు నాలుగు ఇవ్వమని అడుగుతాడు. అన్నం తిన్న తర్వాత ఇస్తాను అని అన్నం పెడుతుంది. టీ.వి. చూసుకుంటూ మళ్ళీ తల్లిదండ్రులు ఆడుతుంటే కూతురు వచ్చి ‘అష్టాచెమ్మ’ అంటే ఏంటిదమ్మ అని అడిగి తెలుసుకుంటుంది.

మరుసటిరోజు బడి వదిలిపెట్టినంక అంజి, నయనలు తల్లిదండ్రులను పచ్చీసు ఆడనీయకుండా అది అడిగి, ఇది అడిగి వాళ్ళ ఇద్దరికి తెలవంది అడగాలని పంతులమ్మ కాడికి వెళ్ళారు. పెద్దసారు వచ్చి చెప్పిన పని చేయలేదని అరిచి వెళ్ళిపోతాడు. అంజి వచ్చి ‘సాలు ఇర్వాలు’ అంటే ఏంది అని తండ్రిని అడిగితే కోపం చేస్తాడు. తల్లి మనల్ని అడగకపోతే ఎవర్ని అడుగుతారు అని సముదాయిస్తుంది కొడుకుని. పెద్దసారు చెప్పిన పనికి త్వరగా తయారైండు. అంజి, నయనలకు ‘బళ్ళో’ ప్రైజులు వస్తాయి. అవి అమ్మనాన్నలకు చూపెడతారు. ప్రైజుల గురించి ఎట్లా వచ్చాయంటే, బళ్ళో ఒక్కొక్కరిని పిలిచి ప్రశ్నలు అడుగుతారు. పచ్చీసు, అష్టాచెమ్మ, పొలం పనులు, వంట, ఇంటిపని, పట్టణాల పేర్లు అడిగితే మేము చెప్పినాం. గెలిచినాం అంటారు. తల్లి బెల్ల అప్పలతో నోరు తీపి చేస్తుంది. రేపటి నుంచి పచ్చీసు ఆడకుండా మీరు అడిగినవన్నీ తెలుసుకొని చెప్పుతాం అంటే

అంజి, నయనలు మీరు ఆడబట్టే మేము తెలుసుకొని చెప్పి గెలిచాం. మీరు ఆడాలని అంజి తండ్రిని హత్తుకున్నాడు.

పెద్దసారు వచ్చి మీరు పిల్లలకు పచ్చీసు ఆడుకుంటూ ఏమి చెప్పారోగాని పిల్లలు వాళ్ల బల్లె ప్రైజులు తెచ్చుకోవడమే కాదు, మండల పోటీలకు కూడా ఎంపికైనారు. శభాష్ అని పిల్లల్ని ఎల్లా చూసుకోవాలో మిమ్మల్ని చూసి నేర్చుకోవాలె అని మిఠాయి పొట్లం ఇచ్చి బజారు పనిపూర్తి అయిందని, నీవు పోవలసిన పనిలేదని, బయటికి పోయిందు. మల్లమ్మ పిల్లలు మనకు మంచి పేరు తెచ్చినారని వాల్లు సల్లగుంటే సాలు అనుకుంటుంది. యల్లయ్య మనసులో మురిసిపోతూ, ఆనందంతో...పచ్చీసు ఆడుదామా ! అని యల్లమ్మను అక్కున చేర్చుకోవడం జరిగింది.

సమాజంలో ఇప్పటి పిల్లలు టీ.వీ.లు, కంప్యూటర్లు, సెలుపోన్లు రావడంవల్ల వారు వాటికి అంకితమైపోతున్నారు. ఆటల గురించి ఆడుకునే సమయం వారికి దొరకడం లేదు. పచ్చీసు, అష్టాచెమ్మ ఆటల గురించి తెలువదు అని మరిచిపోతున్నారని, అవి అడుగంటిపోతున్నాయని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

**3. చిలకల దండ**

తెలంగాణ ప్రాంతంలో హోళి పండుగ ఎట్లా జరుపుకుంటారో రచయిత కొలనుపాక మురళీధరరావు. 'చిలకల దండ' కథలో 'నల్లగొండ కథలు' కథా సంకలనంలోనిది ఈ కథ.

ఫాల్గుణమాస శుద్ధ పంచమి నుండి పూర్ణిమ వరకు వసంతోత్సవం శోభాయమానంగా జరుపుకుంటారు. ఈ సమయంలో వసుధ తన ప్రకృతి అంద చందాలతో, రంగురంగుల పుష్పములతో వసంతుని ఆగమమునకు నిరీక్షిస్తుంది. ఆ ఉత్సాహమే హోళి పండగ సంబరాలు. చిన్నా పెద్దలందరు తమ బేధాలను మరచి ఆనందంగా సమైక్యంగా ఆటవిడుపు ఉత్సాహంతో హోళి, దూలలాడతారు. చతుర్ధశి రాత్రి కామదహనం తరువాత పూర్ణిమరోజు రంగులు గుప్పుకుంటూ హోళీ అయిరే హోళి రంగ హోళీ స్త్రీలు చప్పట్లతో, 'కాముడు కాలె కరిబొగ్గాయే' అని కొందరు 'అల్లోమల్లో

రాగోల మల్లో' మొగపిల్లలు పల్లెంలో కప్పను పెట్టుకొచ్చి జానపదాలతో ఇల్లిల్లు గడపగడప తొక్కుతూ సంబంరంగా చేతులు తిప్పుకుంటూ గుంపులు గుంపులుగా హోళీ ఇనాం అడుక్కుంటారు.

ముఖ్యంగా తెలంగాణ ప్రాంతం హైదరాబాదులో చిలకల దండలు, బత్తీసాలు, కొబ్బరి కుడకలతో దండలు చేసి పిల్లలకు ధరింపచేయడం ఈ పండగలో ప్రత్యేకత. చిలకల గోపయ్య బండిమీద రంగురంగుల పంచదార చిలుకల దండలు, బత్తీసాలు ప్లాస్టిక్ కాగితంతో కప్పుకొని వీధులల్లో అమ్ముతాడు. ఆ వీధి బొమ్మలు, అమ్మమ్మలు అతని దగ్గరికి వచ్చి మనుమలకు, మనుమరాళ్ళకు నచ్చినవి, ఒప్పినవి కొంటారు. అవి పిల్లల మెడలల్లో వేస్తే శుభం కలుగుతుందని వారి నమ్మకం. వేనుగోపాలరావుగారు ఇంట్లో నుండి బయటకు వచ్చి గోపయ్యను బాగున్నవా అని మందలిస్తు, పక్కన ఉన్న పిల్లగాన్ని ఎవరీ హోళికే బడవా? అంటే నన్ను బడవా అంటావా అని పిచికారితో గోపాలరావుగారిని రంగులమయం చేస్తాడు. అమ్మ నీ పని చెబుతా అనగానే అక్కనుంచి పారిపోతాడు ఎదురింటి పిల్లగాడు శేఖర్. వేణుగోపాలరావు తన మనుమళ్ళు, మనుమరాళ్ళ కోసం గోపయ్య దగ్గర పది రంగురంగుల చిలకల దండలు కొంటుంటే, శేఖర్ చిన్నగా పిచికారితో వచ్చి తాతా నాకు కూడా కొనివ్వవ అంటే, రెండు కొనిస్తాను ఆ పిచికారి ఒకసారి ఇవ్వరా అని గుంజుకొని కమలమ్మ మీద రంగు చిమ్ముతాడు వేణుగోపాలరావుగారు. ఆమె ఏంటి చిన్నపిల్లలాగా అని సిగ్గుతో అంటుంటే అక్కడ ఉన్న కుర్రాళ్ళు చప్పట్లు కొడుతూ భలేభలేగా ఉంది ముసలివాళ్ళ రంగులకేళీ అని వారిని ఆట పట్టిస్తారు. శేఖర్ మెడలో చిలకల దండ వేసి అతన్ని ఎత్తుకొని, దూరాన ఉన్న తన మనుమడిని గుర్తు చేసుకుంటాడు. గోపయ్యకు డబ్బులు ఇస్తే అతడు వెళ్ళిపోతాడు.

పిల్లలు పెద్దలు అందరు స్నానాలు చేసి కొత్త బట్టలు కట్టుకుంటారు. వేణుగోపాలరావుగారు స్నానం చేసిన తర్వాత కమలమ్మ తినుబండారాలు తెచ్చి వారికి పెడుతుండగా 'హోళీ శుభాకాంక్షలు బాబీ ఔర్ బాయి సాహెబుకో' అంటూ ఎదురింటి ముఫత్ తలాల్ తమ పిల్లలతో స్వీటు బాక్సులతో వస్తుంది. అందరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. పిల్లలందరి మెడలో రంగురంగుల పంచదార చిలుకల దండలు వేసి బత్తీసాల పొట్లాలు కానుకగా ఇస్తుంది. బన్సీలాల్, ముఫత్ లాల్ పిల్లలు వాటిని ఎదురుచూడకుండా నాలుకతో సప్పరిస్తుంటే, కమలమ్మ ఇప్పుడే వాటిని తినవద్దని,

వాటిని ఉగాదిదాక ఉంచుకొని పంచాంగ శ్రవణం తర్వాత వాటిని వేసుకొని తినాలి అంటుంది. బాబీ మళ్ళీ పండగకు వస్తాను అని వాళ్ళు వెళ్ళిపోతారు. అమ్మమ్మా ‘మరి చిలుకల దండలెందుకేసుకుంటారే?” అని మనుమడు సమర్ అడుగుతాడు.

ఆమె అతనితో “హోళికి రాక్షసిని చంపి ఆమె పేగులతో ఊరేగినారట శివగణాలు. అంతేగాదు శివపార్వతులను కల్పిన మన్మథుడు తాను బూడిదైనా మనకు మేలు చేసి కాముడి పున్నం చేయించుకొని సమాజం క్షేమం కోసం పాటుబడిన వాని పేర కాముడి పున్నం, హోళీ ఆ తరువాత దులరడి అంటూ మూడు రోజుల పండగ చేసుకొని వచ్చే ఏడాదికి తమ గోచారం ఎలా ఉంటుందో అనుకొని శివరాత్రి జాగరణ చేసి వచ్చే ఉగాదికి మళ్ళీ ఈ చిలుకల దండలతో స్వాగతం పలుకుతారు.” (పుట: 504) అని చెప్పడంలో అబ్బో ఇంత పెద్ద కథ ఉందా ఈ చిలుకల దండలకంటూ ఆశ్చర్యపడింది శ్రావ్య, కమలమ్మ ఒళ్ళో కూర్చొని తెలంగాణలో మనం జరుపుకునే సాంస్కృతిక సంప్రదాయ పండగలలో హోళీ పండగ ఒకటి. చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా అందరూ ఒకరిమీద ఒకరు రంగులు జల్లుకుంటూ ఆనందంగా హోళీ సంబరాలను ఘనంగా జరుపుకుంటారు. ఈ కథలో సమాజంలోని ప్రజలు హోళీ పండుగను ఎట్లా జరుపుకుంటారో రచయిత ఈ కథ ద్వార తెలియజేశాడు.

**4. ఖబర్**

మన సాంస్కృతిక సంప్రదాయాలు, పండుగలు, పబ్బాలు హిందువులు ఎట్లా జరుపుకుంటారో, ముస్లింలు కూడా పండుగలు జరుపుకుంటారని ‘ఖబర్’ కథలో రచయిత స్కైబాబ చెప్పాడు. ఈ కథ ‘అల్లాయి బలాయి’ బహుజన కథా సంపుటంలోనిది.

సలీమ్, కరీమా భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. కూతురు సోఫియా, కుమారుడు ఛోటూ. సలీమ్‌కి ఇద్దరు చెల్లెండ్లు. తల్లిదండ్రులు మరణిస్తారు. సాయంత్రం బడోంకి ఈద్ (పెద్దల పండుగ) వాళ్ళ అమ్మ ఉండగా చేసేది. వీళ్ళుకూడా వంటలు వండి, మేక మటన్, బగార అన్నం, దాల్చా చేసి పేటల్ల తీసి ఇంట్లో మక్కా ఉన్న దిక్కు పెట్టి ఒక గిన్నెలో నిప్పులు, సాంబ్రాణి పొడి పక్కన పెట్టినారు.

సలీమ్ స్నానం చేసి లాల్చీ పైజామా వేసుకొని వచ్చి మరణించిన వారి పేరిట ఇచ్చే దానం (ఫాతెహా) ఇవ్వడానికి ఆశీస్సు, జ్ఞాపకం (దువాయాద్) చేసుకుని, తలకు టోపిపెట్టుకొని (ఫాతెహా) ప్రార్థన చేసి, నాన్న, అమ్మ పేరుమీద, తండ్రివైపు అందరి పేరుమీద సాంబ్రాణి వేశారు. పిల్లలచేత కూడా పెద్దల వరుసతో పేర్లు పలికిస్తారు.

తర్వాత రోజు బక్రీద్ పండుగ. ఉదయం అందరు స్నానాలు చేస్తారు. సలీమ్ చికెన్ తెచ్చి వీళ్ళ కంటే ముందు స్నానం చేసి కొత్తబట్టలు వేసుకొని, అత్తరు పూసుకొని, చిన్నదూది ఉండలు అత్తరులో ముంచి చెవులకు పెట్టుకొని, కండ్లకు సుర్మపెట్టుకొని బైకుమీద సోఫియాను కూర్చొపెట్టుకొని ఈద్గాకు (నమాజ్ చేసే స్థలానికి) బయలు దేరుతాడు. మగవాల్లు ఈద్గా నుంచి వచ్చే లోపల ఆడవాళ్ళు కూడా ఈద్ నమాజ్ చదువుకొని రడీగ ఈద్ కలవడానికి ఉంటారు.

ఈ కథలో రచయిత ముస్లింలు పండుగ జరుపుకొనే విధానం తెలియజేశాడు. సమాజంలో వారికి కూడా కొన్ని పండుగలు ఉన్నాయని, ఈద్, బక్రీద్, రంజాన్ మొదలగు పండుగలు జరుపుకుంటున్నారని వివరించారు.

**5. లోటు**

'లోటు కథా రచయిత ఎన్. సంజీవరెడ్డి. తల్లిదండ్రులు లేని ఒక వ్యక్తి చిన్ననాటినుండి చాలా కష్టపడి, శ్రమించి, నాటకరంగంలో ప్రవేశించి మంచి కళాకారుడిలా ప్రజలను మెప్పించిన విధానాన్ని చాలా చక్కగా వివరించారు రచయిత ఈ కథలో.

గోపయ్య చిన్నతనంలోనే అమ్మ నాన్నలు మరణిస్తారు. అతనికి ఆరు సంవత్సరాలు. వాళ్ళ అన్నకు పదిహేను సంవత్సరాలు. అప్పటికే అన్నకు పెండ్లి అవుతుంది. అక్కలకు 'బాల్య వివాహం చేసి దూరదేశాలకు పంపించడంతో, అతడు అన్న, వదినల దగ్గర ఉండి పాఠశాలకు వెళ్ళి వస్తుండేవాడు. అన్నకు పిల్లలు పుట్టడంతో వారిని ఆటలు ఆడించడం, పాఠశాలకు వెళ్ళి మూడవతరగతి వరకు చదవడం, పై చదువులకు పక్క ఊరిలోకి వెళ్లి చదువుకోవడం అన్నకు ఇష్టంలేకపోవడంతో, వారి పిల్లను ఆటలు ఆడించడం, అన్నకు వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉండేవాడు.

ఊరిలో అప్పారావు తన మేళగాళ్లతో రాత్రిపూట రోజు వీధి భాగోతం ఆడేవారు. రామాయణం, మహాభారతం కథలను ప్రదర్శించేవాళ్ళు. ఆగాళ్ళకు చదువురాకపోవడంతో, గోపయ్య చదువురాని వేషగాళ్ళకు పుస్తకంలో చూసి అందిస్తుంటే వాళ్ళు చదివేవారు. క్రమంగా తాళం కొట్టడం, మద్దెల వాయించడం రకరకాల దరువులు వేయడం, వేషాలు వేయడం, భాగవతంలో మెలకువలు నేర్చుకోవడంతోపాటు నటనలో శభాష్ అనిపించుకున్నాడు గోపయ్య.

అప్పారావు తన మేళాన్ని తీసుకొని పరిసర గ్రామాలకు వెళ్ళి కొన్ని రోజులపాటు ప్రదర్శనలిచ్చే వాళ్ళు. భాగోతం చూడటం అందులో అన్ని కులాలవాళ్ళు వేషాలు వేయడం గ్రామాలలో సహజం. అందులో నీతి, ధర్మం, విజయం సాధించడం వంటి అంశాలు ఉన్నట్టుగా భావించి చాలా ఆసక్తిని ప్రదర్శించేవాళ్ళు. “తన తల్లి తననెత్తుకొని ముద్దు ముచ్చట్లు తీర్చేటప్పుడు పొందిన జ్ఞాపకాలు, అమ్మ వుంటే అనుభవించే అనుభూతిని తన వదినతో ఆమె పిల్లల విషయంలో గమనించినప్పుడు అటువంటి పాత్రలు భాగవతంలో చూసినప్పుడు బయటికి కనిపించని ఎక్కిళ్ళ దుఃఖంతో చాటుగా మూగవేదనతో కుమిలిపోయేవాడు.” తన బాధను దుఃఖాన్ని, కష్టాలను, కన్నీళ్ళను, ప్రేమను ద్వేషాన్ని చెప్పి బారం దింపుదామన్న తల్లి లేదనుకుంటాడు.

గోపయ్య మద్దెల కొడితే ఊరంతా అదిరిపోవాల్సిందే. వేషం వేసి బల్ల ఎక్కి ఎగిరితే యిరుగాల్సిందే. కింద దునికాడంటే దుమ్మురేగాల్సిందే అనేటోల్లు గ్రామస్తులు. పౌరానిక కథలలోని నీతి, ధర్మం, నిజ జీవితంలో ఎక్కడ కానరాకపోవడం, తాను కూడా ఆ పాత్రల వలే జీవించాలనే కోరిక క్రమంగా (నిర్జీవంగా) ప్రాణంలేని విధంగా మారుతుంది. క్రమంగా రాత్రిపూట నాటకంలో తన పాత్రను కలలు కన్నట్లుగా తన ఆటను సాగించేవాడు. మద్దెలదరువు, నటనలో ఏ మాపులేదు గాని, మానవీయత స్థానంలో యాంత్రికంగా కళగా అభిమానించడం పోయి దినచర్యగా భావించడం మొదలైంది.

ఏదైనా రోజు పరిస్థితి అనుకూలించక రాత్రి నాటకాలలో పాల్గొనకపోతే తెలిసిన వాళ్ళిండ్లకెల్లి కాలక్షేపం చేయడం, పొద్దస్తమానం పాటలను పాడుకోవడం ఆట ఆడడం చేసేవాడు.

ఈ కథలో రచయిత గోపాలకు తల్లిదండ్రుల ప్రేమ లేకపోయినా, అతని కష్టాలను, దుఃఖాలను, బాధలను తనలోనే దిగమింగి, అతనిలో ఉన్నటువంటి కళను, నటనను ప్రదర్శింపజేశాడు. తల్లిదండ్రులు లేరని బాధపడవద్దని ధైర్యంతో ముందుకు సాగాలని సమాజానికి తెలియజేశాడు.

'బుక్కెడు బువ్వ' కథలో ఆహారపు అలవాట్లు, 'పచ్చీసు' కథలో ఆటలు, 'చిలకల దండ', 'ఖబర్' కథలలో పండగలు, 'లోటు' కథలో కళలు గురించిన విషయాలు ఉన్నాయి.

**4. విధ్వంసం**

ఊర్లోని ప్రజలు బొడ్రాయికి పూజలు చేయకపోయేసరికి ఒకరోజు రాత్రి ఆ బొడ్రాయిలోనుండి పోతరాజు బయటకు వచ్చి యాపచెట్టుకు ఆనుకొని కూర్చొని తన అక్కలను తలచుకునే లోపే వారు తన దగ్గరికి వచ్చి మాట్లాడుకునే విధానాన్ని రచయిత వెన్నం ఉపేందర్ 'విధ్వంసం' కథలో విశ్లేషించాడు. ఈ కథ 'కొన్ని వెలుగు నీడలు' కథా సంపుటంలోనిది.

గ్రామంలోని ప్రజలందరినీ చల్లగా చూడటానికి ఆ ఊరిలో బొడ్రాయిని ఊరి మధ్యలో వేస్తారు. వేసినప్పుడు బాగానే పూజలు చేస్తారు. తర్వాత తర్వాత పూజలు చేయడం మరచిపోయి ఎవ్వరి పనులలో వారు మునిగిపోయి 'బొడ్రాయి'ని కొలవడం మరచిపోతారు. ఒకరోజు రాత్రి ఆ బొడ్రాయిలోనుండి పోతరాజు బయటకు వచ్చి యాపచెట్టుకు ఆనుకొని కూర్చొని తన ప్రతిరూపం చూసుకుంటే చుట్టూ అంతా చెత్త చెదారం, తాగిన ప్లాస్టిక్ గ్లాసులు ఉంటాయి. అదంతా చూస్తూ పోతరాజు తన పరిస్థితి ఇట్లా ఉంటే తన అక్కల పరిస్థితి ఏంటి? అనుకునే లోపే అతని దగ్గరకు గండి మైసమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ, పోలేరమ్మ వస్తారు. వారు ఒకరినొకరు పలకరించుకుంటారు. రోజులు మారినాయని, తమను ఎవరు పూజించడం లేదని, భోజనాలు పెట్టడం లేదని, సోరకాయలు కోసి, వానకాలంలో చెరువులు నిండితే యాటలు కోసేవారని, ఇప్పుడు కోస్తలేరని ఒకరికొకరు చెప్పుకుంటూ, బాధపడుతూ కళ్ళలోంచి నీళ్ళు తీసుకుంటారు. తన అక్కలు తమ్ముణ్ని వారి దగ్గరికి ఒక్కసారైన రాకపోతివి అని అడుగుతారు. అతడు "మునుపు గత్తర నుంచి, చేతబడుల నుంచి జనాన్ని కాపాడవలసి వచ్చేది. ఇప్పుడు కొత్తకొత్త శక్తులనుంచి ఊరిని కాపాడాలి అని కాసేపు ఆగి, జనం కష్టాల పడుతుండ్రు. పొట్టచేతబట్టుకొని పట్నాలకు పోతుండ్రు. వయసోల్లు ఊరొదిలి పోతుండ్రు. ఊర్ల

రాజకీయాలు డబ్బుల చుట్టూ తిరుగుతున్నయ్. జనం మల్ల బతుకమ్మ పండుగ చెయ్యాలె. పాలపిట్టను సూడబోవాల, బోనాలు పుదిచ్చి పండుగల్జేసుకోవాల... గుండం దీసి సవార్ల నిలబెట్టి నిప్పుల దునకాల. బేతాలేషం ఏసి సెట్టతనాన్ని పొలిమేర దాకా తరిమికొట్టాల." (పుట: 138). అని వారితో చెప్పేసరికి కోడి కూస్తుంది. తెల్లారుతుందని మళ్ళీ కలుద్దామని, ఈ యేడేన్నా జనం కోరికలు తీరేలా, అందరి కడుపు సల్లంగుండాల, అందరు కడుపు నిండా తినాలె, జనం బాగుంటె మనం బాగుంటాం. పోయొస్త తమ్మి అని తమ్ముణ్ణి ముద్దాడి వెళ్ళిపోతారు.

ఈ కథలో ప్రజలు 'బొడ్రాయి'కి పూజలు ఎట్లా చేస్తారో, పోతరాజు ఊరిన్ని ఎట్లా కాపాడుతుంటాడో, బొడ్రాయి అంటే ఏమిటో, అతని అక్కలు ఎవరెవరు ఉంటారో వారు ఊరిని ఏ విధంగా కాపాడుతుంటారో రచయిత సమాజానికి ఇటు పాఠకులకు తెలియజేశాడు.

### 4.3.2. మూఢ నమ్మకాలు

తరతరాలుగా మన సమాజం మూఢనమ్మకాలను ఆచార వ్యవహారాలుగా అనుసరిస్తుంది. భయంవల్ల మూఢనమ్మకాలు ఏర్పడ్డాయి. మూఢనమ్మకాలకు కారణాలు అవసరం లేదు. వీటి వల్ల ఎన్నో అనర్థాలు మానవుల జీవితాల్లో ప్రతిఫలిస్తాయి. అవి మానవ భవిష్యత్తును అధోగతి పాలు చేస్తాయి. ఇలాంటి నమ్మకాలను విశ్వాసాలను కూకతి వేళ్ళతో పెకిలించి ప్రజలను చైతన్యం చేయడానికి రచయితలు, కవులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కాని అక్కడక్కడ నేటికీ ప్రజలు బలవుతున్నారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా కథల్లో కూడా మూఢనమ్మకాల గురించిన కథలు ఉన్నాయి. వాటిని ఈ ఉప విభాగంలో చర్చించాను.

**1. బొడ్రాయి**

మూఢ నమ్మకాల నిర్మూలనకు ప్రాముఖ్యం ఇచ్చిన రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'బొడ్రాయి' కథ. ఇది బొడ్రాయి కథా సంపుటంలోనిది.

శారదాంబకి పూనకం వచ్చి ఊరికి కీడు చుట్టుకుందనీ, ఊరికి కష్టం వచ్చిందని, చిన్న పెద్దాలేదు భయం భక్తి లేకుండా పోయాయి అని మూడు సంవత్సరాల నుండి వానలు లేక కరువు వచ్చిందని, అక్కల్లారా చెల్లెండ్లారా మీ పసుపుకుంకుమలకు ముప్పొచ్చిందే తల్లి అని కొలుపు

చెప్పడం, ఆ రోజు బోనాల పండగ. ఆడపిల్లలు బోనాలు ఎత్తుకొని ఊరి మధ్యలో యాపచెట్టు కిందకి వచ్చేశారు. శారదాంబ ఏది చెబితే అదే జరుగుతుందని వాళ్ళ నమ్మకం. సీతారామారావు పట్వారీగా, సర్పంచ్‌గా రమణారెడ్డి ఇద్దరు కలిసి ఆ ఊరిని గుప్పిట్లో పెట్టుకుంటారు. మన ఊరికి బొడ్రాయి లేదని, మనకు ఇన్ని కష్టాలు వచ్చాయని చెబుతుంది. అందరు ఆలోచనలో పడ్డారు. బోనాలు ముత్యాలమ్మ గుడివైపు కదిలాయి. సాయంత్రం పంచాయతీ ఆఫీసులో సర్పంచి మాట్లాడుతూ పొద్దున దేవునమ్మ చెప్పినట్లు మన వూరిలో పశువులు, మనుషులు చనిపోతున్నారని, బొడ్రాయి లేక పోవడమేనని, చుట్టు అన్ని వూర్లలో వేస్తున్నారని, మన వూరిలో వేద్దామని సర్పంచ్, వార్డు మెంబర్లు, కరణం, అన్ని కులాలవాళ్ళు బొడ్రాయి వేయడానికి కర్చుల గురించి మాట్లాడుతారు. సర్పంచ్ పదివేలు ఇస్తాను అనడం, బెల్టుషాపు, వాగు ఇసుక వేలంపాట పాడుదాం. సరిపోకపోతే ఇంటికింత వేసుకుందాం అని, దేశ గురువుకి ఫోన్ చేస్తే తనకి లక్షన్నర కర్చు అవుతుందని చెప్పి, కార్తీక శుద్ధపాడ్యమి బొడ్రాయి ప్రతిష్టకు మంచి రోజని చెప్తుతాడు. నెలరోజులు ముందుగానే ఊర్లో డప్పు చాటింపు వేయిస్తారు. అందరికి టెక్షన్ మొదలై డబ్బులకోసం వెతుకుతుంటారు.

సావిత్రి బొడ్రాయి పండుగకోసం డబ్బులు లేకపోతే చదువుకునే కొడుకుని కరణం సీతారామారావు దగ్గర జీతం ఉంచి అప్పు తెస్తుంది. అలాగే చంద్రమ్మ కూడా ఏడవతరగతి చదువుతున్న కూతురును పనిపిల్లగా ఉంచి అప్పు తెస్తుంది. చాలామంది జీతాలుండి, నగలు కుదవపెట్టి అప్పులు చేయడం, కొంతమంది మైక్రోఫైనాన్స్ వాళ్ళ దగ్గర ఇంటికో పదివేలు అప్పుచేస్తారు.

పండుగరోజు ఊరంతా సందడి సందడి, ఆడపిల్లలు, అల్లుండ్లు, పిల్లలు, బంధువులు అందరు వస్తారు. సాయంత్రం బొడ్రాయికి పూజలు జరుపుతారు. ఊరిచుట్టు వడ్లు పొత్తి పోయడం, రాత్రిపండేండు గంటలకు బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమం మొదలుపెట్టి తెల్లతెల్ల వారుతుండగా ముగించి, బోనాలు పెట్టించి అన్నం (కుంభంగా) కుప్పగా పోయించి మూడు మేకపోతులను బలిఇచ్చి, ఆ అన్నం పొలాల్లో చల్లుకుంటే పంటలు బాగా పండుతాయని దేశగురువు చెప్పడం, రైతులందరు తమతమ పొలాల్లో చల్లించుకోవడం, అందరి ఇంట్లో వంటలు, వండుకొని తినడం,

తాగడం జరుగుతుంది. సాయంత్రం దేశగురువు రఘుపతిరెడ్డి వూరి పెద్దమనుషులను పిలిపిస్తాడు. లక్షన్నర తీసుకొని సర్పంచ్, కరణం మిగతా పెద్దలు రావడంతో వారికి మందు పార్టీ ఇస్తాడు. దావత్ ముగిసాక తనకు రావలసిన డబ్బులు తీసుకొని వచ్చిన వారికి మంత్రించిన కొబ్బరికాయలు, రవిక ముడుపులిచ్చి ఆశీర్వదించాడు. కార్యక్రమం సాఫీగా జరిగినందుకు ఒకరినొకరు అభినందించుకున్నారు.

గ్రామీణ ప్రజల్ని కాపాడుతుందని నమ్మి ఊర్లో బొడ్రాయి ప్రతిష్టించడంవల్ల సామాన్యులు అప్పులపాలు అవుతారు. చదువుకునే పిల్లలు జీతాలకు, పనిపిల్లలుగా కుదరడం, రెడ్డి, రావులకు జీతగాళ్ళ కొరత తీరుతుందని రచయిత ఈ కథ ద్వారా మూఢ నమ్మకాలను విశ్వసించవద్దని, అలా విశ్వసిస్తే ఇలా జరుగుతుందని తెలియజేశాడు.

**2. బెయ్యమే దెయ్యమంట**

బాయికాడ శెనిగచేను మెద కావలి ఉన్న తండ్రికి రాత్రిపూట తినటాని సద్దిమూట (అన్నం) తీసుకొని అన్నదమ్ముల్లు ఇద్దరు కలిసి చీకట్లో వెలుతూ, దయ్యాలు ఉంటాయని బయపడుకుంటూ చేను దగ్గరికి ఎట్లా వెళ్ళుతారో 'బెయ్యమే దెయ్యమంట' కథలో వివరించాడు రచయిత. ఎలికట్టె శంకర్‌రావు రాసిన 'పరిగెచేను' కథా సంపుటిలోనిది ఈ కథ.

చెలకల శేనిగచేను పీకి కల్లంల మెదపెట్టి తెంపుతారు. చెనిగకాయ బస్తాలు ఎవరన్న దొంగలు తీసుకపోతారని భర్త కావలి ఉంటాడు. భార్య సద్దిమూట కట్టి(అన్నం) కొడుకులతోటి నాన్నకు ఇచ్చి, చెనిగకాయలు కాలుస్తడు అవి అక్కడే తిని రమ్మని పంపిస్తుంది. ఆ ఆశతోటి సద్దిమూట తీసుకొని అన్న, తమ్ముడు ఇద్దరు కలిసి నడుచుకుంటూ ఊరి బయటకు వచ్చేసరికే చీకటిపడుతుంది. పొద్దుగాల పచ్చగా ఉండే చెట్లన్నీ చీకట్లో దయ్యాల వలే కనబడేసరికి, భయపడి ప్రాణాలు బిగబట్టుకొని, ఇంటికాడ వాళ్ళ అమ్మ అదో యిదో మాట్లాడుకుంటూ వెల్లమని చెప్పిన మాట తమ్మునికి గుర్తువచ్చి మాట్లాడుకుంటూ, కంచె దాటిదే నాన్నకాడికి వెళ్ళొచ్చు, యానుంచి ఏ దయ్యం వస్తదో అని అన్న బయపడుతుంటే తమ్ముడు మాత్రం చిన్నగా నడుస్తున్నడు. అన్నకు తండ్రిమీద కోపం వస్తుంటది.

తిండికి ఇట్ల చంపుకతినకుంటే, ఇన్ని పచ్చికాయలు తిని ఉండొచ్చుగా, ఓపూట తినకుంటే ఏమాయె పొద్దున్నే గదా. ఇంత(సంకటి) గటక తిన్నడు గదా అని.

లోపల లోపల తిట్టుకుంటు నడుస్తూ ఉంటే తమ్ముడు అన్నకు శానా(చాలా) దైర్నం (ధైర్యం) వుందని అనుకుంటుండు. కాని తమ్ముని కంటె అన్న ఎక్కువ భయపడుతున్నాడని అతనికి తెలువదు. బాటపక్కన తాటిచెట్లు, తుమ్మచెట్లు అన్ని సక్కగా దెయ్యాలు నిలబడ్డట్లే వుందని, చీకట్ల ఏ కొమ్మమీద యే దయ్యం కూసుందో అని మాట్లాడుకుంటూ దబదబ నడుస్తుంటే తమ్ముడు 'అన్నో దయ్యం కొరివి దెయ్యం మన కల్లనే వస్తుంది!" అని అంటే అన్న చూస్తే తన ఎత్తు మంట, (ఉచ్చపోస్తే మనదగ్గరికి రాదట అని తమ్ముడు అంటాడు. తమ్మునికి రాదు. అన్న పోస్తాడు.) ఇద్దరు కలిసి వెనుకకు చూడకుండా బాయికాడికి ఉరుకుతారు. కల్లంకాడ మంచంమీద చుట్ట కాల్చుకొని తండ్రి కూర్చుంటే, కొరివిదెయ్యం అనుకొని బయపడి వెనుక ఆడ కొరివి దెయ్యం, ముందుకు పోదామంటే ఈడ మంచంమీద, ఎటుపోలేక కండ్లు మూసుకొని ఆంజనేయ ఆంజనేయా అని అంటుంటే ఎవలురా అక్కడ ఆడ నిలబడ్డది! అని వాళ్ళనాన్న అనేసరికి, బతికితిమిరా దేవుడా, హమ్మయ్య ప్రాణం దక్కిందని రెండు గుండె చెంబెడు నీళ్ళు గటగట తాగి, వాళ్ళ నాన్నకు చెప్తారు. శెనిగకాయల కాడ కూర్చోని ఏరుకొని తింటున్నారు. తండ్రి వొక్కవొక్కటి పలుకు వొలిచి పెట్టుకుంట అన్నాడు. "అది కొరివి దెయ్యం కాదురా, కర్రుకు నిప్పుపెట్టింద్రు అంతకు ముందే, అయినా దెయ్యాలు యాడ వుంటయ్‌రా? నీ బెయమే నీకు దయ్యం, నీ దైర్నమే నీ దైవం" (శంకర్ రావు, ఎలికట్టె. బెయ్యమే దెయ్యమంట: 98). అని అంటాడు.

ఈ కథలో రచయిత తన తండ్రి ద్వారా దయ్యాలు లేవని, అవన్ని మూఢనమ్మకాలని, బయపడవద్దని, ధైర్యంగా ఉండాలని, సమాజానికి తెలియజెప్పే ప్రయత్నం చేశాడు.

**3. ఎర్రెద్దు**

తాత తన మనవడి కన్నా ఎక్కువగా దొడ్లో పుట్టిన ఎర్రెద్దును ప్రేమగా చూసుకునేవాడు. చివరికి ఆ ఎద్దుకు ఊర్లో ఒక వ్యక్తి మంత్రాలు చేయడం వల్ల మరణించడంతో ఆ కుటుంబం బాధపడే

విధానాన్ని రచయిత బెల్లి యాదయ్య 'ఎర్రెద్దు' కథలో విశ్లేషించాడు. ఈ కథ 'నల్లగొండ జిల్లా కథలు' సంకలనంలోనిది.

సాయిలు, చంద్రమ్మ భార్యాభర్తలు. వీరికి కొడుకు, కోడలు, మనుమలు ఉంటారు. సాయిలు పశువులను ప్రాణంగా చూసుకుంటాడు. దొడ్లో పుట్టిన ఎర్రెద్దుకు మనిషికి పేరు పెట్టినట్లు పెద్దోడా! అని పిలుస్తుండేవాడు. మనుమన్ని చిన్నోడా! అని పిలుస్తుండేవాడు. ఒకసారి మనుమడు వాళ్ళ నానమ్మను నేను గొప్పనా నీకు, ఆ పశువు గొప్పనా అని అడిగితే, ఇద్దరూ సమానమేనని అంటుంది. ఊర్లో మర్ల వీరయ్య అనే వ్యక్తికి మంత్రాలు వస్తాయని అందరూ అనుకుంటుండేవారు. అతడు ఎర్రగా పొట్టిగా, చేతులకు కడియాలు గొల్లబట్ట కట్టి పూల చెప్పులు కాళ్ళకు తొడుక్కునేవాడు. మర్ల వీరయ్య బావి, సాయిలు బాయివైపు కాకున్నాగాని ఏదోపని పనిబడ్డట్టు వారం పదిరోజులుగా కొట్టం దగ్గరకు వచ్చి పోతుండేవాడు. ఒకసారి సాయిలు మనుమడిని వాగులో దొరికిచ్చుకొని భయపెడతాడు. ఆ రాత్రి అతనికి జ్వరం వస్తే వాళ్ళ నాన్నమ్మ గంగా సామ్రాని పొగ వేసి చూసుకుంటుంది. ఇది జరిగిన మూడవనాడు పశువుల కొట్టంలో ఎర్రెద్దు కుప్పకూలిపోతుంది. మర్ల వీరయ్య ఊర్లో చిన్న పిల్లలను ఆడవారిని భయపెడుతుండేవాడు.

మనుమడికి ఎద్దు చనిపోయిందని తెలవడంతో చెలకలో కొట్టం దగ్గరికి వెళ్ళే సరికి అప్పటికే జనం చాలామంది వచ్చి చూస్తుంటారు. మనుమడు తాత నడుం పట్టుకొని ఏడ్చే సరికి తాత అతనిని రొమ్ములకు హత్తుకొని ఒరేయ్ పెద్దోడా! అంటూ పెద్దగా ఏడుస్తాడు. మనుమడిని ఎర్రెద్దు దగ్గరికి నడిపించి, కాళ్ళకు దండం పెట్టించి, నొసలును మూపురాన్ని ముద్దాడించి, అతని అంగి లాగు విడిపించి ఎర్రోని తోక తుంచుతూ ఒళ్లంతా పైనుంచి కిందిదాకా రాసి, మూడు చుట్లూ ఎర్రెద్దు చుట్టూ తిప్పి కొట్టంలకు తీసుకెళ్ళి మిగతా పశువులకు చూపుతూ, ఇక ఇప్పటినుండి ఈడే మాకు పెద్దోడు. మీకు అన్న అని, ఎర్రోని లెక్కనే ఈడు కూడా మిమ్ములను చూసుకుంటాడు అని సమాధాన పరిచి, అన్నింటినీ నోరారా పేర్లతో పిలుస్తా, పెద్దోడా అని పిలవంగనే నాకు ఎదురు రావాలని మనుమడిమీద ఏడుస్తాడు.

జనం అంతా మర్ల వీరయ్యను ఊర్లో చింతలకింద పంచాయితీ పెట్టమని అతని సంగతేందో చూడాలని, ఇక అందరి దొడ్లను ఆగం చేస్తాడని, అతనికి గుండు గీయించి, సున్నం బొట్లు పెట్టాలని అంటూ సాయిలు కుటుంబాన్ని ఓదార్చుతూ ఈ ఎర్రెద్దు ఊరంతా బలగమున్న ఉన్న ఎద్దు. ఏనుగంత

బలమున్న ఎద్దు అనుకుంటూ దీవెన పాడుతుంటారు. ఎర్రెద్దు దంటకు ఏ పశువును కట్టినా కొప్పంతా తనమీదే ఏసుకునేదని, ముళ్ళుగర్ర ఆననిచ్చేది కాదని, కొత్త పిల్లలు అరక పట్టినా పని పనితీరుగానే పోయేదని, ఎవరిని పొడిచింది లేదని, పశువులన్నిటికీ పెద్ద మేస్త్రిలాగా ఉండేదని అందరూ మోటకో, అరకకో, బండికో, గొర్రుకో, బంతికో, ఎదకో, ఎర్రోనితోని పని చేయించుకున్నోళ్ళమేనని, ఇగ మీకేగాదు ఎర్రోనితోని మాకు కూడా రుణం తీరిపోయిందని సాయిలుతో జనం అంటారు.

బొంద తీసి మనిషి శవపేటికను బొందలకు దించినట్లుగానే ఎర్రెద్దు శవాన్ని కాళ్లతో అందులోకి దించుతారు. సాయిలు బొందలకు దిగి 'పెద్దోడా...' 'పెద్దోడా...' రెండుమూడు సార్లు పిలిచి ఎద్దు చెవులను ఒదిలిపెట్టి పైకెక్కి పిడికిలితో మట్టి వేస్, తర్వాత మనుమడితో ఏపిస్తాడు. అందరూ "ఎర్రెద్దుకు దండం ఎర్రెద్దుదే ధైర్యం" అంటారు. దర్శనం నర్సయ్య అందరిచేత పిడికిలితో మట్టి అందులో ఏయించి మొత్తం పూడ్చి బొందపైన ఒక తంగేడు కొమ్మను పాతుతాడు. మోటర్ పోసిన దగ్గర నీళ్ళతో అందరు కాళ్ళు, చేతులు కడుక్కుంటారు. సాయిలు కొడుకు ఇద్దరు, ముగ్గురు బాయిలకు దిగి స్నానాలు చేస్తారు. తర్వాత తాత మనుమడికి స్నానం చేపిస్తాడు. పది రోజుల దాకా వారు కోలుకోలేక పోతారు. పదకొండో రోజు వాళ్ళ దొడ్లో ఎల్లావు సూడిది అవుతుంది. సాయిలు తెలుసుకుంటాడు. పెద్దోడు చిన్న చిన్నోడుగా రాబోతున్నాడని తెలిసినాక వాళ్ళు బాధలనుంచి తేరుకుంటారు.

"వాని పాపం వాని వాళ్ళకే తగులుతుందని, సచ్చిన ఎద్దు తిరిగి రాదని, సింతకిందకు పోతే తలా ఒకటి అంటారని, రుజువు చూపించమంటారని, బదనాం అవుతామని నిజంగా ఆడే సంపి వుంటే ఆడేం పొడుగు ఎల్లడు అని, మొగోడైతే, ధైర్నం కల్లోడైతే మనుషులతోని పెట్టుకోవాలె. నోరులేని జీవిమీదనా అని విద్య, అని సాయిలు కోడలు, కొడుకుతో అంటే అతడు చింతలకు పోడు, మర్ల వీరయ్య కూడా అక్కడికి రాలేదు. సాయిలు కొడుకుకు ఎక్కడైనా ఎదురైతే మర్ల వీరయ్య దొంగలెక్క దాసుకునెటోడు. (పుట: 265)

సమాజంలోని ప్రజలు మంత్రాలు అనేవి ఉన్నాయని, మంత్రాలను, భానుమతి, చాతబాటు, భూతవైద్యం, రుగ్మత, అదొక జబ్బు అని మొదలగు పేర్లతో పిలుస్తారు. జనం వీటిని చాలా గ్రామాలలో నమ్ముతారు, బయటపడుతుంటారు. అలాగే ఈ కథలో సాయిలు ఎర్రెద్దును మర్ల వీరయ్య

మంత్రాలు చేయడంవల్ల చనిపోయిందని అంటారు. సాయిలు కొట్టం దగ్గరికి వారం పదిరోజులు తిరగడం, చిన్న పిల్లలను, ఆడవారిని భయపెట్టడం వల్ల ఊర్లో అందరికి అతనికి మంత్రాలు వస్తాయని నమ్ముతారు. సాయిలు ఎర్రెద్దు చనిపోగానే మర్ల వీరయ్యను చింతల కింద పిలిపించు అని, ఊర్లో ఎన్ని దొడ్లను ఇట్లా ఆగం చేస్తాడని, అతనికి గుండు గీయించి బొట్లు పెట్టాలంటారు. గాని మర్ల వీరయ్యకు ఎందుకు ఎదురెల్లి కొట్టవచ్చుగా, అడగవచ్చుగా, చంపవచ్చుగా కానీ అలా చేయరు. ఎందుకంటే అతడంటే, అతని మంత్రాలంటే భయం ఆకరికి ఎర్రెద్దు చనిపోయిన కుటుంబం కూడా తిని పాపం వాని వాళ్ళకే తగులుద్దని, చంపిన అతన్ని వదిలేస్తారు. ఇగ సాయిలు తన ఎర్రెద్దును తన మనుమడి కన్న ఎక్కువగా చూసుకుంటాడు. అది చనిపోతే ఆ కుటుంబం తన ఇంట్లో మనిషి చనిపోయాడన్న విధంగా బాధపడి, ఎట్లా ఏడుస్తారో అంతకన్న ఎక్కువగా చూసుకుంటాడు. అది చనిపోతే ఆ కుటుంబం తన ఇంట్లో మనిషి చనిపోయాడన్న విధంగా బాధపడి, ఎట్లా ఏడుస్తారో అంతకన్న ఎక్కువగా ఏడుస్తారు. సాయిలు తన మనుమడిని పశువుల కొట్టం దగ్గరకు తీసుకెళ్ళి వీడే మీకు, మాకు పెద్దోడు అని చెప్పి బోరుమని ఏడుస్తాడు. సాయిలు ఆ ఎర్రెద్దుమీద ఎంతప్రేమ పెంచుకుండనేది రచయిత ఈ కథలో చూపించిన విధానం, రైతులు చాలామంది ఇలాగే పశువులను ప్రేమతో పెంచుకుంటున్నారని, సమాజంలో మంత్రాలు అనేవి కూడా ఉన్నాయని రచయిత తెలియజేశాడు.

బొడ్రాయి, బెయ్యమే దెయ్యమంట, ఎర్రెద్దు కథలల్లో సమాజంలో ప్రజలు మూఢ నమ్మకాలను ఎలా నమ్ముతున్నారో, వారు అనుభవించిన ఫలితాలు ఏ విధంగా ఉన్నాయో తెలిపారు రచయితలు.

### 4.3.3. విద్య

మానవాళి జీవించడానికి ప్రధానంగా గాలి, నీరు, ఆహారం. వీటి తర్వాత అంత ప్రాధాన్యం కలది విద్య. ఈ విద్యే మానవ మేధస్సును పటిష్టం చేస్తుంది. పైన పెప్పిన మానవ నిత్యావసరాలను కూడా సులభంగా, నైపుణ్యంతో సాధించుకోవచ్చు. అటువంటి విద్యను ప్రజలకు సరిగ్గా అందకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం, కావాలని పనిగట్టుకొని ప్రజలకు మంచి విద్య అందకుండ ఉండటానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటాయి. నల్లగొండ జిల్లా కథల్లో విద్యా వ్యవస్థలో ఉన్న లోపాల గురించి, చదువుకోవడానికి ఎన్ని కష్టాలు పడాలో మొదాలైన విషయాలు ఉన్నాయి. వాటిని ఈ విభాగంలో చేర్చి విశ్లేషించాను.

## 1. బడి

బడి పంతుళ్ళను చదువు చెప్పనీయకుండా ప్రభుత్వ యంత్రాంగం అనవసరమైన ఇతర పనులకు ఎలా ఉపయోగించుకుంటుందో సవివరంగా చెబుతుంది 'బడి' కథ. మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'బొడ్రాయి' కథ సంపుటంలోనిది ఈ కథ.

మాదాపురం ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీనివాస్. మరో టీచర్ వినోద్ అమెరికా సాఫ్ట్ వేర్ కంపెనీలో జాబ్ సంపాదించి ఉన్న ఉద్యోగానికి లాంగ్ లీవ్ పెట్టడంవల్ల హెడ్ మాస్టర్ ఒక్కడే పాఠశాలను నడిపేవాడు. అతనికి ఎక్కువగా బోధనేతర పనులు అప్పజెప్పడం వల్ల పిల్లలకు పాఠాలు చెప్పకుండా ఒకనెల రోజులు జనాభా గణన ట్రైనింగ్ అని, ఇల్లు ఇల్లు తిరిగి జనాభా సర్వే చేయించడం, మూడు రోజుల ట్రైనింగ్ స్టేట్ డైరెక్టర్‌గారి నుండి వచ్చిన ఆర్డర్ అని రాజీవ్ విద్యామిషన్ ఇంచార్జి బెదిరించడం, మన సమస్యలు పరిష్కరించాలని అన్ని యూనియన్లు కలిసి ధర్నా చేస్తుంటే మీరు స్కూల్ నడుపుతున్నారని బడిని బంద్ చేసి బెల్ కొట్టించి, టీచర్లు శ్రీనివాస్‌ను తీసుకుపోవడం, సాక్షర భారత్ మీటింగ్ మండల రిసోర్స్ సెంటర్‌లో ఏర్పాటు చేశాం. మీరు మీ గ్రామంలో పద్నాలుగు సంవత్సరాల నుండి యాభై ఐదు సంవత్సరాల నిరక్షరాస్యుల లిస్టులో రండి యం.డి.ఓ. ప్రేమలత ఆర్డర్ అని, పల్స్/పోలియో కార్యక్రమం ఉందని, కలెక్టర్‌గారు చాలా సీరియస్‌గా ఉన్నాడు. ఈ కార్యక్రమం జరగకున్నా చర్యలు తప్పవంటున్నారని, ట్రైనింగ్ ప్రోగ్రాం మధ్యాహ్నం ఉంది రండి అని డాక్టరు ఫోను చేయడం, ఉపాధ్యాయులకు ఐదు రోజులు శిక్షణా కార్యక్రమం వెల్లడం వల్లి, నెలనెల కాంప్లెక్స్ మీటింగులని వెల్లడం, ఎలక్షన్ డ్యూటీలు, ఉపాధ్యాయుల సొంత సెలవులు, ఆప్షన్ హాలిడేస్, లోకల్ హాలిడేస్‌లు హడావిడిగా సిలబస్ చెప్పడం, స్కూళ్ళలో సగం పనిదినాలు కూడా పనిచేయకపోవడం వల్ల స్కూల్ మీద తల్లిదండ్రులకు నమ్మకం లేక ప్రైవేట్ స్కూల్‌లో ఇంగ్లీషు మీడియం చెప్పుతున్నారని, పిల్లల్ని ప్రైవేట్ స్కూల్‌కి పంపించారు. బడి పిల్లల సంఖ్య అరవై నుండి పదికి పడిపోవడం, ఇల్లు ఇల్లు తిరిగి ప్రతి పిల్లవాని తండ్రికి చెప్పలేకపోయింది. బళ్ళో పిల్లల సంఖ్య తగ్గడంతో రేషనలైజేషన్‌లో ఆ బడిని పక్కబడిలో కలిపి శ్రీనివాస్‌ని అక్కడి నుండి బదిలీ చేసి మరో చోటుకి పంపించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు రకరకాల బోధనేతరమైన పనులు అప్పగించడం మూలంగా పిల్లల చదువులు దెబ్బతింటున్నాయని రచయిత ఈ కథ ద్వారా చూపించాడు.

**2. కాలేజి కథ**

ప్రభుత్వం ప్రైవేటు కాలేజీలకు పర్మీషన్స్ ఇచ్చి, ప్రభుత్వ కాలేజీలను దివాలా తీయించి, కాలేజి లెక్చరర్స్‌ను, ప్రిన్సిపాల్‌ను రిజల్ట్ తీసుకురమ్మని కమీషనర్ వత్తిడి తెచ్చిన విధానమే 'కాలేజి కథ'. రచయిత్రి జిల్లెళ్ల అనసూయ 'తెలంగాణ బతుకు చిత్రాలు' కథా సంపుటిలోనిది.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పురుషోత్తం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తాడు. లెక్చరర్స్ గా బిక్షం, ఉత్తమ్ కుమార్, ప్రసాద్, శ్రీనివాస్, మధు, కృష్ణారావు, అశోక్, ఇక్బాల్ మొదలగువారు తెలుగు, ఇంగ్లీష్, బోటని, మ్యాథ్స్, హిస్టరి, ఎకనామిక్స్, సివిక్స్ మొదలైన వాటిని బోధిస్తారు. కమిషనర్ వచ్చినప్పటి నుండి లెక్చరర్లను ఎప్పటికప్పుడు పేపర్లు దిద్ది మార్కుల లిస్టులు, రిపోర్టు మూడు రోజుల్లో పంపించాలని, ఎ.జి.యం.సి కళాశాలకు నోటీస్ పంపిస్తాడు. అప్పుడు లెక్చరర్స్ పేపర్లు దిద్దడం మొదలుపెడతారు. పేపర్లు దిద్దుతుంటే అన్ని సబ్జెక్టులల్లో పిల్లలందరికి అంతంత మాత్రమే మార్కులు వస్తూ, ఫేయిలవుతున్నారు. కొందరు ఇష్టం వచ్చినట్లు అర్థంపర్థం లేకుండా రాశారు. ఈ పేపర్లను కమీషనర్‌కు పంపించి ఆ పిల్లగాండ్లకు చదువు ఎట్లా చెప్పాల్నో అడగాలని, ముప్పయివేల రూపాయలిచ్చి మెరిట్ స్టూడెంట్స్‌ను కార్పోరేట్ కాలేజిలల్ల చదివిచ్చుడుగాదు గిసొంటి పిల్లలను చేర్పించి రిజల్ట్ తెప్పియ్యమనాలని, గల్లికొక్క ప్రైవేటు కాలేజి ఇచ్చి, సర్కారు కాలేజీలను దివాలా తీయించి గీ నోట్ల అక్షరం ముక్కరాని గోసి గొంగడి గాల్లకు, చదువు చెప్పటానికి టార్గెట్లు పెట్టి, అర్వై డెబ్బై శాతం రిజల్టు తెమ్మని లేకుంటే ఇంక్రిమెంట్లు ఇవ్వమని బెదిరిస్తున్నారు.

ప్రిన్సిపాల్ సార్ మూడు రోజులు కమిషనర్ ఆపీసులో రివ్యూ మీటింగుకు వెళ్తాడు. మీటింగులో కమీషనర్ అడ్డగోలిగ మాట్లాడుతారు. ఒళ్కో చిన్న పిల్లలను నిలబెట్టినట్లు నిలబెట్టి రిజల్టు తక్కువ తెచ్చినందుకు యూజిలెస్ ఫెలోస్... ఏం చేస్తున్నారు మీరు...ఏది శాతం ఇరువై శాతం రిజల్టు అని చెప్పడానికి సిగ్గుగా లేదు. అంటూ ఇష్టం వచ్చినట్లు (పుట: 118) అంటాడు.

మీటింగ్ అయిపోయిన తర్వాత ప్రిన్సిపాల్ కాలేజీకి వస్తాడు. లెక్చరర్లు మీటింగులోని విశేషాలను అడుగుతారు. ప్రిన్సిపాల్ స్టాఫ్ మీటింగు పెట్టి ఏం కమీషనరండి...లెక్కలు అడిగాడు. ఒక్కొక్క స్టాఫ్ మెంబరు ఈ అకడమిక్ ఇయర్‌లో వచ్చిన రోజులు అంటే సి.ఎల్‌లు, ఓ.డీలు ఆప్షనల్ హాలిడేస్, బందులు సెలవులు పోనూ వచ్చిన దినాలు సంవత్సరానికి తీసుకుంటున్న జీతం లెక్కేసి ఒక్కొక్క ఇన్‌స్ట్రక్షన్ దినాలకు తీసుకుంటున్న జీతం చూస్తే...లెక్కలన్నీ ఆడ కంప్యూటర్‌లో ఉన్నాయి. ఒక్కొక్క విద్యార్థిమీద ఒక సబ్జెక్ట్ పాస్ కావడానికి, ముప్పయివేలు ఖర్చు అవుతుందని లెక్కలేసి మరీ చెప్పాడని, ఎవరెవరు ఏంజేసారో ఎట్లా టార్గెట్ రిజల్ట్ తెస్తారో రాసియ్యమంటున్నారు.(పుట: 119) అని ప్రిన్సిపల్ లెక్చరర్లకు చెప్పాడు.

ప్రభుత్వం ప్రైవేటు కాలేజీలకు అనుమతులు ఇవ్వడం వల్ల మంచిగ చదివే విద్యార్థులందరు ప్రైవేటు కాలేజీలో చేరితే, చదువురాని పిల్లలు గవర్నమెంట్ కాలేజీల్లో చేరతారు. ప్రైవేటు లెక్చరర్స్ బాగా పోటీగా చదివించడం వల్ల ఆ కాలేజీ వాళ్ళకు ర్యాంకులు వస్తున్నాయి. ప్రభుత్వ కాలేజీలో లెక్చరర్లకు మీటింగులని, పండగలని మొదలగు సెలవులు ఇవ్వడం వల్ల విద్యార్థులకు ర్యాంకులు రాకుండా రిజల్టు తక్కువ వస్తున్నాయి. అందుకని ఇకనైనా ప్రైవేటు కాలేజీలు బందుచేస్తేగాని, ప్రభుత్వ కాలేజీల్లో మెరిట్ విద్యార్థులు చేరి రిజల్టు బాగా వస్తాయని, అలా బందుచేయకుంటే, ప్రభుత్వ కాలేజీలు బందు చేయాల్సి వస్తుందని రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేయడం జరిగింది.

**3. రాక్షస క్రీడ**

మెడికల్ కాలేజీలోని సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేస్తుంటే, ఓ జూనియర్ విద్యార్థి ఆత్మహత్యా ప్రయత్నం చేసుకోగా, సీనియర్స్ విద్యార్థులు ర్యాగింగ్ బంద్ చేసి జూనియర్స్ కు వెల్‌కం చెబుతూ ఫ్రెషర్స్ పార్టీ ఇస్తారని 'రాక్షస క్రీడ' కథలో రచయిత్రి జిల్లెళ్ళ అనసూయ చిత్రీకరించారు. 'తెలంగాణ బతుకు చిత్రాలు' కథా సంపుటంలోనిది ఈ కథ.

సుధీర, రాగిణి ఇద్దరు మెడికల్ కాలేజీలో ఫస్ట్ ఇయర్‌లో చేరతారు. సీనియర్స్ జూనియర్స్ విద్యార్థులను ర్యాగింగ్ చేస్తుంటారు. ఒకరోజు సుధీర, రాగిణి సాయంత్రం ఎనిమిది గంటలకు అన్నం

తినడానికి వెలుతుంటే సీనియర్స్ విద్యార్థులు ఎనిమిది మంది అమ్మాయిలు, అయిదారుగురు అబ్బాయిలు ఎదురుపడతారు. వారికి ఆకలి అవుతుంది. సుధీర మనస్సు ఉడికిపోతుంది. 'ఇంకెన్నాళ్ళు.. ఈ ర్యాగింగ్ ఒక కంప్లైంట్ ఇచ్చామంటే కాళ్ళ బేరానికి రారు.. ఏమైనా సరే ముందుకు వెల్దాం రా.. వీళ్ళకు భయపడి కడుపు మాడ్చుకోనవసరం లేదని, పద ఏం చేస్తారో చూద్దాం' అంటూ ధైర్యంతో ముందుకు నడుస్తుంటే రాగిణి భయపడుతూ వెనకాల వెలుతుంది. సీనియర్స్ ఎదురుపడి వారిని ఇలాంటి డ్రస్సులు క్యాంపస్‌లో వేసుకురావద్దని, సీనియర్స్ అంటే గౌరవం లేదని అంటుంటే సుధీర వారికి ఎదురు సమాధానం చెప్పడంతో సీనియర్స్ రాగిణిని వెళ్లమని సుధీరను హాస్టల్‌లోకి తీసుకెళ్ళి ఇరవైమంది విద్యార్థులు ఆమెను మధ్యలో నిలబెట్టి, డ్యాన్స్ చేయమని, పాట పాడమని అంటుంటే సుధీర నాకు ఆకలవుతుందని అంటుంది. డ్రస్సు విప్పమని, ఎవరికి తోచినట్లు వారు అంటూ, నగ్నంగా పోటోలు తీసి అతికిస్తామని ర్యాగింగ్ చేస్తుంటారు. సుధీర జేబులోంచి ఒక చిన్న పొట్లం తీసి, తెల్లటి పౌడర్‌ను అందరికి చూపించి నేను సూసైడ్ చేసుకోబోతున్నాను అంటూ సీనియర్స్‌ను ఎవరిని దగ్గరకు రానివ్వకుండా అక్కడే ఆగమని 'నేను రూంలో సూసైడ్ నోటు రాసిపెట్టి వచ్చాను. నాచావుకి సీనియర్స్ ర్యాగింగే కారణమని...మీరు మెడికల్ స్టూడెంట్స్ అని చెప్పుకోవడానికే సిగ్గేస్తుందని, రాక్షస క్రీడలాంటి ర్యాగింగ్‌తో జూనియర్స్ ని భయభ్రాంతులకు గురిచేసి వారిని పోయేటట్లు చెయ్యడం దారుణమని, ఈ రోజు నన్ను నగ్నంగా చూసి ఫోటోలు తీసి నన్ను అవమాన పర్చడం వల్ల మీరు ఎలాంటి నేరం చేస్తున్నారో మీకు తెలినప్పుడు మీ జీవితాలు మీమీద ఆశలు పెట్టుకున్న మీ వాళ్ళు ఏమవుతారో ఆలోచించుకోండని అందరూ చూస్తుండగానే తెల్లటి పొడి నోట్లో వేసుకొని కాగితంతో సహా మింగి, వెంటనే కిందపడి నోట్లో నుంచి నురుగులు కక్కుతూ గిలగిల కొట్టుకుంటుండగా అంబులెన్స్ కు ఫోన్ చేస్తే వస్తుంది. రాగిణి ఏడుస్తూ ఉరికొచ్చింది. సుధీరను ఐసీయూలో ఉంచారు.

ప్రిన్సిపాల్ వచ్చి సీనియర్స్ అడిగితే సరదాగా రాగింగ్ చేశాం కాని ఇలా ప్రాణాలు తీసుకుంటుందని అనుకోలేదని, ఎలాగైనా సుధీరను కాపాడాలని ఏడుస్తూ ప్రాధేయపడతాడు. డాక్టర్ తెల్లారితేగాని ఏ విషయం చెప్పలేం అనేసరికి వారికి మరింత ఆందోళన పెరిగింది. మీడియా వాళ్ళు, పోలీసులు, ప్రిన్సిపాల్ ఇతర స్టాపు వచ్చి అమ్మాయికి స్పృహ వచ్చాకగాని ఏ విషయం తెలియదని

ప్రిన్సిపాల్ ర్యాగింగ్ గురించి మీడియావాళ్ళతోటి సీనియర్లని ఎవ్వరిని ఏం మాట్లాడనివ్వలేదు. సుధీర ప్రాణానికి ఏమి హాని లేదని డాక్టర్ చెప్తాడు. ఇది కేసయితే మాత్రం సీనియర్లు ఎవ్వరు తప్పించుకోలేరని పోలీస్ ఇన్స్పెక్టర్ అంటాడు.

తెల్లారి మెడికల్ కాలేజీలో సుధీరకు ఏం కాదని, క్షేమంగా ఉండాలని ఎక్కడబడితే అక్కడ రాస్తారు. సుధీరకు స్పృహ వస్తుంది. తననెవరూ ర్యాగింగ్ చేయలేదని సీనియర్స్ అంతా చాలా మంచి వాళ్ళని, తమ కాలేజీలో ర్యాగింగ్ స్ట్రిక్ట్ గా ప్రొహిబిట్ చేయబడిందని...తనకు ఒంట్లో బాగాలేక ఏదో మెడిసిన్ వేసుకుంటే రియాక్షన్ వచ్చిందని స్టేట్మెంట్ ఇచ్చిందని సీనియర్స్ కు తెలిసి సీనియర్స్ అంతా స్వచ్ఛందంగా ర్యాగింగ్ చేయమని, చెయ్యనియ్యమని ప్రకటిస్తారు. సీనియర్స్ జూనియర్స్ కు వెల్కం చెబుతూ ప్రెషర్స్ పార్టీ ఇస్తారు.

ఈ కథలో సుధీర సాహసం చేస్తుంది. ఆ సాహసం చెయ్యకపోతే ఈ ర్యాగింగ్కు అంతమనేదే ఉండదని తనలాంటి వాళ్ళు చదువు మానుకొని వెళ్ళుతుండేవారు. సీనియర్స్ ఆ రాక్షసానందంలో పడి వాళ్ళు ఏం చేస్తున్నారో వారికే తెలియనంతగా తెగించి ఉండడం, నగ్నంగా డ్యాన్స్ వేయడం, కెమెరాతో ఫోటోలు తీసి గోడలమీద అతికించడం, ఇలా చాలా చోట్లలో జూనియర్స్ ని సీనియర్లు ర్యాగింగ్ చేయడంతో చాలామంది విద్యార్థులు మరణిస్తున్నారని, సీనియర్స్ మీద కేసులవుతున్నాయి. వారి చదువు ఆగమై, కుటుంబంతో సహా వారు బాధపడుతున్నారని, అలా ర్యాగింగ్ చేయకూడదని రచయిత ఈ కథ ద్వారా తెలియజేయడం జరిగింది.

బడి, కాలేజీ, రాక్షస క్రీడ కథల్లో మానవ సంస్కృతీ సంప్రదాయాలలో భాగంగా విద్యావ్యవస్థ ఎలా ఉంది. దాన్ని సక్రమంగా వాడుకోకపోతే జరిగే పరిణామాలు మొదలైనవన్నీ చర్చించిన విధానాన్ని ఈ విభాగంలో గమనించవచ్చు.

### 4.3.4. నిరుద్యోగం

మానవాళికి బతకడానికి విద్య కూడా చాలా అవసరం. అలా చదువుకున్న యువతకు ఉద్యోగాలు దొరకక నిరుద్యోగులు మారుతున్నారు. అదేవిధంగా చదవకుండా ఇబ్బందులు పడుతూ

ఎన్నో బానిస, వెట్టిచాకిరి పనులు చేస్తూ ఎన్నో కష్టాలు పడుతున్నారు. అటువంటి వారి గురించన కథలు నల్లగొండ కథల్లో ఉన్నాయి. వాటి గురించి ఈ ఉపవిభాగంలో చర్చించాను.

**1. థర్డ్ డిగ్రీ**

తెలంగాణలో మిడిల్ క్లాస్ బతుకులు ఎట్లా ఉంటాయో 'థర్డ్ డిగ్రీ' కథలో చిత్రించారు రచయిత మోహన్ రుషి. ఈ కథ 'తన్లాట' (తెలంగాణ కథ–2014) సంకలనంలోనిది.

నిరంజన్ మధ్యతరగతి కుటుంబంలో జన్మిస్తాడు. చిన్నప్పుడు క్రికెట్ బాగా ఆడేవాడు. అతన్ని అందరూ నిరంజన్ హిర్వానీ అని పిలిచేవారు. ఇంటర్, డిగ్రీ, పీజీలు వరుసగా ఒకదాని తర్వాత ఒకటి చదివాడు. యూనివర్సిటిలో ఎం.ఎస్సీ (మ్యాథ్స్) చదువుకుంటూ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతుండేవాడు. కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కు ప్రిపేర్ అవుతాడు. నిరంజన్‌కు సిటీలో గవర్నమెంట్ టీచర్ ఉద్యోగం వస్తుంది. పెళ్ళి చేసుకుంటాడు. మీర్ పేట్‌లో ఇల్లు కట్టుకున్నాడు. కాని అతనికి పిల్లలు పుట్టలేదు. మొహం మోతాదుకు మించి పీక్కపోయి, భుజాలు వొంగిపోయాయి. జీవితం బాగా ఆడుకోగా పాతబడి పోయాడు. నిరంజన్‌కు ఒకసారి తన ఊరి ఫ్రెండ్ వాళ్ళ తమ్ముడు సందీప్ కనిపిస్తే అతని గురించి అడిగి తెలుసుకొని, అతనితోటి "తొందరగా లైఫులో సెటిలైపోవాలి. మనకు చేతకానప్పటికీ, చేతికి అందివచ్చే కొడుకులు ఉండాలి." (పుట: 139) అని, తనకు ముప్పై ఎనిమిది సంవత్సరాలు ఉంటాయని, అంటే నలభై సంవత్సరాలు వచ్చాయని, ముసలోళ్ళం అయిపోయినట్టేనని, అనడంతో అతనికి వొళ్ళు జలదరించింది.

"నలభైకి జీవితం ముగిసినట్టేనా? ఏమి మాయజాలం ఇది? ఉత్సాహంతో పవరళ్లు తొక్కిన జీవితం నిర్లిప్తత నీడల్లో నీరు కారిపోతుంది అతని జీవితానికి సంబంధించి ట్రాజెడీ అనేది, నాకు అనిపించినంత వరకూ, పిల్లల్లేకపోవడం కాదు. అలా వంగిపోవడానికి కారణం అదే అన్నట్టుగా కనిపించలేదు. ఏదో మిస్సింగ్ లైఫ్ ఎక్కడో స్ట్రక్ అయ్యింది" (పుట: 140) అనుకుంటాడు.

తెలంగాణ సమాజంలో చాలామంది విద్యార్థులు ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తూ నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, మధ్య తరగతి కుటుంబంలో పుట్టి ఉద్యోగం వస్తే లైఫ్ సెటిల్ అవుతుందని అనుకొని కాంపిటీటివ్ ఎగ్జామ్స్ ప్రిపేరయితే ఉద్యోగం వచ్చేసరికి వయస్సు అయిపోయి, పెండ్లి చేసుకున్నాక పిల్లలు పుట్టక, చర్మం ముడుతలు పడి, నడుములు భుజాలు వంగిపోయి

ఇబ్బందులు పడుతున్నారని, తొందరగా ఏదో ఒక ఉద్యోగం చేస్తూ లైఫ్ సెటిలై పెండ్లి చేసుకొని పిల్లలను కంటే, మనకు చాతకాకపోయే సరికి, వారు ఎదిగి వస్తారని రచయిత ఈ కథలో గవర్నమెంట్ ఉద్యోగమే రావాలంటే ఇలా జరుగుతుందని, ఏదైనా పని చేసుకొంటూ జీవితంలో స్థిరపడాలని పాఠకులకు తెలియజేశాడు.

### 4.4. రైతు కథలు

ప్రపంచ మానవాలికి అన్నం ముద్ద అందించే రైతన్న లేకుంటే ఎవ్వరూ బతకలేరు. ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి, నల్లటి నేలలోంచి తెల్లటి అన్నం మెతుకును సమస్త మానవాళికి అందిస్తాడు. ఆ క్రమంలో ఎన్నో ఒడుదొడుకులు, కష్టాలు, కడగళ్ళు, చివరికి ప్రాణం పోయినా ముందుకే సాగుతారు రైతన్నలు. రైతన్నలే లేకుంటే మనమెవ్వరం బతికి బట్టకట్టలేం కదా! అటువంటి రైతన్నలకు ప్రభుత్వాలు అండగా ఉండాలి. చాలా రకాలుగా ఆదుకోవాలి. వారిని గుర్తించాలి. అలా చేయకుంటే మనం అండగా ఉండి వారి బాధలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్ళే ప్రయత్నం చేయాలి. అటువంటి రైతు కథల్లో వారి సమస్యలు, జీవితం ఎలా ఉన్నాయో మనం చూడవచ్చు.

#### 1. వీలునామా

వానాకాలం కూడా వానలు పడక, కరువు రావడం వల్ల పంటలు ఎలాగైనా పండించాలని బోర్లు వేస్తే నీళ్ళు పడలేదు. తోటలు ఎండిపోయి అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న రైతు బాధలను 'వీలునామా' కథలో రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి చిత్రించారు.

భీకరమైన కరువు రావడం వల్ల బావులు, చెరువులు, కుంటలు, వాగులు అన్ని ఎండిపోయి, పశువులకు మేత కూడా లేకపోవడంవల్ల రైతులంతా దళారి కాసింకు అమ్మారు. రైతులందరూ బత్తాయి తోటలు వేస్తుంటే సీతారాంరెడ్డి తన ఐదెకరాల ఎర్రచెలకలో బోరువేసి బత్తాయి తోట వేసాడు. మొదట్లో బాగానే పారింది. చెట్లు పెరిగి పిందలు పడుతున్న సమయంలో బోర్లు బిక్కిపోయాయి. అప్పుచేసి తోట చుట్టూ పది బోర్లు వేస్తే చుక్కనీరు పడకపోవడం, దానికి తోడు నాలుగు ఎకరాల పొలం, ఐదు ఎకరాల పత్తిచేను వేసాడు. బర్లను అమ్మగా వచ్చిన పదహారువేలతో

సుదర్శన్ రావు బోరు పక్కన తనతోటలో బోరు వేస్తే, మోస్తరు నీళ్ళు వచ్చాయి. మోటరు తీసుకురావడానికి డబ్బులు లేకపోవడంతో భార్య భర్త బాధను చూడలేక పుస్తెలతాడు, పుస్తెతో సహా ఇచ్చి పసుపు కొమ్ముకు పసుపుతాడు కట్టుకొని మెడలో వేసుకుంది. మోటారు తెచ్చి బిగించాడు. పదిరోజులకే బోరు ఎండిపోయింది. తోట అంతా వాడిపోయింది. ఇప్పటికీ ఐదు లక్షల అప్పు అయింది. కొడుకు ప్రసాద్ ఇంజనీరింగ్ పాసై అమెరికా వెళ్ళి యం.ఎస్.సి. చేస్తూ, పార్ట్ టైం జాబ్ చేసి డబ్బులు పంపిస్తాను అనగా వద్దన్నాడు సీతారాంరెడ్డి. అప్పుడు అతడు రెండు సంవత్సరాలపాటు ఇంటిముఖం చూడలేదు. ఇంటిపక్కన కమ్మరి కొండయ్య కొడుకు రాంబాబు అమెరికా వెళ్ళి డబ్బులు పంపిస్తే వారి కుటుంబం ఎంత హాయిగా బతుకుతుంది అని అనుకుంటూ ఇంటికి వచ్చాడు సీతాంరాంరెడ్డి.

అప్పుల బాధ, సమస్యలతో మనస్థాపానికి గురైన సీతాంరాంరెడ్డి తెల్లవారుజామునే తోట దగ్గరికి వెళ్ళి పురుగులమందు తాగి మరణించాడు. భర్తను చూసి భారతమ్మ(భార్య) కుప్పకూలిపోయింది. బిడ్డ సుజాత బోరుమని ఏడుస్తూ, తండ్రిమీద పడిపోయింది. వార్త తెలిసిన ప్రసాద్ హైదరాబాద్ నుండి ఆగమేఘాల మీద వచ్చి తండ్రిని చూసి విపరీతంగా ఏడ్చాడు. సీతారాంరెడ్డి జేబులోనుంచి ఓ కాగితం జారి మంచం పక్కన పడింది. కండ్లు తూడ్చుకొని ప్రసాద్ ఆ కాగితం తీసి చూసాడు. అది తన తండ్రి రాసిన ఉత్తరం. అందులో మీ అందరికి అన్యాయం చేసి, జీవితంలో ఓడిపోయి ఈ లోకం విడిచి వెళ్తున్నాను. ముఖ్యంగా నీకు తీరని అన్యాయం చేసాను. భూమిమీద ఉన్న మమకారంతో ఆ భూమి అమ్మి నీకు డబ్బిచ్చి అమెరికా పంపలేక, ఆ బంగారు అవకాశాన్ని చెడగొట్టాను. మట్టికి రైతుకు ఉన్న అనుబంధం నన్ను భూమిని అమ్మనీయలేదు. ఇంకా ఏవేవో పంటలు పండించాలని అప్పులు చేసి నిండా మునిగాను. నా బొందిలో ప్రాణం ఉండగా ఈ భూమి అమ్మలేకపోయాను. పచ్చటి బత్తాయితోట చూసి మోసపోయాను. లెక్కకు మించి అప్పులు చేసాను. ఎడెకరాల భూమిని అమ్మి ఎవరి అప్పు వారికి ఇచ్చేయి. రైతన్నవాడు ఎవరికి అప్పు ఎగనామం పెట్టాలని చూడడు. నీతి, నిజాయిలతో బతికే రైతు ఎవరికి రుణగ్రస్తుడు కావాలనుకోడు. అందరి అప్పులు తీర్చి మీ నాన్నను రుణ విముక్తున్ని చేయి. మీ అమ్మ భారతమ్మ, మీ చెల్లెలు సుజాతా దాని చదువు, పెళ్ళి బాధ్యత అంతా నీదే. అసమర్థుడైన నీ తండ్రి ఆఖరి కోరిక అప్పు తీర్చడం. అది

తీరుస్తావు కదూ! ప్రేమతో మీ నాన్న సీతారాంరెడ్డి అంటూ కొడుకుని ఉద్దేశించి ఈ ఉత్తరం రాస్తాడు. అది చదివిన ప్రసాద్ వెక్కి వెక్కి ఏడుస్తాడు. రెడ్డి చివరి చూపుకోసం ఊరు ఊరంతా కదిలి వస్తుంది. దహన కార్యక్రమం కోసం కూలీలు ఎండిన బత్తాయి చెట్లనే కొట్టి కాష్టం పేరుస్తారు.

ఈ వీలునామా కథలో రైతుకు, మట్టికి ఉన్న సంబంధాన్ని తెలుసుకోవచ్చు. ఎంత అనుబంధం లేకపోతే అప్పులు అయినా, చివరకు ప్రాణం పోయేవరకు కూడా భూమిని అమ్మలేదు. మరణించిన తర్వాత కొడుక్కి భూమి అమ్మమని చెప్తాడు. కారణం అప్పు తీర్చడం కోసమే. రైతు ఎవరికీ అన్యాయం చేయడు, కనుక ఎవరికీ అప్పు ఎగ్గొట్టదల్చుకోలేదు. కానీ రైతుకు మాత్రం ఎప్పుడూ అన్యాయమే జరుగుతుంది. కరువు కాటువేస్తుంది, ప్రభుత్వాలు సరిగ్గా ఆదుకోవు. అయినా ఎక్కడో చిన్న ఆశ. ప్రతి పంట వేసేటప్పుడు ఈ సారైనా వర్షాలు సమృద్ధిగా పడతాయి, పంటలు పండుతాయని నమ్మి పంట వేస్తాడు. కానీ చాలాసార్లు ఫలితం తారుమారై, నీటి కోసం రకరకాల ప్రయత్నాలు చేసి విఫలం అవుతాడు. అందరికీ అన్నం పెట్టే రైతన్నకు మాత్రం మెతుకు కూడా దొరకదు.

**2. భూమి పుత్రుడు**

మరో కథ 'భూమి పుత్రుడు' ఇది కూడా మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసినదే. ఈ కథలో భూలక్ష్మయ్య వ్యవసాయ రైతు. కొడుకు చేసిన అప్పులు తీర్చడానికి తన చిన్ననాటి స్నేహితుడు మస్తాన్‌తో కలిసి బొంబాయి వెళ్ళి, నాలుగు లక్షలు సంపాదించి తెచ్చి, అప్పులు ఎలా తీరుస్తాడో ఈ కథలో చిత్రించారు రచయిత. ఈ కథ బొడ్రాయి కథా సంపుటిలోనిది.

భూలక్ష్మయ్య వ్యవసాయ రైతు. కొడుకు రాంబాబు, ఆనందరావు దగ్గర రెండు లక్షలు అప్పు చేస్తే, అది వడ్డీతో కలిపి మూడు లక్షలు అవుతుంది. పెద్దమనుషుల్లో పంచాయతీ పెట్టి నా అప్పు నాకు ఇస్తావా, లేకుంటే భూమిని నాకు అమ్మి, అప్పుపోనూ మిగతా డబ్బులు తీసుకుంటావా? అని రాంబాబును అడిగితే చప్పుడు చేయకుండా ఉంటాడు. అప్పుడు తండ్రి భూలక్షయ్యను నిలదీస్తే, ఒక పదిహేను రోజుల సమయం ఇవ్వమని వేడుకుంటాడు. తర్వాత డబ్బు ఇవ్వకుంటే భూమి ఆనందరావుకు అమ్మేటట్లు కాగితం రాసుకున్నారు. భూలక్ష్మయ్య బావిదగ్గరికి వెళ్ళి ఆలోచనలో

పడ్డాడు. తన భూమి తనకే ఉండాలని తాను రైతుగానే బతకాలని, బంగారంలాంటి, ప్రాణంలాంటి భూమి పరులపాలు కావొద్దని, ఎలాగైనా అప్పోసొప్పో చేసి, తన భూమిని ఆనందరావు చెరనుండి విడిపించుకోవాలని అనుకుంటాడు. ఒకసారి మస్తాన్ భూలక్ష్మయ్య దగ్గరికి వచ్చి కలుస్తాడు. ఇతను చిన్ననాటి మిత్రుడు. బొంబాయి వెళ్ళి ఏవో దందాలు చేసి సంపాదిస్తాడు. భూలక్ష్మయ్య అట్లా ఉన్నావేంది, ఏమైందని అడుగుతాడు. కొడుకువల్ల అప్పులపాలయ్యాను. కొడుకు ఆటో కొని అప్పులపాలుచేసాడు. భూమి పాస్ పుస్తకాలు పెట్టి ఆనందరావు దగ్గర అప్పుతెచ్చి ట్రాక్టర్ కొని, బర్లను, బండి ఎడ్లను, బంగారం అమ్మాడు. సర్పంచికి పోటీ చేసి కూడా అప్పు తెచ్చాడు. అతని దగ్గర మొత్తం మూడు లక్షల అప్పైంది. ఇదే సమయం అనుకున్న ఆనందరావు మా దగ్గర భూమి ఎప్పుడు అప్పుకిందకి జమచేద్దామని ఎదురు చూస్తున్నాడు. మొత్తం వివరించి మూడు లక్షల అప్పు ఇప్పించూ అని మస్తాన్‌ని అడుగుతాడు. అలా భూలక్ష్మయ్య బొంబాయి వెళ్ళి నాలుగు లక్షలు అప్పు తెచ్చి ఆనందరావుకు ఇచ్చి భూమి పాసుపుస్తకాలు తీసుకున్నాడు. యుద్ధంలో ఓడిపోయిన దుర్యోధనుడిలా ఆనందరావు తలవంచుకొని వెళ్ళిపోయాడు. మిగతా డబ్బుతో చిల్లర బాకీలు మొత్తం తీర్చాడు.

"భూలక్ష్మయ్య స్నానం చేసి పొలం దగ్గర్కి వెళ్ళి తన భూమి చుట్టూ మూడు చుట్లు తిరిగి మట్టిని తీసుకొని బొట్టుపెట్టుకొని కొబ్బరికాయ కొట్టి, ఇక ఈ భూమిని నానుండి ఎవరు వేరు చేయలేరు పంట పండించి, పదిమందికి పంచుతూ చివరిదాకా రైతుగానే బతుకుతా అనుకుంటూ ఇల్లు చేరాడు."

భూలక్ష్మయ్యకు దగ్గు, జ్వరం వచ్చి రోజు రోజుకు నీరసించి, ఎన్ని మందులు వాడినా తగ్గకుంటే భయంతో భార్య, కొడుకు హైదరాబాద్ హాస్పటల్‌కు తీసుకువెళ్తే రక్తం, మూత్రం, ఎక్స్‌రే, స్కానింగ్ అన్ని పరీక్షలు చేయిస్తే, డాక్టర్ రిపోర్ట్ చూసి, బల్లమీద పడుకోబెట్టి వీపుమీద చూస్తే ఒకటే కిడ్నీ ఎన్నుపక్కన పొడవాటి కోత కన్పిస్తుంది. రాంబాబును ఈ మధ్య మీనాన్న బొంబాయి వెళ్ళాడా అని అడుగుతాడు డాక్టర్. పదిహేను రోజుల కింద వెళ్ళి మస్తాన్ అంకుల్ అప్పు ఇప్పిస్తాను అంటే వెళ్ళి నాలుగు లక్షలు తెచ్చాడు సార్ అంటాడు. ఈ వార్త చదువు అని పేపర్ రాంబాబుకు ఇస్తాడు. "కిడ్నీ బ్రోకర్ మస్తాన్, మస్తాన్ బొంబాయిలో అరెస్ట్, మాయ మాటలతో అమాయకశక్తులను మోసం

చేసి కిడ్నీ వ్యాపారంలో కోట్లు కూడబెట్టిన మస్తాన్ జైలుపాలు"(భూమి పుత్రుడు: 86) వార్త పక్కన మస్తాన్ ఫోటో ఉంటుంది. సత్తెమ్మ, రాంబాబులకు భూలక్ష్మయ్య డబ్బులు ఎలా తెచ్చాడో అప్పుడు అర్థమైంది.

ఈ కథలో చిన్ననాటి మిత్రులను కూడా నమ్మవద్దని తెలుస్తుంది. రైతుకు భూమిమీద ఎంత ప్రేమ ఉందో కిడ్నీ అమ్మడం చూస్తే అర్థమవుతుంది. ఎందుకంటే అప్పులు తీర్చడం కోసం భూమి అమ్మకుండా కిడ్నీ అమ్మి తీర్చాడు కాబట్టి.

**3. రైతు యాత్ర కథ**

రాజకీయ నాయకులు సత్యం ఊరిలో రైతు యాత్ర సభ ఏర్పాటు చేసి, అందులో భాగంగా ప్రజాపార్టీ నాయకుడు పత్తిచేనులో అరక దున్నడం వల్ల చెట్లన్ని విరిగి, వాడిపోయి ఎట్లా చనిపోయిందో 'రైతు యాత్ర' కథలో చూడవచ్చు. ఈ కథ మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'బొండ్రాయి' కథా సంపుటిలోనిది.

సత్యం, సుశీల ఇద్దరూ భార్య భర్తలు. వీరు వ్యవసాయం చేసి జీవనం కొనసాగిస్తున్నారు. ప్రజాపార్టి మండల అధ్యక్షుడు రంగారావు, కార్యదర్శి పరమేశాలు సత్యాన్ని కలిసి రేపు మన మండలంలోని మన ఊరిలో 'రైతు యాత్ర' ఉందని, నీ ఎడ్లతో మీ చేనులో అరక దున్నుడు కార్యక్రమం ఉందని చెప్పి వెళ్తారు.

సత్యం ప్రజాపార్టీ వస్తే రైతుల కష్టాలు తీరుతాయని అనుకుంటాడు. ఉదయం ఎడ్లను కడిగి గుంటుక, మేడి, కాడి మొదలైనవన్ని సిద్ధంగా పెట్టుకుంటాడు. ప్రజాపార్టీ నాయకుడు ప్రసాదరావు సాయంత్రం వస్తాడు. నాయకులు, గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికి, పాదయాత్ర మొదలుపెట్టి ప్రజాపార్టీకి జై, రైతు బాంధవుడు ప్రసాదరావుకి జై అంటూ నినాదాలు ఇస్తూ, ఆట పాటలతోటి ముందుకు సాగుతున్నారు. ప్రసాదరావు నవ్వుతూ, చేతులు ఊపుతూ, పలకరిస్తూ దారిలో కమ్మరి, కుమ్మరి, చేనేత, టీ కొట్టు వృత్తుల వాళ్ళతో మాట్లాడుతూ, కష్ట సుఖాలు తెలుసుకుంటూ, వారికి

భరోసానిస్తూ ముందుకు సాగాడు. సూర్యుడు అస్తమించే సమయానికి రైతు యాత్ర సత్యం పత్తిచేను దగ్గరకు చేరింది. మీడియావాళ్ళు, పత్రిక వాళ్ళు, సెక్యూరిటి వాళ్ళు ఏర్పాట్లు చేసుకున్నారు. సభ వేదిక, కరెంటులైట్ల ఏర్పాటు చేయడం జరిగింది. సుశీల–ఇంక నలుగురు మహిళలు ప్రసాదరావుకు బొట్టుపెట్టి బంతిపూల దండలు వేసి, మంగళ హారతులిచ్చి, కొబ్బరికాయ కొట్టించి, సత్యం అతనికి మేడి అందించి, ఎడ్ల పగ్గాలు పట్టుకొని గుంటుక తోలుతుంటే, మీడియా పోటోలు, లైవ్ తీస్తారు.

స్టేజ్ దగ్గరకు వచ్చేసరికి చీకటి పడింది. సత్యాన్ని స్టేజి మీదకు తీసుకెళ్ళి ప్రసాదరావు ఉపన్యాసం మొదలుపెడతాడు. చూడండి “రైతు బతుకు ఎంత దుర్భరమైపోయింది. సమయానికి విత్తనాలు, ఎరువులు దొరకక, కరెంటు ఉండక అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వారి కష్టాల్లో పాలు పంచుకుంటూ వారికి ఎన్నుదన్నుగా నిలుస్తాను.”(రైతు యాత్ర: 99). అని “ఈ సత్యం ఇంత కష్టపడి రాత్రిపగలు పనిచేస్తే కూడా ఇంకా అప్పుల్లోనే ఉన్నాడు. అందుకే రైతు సంతోషంగా ఉండేటట్లు చేస్తా” రైతన్నకి జై అంటూ ఉపన్యాసం ముగించి, రైతుయాత్ర సభను విజయవంతం చేసినందుకు మరొకసారి అందరికీ అభినందనలు చెప్పి కారు ఎక్కుతాడు ప్రసాదరావు. ముందు సెక్యూరిటీ వాళ్ళు, ఆ వెనుక కార్లు, జీపులు కదిలి వెళ్ళాయి.

సత్యం ఇంటికి రాగానే జనం అభినందనలు తెలిపి స్వీటు తినిపించారు. టీవీల్లో స్కోరింగులు, ’విజయవంతమైన రైతుయాత్ర, ఆదర్శరైతు సత్యం పత్తిచేల్లో గుంటుక తోలుతున్న ప్రసాదరావు, ముందు నడుస్తున్న జనం” అన్నీ ఛానల్లు పోటీపడి చూపిస్తున్నాయి. ఉదయం పేపర్లలో వార్తలు రావడం జరుగుతుంది. ఎడ్లతోనే తనకు ఇంత పేరు వచ్చిందని అనుకుంటాడు.

మిగిలిన కాస్త పత్తిచేను గుంటక తోలడానికి భార్యభర్తలు వెళ్ళి చూసేసరికి పచ్చగా ఉన్న పత్తిచేను అంత విరిగి చిత్తడి, చిత్తడి, దుక్కి దుక్కి కాల్లకింద నలిగి, వాడిపోయి చనిపోయింది. తమ అధినాయకుని మోజులో ఇవేవి పట్టించుకోలేదు. అమావాస్య చీకటి, మీడియావాళ్ళు, పేపర్లవాళ్ళు, సెక్యూరిటీవాళ్ళు, చిన్నపెద్ద నాయకులు అధినాయకుని దృష్టిలో పడాలని ఒకరిమీద ఒకరు అంతా చాళ్ళలో నడుస్తున్నారని అనుకున్నాడు సత్యం. నిన్నటిదాకా ఊరించిన, మురిపించిన పత్తిచేను

ఆనవాళ్ళు లేకుండా పనికి రాకుండా పోయేసరికి తట్టుకోలేక కండ్లు బైర్లు కమ్మి భార్యమీద ఒరిగిపోతాడు. తను కూర్చుని నెమ్మదిగా భర్తను తన ఒడిలో పడుకోబెట్టుకుంది. సత్యం పడగానే రెండు ఎడ్లు అంబా అని అరిచి, వాటి గుండ్ల నిండా నీళ్ళు తిరిగి, మోకాళ్ళ మీద వంగి సత్యాన్ని ప్రేమగా నాకుతుంటే వాటి కండ్ల నీళ్ళు సత్యం ముఖంమీద టపటప పడగానే కండ్లు తెరిచేసరికి ఎడ్లు అలాగే వంగి ఉంటాయి. రైతుయాత్ర సత్యం ధన్యజీవి టీవి వార్తలు సత్యం చెవుల్లో మారుమోగుతున్నాయి.

ఈ కథలో రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో చూడవచ్చు. రాజకీయ నాయకులకు ఎన్నికలొచ్చినప్పుడే రైతులు గుర్తుకు వస్తారు. సభలు, సమావేశాలు, యాత్రలు మొదలైనవి గ్రామాల్లో పెట్టి వారి దగ్గరికి వచ్చి నన్ను గెలిపించండి, మీకు అది చేస్తాం, ఇది చేస్తాం అని చెప్పి వెళ్ళిపోతుంటారు. వారు ఎన్నికైన తర్వాత వారిని పట్టించుకోరు. ఈ కథలో సత్యం పత్తిచేనులో అరకదున్ని, రైతుయాత్ర ముగించి రంగారావు వెళ్ళిపోతాడు. రంగారావుతోపాటు ఇతర నాయకులు రైతు పత్తిచేను తొక్కారు. పత్తిచెట్లు వాళ్ళ కాళ్ళకు తగిలినా కాని అలాగే తొక్కుకుంటూ వెళ్ళి పోయారేగాని, ఆ చేను నాశనం అవుతుందని కనీసం ఏ ఒక్క నాయకుడు ఆలోచించలేదు. అలా తొక్కడంవల్ల అది పనికి వస్తుందా? రాదా? అని ఆలోచించలేకపోయారు. వారి అవసరానికి మాత్రమే రైతును ఉపయోగించుకున్నారు. వారు గెలిచిన తర్వాత చేసేది ఏమీ ఉండదుగాని, అలా ఊరేగించడానికి రైతు చేనే కావాల్సి వచ్చింది. ఆ చేను నాశనం కావాల్సి వచ్చింది. రైతులు ఎంత అమాయకంగా జీవనం గడుపుతున్నారో ఈ కథ ద్వారా రచయిత తెలియజేశారు.

**4. మాయ**

పంట పొలాల్లో ఫ్యాక్టరీల ప్రవేశాన్ని దాని పూర్వపరాన్ని విశ్లేషించిన కథ 'మాయ'. ఈ కథ మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'బొడ్రాయి' కథా సంపుటిలోనిది.

సిరిపురం గ్రామం పక్కనే రెండు గుట్టల మధ్య రెండు వందల ఎకరాల ప్రభుత్వ భూమి, ఎప్పుడూ గలగల పారే అమృతం వాగు, ఆ పైన ఎప్పుడూ నీరుండే పెద్ద చెరువు. సదరు ప్రభుత్వం భూమి మీద ఓ బడా మందుల ఫ్యాక్టరీ యజమాని సుబ్బరాజు కన్నుపడి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు,

కలెక్టర్, గ్రామ సర్పంచి వారి అనుమతితో 'రాజా ఫార్మసీ మందుల ఫ్యాక్టరీ' పేరుతో కంపెనీ నిర్మించి, మందులు తయారుచేసి, ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తాడు.

ఫ్యాక్టరీ పెట్టి రెండు సంవత్సరాలు గడిసేసరికి, బావులలోని, బోరులలోని నీళ్ళన్ని క్రమంగా ఎర్రగా మారి, తాగడానికి పనికి రాకుండా పోయి, జనం అయోమయంలో ఆందోళనలో పడిపోయారు. తెల్లటి నీళ్ళతో ఉన్న అమృతం వాగు నీరు నల్లగా మారి కంపు వాసన కొడుతూ, వాగు వెంబడి వేసిన బోర్లన్నీ కలుషితమైనవి, ఫ్యాక్టరీ వ్యర్థాలు రాత్రిపూట గుట్ట పక్కనే ఉన్న వాగుల్లో డంప్ చేయడం వల్ల.

భూములన్నీ చవుడుగా మారిపోయి, పంట పెట్టుబడులు రాక, రైతులు అప్పులపాలై, అదిగాక పెద్ద చెరువులోని నీరు సుబ్బరాజు అర టి.యం.సి నీళ్ళు తన ఫ్యాక్టరీకి వాడుకోవడంవల్ల రైతులు ఓ చివరి పంట కూడా నష్టపోతారు. గాలి, నీరు కలుషితమై జనం రోగాల బారిన పడతారు. కోటి రూపాయల కాంట్రాక్టుకు ఆశపడి సర్పంచ్ నాగిరెడ్డి ఫ్యాక్టరీ పక్కన ప్రభుత్వ భూమిలో కట్టిన కస్తూర్బా పాఠశాల, పిల్లలందరికీ శరీరమంతా ఎలర్జీరావడం, అక్కడ నుంచి మార్చివేసి, ఏదో కారణాలతో హాస్పటల్, పాఠశాల పెన్సన్లు ఎత్తివేశాడు. ఫ్యాక్టరీ దగ్గర భూములు రైతులంతా సుబ్బరాజుకు అమ్ముకొని ఊరువిడిచి పోయారు. పశువులకు, జంతువులకు, పక్షులకు మేత లేక మల్లన్న గుట్టలు మసిబారిపోయాయి. రాజు వేయించిన రోడ్డు, లైట్లు ఆయన ఫ్యాక్టరీ కొరకే అని వారికి ఆలస్యంగా అర్థమైంది. ఫార్మ ఉత్పత్తులు దేశ విదేశాలకు ఎగుమతి చేసి కోట్లకు పైగా సంపాదించి ఎదిగింది. వందల ఎకరాల భూమి సంపాదించి, ఎక్కువ మందులు ఉత్పత్తి చేసినందుకు కేంద్రమంత్రి చేతులమీదుగా ఉత్తమ ఫార్మసీ అవార్డు అందుకుంది.

"సుబ్బరాజు మాయ మాటలు నమ్మి నష్టపోయిందల్లా సిరిపురం అమాయక జనం, గాలి, నీరు కలుషితమై రోగాలపాలు కావటం అమ్మలాంటి అమృతం వాగు విషతుల్యం కావటం, మల్లన్నగుట్ట మసిబారి పోవడం, వెరసి సిరులొలికే సిరిపురం బికారిగా మిగిలిపోయింది." (మాయ కథ: 110).

మానవాళికి అన్నం పెట్టే రైతు భూముల్లో ఫ్యాక్టరీలు పెట్టడం వల్ల వ్యవసాయోత్పత్తులు తగ్గిపోతాయి. ఆ ఫ్యాక్టరీలు పెట్టిన స్థలమే కాకుండా మిగతా ప్రాంతాలలోని నీరు, గాలి కలుషితమై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొని జబ్బుల బారిన పడి మరణిస్తున్నారు. కనుక వ్యవసాయ క్షేత్రాలకు దగ్గరలో ఫ్యాక్టరీలు నిర్మించి, రైతుల్ని, ప్రజల్ని ఇబ్బందులకు గురిచేయవద్దని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

**5. రైతు పుట్క**

రైతు వ్యవసాయం చేస్తే ఎన్ని కష్టాలు, బాధలు పడతాడో రైతు స్వర్గానికి వెళ్ళి దేవునికి చెప్పి, దేవుడిని భూలోకానికి తీసుకొచ్చి చూపించిన విధానాన్ని 'రైతు పుట్క' కథలో రచయిత ఎలికట్టె శంకర్రావు చిత్రీకరించాడు.

సచ్చి స్వర్గానికి వెళ్ళిన రైతును దేవుడు 'లేసి ఎదురుపోయి ఎంతో ఆదరంగా తీసుకొచ్చి' తన కుర్చీమీద కూర్చోబెట్టి, తన జరీ కండువతో రైతు మొఖం చెమటను తుడిచి అలసిపోయావా అంటాడు. రైతు డెబ్బై సంవత్సరాలు మట్టితో సహవాసం చేసి అలసిపోయావా మరి? అంటాడు. లేచి పట్టు పరుపు మీద పడుకోకాస్త నిమ్మలపడతావు అని అన్నాడు. మట్టి పరుపులమీద పడుకున్నోన్ని, నీ పట్టు పరుపుల మీద నాకు నిద్ర పట్టదులే అన్నాడు. తాగు దూపగొని ఉంటావు అని గుండుచెంబు నిండా అమృతాన్ని తెచ్చి రైతుకు ఇస్తాడు. అతడు గడగడా తాగి రుమాలు గుడ్డతో ముఖం తూడ్చుకొని, జకమొకతో మోదుగాకు చుట్టని కాల్చి రెండు దమ్ములు గుండెలు నిండా గుంజుతాడు.

"దేవుడు ఇసనకర్రతో ఊపుకుంటా రైతా! ఈ జన్మలో వొల్లు దాసుకోకుంట వొప్పజెప్పిన పని చేసినోల్లకే స్వర్గానికి వచ్చేరాత, ఆ పున్నెం నువ్వు ఏడేడు పద్నాలుగు జన్మాలకు సరిపోను చేసుకున్నావు. అందుకని మల్లా నీకు రైతు జన్మే ఇస్తున్న పో...పొయ్యి నీ మేడిపట్టుకొని దున్నుకో పో అన్నాడు." రైతు భయపడి దేవుని చేతులో ఉన్న ఇసనకర్ర గుంజి అవతల ఇసిరేసి, నువ్వు రైతు పుట్క పుట్టించినపుడు నువ్వు వొప్పజెప్పిన పని నడమంత్రాన ఎగ్గొట్టలేక సచ్చేటట్టు కష్టం చేసిన, ఇప్పుడు మాతరం ముందే చెబుతున్న, నాకా రైతు పుట్క అస్సలే వద్దు. వద్దంటే వద్దు. నన్ను భూలోకంలో

మల్లా పుట్టియ్యాలనిపిస్తే ఇసురాల్లు జేసే కోశాల్ల ఇంట్లనో, బట్టలు ఉతికే సాకలోల్ల ఇంట్లనో గాడిదగా పుట్టియ్యి. ఏ జంజాటం (ఆరాటం) లేకుండా హాయిగా బతుకుతాను. దేవుడు అతన్ని రైతు జన్మ ఎంతో పున్నెం కదా అని మళ్ళీ అంటాడు. అప్పుడు రైతు నీకేం తెలుసు నీవు ఈడ స్వర్గంలో కూసోని ఏంది ఇబ్బంది అంటే ఎట్ల చెప్పాలి. నీకు రైతు యాతన తెల్వాలంటే భూలోకంలో ఒక పంట కాలం చూసిరా అప్పుడు తెలుస్తుందని రైతు అంటాడు. దిగ్గున లేచి రైతుకు అన్ని శరలా? పోదాంపా అని భూలోకానికి "పూలరథం ఎక్కి దేవుడు తోలుతుంటే రైతు వెనకాల కూర్చోని భూలోకానికి వచ్చారు. గిర్కలేనే(ఎనె) మీద ఆపిండు. ఇగో ఆడ తనుకులాడుతుంటే ఆదు నా తమ్ముడు మడికి నీల్లేసి రెండు దున్నపోతులతో పొలం దున్నుతున్న విధానాన్ని "నాట్లేసే సమయానికి కరెంటు పోతే అతని తమ్ముడు కండ్లనీళ్ళు పెట్టుకున్న విధానాన్ని పొలానికి నల్లగొండ నుంచి పిండికట్టలు తెచ్చి నాటేసి, చిన్న పిల్లగానికి పాలు తాపించినట్లుగ పంటమీద పానపెట్టుకొని నీల్లు బెట్టిండు. వరి పొట్టకొచ్చి ఈని ఇత్తుగట్టి బారినంక కోసిండు. కూల్లకు పోయినయి పోను లేక్కలు వేసుకొని నాలుగు బస్తాలు గూడా ఇంట్ల బెట్టకుండ ఎడ్లబండి మీదేసుకొని నల్లగొండ మార్కెట్టుకు వస్తే సావుకారి గింజలను చేత్తో పట్టి తాలుంది, పెల్లుంది అని నూటఒక్క వొంకలు చెప్పి అడ్డికి పావుశేరుకాడికి అడిగితే వాటిని తలబట్టుకొని అమ్ముకొని ఇంటికొచ్చి, పెండ్లం అంత సంకటి మాడికాయ పచ్చడిలో చెక్క ఏస్తే, అదే బ్రహ్మ పద్దార్థమోలిగ కండ్లకు అద్దుకొని తింటున్న విధానాన్ని రైతు దేవునికి చూపిస్తాడు. అంత కష్టం చేసినా రైతు ఇంత హీనమైన కూడు (అన్నం) తింటుండా అని గుండెలు బాదుకున్నాడు దేవుడు. అప్పుడు రైతు దేవుడా నిజంగా నేను పున్నెం చేసుకుంటే నామీద పావురం ఉంటే మల్లా నన్ను రైతుపుట్క పుట్టిస్తవా అని అడిగిండు. దీనికి మాట పడిపోయి 'గిర్కలేనె' మీదున్న రథంకాడికి బాటదీసిండు.

ఈ కథ ద్వారా రైతు కష్టం రైతుకే తెలుస్తుంది. మరెవరికి తెలువదు. రైతు పండించిన తిండి తింటారు. కాని అతని బాధలు అర్థం చేసుకోరు. ఆందరికీ అన్నం పెట్టే రైతుకే అన్నం లేకుండా పోతుంది. ఎన్నో కష్టాలబారిన పడుతున్నాడు. భూమిమీద ఎవ్వరూ పట్టించుకునే నాధుదు లేదని రైతు చచ్చిన తర్వాత స్వర్గానికి వెళ్తే అక్కడ దేవుడు రైతు పుట్క పుట్టడం అదృష్టం కనుక నీవు మళ్ళీ రైతుగానే పుట్టు అని అనగా, రైతు వెంటనే తేరుకొని రైతుకు వద్దు రైతు కాకుండా వేరే ఏ విధంగానైనా, గాడిదగానైనా పుట్టించు అని వేడుకుంటాడు. అప్పుడు దేవుడు అవునా రైతుకు ఇన్ని

కష్టాలుంటాయా అని ఆశ్చర్యపడి దేవుడు వారి కష్టాలు చూసి భూలోకానికి వస్తాడు. రైతు ధీనస్థితి చూసి బాధపడతాడు. అంటే దేవునికి కూడా కష్టం తెల్వకుండా పోయింది. సమస్త మానవాళికి ఆహారం అందించే రైతుకు అండగా వుండి వారిని కష్టాలనుండి విముక్తి చేసే దిశగా ఆలోచించాలి. లేకుండే మన కన్ను మనమే పొడుచుకున్నవాళ్ళమవుతామని ఈ కథ తెలుపుతుంది.

**6. అయిటివాన-మా ఆశ**

ఎలికట్టె శంకర్రావుది వ్యవసాయ కుటుంబం. తన చిన్నతనంలో తల్లిదండ్రులు వ్యవసాయం చేసే విధానం, ఇత్తనాలు భూమిలో ఏస్తే మొలవకపోవడం రచయిత ఆయిటి వాన–మా ఆశ' కథలో చిత్రించారు.

ఎండాకాలంలో ఉదయం అన్ని పనులను చేసిన తర్వాత రచయిత తల్లి, అక్కలు శెనిగెకాయలు ఇత్తనాలకు వొలుస్తారు. వాటితోపాటు బొబ్బెర్లు, పెసల్లు, ఉలవలు, గోగులు, తీరొక్క తీరు గింజలను ఎండబెట్టి వాటికి పురుగు పట్టకుండా యాపాకు బూడిద కలిపి కుండలల్లో పోస్తుంది.

తండ్రి కార్తెలు లెక్కేసుకుంట సూస్తుంటే అయిటివానలు అందుకున్నాయి. వాన బాగా పడింది. తండ్రి ఉదయ (శెల్కలకు) చెలకలకు పోయి చూసి వచ్చి రేపు ఇత్తనాలు వేయాలె సాయినోని చెలక మూరెడు మందం పదునుంది అని రచయిత తండ్రి తల్లితో అంటారు. అప్పటికే కమ్మరి కొలిమికాడ కూసోని అన్ని అవిరిచ్చుకొని పెట్టుకుంటాడు. తాడు తగుల్లు, కొట్టం దూలానికి యాలాడదీసిండు భద్రంగా.

మామ్మ జాజు కలిపిస్తే ముసలెద్దు కొమ్ములకు పూసి, అరసేతులకు పూసుకొని ఎడ్లకు బొట్టుపెట్టి, మువ్వలు కట్టి కోడారువేసి ములుగుగర్రతో జా అని అల్లిచ్చిండు. రుమాలు సుట్టి తనమీద యిత్తనాలు మూట పెట్టుకుండు. తర్వాత అమ్మా నన్ను తమ్ముని తీసుకొని చెలకలకు పోయింది. నాన్న దున్నుతుంటే అమ్మ శెనిగె కాయ గింజలు, కందులు వేసింది. ఓ అయిదారు దినాలకు మొలకలు వస్తాయి అని మురిసిపోయిండు నాన్న.

వారం పదిరోజులైన ఆన పడకపోయేసరికి మా అమ్మ నాన్నతో 'శిన్కుబడ్తదంటవాయా' అని అంటుంది. మా నాన్న పైకల్ల సూస్కుంట 'అగో నల్లగొండ గుట్టల మీద మబ్బులు బయపడాల్సిన పన్లే అన్నాడు. మానాయిన గొంతులో కొండంత ఆశ. అయినా మామ్మ గుబులుగుబులుగా ఉంటె మానాయిన అన్నాడు.

దాసుకోకుంట బూమమ్మకు కండలు దారపోసిన. మంట్లె యిత్తనాలు బోసినం మబ్బులమీద ఆడపడదాం. అన్నంబెడ్తదో అగ్గిబెడ్తడో అంత ఆపయ్యోని దయ అని అన్నాడు.

రచయిత 'నల్లగొండ గుట్టల మీద మబ్బులు బయపడాల్సిన పనిలేదు' అంటాడు. వెనుకట మబ్బులు పడితే వర్షాలు తప్పకుండా వస్తాయి అని వారి నమ్మకం. తన తల్లికి తండ్రితో చెప్పిస్తాడు.

రైతు 'ఆయిటి వానలు' వర్షాకాలం ప్రారంభంలో పడే వర్షాల కోసం(తొలకరి జల్లులు) ఎదురు చూస్తాడు. వానాకాలం వచ్చే సమయానికి చెట్టుచేమ కొట్టి, దుక్కులు దున్ని వర్షాలకోసం ఎదురుచూస్తారు. వానలు పడకపోతే భూమిలో వేసిన విత్తనాలు ఎండిపోతాయని బాధతో దిగాలు పడతాడు రైతు. విత్తనాలు వేసేముందు పెట్టుబడికి అప్పుకోసం ఎదురుచూడాలి. విత్తనాలు వేసిన తర్వాత వానలకోసం ఎదురుచూడాలి. అన్ని బాధలను తట్టుకొని కష్టపడి పంట పండిస్తే దాన్యం గిట్టుబాటుకోసం ఎదురు చూడాల్సివస్తుంది. అది కూడా రాకపోతే అప్పులు అన్ని మీదపడి ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి రైతుది అని ఈ కథ ద్వారా మనం గ్రహించవచ్చు.

### 7. పశువులంటే మా నాయనకు పానం

రచయిత ఎలికట్టె శంకర్రావు. వీరి తండ్రి వ్యవసాయం చేస్తూ, పశువులను కన్న బిడ్డల్లాగా మహా పావురంగా పెంచి, వాటికి పనినేర్పి, అరకకట్టి దున్నిన ముసలి ఎద్దు 'ఎత్తుబడితే' దాన్ని ఏ విధంగా సాదుతాడో 'పశువులంటే మానాయనకు పానం' కథలో తెలియజేశారు రచయిత. 'పరిగెచేను' కథా సంపుటిలోనిది ఈ కథ.

వ్యవసాయ కుటుంబంలో పుట్టిన రచయిత. తన తండ్రి 'పశువు సంపదను' మహా పావురంగా పోషిస్తాడు. అర్ధరాత్రి కూడా లేచి పశువులకు మేత ఏసి వచ్చెటోడు. ఎద్దుకు ఏదైనా అయితే

మంత్రగాన్ని తీసుకొచ్చి, యాప మండలతో మంత్రం ఏపిచ్చి, అది మేత మేసిన దాక, ఆయన తిండి తినేవాడు కాదు. ఒక ఆవు, ఎద్దుతోటి వ్యవసాయం చేస్తూ, దొడ్డినిండ పశువులను చేసి, వాటిని సవరిస్తుంటే చూసిన వాళ్ళు, పిల్లలను కూడా ఈ విధంగా చూస్తాడో, చూడడో అని అనేటోల్లు. ఎండకాలం పశువులకు గడ్డి సరిపోతలేదని ఒక మడి వూనాస సొప్ప ఏసి, దాన్ని సాయంత్రం పూట కోసుకొచ్చి ముక్కలు ముక్కలుగా నరికి వాటికి ఏసి, అరక ఎడ్లకు వుల్వపిండి పెట్టి, తవుడు కుడితిల కలిపి తాపెవాడు.

ఎదిగిన కోడెకు తొలిసారిగా మెడమీద కాని పెడితే, ఎంతలావు పందుబోతుల కోడె అయిన తన చేతుల కొండ మోయాల్సిందే, ఎడ్లను కొట్టకుంట అల్లించేవాడు. ఒకసారి ముసలెద్దును కొత్త కోడె దూడను బండి కట్టి నాలుగు బస్తాలు వొడ్లు మోసుకొని కాడికి పోతే కట్టేసిన కోడె దూడ పగ్గం వూడదీసుకొని ఉరుకుతుంటే, ముసలి ఎద్దును కూడా వదిలి పెడితే రెండు కలిసి నడుస్తుంటే పగ్గం అందుకొని లెంకకట్టి పట్టుకొని ఇంటికి నడుస్తుంటే, ఆడ చూసిన వాళ్ళు మెచ్చుకుంటారు. పశువును ఎంతో పావురంగా చూస్తాడు. ముల్లుకర్ర అనేది తెలవదు. బురదనాగలైనా, ఎలగటి నాగలైనా పొరపాటున దెబ్బపడితే ఇక నిరదపోడు.

ఇరవై సంవత్సరాలు కష్టంజేసి ముసలెద్దు పూర్తిగా, ఎత్తుబడి దొడ్లె ఉంటుంది. కర్ర ఆనిస్తే ఆయాసపడుతుంది. గసపెడుతుంది. కాలుతీసి కాలు ఏస్తలేదు. అయిన దాన్ని దొడ్లనే కట్టేసి సుకంగా మేతేసి సాదాడు. ఎవలన్న అమ్మేయరాదు అంటే వాళ్ళని కోప్పడుతుండేవాడు. నవిశి నవిశీ లేవకుంట అయి, కాల్లెంట పుర్రుబెట్టి, పిడుసలు, పిడుసలు పెడుతున్నా దాన్ని బకీటు నీల్లతోని శుభ్రంగా కడిగి ఇంత పచ్చిమేత లేగదూడకు పెట్టినట్లు పెడితే, అట్ల కొద్దిరోజులు నెట్టుకొచ్చిన ఎద్దు యిశంగాదని ఒక మాపు గుంజను తన్ని చనిపోయింది.

ఇంట్లో మనిషి పోయినట్లు బాదపడుతుంటే ఊరి బయటి గూడెం మాదిగవాళ్ళు వచ్చి చుట్టుచేరి, తోలు పలుచగా ఉందని, మూడు వందలకు ఇవ్వమంటారు. అంతసేపు తలకాయ

పట్టుకొని కూసున్నాయన వొక్కసారిగా లేసి అసలు ఎవడు రమ్మన్నారు బేరానికి నీయమ్మ, 'గొడ్డు సచ్చి నేనేడుస్తుంటే తోలుకోసం మీ ఏడుపు' అని కసిరిచ్చి యెల్లగొట్టిండు.

'ఇంతకాలం దాని కష్టం తిన్నం, ఇయ్యాల పీనిగను అమ్ముకొని తింటే దాని పెండ తిన్నట్లుగాదు? తల్లిరొమ్ము శీకితే కడుపు నిండుతది. కాని అయ్య యేలు శీకితే  నిండదు అని అంటాడు. ఎద్దు ఇన్ని రోజులు కష్టం చేస్తే, దానికష్టం మనం తిన్నాము, కాని అది సస్తే బొందపెట్టాలి. కాని దాన్ని అమ్ముకొని తినొద్దు అని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

ఈ కథలో రైతు వ్యవసాయ పనిలో పాల్గొనే ప్రతిదాన్ని ఎంతో ఆప్యాయంగా, ప్రేమగా, ప్రాణంగా చూసుకుంటాడు. అటువంటి రైతు జీవితాన్ని ఈ కథలో వివరించాడు రచయిత. వ్యవసాయంలో ప్రధాన పాత్ర పోషించేవి పశువులు. ఎడ్లు, బర్లు, ఆవులు మొదలైనవి. అటువంటి పశువులకు ఏదైనా గాయం అయినా, గడ్డి తినకపోయినా రైతు విలవిలలాడుతాడు. ఒకవేళ చనిపోతే దాన్ని తినేవాళ్ళకు కూడా ఇవ్వడు. దానిని మనిషి లెక్క బొందపెట్టి గౌరవించే స్వభావంగలవాడు రైతు. మూగ జీవాలపట్ల రైతుకు ఎంత గౌరవముంటుందో ఈ కథ ద్వారా తెలుస్తుంది.

**8. ఆనొస్తే... చెరువేది:**

వ్యవసాయ రైతు వర్షం వస్తే చెరువులు లేవని, అతని యొక్క ఆవేదన 'ఆనొస్తే చెరువేది' కథలో రచయిత అంబటి వెంకన్న చిత్రీకరించాడు.

కాడయ్య రాజమ్మ భార్యభర్తలు. కాడయ్య వ్యవసాయ రైతు. రోహిణి కార్తెల పెసలు వేసి ఆముదాలకు, శెనిగలకు మంచిగా భూమి కుంకుమవలె చేసి హాయిగా కూర్చున్నాడు. వాన కుండపోతగా కురుస్తుంది. ఎన్ని సంవత్సరాలయే అదునుమీద వానలు పడక, కాలం ఈ సంవత్సరమన్న అయితదో ఎప్పటిలాగే ముందల మురిపిచ్చి, వెనుక ఏడిపిస్తుందో చూడాలే. వాగులల్ల నీల్లు పారుతుంటే ఎంత బాగుండేదని, మెత్తని ఇసుక తేలి తేటగా ఉండేదని, పెద్ద ఉషికవాగు లంగ నీల్లు గలగల పారుతుంటే ఎంత హాయిగా ఉండేదని, వాగులు వొర్రెలు కుంటల్ల చేరి తల్లి వొడిలో పిల్లలోలిగ ఎంత ముద్దుగ ఉండేదని కుంటలు అలుగు బోసి చెరువులు నిండితే ఊర్లు ఎంత పచ్చగా

ఉండేదని, వాగులు దొంకలై దొంకలు ఎనెలు బట్టి అటాని భూములు సగం ఇటాని భూముల సగం కలిసిపోయాయి. మనుషులు పోవడానికి బాటే లేకుంట అయింది.

ఎకరాల కొద్ది కుంటలు పూడిపోయినాయో ఆనవాల్లే లేకుంట అయి, పెద్దపెద్ద ఈదులు వొంపులు మాయమై, చెరువులు,, పొలాలు, చెలకలు అయి, చెరువు నిండా ఇండ్లు అయి,, ఊర్లు అయి, గట్టిగా పది చినుకులు పడితే ఒకడేమో పొలాలు మునిగిపోయినాయని, ఏయిర్ పోర్టులు మునిగిపోయినాయని అంటారు. మరి ఎందుకు ఇట్టయితుందంటే ఎనకటి నుంచి ఉన్న కుంటలు పూడపోసి, ఎప్పటి నుంచో ఉన్న చెరువులను ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారు.

ఆహార పథకంలో ఏ పని చేపియ్యాలో తోయక వరద కట్టలు పోపిచ్చి, సుక్క సుక్కని పొదుపు చేయాలని సుక్క నీళ్ళు నిల్వకుంట చేస్తున్నారు. వాటర్ షెడ్ల పేరుతోని ఏడబడితే ఆడ వాగులు మలిపి చెర్లలోకి నీల్లు రాకుంట చేసినారు. కూలిరేటు వంద రూపాయలైందని సంతోషపడితే, నిత్యావసర సరుకులు రేట్లు పెరిగాయి. రోజు ఎట్ల గడవాలని ఆలోచనలు ఒకదానికోటి తెగుతలేదని, ముడిపడుతలేదని పట్టపగలే అట్టనే నిదురపోయాడు కాదయ్య. తర్వాత లేసి మొకం కడుక్కొని, తువ్వాల బుజాన వేసుకొని బాయికాడికి పోతుంటే చెరువు అలుగు పోస్తుంది.

ఈ కథలో నీటికి ఆలవాలమైన వాగులు, వంపులు, కుంటలు, చెరువులు పూడబోసి, పొలాలు, చెలకలు, ఇండ్లు కట్టుకోవడం వల్ల చెరువులు అంతమైయ్యాయని, నీళ్ళులేక రైతులు పంటలు పండక బాధపడుతున్నారని, సరైన రుతువులో(కార్తెలో) వానలు పడక, వేసిన విత్తనాలు ఎండిపోయి, వానల కోసం ఎదురు చూడడం, వానొస్తో చెరువులు లేకుండా పోయాయని రైతు ఆవేదనను వ్యక్తపరిచాడు రచయిత.

**9. ఇత్తు**

'ఇత్తు' కథా రచయిత కోట్ల వనజాత. విత్తనాలను బతుకునిచ్చే దైవంగా భావిస్తూ, ఇత్తు చేసే మాయలో రైతు ఎలా బలవుతున్నాడో ఇందులో చూడవచ్చు. హైబ్రిడ్ విత్తనాలను కొంటూ వాటిని

కాపాడటానికి ఎరువులు, మందులు వేలకు వేలు పోసి కొంటూ విత్తన కంపెనీ మాయాజూదమని తెలియజేస్తుంది ఈ కథ. 'పంట పని అయిపోతుంది. రేపు మనిషి పని కూడా అయిపోతుందని ఈ కార్పోరేట్ ప్రపంచం ప్రకటిస్తుందని చెప్పకనే చెప్తారు రచయిత్రి.

అరుణ తండ్రి చిన్నప్పుడే మరణిస్తే నాయినమ్మ, బాబాయి పెంచి, పెండ్లి చేసి, తన తండ్రి ఆస్తికి వారసురాలిగా చేస్తారు. భర్త ఇల్లరికం వస్తాడు. వీరికి ఇద్దరు మగ కవలపిల్లలు. ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నారు. వ్యవసాయం తప్ప ఇంకోటి తెలియని బతుకులు వారివి. అడవి పందులకు పెట్టిన కరెంటు కంచెకు భర్త మరణిస్తాడు. భర్త చనిపోయిన తర్వాత మొండి ధైర్యంతో వ్యవసాయం చేస్తుంది అరుణ.

ఇంట్లో గింజలు దిగుబడి రావట్లేదని, హైబ్రిడ్ విత్తనాల కంపెనీవారు ఊరికి వచ్చి, మీటింగ్ పెట్టి, తన విత్తనాలు పండించి తనకు అమ్మితే క్వింటాకు గవర్నమెంట్ కన్న డబుల్ ఇస్తానంటే, అరుణ లాంటి అమాయకులే కాదు, చాలామంది చదువుకున్న రైతులు కూడా చెప్పినట్లు విన్నారు. కాకపోతే కంపెనీ రూలు ప్రకారం ఇత్తనపు గింజలు కూడా రైతులు కొనాల్సిందేనని అన్నాడు. అందరు ఇత్తనపు గింజలు, ఎరువులు, పురుగుల మందులు వేలకు వేలు పెట్టి కొని, కోత మిషన్లకు వేలు పెట్టి కోయించి, అంతా పండించినాక ఆ కంపెనీవాడు అందులో జన్యు లోపాలు ఉన్నాయని, పంటను కొనం పొమ్మని, మొత్తానికే ఎత్తేసిండు. ఎమ్మెల్యేను కలిసి విషయం చెప్పితే "నేను కూడా గవే పండించిన ఆ బద్మాస్‌గాల్లకోసం చూస్తున్న' అన్నాడు.(పుట:70). హైదరాబాదులో వాని యొక్క అడ్రస్ పట్టుకొని లారీలల్ల 'ఒడ్లని' తీసుకుపోతే, దింపుకోవడానికి ఒప్పుకోలేదు వాడు. లారీల కిరాయి తడిసి మోపెడయితున్నాయని రైతులు తిరగబడితే, లాఠీచార్జి జరిగి, పోలీసుకేసు అయి, కోర్టులో కేసు పైనలైయితేనే డబ్బులొస్తయి. రాకపోవచ్చు కూడా. మొదలు పెట్టుబడి అప్పులు ఎట్లా తీరాలె అని అరుణ పురుగుల మందు తాగింది. సమయానికి చూడబట్టి బతికింది. అప్పు లక్షలల్ల ఉంది. నాలుగెకరాలు అమ్మి మొదట అప్పులు తీర్చమన్నాడు వాళ్ళ బాబాయి. అరుణ అట్లే చేసింది. వ్యవసాయం మీద ఆధారపడిన రైతులకు వ్యాపార దళారులు హైబ్రిడ్ కల్తీ విత్తనాలను అమ్మి మోసం చేసి వారిని అప్పుల పాలుచేసి, ఎన్నో రూపాలుగా నిత్యం దోచుకుంటూనే ఉంటారు. ఈ కథలో

వ్యవసాయం మీద ఆధారపడిన రైతులకు వ్యాపార దళారులు హైబ్రీడ్ కల్తీ విత్తనాలను అమ్మి మోసం చేసి వారిని అప్పుల పాలుజేసి, ఎన్నో రూపాలుగా నిత్యం దోచుకుంటూనే ఉంటారు. వ్యవసాయరంగం ఇప్పటికీ వ్యాపార దళారుల ఆధిపత్యం కింద ఎలా నలిగిపోతుందో, ప్రపంచీకరణ పరిణామాలకు రైతు జీవితం ఎలా అతలాకుతలమవుతుందో ఈ కథ వివరిస్తుంది.

**10. కారెడ్లు-ఎకరం నేల**

ప్రభుత్వం రాత్రిపూట కరెంటు ఇవ్వడంవల్ల మిరపతోటకు నీళ్ళు కట్టడానికి వెళ్ళిన వ్యవసాయ రైతు కరెంటు షాకు తగిలి ఎట్లా మరణిస్తాడో 'కారెడ్లు–ఎకరం నేల' కథలో తెలియజేశారు రచయిత శిరంశెట్టి కాంతారావు. 'ఊత కర్రలు' కథా సంపుటంలోనిది ఈ కథ.

నర్సయ్య ఎకరం దుబ్బచెలకకు తోడు ఇంకో రెండు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని మిరపతోట వేస్తాడు. తోటకు పెట్టుబడి సోమయ్య సేటు పెడతాడు. తోట బాగా పెరిగి, ఎంత నీరు కడితే అంత పూత, పిందే దిగుబడినిస్తుంది. కరెంట్ ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక, కళ్ళలో వత్తులు పెట్టుకొని రాత్రి పగలు అనకుండా మిరపతోట దగ్గరే ఉండేవాడు. అమావాస్య రోజు భర్త ఇంటికి రాకపోవడంతో, అంజమ్మ ఇద్దరి పిల్లల్ని వేసుకొని వాళ్ళకు దోమలు కొట్టుకుంటు, నిదురపోయిందో లేదో గణ గణ గణమంటూ ఎద్దుల మెడల్లోని గంటల సప్పుడు, 'ఖణిల్లు, ఖణిల్లు' న వేస్తున్న రంకెల సప్పుడికి ఉలికిపడి లేచింది. ఏదో అపశకునం మాదిరిగా 'కిస కిస' మంటూ బల్లి పలుకులు, ఒక్కసారిగా ఆమెకు గుండెలు 'ఝుల్లు' మన్నది. ఏందిది ఇంత రాత్రి ఎడ్లు ఎందుకు ఉరికొస్తున్నాయో అని తలుపుతీసి బయటకు వస్తే, తలతాళ్ళు తెంపుకొని వచ్చిన ఎద్దులు రెండు 'బొళ బొళా' కన్నీళ్ళు కారుస్తూ ఏదో చెప్పాలన్నట్టు రంకెలు పెడుతూ తోకలు పైకెత్తి ముందటి కాళ్ళ డెక్కలు అరిగిపొయ్యేల వాకిలిని పొక్కిలి చేస్తూ ఇంటి చుట్టూ భీభత్సంగా తిరగసాగాయి. ఎందుకు ఇట్ల చేస్తున్నాయి, మనిషి ఏమైందు, ఎడ్లు పగ్గాలు తెంపుకొని వస్తుంటే చూడలేదా అని ఆందోళన పడుతుంది. చుట్టుపక్కల వాళ్ళు ఏమైందని అడిగితే అదే నాకూ తెలుస్తలేదు అంటూ మెల్లగా ఎద్దుల దగ్గరకు పోయి గంగడోలు దువ్వుతున్నగాని, వాటి హడావిడి అంతకంతకు అధికమవుతుంటే తప్ప తగ్గడం లేదు. పిల్లలిద్దరు లేసి వచ్చి తల్లి చేతులు అటొకరు, ఇటొకరు పట్టుకొని ఏడుస్తున్నరు.

వీధివాళ్ళు అసలు ఏం జరుగుతుందో తెలుసుకోవాలని, తోటకాడికి వెళ్తుంటే, ఎద్లు వాళ్ళకంటే ముందే తోటకాడికి వస్తాయి. అక్కడికి వెళ్ళి సూస్తే, కరెంట్ షాక్ కొట్టి ప్రాణం పోయి నల్లగా కమిలిపోయిన నర్సయ్య ఇంజన్ పాకలో ఫీజ్ బోర్డుముందు బొక్కబోర్లాపడి ఉంటాడు. ఎద్లు గుంజుకొని తెంపుకున్న ఆనవాళ్ళు కన్పిస్తే వాళ్ళకు అప్పుడు అర్థమైంది. కట్టు గుంజల కాడ నిలబడి కన్నీళ్ళు కారుస్తున్న ఎద్దులను చూస్తూ "నోరున్న మనుషుల కన్నా నోరులేని ఈ జీవాలే నయం. వాటికున్న ఇస్వాసం మనుషులకు యాడిది"? అనుకుంటూ అర్ధరాత్రి అపరాత్రి అనకుంటా కరెంటిచ్చి సర్కారోడు రైతుల ప్రాణాలతో ఆడుకుంటుండు" అంటూ గవర్నమెంటును తిట్టిపోస్తూ శవాన్ని తీసి గడ్డమీద పడుకోబెట్టారు. అంజమ్మ ఏడవకుంట తన బాధను, దుఃఖాన్ని దిగమింగి బయటికి రావాల్సిన కన్నీళ్ళు గుండెల్లోనే దాచుకుంటుంది. ఆ బాధను ఎట్లా బరిస్తుందో పాపం అంటున్నారు. మరుసటిరోజు సాయంత్రం జరగాల్సిన కార్యక్రమాలు అన్ని జరిగాయి.(కాంతారావు, శిరంశెట్టి. కారెడ్లు–ఎకరం నేల).

ప్రభుత్వం వ్యవసాయానికి సంబంధించి రైతులకు విద్యుత్ ఇచ్చే విషయంలో సరైన సమయం పాటించకపోవడం వల్ల ఎంతోమంది రైతులు కరెంటు షాక్ కొట్టి చనిపోతున్నారని, అలాగే నర్సయ్య కూడా చనిపోయాడని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

**11. తెగిపడ్డ పల్లెలు**

అంజన్న గుట్టకు గ్రానైట్ రాయి ఉందని, తవ్వకం చేస్తారని పట్వారి పొలాలను అమ్ముకొమ్మని చెప్పడం వల్ల మల్లేశం తన పొలాన్ని అమ్మలేక ఎట్లా మరణించాడో 'తెగిపడ్డ పల్లెలు' కథలో రచయిత్రి సుజాత సూరేపల్లి చిత్రీకరించారు.

మల్లేశం, లక్ష్మి భార్యాభర్తలు. వ్యవసాయం మీదనే ఆధారపడి జీవించేవారు. రెండు ఎకరాల పొలం, బర్లు, గొర్లు ఉండేవి. పొలం అంటే అతనికి ప్రాణం. దేవుని దయవల్ల ఈ సంవత్సరం పంటలు బాగా పండినాయని, వచ్చే డబ్బులతోని ఇంకో రెండు బర్లను కొనాలని మల్లేశం ఊర్లో బర్లు కాసే యాదయ్యతో అనడం, మన జంజన్నగుట్టకి గ్రానైట్ రాయి ఉన్నదట. తవ్వుతారట. పట్వారి

నిన్ననే చెప్పండని, అందరిని వచ్చి ఎంతోకొంతకు పొలాలను అమ్మమన్నడని, ఉన్న బర్లనే అమ్మేయాలే అని యాదయ్య చెప్తాడు. ఏం చేయాలని అనుకుంటూ మల్లేశం దిగులుతో ఇంటికి వచ్చి, రాత్రి భార్యతో చెప్పడం, చూస్తుండగానే ఒకరోజు పొలాలమీద మట్టిపోసి రోడ్డువేస్తున్నారు. పట్వారి ఊరోల్లందరిని పిలిచి పొలాలు అమ్మమని లేకపోతే ఇచ్చే పైసలు కూడా ఇవ్వమని బెదిరించాడు. ఒక్కొక్కళ్ళు భయపడి పొలాలను అమ్ముకున్నారు. ఇంతలో మల్లేశం చిన్న అక్కను, పిల్లలను పొలాలు పోయాయని వదిలేయడం, లక్ష్మికి సంతానం అందడం (నీళ్ళు పోసుకుంది) జరిగింది.

కులపోల్లు అందరు అమ్ముకున్నారు. పట్వారి ఇంటి మీదకు వచ్చి 'మీ మాల మాదిగలకి పొలాలెందుకురా. మా దగ్గర గింతపని చేసుకుని బతకాలె' అని నానా మాటలు అనిపోయిండు. రోడ్డు పక్కన చెట్లు నరికి పెద్దపెద్ద గోడలు కట్టడంతో బర్లు, గొర్లు తిరగకుండా, బస్సులు, లారీలు చాలా స్పీడ్‌గా పోవడంతో రోడ్డుదాటే వాళ్ళకు ఆక్సిడెంట్ అయి చానామంది చనిపోతున్నారని, ఇక లాభం లేదని లక్ష్మి రాత్రి భర్తతో మనం ఒక్కరమే మిగిలినం. అందరు అన్ని అమ్ముకున్నారు. ఏదో కూలినాలి చేసుకొని బతుకుదాం గాని పొలం బర్లను అమ్మిరా అని చెప్పుతుంది. "ఎవడు ఏం చేస్తాడో చూస్తా. ఏదీ అమ్మేది లేదు." (సుజాత, సూరేపల్లి. తెగిపడ్డ పల్లెలు: 536) అని గట్టిగా అంటాడు. ఇద్దరు చాలా సేపు చర్చించుకుంటారు. తెల్లారి ఏదో నిర్ణయం తీసుకోవాలనుకుంటాడు. లక్ష్మికి నెలలు నిండాయి. మల్లేశం తెల్లారంగనే పొలంకాడికి పోయివస్తానని పోయిండు. ఎండ బాగా కొడుతుంది. భర్త ఇంకా ఇంటికి రాలేదని, ఊర్లో మీటింగు జరుగుతుంటే ఇంటి దగ్గరే కదా, ఏమి చెప్తారో పొలాల గురించి అని మెల్లగా పోయింది. మంత్రి ఎమ్మెల్యే, రోడ్డు, గుట్ట తవ్వితే వచ్చే లాభాల గురించి, రకరకాలుగా చెప్పి, పొలాలు పోయి, బతుకుదెరువు పోయి గుండే ఆగి సచ్చిపోయిన వాళ్ళ కుటుంబాలకు దీనిని అభివృద్ధి అని ఎట్లా చెప్తున్నారో లక్ష్మికి అర్థం కాలేదు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి భర్తకోసం ఎదురు చూసింది. ఇంకా రాలేదు. లక్ష్మి ప్రసవానికి కూడా తల్లిగారింటికి పోతే భర్తను ఒక్కడినే వదిలిపోవడానికి మనస్సు ఒప్పలేదు. బతుకుతెరువు ఎట్లా అనుకుంటూనే నిద్రలోకి జారింది.

బయట చప్పుడు వినిపిస్తే లేచింది. అందరు ఉరుకుతున్నారు. ఊరవతల చెట్టుదగ్గరికి పోతున్నారని అర్థమై తను మెల్లగా నడుచుకుంటూ పోతున్న కొద్దీ ఎందుకో గుండెల భయం

అవుతుంది ఆమెకు. ఇంటిపక్కలోల్లు వచ్చి వొక్కసారే లక్ష్మిని పట్టుకొని ఏడుస్తున్నా ఆమెకు ఏమి అర్థంకాలేదు. పాపం కొడుకు ఎండదెబ్బకొట్టి నట్టుందని, లేదు పొలం పోయిందని, విషం తాగిండని, నెల రోజులనుండి ఒకటే దిగులు పడుతున్నాడు. గుండె పగిలినట్టయిందని అంటుంటే అన్ని వినకుంట జనంలోకి పోయి చూసింది లక్ష్మి. కట్టెలెక్క అచేతనంగా పడి ఉన్నాడు మల్లేశం.

మల్లేశం వాళ్ళ ఊర్లో అంజన్న గుట్టకు గ్రానైట్ రాయిని తీయడం కోసం, పట్వారి రైతులందరిని పొలాలను అమ్ముకొమ్మని బెదిరించి, దళితులకు పొలాలు ఎందుకని, వారి దగ్గర పని చేసుకొని బతకాలని వారి పొలాలు అమ్మేటట్లు చేసి, పొలాల మీద మట్టి పోసి రోడ్డు వేస్తుండడం వల్ల, మల్లేశం తన పొలాన్ని బర్లను, గొర్లను అమ్మలేక, పొద్దున లేసి పొల కాడికి పోయి వస్తానని పోయి ఊరి అవతల చెట్ల దగ్గర మరణించాడు. ఈ కథలో రచయిత రైతుల బతుకులు ఇట్లా ఉన్నాయని చూపించింది.

**12. ఈదురు గాలి**

ఒక రైతు భూమిని కౌలుకు తీసుకొని పత్తిచేను వేస్తే పంట చేతికిరాక, యాసంగి పొలం ఎండకాలం చేస్తే ఈదురుగాలితో వడగండ్ల వాన వచ్చి వడ్లన్ని నేలపాలు కావడంతో, తెచ్చిన అప్పులు ఎట్లా తీర్చాలని ఆ రైతుపడే బాధను రచయిత భూతం ముత్యాలు. 'ఈదురుగాలి' కథలో భూతం ముత్యాలు రచించిన 'దగ్ధం' కథా సంపుటంలోనిది ఈ కథ.

బక్కయ్య, రుక్కమ్మ భార్యాభర్తలు. వీరి కూతురు సుజన. బిడ్డ పెండ్లీడుకు వచ్చిందని ఊరి కామందు దగ్గర భూమి కౌలుకు తీసుకొని అయిదు ఎకరాలు పత్తిచేను వేస్తే పంట చేతికి రాలేదు. రెండు ఎకరాలు యాసంగి పొలం తిండిగింజలకు అక్కరకు వస్తదని ఆశపడి చేస్తాడు. ఎండకాలం కావడంతో అతని చుట్టుపక్కల పొలాలన్ని కాసుకొని కల్లాలు కూడా అయిపోయి, తన పొలం వెనకకు రావడంతో వరికోత మిషను దొరకక కూలివాళ్ళను అడిగితే అతని ఒక్కపొలం కోసం కరువుపని వదిలిరామంటారు. ఎవరు రాకపోయేసరికి భర్త, భార్య, కూతురు కలిసి మండుటెండల్లో కూడా చెమట కారుతున్న ఎండని లెక్క చేయకుండా మధ్యాహ్నం వరకు రెండు పెద్దమళ్ళు కోస్తారు. ఎండ బాగా కొడుతుంటే కూతురిని చెట్టునీడ వెళ్ళి నీళ్ళుతాగి కూర్చుంటే, సూర్యుని చాటుకు మబ్బువచ్చి

చల్లబడంతో మల్లొక మునుం కొయ్యవచ్చని ముగ్గురు పొలంలకు దిగుతారు. ఆకాశం మబ్బులు కమ్ముకొని ఈదురుగాలి దుమ్ములేపుతూ వస్తుంటే పశువులను కాసే పోరగాల్లు చెట్లచాటుకు దాసుకుంటారు. పశువులు, జీవాలు తల ఒక దిక్కు ఉరుకుతాయి. ఉత్త మబ్బే తెప్పలు తేలిపోతాయని బక్కులు అనుకుంటాడు. కాని మబ్బులు కమ్ముకొని వాన కుమ్మరిస్తుంటే వారికి అంతుచిక్కలేదు. వడగండ్లవాన పొలంలో పడి వడ్లన్ని నేలమీద పడి కరెంటు స్తంభాలు వొరిగి, తాతలనాటి మర్రిచెట్టు ఎర్లతో సహా కూలింది. గడగడ వనుకుతూ ముగ్గురు కొట్టాలకు వెలితే, కొట్టం కూలుతుంది. తన అంగిని బిడ్డకు తొడిగి తాటి కమ్మలను తీసుకొని వడగండ్లు పడకుండా గొడుగులా వారికి పడతాడు. బర్లు మేకలు, గొర్లు నోరు తెరిచి అరుస్తూ మెడకున్న తాళ్ళతో తనుకులాడుతుంటాయి. ఉరుములు, మెరుపులు, పిడుగులు పడుతుంటే బక్కయ్య శరీరం వడగండ్ల దెబ్బలకు మొద్దుబారిపోయింది. కూతురు కండ్లు మూసుకొని అర్జునా, అర్జునా అని అరుస్తుంది.

“యాడనో పడింది పిడుగు మొదలైనవి కొంప కూల్చింది. దరిద్రపు వాన దెయ్యమోలె దాపురించె. ఇది మన గండానికే వొచ్చినట్టుందయ్యా, ఏం కాలమో ఇది పాడుకాలం, ఆనకాలం ఆనలు కుర్వాలని కప్పకావన్నాడి, ఊరంతా బతుకమ్మను దీస్తే సిన్కు రాలపాయె, ఊరంత గల్సి సబ్బండ కులాలు బొద్రాయి పండ్గజేత్తిమి. ఆ యాల్ల ఎటుపోయిందో వాన, నడ్మంత్రపానొచ్చి మోటబక్కెనోల్గె, ఎట్టుందో మన ఇల్లుపొల్లెట్టెట్టుందోపో” అంటూ అతని భార్య దీనంగా అరుస్తుంది.

ఊకో వాన ఒక్క నల్లగొండలనే ఉన్నట్టు ఈ దరిద్రపాన దేశమంతటా ఉందిగాని అంటూ ఓదార్చ చూసిండుగాని తన గుండె తర్కపోతనే ఉంది. గంటసేపు వానకే గడగడ వొనికించే, వొరిమడుల నిండ వొర్రెకోసి, చేతికొచ్చిన పంట నేలపాలు చేసింది. వొంకలైపారి డొంకల చెరిపింది. ఊర్లను సుట్టింది. పాతిండ్లను కూల్చింది. ముసలిముతకలను, పిల్లజెల్లలను తనువెల్ల తడిపి తానమాడింది. రైతుల పాలిట శాపమై నిలిచింది. ఈదరగాలికి బీతిల్లి బక్కయ్య, వడగండ్ల వానకు ముగ్గురు తడిసి ముద్దై కండ్లముంగల వొరి మళ్ళు అలుగులై పారుతుంటే దెష్టవానొచ్చి కన్నీళ్ళు పెట్టించింది. బక్కయ్య బతుకు బుగ్గిపాలు జేసింది. చేను చూడలేక గొడ్డోలే గోసపడుతూ గడగడ వొనుకుతూ ముగ్గురూ ఇంటిబాట పట్టి ఇంటికి వచ్చే సరికి ఊరంతా అతలాకుతలమై, బక్కయ్య

ఇల్లంతా ఆగమై, కమ్మల గూడు కుంటిదై, ఇంటిముంగలి సాయమాను కూలి, కోళ్ళగూడు నిండనీళ్ళు చేరి కోళ్ళన్ని నీళ్ళో తేలుతూ, ఇంటి ముంగల మోకాళ్ళలోతు నీళ్ళు చేరడంతో ఇంట్లోకెల్లి పారదెచ్చి నీళ్ళు బయటకు ఎల్లదీసిండు. భార్య సాయమాను సర్దింది. ముగ్గురూ కూడ ఇంట్ల జేరి పొయ్యికాడ కూసొని తడిసి ముద్దయిన, తిమ్మిరిపట్టిన ఒంటిని వెచ్చగా చేసుకుంటారు. ఆ రాత్రి ఇంట్లో దీపం వెలుగలేదు. చీకట్లోనే వారు నిద్రపోయారు.

బక్కయ్య మూడు రోజులు అన్నం తినకుండా, కౌలు ఎట్లా తీర్చాలని తనలోనే కుములుతుంటే, అతని భార్య బాధపడకని ధైర్నం చెప్పజూసింది. కూతురు కూడా తండ్రితోటి ఈ సంవత్సరం కాకుంటే వచ్చే సంవత్సరం తీర్చుదాము. అప్పుగాని, నువ్వు బాధపడితే మేము ఏంగావాలని అంటుంది. ఆడపిల్ల మొగోనిలెక్క తండ్రికి దైర్నం చెప్పగానే, సావే దిక్కు అనుకున్న భార్యా బిడ్డల మాటలతో కొండంత బలం వచ్చినట్టు అయి, పైసలు, సొమ్ములు మనలను సంపాదించవని, బతికుండి సాధిద్దాం, సచ్చి సంసారం ఆగం చేసుకునుడు కంటే, భార్య పిల్లల బజాట్ల పడేసి పోవుడు కంటే జీవంతో ఉండి మనిషై బతకాలని అనుకుంటాడు. బక్కయ్య ఆ రోజు నుండి మరో జన్మ ఎత్తి జనంలో కలిసి తిరిగిండు. ఈదురుగాలి మింగిందనుకుంటే ఈసమెత్తు జంకలేదు అతడు.

ఎండాకాలంలో అప్పుడప్పుడు అనుకోకుండా అకాల వర్షాలు పడి రైతులు పండించే పంటలు నీటిలో మునిగిపోయి నష్టాలపాలు అయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటారు. అప్పులు ఎక్కువైతే ఈ సంవత్సరం కాకుంటే వచ్చే సంవత్సరం పంటలు పండించి తీర్చవచ్చు. కాని చనిపోతే తన కుటుంబమే ఆగమవుతుందని అలా చనిపోకూడదని దైర్యం తెచ్చుకొని బ్రతకాలని ఈ కథ ద్వారా రచయిత తెలియజేశాడు.

**13. ఊరవతల ఊడల మర్రి**

ఒక రైతు అప్పుల బాధ తట్టుకోలేక మర్రిచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటాడు. చివరికి ఆ మర్రిచెట్టును రాత్రికి రాత్రే నరికివేసిన విధానాన్ని 'ఊరవతల ఊడల మర్రి' కథలో చిత్రించారు రచయిత. ఈ కథ పి. చంద్రశేఖర్ రాసిన 'ఆంధ్రజ్యోతి' పత్రికలోనిది

నారాయణ, పూలమ్మ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. నారాయణ తల్లితో జీవిస్తుంటారు. తనకున్న ఎకరం భూమితోపాటు, ఐదు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని బీటి పత్తి పెడతాడు. వర్షాలు పడక ఆ పత్తి గింజలను పిట్టలు ఏరుకతిని పోతాయి. ఊర్లో సేటు దగ్గర ఐదు రూపాయల వడ్డికి అప్పు తెస్తాడు. అవి మూడు లక్షల దాంక అప్పు అవుతుంది. సేటుకు ఊర్లో ఎవరో నారాయణ పత్తిచేను పండదని చెప్పడంతో తెల్లారి ఉదయం వచ్చి అప్పుగట్టమని గోలగోల చేసి, బాగా తిట్టి, మూడు రోజుల్లో అప్పు తీరిస్తే సరేసరి, లేదంటే ఇల్లు వేలంవేసి అయినా అప్పు వసూలు చేస్తానని చెప్పి వెళ్తాడు.

ఆ ఊరిలో రైతులంత అప్పులు చేసి, పంటలు పండక, అప్పు తీరక ఊరి అవతల మర్రి చెట్టుకు ఉరివేసుకొని చనిపోతారు. ఆ రోజు రాత్రి నారాయణకు కల వస్తుంది. మర్రిచెట్టు కాడికి పోయినట్టు, తాడు తీసుకపోతే ఆ చెట్టు మీదనుంచి ఏలాడుతున్నట్టు తాళ్ళు, గబ్బిలాలు తలకిందులుగా ఏలాడుతున్నట్టు, తాత, తండ్రి అక్క గబ్బిలాలుగా తిరుగుతున్నట్టు వాటిని పట్టుకోవడానికి పోయి కేకలు వేస్తుంటే, భార్య లేచి ఏందయ్య అని అడిగే సరికి లేచి ఇది కల అనుకుంటాడు. నారాయణ ఇంట్లో ముగ్గురు, తాత, నాయన, పెద్ద అక్క ఆ మర్రి చెట్టుకు ఉరివేసుకొని చనిపోతారు. భార్య పూలమ్మ, భర్తను పట్నం వెళ్ళి సేటునడగమంటుంది. కాని సేటు ఏమైనా కుదబెట్టు, బంగారం గాని, పట్టా పాసుపుస్తకాలు గాని పెడితేనే వడ్డికి డబ్బులు ఇస్తాను లేకపోతే ఇవ్వను అనేసరికి ఇంటికి వస్తూ మధ్యలో పురుగులమందు కొనుక్కొని తాగి చనిపోతాను అని అనుకుంటాడు. చేతిలో సరిపోను డబ్బులు లేక ఇంటికి వస్తాడు. ఆరోజు నర్సిగాడు అనే రైతు ఉరిపెట్టుకొని చనిపోతాడు. భర్త ఇంటికి వచ్చినంకా భార్య చెబుతుంది. ఆ రాత్రి చెబుతుంది. ఆ రాత్రి భార్య సేటు ఏమన్నాడని అడిగితే సప్పుడు చేయకుంట పడుకుంటాడు. భార్యకు అర్థమవుతుంది. అతనికి మళ్ళి కల వస్తుంది. మర్రిచెట్టు మీద కొరివి దయ్యం, ఊడలు రా రమ్మని పిలుస్తున్నట్లు ఊరితాళ్ళు... కొమ్మ కొమ్మకో ఉరితాడు గబ్బిలాల కిచ్ కిచ్...కీచ్... కీచ్... కల రావడంతో ఒకసారిగా ఉలికిపడి లేచి చూస్తే భార్య నిద్రబోతుంది. పక్కనే కూతురు కూడా ఉంటుంది. అతనికి భయం జొరపడుతుంది. రా రమ్మని పిలుస్తుంది ఊడల మర్రిచెట్టు. గబగబ లేచాడు. ఇంటిపై కప్పు సూరులో దాచుకున్న సారాయి సీస బయటకు తీసి తాగి, గొడ్డలి తీసుకొని చీకట్లోనే ఊరవతల ఊడల మర్రిచెట్టు దగ్గరికి చేరి, ఎవరన్నా చూస్తున్నారా లేదా అటు ఇటు చూసి వచ్చిన పని మొదలు పెట్టాడు.

ఆ రాత్రంతా మర్రిచెట్టును మొదలు లేకుండా నారాయణ నరికి నరికి అలసిపోయి, ఒళ్ళంతా చెమటలు కారుతుంటాయి. భార్య ఆ చెట్టు దగ్గరకు వెలితే అక్కడ చెట్టులేదు. "పదవే...బస్సొచ్చే ఏళయింది తొందరగా బయలుదేరి పట్నం వెళదాం...అక్కడే ఏదో ఓ పని చేసుకొని అప్పులు తీరుద్దాం" అంటూ...పూలమ్మను తీసుకొని ఇంటిదారి పడుతాడు నారాయణ.

సమాజంలో రైతులందరు పంటలు పండితే బతకవచ్చని, అప్పులు చేసి పెట్టుబడి పెడతారు. సరైన సమయంలో వర్షాలు పడక, ఏసిన గింజలు పక్షులు తినిపోవడం వల్ల, పంట చేతికి రాక, అప్పులపాలు అవుతారు. పంట పండితే అప్పులు తీరుతాయనుకునే రైతులకు పంటలు పండక నిరాశ మిగలడం వల్ల మందుతాగో, ఉరివేసుకొని చనిపోతుంటారు. ఈ కథలో కూడా నారాయణ అప్పులు చేసి పత్తిచేను వేస్తే వర్షాలు పడక గింజలన్ని తినిపోతే, అప్పులోడు వచ్చి ఇంటిమీద కూర్చుంటే, ఎక్కడ వెతికినా అప్పుపుట్టక ఆఖరికి చావడానికైనా సిద్ధపడతాడు. ఊర్లో రైతులంతా అప్పులు తీరక చనిపోవడంతో నారాయణకు భయం జొరపడి, ఊరవతల మర్రిచెట్టు పిలవడం, రాత్రి నిదురపట్టక దిగ్గున లేచి సూరులో దాచిపెట్టుకున్న సారాతీసి తాగి, గొడ్డలి పట్టుకొని రాత్రి మర్రిచెట్టు నరికి, పట్నం వెళ్ళి కష్టపడి అప్పు తీర్చొచ్చుకాని, సస్తే అప్పులు తీరవుగదా అని రచయిత రైతులంతా అప్పులైయ్యాయని బయపడవద్దని, చావకూడదని బతికి ఉంటే అప్పులు ఇయ్యాల కాకుంటే రేపైనా తీర్చవచ్చని ఈ కథ ద్వారా సమాజంలోని రైతులందరికి తెలియజేయడం జరిగింది.

**14. పంచనామా**

ఓ రైతు తోట ఎండిపోతుందని బోరుబండి, తీసుకువచ్చి బోరు వేస్తుంటే కలెక్టర్‌గారి ఆర్డర్ ప్రకారం, ఎం.ఆర్.ఓ, ఆర్.ఐలు వచ్చి, 'వాల్టాయాక్టు' చట్టం కింద బోర్ బండి సీజ్ చేసి, కేసు బుక్ చేయడంతో, బోరువేయనీయకుండా చేసేసరికి ఆ రైతు రాత్రి యాపచెట్టుకు ఉరివేసుకొని చనిపోతాడు. ప్రభుత్వ నిర్వాహకుల వల్ల ఆ రైతు ఆత్మహత్య చేసుకున్నాడని 'పంచనామా' కథలో చిత్రించబడింది. రచయిత బోధనం నర్సిరెడ్డి రాసిన 'సంతకం' పత్రికలో (ఏప్రిల్-2012) ఈ కథను విశ్లేషించాడు.

నల్లగొండకు ఐదు కిలోమీటర్ల దూరం అన్నారం శివార్ల రామస్వామికి ఐదు ఎకరాల బత్తాయితోట ఉంటుంది. చుట్టుపక్కల అందరికి బోర్లు వేస్తే నీళ్ళు పడ్డాయికాని, తనకు మాత్రం ఎనిమిది (పొక్కలు) బోర్లు వేసినా సుక్కనీళ్ళు రాలేదు. కాని ఇంకా రెండు బోర్లేస్తే మట్టంగా పది

అయితాయని ఎట్లనన్న చేసి ఆ రెండు పొక్కలు బొడిసి ఇగ ఆశలు వదులుకుందామనుకుంటాడు. బత్తాయి తోటకు నీళ్ళు లేక వాడుపు మొకం బెట్టి చెట్లు అన్ని ఎండిపోవడానికి వస్తున్నాయని, దుప్పులపల్లిల పటేలు లింగారెడ్డి కాడికి పోయి పదివేలు బయానాగా ఇచ్చి బోరుబండి తీసుకువచ్చి బోర్ వేస్తుంటాడు. ఇతనిది రోడు పక్కనే తోట ఉండటంచేత ముషంపల్లిల ఎస్.సి. రైతుల తోటలు చూడటానికి కలెక్టరు, ఎం.ఆర్.ఓ యాదగిరికి ఫోన్ చేసి పర్మిషన్ తీసుకున్నారా తీసుకోకపోతే 'వాల్టాయాక్టు కింద కేసు బుక్ చేసి బండిని సీజ్ చెయ్యి అని చెప్పడంతో ఎం.ఆర్.ఓ. ఆర్.ఐ., ఇద్దరు, విలేజి ఆఫీసర్లు వచ్చి రామసామి తోటలోని బోరుబండి దగ్గరికి వస్తారు. బోరు మిషన్ ఆపుజేసి డ్రైవరు ఓనర్లకు ఫోన్ చేసిండు. ఓనర్ వెంటనే ఎం.ఆర్.ఓ అడిగితే, నీకు పర్మిషనుందా, ఎం.ఆర్.ఓ అంటాడు. 'ఎందుకు సార్ నా భూమిలనే బోరేసుకుంటే పర్మిషన్ గావాలా? అడిగిండు అమాయకంగా ఔనయా! పర్మిషన్ తీసుకోవాలె ఎట్లబడితే అట్లా బోర్లేసుకుంటే భూమిల నీళ్ళు లేకుంటయ్యి కరువులోస్తున్నయ్. అందుకనే ఈ బండిమీద కేసు బెట్టి స్టేషన్‌కు బంపుతున్న నీమీద గూడ కేసు బెట్టాలే గని నిన్ను వదిలి పెడుతున్న ఓళ్ళది ఈ బండి?" (పుట: 14) (సంకటం పత్రిక) ఎం.ఆర్.ఓ. అడిగిండు. రామసామి తన మీద కూడా కేసు బెట్టి లోపలేయండి సారు అని ఈ బాధలు లేకుండా ఆడనన్న నిమ్మలంగుంట! అంటాడు. బోరుబండి యజమాని లింగారెడ్డి మినిష్టరుతో ఫోన్ చేయించిన కలెక్టర్ వినలేదు కేసు బుక్ చేస్తారు.

రాత్రి రామసామి ఇంటికి రాకపోయే సరికి ఇంట్లో వాళ్ళు ఇంకా రాలేదని వాళ్ళను వీళ్ళను అడిగితే తోటలోనే ఉన్నాడని చెప్పుతారు. భార్యకు కదుపుల భయం జొరపడుతుంది. భర్తకు ఏమైందో ఇంకా రాకపోయేనని లబలబ మొత్తుకుండే సరికి, వాళ్ళ అన్నకొడుకు బండేసుకొని పోయే సరికే యాపచెట్టుకు వేళాడుకుంట కనబడేసరికి, ఊళ్ళెకు ఊరికి అందర్ని తీసుక వచ్చాడు. ఎం.ఆర్.ఓ., ఎ.ఎస్.ఇ. మల్లికార్జున్ వచ్చి డెడ్ బాడిని కిందకు దించారు. ఏ.ఎస్.ఐ గారు మీ ఫార్మాలిటిస్ కంప్లీట్ చేసి ఆర్.ఐ.కి కాపి ఇవ్వండని ఎం.ఆర్.ఓ. అంటాడు. అందరూ ఎవరిపని వాళ్ళు చేస్తున్నారు. రామసామి భార్య పిల్లలు గుండెలు బాదుకుంట ఏడుస్తున్నారు. ఆళ్ళోళ్ళు వాళ్ళను పట్టుకొని ఓదార్చుతున్నారు. ఎం.ఆర్.ఓ కి మనస్సులో బాదగా ఉండి వారినే చూస్తున్నాడు. కంప్లీట్ అయ్యిపోయి ట్రాక్టర్ వెళ్ళిపోతుంది. ఎం.ఆర్.ఓ, ఆర్.ఐ. తోటి ఈ రామసామిని మనమే

చంపినమయ్యా ఆన్ని బోరు వేసుకోనియ్యమైతిమి, సరైన సాహాయం చెయ్యకపోతిమి అని అనుకుంటు బయలుదేరిండు.

ఈ కథలో రామస్వామి బత్తాయితోట ఎండిపోతుంటే తట్టుకోలేక బోర్లు వేస్తే, అవి పడక, అప్పుల పాలైతాడు. ఇంకా ఏమైనా బోర్లు పడతాయోనని ఆశతో బోరుబండి తీసుకొచ్చి బోరు ఏపిస్తుంటే ఎం.ఆర్.ఓ., ఆర్.ఐలు వచ్చి సీజ్ చేయడం, కేసు బెట్టడం వల్ల ఇగ చేసేది ఏమీలేక ఆ బాధను భరించలేక పోయిండు. రాత్రి యాపచెట్టుకు ఉరేసుకొని చనిపోయాడు. చివరికి ఎం.ఆర్.ఓకి ఆ రైతు బాదేందో అర్థమైంది. ఆ రైతును మనమే చంపినామనుకున్నాడు. ప్రభుత్వం రైతులను తోటలను పెట్టండి అని అంటారు కాని వాటికి నీరందించే ప్రయత్నం చేయటంలేదు. నీళ్ళు లేక ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రైతులకు కాల్వల ద్వారా నీరందిస్తే బాగుంటుందని, రైతులు నీరు లేకుండా పడే బాధలను ఈ కథ ద్వారా తెలియజేశాడు రచయిత.

**15. బండ్లబాట**

ఓ రైతు తనకున్న రెండు ఎకరాల భూమికి వెనుకట నుంచి నడుస్తున్న బాటను ఇప్పుడు బాటలేదని ఓ దొర అతనిపై కేసుపెట్టి, పెద్దమనషులల్ల పడేసి, ఆ రైతుకున్న రెండు ఎకరాలను కొనడం వల్ల ఆ రైతుపడే బాధను 'బండ్లబాట' కథలో ఏనుగు రచయిత నర్సింహా రెడ్డి విశ్లేషించాడు. 'జాంతి' పత్రికలో (ఏప్రిల్–2014 to– జూన్ 2014) ఈ కథ ప్రచురితమైంది.

బాలయ్యకి ఇద్దరు పిల్లలు. ఒక కూతురు, ఒక కుమారుడు ఆయనకు రెండు ఎకరాల భూమి సిటికి దగ్గర ఉండడంతో కూరగాయలు వేసుకొని వాటిని అమ్ముకొని జీవిస్తుండేవాడు. బాలయ్య భూమి పక్కన రామయ్య భూమిని, చుట్టుపక్కల ఉన్నవారి భూములను అంతా మార్తాండరావు కొంటాడు. ఇతని దగ్గర డబ్బు బాగా ఉండటంతో భూములను కొంటుండేవాడు. ఇగ బాలయ్య రెండు ఎకరాలు మాత్రమే ఉంటుంది అక్కడ. తన చెలకలకు పోవడానికి వెనుకటి నుంచి బండ్లబాట ఉండేది. ఆ బాటలనే బాలయ్య వెల్లెవాడు. మార్తాండరావు కొన్న భూములన్నీటికి తన మనుషులతోటి ఫెన్సింగ్ వేస్తు, బాలయ్య నడిచే బండ్లబాటను కూడా పూడ్చి వేస్తుంటే వారిని అడుగుతాడు బాలయ్య. వాళ్ళు ఇది మా దొరది పట్ట అయిన భూమి అంటారు. బాలయ్య ఆ ఫెన్సింగ్ చెడగొట్టి తన చెలకలకు పోవడానికి దారి తీసుకుంటాడు. మార్తాండరావు కేసు పెడతాడు. బాలయ్యను పోలీసులు పిలిపిస్తారు. ఎస్.ఐ బాలయ్యను నీ భూమి కూడా మార్తాండరావుకు అమ్మమని, ఆ బాట పంచాయతీ తీరుతుందని

నీమీద కేసుపెట్టకుండా ఉంటాడని చెప్పడంతో బాలయ్య అమ్మనని అంటాడు. పోలీసులు పిలిచేసరికి ఇంట్లో వాళ్ళంతా బయపడుతుంటారు. బాలయ్య తన బావమర్దిని పిలిపించుకుంటాడు. పెద్దమనుషుల పంచాయతి పెడతారు. వారు అది పట్టాభూమి రామయ్య దగ్గర కొన్నాడు. ధరపెట్టుకొన్న భూమి ఉత్తిగ ఎట్లా వదిలిపెడతాడు అని పెద్దమనుషులు అంటారు. బాలయ్య వెనకటి నుంచి నడుస్తున్న, పట్టాభూమి కాదు అని నన్ను ముంచకండని బతిమిలాడుతాడు.

వీఆర్వోను పిలిపిస్తే, నక్షపెట్టి చూసి బండ్లబాట లేదని చెప్పుతాడు. వెనుకటి నుంచి నడిచిన బాటేనాయే అని బాలయ్య అంటాడు. దానికి వీఆర్వో ఎనుకట ఎట్లబడితే అట్లా నడిచారు. ఇప్పుడు భూములకు ధరలు పెరగడంతో బంగారం లెక్క పట్ట భూమి దారుడు కొలుస్తున్నారు. అయితే నేను ఎట్ల నడవాలని వీఆర్వోను అడుగుతాడు. వీఆర్వో బాలయ్యను తొవ్వన్నకొను, లేకపోతే నీ రెండు ఎకరాలు తనకొన్న అమ్ము అంటాడు. ఎమ్మటే మార్తాండరావు ఇలా అంటాడు. “నేను నిజంగా భూమి అమ్మేందుకు కొనలేదు డెవలప్‌మెంట్ చేద్దామని కొన్నాను. నీ పొలానికి దారి లేదంటే, నువుకొంటానంటే, అదే గ్రామ పెద్దలందరూ కలిసి చెబుతున్నారు. కాబట్టి దారికోసం భూమి అమ్ముతాను. దారి చాలా పొడవుంది. కాబట్టి రెండు ఎకరాల విస్తీర్ణమవుతుంది. ఎకరాకు రెండు లక్షలు నాలుగు లక్షలిస్తే దారి వదుల్తాను లేదా నేనే నీ రెండెకరాలు నాలుగు లక్షలకు కొంటాను. నిర్ణయం నీదే.” (పుట: 17) జాంబి పత్రిక–2014) అని అతని మనసులోని మాటను కుండబద్దలు కొట్టినట్టుగా మాట్లాడేసరికి, పెద్దమనుషులు కూడా న్యాయంగానే ఉందని అనడంతో, బాలయ్య బాధతో అందరూ చూస్తుండగానే బోరున ఏడుస్తాడు. తనవద్ద నాలుగు లక్షలే ఉంటే తనకీ బాధలన్నీ ఎందుకు వచ్చేవి? ఇన్ని అప్పులెందుకుకయ్యేవి? ఇన్నేండ్ల నుండి బిడ్డ పెండ్లి ఎందుకు వాయిదా వచ్చేది? తన కొడుకు పదో తరగతి మధ్యలోనే ఆపి ఎందుకు కూరగాయలు అమ్ముకొచ్చేవాడు? అతనిలో అంతులేని ఆలోచనలతో దిక్కుతోచక రోదించిండు బాలయ్య.

“ఊరూరుదీ ఇదే కత మనం దున్నేభూమి ధరల రెక్కలొచ్చి ఎగిరిపోతుంటే భూమి కిరికిరి మొదలైతే ఉన్నోల్లదే చెల్లువాటైతది మన భూములన్ని అమ్మి కూలీ నాలికి మళ్ళాలె. అమ్ముతాడు. మా బావ తన రెండు ఎకరాలు భూమి మార్తాండరావుకు అమ్ముతాడు. ఇంక బాట పంచాయతీ అక్కరలేదు. బాటే అక్కరలేదు” అని చెప్పుతూ బావమరిది కల్లలో నుంచి నీరు కారసాగాయి. ఇగ పెద్దమనుషులు భూమి అంతా మార్తాండరావుకు క్లియరయిందని తీర్మానించారు.

సమాజంలో పేదవాని కష్టాలు, బాధలు ఎవరు పట్టించుకోరు. అతని తరపున మాట్లాడరు. ధనవంతునివైపు ఎక్కువగా మాట్లాడతారు. ఆ పేదవాన్ని ఇంకా పేదవాన్ని చేస్తుంది సమాజం. ఉన్నవాన్ని మాత్రం పైకి లేపుతుంది. ఎందుకంటే వాడు ఇచ్చే లంచాలకు, తాగుడుకు బానిస అవుతుంటారు. కాబట్టి, ఈ కథలో మార్తాండరావు ధనవంతుడు. డబ్బులు ఏమిచేయలేక భూములను కొని ఫెన్సింగ్ వేసుకుంటాడు. ఎక్కడ భూములు దొరికితే అక్కడ కొంటుండేవాడు. ధనవంతులు ఇలా ఎక్కువ డబ్బులు పెట్టికొనడం వల్ల భూములకు ధరలు పెరిగిపోయాయి. పేదవానికి సరియైన డబ్బులు లేక, తినడానికి తిండిలేక, ఉన్న దాంతోనే సరిపెట్టుకొని జీవిస్తుండేవారు. అట్లానే బాలయ్య కూడా ఉన్నా రెండు ఎకరాల్లో కూరగాయలు పెట్టుకొని జీవిస్తుంటే తన నోటికాడ కూడు మార్తాండరావు లాగేసుకున్నాడు. ఇలా చాలామంది సమాజంలో, దేశంలో కూడా ఎందరో ఉన్నారని రచయిత ఈ కథలో తెలియజేశాడు.

## 4.5. కరువు - వలస జీవిత చిత్రణ కథలు

మానవ సమాజం మొత్తం దాదాపుగా ప్రకృతితో సంబంధంతోనే జీవించగలుగుతుంది. ప్రకృతి మనకు సహకరించకపోతే మనకు తీవ్రమైన కష్టాలు, పరిణామాలు ఏర్పడతాయి. మనకు ఆహారం కావాలంటే, పంటలు పండాలి. దానికి నీరు తప్పనిసరిగా కావాల్సిందే. అది లేకపోతే మన జీవచ్ఛవాలుగా మిగిలిపోతాం. అటువంటి పరిస్థితి సంభవించినప్పుడు దానిని కరువు అంటాం. ఆ కరువు ప్రకృతి వైపరీత్యాల కొంత అయితే, మానవ తప్పిదాల వల్ల, ప్రభుత్వాల వల్ల ఒకరకమైన కరువులు సంభవిస్తాయి. వాటి ఫలితం వలసలు వెళ్ళే ప్రమాదం ఉంటుంది. అటువంటి కరువు, వలసల గురించిన విషయాలను నల్లగొండ జిల్లా కథా సాహిత్యంలో రచయితలు స్పృశించారు. వాటిని ఈ విభాగంలో చర్చించాను.

### 1. వాన కురిసిన రాత్రి

మూడు సంవత్సరాల నుండి వర్షాలు రాకపోవడంవల్ల కరువు వచ్చి, ఒకరోజు రాత్రి వాన పడితే ఆ రైతు ఎంత సంతోషిస్తున్నాడో రచయిత 'వాన కురిసిన రాత్రి' కథలో రమేశ్ హజారిగారు వివరించారు.

శీనయ్య, ఉపేంద్రమ్మ భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు శంకరయ్య. శీనయ్య కుటుంబం వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తారు. పిండి కట్టలకు, పత్తిచేను మందులకు అవసరం వస్తుందని పెసరుచేను వేస్తే అతని అదృష్టం బాగాలేక పెసరుచేను అంత మసిపేను పడుతుంది. ఉత్తరాన మబ్బుపడితే తప్పకుండా వాన వస్తుందని అనుకుంటాడు. సాయంత్రం ఉన్నట్టు ఉండి గాలి గట్టిగా వస్తుంది. ఉపేంద్రమ్మ భర్తను కాళ్ళు కడుక్కో అన్నం తిందువు అంటుంది. ఉరుములు, మెరుపులు మెరిసి చిన్న చిన్నగా వాన రావడంతో శీనయ్యకు ఎక్కడలేని సంతోషమవుతుంది. 'పెసల్లు బందుతాయి ఎట్లలేదన్న రెండు పుట్లు కావాలె...చెరువు ముచ్చటే లేదు నిండుతది...ఇదే మోపున ఒక్కగంట నిలబడితే సాలువాన...శివయ్య గుండు మునుగుతది...కతమేనాయె...శివయ్య గుండు మునిగితే అలుగెల్లుడేనాయె సెరువు. ఆఖరికి పెద్దగుండు మునిగినా సాలు బావులల్లకు, బోర్లల్లకు మస్తు నీళ్ళు ఊరుతయి. గాసారానికి రెండెకురాలు నాటుబెడితినా...పది పుట్లొడ్లు ఎటుబోవు." అని ఆలోచనలో బడ్డాడు. ఆలోచన్లకు బోయిండు శీనయ్య. అంతటితోనే ఆగక ఆయన మనసు వేసవికాలంలో పండించే పంట శెనిగే మీదకు కూడా పోయింది. 'రాళ్ళ చెల్క టాక్టరు బెట్టి సాలు ఇరువాలు మెత్తగా దున్నించి యాసంగి శెనక్కయేత్తే...నాలుగేండ్లకింద కాసినట్లు 80 బస్తాలు ఎటుబోవు."(నల్లగొండ కథలు: 522) అని ఆయన మనసు లెక్కలు వేస్తుంది.

ఆయనకు ఆనందం ఎక్కువైనా, బాధ ఎక్కువైనా మొదట చెలకకాడి కొట్టం దగ్గరికి వెళ్తాడు. దుక్కి తడిసిందో చూడాలని తొందర పెరిగి ఒరుకు కొప్పెర (కవరు గొడుగు) మీద కప్పుకొని బయట బాగ వాన పడుతున్నా కూడా చెలక దగ్గరికి బయలుదేరుతుంటే భార్య ఈ చీకట్లో పోతున్నావు. వచ్చే వాన ఆగుద్దా కొంచెం అన్నం తిని పోరాదు. మేము ఉదయం తొందరగా లేవాలే అంటుంటే కూడా అట్లనే వెళ్ళి, చెట్లకింద తడిసిందో లేదో వాన ఆగిపోయింది. సరిగ్గ సాల్లల్లకు నీళ్ళు వచ్చి, చీకట్ల పెసరుచేను బాగా ఊగుతుంది. వరిగడ్డి ఎడ్లకు వేసిండు. ఈయనకు రెండు జతల ఎడ్లు, నాలుగు ఆవు పెయ్యలు, వాటికి పుట్టిన కోడెలేగలతోని కొట్టం కలకలలాడేది. మూడు సంవత్సరాలు వరుసగా కరువు వచ్చేసరికి వాటిని సాదలేక ఒక బక్క ఎడ్ల జతను ఉంచుకొని అన్నిటిని అమ్ముతాడు. శీనయ్య బోసిపోయి కొట్టంల నులక మంచంల కూసొని మబ్బు బాగా పట్టడంతో చూడాలే వాన దేవుడు ఏం

చేస్తాడో, ఏమాయె వానదేవుడు వస్తుండు పోతుండు అనుకుంట నులక మంచంమీద నడుంవాల్చిండు. చల్లటి గాలికి అట్లనే అతనికి నిద్రపట్టింది.

మూడు సంవత్సరాల నుండి వర్షాలు లేక కరువు రావడంతో, కొన్ని పశువులను అమ్ముకున్నాడు. రాకరాక వాన వస్తే శీనయ్య అనే రైతు ఆ ఆనందాన్ని తట్టుకోలేక భార్య అన్నం తినమన్న కూడా తినకుండా ఆ రాత్రి చేను దగ్గరికి పోయి, చేను చూసుకొని పశువులకు మేతవేసి, వర్షానికి చెరువు నిండితే పంటలు బాగా పండుతాయని పదే పదే మనస్సులో తలచుకుంటూ సంతోషపడతాడు. రైతులు వర్షాలు లేకపోతే ఎట్లా బాధపడతారో, వర్షాలు పడితే ఎంత సంతోషిస్తారో రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

**2. ఇత్తు**

వ్యవసాయం చేయడానికి వానలు లేక, నీళ్ళు లేక, పంటలు పండక, పశువులను మేపడానికి మేతలేక కరువు వచ్చి, ఉన్న పశువులను అమ్ముకొని తినే పరిస్థితిని 'ఇత్తు' కథలో చూడవచ్చు. కోట్ల వనజాతగారు వివరించారు. 'ఇత్తు' కథా సంపుటంలోనిది ఈ కథ.

అరుణ తండ్రి తన చిన్నప్పుడే మరణిస్తాడు. నాయినమ్మ బాబాయి పెంచి, పెండ్లిచేసి తన తండ్రి ఆస్తికి వారసురాలిగా చేస్తాడు. తొమ్మిది ఎకరాల భూమి ఉంటుంది. భర్త ఇల్లరికం వస్తాడు. ఇంటి జాగ ఎకరానికి ఎక్కువగానే, అందులో ఇల్లు మూడు గదులు, మిగిలిన స్థలంలో పశువుల కొట్టం, పూలచెట్లు, కూరగాయల తోట, చేతబావి కూడా ఉంటుంది.

అరుణ వాళ్ళ బాబాయి కూతుర్లు బతుకమ్మకోసం బంతిపూలు తీసుకోవడానికి ఇంటికి వస్తారు. తోట కనిపించదు. పక్కన పశువుల కొట్టం చిన్నగా ఉండడం చూసి, అక్కను తోట ఎందుకు పెట్టలేదని అడిగితే, తర్వాత అడుగుదామని మీరు ఐదు ఎకరాలు ఎందుకు అమ్ముతున్నారో అమ్మను అడిగినావా అని అన్నది. నాకు తెలువదని అంటుంది. మీరు చదువుకుంట పట్నం హాస్టల్ల బాగానే ఉన్నారుగాని, మూడు సంవత్సరాల నుంచి వానలు లేక మేము అంత ఊర్ల దివాల దీసినం (ఊరిల నష్టపోయినం), ఉన్న పశువులకు మేతలేక, నీళ్ళు లేక అవి కళ్ళముందు చస్తుంటే చూడలేక వాటిని

అమ్ముకున్నం అని చెప్పింది. ముసలి ఎడ్లు, సగం వట్టిపోయిన ఆవులు, దున్నపోతులు మొత్తం కలిపి ముప్పై పశువులు ఉన్నాయి.

ఒకసారి ఇవన్నీ ఎందుకు పెట్టుకున్నారు అక్క, నీళ్ళు, గడ్డి దండగ అంటె, "ఇంకోసారి ఆమాట అన్నవంటే దవడపండ్లు రాలగొడ్త ఇన్ని రోజులు చాకిరీచెయ్యలేదా మనకు మనుషుల్ని కూడా పనికిరాకపోతే వదిలించుకునాటట్లున్నావ్" అని తిట్టింది (ఇత్తు: 67). ఊరికి, ఇంటికి కరువు ఒక్కసారిగ రావడం వల్ల ఈ రెండు సంవత్సరాల నుంచి అవే అమ్ముకుని తింటు, ఇద్దరు పిల్లల్ని హాస్టల్ల వుంచి చదివిస్తున్నాం. పాపిష్టి జన్మలు మావి అరుణ గొంతు (జీరబోయింది) బొంగుపోయింది.

అరుణ ముసలి ఎడ్లు, వట్టిపోయిన ఆవుల్ని అమ్ముకోకుండా చూసుకునే దయామయి. ఇవన్నీ ఎందుకు నీళ్ళు గడ్డీదండగ అన్నవారిని దవడపండ్లు రాలగొడ్త ఇన్ని రోజులు చాకిరీ చేయలేదా మనకు మనుషుల్ని కూడా పనికి రాకపోతే వదిలించుకునేటట్లున్నావని'ని తిట్టిన మనస్తత్వం ఆమెది అలాంటి అరుణ ఇల్లు కరువులో కూరుకపోయి, పాడిపశువుల్ని కూడా అమ్ముకుతినే స్థితిలోకి జారిపోయింది.

ఈ కథలో కరువు రావడం వల్ల అరుణ తన పశువులను అమ్ముకొని ఆ వచ్చిన డబ్బుతో జీవనం కొనసాగిస్తుంది. అలాగే సమాజంలోని ప్రజలు కూడా కరువు రావడం వల్ల తమ పశువులను అమ్ముకొని జీవిస్తున్నారని రచయిత ఇందులో తెలియజేశాడు.

**3. చివరి గుడిసెలో గాజు కళ్ళు**

బ్రోకర్ల మాటలు నమ్మి హైదరాబాదుకు వలసవచ్చిన కుటుంబాల వేదనలను 'చివరి గుడిసెలో గాజు కళ్ళు' కథ. కోట్ల వనజాత తెలియజేశారు. 'ఇత్తు' కథా సంపుటంలోనిది ఈ కథ.

రమేష్, యాదప్ప దవఖాన (ఆసుపత్రి) గేటువైపు పోస్టుమార్టం రూంకాడ కూసున్నారు. పక్కనే తల్లిదండ్రి కూసోని ఏడుస్తున్నా వారిని ఏమైందని అడిగాడు రమేశ్. మా బిడ్డ పోస్టుమార్టం రూంల ఉందని చూపించారు. వాళ్ళని ఓదార్చి ఏమైందని అడిగిండు. మెల్లగ కథ చెప్పుకొచ్చింది. ఆయనది ఆంధ్రలో ఒక పల్లెటూరు.

ఉన్నంతల బాగానే బతుకుతున్న వాళ్ళని ఒక రాజకీయ నాయకుడు హైదరాబాదులో పని చూపిస్తాను అంటే, ఆయన మాటలు నమ్మి వందల కుటుంబాలు హైదరాబాదుకు వచ్చారు. అతడు బోకర్ (మధ్యవర్తి) అన్నమాట. మగవాల్లని సెక్యూరిటీ గార్డులుగాను, ఆడవాళ్ళను పెద్దవాళ్ళ ఇండ్లల్ల పనిమనుషులుగా పెడతాడు. ఈ చనిపోయిన అమ్మాయి యాక్టరమ్మ ఇంట్లో పని కుదిరింది. ఆ పిల్లను ఎట్లా వాడుకున్నారో, దేనికి ఎర వేసినారో ఆ దేవునికే తెలువాలి. 'దారి తప్పిన పిల్ల ముందు దారి తోచకనే చచ్చిపోయిందని' టి.వి.ల చెప్పినారట అని తండ్రి చెప్తున్నాడు.

'యాడ ఉన్నకాడ ఉండనీయకుండ హైదరాబాదుల ఎమో బంకచక్కలున్నాయని జనాన్ని ఎగదోసి తెచ్చి ఈడ బడేసే ఎవలెల్ల బతుకుతున్నడో ఎవనికి సోయుంటది.' యాదప్ప గట్టిగ అన్నాడు. ఆ తండ్రి మోసపోయినం నాయన' అని గట్టిగ ఏడుస్తున్నాడు. రమేశ్ కి కూడా ఒక్కసారిగా దుఃఖం అలా నెట్టుకొచ్చింది.

ఈ కథలో ప్రాంతాల నుండి హైద్రాబాద్‌కు వలస వచ్చిన వారి కుటుంబాలు మోసపోయి వారి జీవితాలు చిన్నాభిన్నమైన విధానాన్ని రచయిత మనముందుంచాడు.

**4. విషపు నీళ్ళు**

వర్షాలు లేక రెండు మూడు సంవత్సరాల నుండి వ్యవసాయం చేయడానికీ నీళ్ళు లేక, ఫ్లోరిన్ నీళ్ళ బాధ భరించలేక, బతుకుదెరువుకోసం ఆ ఊరి జనం వలస బాట పడితే చింతల నర్సయ్య కుటుంబం కూడా వలస వెళ్ళడం జరిగింది. ఆ కుటుంబ గాథను 'విషపునీళ్ళు' కథలో చిత్రించాడు రచయిత. మేరెడ్డి యాదగిరిరెడ్డిగారు రాసిన 'బొడ్రాయి' కథా సంపుటంలోనిది ఈ కథ.

నల్లగొండ జిల్లాలో ఓ మారుమూల గ్రామం కంకణపల్లిలో చింతల నర్సయ్య కుటుంబం అంతా ఫ్లోరిన్ బారినపడి, తండ్రి యాభై సంవత్సరాలకే బాణంలాగా వంగిపోయి రెండు కాళ్ళు చెరోదిక్కు వంకర్లు తిరిగి నడవలేక రెండుమూడు సంవత్సరాలు మంచంలో ఉండి చనిపోయాడు. తల్లి పరిస్థితి కూడా ఏం తీసిపోలేదు. ఒళ్ళంతా చులుకు, మంట, పోట్లతో ఎండుటాకులా ఎండిపోయి, రాత్రిళ్ళు నిద్రలేక భర్త మరణించిన నెలరోజులకే తానూ చనిపోతుంది. ఒక్కగానొక్క చెల్లెలు ముప్పై సంవత్సరాలకే నందుంవంగిపోయిందని భర్త వదిలేస్తే పుట్టిల్లు వెళ్ళి మూడు నెలలకే ఓ రాత్రిపూట

బావిలో పడి చనిపోయింది. దెబ్బమీద దెబ్బ ఒక్క సంవత్సరమే నర్సయ్య ఇంట్లో ముగ్గురు చనిపోవడంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

వర్షాలు లేక మూడు సంవత్సరాల కరువు. నర్సయ్యకు ఉన్న రెండు ఎకరాల భూమి పడావు పడింది. బతుకుదెరువు కోసం ఫ్లోరిన్ నీళ్ళబాధ భరించలేక ఆ ఊరిలో చాలామంది వలస బాటపట్టి హైదరాబాదుకు చేరి రిక్షా కార్మికులుగానో, షాపులలో గుమస్తాలుగానో పని సంపాదించుకున్నారు. నర్సయ్య కూడా తన ఒక్కగానొక్క బిడ్డ తేజస్విని తీసుకొని సావిత్రమ్మతో కలిసి హైదరాబాదుకు వచ్చాడు.

గడ్డి అన్నారంలో ఆ రోజుల్లో బర్లపాల వ్యాపారం బాగా జరిగేది. దిల్‌సుఖ్‌నగర్ ఎదురుగ ఉన్న ప్రాంతమంతా ఖాళీగా వుండి బర్లను పెంచుకునేవారు. చాలా కుటుంబాలవారు బర్లపాల మీదే బతికేవారు. నర్సయ్య అక్కడే ఉంటూ బర్లకు గడ్డి సరఫరా చేసేవాడు. తన ప్రాంతంలో వరికోతల సమయంలో లారీలలో గడ్డికోసి నిల్వచేసి అమ్మేవాడు. బాగానే గిట్టుబాటయ్యేది. దీనికితోడు సావిత్రమ్మ మిషను కుట్టుడు బాగా నడిచేది. కొద్దిరోజుల్లోనే ఆడవారి జాకెట్లు చిన్న పిల్లల గౌన్లు సావిత్రమ్మ కుట్టేతీరు అందరికి నచ్చింది. తీరిక లేకుండా పనిదొరికేది. తమ బిడ్డను చదివించుకుంటూ నలుగురితో మంచి వాళ్ళుగా పేరు తెచ్చుకున్నారు.

ఊర్లో ఉన్న రెండు ఎకరాల భూమి అమ్మి, దానికి తోడు తన గడ్డి వ్యాపారం మీద కూడబెట్టింది కలిపి ఓ మూడు లక్షల రూపాయలకు ఓ అందమైన అపార్ట్‌మెంట్ కొన్నాడు. అది ఇప్పుడు ముప్పై లక్షల ధర పలుకుతుంది.

నల్లగొండ జిల్లాలోని ప్రజలు, రైతులు నీళ్ళల్లో ఫ్లోరిన్ ఉండటంవల్ల ఉన్న ఊరును వదిలిపెట్టి, బతుకుదెరువుకోసం ఎంతోమంది వలసలు వెళ్ళి అక్కడే స్థిరపడిపోతున్నారని రచయిత ఈ కథలో తెలియజేశాడు.

**5. సదువు**

కరువు వచ్చి వ్యవసాయ పంటలు పండక అప్పులు ఎక్కువ అయ్యి ఊర్లో సరిపడ పని దొరకక దేశాలు పట్టుకొని వలసపోవడం వల్ల నాలుగు మెతుకులు దొరుకుతాయని వెళితే కొడుకు చదువు ఆగమవుతుందని హాస్టల్లో చేర్పించాలని నిర్ణయించుకున్న ఓ తండ్రి దీన స్థితిని రచయిత భూతం ముత్యాలు. 'సదువు' కథలో చిత్రించారు. 'దగ్దం కథా సంపుటంలోనిది ఈ కథ.

ఎంకులు, యాదమ్మ భార్యాభర్తలు. వీరి కొడుకు శివుడు. ఊర్లో సరిపడ పనులు దొరకక, భార్య కరువు పనికి పోతే వచ్చిన డబ్బులు తినడానికే సరిపోయేవి కావు. భార్య భర్తలు బతుకుదెరువు కోసం కొడుకును వెంటబెట్టుకొని దేశానికి వలస వెళ్ళి వస్తుండేవారు. వారు వెళ్ళినప్పుడల్లా కొడుకుని అక్కడ స్కూల్లో చేర్పించి, వారు మళ్ళి తిరిగి ఇంటికి వచ్చినప్పుడు ఊర్లో ఉన్న స్కూల్‌కి పంపించేవారు. అట్ల ప్రతిసారి జరుగుతుండేది. కొడుకు చదువు ఆగమవుతుందని అనుకొని తనకు ఉన్న వ్యవసాయ భూమిలో రెండు ఎకరాలు పత్తిచేను పండుతుందని ఆశపడి, ఊర్లో అందరు వారి పిల్లలను ప్రైవేటు స్కూల్‌కి పంపిస్తుంటే ఎంకులు కూడా తన కొడుకును ప్రైవేటు స్కూల్‌కు పంపిస్తాడు. కరువువచ్చి పత్తిచేను పండక, స్కూల్ ఫీజు, వ్యాను కిరాయి కట్టలేక, తెచ్చిన అప్పులు తీర్చలేక అప్పులు ఎక్కువ అవుతాయి. ఇంకా లాబం లేదని ఊర్లో ఉన్న సారుని కలిసి తన బాధను చెప్పుకుంటాడు.

ఆసారు ఎంకులుతోటి "సర్కారు ఇయ్యాల రేపట్ల పేదలకు తక్వకులపోల్లకు, సూదరోల్లకు, లంబాడి జాతికి ఆస్టల్లుబెట్టి సగిలీక సకలం పిల్లలకు అందించుకుంట సదువులు జెప్పిస్తుంది. దాన్ని మీ అసోంటి పేదలు అందుకోవాలే, అయ్యి ఉన్నది మీకొరకే" (పుట: 88) అని ఆయన నాలుగు మంచిమాటలు చెప్పేసరికి ఎంకులు తన కొడుకును హాస్టల్లో చేర్పించడానికి సిద్ధమై టి.సి. తేవడానికి తండ్రీకొడుకులు బయలుదేరి పాఠశాల ముందుకు వెళ్తారు.

దేశంలో చాలామంది నిరుపేద కుటుంబంతో జీవిస్తున్నారు. వారు బ్రతకడానికి వలస వెళ్ళడం వల్ల, వారి పిల్లల చదువులు మధ్యలోనే ఆపివేస్తున్నారని, వారి అందరి కోసం ప్రభుత్వం

హాస్టల్స్‌ను ప్రవేశపెట్టిందని వారిని అందులో చేర్పిస్తే వారి భవిష్యత్తు బాగుపడుతుందని, తల్లిదండ్రులకు కూడా కొంత భారం తగ్గుతుందని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు.

**6. అడిగెటోళ్ళు: కరువు-నీటి సమస్య**

ఊరి పక్కనే కాలువ ఉన్నాగాని ఆ ఊరికి కరువువచ్చి తాగడానికి నీళ్ళు లేకపోవడంతో, ఆ గ్రామ ప్రజలు, సర్పంచి, వార్డు మెంబర్లను గ్రామ పంచాయతీ ఆఫీసులో నిలదీస్తున్న విధానాన్ని రచయిత పి. చిన్నయ్య 'అడిగెటోళ్ళు' కథలో 'బతుకమ్మ' పత్రికలో విశ్లేషించాడు. (నమస్తే తెలంగాణ–12మే, 2013)

భువనగిరిలో ఎండకాలం కావటంవల్ల ఊర్లో నీళ్ళు లేక జనం సైకిళ్ళు, స్కూటర్లు, కార్లమీద ఎవరికి దగ్గట్టు వాళ్ళు బిందెలను, క్యానులను, డ్రమ్ములను వేసుకొని చుట్టుపక్కల వ్యవసాయ బావుల దగ్గరకు పోయి నీళ్ళు తెచ్చుకుంటారు. చాలా ఇబ్బంది పడుతుంటారు. ఆ గ్రామ ప్రజలు యం.ఆర్.ఓ. ఆఫీస్ ముందు దర్నా చేస్తారు. హైవే రూట్‌లో బస్సులు ఆపడం, ఊర్లకు వచ్చి పోయే బస్సులను నిలబెట్టడం ఇలాంటి కార్యక్రమాలు చేయడంవల్ల ఒకరోజు మండలాధికారి వచ్చి పాత చేతిపంపులను బాగు చేసినా, వాటి నుండి చుక్కనీరు కూడా రాకపోవడంతో, ఒకరోజు సర్పంచ్‌ని, వార్డు మెంబర్లను గ్రామ పంచాయతీ దగ్గర నిలబెట్టి వారిని ప్రజలు, యువకుడు మల్లేశ్ మొదలగువారు నిలదీస్తే, వారు ఎన్ని ఆలోచనలు చేసినా, లాభం లేకుండా పోయింది. ఇండ్లలోని బోర్లనుండి, ఊరిపక్కన రాంరెడ్డి బావినుండి ఊర్ల టాంక్‌కు నీళ్ళు ఎక్కిద్దామనుకుంటున్నం. ఎం.ఎల్.ఏ గూడా.." అని సర్పంచ్ ఏదో చెప్పబోతుండగా, మల్లేశ్ ఎన్ని రోజులు ఒస్తయనుకుంటున్నవు, ఆ బాయిల నీళ్ళు నెలరోజులు వస్తే మా ఎక్కువ, ఆ తర్వాత ఎట్ల అని అనగానే, ప్రజలు కూడా వారిని తలాకొక మాట అంటారు.

వాగులున్న ఇసుకను జాగ్రత్తగా కాపాడుకోవాలని, అవసరానికి ఊరోళ్ళు వాడుకోండని, అడ్డగోలుగా పట్నానికి పోనియొద్దని, ఇసుక లేకుంటే మనకు కరువొస్తదని చెప్పి, మీరే ఇసుక కాంట్రాక్టు ఇస్తే వారు ఇష్టమొచ్చినట్టు తొవ్వుకపోయిరి. పిడికెడు ఇసుక లేదాయె, ఇసుక లేకపోవడం వల్లె నీళ్ళు లేక కరువు వచ్చిందని, ఆరేడు వాగు పొంట ఉన్న ఊర్లల్ల కరువు రాలేదు. ఆ ఊర్లల్ల ప్రజలు ఇసుకను తొవ్వనీయలేదని, మనూర్లనే ఇట్ల జరిగిందని మల్లేశ్ అనడంతో ఆడ ఉన్నవాళ్లు అంత ఆలోచనలో పడతారు.

"ఇసుకతో వచ్చిన డబ్బులతో ఊరును మస్తు అభివృద్ధి చెయ్యొచ్చంటిరి. ఊర్ల అందరికీ పని దొరుకుందని ప్రచారం చేస్తిరి. ఇప్పుడు ఏమయింది? అభివృద్ధి ఎవరికి జరిగింది? సైకిలున్న వార్డు మెంబరుగాడు సైకిల్ మోటారు కొనె, బైకున్నోడు కారు గొనె, వాస్తు బాగాలేదని ఇండ్లను కూలగొట్టి మెరిసేటట్లు కట్టుకొంటిరి. వీళ్ళకు మించినోళ్ళు వీళ్ళ మీదున్న ఎం.ఎల్.ఏ, ఎం.పి గాళ్ళు తమకు లాభం ఉందనుకుంటే ఏదైనా చేస్తారు." (పుట: 26–బతుకమ్మ– 12 మే, 2013) అని ఒక విద్యార్థి అనగానే, ప్రజలు మరి వీళ్ళ సంగతి ఏం చేద్దామని అంటారు. చేసేది ఏముంది. "వీళ్ళు ఏం చేస్తారో, ఎట్ల చేస్తారో పోయి ఎం.ఎల్.ఏ, ఎం.పిగాని కాళ్ళు పట్టుకుంటారో ఊరు చుట్టుపక్కల ఏడ నీళ్ళు పడితే ఆడ బోరు ఏయించి ఊర్లకు నీరు తీసుకురావాల్సిందే." నని ఒకతను పుణ్యానికొచ్చింది గదాయని మింగి కూర్చున్నరు. దేని, దేనికి ఖర్చు పెట్టారో లెక్కలు తేలేదాకా ఈళ్ళను ఎవర్ని వదలొద్దని మరొకతను ఆవేశంతో అంటారు. ఎండకాలపు ఎండల్లాగే కుతకుత ఉడుకుతున్నా కూడా, ప్రజలంతా ఒకవైపు గిరిగీసినట్టుగా ఉంటారు. ఇలాంటి మల్లేశ్, విద్యార్థులు 'అడిగెటోళ్ళు' ఉన్నారని రచయిత ఈ కథను ముగించాడు.

సమాజంలో ఎక్కడ చూసినాగాని, సర్పంచి, వాడు మెంబర్లు కుమ్మక్కై, ప్రజలను మోసం చేస్తుంటారు. ఏమైన గ్రామానికి ఫండ్స్ వస్తే సగం ఎం.ఎల్.ఏ, ఎం.పిలకు, మిగతా సగం సర్పంచి, వార్డు మెంబర్లకు, తర నాయకులకు. ఊరును బాగుచేసే నాయకులే లేరు. అలాగే ఈ కథలో కూడా సర్పంచ్, వార్డు మెంబర్లు వాగుల ఉన్న ఇసుకను కాంట్రాక్టర్లకు ఇచ్చి ఆ వచ్చిన డబ్బులను ఎం.ఎల్.ఏ, ఎం.పి, సర్పంచి, వార్డు మెంబర్లు వారివారి అవసరాలను తీర్చుకుంటారు. ప్రజలతోటి ఊరును బాగు చేస్తామంటారు గాని, చెయ్యరు. వాగుల ఇసుక తోడడం వల్ల నీళ్ళు అన్ని ఇంకిపోయి కరువువచ్చి ఆ ఊరి ప్రజలకు తాగడానికి కూడా నీళ్ళు లేక ఇబ్బంది పడతారు. మల్లేశ్, కొందరు విద్యార్థులు, ప్రజలు వారిని నిలదీస్తారు. ఇలా ప్రతి గ్రామంలో యువకులు ముందు నడుస్తేనే, గ్రామాలు బాగుపడి అభివృద్ధి చెందుతాయని, రచయిత ఈ కథ ద్వారా సమాజానికి తెలియజేశాడు.

వాన కురిసిన రాత్రి, ఇత్తు, చివరి గుడిసెలో గాజు కళ్ళు, విషపు నీళ్ళు, సదువు, అడిగెటోళ్ళు కథలల్లో రైతులు వాన రాకకోసం ఎదురు చూసి చూసి, వాన పడగానే సంతోషిస్తారు. వానలు సరైన సమయంలో పడకపోతే పెట్టుబడులు తట్టుకోలేక ఇబ్బందులు పడతాడు. విత్తనాలు నాణ్యమైనవి రాకపోవడం వల్ల పంటలు పండక నష్టపోతారు. ఇలాంటి కరువులు రావడంవల్ల వలసలు వెళ్ళి

అక్కడ కూడా బ్రోకర్‌ల వల్ల మోసపోయిన సందర్భాలు కూడా ఈ కథలలో కనిపిస్తాయి. ఇటువంటి విషయాలను ఈ విభాగంలో చర్చించాను.

### 4.6. కుల వృత్తులు:

"గ్రామాల్లో పనివాళ్ళు మూడు రకాలుగా ఉండేవారు. వ్యవసాయ సంబంధ పనులు చేసేవాళ్ళు. పనిముట్లు తయారు చేసే వడ్ల, కమ్మరి, మాదిగ మొదలైన వాళ్ళు ఒకరకం. రెండు: మనుష్యులకు సంబంధించిన పనులు చేసేవాళ్ళు. అవసరాలు సమకూర్చే పద్మశాలి, కుమ్మరి, చాకలి, మంగలి, గొల్ల, తెనుగు, మాల మొదలైన వాళ్ళు రెండోరకం. మూడు: సుఖ సంతోషాలకు సంబంధించిన పనులు చేసేవాళ్ళు. సౌకర్యాలు సగపెట్టే గౌండ్ల, కటిక, బోగం మొదలైన వృత్తులు మూడోరకం." (సిధారెడ్డి, నందిని. 2008: 4). ఈ అన్ని రకాల పనివాళ్ళకు ప్రధాన వనరు వ్యవసాయమే. భూమిని, నీటిని ఆధారంగా అన్ని రకాల వృత్తులవాళ్ళు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ది పొందుతారు. ఆధునిక, అత్యాధునిక యుగం అని చెప్పపడుతున్న నేటి కాలంలో ఆ వృత్తులు చాలావరకు కనుమరుగయ్యాయి. మరికొన్ని కనుమరుగవుతున్నాయి. ఆయా వృత్తుల బాధలు, కష్టాలు మొదలైన వాటి గురించి నల్లగొండ కథా సాహిత్యంలో రచయితలు స్పృశించారు. కుల వృత్తుల విభాగంలో ఆ కథల గురించి విశ్లేషించాను.

#### 1. యక్షగానం

ప్రపంచీకరణ పుణ్యమా అని దాసరోళ్ళ కళలు ఎలా అంతరించి పోతున్నాయో, వారి జీవితాలు ఎలా దిగజారిపోయాయో, కులవృత్తులు ఎలా ధ్వంసమయ్యాయో 'యక్షగానం' కథలో రచయిత దేవులపల్లి కృష్ణమూర్తిగారు చిత్రీకరించారు.

రావులపెంట దాసరోల్లు (దాసరి రామచంద్రం, ఇద్దరు పెండ్లాలు, కొడుకులు, తమ్ముల్లు మొదలైనవారు) ఊరు, ఊరు తిరుగుకుంటూ, బాగోతులు ఆడుకుంటూ పోతుండేవారు. ఆవూరి దొరలు, పటేండ్లు దయతలిచి నాలుగు నాటకాలు ఆడిస్తే ఆడేది, లేకుంటే సాపలు అల్లుకుంటూ, అమ్ముకుంటూ, అడుక్కుంటూ జీవనం వెల్లదీస్తుండేవారు. రాను రాను జనాలకు సినిమాల సోకు

ఎక్కువయి, నాటకాలు ఎవరూ చూడకుంటయ్యారు. పాత పరిచయాలున్న వూర్లకు పోయి నాటకాలు వేస్తం దొరా అంటే ఈ రోజుల్లో మీ నాటకాలు ఎవరు చూస్తాదురా అంటూ ముఖంమీద కొట్టినట్లె అనడంతో, వాటిని తెరిచి చూడక చాలారోజులై (చాన్నాల్లయి), ఆ కళాకారులందరూ బతుకుదెరువుకు ఊరికి ఒకరై వ్యవసాయ కూలీలుగా, బిచ్చగాల్లుగా మారిపోయారు. చూస్తుండగానే ఆ కళా కనుమరుగైంది. నాగార్జున సాగర్ కాల్వలో వదిలినంక, కూలిపనులు దొరుకుతున్నాయని కాల్వ పక్కన ఉన్న ముకుందాపురం చేరారు. పెద్దకాల్వ తీసినప్పుడు మట్టికని తీసుకున్న జాగలో బొందలు ఉంటే వాటిని పూడ్చి గుడిసెలు వేసుకున్నారు. ఆ వూరు వారికి అన్ని విధాలా అనుకూలంగా ఉండడం, సంవత్సరం పొడుగునా ఏదో ఒకపని దొరకడం, అన్నిటికంటే ముఖ్యంగా చుట్టుపక్కల ఊర్లల్ల తాగినంత కల్లు దొరకడం లేవంగనే చిన్నపిల్లలు, ఆడవాళ్ళు వూరిలోకెళ్ళి చద్దిబువ్వ(చలి అన్నం) అడుక్కోవడం, తర్వాత ఈత ఆకులతో సాపలు అల్లుకుంటూ ఆడవాళ్ళు ఉంటే మొగవాళ్ళు గాలాలు తీసుకొని చెరువులకు వెళ్ళి చేపలు పట్టుకొచ్చి అమ్ముకుంటూ జీవిస్తున్నారు. (కృష్ణమూర్తి, దేవులపల్లి. 'యక్షగానం': 10).

ఆధునిక యుగంలో టీవీలు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు వచ్చి పిల్లలు, పెద్దలు వాటికి అంకితమైపోవడంతో, దాసరోల్లు వేసే నాటకాలు చూడకుండాపోవడంతో, వారి బతుకులు ఆగమై, వారి కళలు, కులవృత్తులు అంతరించి పోతున్నాయని రచయిత ఈ కథలో తెలియజేశాడు.

**2. అంతులేని పయనం:**

స్మశానానికి వాచ్‌మెన్‌గా సీతమ్మ ఉంటుంది. ప్రభుత్వం ఆ స్మశానాన్ని విదేశీ కంపెనీకి కాంట్రాక్టుకు ఇవ్వడంవల్ల, మున్సిపాలిటీ ఉద్యోగులు వచ్చి ఆమెను ఎట్లా ఎల్లిపొమ్మంటారో మల్లి ఏంపని చేస్తుందో 'అంతులేని పయనం' కథలో వివరించాడు రచయిత. శిరంశెట్టి కాంతారావు రాసిన 'ఊతకర్రలు' కథా సంపుటిలోనిది ఈ కథ.

సూర్యాపేట సజ్జల చెరువు కట్టకు తీసుకొని స్మశాన వాటికా ఉంటుంది. సీతమ్మ స్మశానానికి కాపల కాస్తూ ఉంటుంది. ఒకరోజు మున్సిపల్ ఉద్యోగులు వచ్చి ఆమెను వెల్లమంటారు. నలభై సంవత్సరాల నుండి ఈ బొందలగడ్డను నమ్ముకొని మా కుటుంబం బతుకుతుంది. ఈరోజు తినే

అన్నంలో మన్ను బోస్తమంటున్నారు. ఇదేమన్న న్యాయంగా ఉన్నదా అని బాధతో అంటుంది. గదంతా మాకు తెలువదమ్మ మా పైన ఉన్నవాళ్ళు చెప్పినట్లు చేస్తున్నం. యాడాదినుండి నీకు చెబుతున్నాం. మా మాట నువ్వే చెవిన బెట్టలేదు. "మీ మాట ఏం ఇనలేదు సారూ! ఆనాడు మా అమ్మ నాయినలకు నెలకింత జీతమిచ్చుకుంట వచ్చిన పంచాయతీ నాకాడికొచ్చే సరికి జీతంలేదు గీతంలేదు. దహనాలకొచ్చే వాళ్ళనే పదోపరకో అడుక్కొని బతకమంటే గట్లనే లెమ్మని బతుకుతున్న గదు. ఇయ్యాల అదిగూడా లేకుంట ఎవలకో గీబొందలగడ్డ కాంట్రాక్టుకిచ్చినం ఎల్లిపొమ్మంటే యాడికి బోవాల? గంత పెద్ద సర్కారోనికి నా నోటిముందటి కూడు తియ్యకుంటే ఎల్లదా? జర మీరన్నా జెప్పుండ్రి బాంచన్." (కాంతారావు, శిరంశెట్టి. అంతులేని పయనం: 60) అని రెండు చేతులు జోడించి ఆ మున్సిపల్ ఉద్యోగులను ప్రాధేయపడింది.

నీకు తెల్వదమ్మా! ఇప్పుడు సర్కార్ పద్ధతులన్నీ మారిపోయినాయి. అన్ని మున్సిపాలిటీలల్ల కరెంటు కష్టాలు ఏర్పాటు చెయ్యాలని ఒకపెద్ద కార్యక్రయం తీసుకుంది. ఆ కాంట్రాక్ట్‌ను గూడా ఓ పెద్ద విదేశీ కంపెనీకిచ్చింది. అందులో భాగంగానే నిన్ను తీసేస్తుండు. అంటూ అసలు విషయాన్ని సీతమ్మకు వివరించే ప్రయత్నం చెయ్యసాగారు. అదే సమయానికి విద్యుదహన వాటికలను తీసుకొచ్చిన రెండు లారీలను చూసిన సీతమ్మ ఒక్కసారిగా బాధతో కుప్పకూలిపోయింది.

సీతమ్మ మళ్ళీ వేరే పని చూసుకుంది. హాస్పటల్‌లో ఊడ్చడం, లేబర్ వార్డులు కడగడం ఇలా బతుకుబండిని నడిపిస్తుంది.

ప్రభుత్వం విదేశీ కంపెనీకి స్మశాన వాటికను కాంట్రాక్ట్‌కు ఇవ్వడంవల్ల సీతమ్మ తన వృత్తిని కోల్పోవడం, మళ్ళి వేరే పనిని వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చిందని, ఇలా ప్రభుత్వం విదేశీ కంపెనీలకు కాంట్రాక్టులకు ఇవ్వడంవల్ల ఎంతోమంది ఉపాధి కోల్పోయి, వేరే ఉపాధికోసం వెతుక్కుంటున్నారని రచయిత ఈ కథలో తెలియజేశాడు.

**3. తోలు బొమ్మలు:**

ప్రపంచీకరణ, ఆధునిక జీవన విధానం కారణంగా వృత్తి కళాకారుల దైన్యస్థితి ఎలా ఉందో 'తోలుబొమ్మలు' కథలో విశ్లేషించారు రచయిత. మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'బొడ్రాయి' కథా సంపుటిలోనిది ఈ కథ.

రంగప్ప, ముత్తమ్మ భార్యాభర్తలు. కొడుకు మల్లన, కోడలు శాంతమ్మ, మనుమడు రాములు. గ్రామం 'కొయ్యలగూడెం'. తండ్రుల తాతల నుంచి తోలు బొమ్మలాటలు ఆడించడం, బాగోతాలు ఆడటం, వాళ్ళ కులవృత్తిగా మారింది. బుడిగ జంగాల కుటుంబాలు ఆటల మీదనే ఆధారపడి జీవించేవారు. రంగప్ప తమ్ముడు, వాళ్ళ భార్యలు, వాళ్ళ పిల్లలు అందరు కలిసి మగవాళ్ళు వేషాలు కడితే, ఆడవాళ్ళు తాలాలు, మద్దెలు హార్మోనియం వాయించేవాళ్ళు. ఏ వూరిలోనైనా గుడిసెలు వేసుకొని ఒకనెల రెండు నెలలు తోలుబొమ్మలాటలు–బాగోతులు, ఏ ఆట ఆడమంటే ఆ ఆట ఆడేవారు. రంగప్ప కాలికి గజ్జకట్టి కాలికింద పీటచెక్క వేసుకొని, బొమ్మను తెరమీద ఎక్కించి, బొమ్మ హావభావాలకనుగుణంగా మాటలు, పాటలు పాడేవారు. ముఖ్యంగా కేతిగాడు, బంగారక్కలు హాస్యంతో జనం పగలబడి నవ్వేవారు. చుట్టుపక్కల ఊర్లల్ల జనం బండ్లు కట్టుకొని ముకుందాపురం, చిట్యాల తదితర ప్రాంతాలకు కాలినడకతో చీకటి పడేవరకు పిల్లపాపలతో వచ్చి చాపలు పరుచుకొని చూసేవారు. ఒకరోజు బొమ్మలాట, ఇంకోరోజు బాగోతాలు ఆడటం, రంగప్ప దుర్యోధనుడు, భీముడు, కంసుడు నాయకుని వేషాలతో జనాలను రంజింపజేసేవాడు. మద్దెల, తాళాలు, వంతల పాటలతో స్టేజి దద్దరిల్లిపోయేది. అదే సమయంలో సిందు బాగోతులు, గొల్ల బాగోతులు వీళ్ళతో పోటీలుపడి ఆటలు ఆడేవారు. వారికి ఒక సంవత్సరానికి సరిపడా తిండిగింజలు దొరికేవి. మళ్ళీ పండుగలకు, పెండ్లీలకు, వరికోతలు, కల్లాల సమయాల్లో వచ్చి ఆటలు ఆడిపోయేవారు.

హాయిగా సాగుతున్న వాళ్ళ బతుకులను ప్రపంచీకరణ, పట్టణీకరణ అతలాకుతలం చేసింది. కొత్తకొత్త వస్తువులు మార్కెట్లోకి వచ్చి కులవృత్తులు కూలిపోయాయి. ఇంటికో టి.వి., సెల్‌ఫోన్లు వచ్చాక జానపద కళలకు ఆదరణ కరువు అయి బొమ్మలాటలు, బాగోతులు, హరి కథలు, బుర్ర కథలు ఆదరించేవారు, చూసేవారు కరువయ్యారు. ఆటలమీద బతికే బుడగ జంగాల కుటుంబాల వారంతా బజారున పడ్డారు. కొంతకాలం కప్పల బేరం, ఇంకొన్నాళ్ళు పాత ఇనుప సామాన్లు కొని

అమ్మటం, ప్లాస్టిక్ వస్తువుల బేరం, హర్ ఏక్ మాల్ బేరం, ఏది దొరక్కపోతే కూలికిపోయి పొట్ట పోసుకోవడం మొదలుపెట్టారు. రంగప్ప భార్య, కొడుకు, కోడలు బావులు తవ్వడానికి కూలి కుదిరారు. రంగప్ప పంచాంగం పట్టుకొని ఊరూర తిరిగి పాటలు, పద్యాలు పాడి, పంచాంగం చూసి, మంచిచెడు చెప్పి వాళ్లిచ్చే పది పరకతో ఇల్లు చేరేవాడు.

ప్రపంచీకరణ, పట్టణీకరణ వల్ల టీ.వీ.లు, సెల్‌ఫోన్లు వచ్చి బుడగ జంగాలవారి కులవృత్తులు దెబ్బతిన్నాయని రచయిత ఈ కథలో చూపించారు. ప్రపంచీకరణవల్ల సర్వ వృత్తులు సర్వనాశనం అయ్యాయి. దీనివల్ల చాలామంది ఉపాధి కోల్పోయారు. అదే విధంగా కొత్త ఉపాధి అవకాశాలు కూడా వచ్చాయి. కాని వృత్తులనే నమ్ముకొని జీవించేవాళ్ళు మాత్రం వేరే పనిలోకి మారలేక, కొత్త పనులు చేయాలంటే వారికి చదువులేకపోవడం వల్ల చిన్నచిన్న కూలీలుగా మారాల్సి వచ్చింది.

**4. మట్టి మనిషి:**

కుండలను తయారు చేసే కుమ్మరి రాజయ్య మరణిస్తే, అతడు తయారు చేసిన చిప్ప బాధపడి చివరికి చితిలో దునికి పగిలిపోతుంది. రచయిత యెన్నం ఉపేందర్ రాసిన 'మట్టి మనిషి' కథలో చిప్పటోటి మాట్లాడిన విధానాన్ని చిత్రీకరించాడు.

కుమ్మరి రాజయ్య కుండలు తయారుచేసేవాడు. రాత్రి వామి, సారెని (కుండలు కాల్చే ప్రదేశం, తయారు చేసే చక్రం) మాటిమాటికి వాటిని చూసి ఏడ్చి, నిద్రలోనే మరణిస్తాడు. శవయాత్ర ప్రారంభమైంది. అతడు అపురూపంగా చేసుకున్న చిప్పలో నిప్పులు పోసి, ఉట్టితాళ్ళతో పట్టుకొని కొడుకు పాడెముందు నడవడం, దప్పు చప్పుళ్ళతో గంగిరెద్దుల ఆటలతో నడుస్తున్నారు. చెరువులోని నల్లమట్టి తెచ్చి నాకు ప్రాణం పోశాడని చిప్ప దుఃఖానికి లోనున్న అగ్ని ఆరిపోతే అపశకునమని కన్నీళ్ళని బలవంతంగా ఆపుకొని, చుట్టు చూసింది. జనం రాజయ్య పార్థివదేహాన్ని గోడలు ఎక్కి చూస్తున్నారు. ఇంటి 'గూనపెంక తయారు చేస్తే ఇప్పటికి చెక్కు చదరలేదని ఓ తల్లి జ్ఞాపకం చేసుకుంది. ఎండాకాలం చన్నీళ్ళ కుండల కోసం వస్తే వారికి నచ్చినట్లు చేసేవాడని చిప్ప గుర్తు చేసుకుంటుంది. గంగిరెద్దులు ఆడించేవారితో రాజయ్య చేసిన కుండ నీళ్ళే తాగమంటు ఓ తల్లి

చెంబులో ఇస్తే, మరణవార్త విన్న చన్నీళ్ళ కుండా తన కన్నీళ్ళని చెంబు ద్వారా అందరికి పంచసాగింది. పెళ్ళివాళ్ళు అవిరేణి కుండలు, వజ్ర పరుపులు తీసుకెళ్ళేవారని, తలంబ్రాలు పెళ్ళి కొడుకు చేతిలో పోసి గరిగ బుడ్డి చేతిలో పెట్టినప్పుడు ఎంత మురిసిపోయింది. నా చిట్టి చిన్నమ్మ గరిగ బుడ్డి అని నిప్పుల చిప్ప తెప్పరిల్లి తేరుకుంది. నలుగురు మిత్రులు పాడె మోస్తుంటే దగ్గరి బందువు బొంగులు, చిల్లర పైసలు, బంతిపూలు చల్లుతున్నాడు. గౌండ్ల యాదయ్యకి ఎదురైతే కల్లు కావడి నేలపై పెట్టి, 'అయ్యో రాజయ్య పోయాడా' అంటూ కన్నీళ్ళు పెట్టుకుంటుంటే విన్న కల్లు పటువలు 'ఇది నిజమా' అని నిప్పులవైపు చూస్తే, అవును అన్నట్లు చిప్ప తలాడించింది. విన్న కల్లు పటువలు అతని మరణాన్ని తట్టుకోలేక, శోకం నురుగులు కక్కుతుండగా భళ్ళున పగిలిపోయాయి. పాడె మోసేవాళ్ళ అరికాళ్ళు తడుస్తాయి. పెద్దమ్మలు పగిలిపోయారని బాధ ఎక్కువైంది చిప్పకి.

ఇప్పుడు రాజయ్య అవసరం తగ్గిపోయింది. కూర కంచుడిలో కూర ఎంత మంచిగా ఉండేది. ఆయన పోయాడు. కూర కంచుడు పోయింది. పిల్లలు రాతెండి గిన్నెలకి అలవాటైనారని ఓ ఇల్లాలు. కుండలో కలిని పోసి అన్నం వండితే బాగుండేది. మాలెస్రబుడ్డి కూర కంచుడిపై పెట్టి వండితే రుచిగా ఉండేది. కాలం మారిపోయింది. ఇప్పటి తరానికి ఈ సంగతులే తెలియవు. జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయింది తల్లి. నాతో చేసిన మూతలు, ముంతలు, బుడ్లు అందరికి ఓ విషాద దినం అని ఓ తరం అంతమైంది. ఆయన లాంటి వాళ్ళు ఇక రారు. ఇంకో రెండు తరాలకు జనం అతన్ని మరిచిపోతారు. "ఇదిగో కుమ్మరి సారె. దీనిపైనే మట్టితో కుండలు చేసేవాళ్ళట అని పిల్లలకు మ్యూజియం సందర్శనలో టీచర్లు చెబుతారు" భవిష్యత్తు నా కండ్లకు స్పష్టంగా కనబడుతుంది. కాలం మారిపోయె కదా అని చిప్ప అనుకుంటుంది. దింపుడు కల్లం తర్వాత చితిలో పెట్టారు. రాజయ్య చేసిన కుండనే కొడుకు తలగోరుకుండ ఎత్తేయగానే అది పగిలి పెంకులు పెంకులుగా మారిపోయింది. కుండ దేహం, నిప్పుల చిప్ప. జనం గొల్లుమన్నారు. చిప్ప పెటిల్లుమని పగిలితే కపాలం పగిలిందని బందువులు చెరువులో స్నానం చేయడానికి వెళ్ళారు. చితి భగభగ మండింది. మట్టిని తవ్వినచోటే కుండెడు బూడిదగా మట్టిలో కలిసిపోయాడు. జనం వెనుదిరిగారు. పెంకుటింటి దుగిట్లో దీపం వెలిగింది.

ఆధునిక మానవ జీవనంలో మట్టి పాత్రలకు స్థానం లేకుండాపోవడం క్రమక్రమంగా కుమ్మరి వాళ్ళ కులవృత్తి అంతరించిపోయిందని ఈ 'మట్టిమనిషి' కథ ద్వారా తెలుస్తుంది.

**5. కిర్రు చెప్పులు**

ఆధునిక కాలంలో కుల వృత్తులు ఎట్లా అంతరించి పోయాయో 'కిర్రు చెప్పులు' కథలో రచయిత వెన్నం ఉపేందర్ చిత్రీకరించాడు. వీరు రచించిన కొన్ని వెలుగు నీడలు కథా సంపుటంలోనిది ఈ కథ

బక్కులు చెప్పులు కుట్టి జీవనం కొనసాగించే వాడు. రెండు మూడు సంవత్సరాలకి ఒకసారి కిర్రు చెప్పులు సొంతంగా తయారుచేసి తీసుకొచ్చి నాయనకు ఇస్తే, అవి బజార్లో నడుస్తుంటే 'కిర్రు కిర్రు' మంటు శబ్దం వచ్చేవి. చిన్నప్పుడు బక్కుల్ని చెప్పులు ఎలా తయారు చేస్తావు అంటే తనతో వస్తే చూపిస్తాను అంటాడు. ఇద్దరు కలిసి గూడానికి వెళ్ళారు. బక్కులు ఇల్లు పూరి గుడిసె ఇంట్లోకి వంగి వెళ్ళాలి. తాను ఎలా చర్మాన్ని తంగేడు చెక్కతో శుభ్రం చేస్తాడో గూటం, ఆరె లాంటి పనిముట్లు ఎలా వాడుతాడో చూపిస్తాడు.

మాకు పంటలు పండితే బక్కులు కొంత ధాన్యం తెగోన్నిబాబు అంటూ తీసుకెళ్ళేవాడు. ఈ ఇల్లు నాది అంటూ మిగతావారితో కొట్లాడేవాడు. పండుగలప్పుడు మా అమ్మ అన్నం, తినుబండారాలు పెడితే తెచ్చుకునేవాడు. బాబు అన్న పెళ్ళికి డప్పు నాదే అంటూ మురిసిపోయేవాడు. నేను డప్పు కొట్టాను అంటే పక్క ఊర్లోకి వినిపిస్తది అంటూ సంతోషపడేవాడు. నాయన చనిపోయినప్పుడు బక్కులు పాడె ముందుండి చావు డప్పు కొట్టాడు. నాయనగారు ఇకరారు కదా! నా కిర్రు చెప్పులు ఇంక ఎవరు వేసుకుంటారు అంటూ బోరున ఏడ్చాడు. మండుతున్న చితిలో నాయన వేసుకున్న కిర్రు చెప్పులు వేయబోతే చెప్పులను తీసుకొని కండ్లకు అద్దుకొని నేను ఈ ఘోరం చూడలేను అంటూ గూడెం వైపు పరుగెత్తాడు.

బక్కులు ఇరవై సంవత్సరాల తర్వాత కలిసి నమస్కారం బాబు దండం పెడతాడు. ఏం చేస్తున్నావు అని అడిగితే 'కూలి నాలి చేసుకుంటూ పొట్ట నింపుకుంటున్నా' అంటాడు. అతని చేతిలో కొంత డబ్బు ఉంచాను. అనుకోని ఆ సంఘటనకి అతని కళ్ళల్లో తడి, వస్తాను అంటూ బయలుదేరాను. ఇన్ని సంవత్సరాలు అయినా ఏ మాత్రం మార్పు కనిపించలేదు. అతని జీవనం అలాగే ఉందనిపిస్తుంది.

బక్కులు జీవితం బాగుపడాలంటే ఏ పోరాటం చేయాలి? ఎవరితో చేయాలి. ఈ ఆర్థిక వనరులు ఇప్పుడు ఎవరి చేతుల్లో ఉన్నై? ఎన్నికలొస్తున్నాయి. నాయకులు ఎంపిక కాబడుతున్నారు. కొన్ని ప్రశ్నలకి ఎప్పటికీ జవాబు దొరకదేమో అంటారు రచయిత.

ప్రపంచీకరణ ప్రభావం వల్ల జనం రెడిమేడ్ చెప్పులకు అలవాటు పడ్డారు. తోలు చెప్పుల వాడకం తగ్గడం వల్ల కులవృత్తులు నాశనమైపోయి, వారు కాయ కష్టం చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. ఈ కథ ద్వారా కులవృత్తులు అంతమవుతున్నాయని రచయిత తెలియజేశాడు.

**6. చివరికి**

ప్రధానోపాధ్యాయుడు పదవి విరమణ సమయంలో ఎదుర్కొన్న సమస్యను తెలియజేసే కథ 'చివరికి'. రచయిత పెరుమాళ్ళ ఆనంద్.

ప్రకాశరావు స్కూల్‌లో నిరాఘటమైన ప్రధానోపాధ్యాయుడు. ఉపన్యాసంలో ప్రావీణ్యం కలవాడు. అనర్గళంగా ఉపన్యసించగలడు. సెప్టెంబర్ 5నాడు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రిచేత అందుకున్నాడు. పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు భోదించకుండా, వారితో గడపకుండా ఎప్పుడూ సదస్సులకు, క్యాంపులకు, సమావేశాలకు వెళ్ళేవాడు. పైరవీలు చేస్తూ, పై అధికారులకు విందులు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేసేవాడు. మళ్ళీ రెండోసారి కూడా ఉత్తమ సేవలకు గుర్తింపుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు డిల్లీకి వెళ్ళి రాష్ట్రపతి చేతులమీదుగా తీసుకున్నాడు. దీనికోసం రాజకీయ పైరవీలు, ఎన్నెన్నో విందులు ఏర్పాటు చేశాడు. ప్రకాశరావు పదవీ విరమణ దగ్గర పడింది. విద్యార్థులంతా సమావేశమై ప్రధానోపాధ్యాయులు

ప్రకాశరావుకు ఎలాంటి సన్మానం చేయకూడదని తీర్మానించుకున్నారు. కార్యక్రమానికి డి.ఇ.ఓ. మొదలు విద్యాశాఖమంత్రి వరకు అందర్ని ఆహ్వానించాడు. తన యూనియన్ రాష్ట్ర నాయకులను కూడా ఆహ్వానించాడు. మండల, జిల్లా స్థాయి నాయకులందరూ కదిలారు. అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. వేదిక అందంగా అలంకరించబడింది. "విద్యార్థులు మాత్రం అందరు మూకుమ్మడిగా సెలవులు పెట్టి నిరసన గళం విప్పారు. ఏనాడు పాఠశాలలో రోజుమొత్తం గడపని ఆయనకు ఎలా గౌరవించాలనుకుంటారు. ప్రతిరోజు డి.ఇ.ఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, అన్ని పైరవీలు చేస్తూ విద్యార్థులపట్ల నిర్లక్ష్యం వహించి, పాఠశాలను మరిచిపోయిన వ్యక్తిని మేమెందుకు గౌరవించాలని తీవ్ర నిర్ణయం తీసుకున్నారు. వచ్చిన అతిథులంతా ఇది గమనించి నిశ్శబ్దంగా వెళ్ళిపోయారు." (చివరికి కథ: 243)

ప్రకాశరావు ప్రధానోపాధ్యాయుని ఛాంబర్‌లో ఒంటరిగా కూర్చుని జీవితంలో ఏం కోల్పోయానో అని ఆలోచిస్తుండగా సూర్యుడు అస్తమించగా మసక మసక చీకట్లు కమ్ముకున్నాయి.

ప్రకాశరావు ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేయకపోవడం, విధులను సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల కార్యక్రమానికి వచ్చిన అథిదుల ముందు విద్యార్థులచేత పరువు పోగొట్టుకున్నాడు. ఇలా ఎంతోమంది ఉపాధ్యాయులు ఉన్నారు. వారు ఇతర కార్యక్రమాలకు వెళ్ళడంవల్ల విద్యార్థులు ఎంతో నష్టపోతున్నారని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

**7. రాజన్న**

కోట్ల వనజాత రచించిన 'ఇత్తు' కథా సంపుటంలోని కథ 'రాజన్న'. వానకాలం చెరువు నిండక పంటలకు కరువు దెబ్బ తగిలి, యాసంగి వ్యవసాయం చేయడానికి నీళ్ళులేక మూలకుపడి, పశువులకు మేతలేక, కులవృత్తి సాటిలేదని, సాగర్ కాల్వపక్కన జీవాలను మేపడానికి తీసుకెళ్ళి మళ్ళీ ఇంటికి తిరిగిరాని రామలింగం 'రాజన్న' కథ.

మూడు కోసుల దూరమున్న కృష్ణానది ప్రాంతానికి రామలింగం, అతని తమ్ముడు రమేశ్ కలిసి జీవాల మందను మేపడానికి తోలుకపోయారు. ఉగాది ఎల్లినంక పోతే రమేశ్ ఎండలకు

తట్టుకోలేక తిరిగివచ్చిండు. సాగర్ ఎడమ కాల్వకింద రైతులు రెండు పంటలు పండిస్తారు. రైతులు పొలాలల్ల మందను ఆపుకొని గొల్లవాళ్ళకు బియ్యం పెడితే, అవి వండుకొని తినుకుంట రామలింగం జీవాలను కాసేవాడు. రోహిణి కార్తె ఎల్లంగనే తిరిగి ఊరికి వద్దామనుకుంటే, మెరుగు కార్తె, ఆరుద్ర పోయి, పునాసొచ్చిన పుటుక్కుమని చినుకు పడలేదు. వానలు పై రాష్ట్రాలల్ల పడ్డయంట, సాగర్ నీళ్ళు ఎక్కువైనాయని హఠాత్తుగా గేట్లు తెరిచారు. ఆ రోజు మధ్యాహ్నం అన్నం వండుకొని తిని కృష్ణానదిలో చెలిమ(నీటి ఊటగుంట)తీసుకొని నీళ్ళుతాగి అలసిపోయి నిద్రపోయిండు. ఒడ్డున ఎవరో గోలగోల అరుస్తుంటే లేచి పొద్దుగూకుతున్నదని అరుపులు పట్టించుకోకుండా జీవాలను ఒక దగ్గరికి చేరుద్దామని రాయి దిగిండు. ఇసుకల కాళ్ళు దిగుతున్నాయి. నాలుగు అడుగులు ఎత్తెత్తి ఏశే వరకే ఆయాసమొచ్చింది. పది అడుగులు వేసేవరకే చాతకాలేదు అతనికి.

ఒడ్డునున్న మనిషి మాటలు వినబడుతున్నాయి. “సాగర్ గేట్లెత్తిన్రట. ప్రాంతీయ వార్తలల్ల చెప్పిండ్రు. నువ్వు నడవలేవు. దిగపడిపోతవు. ఎట్లనన్న రాయిమీద కెక్కు. మేం పోలీసులకు చెప్తం. నిన్ను బైటకు తెస్తం” (రాజన్న:45). ఎటు దరికి చేరాలన్నా రెండు వందల గజాల దూరమున్నదని, పెద్దరాయి ముందల చిన్న గుండును పట్టుకొని నిలబడ్డాడు. పోలీసులు వచ్చేసరికే తెల్లారింది. రామలింగం నిలబడ్డ రాతిగుండ్లమీద మనిషి ఎత్తునీళ్ళు పోతున్నాయి. రామలింగం బతుకు ఆ రాత్రే తెల్లారిపోయింది. శవం దొరకలేదు. పద్దెనిమిదేళ్ళ రామలింగం ఎప్పటికీ తిరిగిరాలేదు. అప్పటికీ పెళ్ళై ఏడాదయ్యింది. భార్య చ్చినదని కాపురానికి రాలేదు. ఇకపై రావలసిన అవసరం లేకపోయింది. ఆమెకు మారు మనువయ్యింది(మరో పెళ్ళయింది).

కులవృత్తిని నమ్ముకొని జీవాలను (గొర్లను) కాసి బతుకుదామనుకుంటే, కృష్ణానదిలోకి నీళ్ళు వచ్చి అందులో కొట్టుకుపోయాడు రామలింగం. బతుకుదెరువుకు పోయిన వాళ్ళు ఎందరో మరణిస్తున్నారని ఈ కథలో రచయిత తెలియజేశారు.

యక్షగానం, అంతులేని పయనం, తోలుబొమ్మలు, మట్టిమనిషి, కిర్రు చెప్పులు, చివరికి, రాజన్న వంటి కథల్లో కులవృత్తులు ఎలా కుప్పపోయాయో వివరించబడింది. కళాకార వృత్తివారు దాసరులు మొదలైనవారు, వ్యవసాయం, కుండలు, చెప్పులు కుట్టేవారు, శ్మశానం దగ్గర కాపాల

వృత్తివారు ప్రపంచీకరణ ప్రభావం, ప్రభుత్వాల అవకాశవాద నిర్ణయాలు వివిధ కారణాల వల్ల కులవృత్తులవారు చాలా బాధలు పడ్డ విషయాలను ఈ కథల్లో మనం గమనించచ్చు. ఈ విషయాలను ఇందులో చర్చించాను.

### 4.7. భూస్వాములు/దొరలు-వెట్టిచాకిరి

భూస్వాములు, దొరలు ప్రజలను ఎలా ఇబ్బందులకు గురిచేసి వెట్టిచ్చాకిరి చేయించుకున్నారు. చదువుకోవాల్సిన సమయంలో పిల్లలు దొరల ఇళ్ళలో వెట్టిచాకిరి చేస్తూ, చదువుకు దూరమైన సంఘటనలు మనం నల్లగొండ జిల్లా కథల్లో మనకు కన్పిస్తాయి. అంతేగాక కొందరు దొరలు ప్రజలను బాగా చూసుకునే మంచివారు కూడా ఉన్నారని కూడా ఈ కథల మనకు తెలుస్తుంది.

**1. స్నిద్ధఛాయ**

నిజాం గద్దె దిగగానే దొర గడీల నుంచి అందరు ఎవరితోవన వాళ్ళు పోయింద్రు. దొన తనను ఇంత ఆదుకోబట్టే పోరలను చదివించుకున్నడు. వాళ్ళు మంచి నౌకరీలకు ఎక్కింద్రు. దొర ఒంటరి వాడైపోయి అచ్చయ్య ఒక్కడే దొరతోటి మిగిలిండు అని రచయిత్రి 'స్నిగ్ధచ్ఛాయ' కథలో ముదిగంటి సుజాతారెడ్డి రాసిన 'బతుకమ్మ పత్రిక' (11 జనవరి 2015)లో విశ్లేషించాడు.

రాఘవరెడ్డి దొరది బంగారు మేనిఛాయ. బక్కపల్చగా వుండేవాడు. నవ్వినప్పుడు అందమైన పళ్ళవరుస ఇంకా చెక్కు చెదరకుండా వుంది. ఆయన చిరునవ్వు నవ్వినప్పుడు కనుగుడ్లు నేరేడు పండ్లలాగా మెరిసిపోతుండేవి. సన్నని పెదవులు నవ్వుల నురుగులను కక్కుతున్న ఇంకా ఒక రష్యన్ ప్రెస్ లెక్క కన్పిస్తుంటాడు. కాలం తెచ్చిన మార్పులు అతని హుందాతనంలో ఏ మార్పును తేలేదు. మెదడు చురుకుగానే పని చేస్తున్నది. జ్ఞాపకశక్తిలో ఏ లోపం లేదు.

గడీకి చుట్టూ రాళ్ళలో కట్టిన ఎత్తైన పారిగోడ. ఆ పారిగోడ దాటి లోపలికి పోయేటందుకు ఎత్తైన ఇనుప పాటకులుండేవి. గడి ముందున్న విశాలమైన వాకిలి ఉంటుంది. వెట్టివాళ్ళు తెల్లవారంగనే ఊడ్చేవాళ్ళు. ఆడబాపలు కూడా ఉండేవారు. పెద్దమేడ ఆంగ్లో ఇండియన్ శైలిలో కట్టిన విశాలమైన బంగ్లా ధగధగలాడుతుండేది. చుట్టు మల్లె, గులాబి, గన్నేరు పూలు సువాసనలను వెదజల్లుతూ ఉండేవి. పారిగోడ పొంటి చెట్లు గాలికి ఊగుతూ పూలను చల్లుతూ స్వాగతం పలికేయి. గడి ముందలి అరుగులు పాలరాతి బండలు వేసి ఉండేది. చెక్కణం పనితనంతో ఇత్తడి గుబ్బలతో

కూడిన దర్వాజలు బంగారం లాగా మెరిసే ఇత్తడి గుబ్బులు, విశాలమైన దీవాన్ ఖానా చాలామంది తోటి నిండిపోయి వుండేది. ఎదురుగ సింహాసనం లెక్క చెక్కణపు కుర్చీలోపల చెక్కణలు నాలుగు సంభాల పందిరి ఉండేది.

నిజాం గద్దెదిగంగానే దొర గడీల నుంచి అందరు ఎవరి దారిన వాళ్ళు పోతారు. దొర ఒంటరి వాడైపోయిండు. అచ్చయ్య ఒక్కడే దొరతోటి ఉంటాడు. నర్సయ్య ఏడాదికి ఒకసారి దసరా పండుగ నాడు ఇనాం తీసుకోవడానికి , దొరను కల్వడానికి తప్పకుంట వెళ్ళేవాడు. గడీల సేవకుని లెక్క పనిచేసేవాడు. అప్పట్లో దొర ఇంట్ల నుంచి పోయినంక ధాన్యం వ్యాపారం చేసి పిల్లల్ని చదివిస్తాడు. వాళ్ళు మంచి ఉద్యోగాలలో చేస్తున్నారు. దొర తననింత ఆదుకోబట్టే పిల్లలను చదివించానని, వాళ్ళు మంచి నౌకరీలకు ఎక్కిండ్రని చెప్పుకునేవాడు. అయినా దొరను కలిసి ఇనాం తీసుకోంది వుండేవాడు కాదు. దొర దీవెనలు తీసుకోంది అతనికి వుండబుద్ధి కాదు. దొర దీవెనలు తీసుకోనిది అతనికి వుండబుద్ధి కాదు. ఎవరు ఏమనుకున్నా వచ్చి వెలుతుండేవాడు.

రాఘవరెడ్డి దొర కౌలు భూములను కౌలు చేసేటోల్లకు ఇచ్చేసిండు. తనకు పిల్లల్లేరు. ఏంచేసుకుంటానని పదెకరాల భూమిని ఉంచుకున్నాడు. దానిమీద ఆదాయంతోనే బతుకుతున్నాడు. ఇప్పుడు వయస్సు పండుబారింది. పోయేనాడు ఇప్పటికి తనకు వండి పెడుతున్న అచ్చయ్యకే ఆ భూమిని వ్రాసి పోతనంటుండు రాఘవరెడ్డి.

ఈ కథలో రాఘవరెడ్డి దొర ఊరి ప్రజలను మంచిగా చూసేవాడు. వారికి ఏ కష్టం వచ్చినా ఆదుకునేవాడు. గడిలో చాలామంది వెట్టి చాకిరీవాల్లను, ఆడబాపను పోషించేవాడు. తనకు పిల్లలు లేకపోవడంవల్ల తనకున్న భూములన్ని పేదప్రజలకు, కౌలుకు తీసుకున్నవారికి పంచిపెట్టి, ఒక పది ఎకరాలు మాత్రమే ఉంచుకొని దానిమీద వచ్చే ఆదాయంతో బతుకుండేవాడు. నిజాం గద్దె దిగంగానే దొర గడీల నుంచి అందరు ఎవరి దారిన వాళ్ళు ఎల్లిపోయారు. చివరికి తను ఒక్కడే ఉండడంతో, అతనికి తోడుగా అచ్చయ్య మిగిలిపోతాడు. నర్సయ్య తనకు అన్ని వున్నాగాని దొర దగ్గరకు వచ్చి ఇనాం ఆడుకొని వెళ్ళేవాడు. తనకు అన్నం వండి పెడుతున్న అచ్చయ్యకు పోయేవాడు. పది ఎకరాలు రాసి పోతానని రాఘవరెడ్డి అంటాడు. ఇలాంటి గొప్ప హృదయంగల దొర జీవిత గాథను రచయిత్రి ఈ కథలో వివరించారు.

## 2. నల్ల తేళ్ళు

దొరతనం ఆనాటి కాలంలో మహిళలను ఎలా లొంగదీసుకుందో రాములమ్మపై నిందమోపిన దొర మగతనాన్ని తేళ్ళతో ఎలా బయటపడుతుందో స్త్రీ ధైర్యం ఎలా ఉంటుందో "నల్లతేళ్ళు" కథ చూపిస్తుంది. ఈ కథ కోట్ల వనజాతా రాసిన 'ఇత్తు' కథా సంపుటిలోనిది.

వీరప్పదొర శేషన్నతో రాములమ్మకు డబ్బులు పంపిస్తాడు. భర్త వెంకటి 'వానితో ఎప్పుడు పోయినవ్' అని తిడుతాడు. ఆమె నేను ఎప్పుడు పోతిని, దొర నాకు డబ్బులు పంపుడేంది అని ఆలోచించింది. ఆమెకు ఈ మధ్య జరిగిన ముచ్చటొకటి గుర్తుకువచ్చింది. రాములమ్మ కూరగాయల మడిల కలుపుతీస్తానికి కొడవలి తీసుకపోకుండా, చేతితో పీకుతుంటే అరచేతులు తెగిపోతున్నాయని కొడవలి కోసం పక్కన ఉన్న పాలి వాల్లను అడిగి లాభం లేదని, పక్కచేనులో వీరప్ప దొర జీతగాలు ఉంటారని అక్కడికి వెళ్తుంది. దొర కందిపొల్లులో పుల్లలు వేరుతుంటాడు. జీతగాడు అనుకొని 'ఒక కొడవలిస్తవా అన్న' అని అడగగానే ఇటు తిరిగి చూసిండు వీరప్పదొర. రాములమ్మ అక్కడ నుంచి తనచేన్లకు ఉరికిన సంఘటన గుర్తుకొచ్చింది. ఉత్తగ మొకం చూస్తేనే నా ఇంటికి పైకం పంపుడేంది. నన్ను బదనాం చేసుడేంది. అర్థమైతలేదు ఆమెకి. భర్త మాట్లాడి మూడు రోజులైంది. వీరప్ప పైకం పంపడానికి వెనుక కారణం తన భార్య దేవమ్మను అడిగి 'అసలు ముచ్చట రాబట్టింది.'

పొద్దుగూకి పశువులు, కూలివాళ్ళు ఊళ్ళోకి వస్తున్నారు. రచ్చకట్టకాడ పెద్దమనుషులు మాట్లాడుతున్నారు. అందరి మధ్యలో వీరప్ప దొరను రాములమ్మ చేన్లకుపోయి వస్తుంటే చూసింది. వాళ్ళ దగ్గరికి వెళ్ళలే అక్కడ అంతా మగవాళ్ళు అందరూ వింతగా చూస్తున్నారు. ఆమె అన్నం తిన్న డబ్బనిండ నల్లతేళ్ళను (చిన్నవి, పెద్దవి) తీసుకొని వచ్చి మూత తీసి వీరప్పదొర మీదకు విసిరేసరికి అన్ని వంటిమీద పడగానే బట్టలు మొత్తం విప్పుకున్నాడు. ఊరంతా వీరప్పను చూసిన వాళ్ళందరికి అసలు ముచ్చట తెలిసిపోయి నిమిషాలల్లో ఆడోళ్ళందరూ అతన్ని పట్టుకొని చెట్టుకు కట్టేసి ఇష్టం వచ్చినట్లు కొట్టి, ఎందుకు ఇట్ల చేసినవని నిలదీసినారు. మొగవాళ్ళు పోలీసులకు చెప్పినారు. ఆడవాళ్ళు వీరప్పను నిజం చెప్పినాకే పోలీసులకు అప్పగిస్తామన్నారు. ఇగ తప్పదని నోరు విప్పిండు.

రజాకార్ల కంటే ముందు ముచ్చట. వీరప్పకు ఇరవై సంవత్సరాలు ఉంటాయి. అప్పుడు అతనికి చిన్న మడిచెక్క భూమి ఉండే, దాని పక్కన ఎర్రమ్మవాళ్ళ చేను, ఈమె మీద మనసుపడి ఊక సతాయించెటోడు. అప్పటికే వేరే అతనితోటి పెళ్ళి అయింది. బోనాల పండుగకు తల్లిగారి ఇంటికి వచ్చింది. ఇత్తనాలు వేయడానికి తల్లితో కలిసి చేనుకు వస్తే, అదును చూసి ఎర్రమ్మను ఆగముచేయబోయిండు. దగ్గరలో ఉన్న కొడవలితోటి వొళ్ళు మొత్తం చెక్కింది. మళ్ళీ ఆడదాని మొకం చూడకుంటా చేసింది." ఊరినుంచి పారిపోయి ఉస్మానియా హాస్పిటల్‌లో బాగు చేసుకొని గట్లనే రజాకార్లతో కలిసిపోయి మల్ల ఊర్లకొచ్చిండు. 'అసలు ముచ్చట ఎవరికి చెప్పకుండానే ఎర్రమ్మ ఉరేసుకొని మరణించింది.

"వీరప్ప మాత్రం తన సంగతెవ్వరికీ తెల్వదని అందరికీ చిల్లర పైసలు ఇండ్లల్లకు పంపుకుంట బదనాం చేసి ఖుషి చేస్తుండే. రాములమ్మ చేసిన తెగింపుకు వీరప్ప బతుకు బలైంది. ఔ! మల్ల నల్లతేళ్ళను ఒత్తి సంపాలే కదూ!"(పుట: 78) అని అంటుంది. ఈ కథలో వీరప్ప దొర ఊర్లో ఉన్న మహిళలకు తన జీతగాళ్ళతో డబ్బులు పంపి వారిని లొంగదీసుకుంటాడు. అలాగే రాములమ్మకు పంపడం వల్ల ఆమె వీరప్పదొరపై నల్లతేల్లను పోయడంతో అతడు బట్టలు ఊడబీక్కోవడం, అక్కడున్న మహిళలు అతనిని కొట్టి చెట్టుకు కట్టేసి, పోలీసులను పిలిపించి అప్పచేయడం జరుగుతుంది. ఇలా సమాజంలో చాలామంది ఉన్నారని రచయిత్రి స్త్రీలు ఎదిరించి బతకాలని, అలాగైతేనే సమాజంలో బతకగలం అని తెలియజేశాడు. రచయిత ఈ కథలో తెలియజేసింది.

**3. మీనా**

చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి చదువుకు దూరమై పనిపిల్లగా మారిన మీనా జీవితగాథను 'మీనా' కథలో చిత్రించారు. రచయిత భూతం ముత్యాలు రాసిన 'దగ్ధం' కథ సంపుటంలోనిది ఈ కథ.

మీనా తల్లిదండ్రులు దీనయ్య, శాంతమ్మ. తండ్రి రోజు తాగివచ్చి తల్లిని ఎక్కడబడితే అక్కడ కొడుతుండేవాడు. ఒకరోజు తల్లికి జ్వరం వచ్చి లేవకుంట పడుకుంటుంది. మీనా ఉదయం లేసి చూస్తే తల్లి అట్లనే పడుకుంటుంది. పిల్లలంతా బడికి తయారవుతుంటారు. నేను ఇయ్యాల బడికి ఎట్ల

పోవాలె. నాకు తల దువ్వి జడ ఎవరు ఏస్తరు. నన్ను పలరిస్తోళ్ళు లేరు. మా యింటికాడ కన్నెత్తి చూసెటోల్లెలేరు. మా ఇల్లేమో ఊరికి కానరాకుంట ఉండే. ఇయ్యాల బడికి పోతనేమోగాని, నేనన్న పొరకతోని ఇంటిముందర ఊకుతాను అని ఆకిలి ఊకి ఎత్తిపోస్తుంది. తల్లి మూలుగుతుంటే మీనకు భయంవేసి పక్కింటి పోషమ్మత్త దగ్గరికి వెళ్ళి తల్లికి జ్వరం వచ్చిందని చెప్పి తీసుకొని వస్తుంది. పోషమ్మ శాంతను చూసి మీనాతోటి మొకం కడిగిచ్చి, కొంచెం వేడివేడి చాయి తాపు అని, మీనాతోటి చెప్పి, తల్లి శాంతతోటి ఎందుకు గొడవలు పెట్టుకుంటారే ఏవైనా ఇబ్బందులు ఉంటే సర్దుకుపోవాలిగాని. సూడు నీబిడ్డ నీకోసం గడగడ వనుకుతుంది. పిల్ల చీటికి మాటికి గొడవలు పెట్టుకోవద్దని, డాక్టర్ ఊర్లోకు వచ్చినట్టుండని ఆమెను లేపుతుంది. లేసి కూసొని, "ఇగో పోషమ్మత్త కర్రె నర్సిరెడ్డి కాడ జీతం కుదుర్గ చేస్తలేదు. ఆ రెడ్డోడు పాలి గుండగాళ్ళ రప్పించి అప్పు తీర్సుతావా తీర్సవా? అని కొట్టించిండు. ఆనిమీద కోపంతో బాగా తాగివచ్చి నామీద ఎల్లదీస్తుండని చెప్పుతుంది. ఆమె ఎంత చెప్పినా వినిపించుకునేవాడు కాదు. ఇక లాభంలేదని తల్లిగారింటికి పోతానని పోషమ్మత్తతో చెప్పుతుంది.

శాంతకు మొకం కడిగించి, డాక్టరుతోటి జ్వరం సూదిమందు గోలీలు ఇప్పిస్తరు. తండ్రి బాగా తాగివచ్చి వేపచెట్టుకింద నిలబడితే పోషమ్మత్తకి నాలుగు మంచిమాటలు చెప్పి, తిడుతుంటే పట్టించుకోకుండా కూతురిని పిలుస్తాడు. మీనా బయపడి అతని దగ్గరకు వెళ్ళదు. వీళ్ళకు ఎందుకు పుట్టానో, పుట్టకున్నా బాగుండు. ఇంకా వేరే ఇంట్లో పుట్టిన బాగుండు అని అనుకుంటుంది. తల్లిదండ్రి కూలికి వెలితేనే కూడు ఎందుకిట్ల మా బతుకులు మారవా? మేమేం పాపం జేసినాం. ఈనాడు పిల్లలు మంచిగ బడికి పోతుంటే నేనేమో సరిగా బడికి పోకుంటైతి. ఇప్పుడు ఎన్ని దినాలు బడి బందు పెట్టాల్నా, అసలు ఇప్పట్నించి నన్ను బడ్కి పంపుతారా, సదివిస్తరా, నేను సద్వుకుంటనా, బడికిపోయి పిల్లలతో ఆడుకుంటనా? వాళ్ళంతా ఆడ్కుంట, పాడుకుంట, నవ్వుకుంట, ముర్సుకుంట సారు చెప్పేపాఠాలు ఇనుకుంట సదువుకుంటరు. నేను ఈళ్ళకు పుట్నందుకు ఇంతేనేమో అని అనుకుంటుంది. ఆమె దోస్తు స్వప్నకైతే రోజుకో డ్రస్సు ఏస్కొస్తదని, తనకు తొడుక్కోవడానికి బట్టలు సరిగ్గా లేకపోయేసరికి గరీబోళ్ళకు ఎందుకు పుట్టిన్నేమో అని బాధపడుతుంది.

మీనను వాళ్ళ అమ్మ అమ్మమ్మ ఇంటికి వెళ్దామని బట్టలు సర్దుకొమ్మని చెబుతుంది. అమ్మ మరి నా బడి, నేను బడికి పోవద్దా అని అంటే బడిలేదు గిడిలేదు నడువని అంటుంది. అమ్మమ్మ ఇంటికి వెళ్లడం తనకు ఇష్టం లేదు. తండ్రి ఆపుతాడని అనుకుంటుంది. కాని అతను ఆపిన ఆగదని తెలిసే ఊకుంటాడు. ఆటోల అమ్మమ్మ ఇంటికి చేరుకుంటారు. అమ్మమ్మ వీళ్ళ అవతారం చూసి బాధపడుతుంది. మీన వాళ్ళ అమ్మను మంచంల కూసబెట్టి, మీనకు పెరుగన్నం పెడుతుంది. మీన అమ్మమ్మకు తండ్రి, తల్లిని కొట్టిండని చెప్తుంది. ఇంటి నుండి మీన తాతయ్యకు ఫోన్ వస్తుంది, తండ్రి చనిపోయాడని. ఆ విషయం తల్లికి ఇనపడి, ఆమెకు తెలియకుండానే కండ్లపొంటి నీళ్ళు వచ్చి, పండ్లుకొరుకుతూ, కండ్లు తెల్లగుడ్లేసింది. డాక్టరు వచ్చి సూసి చనిపోయిందని చెప్తాడు. మీనాను చూడటం అమ్మమ్మ వల్ల కాలేదు. ఆఊరి దొరసాని పట్నంల ఉంటే ఆమెను ఇండ్లల్ల పనికి కుదిరించారు. వాళ్ళ ఇంట్ల చేరి వారికి సాకీరు చేయాల్సివచ్చింది. అట్ల ఆమె సదువు కల కలగానే మిగిలింది. ఒకరోజు ఆమె జీవితాన్నే మింగింది. ఇప్పుడు ఆమెలోకం ఆ ఇల్లైంది. ఆమె బాల్యం పనిల బందీయైంది. ఆమె ఆశలు కరిగినాయి. ఆమె కలలు సెద్రినై. అమ్మ పావురంతో పిల్సే పల్కరింపులే లేవు. అమ్మ ప్రేమతో పిలిచే పిలుపులినబడవు.

తల్లిదండ్రులు ఒకరినొకరు అర్థం చేసుకొని జీవించాలని, జీవితంలో ఎన్నో సమస్యలు, ఎన్నో ఆటంకాలు, ఒడిదుడుకులను ఎదుర్కొని జీవించాలని, పిల్లలముందు గొడవలు పెట్టుకోవడంవల్ల వారి మనసు ఎంతో బాధపడుతుందని, వారి సదువులు ఆగమవుతాయని, వారు అనాదలుగా మారిపోవడం, బతకడానికి ఎన్నో ఇబ్బందులు వచ్చి పనిపిల్లలుగా మారుతున్నారని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

స్నిగ్ధచ్ఛాయ, నల్లతేళ్ళు, మీనా కథల్లో దొరల/భూస్వాముల ఇళ్ళలో ప్రజలు ఎలా మగ్గిపోయారో, చిన్నపిల్లలు వెట్టిచాకిరి చేస్తూ, ఎలా బాల్యానికి దూరమయ్యారో మనకు కన్పిస్తుంది. ఈ కథల్లో మనకు ఓ కొత్తకోణం ఉంది. అది ఏమిటంటే కొందరు దొరల ప్రేమకు ప్రజలు నోచుకున్నారో కూడా చూడవచ్చు. అటువంటి విషయాలను ఈ ఉపవిభాగంలో చర్చించాను.

## 4.8. ఉద్యమ కథలు

ప్రపంచంలో అన్యాయం ఎక్కడ ఉందో అక్కడ తిరుగుబాటు ఉండి తీరుతుంది. సమాజంలో ఏదో ఒక సమస్య ఉత్పన్నమవుతూనే ఉంటుంది. ఆ సమస్యలకు ప్రజలు బలవుతూనే ఉంటారు. వాటిని ప్రభుత్వాలు కావచ్చు, మరే ఇతరులైనా సృష్టించే అవకాశం ఉంది. ప్రజలకు అండగా ఉంటూ, వాటిని పరిష్కరించే దిశగా మేధావులు, రచయితలు మొదలైన ఉద్యమిస్తూనే ఉంటారు. అటువంటి సాహిత్యాన్ని ఉద్యమ సాహిత్యం అంటాం. వివిధ ప్రక్రియలలల్లో ఉద్యమ సాహిత్యం వస్తూనే ఉంది. అదే విధంగా నల్లగొండ కథల్లో కూడా ఉద్యమ సాహిత్యం వచ్చింది. అందులో తెలంగాణ ఉద్యమం, నక్సలిజం మొదలైన సామాజిక అంశాలపై విప్లవోద్యమ కథలు ఉన్నాయి. వాటిని ఈ ఉపవిభాగంలో విశ్లేషించాను.

### 4.8.1. తెలంగానోద్యమ నేపథ్య కథలు

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భాషా ప్రాతిపదికన ఏర్పడ్డ రాష్ట్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్. హైదరాబాదు రాజ్యం, మద్రాసులో భాగంగా ఉన్న ఆంధ్ర ప్రాంతాన్ని కలిపి 'ఆంధ్రప్రదేశ్'1956గా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పటినుండి ఆంధ్రప్రాంతం వారు తెలంగాణవారిని నీళ్ళు, నిధులు, ఉద్యోగాల విషయంలో అన్యాయం చేసి, మోసగించారు. ఆ బాధలు భరించలేక తెలంగాణ ప్రాంతంవారు 'ప్రత్యేక తెలంగాణ'కోసం అప్పటినుంచి 1969 వరకు రగిరగిలి పెద్ద ఎత్తున ఉద్యమం చేశారు. అప్పుడు విఫలమైనందున అప్పటినుంచి బలాన్ని కూడగట్టి 90 వ దశకం నుండు మళ్ళీ ఉద్యమం చేయనారంభించారు. అది కాస్త 2009 నాటికి తీవ్రరూపం దాల్చింది. అప్పటి నుండి 2014 వరకు ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. తెలంగాణ ప్రజలు ఎట్టకేలకు ప్రత్యేక 'తెలంగాణ' రాష్ట్రాన్ని సాధించుకున్నారు. ఆ క్రమంలో ఎంతో అమరుల ప్రాణ త్యాగాలు, ప్రజల గాయాలే గేయాలుగా మారిన విధానం, ఉద్యమం నడిచిన తీరు, కొందరు నాయకులు ఉద్యమానికి ద్రోహం చేసిన తీరు మొదలైన విషయాలు నల్లగొండ జిల్లా కథల్లోని కొన్ని కథల్లో ఈ అంశాలు స్పృశించబడ్డాయి. అటువంటి కథలను ఈ ఉపవిభాగంలో చర్చించాను.

**1. కలల గూడు**

తెలంగాణ ఉద్యమంలో పోలీస్ ఫైరింగులో తూటా తగిలి కొడుకు మరణిస్తే, తండ్రికి గుండెపోటు వచ్చి హాస్పటల్లో పడిన విధానాన్ని 'కలలగూడు' కథలో రచయిత దేవులపల్లి కృష్ణమూర్తిగారు వివరించారు. ఈ కథ 'కలలగూడు' సంపుటంలోనిది.

'విశ్వనాథం' రిటైర్డ్ ఉద్యోగి భార్యతో కలిసి నల్లగొండ నుండి స్వంత ఊరు వచ్చి పెద్ద ఇల్లు కట్టుకొని అందులో ఉంటారు. వీరి పిల్లలు హైదరాబాదులో ఉంటున్నారు. 'చంద్రం' గవర్నమెంట్ టీచర్. విశ్వనాథంగారి ఇంటి పక్క నుండి పాఠశాలకు రోజూ వెళుతుండటం, లెక్కలు ట్యూషన్ 'చీమలగడ్డ'లో చెప్పి వస్తూ పోతూ అతన్ని చూస్తూ ఉంటాడు. ఒకరోజు విశ్వనాథం ఇంటికి వెళ్లి పరిచయం చేసుకొని అతన్ని కాలక్షేపమేంటి సార్ అని అడిగితే, అదో ఇదో వ్రాస్తుంటాను. కథలా? కవిత్వమా? సార్ అంటే ఏది కుదరటం లేదు. అయినా వ్రాస్తూనే ఉన్న. కథలు రాసి మిత్రులకు వినిపిస్తే నచ్చలేదన్నారు. కవిత్వం రాద్దామనుకున్న నచ్చలేదు. నవల రాద్దామనుకున్న అది సాగలేదు. ఏదో రాస్తూనే వున్నాను అంటాడు. దసర సెలవులప్పుడు ఒకరోజు విశ్వనాథంగారి ఇంటికి వెళ్ళి అతని రచన ఎంతవరకు వచ్చిందని అడిగితే, సాగుతుందయ్యా చంద్రం. రోజూ ఏదో ఒకటి వ్రాస్తుంటే పొద్దుపోతుందని అంటాడు. మీరు రాసింది చూడవచ్చా సార్ అంటే కాగితాలు చిందర వందరగా ఉన్నాయి. రేపన్న ఎల్లుండన్నరా వరుసగా పేర్చి ఇస్తాను. చదివి చూడని అంటాడు.

చంద్రం దసర పండుగ తర్వాత వెళ్తాడు. విశ్వనాథం మనుమడు తన కళ్ళజోడు ఆగం చేస్తాడేమోనని ఎక్కడో పెట్టాను అది దొరకక కాగితాలన్ని పేర్చలేక పోయాను. సరే తీరిక ఉన్నప్పుడే కాగితాలు వెతికి ఇవ్వండి సార్. దసర పండుగ ఎట్లా జరిపారు అని ఒకరినొకరు అడిగి తెలుసుకుంటారు. విశ్వనాథం తన చిన్నకొడుకు దసరాకు రాలేదని, ఉస్మానియాలో పి.జి. చేస్తున్నాడని, దసరాకు ఫ్రెండ్స్ ఇంటికి వెళ్తున్నానని చెప్పిండు.

డిసెంబర్ 9 ప్రకటన చిచ్చే రగులుతుంది. 1969లో టి.ఎన్.జి.వో సంఘంలో జాయింటు సెక్రటరిగా వుండి చాలాకాలం తెలంగాణ కావాలని సమ్మె చేశామని, ఆ సమ్మె పూర్తిగా

కొనసాగలేదని మధ్యలో వచ్చి ఉద్యమాన్ని చేతిలోకి తీసుకొని, ఆ 'దొర' ఎంతమంది ఉసురు తీసుకుండని, నోటికాడికి వచ్చిన బువ్వ చేజారిపోయిందని, మళ్ళీ 40 సంవత్సరాలకు రగులుతుందని, మావాడు యూనివర్సిటీలో ఉద్యమంలో తిరుగుతుండని, రెండు మూడు కేసుల్లో ఇరుక్కుండని ధూందాంలని తిరుగుతుండని, పాటలు రాసి మంచిగా పాడుతాడు. దేశపతి శ్రీనివాస్, వాడి దోస్తులు ఎట్లాయితే అట్లయితది నేనేం చేద్దునని చంద్రంతో చెప్పుతాడు.

"చంద్రం నెలరోజుల తర్వాత విశ్వనాథంగారి ఇంటికి వెళ్తే తాళం వేసి ఉంటుంది. అక్కడ నుండి వెళ్తున్న పిల్లగాన్ని అడిగితే, పదిరోజుల కింద వాళ్ళ అబ్బాయి దవాఖానలో ఉన్నాడని పట్నం పోయారు సార్ అని చెప్పుతాడు. నాల్గు, ఐదు రోజుల తర్వాత పేపర్లో వార్త కనిపిస్తుంది. "ఇరవై రోజుల క్రితం ఉస్మానియా యూనివర్సిటీలో పోలీసు ఫైరింగులో తూటా తగిలి హాస్పటల్లో చికిత్స పొందుతున్న ప్రసాద్ నిన్న చనిపోయిండు. ఇతనిది నల్లగొండ జిల్లాలోని గ్రామము. తండ్రి విశ్వనాథంగారు అని రైటైర్డ్ ఉద్యోగి. అంత్యక్రియలు ఈరోజు వారి స్వగ్రామంలో జరుగుతున్నాయి." (కలల గూడు: 8) అని ఉంటుంది. చంద్రం మనస్సు ఎంతో బాధపడింది. మధ్యాహ్నం 2 గంటలకు శవం వచ్చింది. పోలీసులు బందోబస్తు భారీగా చేయడం, యూనివర్సిటీ విద్యార్థులు నాలుగైదు వ్యాన్లలో వచ్చారు. ఊరేగింపు మొదలైంది. అక్కడ ఉన్న స్కూల్, కాలేజీ విద్యార్థులు ఊరేగింపులో పాల్గొని "ప్రసాద్ అమరహై, ప్రసాద్ ఆశయాలను సాధిద్దాం" అంటూ నినాదాలతో దద్దరిల్లిపోయింది. విశ్వనాథంగారు, భార్య కనిపించలేదు. తెలిసిన పెద్దమనిషిని అడిగితే కొడుకు మరణవార్త విని హార్ట్‌స్ట్రోకు వచ్చిందని హాస్పటల్లో ఇంటెన్సివ్ కేర్‌లోనే వున్నాడని చెప్పడంతో షాక్ అయ్యి కలలగూడు చెదిరిపోయిందే విశ్వనాథంగారు ఈ వయస్సులో హార్ట్‌స్ట్రోకుతో బయటపడగలరా! ఎంతోకాలం నుండి తనకి ఇస్తానన్న వారి రచనలు అట్లా పోవలసిందేనా? అనుకుంటాడు చంద్రం.

ఈ కథలో రచయిత రెండు కోణాల్లో కథను రాసాడు. ఒకటి విశ్వనాథంగారు రాసిన రచనల గురించి, రెండవది తెలంగాణ ఉద్యమంలో పోలీసు కాల్పుల్లో బలి అయిన ప్రసాద్ అనే యూనివర్సిటీ విద్యార్థి గురించి. ఇలా ఎందరో విద్యార్థులు తెలంగాణకోసం వీరమరణం పొందారని తెలియజేశాడు.

**2. ద్రోహం**

తెలంగాణ ఉద్యమ ద్రోహానికి పాల్పడిన మర్రి చెన్నారెడ్డి ఉద్యమ చరిత్రలో ద్రోహిగానే మిగిలిపోయాడని 'ద్రోహం' కథలో రచయిత దేవులపల్లి కృష్ణమూర్తిగారు విశ్లేషించాడు.

1969 జనవరిలో తెలంగాణా ఉద్యమం ఖమ్మంలో మొదలై తెలంగాణా అంతటా వ్యాపించింది. బి.ఎ. విద్యార్థులు క్లాసులు బహిష్కరించి, జై తెలంగాణా అంటూ ఊరేగింపులు, బహిరంగ సభలు ప్రారంభించడం, హైదరాబాదు నుండి ముఖ్యమైన నాయకులు వచ్చి బహిరంగ సభలో మాట్లాడటం, ఇ.వి. పద్మనాభన్ చాలా ఉద్రేకంగా మాట్లాడటం, నిజాం కాలేజీ విద్యార్థులపై బాష్పవాయువు ప్రయోగం, లాఠీచార్జిలు జరపడంవల్ల ఎంతోమంది విద్యార్థులు చనిపోయారు. నల్లగొండలో ఉద్యమం ఊపందుకొని, రంగాచారి అనే ఆంధ్ర ఉద్యోగిపై పెట్రోలుపోసి తగలబెట్టడం, తెల్లవారేవరకు ఈ విషయం అంతా వ్యాపించి, కాలేజీ నడవక మార్చినెలలో హైద్రాబాదు రెడ్డి హాస్టల్లోని విద్యార్థులు సభలు, సమ్మెలు జరపడం, యువకులు మేదావులు కలిసి 'ప్రజాసమితి' స్థాపించి, మార్చి 3న తెలంగాణ బందుకు పిలుపు ఇస్తే ప్రశాంతంగా జరగడం, విద్యార్థులు కాలావది (పరిమితి) లేకుండా చేసే సమ్మెకు, సపోర్టుగా తెలంగాణా ఉద్యోగులు వెంట నిలిచారు. కమ్యూనిష్టులు ప్రత్యేక తెలంగాణకు మద్దతు ఇవ్వటంలేదు. విద్యార్థి నాయకుడు మల్లికార్జున్ హైద్రాబాదులో ఉద్యమం కొనసాగించడం, నల్లగొండలో విద్యార్థి నాయకులను, యన్జీవో నాయకులను, విద్యార్థులను, విద్యార్థి నాయకుడు శ్రీదర్ రెడ్డిని అరెస్టుచేసి, జైల్లో పెట్టడం, అక్రమకేసుల్లో ఇరికించడం, ఈ ఉద్యమంలో అనేకమంది మహిళలు నగరమేయర్ రాణి కుముదిని దేవి, సదాలక్ష్మి, ఈశ్వరీబాయి, సంగం లక్ష్మీబాయమ్మ మొదలైనవారు పాల్గొన్నారు.

నల్లగొండలో టీ.ఎన్జీవో నాయకుడు యాదగిరిరెడ్డిని అరెస్టు చేయడం, 37 రోజులు సాగిన యన్జీవోల సమ్మె ఆకరికి విరమించడం, హైదరాబాదులో మల్లికార్జున్ విద్యార్థి నాయకుడు 24 రోజులపాటు నిరాహారదీక్ష చేస్తే పోలీసులు బలవంతంగా విరమింపజేశారు.

ఈ మహోద్యమం 9నెలలపాటు జరిగింది. విద్యార్థులు ముఖ్యపాత్ర పోషించడం, మొత్తం తెలంగాణలో 360 మంది విద్యార్థులు ప్రాణాలు పొయ్యాయి. వీటన్నిటిని మర్రి చెన్నారెడ్డి తనకు

సహాయపడే విధంగా (అనుకూలంగా) మార్చుకుని కేంద్రంలో (రహస్య ఒప్పందం) బయటి ప్రపంచానికి తెలియనియ్యకుండా, ఒడంబిక (అంగీకారం) చేసుకొని 1969 నవంబర్ 26న ఉద్యమాన్ని (వాయిదా) గడువు వేస్తున్నట్లుగా ప్రకటించి కోలుకోలేదని దెబ్బతీశాడు(ద్రోహం: 34).

తెలంగాణా ఉద్యమంలో విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, మొదలైనవారు సమ్మెలు, బందులు, లాఠిచార్జీలు, పోలీసుకాల్పులలో ఎంతోమంది ప్రాణాలు పోయినగాని, మర్రిచెన్నారెడ్డి ఒప్పందం కుదుర్చుకోవడం తెలంగాణాకు తీరని ద్రోహం చేశాడని రచయిత ఈ కథలో వివరించాడు.

**3. సోయి**

సొంతవారి కోసం కాకుండా సమాజంకోసం పాటుపడటం చాలా గొప్ప విషయమనే దాన్ని రుజువు చేసిండు. ఉద్యమకారుడు, కార్యకర్త సమాజంలో ఎక్కడైనా అన్యాయం జరిగిందంటే వెంటనే స్పందిస్తాడు. తానొక్కడు స్పందించడం కాదు. సమాజంలో చురుకు పుట్టించి, పీడితుల, బాధితుల పక్షాన గొంతుకై నినాదమైతాడని 'సోయి' కథ చెబుతుంది. రచయిత స్కైబాబ రాసిన 'అలాయి బలాయి' బహుజన కథా సంపుటంలోనిది ఈ కథ.

పాయిలి సాయిచంద్ర డిగ్రీ వరకు చదువుకున్నాడు. అతని స్నేహితుడు యూసూఫ్. ఊర్లో అందరు సాయంత్రం కాగానే మందుతాగి, అనారోగ్యంపాలు అవుతూ, చనిపోతున్నారని, మందు అమ్మనీయకుండా బందు చేయించారు. వాళ్ళ ఊరే కాకుండా చుట్టుపక్కల ఊర్లన్నిట్ల బంద్ చేయించి, ఊర్లన్ని ఆదర్శ గ్రామాలు అయ్యేటట్లు చేయడంతో సాయిచంద్ర ఊర్లల్లకు వెళ్తే అందరు అతడిని దేవుడని అంటుండేవారు. అతడు చాలా పుస్తకాలు చదువుతుండేవాడు. ఎవ్వరికీ తోయని తీర్పులు ఇస్తుండేవాడు. సంవత్సరం తిరిగే వరకు తన ఊరు తీరే మార్చేసిండు. లోకల్ మేడ్ వస్తువుల బిజినెస్ చేసుకుంటూ తన వరకు కర్చులు ఎల్లదీసుకునేవాడు. వాళ్ళ స్నేహితులని ఊకోనిచ్చేవాడు కాదు. ఊర్లె ఏ సమస్య వచ్చినా, పెర్కొల్లను, ముస్లింలను, గొల్లోల్లను, గౌండ్లోల్లను, సాకలోల్లను, మాలమాదిగోల్లనంత ఏకం చేస్తుండేవాడు. ఆఖరికి ఊర్లె ఏ కొట్లాటలు వచ్చిన రెడ్డోళ్ళంత ఒక దిక్కు, ఈల్లు అంత ఒకగుంపు అయితుండేవారు.

సాయిచంద్రకు రాజకీయాలంటే ఇష్టం ఉండేది కాదు. రాజకీయ నాయకుల కన్నా ఎక్కువ ఇతడే అందరి పనులకోసం తిరుగుతుండేవాడు. పైసకూడా తినేవాడు కాదు. ఉంటే అతని జేబులనుంచి పెట్టేవాడు. సాయిచంద్ర అంటే అక్కడి ఎమ్మెల్యేకుగూడ మంచి నమ్మకం. వాళ్ళ పార్టీల చేరమన్న చేరలేదు. అతడు తెలంగాణా కోసం పని చేస్తుంటే తెలంగాణ పార్టీవాళ్ళు కూడా అడిగినగాని అందులో కూడా చేరలేదు. అటు పక్క తెలంగాణ ఉద్యమం అంతగా లేకున్నా కాని అతడు ఆ నినాదం ఎత్తుకొని ప్రతి ఒక్కరిని జై తెలంగాణా అనేటట్లు చేసిండు. వాళ్ళ మండలం మండలమంత సాయిచంద్ర అన్నమాటే అందరి మాటైపోయింది. కింది వర్గాలల్ల మంచి చైతన్యం తెస్తుండేవాడు.

గ్రామీణ జీవితాన్ని ప్రతిబింబించే కథ. భద్రత, భరోసాలేని బతుకు, తాగుడు కారణంగా విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు, సాధారణ గ్రామీణ బహుజనుల జీవితం ఈ కథలో అంతర్లీనంగా ప్రతిబింబిస్తుంది. అయితే సాధారణ సమాజం కన్నా భిన్నంగా తర్వాత తరాలపట్ల ఒక బాధ్యతగా సాయిచంద్ర చైతన్యవంతుల ప్రతినిధిగా నిలబడటం ద్వారా భవిష్యత్తులో అయిన బహుజన సమాజం చైతన్యవంతమై స్వయం గుర్తింపు సాధిస్తుందనే ఆశను రచయిత ప్రకటించాడు.

కలలగూడు, ద్రోహం, సోయి కథల్లో తెలంగాణోద్యమంలో జరిగిన త్యాగాలు, ఒడిదొడుకులకు సంబంధించిన విషయాలు స్పృశించబడ్డాయి. వాటిని ఈ ఉపవిభాగంలో చర్చించాను.

### 4.8.2. విప్లవోద్యమ నేపథ్య కథలు

సమాజంలో ధనికవర్గ, అగ్రవర్ణ వర్గాలకు చెందినవారు, బడుగుబలహీన వర్గాలవారిని పీడిస్తూ ఉంటారు. ఆ పీడనల విముక్తికోసం ప్రజలు ఎన్నో ఉద్యమాలు చేస్తుంటారు. ప్రభుత్వాలు కూడా ప్రజలకు అవసరమైన నిర్ణయాలు తీసుకునే సందర్భంలో విఫలమైనప్పుడు కూడా ఉద్యమాలు చేస్తారు. కొందరు త్యాగం చేసి ప్రజల తరపున జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ అజ్ఞాతంలో ఉన్న నక్సలైట్ల/మావోయిస్టుల పార్టీలో చేరుతుంటారు. అటువంటి సందర్భంలో రచయితలు స్పందించి ఉద్యమ సాహిత్యం వెలువరిస్తారు. స్వయంగా అజ్ఞాత ఉద్యమంలో పాల్గొన్నవారు కూడా

తమ అనుభవాలను కథల రూపంలో రాస్తుంటారు. అటువంటి కథలు నల్లగొండ జిల్లా కథల్లో ఉన్నాయి. వాటిని ఈ ఉపవిభాగంలో చర్చించాను.

**1. మొదటి కథ**

కామ్రేడ్సు సమావేశమై చర్చలు జరుపుతున్న సమయంలో మిలిట్రి కాల్పుల్లో సెంట్రి డ్యూటి చేస్తున్న కామ్రేడ్ ఎర్ర సత్యం అమరుడైన విధానాన్ని, కొందరు కామ్రేడ్స్ మరణించడం, కొందరు పట్టుబడడం రచయిత 'మొదటి కథ'లో దేవులపల్లి కృష్ణమూర్తిగారు వివరించారు.

ఉదయం క్యాంపసంత హడావిడి, కొత్త కామ్రేడ్లు ఒకరికొకరు పలకరించుకుంటూ, చౌటుప్పల నుండి రావాల్సిన కామ్రేడ్స్ కోసం ఎదురుచూస్తుండగా కామ్రేడ్ యాదగిరి వచ్చి సత్యాన్ని కలిసి పొద్దుగాల మిలట్రివాల్లు తిరుగుతున్నారని వేరే దారిన వచ్చాను. అందుకే ఆలస్యమైందని, మనవాళ్ళు అంతా చేరినారా అని వచ్చిన కామ్రేడ్లు సత్యం కలిసి పెద్దగుట్ట ఎక్కుతారు. ఆ గుట్టపైన సమానంగా ఉండడం వ్యవసాయం చేయడం, బావుల్లో ఎల్లకాలం నీల్లు దొరకడం, చింతతోపుల నీడ, అక్కడ జన సంచారం ఉన్నట్లుగా ఎవరికి తెలియదు. గుర్తున్నోల్లకు తప్ప, అందుకే రాచకొండ దళం భద్రంగా ఉంటుంది. కామ్రేడ్ కె.వి. అందరిని పరిచయం చేసిన తర్వాత మాట్లాడుతూ "ప్రియమైన కామ్రేడ్స్ మనం గత ఐదు సంవత్సరాలుగా దొరలకు, దేశ్ ముఖులకు, రజాకార్లకు ఎదురొడ్డి పోరాడుతున్నాం. ఇప్పుడు పరిస్థితులు మారినయ్. ఇండియన్ మిలట్రీ దిగింది. దాడులు జర్గుతున్నాయి. దొరలు భూస్వాములు గ్రామాలకు చేరింద్రు. వీళ్ళంతా కాంగ్రేసు పార్టీగా చెలామణి అవుతుంద్రు. కమ్యూనిష్టుల ఇండ్లను నేలమట్టం చేస్తుంద్రు. మిలిట్రీ క్యాంపులు ఎక్కువైనయి. కదిలేటట్లు లేదు. ఇలాంటి పరిస్థితిలో మన పోరాటం ఇంకా కొనసాగించాలా, నిలిపివేయాలా అని, అన్ని దళాలతో చర్చిద్దామని మన నాయకుడు కామ్రేడ్ రాజబహద్దూర్ గౌర్ ఈ తెల్లారుగట్ట ఇక్కడికి వచ్చిండు. కావున కామ్రేడ్స్ మీ మీ దళ సభ్యుల అభిప్రాయాలు వివరించండి." (మొదటి కథ: 10) అని ముగించడంతో దళ కమాండర్లు తమ ప్రాంతంలో పరిణామాలను చర్చలు జరుగుతుండగా రాత్రి అవుతుంది. నలుగురు తల ఒక పక్క సంట్రి డ్యూటికి ఎక్కుతారు.

బాలెంల కేంద్రంగా దళం పనిచేస్తుందని, ఓ ద్రోహి ఇచ్చిన సమాచారంతో నిద్రిస్తున్న నర్సయ్యను పోలీసులు పట్టుకెళ్ళి తిమ్మాపురం వద్ద కాల్చి చంపడంతో, దళం చిన్నాభిన్నమై కొందరు నల్ల నర్సింహులు దళంలో చేరుతారు. మిలిట్రీ నలువైపుల నుండి జరిపిన మెరుపుదాడికి సమావేశంలో పాల్గొన్న సభ్యులందరూ చెల్లా చెదురు అయ్యారు. కాల్పులతో అడవి హోరెత్తిపోయింది. గుట్టల్లో నుండి ఎక్కడికి పరుగెత్తుతున్నారో వాళ్ళకే తెలుయటం లేదు. సంత్రి డ్యూటీ చేస్తున్న నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే తుపాకి గుండ్లకు నేలకొరిగారు. అందులో సత్యం కూడా చనిపోతాడు. చర్చలకు వచ్చిన రాజబహద్దూర్ గౌర్ కూడా పట్టుబడ్డవాళ్ళలో ఉన్నాడు.

దొరలని, దేశ్‌ముఖ్‌లని, రజాకార్లని ఎదిరించి పోరాడి, వారియొక్క అరాచకాలను, దౌర్జన్యాలను, దోపిడితనాన్ని అరికట్టినవారు కామ్రేడ్స్‌లు మిలట్రీవాళ్ళు వచ్చి వారి ఇండ్లను, వారి స్థావరాలను కూల్చి, అడవులల్లో కాల్పులు జరిపి, వారిని చంపడం, కొందరిని పట్టుకొని జైల్లో పెట్టడం, మిలట్రీ వాళ్ళు క్యాంపులు ఎక్కడబడితే అక్కడ పెట్టడంతో కామ్రేడ్స్ అంతరించి పోయారు. కొందరు బయపడి జనసమూహంలో కలిసారు. కామ్రేడ్స్ ఎంతో మంది అనర్హులైనారని కథలో రచయిత తెలియజేశారు.

**2. నా కథ**

దొర చెలక పక్కన ఉన్న భద్రయ్య భూమిని దక్కించుకోవడానికి అతని పాలివాళ్ళతో భాగం వస్తదని ఎగేస్తే, సంగపోల్లు కామ్రేడ్స్ వచ్చి దొర అరాచకాలను, ఆగడాలను, దౌర్జన్యాన్ని ఎదిరిస్తారని, ఊరినుండి పట్నం వెళ్ళిన విధానాన్ని రచయిత దేవులపల్లి కృష్ణమూర్తిగారు 'నా కథ'లో చిత్రీకరించారు.

నకిరేకల్ చుట్టుపక్కల గొలలు జరుగుతున్నాయని, సంగపోల్లు ప్రతి గ్రామంలో ఎర్రజెండాలు పట్టుకొని ఊరేగింపులు చేస్తూ, పెండెం భద్రయ్య ఊరికి వస్తారు. భద్రయ్యకు నలుగురు ఆడపిల్లలు, ఒక కొడుకు. వ్యవసాయం చేసి ముగ్గురు అమ్మాయిల పెండ్లి చేస్తాడు. చిన్న కూతురికి పంటల మీద పెండ్లి చేయాలని అనుకుంటాడు. ఆ ఊరి దొర ఒకడు బాగుపడితే ఓర్వడు. గడి ముందునుండి మంచి

కోడెదూడలు పోతే వాటిని ఎట్లన్న చేసి తన దొడ్లె తోలుకోవడం, పడుచు ఆడపిల్లలు కనిపిస్తే జాడ తీసుకొని, ఆ కుటుంబాన్ని నానా బాధలు పెట్టి ఆ పిల్లను లొంగదీసుకోవడం, పండే భూమి అని తెలిస్తే అతనికి అమ్మిపోయేట్లు చేయడం, భద్రయ్య నాలుగు ఎకరాలు దొర చెలక ఆనుకొని ఉండటంతో దాన్ని ఎట్లన్న చేసి కాజేయాలని పట్టుబట్టి భద్రయ్య వాళ్ల పాలివాళ్ళతో చెలకలో భాగం వస్తదని ఎగేస్తే, వారు దొర మాట విని పంచాయితీ పెట్టడంతో ఊరి పెద్దమనుషులు అప్పట్లో చూసినవారు భూమి అంత పెండెం భద్రయ్యదేనని అనుకొచ్చారు. దానికి దొర అడ్డుపుల్ల వేయడంతో ఆ పంచాయతీ రావణ కాష్టంగా రగులుతూ రెండు సంవత్సరాలైన పరిష్కారం జరగదు. రెండు మూడు రోజులకు ఒకసారి సంగపోలు ఊరిలోకి వచ్చి పాటలు పాడటం, ఊరేగింపులో భద్రయ్య కొడుకు ఆ గుంపులో చేరి జైకొట్టడం బయటి ఊర్ల నుండి వచ్చిన కామ్రేడ్లకు తలా ఒక ఇంటికి తీసుకుపోయి భోజనాలు ఏర్పాటు చేయడం, భద్రయ్య కొడుకు కూడా ఒక కామ్రేడ్‌ను వెంటబెట్టుకొస్తే, భార్య అన్నం పెట్టడం, ఇలా నాలుగు ఐదు సార్లు ఆ కామ్రేడు రావడంతో ఆమె ఉండబట్టలేక భూమి పంచాయతి గురించి చెప్పడంతో అతడు ఓపికగా విని “ఇట్లాంటివి ఈ దొరోడు చాలా పంచాయితీలు పెడ్తుండని విన్నం, వీటన్నిటిని తొందరలోనే తీరుస్తం” అని చెప్పడంతో ఆమెకు సగం దిగులు పోతుంది. భర్తకు చెప్పితే “ఇంతకన్న కావాల్సిందేముందే దేమునోలిగ ఆ సంగపోల్లు మనూరొచ్చినట్లుంది. దొర మూటముల్లె సర్దుకుంటడంట. పట్నం పోతడేమోనని అందరు అనుకుంటుండ్రు.” (కథల గూడు సంపుటి: 18).

వారం రోజుల తర్వాత సంగపోలు ఊరిలో బహిరంగ సభ పెడితే దొరచేసే దుర్మార్గాలన్నీ బాధితులు చెప్పడం, అందులో భద్రయ్య భూమిని దొరాయిన దక్కించుకోవాలని పంచాయితి పెట్టించిండు. ఇది అన్యాయం ఆ భూమి భద్రయ్యదే అంటూ చెప్పగా ఇదే మా తీర్పు అని సంగపోల్లు చెప్పడం. ఆ రాత్రి దొర గడిని గడ్డపారలతో కూలగొట్టి (గరిసెల్లో) పెద్ద గదుల్లో ఉన్న ధాన్యాన్ని ఊరోల్లు గంపలతో దోచుకొనిపోయారు. ఊర్లో సంగపోల్లు తిరుగుతున్నారని ఎట్ల అయిన గోలలు అవుతాయని వారం రోజుల ముందే బొడ్రాయి కాడ వేపచెట్టుమీద ఎర్రజెండలు కట్టారు. నకిరెకల్ నుండి పోలీసులు వచ్చి అడిగితే అంతా బయటనుండి వచ్చిన వాళ్ళే. కూలగొట్టి, దోచుకపోయారని ఊరోల్లు చెప్పడంతో రెండుమూడు రోజులు తిరిగి తిరిగి పోయారు. వారం రోజుల తర్వాత వాళ్ళ

ఇంటికి అన్నం తిన్న కామ్రేడ్ వస్తే మీ మూలంగా నా భూమి పంచాయితి తీరిపోయి, ప్రాణం సుఖంగా ఉందని భద్రయ్య చేతులు పట్టుకున్నాడు.

పల్లెల్లో ఎన్నో సంవత్సరాలుగా తీరని పంచాయతీలను ఆనాడు కామ్రేడ్స్ ప్రజల వద్దకు వచ్చి ఆ పంచాయతీలకు తీర్పులను ఇవ్వడం అవి అమలు కావడం జరుగుతుండేవి. దొరల దౌర్జన్యాన్ని ఎదిరించి వారి గడీలను కూలగొట్టి వాళ్ళ ఆస్తులను, ధనాన్ని పేదలకు, ప్రజలకు పంచిపెట్టేవారు. సంగపోల్లు చేయబట్టి ప్రజల బానిస బతుకులు మారాయని, ఆడవాళ్ళు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఈ కథ ద్వారా రచయిత తెలియజేశారు.

**3. నీళ్ళెంత రుచి**

మాయమైపోతున్న మనిషితనాన్ని రక్షించే ఆదర్శంతో జనం మంచికై 'నీటిబొట్టు'కు కూడా దూరమై ఏటికి ఎదురీదుతున్న విప్లవకారుల జీవితాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తుందీ 'నీళ్లెంత రుచి' కథ. రచయిత్రి తాయమ్మ కరుణ రాసిన 'జీవితం' కథ సంపుటంలోనిది ఈ కథ.

వనజక్కా, శ్రీను, లక్ష్మిశాంత, అమీరు, విజయ, రమేశ్, మహేందర్, మమత, మల్లికార్జున్, భగత్, సుధాకర్ మొదలైనవారు విరసం ఉద్యమకారులు. మహేందర్ రాష్ట్ర కమిటి సభ్యుడు. ఇతను అలర్టుగా ఉండి, అందర్ని గమనిస్తూ ఉండేవాడు. మరొకరు డిప్యూటి కమాండర్ మమత, మహేందర్‌కు ఇద్దరు గార్డులు. ఒకరు మల్లికార్జున్ ఇంకొకరు భగత్. సుధాకర్ కమాండర్‌గా ఉద్యమంలో పనిచేసేవారు. ఎండకాలం ఎండలు ఎక్కువగా కొట్టడంతో బావులల్లో నీళ్ళు ఎండిపోయి, నీళ్ళు దొరకక వారు ఎన్నో బాధలు పడుతుండేవారు. అడవుల్లో ఎక్కడ చూసిన నీళ్ళు దొరకవని ఉన్న నీళ్ళను తల ఒక బాటిల్లో పట్టుకొని ఎవరి బాటిల్ వారు, వారి ఎమ్మటి ఉంచుకునేవారు. పోలీసులు వారిని అనుసరించి వారిమీద కాల్పులు జరగకుండా అలర్టుగా ఎప్పుడు కొంతమంది ప్రత్యేకంగా సెంట్రి డ్యూటి చెయ్యాల్సి వచ్చేది.

కామ్రేడ్స్ కి నీళ్ళు దొరకక బట్టలు అన్ని ఉప్పుపేరి అట్టలు కట్టి ఉండేవి. ఎప్పుడైన వారికి నీళ్ళు దొరికితే అక్కడే స్నానం చేసి బట్టలు ఉతుక్కునేవారు. లేకపోతే అంటే రాత్రుల్లో అడవుల్లో చెట్లపొంటి,

గుట్టలల్లో తిరుగుతుండేవారు. అక్కడేవారు నిదురపొయ్యేవారు. మరికొందరు వాళ్ళ సెంట్రి డ్యూటి వారు చేసేవారు. అన్నలకు ఎవరైన అన్నాలు వండి పంపిస్తే తినేవారు. అప్పుడప్పుడు కడుపు కూడా మార్చుకునేవారు. వారి ఎమ్మటి వండుకోవడానికి గిన్నెలు ఉన్నా, గాలి అలసిపోయి వండుకునే ఓపికలేక పొయ్యేది. ఎక్కడికి వెళ్ళిన వాటిని పట్టుకెళ్ళేవారు. ఎండ, వాన అనకుండా అడవులల్లో గూడారాలు వేసుకొని ఉద్యమంలో పనిచేస్తుండేవారు. వారికి బియ్యం అయిపోతే నూకల అన్నం కూడా వండుకొని ఇంత గొడ్డుకారం కలుపుకొని వేడివేడిది తినేవారు.

గ్రామాలల్లో రాత్రిపూట మీటింగ్ పెట్టి, ప్రజల యొక్క అవసరాలను తెలుసుకొని, వారిని అన్యాయం, దౌర్జన్యం, మోసం చేసిన పెత్తందార్లను, దొరలను ఎదిరించి, బెదిరించేవారు. ప్రజలకు అన్నలు ఎప్పుడూ అండగా నిలబడేవారు. అన్నలకు భోజనాలు ఏర్పాటు చేస్తే వారు అక్కడే తినేవారు. ప్రతి గ్రామానికి తిరిగి మీటింగ్‌లు పెట్టి వారి సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకునేవారు.

పోలీసులు ఒకసారి మావోయిస్టుల మీద కాల్పులు జరిపితే వారికి దొరకకుండా అడవిలో ఉరుకుతూ చెట్లచాటుకు, గుట్టలచాటుకు దాచుకుంటూ, తూటాలు తగలకుండా పోలీసులపై ఎదురుకాల్పులు జరుపుతూ ఉండేవారు. ఒక్కోసారి వారు చెట్లచాటుకు దాచుకునేవారు. ఎందుకంటే పోలీసుల దగ్గర ఎక్కువగా తూటాలు ఉండేవి కావు. నక్సలైట్ల దగ్గర ఎప్పుడు తూటాలు వారి వెంటే పెట్టుకునేవారు. పోలీసుల దగ్గర అయిపోగానే, మావోయిస్టులు పోలీసులపై కాల్పులు జరుపుకుంటూ ముందుకు వెళుతుండేవారు. వీరి వెంట తుపాకులు, వారి కిట్లు, ఎవరి వస్తువులు వారి వెంట ఉంచుకునేవారు. ఒకరు బియ్యం మూట, ఒకరు కంప్యూటర్ ఇంకా మొదలైన సామాన్లు కూడా తమవెంట తీసుకెళ్ళేవారు. చీకట్లో నీళ్ళు దొరకవని, సాయంత్రమే వండుకునేవారు. రాత్రివేళల్లో వండితే మంట అందరికి కనిపించి పోలీసులకు సమాచారం ఇస్తారని, తమపై కాల్పులు జరుగుతాయని అనుకునేవారు. పోలీసు ఫైరింగ్ జరిగినప్పుడుగాని అడవుల్లో వేరే ప్రాంతానికి చోటు మార్చినప్పుడు గాని దాహం వేస్తే, నీళ్ళు వారిదగ్గర లేనప్పుడు వేరేవాళ్ళు అతనికి ఇచ్చేవారు కాదు. ఎందుకంటే వారికి కూడా దాహం వేసినప్పుడు అడవుల్లో నీళ్ళు దొరకవు కాబట్టి. ఎవరోఒకరు దాహం వేసిన వ్యక్తికి బాటిల్ మూతడు నీళ్ళిస్తే వాటితోనే గొంతు తడుపుకునేవారు.

ఒకసారి రాత్రి అందరి దగ్గర నీళ్ళు అయిపోయి దాహంతో తనుకులాడుతూ ఉంటే మంచినీళ్ళు తేవడానికి కొందరు కామ్రేడ్స్ సభ్యులు వెళ్ళి చాలాసేపు రాకుండా ఉండేసరికి, మిగతావాళ్ళు బయపడుతుండేవారు. పోలీసులుగాని వారిపై కాల్పులు జరిపారని అనుకునేవారు. వారు నీళ్ళకోసం చెరువులు, బోరింగులు, బావులు ఎన్ని వెతికినాగాని నీళ్ళు దొరకక ఆకరికి ఒక లోతు బావిలోకి దిగి, చెలిమకొట్టితే నీళ్ళు రావడంతో ఆ వండ్రుమట్టి, బురద నీళ్ళను కూడా క్యాన్లలో పోసుకొని, వాటిని పట్టుకొని చీకట్లోనే నడుచుకుంటూ వారు ఉండే స్థావరానికి చేరుకునేవారు. వాళ్ళు వచ్చేదాంక వారు బయపడుతూనే ఉండేవారు. వారు తెచ్చిన నీళ్ళను గొంతు ఎండుకపోయి తాగడానికి అందరూ ఒక్కసారిగా ఎగబడుతుండే సరికి ఒక ఇద్దరు ఆ నీళ్ళను బాటిల్లో పోస్తుంటే ఒకరు వాటిని అందరికి ఇస్తుండేవారు. మొదటగా ఒక వ్యక్తి ఆ నీళ్ళను నోట్లో పోసుకునే సరికి అంతా మట్టి, ఇసుక రావడంతో ఆ నీళ్ళను వడగట్టి పోసిన కాని అట్లనే వస్తుంటే దాహంతో సచ్చేదానికన్నా ఏవో ఒక నీళ్ళు తాగితేనైనా బ్రతకవచ్చు అనుకొని దాహం వేసిన వారికి ఆనీళ్ళే దొరకడంతో వారు ఆనీళ్ళనే ఎంతో రుచిగా తాగేవారని ఈ కథ ముగుస్తుంది.

ఉద్యమంలో నక్సలైట్లు ఎన్నో బాధలు, కష్టాలు అనుభవించేవారని, ప్రజలకోసం, వారి జీవితాలనే పక్కనపెట్టి ఉద్యమంలో పాల్గొని సమాజంకోసం సేవ చేస్తుండేవారని కనీసం వారికి నీళ్ళు కూడా దొరకక ఎన్నో ఇబ్బందులు పడ్డారని రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేశారు.

**4. పిల్లలు**

విప్లవ ఉద్యమకారుల పిల్లలను కని ఇతరులకు పెంచుకోవడానికి ఇచ్చి, వారు ఉద్యమంలో కొనసాగుతుండేవారు. అలాగే ఓ తల్లి కూడా తన కూతురును ఇచ్చి, ప్రతిసారి వెల్లడం వల్ల వారు చిరాకు పడుతుంటే, ఆ తల్లి మనస్సు ఎంత బాధపడుతుందో, ఆమె పడే ఆవేదన, ఆరాటాన్ని 'పిల్లలు' కథలో రచయిత్రి తాయమ్మ కరుణ రాసిన 'జీవితం' కథా సంపుటంలో చిత్రీకరించారు.

కవిత ఉద్యమంలో పనిచేస్తుంది. పెళ్ళి అయిన కొద్దిరోజులకు ఆమెకు ప్రెగ్నెన్సీ కావడం వల్ల కనాలని అనుకుంటుంది. కాని ఎదిరించలేకపోతుంది. ఆరో నెలలో అభార్షన్ చేయించుకోవడంతో

పిండానికి రూపురేఖలన్నీ ఏర్పడతాయి. ఆ పసిగుడ్డు శరీరాన్ని చూసి ఆమె బోరున ఏడుస్తూ కూలబడిపోతుంది. 'నా కొడుకును చంపేశారు' అని ఒకటే ఏడుపు. ఆమె ఆరోగ్యం కూడా పాడవుతుంది. మళ్ళీ కొద్ది రోజులకు రెండోసారి ప్రెగ్నెన్సీ కావడంతో ఎవరు అభార్షన్ చేయించుకొమ్మని అనకపోవడంతో పాపను కంటుంది. ఒక సంవత్సరం పాపను వారి దగ్గర ఉంచుకొని, తరువాత పాపను వేరేవాళ్ళకు ఇస్తారు. పాపను తీసుకున్న దంపతులు ఇద్దరు డాక్టర్లు కావడంతో "పాపకు తల్లిదండ్రులమని మీరు ఎన్నటికీ రావద్దు. అట్లా అయితేనే పెంచుకుంటాం" (పుట:129) అని ముందుగానే వారితో అంటారు. వారు సరేనని పాపను ఇస్తారు.

పాపను కవిత భర్త ఏ ఒకటి రెండు సార్లు చూశాడో తెలియదు. కాని, ఆమె మాత్రం అడవి నుంచి బయటకు వచ్చినప్పుడు పాపను, తెలియని వ్యక్తిలా చూసి వస్తుండేది. ఆమె వెళ్ళినప్పుడు పాపను తీసుకున్నవాళ్లు చాలా ఇబ్బంది పడి, చిరాకు పడుతుండేవారు. కాని అవన్నీ నాకు తెలుసు. అయినప్పటికీ ప్రాణం ఊరుకోదు కదా! వెలుతుండేది. పాపకు వీళ్ళు తల్లిదండ్రులనే విషయం అస్సలు తెలియదు. పాప నాలుగైదేళ్ళ వయస్సున్నప్పుడు ఒకసారి చూడటానికి వెళ్ళింది కవిత. వీళ్ళు వచ్చిన చిరాకేనో... నిజంగా పాప అన్నం తిననందుకోగాని ఆమె కొట్టింది. కవిత మనసు ఎంత విలవిలలాడిందోగాని వెంటనే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఏం చేస్తుంది పాపం తిరిగి వచ్చేసింది. పాప గురించి తెలిసిన వాళ్ళు ఎవరైనా కలిస్తే చూసినంత ఆనందం ఉండేది కవితకు. ఎప్పుడెప్పుడు పాప గురించి వివరాలు సేకరించాలని, మధ్యలో ఒకసారి కలిసింది.

ఒకసారి వనజక్క, కవిత పాప దగ్గరకు వెళ్తారు. పాప కవిత ఎత్తు పెరుగుతుంది. చాలా హెల్దీగా (అందంగా, ఆరోగ్యంగా) తయారైంది. ఇంటర్ చదువుతోంది. కవితకు పాపను చూడగానే గుండెలకు అద్దుకోవాలని ప్రాణం కొట్టుకుంటుంది. కవిత తన తల్లేనని పాపకు తెలియదు కదా. వీళ్ళను చూస్తూ కాలేజికి వెళ్ళిపోయింది. వీళ్ళు కాసేపు ఉండి తర్వాత కవిత, వనజ బయటకు వచ్చేశారు. చాలా రోజులకు పాపను చూసేసరికి కవిత నీరైపోయింది. నడవలేక కూలబడిపోయింది.

ఉద్యమకారుల్లో కూడా ప్రేమ, పెండ్లీలు ఉంటాయని, పిల్లలు కూడా కంటారు. కాని, కాకపోతే పిల్లలను వేరే వాళ్ళ దగ్గర వదిలిపెట్టి, అప్పుడప్పుడు వెళ్లి చూసి వస్తుండేవారు. విప్లవకారులు సమాజంలో జరుగుతున్న దోపిడి, దౌర్జన్యాలను, అక్రమాలను, హింసలను మొదలైన వాటిని అరికట్టడంకోసం ఉద్యమంలో కొనసాతుంటారు. కావున వారు ఎప్పుడు ఎక్కడ ఉంటారో కూడా వారికే తెలియదు. కాబట్టి పిల్లలను కనకుండా కొందరు జీవిస్తారు. ఇంకొందరు పిల్లలను కని ఇతరులకు ఇచ్చి, వారిపై ప్రేమ పెట్టుకొని ఇబ్బందులు పడుతుంటారని, అందులో కవిత ఒకరని, రచయిత్రి ఈ కథ ద్వారా ఆమె పడే కన్నీటి గాథను, వేదనను వర్ణించారు.

**5. అమ్మ**

మావోయిస్టు ఉద్యమంలో బిడ్డను కోల్పోయిన తల్లి వేదనను 'అమ్మ' కథలో చూడవచ్చు. రచయిత్రి తాయమ్మ కరుణ రాసిన 'జీవితం' కథా సంపుటంలోనిది ఈ కథ.

లచ్చుమమ్మ, నర్సయ్య భార్యాభర్తలు. వీరి కుమారుడు మల్లేషు. ఒక్కగానొక్క కొడుకు కావడంచేత తల్లి గారాబంగ పెంచుతుంది. ఆమె కొడుకే సర్వస్వం అనుకుంటుంది. పదవ తరగతిలో స్కూల్ పస్టు వస్తాడు. తర్వాత ఇంటర్, డిగ్రీ, ఆ తర్వాత పి.జి.కి దూరప్రాంతంలో చదవడంవల్ల వారి మధ్య కొంత దూరం పెరిగి కలిసి ఉండే రోజులు తగ్గిపోయాయి. దాంతోపాటే అతనికి రాజకీయాల్లో ప్రవేశం పెరిగింది. ఊర్లోకి అన్నలు వస్తారని తెలినప్పటినుంచి ఎప్పుడూ వారిని అతడు కలిసిందిలేదు. పి.జి. లో చేరడంతోపాటు, రాజకీయాల ప్రవేశంలో సమాజం పట్ల అవగాహన పెరిగింది. అతడు దోపిడి, అన్యాయాల గురించి, మహిళల పరిస్థితి గురించి మాట్లాడుతుంటే తల్లి ఆశ్చర్యపోయేది. సాయంత్రం వాళ్ళ ఇంటికి చిన్న పెద్దా తేడా లేకుండా స్నేహితులు వచ్చి అతనితో మాట్లాడుతుండేవారు. కొడుకు మాటలు వింటుంటే తల్లికి 'అన్నోళ్ళు' మాట్లాడుతున్నట్లు మాట్లాడుతుండని అనుకునేది. లచ్చుమమ్మ అన్నలకు అన్నాలు పంపుతూ, అప్పుడప్పుడు మీటింగులకు పోయి వస్తుండేది. ఈ మధ్య అన్నల కంటే పోలీసులే ఊర్లల్లకు ఎక్కువగా వస్తున్నారు. ఇంకొద్ది రోజులకు 'వీడు అన్నళ్ళ కలవడు గద' అని బయపడుతుండేది. అతడు మాట్లాడే విషయాలను బట్టి అన్నల మనిషేనని ఊర్లోవారికి ఎప్పుడో అర్థమైంది. తల్లికే ఆలస్యంగా అర్థమైంది.

ఎమ్మెస్సి చివరి సంవత్సరం సదివేటప్పుడు నాలుగు నెలలవరకు ఇంటికి రాక ఓ రోజు సాయంత్రం వచ్చి, తెల్లవారే పోతానని అంటే, తల్లి కొడుకు తనకు దూరమయిండు అని అనుకుంటుంది. కొడుకుకు అన్నం పెట్టి పక్కనే కూసొని ఏమి మాట్లాడలేకపోయింది. మాట మాట్లాడితే కండ్లనీరు కట్టలు తెంచుకుంటుందని, తల్లికి అర్థమైందన్న విషయం మల్లేషుకు అర్థమైంది. అతడు మాట్లాడిన, ఆమెను మాట్లాడించిన ఏడుస్తుందని తెలుసు. తల్లిని కూడా అన్నం తినమంటే ఆమె కూడా అతనితోపాటు తింటుంది.

ఆ రాత్రి తండ్రి పడుకుంటాడు. కాని తల్లికి, కొడుకుకు నిదురపట్టక, మల్లేశ్ తల్లిని చూడడం ఇదే చివరిసారి అవుతుందని అనుకుంటాడు. కొడుకు నిదురపోలేదని తల్లి అతన్ని పిలిస్తే ఏందమ్మ అని పలుకుతాడు. నిద్రపడ్తలేదారా అని అంటుంది. దోమలు కుడుతున్నాయని అనడంతో, కొడుకు మాట మారుస్తున్నాడని అర్థమై 'నాయనా మల్లేషు, నీమీద పాణాలన్ని పెట్టుకొని పెంచుకున్నరా' అని అంటుంది. కొడుకు లేచి మంచంల కూసుంటూ, ఇప్పుడేమైందే అని అంటాడు. 'ఇంతకు ముందు పది, పదిహేను రోజులకోపాలి వచ్చేటోనివి. తర్వాత నెలకోసారి రావడం మొదలుపెట్టినవ్. అట్లట్ల ఇప్పుడు నాల్గునెల్లకు వచ్చినవ్. వచ్చి తెల్లారే పోతంటున్నవ్' అని తల్లి అంటుంది. పనుండి రాలేదమ్మ అని కొడుకు అంటే 'కొడ్కా నీవు చేస్తున్న పనులేందో, యేడికో ఆడికి అర్థమయితుందారా. అన్నలు మంచోల్లు అది జనమందరికి తెలుసు. కాని, నాకు నువ్వొక్కడివేరా మల్లేషు. నువ్వులేకపోతే నేను పాణాలతో వుండలేను' అంటూ ఇంక మాట్లాడలేక అతనికి వినిపించకుండా ఏడుస్తుంది. మల్లేషు లేసి తల్లి మంచంమీద కూసొని తల్లిని పట్టుకొని 'అమ్మా, నీ కడుపున పుట్టడం నేను చేసుకున్న భాగ్యమే. నేను యాడున్నా నీ ప్రేమ నన్ను కాపాడుతది. వీలైనప్పుడల్లా కలిసి పోత, ఉత్తరాలు రాస్తా' అని అంటాడు. తల్లికి పార్టీ గురించి అప్పటికే అర్థమవుతుంది. తల్లికి చెప్పకుండ పోదామనుకుంటే ఎక్కువగా బాధపడుతుందని ఆలోచించాడు. కొడుకు వెళ్ళిపోతున్న విషయం తల్లి పసిగట్టి 'నా కొడుక్కు ఊరంతటి కంటే ఎక్కువ తెలివుందని మురిసినరా. కాని నాకు దూరమవుతావని అనుకోలేదురా మల్లేషు. మల్లొక్కసారి ఆలోచించుకోబిడ్డ" అని ఎక్కిళ్ళను ఆపుకుంటూ అంటుంది. అమ్మ, సంక్రాంతి పండగకు వస్తలేవే" అని కొడుకు అంటే, తల్లికి కొడుకు నిర్ణయం మారదనుకొని, ఏం మాట్లాడలేదు. తల్లిని పడుకోబెట్టి తను పడుకున్నాడు. మల్లేశ్ ఉదయం తయారు అవుతుంటే తల్లి

“సంక్రాంతికి తప్పక వస్తువు కదకొడ్క” అని అపనమ్మకంగానే అడుగుతుంది. తల్లి రెండు చేతులు పట్టుకొని “తప్పకుండా వస్తమ్మ” అంటాడు. తండ్రి చేయిపట్టుకొని పండగకు వస్తానని అప్పుడు రెండురోజులు ఉంటానని, పొయ్యస్త అని చెప్పి బయటకు వెళ్ళిపోయిండు. తల్లి మాత్రం కూలికి, నాలికిపోయిన, ఎక్కడ ఎవరు కనిపించిన కొడుకు గురించే చెప్పుతుండేది. కొన్నాళ్ళకు తన ఇంట్లో లేనప్పుడు వచ్చి వెలుతున్నాడని అనుకొని ఇంటినుండి బయటకు వెళ్ళలేకపోయేది.

ప్రతి సంవత్సరం సంక్రాంతి పండక్కి కొడుకు వస్తాడేమోనని, ఇల్లంత శుభ్రం చేసి, తనకు ఇష్టమైన అరిసెలు చేయడం, కొత్తబట్టలు మేరె సత్తయ్య కాడ కుట్టియ్యడం, ఎవరికో ఒకరికి పంచడం జరుగుతుండేది, కాని ఆ తల్లి బట్టలను చూసి పండగకు కొడుకు వచ్చినట్టు తృప్తి పడుతుండేది. కొడుకు రేపు వస్తాడు అని దారెంట పోయే వారందరితో చెప్పుతుంటే, తప్పకుండా పండగకు వస్తాడు లేమ్మా బాధపడకు అని, ఆమెను ఓదార్చే మాటలు, పొగిడే మాటలు అనుకుంట జనాలు పోతున్నారు. వారి మాటలకు సంతోషంతో మురిసిపోయేది. తర్వాత బజారున పోతున్న మల్లయ్యను పిలిచి “ఓరి మల్లి నా కొడుకు పండక్కు వస్తుండురా వానికి కొత్తబట్టలు కుట్టిస్తున్న, అరిసెలు జేసిన వాని కిష్టమని” అంటుంది. తాగి ఉన్న మల్లయ్యకు అయితుందిగాని ఇంకా నా కొడుకొస్తుండు. నా కొడుకొస్తుండు అని దారెంట బోయేటోళ్ళ ప్రాణందింటవ్. ఇనీ ఇనీ ఇసుకోసుంది” అని అనగానే తన కొడుకుని సచ్చిండంటవని నోటికొచ్చిన బూతు కులాల కూసి అతని మీద కలబడి కొడుతుంటే జనాలు విడిపించిన విడవక, భర్తవచ్చి “వాడొట్టి తాగుబోతోడు. వాడనంగనే మల్లేశ్ మనల్ని వదిలి మెల్లిపోతాడే ఇడువు, ఇడువు” అని విడిపించిండు.

చివరి చూపన్న చూసుకును, శవాన్ని అన్న ఇయ్యక పాయిరి, ప్రాణాలన్ని ఆనిమీద పెట్టుకొని బతికే, ఈ బజార్న రావాల్నంటే కన్నపేగు మెలిపడ్డట్టయితది అని తలావోక మాట అనుకుంటు కండ్లోత్తుకుంట ఎవరిదారిన వాళ్ళు పోతారు. “నా కొడుకు చీమకన్న హాని జేసేటోడు కాదు. దయగల్లోడు, నల్గురి బాగును కోరుకునెటోడు. ఎవరికి కష్టమొచ్చినా తన కొచ్చిందనికుంటాడు. నా కొడుకును ఎందుకు సంపుతరు. ఎవలకేం పాపం జేసిండని సూర్యుని మొఖాన మన్నుబోస్తే, ఆళ్ళ మొఖానే పడ్తది. ఆనసుమొంటి పిల్లల్లేరా ఆని నోట్ల అగ్గిబుట్ట” అని తిడుతూ, భర్త మాటలతో

మల్లయ్యను వదిలిపెట్టినప్పటికీ తన కొడుకుని అంతమాట అంటాడా అని సాపిస్తానే ఉంది. లచ్చుమమ్మ కోపంతో ఊగిపోతూ ఏడుస్తూ.

ఉద్యమంలో ప్రాణాలు పోగొట్టుకున్న కొడుకు, పండుగకు వస్తానని చెప్పి వెళ్ళిన కొడుకు, రాకపోయేసరికి ఆ తల్లి పడే బాధను, ఆవేదనను ఎట్ల పరితపిస్తుందో, ఆకరికి పిచ్చి దానిలెక్క తయారైన విధానం రచయిత్రి పాఠకుల ముందుకు తీసుకువచ్చారు.

లచ్చుమమ్మ తన కొడుకు పుట్టినప్పటి నుంచి కళ్ళన్నీ బిడ్డ మీదే ప్రాణం కంటే మిన్నగా చూసుకుంటుంది. తల్లి కనుసన్నల్లో పెరుగుతూనే ఊరి పేద ప్రజలందరికి దగ్గరైతాడు. అందరిచేతా మంచివాడనిపించుకుంటాడు. అందరూ అతన్ని అన్నల్లో వాడే అనుకుంటారు. ప్రతి సంక్రాంతికి కొడుకు కోసం కళ్ళల్లో వత్తులు వేసుకొని ఎదురు చూసే తల్లికి నాలుగేళ్ళ క్రితమే కొడుకు దూరయ్యాడని తెలిసి గుండె పగులుతుంది. ఎందరో అమ్మల గర్భశోకమే ఈ కథావస్తువు.

**6. ఇంద్రవెల్లి**

ఆదివాసుల సభకు అన్నలు వచ్చారని, పోలీసులు కాల్పులు జరపడం వల్ల చాలామందికి దెబ్బలు తగిలి, కాళ్ళుచేతులు విరిగి, ఎంతోమంది ప్రాణాలు పోయి, హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న ఇసుర్రాయి కథే 'ఇంద్రవెల్లి' రచయిత ఎం. రత్నమాల రాసిన 'తెలంగాణ రచయిత్రుల కథలు' కథా సంకలనంలో చిత్రీకరించారు.

ఆదిలాబాద్ జిల్లా పిట్టబొంగారం, ఇంద్రవెల్లి సంతలో ఆదివాసులు జరుపుకోవాలనుకున్న సభకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో, సామూహికంగా బతికే గిరిపుత్రికలు ప్రభుత్వం అంటే అడవి తల్లిలా కాచి కాపాడేదేనని అనుకున్నారు. అందుకే గిరిజన రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో నిరాయుధంగా కదిలారు. సభకు వస్తున్న, వచ్చిన ఆదివాసీలు నాయమైన డిమాండ్లు వినడానికి ఇష్టపడని పాలకవర్గాలు అచ్చు బ్రిటీష్ వలసవాద కాలంలో జరిగిన జలియన్ వాలాబాగ్‌లో లాగా చెట్లెక్కి కొమ్మలల్ల దాసుకొని పోలీసుకు దొంగచాటుగా ధనాధన్ కాల్పులు మొదలు పెట్టడంతో, బెదిరిపోయి అయోమయం స్థితిలో ఎక్కడ బుల్లెట్లు దిగుతున్నాయో కూడా చూసుకోలేని పరిస్థితుల్లో ప్రజలు పరుగులు తీస్తూ, అరుపులు, పొడబొబ్బలు, ఏడుపులు రక్తం మడుగులో గిలగిల

కొట్టుకుంటున్న శరీరాలు, తెగిపడ్డ కాళ్ళు చేతులు, మొండాలు, వేలజనం ఎటువంటి హెచ్చరిక లేకుండా మనదేశ పోలీసులే రేసుకుక్కల్లా ఏటాడి వెంటాడి వారిని కాలుస్తారు. ఇంకా చాలా ఊర్లల్లో తుడుంగొట్టి నాలుగు ఐదు రోజుల ముందు నించే ప్రచారం చేయడంతో జనం అన్ని ప్రాంతాల నుంచి నెత్తిన రొట్టెలు మూటలు ఎత్తుకొని, భుజాన బస్తపేగు చుట్టిన అనప బుర్రల నీళ్ళు నింపుకొని పెద్దఎత్తున తరలివచ్చారు. ముందుగానే ప్లాన్లు వేసుకున్న ప్రభుత్వం జిల్లా ఎస్.పి. ఆధ్వర్యంలో ఇంత ఘోరం జరుగుతుంది.

కాల్పులో ఇసుర్రాయి దొరకడంతో కాళ్ళలో కాల్చుకొని పోయారు పోలీసులు. రెండుకాళ్ళు పోయి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటుంది. మొకాలి కింద బెత్తెడు దాకా మాత్రమే ఆమెకు కాళ్ళు ఉన్నాయి. రెండువాదాలు తెగిపోయి కాళ్ళకు నెత్తురోడుతూ బ్యాండేజీలు ఉన్నాయి. ఉక్కు కరిగించి పోతపోసినట్టు నల్లతి విగ్రహం, కాళ్ళమీద నుంచి నడుము దాక దుప్పటి, చేతులకు బేడీలు వేసి వాటికి ఇనుప గొలుసులు వేసి మంచం కొడుకు కట్టేసారు.

పిట్టబొంగారం గ్రామానికి చెందిన తోడిసెం ఇసుబాయికి గోండీభాష తప్ప మరో భాష కూడా రాదు. ఇంద్రవెల్లి సంత తప్ప జిల్లా దాటి ఎరుగని ఆమెకు రెండుకాళ్ళు కూడా లేకున్నా, ఎక్కడి కథ పారిపోతుందని బందిస్తారు. పోలీసులను బందోబస్తు పెట్టారు. ఆమెను చూడ్డానికి హక్కుల సంఘాల వాళ్ళు వెళ్ళినా పోలీసులు కలవనీయటంలేదు. ఆమె పెద్ద పెద్ద కళ్లతో వచ్చిపొయ్యేవాళ్ళను ఆశ్చర్యంగా చూస్తోంది. “పక్కనే స్టూళ్ళమీద ఇద్దరు ఆడ కానిస్టేబుళ్ళున్నారు. ఇసుర్రాయి పిల్లలేమో పదిహేనేళ్ళ మొగపిల్లాడు, పన్నేండ్ల ఆడపిల్ల మంచంపక్కన నేలమీద కూసున్నారు. ఫ్యాను గాలికి కాళ్ళమీద దుప్పటి పక్కకు పోయింది. మోకాలు కింద బెత్తెడున్న మొండి కాళ్ళకు చుట్టిన బ్యాండేజీ నెత్తుటితో తడిసి ఎర్రగుంది. బొట్లు బొట్లుగా బసగారినట్టు నెత్తురు కారుతుంటే ఇస్రూబాయి బిడ్డ లేచి బట్టతో అద్ది ఆమెకు నీళ్ళు తాపుతుంది. ఆ బిడ్డ నెత్తికి సమరైనా లేదు. చింపిరి జుట్టుతోనే ఉంటుంది.” (పేజి: 147)

ఈ కథలో సర్కార్ ప్రభుత్వం ఆదివాసుల మీటింగుకు అనుమతించి, వారిపై కాల్పులు దొంగచాటుగా జరపడం చాలా దారుణం ఎంతోమంది ప్రాణాలు పోయి, కాల్లు చేతులు విరుగుతాయి. ఇసుబాయిని కాళ్ళలో కాల్చడంవల్ల రెండు కాళ్ల మొకాలుకు కింద రెండు ఇంచుల

మందం తీసి వేయడం, హాస్పటల్ బెడ్ మీద ఉన్న ఆమెకు రెండు చేతులకు బేడీలు వేసి మంచానికి కట్టడం. చాలా దారుణమని, ఆమె కాళ్ళకు కట్టిన బ్యాండేజీల నుంచి రక్తాన్ని కూడా తూడుచుకోలేక చేతులను కట్టేసి, పక్కన ఇద్దరు కానిస్టేబుళ్ళు ఉండడం, ఆమె ఆ స్థితిలో కూడా ఎట్లైనా పారిపోదామనుకోవడం, ఆమె పిల్లలు తెలిసితెలియని వయస్సులో కూతురు ఆమె కాళ్ళకు కారుతుంటే గుడ్డతోటి అద్దడం, చాలా బాధాకరంగా చేశారని రచయిత ఈ కథలో తెలియజేశాడు.

## 4.9. బహుజన కథలు

అగ్రవర్ణ, ఆధిపత్య వర్గాలవారు కాకుండా పీడనకు గురయ్యే బి.సిలు, దళితులు, మైనారిటీలు మొదలైనవారిని బహుజనులు అని అంటున్నాం. అటువంటి వారి గురించిన సాహిత్యమే బహుజన సాహిత్యం. ఇందులో వారి జీవన విధానం, సమస్యలు, ఐక్యత మొదలైన వాటి గురించి ఉంటుంది. నల్లగొండ జిల్లా కథల్లో బహుజనులకు సంబంధించిన కథలు ఉన్నాయి. వాటిని ఈ విభాగంలో చర్చించాను.

### 1. లతీఫ్ మియా శాస్త్రం

ఒక ముస్లిం వ్యక్తి తన కూతురు పెండ్లి చేయడానికి డబ్బులు లేక, దావత్‌కి యాట మాంసం తేలేని పరిస్థితిలో (బీఫ్) ఆవుమాంసం తెచ్చిపెట్టిన విధానం 'లతీఫ్ మియా శాస్త్రం' కథలో రచయిత స్కైబాబ రాసిన 'అలాయిబలాయి' బహుజన కథా సంపుటంలో వివరించాడు.

లతీఫ్ మియా లారి డ్రైవర్. రెండుమూడు రోజులు సరిగ్గా నిదురలేకపోవడం వల్ల కన్ను అంటుకొని లారిని చెట్టుకు గుద్దడంతో కాలు, చేయి ఇరుగుతుంది. కాలుకు ఇనుపరాడ్డు వేయడంవల్ల డాక్టర్ లారి తోలవద్దని చెప్పడంతో ఊర్లో చిన్న సైకిల్ షాపు పెట్టుకొని పంచర్లు చేసుకుంటు జీవనం కొనసాగిస్తాడు. ఇతనికి ముగ్గురు ఆడపిల్లలు. పెద్ద కూతురికి పెండ్లి కుదురుతుంది. కట్నం ఇవ్వడానికి డబ్బులు లేక పడరాని కష్టాలు పడి అప్పుచేసి పెండ్లి చేయడానికి సిద్ధమవుతాడు. ఊర్లో అందరితోటి కలిసిమెలిసి ఉండడంతో బిడ్డ పెండ్లికి అందరికి చెప్పుతాడు. పెండ్లి దావత్ జరుగుతుంటుంది. ఊర్లో ఇతర కులపోల్లు వద్దామనుకుంటారు. కాని రాలేక పిల్లలతో కట్నం పైసలు పంపిస్తారు. ముస్లింలు,

మాదిగవాళ్ళు మాత్రమే వస్తారు. కట్నాలు మాత్రం ఊరి అందరియి పడుతాయి. గాని దావత్‌కు మాత్రం రాలేకపోతారు. పదిమంది సూదరోల్ల, మాలపోరగాల్లు వస్తే వారికి సాటుంగ కూసపెట్టి వారు తినిపోయోల చూస్తాడు.

ఆకరికి స్నేహితులు వస్తే వారితోటి దావత్‌ల లతీఫ్ మియా కూర్చొని తిని లేస్తున్న సమయంలో గొల్లోల్ల శ్రీను వస్తే కూర్చొమ్మని అంటాడు. నేను తినటానికి రాలేదు రా అని లతీఫ్ మియా చెయ్యి పట్టుకొని "ఏం లేదుర...నువ్వు మంచోనివి మాలెక్కనే బీదోనివి, బిడ్డపెండ్లి కనాకష్టాలు పడి చేస్తున్నవని వొండిచ్చినవ్. నువ్వు ఇంత పని చేస్తవనుకోలేదుర...నాకేం మంచిగనిపియ్యలేదు" (పుట: 54) అని జేబుల నుంచి రెండు వందలు తీసిండు. లతీఫ్ మియా బాధపడుతూ ఏదో అనబోతే సైది (స్నేహితుడు) లేసి అతన్ని ఆగమని శ్రీనుతోటి నాలుగు రోజుల నుండి అందర్ని పిలిశాడు. మీ ఇంటికి కూడా పోయిండు. నువ్వులేవని ఊరికి ఎల్లినావని ఇంట్లోవాల్లు చెప్పితే నేను, లింగడు, యాది సత్తి కలిసినం. లతీఫ్ మియా ఆందోళన పడుతుంటే, ఖర్సులు ఎంత అయితదో లెక్క వేశాము. ముస్లిం ఇంట్ల దావతంటే అందరు వస్తారు. ఎంతని పెడుతాడు మాంసం? యాట అది కూడా లెక్కలు వేశాం. మాంసం తక్కువేస్తే ఊరోళ్ళు ఊకోరు, అప్పటికీ కట్నం పైసలు తక్కువ పడితే తలాకొంత ఇచ్చాము. ఇగ వాళ్ళ వల్లకాక నీ తాహతుకు దగ్గది పెట్టమన్నాము. కాని లతీఫ్ మియా వెనుకముందు ఆడి 'అరేయ్! నేను ఎన్నో దావత్‌లల్ల మీ ఇండ్లల్లకు ఒచ్చి తిన్నరా! నాకోసం హలాల్ చేయించి మరీ నన్ను దావత్‌కు పిలిషేది మీతోపాటు మనూరోల్లంతా...ఆల్లెవరు రాకుంట దావత్ చెయ్యాల్నంటే నాకు పానం దరిస్తలేదుర" (పుట:55) అని కన్నీళ్ళు పెట్టుకుండు. వాన్ని సమజాయించి, ఎల్లని దానికి మల్లసారి చూసుకుందాం లెమ్మని ధైర్యంగా ఉండాలని చెప్పినాం. "మన లింగడు మా ఇంట్ల పెండ్లికి యాటను మైసమ్మకు బలిస్తే నువ్వు తినకుంటనే పోతివి గదరా. ఐనా నువ్వేమన్న అనుకున్నవా గట్టనే అందరు అర్థం జేస్కుంటరు." (పుట:55) అని చెప్పినాం. వాడు నిమ్మల పడ్డంక ఎట్ల చేస్తే కలిసివస్తదని లెక్కవేశాం. ఊరంతా రారు కాబట్టి మాంసం తక్కువ బడుతదని మందుల దావత్‌కు సరిపోను తీసి మిగతాది అమ్మితే కొంత అప్పు తీర్చవచ్చని అనుకున్నాం.

పిలగానోల్లను ఒప్పించడానికి పడరాని పాట్లు పడ్డారు. లతీఫ్ తోడు లింగడు అంగడికి పోయి ఆవు దూడను ఇంటికి తెస్తే, మనోల్లంత పరిష్కాలాడిరి. జాన్‌రెడ్డి తాత అయితే "ఏంద్రా లతీపూ! ముస్లిం ఇండ్లల్ల దావత్ అంటే పానం లేషొస్తది గదనోయ్, అసొంటిది, మా రెడ్డోళ్ళకు, ఎలమోళ్ళకు, సూదరోళ్ళకు తునకలు లేకుంట జేస్తున్నవేంది పిలగా" (పుట: 55) అని అంటే ఏంచేస్తం తాతా! నా బతుక్కు గిదే శాతనైతది అన్నాడట. చిన్నబుచ్చుకొని, ఇగ చెప్పు, వాన్నేం చేయమంటావో అని ఆగిండు సైది. శ్రీను కదిలిపోయిండు. లతీఫ్ మియా చేతుల పట్టుకొని ఏమనుకుకోనురా, నీ కెల్లింది నువు పెట్టినవు నేనే ఏదో అనేషినగాని, పోనియ్యిరా, మనుసుల పెట్టుకోకు అని నావంతు కట్నం అని మల్లొక రెండొందలు తీసి మొత్తం నాలుగు వందలు చేతిల పెట్టిండు.

ఈ కథ రెండు విషయాలతో కొనసాగుతుంది. ఒకటి స్నేహానికి, రెండు కులానికి సంబంధించిన విషయాలు ఉన్నాయి. తోటి స్నేహితుడు కష్టాల్లో ఉన్నాడని ఆదుకోవడం జరుగుతుంది. ఇంక కుల, మతాలను ఎత్తి చూపిస్తుంది. సమాజంలో అతనికి ఉన్నది, లేనిది, ఎల్లింది, ఎల్లనిది చూస్తలేరని, సమాజంలో మార్పు రావాలని, కులం మతం అనేవి మాసిపోవాలని, అందరు కలిసిమెలిసి జీవించాలని రచయిత ఈ కథలో తెలియజేశాడు.

**2. ఖబర్**

కన్న తల్లిదండ్రులకు సమాధి కట్టించడానికి, చెల్లెండ్ల పెండ్లి చేయడానికి దుబాయ్ వెళ్ళి డబ్బులు తీసుకొని వచ్చేసరికి ఏం జరిగిందో 'ఖబర్' కథలో రచయిత స్కైబాబ రాసిన 'అలాయి బలాయి' బహుజన కథా సంపుటంలోనిది ఈ కథ.

సలీమ్, కరీమా భార్యాభర్తలు. వీరి పిల్లలు కూతురు సోఫియా, కుమారుడు ఛోటూ. సలీమ్‌కి ఇద్దరు చెల్లెండ్లు. తల్లిదండ్రులు మరణిస్తారు. వారికి సమాధులు కట్టడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో, చెల్లెండ్ల పెండ్లి చేయాలని దుబాయ్ వెళ్ళి డబ్బులు తీసుకొని ఐదు సంవత్సరాల తర్వాత తన స్వంత ఊరు నల్లగొండకు వస్తాడు. తెల్లారి సలీమ్ భార్య, పిల్లలను, చెల్లెండ్లను షాప్‌కు తీసుకెళ్ళి కొత్తబట్టలు తీసుకుంటాడు. సాయంత్రం బడోంకి ఈద్ (పెద్దల పండుగ) వాళ్ళ అమ్మ

ఉండగా చేసేది. ఈసారి వీళ్ళు కూడా చేస్తారు. మరుసటి రోజు బక్రీద్ పండుగ. ఉదయం అందరు స్నానాలు చేసి కొత్తబట్టలు వేసుకుంటారు. సలీమ్ తన కూతురు సోఫియాను తీసుకొని బైకుమీద కూర్చొబెట్టుకొని ఈద్గాకి (నమాజ్ చేసే స్థలానికి) చేరుకుంటారు. ఇమామ్ సామ్ ఈద్గా బాగోగుల గురించి, సమాజంలోని మార్పుల గురించి చెప్తాడు. గంటలో నమాజ్, తక్బీర్, దూవా అయిపోతుంది. సుట్టాలు, బస్తీవాల్లు కలిస్తే ఈద్ ముబారక్ చెప్పి అలాయి బలాయి (కౌగిలింత) తీసుకొని బయలుదేరి వెళ్తుంటే, కూతురు తండ్రిని ఎక్కడికి వెలుతున్నం అడిగితే, తాత, నాయనమ్మల సమాధుల దగ్గరికి అంటాడు. మధ్యలో విడిపూలు తీసుకొని, ఖబ్రస్తాన్ (సమాధుల స్థలం) కాడికి వెళ్తారు. సలీమ్ లోపలికి వెళ్ళి వాళ్ళ అమ్మ నాన్నల సమాధులను చూస్తే కనిపించవు. చుట్టు కడీలు కట్టి ఉన్న సమాధులే కనిపిస్తాయి. అంతా తిరిగి చూసిందు కనిపించలే, చెమటలు పట్టినాయి. ఏం చేయాల్నో అర్థంకాక, చుట్టూ చూసిందు, అందులో ఒక మూలకు గుడిసే కనిపిస్తే, సమాధులు తవ్వేవాళ్ళు ఎవరైనా ఉన్నారేమోనని అక్కడికి వెళ్ళి, ఒక పెద్దాయనను అడుగుతాడు. ఇక్కడ మా అమ్మ, నాన్నల మట్టి సమాధులు ఉండే అవి కనిపిస్తలేవని. అతడు ఇక్కడికి వచ్చి చూసుకోక ఎన్ని సంవత్సరాలు అవుతుందని అంటాడు. సలీమ్ ఐదు సంవత్సరాలు అని అంటాడు. అవునా అని తల్చుకొని ఏమో నాయనా...నాకైతే తెలియదు. మల్లొకసారి చూడమంటాడు. సలీమ్‌కు అనుమానం వచ్చి సూదు పెద్దాయనా! పండుగ రోజు అబద్దం చెప్పొద్దు ఏమైనాయో చెప్పు అని అడిగిండు దీనంగా.

“అయ్యో! అబద్ధమెందుకు చెప్తనయా...రోజు రోజు సచ్చేటోళ్ళు ఎక్కువవుతుంటిరి. ఖబ్రస్తాన్ మాత్రం పెరుగుతలేదాయె...పైంగ ఖబ్జాలు పెట్టి సుట్టు మూసుకొస్తున్నరాయె...వందలు వేల గజాలు సంపాదించుకుంటున్నోళ్ళకు పేదోల్లకు ఆరారు గజాల జాగ వదుల్తానికి పానం దరిస్తలేదు. దేని దేని కోసమో కొట్లాడుతుంటారు. కాలం చేసినోల్లను పూడ్చి పెట్టడానికి గింత జాగ కావాల్నని మాత్రం ఎవరూ గడ్ బడ్ చేస్తలేరైరి. ఎవరన్న చనిపోంగనే వొచ్చి జర మంచి సోటు సూసి ఖబర్ తవ్వమంటరు గని ఆ మంచి సోటు ఎంతకని ఉంటది బేటా! నువ్వు చెప్పు! నువ్వు సూసినకాన్నుంచి ఈ ఖబ్రస్తాన్ ఇంచు పెరిగిందా చెప్పు..మరి రోజు రోజు సచ్చెటోల్లను యాడ బొందపెట్టం? కొత్త స్థలమేదీ సూపెడతలేరాయె. ఇగ దాంతోటి ఎవరు పట్టించుకోకుంట మట్టిల కలుస్తున్న సమాధులున్న సోటుల్నె మల్ల కొత్త సమాధులు తవ్వుతున్నం. మరి అట్లేమన్న మీ వాళ్ళ సమాధులు తవ్వేసినమేమో

బేటా! మాఫ్‌కర్నా బాబ!" అన్నడు ఆ పెద్దాయన జెరసేపు ఉక్రోషంగా... అంతల్నె జరంత దీనంగ..(పుట: 70). సమీమ్‌కు కండ్లల్ల నీల్లు తిరిగి, ఏం చెయ్యాల్నో తోచక స్తబ్దుగ నిలబడిపోయిండు. సోఫియా ఏమైంది (పప్పా) నాయ్న , తాత, నాయనమ్మల సమాధులు ఏమైనయి అని అడుగుతున్నది.

ఆధునికత, అభివృద్ధి రెండూ డబుల్ ఎడ్జ్‌డ్ వెపన్‌లా మానవీయతపై దాడి చేస్తున్నాయి. బతికున్నప్పుడు ఎలాగూ ఆధిపత్యాహంకారం మనిషితనం ఉనికిని ప్రశ్నిస్తున్నాయి. ఉనికిని రద్దు చేస్తున్నాయి. చనిపోయిన తర్వాత ఖబర్ (సమాధి)ని కూడా అభివృద్ధి వదలక పోవడమనేది రచయిత ఈ కథలో తెలియజేశాడు.

**3. జమ్మి**

దళిత కులాల మధ్య వున్న అసంబద్ధ అనైక్యతను 'జమ్మి' కథ ప్రతిబింబించింది. రచయిత స్కైబాబ రాసిన 'అలాయి బలాయి' బహుజన కథా సంపుటంలోనిది ఈ కథ.

సైదులు, నిర్మల ఇద్దరు క్లాస్‌మెంట్స్ కావడంతో ప్రేమించుకుంటారు. వీళ్ళవి పక్కపక్క గ్రామాలు. వేరు వేరు కులాలు. సైదులు మాదిగ, నిర్మల మాల. వీరి ప్రేమ వ్యవహారం ఊర్లో అందరికి తెలుస్తుంది. నిర్మల వాళ్ల తల్లిదండ్రులకు చెప్తుంది. వాళ్ళు ఒప్పుకోక వేరే పెండ్లి చేయడానికి సిద్ధమవుతారు. నిర్మల సైదులుని కలిసి, ఇద్దరం ఎక్కడికన్న ఎల్లిపోదాం అని అతని కాల్లు, చేతులు పట్టుకుంటుంది. కాని అతడు తల్లిదండ్రుల గురించి ఆలోచిస్తాడు. ఒక్కడే కొడుకు కావడంతో వాళ్ళు తట్టుకోలేరని, మనం వెల్లిపోతే మీవాళ్ళు వచ్చి ఇంటిమీద గోలగోల చేస్తారని, అయన్ని ఆలోచించవద్దా! అని అంటాడు. "నిర్మల బాగా ఏడ్చి ఆకరికి చేతగానోనివి ఎందుకు ప్రేమించినావని అతన్ని నిలదీస్తుంది. ఆడపిల్ల వచ్చి లేసి పోదామన్న కదులతలేవన్ని, నువ్వు మొగోనివేనని, తిట్టుకుంట తర్వాత నువ్వే బాదపడుతావని, ఇగ నేను వెళ్ళిపోతున్నానని మల్ల కనబడను నీ ఇష్టం." (పుట:78) అని వెళ్ళుతుంది.

ఇద్దరికి వేరువేరుగా పెండ్లీలు అవుతాయి. సైదులు వరంగల్లో ఉంటున్నాడు. వాళ్ళు కలవక మూడు సంవత్సరాలు అవుతుంది. సైదులు వస్తే కలుద్దామని ప్రతి దసరా పండుగకు నిర్మల జమ్మిచెట్టు దగ్గరకు వెళ్ళేది. కాని అతడు రాకపోయెసరికి బాధపడుతుండేది. మూడు సంవత్సరాల తర్వాత సైదులు దసరాకు నిర్మలను కలువాలని ఊరికి వస్తాడు. ఊర్లో అందరితోటి కలిసి సాయంత్రం దసరా అయిపోగానే జమ్మిచెట్టుకాడికి వెళ్ళడానికి నిర్మల ఊరివాళ్ళు, సైదులు ఊరివాళ్ళు కలిసి 'జమ్మిచెట్టు' కాడికి వెలుతారు. పూజ అయిపోగానే జమ్మి ఆకు తీసుకొని అందరూ అలాయి బలాయి తీసుకుంటారు. నిర్మల అక్కడికి వస్తుందని, కలిసి మాట్లాడుకోవాలని, వెతికితే కనిపించకపోయేసరికి ఆమె ఫ్రెండ్ జానమ్మని అడుగుతాడు. ప్రతి సంవత్సరం నీకోసం జమ్మి చెట్టుకాడికి నువ్వు వస్తావని వచ్చేది. నీవు రాకపోయేసరికి ఈసారి రానని చెప్పిందని చెప్పడంతో బాధపడతాడు.

అంటరానోళ్ళని ఎందుకు అంటరు. రెండు కులాలు ఉండేది ఊరి బయటనే కదా. మరి అందుల గూడ నిర్మలను పెండ్లి చేసుకుంటానికి నాది పనికిరాని కులమెందుకైందని, మాలోల్ల కన్నా మాదిగోల్లం తక్కువెందుకైనమని ఈ తేడాలు ఇంకెపుడు పోతాయని మొత్తం వ్యవస్థనే నిలదీసేటట్టు రచయిత సైదులుతో చెప్పించడం ఈ కథలో మరో విశేషం.

మానవ సంబంధాలన్నీ కుల సంబంధాలే అని, అన్ని బంధాల్లో కుల, మత బంధాలే అత్యంత బలమైనవి అని చెప్పే కథ ఇది. సమాజం మారాలని కుల పట్టింపులు, కులబేధాలు ఉండకుండా అందరు సమానంగా ఉంటేనే సమాజం బాగుపడుతుంది.

**4. ఏక్ ముసాఫర్ దోరాస్తే**

ఉద్యమాలు, సభలు, సమావేషాలు, పుస్తకాలు అంటూ పెండ్లికాక ముందు చురుకుగా ఉద్యమంలో పాల్గొనేవాడు. పెండ్లి అయినంక ఉద్యోగం చేస్తూ కూడా అతనికి అవే జ్ఞాపకాలు మొదలవుతూ రాత్రి సమయంలో నిదరపట్టకపోవడం, ఇగ ఉద్యమాలకు దూరమవుతానేమోనని

ఉద్యోగానికి రాజీనామా చేసిన విధానం 'ఏక్ ముసాఫర్ దోరాస్తే' కథలో రచయిత స్కైబాబ రాసిన 'అలాయి బలాయి' బహుజన కథా సంపుటిలోనిది.

సమీర్, జుబెదా భార్యాభర్తలు. సమీర్ ఉద్యోగం సిన్సియర్‌గా చేస్తూ, మధ్య మధ్యలో ఉద్యమాలు, సభలు, సమావేశాలు, పుస్తకాలు అని మీటింగులల్లో పాల్గొంటుండేవాడు. ఒకసారి యజమాని ఉద్యోగమో, ఉద్యమమో ఏదో ఒకటి నిర్ణయించుకొమ్మని అంటాడు. ఆఫీస్ నుండి సాయంత్రం తొందరగా ఇంటికి వస్తాడు. రాత్రి అతనికి నిద్రపట్టకుంటే పక్కరూంలో సెల్ఫ్ లో పాత డైరీలు పెండ్లికాకముందు రాసుకున్నవి చూసి చదువుతుంటే అతనికి పాత జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి. ఇట్లనే ఉద్యోగం చేస్తుంటుంటే ఇక ఉద్యమాలకు దూరమైపోతానేమోనని తలచుకుంటూ రాత్రి చాలాసేపటికి నిద్రపోతాడు. సలీమ్ రాత్రి నిద్రపోలేదని అతని భార్య ఉదయం తొమ్మిదిగంటలకు లేపడంతో, ఆఫీస్‌కు లేటుగా వస్తానని ఫోన్ చేసి చెప్తాడు. వెళ్ళేసరికి గంట లేటవుతుంది. పక్కన ఉన్న కొలీగ్ సలీమ్‌తోటి సార్ రమ్మన్నాడు, రెండుసార్లు వచ్చాడని చెప్పడంతో, అతడు ఒక లెటరు సిస్టంలో టైప్ చేసి, ప్రింట్ తీసుకొని సుదర్శన్ సార్ రూమ్‌కి వెళ్లగానే, సమీర్‌కు కంగ్రాట్స్ చెప్పి నీ సిన్సియారిటీకి మెచ్చి ఎండిగారు నీకు ప్రమోషన్ ఇవ్వమన్నారని, ప్రమోషన్ లెటర్ చేతిలో పెట్టబోయిండు. కాని సమీర్ ఉద్యోగానికి రిజైన్ చేస్తున్నానని, రిజిగ్నేషన్ లెటర్ అని అంటారు. సార్‌కి ఏమి అర్థంకాక, పరేషానై మరి ఏంచేస్తావని అడుగుతాడు.

అవతల నాకోసం ఎదురుచూస్తున్నవాళ్ళు లక్షలాది మంది ఉన్నారు సర్...నేను, నాలాంటివారు చేయాల్సిన పనులు చాలా ఉన్నాయ్ సర్. అవి అందరూ చేయలేరు. చేయగలిగిన నాలాంటివారు కూడా ఇలా సుఖంగా ఉద్యోగాల్లో సెటిల్ అయిపోవడం న్యాయం కాదనిపించింది సర్. ఎనీ హౌ థ్యాంక్యూ ఫర్ యువర్ కో ఆపరేషన్...సమీర్ అంటూ చేయి చాపాడు.(పుట: 107). సుదర్శన్ సార్, సమీర్‌ని కూర్చోమని, ఆలోచించుకొమ్మని, తప్పు చేస్తున్నావేమోనని అంటాడు. కాని అతడు నా నిర్ణయం కరెక్టే సర్...కళ్ళముందే అన్యాయాలు, దోపిడీ, దౌర్జన్యం కొనసాగుతుంటే ఏమీ పట్టనట్టు, అదసలు మన సమస్యే కానట్టు కూసోలేకపోతున్న సర్...కోట్లాది కళ్ళు కారుతున్న కన్నీళ్ళతో వెంటాడుతుంటాయ్ సర్..లక్షలాది ఆర్తనాదాలు మనసును నిలువనీయవు... గుజరాత్‌లు,

ఖైర్లాంజీలు... కొందమాల్‌లు... కశ్మీర్లు... ఇరాక్‌లు... తెలంగాణలు... నేను చేయాల్సింది బయట ఎంతో ఉంది... నేను మాత్రమే చేయగల పనులు షానా ఉన్నయ్. ఒక్క నాకోసం, ఒక్క నాభార్యకోసం, ఒక్క నా కుటుంబం కోసం ఈ ఉద్యోగంలో, ఈ నాల్గు గోడలమధ్య కూరుకుపోలేను సార్... బైట ఎందరు అభాగ్యులైన నేనులున్నారో మీకు తెలుసు.. బైట ఎందరు విధవలైన తల్లులున్నారో మీకు తెలుసు...బైట పూట గడవక బతుకీడుస్తున్న కుటుంబాలెన్నో మీకు తెలుసు. అనాథలైన పిల్లలెందరో మీకు తెలుసు... ఆ నిద్ర పట్టని కళ్ళన్నీ నన్ను కూడా నిద్రపోనివ్వడం లేదు సార్... శాంతిలేని ఆ బతుకులన్నీ నాగ్గూడ శాంతి లేకుండా చేస్తున్నాయ్ సార్.." (పుట:108) అని చెపుతుంటే అతని గొంతు పూడుకపోయింది.

సుదర్శన్ సార్ ఆశ్చర్యపోయి, కొద్దిసేపటికి దగ్గరికి వచ్చి అలాయి బలాయి ఇచ్చి కంటతడి పెట్టుకుంటే సమీర్‌కు కూడా దుఃఖం బయటకు తన్నుకొస్తుంది. సార్ అతడిని ఓదార్చుకుంటు "రేపటి నుంచి ఐ మిస్ యూ యర్" అని బాధగా అంటాడు. కొద్దిసేపటికి కళ్ళు తుడుచుకొని షేక్‌హాండ్ ఇచ్చి బయటకు వచ్చి సెక్షన్‌లో తన డెస్క్ దగ్గర కాగితాలన్నీ సర్దుకున్నాడు. ఆఫీసంతా తన చుట్టు మూగింది. సమీర్ లాంటి ఉద్యమకారులు ఉంటే దేశం బాగుపడుతుందని రచయిత ఈ కథలో తెలియజేశాడు.

లతీఫ్ మియాశాస్త్రం, ఖబర్, జమ్మి, ఏక్ ముసాఫిర్ దోరాస్తే కథల్లో బహుజనులైన బి.సి., దళిత, మైనారీలకు సంబంధించిన అంశాలను స్పృశించబడ్డాయి. వాటిని ఈ ఉపవిభాగంలో చర్చించాను.

### 4.10. దళిత కథలు

సమాజంలో వివిధ సామాజిక సమూహాలున్నాయి. అందులో సమాజానికి దూరంగా విసిరివేయబడి, అవమానించబడి, అంటరానివారుగా చూడబడుతున్నవారు ఉన్నారు. నీచంగా చూడబడుతున్న వారిని మనం దళితులు అంటున్నాం. మన దేశంలో ఎస్.సి లను దళితులుగా అంటున్నాం. అటువంటి వారి గురించి వచ్చిందే దళిత సాహిత్యం. నల్లగొండ జిల్లా కథల్లో దళితుల గురించినవి ఉన్నాయి. వాటిని నా పరిశోధనలో భాగంగా ఇక్కడ చర్చించాను.

**1. లవ్ ఇన్‌ఫెక్షన్**

ఒక దళిత యువకుడు, ధనవంతుల యువతి ఇద్దరు ప్రేమించుకుంటారు. ఆ యువతి అన్నలు ఆ యువకుడిని కిడ్నాప్ చేసి చంపి కాల్వలో పడేసిన విధానమే 'లవ్ ఇన్‌ఫెక్షన్' కథ. రచయిత్రి జిల్లెళ్ళ అనసూయ. 'తెలంగాణ బతుకు చిత్రాలు' కథా సంపుటంలోనిది ఈ కథ.

మురళి తల్లిదండ్రులు చనిపోవడంతో వాళ్ళ అమ్మమ్మ పెంచి పెద్ద చేస్తుంది. అట్టడుగు సామాజిక వర్గానికి (దళిత) చెందినవారు. మురళి ఇంటర్ మీడియట్ హెచ్‌ఇసి సెకండియర్ చదువుతూ, అదే క్లాస్‌లో సునీత అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. సునీత తల్లిదండ్రులు బాగా ఉన్నవారు. ఒక రోజు క్లాస్ రూమ్‌లో డోర్ వేసుకొని మధ్యాహ్నం లంచి చేస్తుంటారు. ఇద్దరిని విన్సెంట్ ఫిజికల్ డైరెక్టర్ సార్ చూస్తాడు. ప్రెయర్ టైంలో ఇద్దరు లేకపోయేసరికి కోపం వస్తుంది. మురళి, సునీత మరో నాలుగైదు సార్లు సార్ కంట్లో పడతారు. పిల్లలందరు వారిని 'ప్రేమ పక్షులు' లవ్ బర్డ్స్ అంటుండేవారు. ఒకరోజు విన్సెంట్ సార్ మురళిని పిలిచి, ఎలా చదువుతున్నావని, అడిగి ఫస్ట్ ఇయర్స్ లో బాగా చదివావు. సెకండియర్‌లో పర్సెంటేజ్ తగ్గుతున్నది. చదువు పాడు చేసుకోకు, ప్రేమదోమ అని తిరగకు. ఇదంతా పక్కకు బెట్టి చదువుమీద మనసు పెట్టమని చెప్పుతాడు. మరునాడు ఇద్దరు క్లాసులో కనిపించకపోతే పిల్లలను అడిగితే ఫస్ట్ పిరియడ్ మురళి వచ్చాడని, సునీత రాకపోయేసరికి వెళ్లిపోయిండని చెప్తారు. ఆ తర్వాత మురళి ఫ్రెండ్స్ వచ్చి, సునీతను ఇంట్లో కాలేజీ బందుచేయించారని, అది తెలిసి వీడు కూడా కాలేజీకి వస్తలేడంటూ, సునీత వాళ్ళన్న మురళితోని మాట్లాడతానని పిలిపించాడట సార్ అని అంటారు. హఠాత్తుగా మురళి కనిపించకపోయేసరికి వాళ్ళ అమ్మమ్మ కులపెద్దలతో కలిసి వచ్చి పోలీస్ స్టేషన్‌లో తన మనవడ్ని సునీత అనే అమ్మాయి తరపు వాళ్ళే కిడ్నాప్ చేసి ఉంటారని కేసు పెడుతుంది. పోలీసులు సునీత తల్లిదండ్రులను, అన్నలను, మురళి స్నేహితులను పిలిచి ఇంటరాగేట్ చేస్తారు. మురళి స్నేహితులు ఇదంతా సునీత అన్నలపనే సార్ వాడ్ని కిడ్నాప్ చేసి కొడ్తున్నరట అని అంటారు. పోలీసులు సునీతను నిజంగా నీవు మురళి ప్రేమించుకున్నారా, మీ ఇంట్లో మీ ప్రేమ విషయం తెలుసా! ఓసారి ఫోన్ మాట్లాడటం చూసి నన్నే తిట్టి కాలేజికి పోవద్దన్నారు. మరి నీవు చెప్పకపోవావా మురళి విషయం." చెబితే మా అన్నలు

మురళిని కొడుతారేమోనని చెప్పలేదు సార్..." సునీత మాటల్లో భయం, అమాయకత్వం వారికి తెలుస్తుంది.

నాలుగోరోజు విన్సెంట్ దగ్గరికి ఓ స్టూడెంట్ వచ్చి మురళి చనిపోయిండు సార్ అంటే ఎలా జరిగిందని అడుగుతాడు. సునీత అన్నలే వాణ్ణి తీసుకుపోయి కొట్టి కాల్వల పడేసినారని, నిన్న సాయంత్రం రిజర్వాయర్‌లో శవం దొరికిందంటని, ఎవరో చూసి చెప్పితే పోలీసులు వెళ్ళి బయటకు తీశారటని, చూసి వచ్చిన పిల్లలు...శవం గుర్తుపట్టలేనంతగా కుళ్ళిపోయి ఉందని, తలమీద పెద్దబొబ్బ ఉందని, మొహం అంతా కప్పలు, చేపలు పీక్కుతిని భయంకరంగా ఉందని చెప్పారు. ఎస్.సి విద్యార్థి సంఘాలు శవాన్ని తీసుకెళ్ళి సునీత ఇంటిముందు పెట్టి దర్నాలు, శవయాత్ర చేశారు. దళిత విద్యార్థి హత్యను ఖండించారు. దోషులను శిక్షించాలని అంటారు. సునీత కుటుంబ సభ్యులు అప్పటికే పరారీలో ఉన్నారు. పోలీసులు దోషులను పట్టుకునేందుకు తమ ప్రయత్నం తాము చేస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తేగాని నిజాలు బయటకు రావన్నారు. మురళి ఫోన్‌లో మాట్లాడిన అందర్ని పోలీస్ స్టేషన్‌కి పిలిచి ఇంటరాగేట్ చేస్తారు. ఎస్.పిగారు కాలేజీకి వచ్చి టీనేజి లవ్ ఎంత ప్రమాదకరమో అది పిల్లల జీవితాలను ఎంత నాశనం చేస్తుందో గంటలు గంటలు ఉపన్యాసాలు ఇచ్చారు. ఆర్డీవో మురళి కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించారు. విద్యార్థి సంఘాలు మురళికి సంతాప సభలు పెట్టాయి. మురళిని అమర ప్రేమికుడిగా కీర్తిస్తూ కవితలు చదివారు. పాటలు పాడుతారు. నెలరోజుల హడావిడి తర్వాత విషయం పాతబడింది. ఈతకని వెళ్ళి కాలుజారి కాలువలో పడి చనిపోయాడని పోలీసులు నిర్ధారించి, కేసు మూసివేశారు.

ఈ కథలో ఇంటర్ చదివే మురళి, సునీతలు ప్రేమించుకుంటారు. కాని సునీత అన్నలు మురళిని కొట్టి చంపేస్తారు, అతని కులం గోత్రం వేరే కాబట్టి. ఆ ఇద్దరు క్లాసులో మంచి విద్యార్థులు. వారి ప్రేమ ఓ మంచి పిల్లవాడి జీవితాన్ని అంతం చేసింది. పాత రోజుల్లో కన్నా ఇప్పుడు ప్రేమను కులం ఎక్కువగా శాసించడం చూస్తున్నాం. కులం వెర్రిలో కుటుంబ సభ్యులే హంతకులుగా మారి ప్రేమికులు తన సొంత కూతురో కొడుకో, చెల్లో అయినా క్రూరాతిక్రూరంగా వారి జీవితాలను అంతం

చెయ్యడం చూస్తున్నాం. ఇదంతా చూస్తుంటే మనం ఏ కాలంలోకి పోతున్నామో అని ఆశ్చర్యం కలుగక మానదని రచయిత ఈ కథలో తెలియజేశారు.

**2. బత్తెం**

దళిత విద్యార్థి డప్పుకొట్టడం రాకున్నా, తమవంతు వచ్చినప్పుడు తండ్రి లేకపోవడంతో, పాలోల్ల దగ్గర మాటొస్తదని తల్లి బాధపడుతుంటే కొడుకు వెళ్ళి డప్పుకొట్టి కూలి తెచ్చిన విధానాన్ని గాదె వెంకటేశం 'బత్తెం' కథలో వివరించాడు.

తల్లిదండ్రులకు తమ సంతానం చేదోడువాదోడుగా ఉంటే వారి ఆనందం అంతా ఇంతా కాదు. రాములు కొడుకు ఎంకటి. దళిత (మాదిగ) కుటుంబంలో జన్మిస్తాడు. ఇంజనీరింగ్ చదువుకుంటున్నాడు. తండ్రి పశువులను కొని, సంతలో వ్యాపారం చేస్తుంటాడు. ఒకరోజు తండ్రి అంగడికి వెళ్తాడు. సాలోల్ల ఇంట్లో పెండ్లి. డప్పు వంతు వాల్లదే కావడంతో, అమ్మాయిని పెండ్లి పిల్లను చేసేటప్పుడు డప్పుకొట్టి రావాలి. వాళ్ళు ఇచ్చిన బత్తెం (కూలి) తీసుకొని రావాలి. తల్లి పాలోల్లతోని మాటపోతే మల్ల రాదని బాధపడుతుంటే ఎంకటి పోతాను అంటాడు. తల్లికి ఇష్టం ఉండదు. చదువుకున్న కొడుకు డప్పు కొడితే ఇన్‌సట్ అవుతుందని అంటుంది. కాని ఎంకట్ వెళ్లి డప్పుకొట్టి బత్తెం (చింతపండు, బియ్యం, కారంపొడి, ఉల్లిగడ్డ ఒక్కరోజుకు ఒక కుటుంబానికి సరిపోను) తెచ్చి తల్లికి ఇస్తాడు. ఆ సందర్భంలో ఎంకటి తండ్రి మొఖం(సింగిడయ్యింది) ఇంద్రధనస్సు వోలే వెలిగిపోతుంది.

"గర్వంతో నిండిన ఆనాటి ఆనందాన్ని ఇప్పుడు అతడు ఉద్యోగం చేస్తూ, ఇంటి బాధ్యతను మొత్తం నెత్తికెత్తుకున్నప్పుడు కూడా పొందలేదు" అని ఎంకటి పాత్రచేత చెప్పించాడు రచయిత. ఈ కథలో డప్పు కొట్టడం వల్ల ఇజ్జత్ ఏమీ పోదని, పుట్టిందే దళిత పుట్టుక కాబట్టి డప్పుకొట్టవచ్చని అంటాడు. వెంకటేశం ఉద్యోగం చేసి తల్లిదండ్రులకు మంచి పేరు కూడా తెచ్చాడని ఈ కథ ద్వారా తెలియజేశాడు.

**3. బుగాడ**

ఒక యువకుడు అన్నలతో ఏమైనా సంబంధం ఉన్నదేమో అన్న అపోహలతో పోలీసులు గ్రామాలలో తమకు సహకరించే వేగులతో మాటువేసి ఎప్పటికప్పుడు ఆ యువకున్ని గమనిస్తూ అనుమానించే విధానం 'బుగాడ' కథలో రచయిత భూతం ముత్యాలు వివరించాడు.

ఊర్లో దళిత యువకుడు భార్యా పిల్లలతో ఉంటున్నాడు. ఇతనికి ఊర్లో మంచి పేరుంది. పట్నంలో చదువుకున్నాడని, అతనికి అన్నలతో సంబంధం ఉండేదేమోనని అనుమానంతో అతని పట్టుకోవడానికి బుడ్డెయ్య అనే ఎదురింటి వ్యక్తిని కాపలా పెడతాడు. అబ్బయ్య అనే పోలీసు. అతని ఇంటికి ఎవరు వస్తున్నారు, ఎవరు పోతున్నారని, చుట్టుపక్కల జాడ తీసుకుంటున్నాడు. ఆ యువకుడు పోలీసోల్ల మీద కాంప్లెంట్ రాసి జిల్లా పెద్దసారుకు పంపిస్తాడు. ఒకసారి అతనికి దిమ్మ తిరిగి, తిక్కలేసి మందులు మింగి హాస్పటల్లో చేరి సచ్చి బతికి బయటపడతాడు. ఒకరోజు అబ్బయ్య జందారు అతన్ని తీసుకొని పెద్దసారు కాడికి వెళ్తాడు. ఆ సారు అతనితో లోపల గంటసేపు మాట్లాడతాడు. అతడు నాకు మామూలు బొమ్మలు దించడం, పేర్లు రాసుడు వొస్తదని చెప్పుతాడు. అందుకు పెద్దసారు "నువ్వేమన్న ఆళ్ళకు బ్యానర్లు రాశ్నవా ఏంది? ఏదన్న ఇంటే నాతో చెప్పు, నీకేం భయంలేదు. ఆళ్ళు, వీళ్ళు నిన్ను బయపెట్నట్టు రాశ్నావ్. ఎవరి పనులు వాళ్ళకుంటయ్ గద బాబు. అట్లాని నీవెందుకనుకుంటవ్ నీలోనివ్వే ఎంద్కు మదన పడ్తవ్ ఏన్గు పోతుంటే కుక్కలు మొర్గిన మన్కొని పట్టించుకోకు. ఇగో ఈ తారీకు నుంచి నిన్నెవరన్న ఏలెత్తి సూపినా, బెద్రించినా, ఇది మా నెంబరు దాన్కి పోన్ జెయ్యి. పిల్లలు గల్లోన్వి. మల్లోసారి మందులేస్కోకు"(పుట:155) అని మంచిగుండని చాయ్ తాపించి పంపిస్తాడు.

అబ్బయ్య జందారు ఆ యువకున్ని ఇంటికి తీసుకొస్తు మధ్యలో తలా ఓ బీరు తాగినంక అతడు "నాకే పిచ్చిలేదుగని జరంత ఆడోల్ల పిచ్చని" చెప్పిండని అతన్ని పట్టుకోవడానికి ఊర్లో అందరితోని గోడలు దునుకుతున్నాడని ఒక వదంతి (బుగాడ–పుకారు) లేపుతాడు. ఒకరోజు రాత్రి బుడ్డయ్యను అతని ఇంటికి ఎవరు వస్తున్నారు, పోతున్నారని కనిపెట్టి ఫోన్ చేయమని కాపలా పెట్టాడు. కాని అతడు రాత్రి మూత్రానికి కూడా బయటకు వెళ్లడు, లేవడు. అట్లనే పడుకుంటాడు.

జందారు పోలీసు మధ్యమధ్యలో బుడ్డయ్యకు పోన్ చేయడం, బైకుమీద వచ్చి బుడ్డయ్యను అడిగితే లేవలేదని చెప్పడంతో, జందారు అతడు లేసి బయటకు వస్తే అతన్ని కాల్చి ఎన్‌కౌంటర్ చేసి ప్రమోషన్ పొందాలని చూస్తాడు. కాని ఆ రాత్రి యువకుడు లేవకపోవడం, బుడ్డయ్య తెల్లారిదాక కాపలా కాస్తాడు.

ఇలా ఎంతోమంది పోలీసుల చేతుల్లో అమాయకులు వివక్షకు, దయనీయస్థితికి గురవుతున్నారనే మీమాంస కలగక మానదని రచయిత ఈ కథలో తెలియజేశాడు.

**4. పంపకాలు**

ఒక కాపాయనకు పెండ్లి అయి పిల్లలు ఉన్నగాని, తన పక్క చెలకలో ఒక దళిత యువతిని మోసం చేసి, కడుపు చేసి, ఊర్లో నుండి పట్నం పారిపోవడంతో ఆ యువతి తండ్రి పడే బాధను 'పంపకాలు' కథలో రచయిత పి. చిన్నయ్య వర్ణించాడు. ఈ కథ 'అరుణతార' పత్రికలో (ఏప్రిల్-జూన్. 2010) ప్రచురితమైంది.

పెంటయ్య తన పెద్ద కూతురికి తక్కువ కట్నమని తనమేనళ్ళుడికి ఇచ్చి పెండ్లి చేస్తాడు. ఆ అమ్మాయి పెండ్లి అయిన నెలరోజులకే భర్త ఎడ్డోడని అతన్ని వదిలేసి తల్లిగారింటికి వస్తుంది. అప్పటినుండి ఇంటి దగ్గరనే ఉంటుంది. కాపోల్ల జంగారెడ్డి చెలక, పెంటయ్య చెలక పక్కపక్కన ఉండటంతో పెంటయ్య కూతురు రోజు పశువులను తోలకపోతుండేది. జంగారెడ్డి ఆమెకు ఏమి ఇచ్చిండో, ఏ ఆశ సూపెట్టిండోగాని, లొంగదీసుకుంటాడు. ఆమెకు నాలుగోనెల కడుపు రావడంతో తండ్రికి తెలుస్తుంది. సరే పోనీ వాని ఇంటికి పంపుదామనుకుంటే అతనికి పెండ్లి అయి పెండ్లాం పిల్లలు ఉంటారు. ఏమి చేయాలనో తండ్రికి అర్థం కావటం లేదు. జంగారెడ్డికి ఈ విషయం తెలిసి హైదరాబాదుకు పారిపోతాడు. జంగారెడ్డి బంధువులొచ్చి పెంటయ్యను కూతురికి యాభైవేలు బ్యాంకుల ఏస్తామని బతిమిలాడుతుంటాడు. పెంటయ్య కూతురు మాత్రం అతనితోనే ఉంటానంటుంది. పెంటయ్య తన బిడ్డను "ఎడ్డోనికిచ్చి అట్ల ఆగం చేస్తిని, కాపోడు అట్ల ఆగం చేస్తే, ఈ బిడ్డ ఏమో ఆనితోనే ఉంటానంటే, కాపోడు ఏలుకుంటాడో లేదో బిడ్డను" (పుట: 61) అని, పోలీస్ స్టేషన్‌ల జంగారెడ్డి మీద కేసు పెడదామనుకుంటాడు. కాని కేసు పెడితే తేలుతదా తమ్మిని, తిమ్మిని చేస్తారు పోలీసులు. అప్పటి కాపోల్లు పోయి వాళ్ళ కులపోడు ఎం.పితో పోలీసులకు ఫోన్ చేయించుకున్నారని తెలుస్తుంది. ఇగ ఏం చేయాలో తెలియక పెంటయ్య బాధపడుతుంటాడు.

సమాజంలో ఎక్కడ చూసినా (ధనవంతులు) ధనికులు మాత్రం దళితులను మోసం చేస్తూనే ఉంటున్నారు. అలాగే ఈ కథలో కూడా కాపోళ్ళ జంగారెడ్డి ధనికుడు, పెంటయ్య అనే దళితుని బిడ్డను మోసం చేసి, ఆమె కడుపు రావడంతో హైదరాబాదు పారిపోతాడు. పెంటయ్య తన కూతురికి అతనికి తోలుదామంటే పెండ్లాం పిల్లలు ఉండటానికి, కేసు పెడదామంటే పైన అధికారులు, డబ్బు ఉండేనని, ఏం చేయాలనో తెలియక బాధపడతాడు. ఇలా సమాజంలో అనేకచోట్ల, ప్రతి విషయంలోను అగ్రవర్ణాల చేతిలో దళితులు బలవుతున్నారని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

**5. పాలపిట్ట పాట**

తెలంగాణలో బతుకమ్మ వచ్చిందంటే చాలు, తెలంగాణ ఆడబిడ్డలంతా ఆడిపాడుకుంటారు. కాని దళిత జాతి ఆడబిడ్డలను ఆడనివ్వరు. కనీసం బతుకమ్మను తాకనివ్వరు. ఒక దళిత జాతిబిడ్డ దొరసాని ఇంట్లో ముట్టుకుందామనుకుంటే ఏమైందో, ఆ రాత్రి ఆ బిడ్డ ఎట్లా చెరువుల పడి మరణించిందో పాలపిట్టలు ఎందుకు పాటలు పాడాయో పాలపిట్టల పాట కథలో రచయిత పి.చంద్రశేఖర్ విశ్లేషించాడు. ఈ కథ 'నమస్తే తెలంగాణ బతుకమ్మ పత్రికలో (11 అక్టోబర్, 2015) ప్రచురించబడింది.

మైసయ్య, యల్లమ్మ భార్యాభర్తలు. వీరి కూతురు బతుకమ్మ. భార్య, భర్తలు దొర దగ్గర జీతం ఉంటారు. బతుకమ్మ పండగ వస్తుంది. పండగ రోజు ఉదయమే మైసమ్మ, యల్లమ్మ బతుకమ్మ అడవికి వెళ్ళి పూలను కోస్తారు. అమ్మ, నాన్న వేరేపని మీద వెళితే బతుకమ్మ పూలను సాపలో పోస్తుంది. దొరసాని స్నానం చేసి వచ్చి, బతుకమ్మను పేర్చి ఏదో పనిమీద ఇంట్లోకి వెళ్ళిపోగానే, బతుకమ్మ వచ్చి ఆ పేర్చిన బతుకమ్మను ఒక్కసారి తాకాలనిపించి పట్టుకుందామనేసరికి కేకలు వేస్తూ దొరసాని ఉరికివచ్చి 'ఓసి దొంగముండా...అంటరాని ముండా బతుకమ్మను పట్టుకున్నావే' అని తిడుతూ, కొడుతూ ఉంటే, పక్క ఇంటి దొరసాని వచ్చి "కడజాతి ముండా...ఎంత ధైర్యమే బతుకమ్మను ముట్టుకుంటావా...? చూస్తావేంది వదినా ఇంకో నాలుగేయ్" అని అంటుంది. ఇంతలో బతుకమ్మ తల్లి యల్లమ్మ వస్తే దొరసాని మండిపడి "ఎన్నిసార్లు చెప్పానే దీన్ని పనికి తీసుకురావద్దని, చూడు ముండ' అని బిడ్డనీ, తల్లినీ తిడుతుంది. కోపంతో తల్లికూడా బతుకమ్మను కొడుతుంది. దొరోరి బతుకమ్మను మాదిగోళ్ళ మైసయ్య బిడ్డ బతుకమ్మ ముట్టుకుందట అని ఊరంతా తెలుస్తుంది. దొర కూడా మైసయ్యను తిడుతాడు. గూడెం వాళ్ళు బతుకమ్మను నానా మాటలు అన్నగాని అవి ఏమి

పట్టించుకోదు. దొరసాని, వాళ్ళ అమ్మ, నాన్న కొట్టారని ఆమెకు కోపం లేదు. దొరసాని కొడితే కొట్టింది కాని... ఇంకొక్క నిమిషం ఆలస్యంగా వచ్చి ఉంటే బాగుండు. బతుకమ్మను తనివితీరా పట్టుకునే దాన్ని అందమైన బతుకమ్మను పట్టుకోవాలనే ఆశ తీరకపాయె...ఎట్లా? బతుకమ్మ ఆడాలన్న కోరిక తీరెదెట్లా...? అని ఆమెకు నిదురపట్టడం లేదు.

ఎట్లయిన బతుకమ్మ ఆడాలే అని చీకట్లోనే గూడెం దాటి అర్ధరాత్రి అమావాస్య చీకటిలో బతుకమ్మ ఆడే గౌరమ్మ దగ్గరకు చేరింది. కాని బతుకమ్మ లేదు. చీకట్లో ఎట్లా పూలు తెంపాలి, నేనే బతుకమ్మను, ఇంకో బతుకమ్మ ఎందుకని, బతుకమ్మ గౌరమ్మకు చేతులెత్తి మొక్కి 'అమ్మ గౌరమ్మ తల్లి నీ బిడ్డను నాతప్పు కాయి తల్లి' అని వేడుకొని, పాట పాడుతూ చప్పట్లు కొట్టుకుంటూ గౌరమ్మ చుట్టూ తిరుగుతుంది. ఎవరైనా తనతో పాట పాడితే బాగుండు అని అటు ఇటు చూస్తే జమ్మి చెట్టుమీద పాలపిట్ట మౌనంగా చూస్తుంటే "పాలపిట్ట పాలపిట్టా... నాతోపాటు బతుకమ్మ ఆడవా..." అంటే నరేనని, లోకంలోని పాలపిట్టలన్నింటిని తీసుకురమ్మని తీతువుతో చెప్పింది. మళ్ళీ పాట అందుకుంది. బతుకమ్మతోపాటు పాలపిట్ట కూడా గొంతు కలిపింది. గౌరమ్మ కూడా నోరారా పాటలు పాడుతుంది. చీకటి కూడా గొంతు కలిపింది. ఈలోగా పాలపిట్టలన్ని వచ్చి పాడాయి, ఆడాయి. చుక్కలన్ని పులకరించినై, ఎంతసేపు ఆడిందో...తరతరాలుగా బతుకమ్మ ఆడని (దళిత) కడజాతి ఆడ బిడ్డలందరి తరపునా బతుకమ్మ ఒక్కతే ఆకలి తీరా ఆడీ, ఆడీ అలిసిపోయి, తన ఆట అయిపోయింది. ఇక మిగిలింది బతుకమ్మను చెరువులో కలపాలె. తనను తానే ఓ బతుకమ్మను చేసుకుంది. మెల్లగా చెరువులోకి దిగింది. ముందురోజు ఆడిన బతుకమ్మ, చెరువులో తంగేడు పూలు నీళ్ళలో తలతల మెరుస్తున్నాయి. అట్లనే మెల్లగా చెరువు మధ్యలోకి లోతుకు పోయింది. బతుకమ్మ ఆ పువ్వులో ఒక పువ్వులా కలిసిపోయింది. బతుకమ్మను చుక్కలు, పాలపిట్టలు వెతికినాయి. భూమి గుండె ఒక్కసారిగా తల్లడిల్లి, ఆకాశం బోరున విలపించింది. ఆ మూడోరోజు వర్షానికి చెరువులు, వాగులు, వంకలు పొంగి పొర్లినై. బతుకమ్మకోసం చెట్టు పుట్టా దేవులాడారు. చెరువులో బతుకమ్మ మధ్య కనిపించింది. ఆ చెరువు పక్కనే బొంద తీసి సమాధి చేశారు. బతుకమ్మ చెరువులకు ఎందుకు పోయిందో ఎవరికి తెలియదు. పాలపిట్టలకు తప్ప. మల్లి బతుకమ్మ పండగ వచ్చింది. ఇప్పుడు బతుకమ్మ లేదు. కాని బతుకమ్మ సమాధి మీది తంగేడు చెట్టు మొలిచింది. ఆ పూలనే ఆడబిడ్డలు బతుకమ్మ ఆడుతున్నారు. బతుకమ్మ లాటకు దూరంగా ఉన్న కడజాతి బిడ్డలు బతకమ్మను ఎత్తుకోవాలని ఆశ మెరుస్తుంది.

ఇప్పుడు బతుకమ్మ ఎవరికి గుర్తుకు లేదు. ఒక పాలపిట్టకు తప్ప ఆ పాలపిట్ట ఒకతే బతుకమ్మ పాట పాడుతుందని ఈ కథ ముగుస్తుంది.

ఈ కథలో సమాజంలో చాలా వరకు దొరల పాలేరులుగా, జీతగాళ్ళుగా దళితులే ఎక్కువశాతం పని చేస్తుంటారు. పనులను వారితోటే దొరలు చేయిస్తారు. బతుకమ్మ పండగ నాడు పూలుకోసుకొస్తుంటారు. దొరగాని, దొరసాని గాని అడవికి వెళ్ళి బతుకమ్మ పూలు కోసుకొని రారు. అదే దళితులు తెచ్చిన పూలను వారు బతుకమ్మను చేస్తారు కదా! అది తప్పు ఎందుకు కాదు. తయారు చేసి బతుకమ్మను దళితులు ముట్టుకుంటే తప్ప, తప్పు ఎందుకు అయితది. ఆ పూలు తెచ్చిందే వారుకదా! అయితే దళితులు బతుకమ్మ ఆడకూడదా! చాలా ఊర్లల్లో దళిత జాతిని పక్కన పెడతారు. వాళ్ళు మీలాగా మనుషులు కాదా! కథలో ఒక దళిత బిడ్డ బతుకమ్మ, బతుకమ్మ ముట్టుకుంటే దొరసాని తనకు ఇష్టమొచ్చినట్లు కొట్టి, తిడుతుంది. ఆ బతుకమ్మ తల్లి యల్లమ్మను కూడా తిడుతుంది. దొర, తండ్రి మైసయ్యను తిడుతాడు. ఎందుకో ఈ చిన్ని బతుకమ్మకు, బతుకమ్మ ఆడాలని, దానిని ఒక్కసారి హత్తుకోవాలనిపించి ముట్టుకుందామనుకునేసరికి దొరసాని అలా చేస్తుంది. దొరసాని, తల్లి, దండ్రి ముగ్గురు కొట్టినా, అయినా పర్వాలేదని బతుకమ్మ ఆడాలనుకుంటుంది. ఆ రాత్రి అమాస్య చీకట్లో గూడెం నుండి బయలుదేరి చెరువు దగ్గర గౌరమ్మ కాడికిపోయి ఆడి పాడుతుంది. ఆమెతోపాటు పాల పిట్టలు, గౌరమ్మ, గౌరమ్మతోపాటు ఆ చీకటి కూడా గొంతు కలిపి పాడుతుంది. చివరకు బతుకమ్మ చెరువులో, ఆ ముందు రోజు ఆడి చెరువులో వడిలిని తంగేడు పూలు నీళ్ళమీద తేలుతుంటాయి. ఈ బతుకమ్మ చెరువు మధ్యలోకి పోయి ఆ తంగేడు పూలలో తాను ఒక పువ్వు అవుతుంది. ఇలా పాలపిట్టలు కూడా బతుకమ్మతో ఆడిపాడినాయని రచయిత తెలియజేశాడు.

**6. అంటరాని బతుకమ్మ**

తెలంగాణలో ఉద్యమాలల్లో, మీటింగులలో బతుకమ్మలను పేర్చి కులమత బేధాలు లేకుండా అందరు ఆడి పాడుతారు. కాని గ్రామాలల్లోకి వచ్చేసరికి కులాలను ఎత్తి చూపుతారు. సద్దుల బతుకమ్మ రోజు ఓ దళిత మహిళ బతుకమ్మను ఎత్తుకపోయి ఇతర కులపోల్ల స్నేహితుల దగ్గర దించబోతుండగా ఆమెను అవమానపరిచిన విధానాన్ని రచయిత చిన్నయ్య 'అంటరాని బతుకమ్మ'

కథలో విశ్లేషించాడు. ఈ కథ 'ఆంధ్రజ్యోతి పత్రికలో ఆదివారం 18 అక్టోబర్, 2015న ప్రచురించబడింది.

నరేష్ పద్మ భార్యా భర్తలు. పద్మ వాళ్ళ ఊర్లోనే గ్రామీణ బ్యాంక్ మిత్రగా పనిచేస్తుంటుంది. మహిళా సంఘాలకు లోన్ ఇప్పించడం, తిరిగి కట్టించడం, వాటికవసరమైన ఓచర్సు రాయడం, సలహాలివ్వడం చేస్తుంది. దాంతో ఊర్లోని మహిళలు అంతా బాగా పరిచయమవుతారు. పైగా అందరితో కలుపుగోలుగా కలుపుకొని పోతుంది. పద్మకు అందరూ తనను మంచిగానే గౌరవిస్తున్నట్టనిపించేది. ఉద్యమ సమయంలో బతుకమ్మలను, బోనాలను పెట్టి అన్ని కులపోల్లు ఒక దగ్గర కలిసి ఆడిపాడేవారు. పద్మపాటలు బాగా పాడుతుండేది. తెలంగాణ పార్టీలకు ఆమె గొంతు కావాల్సి వచ్చిందని, వాళ్ళతో ఊరు ఊరు మీటింగులకు తిరుగుతుండేది. సద్దుల బతుకమ్మ రోజున మీటింగులకు పోయి పోయి కులపోళ్ళతోనే ఆడాలనే గుర్తులేకుండా పోయింది. మీటింగులకు బతుకమ్మలను మా ఇంట్లోనే పేరుస్తుంటిమి గదా! సరిత, లక్ష్మి గూడా బతుకమ్మను ఎట్లా పేర్చాలో నేర్చుకున్నారు కదా! ఆ స్నేహంతో సరిత దగ్గరకు పోయి ఒకరోజు ముందుగాలనే పద్మ కూడా వాళ్ళతో వస్తానని చెప్పుతుంది. కాని వాళ్ళు ఏమీ మాట్లాడలేదు.

సాయంత్రం బతుకమ్మలను తీసుకొని ఊరి మధ్యకు పోవాలంటే ఆ వాడకట్టోళ్ళందరూ పద్మ ఇంటిముందు నుంచే పోవాలి. పోయే ముందు సరిత, లక్ష్మి చెప్తారు కదా అని అనుకుంటుంది. అప్పటికి వాళ్ళ ఇంటికి ఒకటి రెండు సార్లు పోయి వస్తుంది. వాళ్ళు ఏమీ మాట్లాడలేదు. గాని సరిత వాళ్ళ అత్త గుణుగుతుంది. పండగ సందడిలో పద్మ పట్టించుకోలేదు. చీకటి పడుతుంది. బతుకమ్మను ఎత్తుకొని బయటకు వచ్చింది. వాడకట్టు వాళ్ళు ఒకర్ని చూసి ఒకరు బతుకమ్మలు ఎత్తుకుంటారు. సరిత వాళ్ళింటికి పోయి చూస్తే ఇంట్లో ఎవరు లేరు. ఇప్పుడే పోయారని ఎవరో వెనకాల అనే సరికి గబగబా నడుచుకుంటూ గుంపు దగ్గరికి చేరే సరికి అందరూ ఊరి మధ్యకు చేరుకుంటారు.

ఎప్పటిలాగే ఎవరి ఆడ్డలల్ల వాళ్ళు బతుకమ్మలను దించుతున్నారు. అప్పటికే కోమటోళ్ళు, కాపోళ్ళు ఓ అడ్డ దగ్గర బతుకమ్మ ఆడటానికి సిద్దంగా ఉంటారు. పద్మపోయి సరిత, లక్ష్మి బతుకమ్మల పక్కనే దించబోయింది. పక్కనే ఉన్న సరిత వాళ్ల అత్త 'ఏంది పిల్ల ఈడ దించుతున్నవు? ఏందత్త అట్లంటున్నవు, ఆడెందుకు? మీ వాళ్లదగ్గరకు పోయి ఆడు. ఈడ ఆడితే తప్పేంది అత్త? తప్పుగాదా! ఎప్పుడు లేంది ఊర్ల కొత్త పద్ధతి తీసుకొస్తున్నవు కులమాచారాలుండొద్దా? సిరి నీకుంటే

వుండొచ్చుగాని, నీ దగ్గరే పెట్టుకో" (పుట: 27. ఆదివారం, ఆంధ్రజ్యోతి 18 అక్టోబర్ 2015) అని ఆమె అనేసరికి పద్మకు నోట మాట రాకుండా నెత్తిలున్న బతుకమ్మను అట్లనే నేలకు కొట్టి పోదామనుకుంటుంది. కాని అంతలోనే సరిత దగ్గరికొచ్చి ప్లీజు పద్మ నీవు ఈడ బతుకమ్మను పెడితే వీళ్ళు ఆడరు. పోయి మీ కులపోళ్ళ దగ్గర ఆడు. నెమ్మదిగా బతిమిలాడినట్లు బాధతో అనేసరికి సరిత గూడా ఇట్ల అనుడేంది? లేసిన దగ్గరనుంచి ఇంట్లకొచ్చి కష్టసుఖాలు చెప్పుకునేటోళ్ళు తిని పోయేటోళ్ళు, కూరలు ఏసుకపోయెటోళ్ళు అనుకొని బాధపడుతుంది. అందరూ పద్మవైపే చూస్తున్నరు. సిగ్గుతో నెమ్మదిగా కులపోళ్ళ అడ్డ దగ్గరకు పోయింది. ఇగ ఎట్ల ఆడిందో పాడిందోగాని అందరికంటే ముందుగాలనే చెరువులో వదిలేసి ఇంటికి వస్తుంది.

ఈ కథలో పండుగలన్నీ సామూహిక సంబరాలే. అయినప్పటికీ అవన్నీ కులాల వారీగా చేసుకొని సంబరపడాల్సిందే. పట్టణాల్లో ఇది కనిపించదుగాని పల్లెల్లో కులవివక్ష ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మను జాతీయ పండుగగా ప్రకటించడంతో ఎన్నడూ ఆడనివాళ్ళు కూడా బతుకమ్మ ఆడుతున్నారు. రోడ్డుమీద అందరు కలిసి బతుకమ్మ ఆడటం ఒక ఉద్యమ అవసరం, అలాగే ఊళ్ళల్లో ఆడదామంటే ఎలా కుదురుతుంది? తన అవసరాల కోసం పద్మ చుట్టూ తిరిగిన బిసి కులాల వాళ్ళే చివరకు ఆమెది 'అంటరాని బతుకమ్మ' గా దూరంగా పెట్టినప్పుడు ఆమె పడిన వేదన వర్ణనాతీతంగా ఉంటుందని రచయిత అటు పాఠకులకు, ఇటు సమాజానికి తెలియజేయడం జరిగింది.

లవ్ ఇన్‌ఫెక్షన్, బత్తెం, బుగాడ, పంపకాలు, పాలపిట్ట కథ, అంటరాని బతుకమ్మ వంటి కథల్లో దళితులు అగ్రవర్ణాల వారి చేతుల్లో ఎలా నలిగిపోయి అవమానించబడ్డారో, వారి సమస్యలు, బాధలు మొదలైన విషయాలు స్పృశించబడ్డాయి. దళితుల తరపున రచయితలో వీటిల్లో రచించారు.

### 4.11. మైనారిటీ కథలు

సమాజంలో రకరకాల మనుషులు, మనుషుల సమూహాలు ఉంటాయి. అందులో ప్రధానంగా వివిధ రకాల మతాలు, కులాలు మొదలైనవి. అందులో అల్పసఖ్యాక వర్గాల ప్రజలు ఉంటారు. అది మత, కుల పరంగా ఏవిధంగానైనా ఉండవచ్చు. అటువంటి వారిని మనం మైనారిటీ ప్రజలు అంటున్నాం. అందులో ప్రధానంగా ముస్లిం, క్రిష్టియన్, భౌద్ధం, జైనం మొదలైన మతాల ప్రజలను

మన దేశంలో మైనారిటీలను గుర్తిస్తున్నాం. వారు అనుభవించే కష్టాలు, సమస్యలు మొదలైన వాటి గురించి చర్చించే సాహిత్యం వివిధ ప్రక్రియల్లో వస్తోంది. అందులో నల్లగొండ కథల్లో అటువంటి కథలు ఉన్నాయి. వాటిని ఇక్కడ చర్చించాను.

**1. బిల్లి**

పప్పు ఫాసిజం యింట్ల పెరిగే పిల్లికి మాంసం పెట్టినందుకు యింటిపైన ముస్లిమ్ యువతిని, తిన్న పిల్లిని యింత హింస పెడ్తారో ఎంత కౄరంగా అమానవీయంగా ఉంటారో రచయిత్రి 'బిల్లి' కథలో షాజాహానా వివరించింది.

రెహానా, రహీమ్ భార్యా భర్తలు. రహీమ్‌కి చిన్న గవర్నమెంట్ ఉద్యోగం కావడంవల్ల ట్రాన్స్ ఫర్ అయి పట్నానికి వస్తారు. ఒక అపార్టుమెంటులో కిరాయికి ఉంటారు. ఒకరోజు ఆదివారం మంచి మాంసం వండుతుంది. ఆవాసనకు పక్కింటి పిల్లి వాళ్లింటికి వస్తుంది. రెహానా దానికి మాంసపు ముక్కలు పెడుతుంది. ఇలా పునరావృతం అవుతుంది. అనుకోకుండా ఒకరోజు ఆపిల్లి అసలు పెంపకం దారు దాక్షాయణి మాంసం తింటున్న తమ పిల్లిని చూస్తుంది. అప్పుడు ఆమె "ఇన్ని రోజులూ చక్కగా పాలు, పెరుగూ పోసి పెంచాను. ఛండాలపు తిండిపెట్టి మా పిల్లిని అపవిత్రం చేసిందే. అయినా వెనకా ముందు చూసుకో అఖ్ఖర్లా? ఎవరి పిల్లి ఏంటి అని, మా ఇంట్లో పిల్లలతో సమానంగా పెరిగిన పిల్లి. మడి, ఆచారం అన్నీ ఔపోసన పట్టిన పిల్లి అది. ఇన్నాళ్ళ దాని నిష్ఠను ఒక్కరోజులో గంగలో కలిపింది కాదు.. అయినా ఆ ఓనర్‌కి ముందు నుంచే చెప్తూనే ఉన్నాము తురకలకు అద్దె ఇవ్వద్దని. అయినా వింటేనా...వెధవకు డబ్బు ఆరాటం. అయినా రానీ...అతన్ని సంగతీ తేలుస్తాను." (పుట:104) అని దూషించడం ఈ కథలో చూడవచ్చు.

సమాజంలో కులమత తేడాలను విశదం చేయడంలో సఫలం అయ్యాయి. తినే తిండి ఏ విధంగా బ్రాహ్మణ, నయా బ్రాహ్మణ కులాలకు చెందిన వారిని ముస్లింల నుంచి వేరు చేస్తుందో చెప్తుంది. ఈ కథలో ఇరువర్గాలు నెలకొని ఉన్న సాంస్కృతిక భిన్నత్వాన్ని తద్వారా వైషమ్యాన్ని అతి సున్నితంగా, సుతారంగా మన కళ్ళముందు నిలుపుతుంది.

సమాజంలో ఇప్పటికీ కొన్ని చోట్ల శాకాహారం తినేవారు, మాంసాహారాన్ని తినేవారి పట్ల వైషమ్యాన్ని చూపిస్తున్నారని రచయిత్రి ఈ కథలో చూపించింది.

**2. దీవారెc**

మనమరాలు తన నానమ్మ కోసం ఇల్లు కట్టించింది. కాని అందులోకి కాలు పెట్టకుండానే కన్ను మూసిన ఆమె నానమ్మ. ఆ యింటి కథే 'దీవారెc'. ఈ కథను రచయిత్రి షాజహాన రాసిన 'లద్దాప్ని' కథ సంపుటంలోనిది.

తొంబైమూడు సంవత్సరాల నానమ్మ (దాదీమా) కోసం మనుమరాలు రెండు రూముల ఇల్లు కట్టించాలనుకుంటుంది. ఈ ఇరుకు ఇంట్లో కాకుండా చివరి రోజుల్లో హాయిగా గాలి వెలుతురులో తిప్పాలని ఓ రెండు గదులు ఆమెకోసం కేటాయించాలన్న కోరికతో వాళ్ళనాన్న, అమ్మను రెండు గదులు ఇల్లు కట్టాలని, బాయి, బాబీ, పిల్లలు ఎవరైన వస్తే ఇరుకుగా ఉందని వారితో మాట్లాడుతుంది. వాళ్ళు సరేనని అంటారు. తండ్రి వెంటనే ఊళ్ళో సీనియర్ మేస్త్రిని పిలిపించి, మాట్లాడుతాడు. రెండు నెలల్లో రెండు గదులు కట్టడం పూర్తి చేయాలనేది ఒప్పందం. ప్లాన్ వేసిచ్చి, కొంత అటు ఇటుగా అవుతుందని కూడా చెప్తాడు. తండ్రి ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే ఉండటంతో ఇంటిపని మొత్తం పూర్తి అయ్యేవరకు కూతురిని చూడమని చెప్పడంతో ఆమె ఆ పనుల్లో కూరుకుపోతుంది.

మేస్త్రీ ఆదేశాల మేరకే రెండు రూములకు ముగ్గుపోసి, పునాదులు తీస్తారు. ఇసుక, ఇటుక మేస్త్రీ తెప్పిస్తాడు. గోడకు బాగా నీళ్ళు కొట్టాలని, కొట్టకపోతే గోడలు గట్టిగా ఉండవని చెప్పుతాడు. ఆమె అదే పనిలో ఉంటుంది. నానమ్మ బయటికి వెళ్లడానికి ఇబ్బంది అవుతుందని ఎటాచ్డ్ బాత్‌రూమును వెస్ట్రన్ టాయ్‌లెట్‌తోపాటు మామూలుది కూడా పెట్టాలని మేస్త్రీతో మాట్లాడితే ముందు మాట్లాడిన దానికంటే డబ్బులు పెంచేశాడు. వాళ్ళు గోడలు కడుతుంటారు. ఆమె గోడలకు సాయంత్రం నీళ్ళు కొడుతుంది. మధ్యలో నానమ్మను చూడడానికి వెళ్ళి వచ్చేసరికి పునాదులు అయిపోయి గోడ లేస్తుంది. అయితే ఆమెకు బాత్‌రూమ్ చిన్నదిగా అనిపించింది. మా నానమ్మ

ఆరడుగుల ఎత్తు, ఆమెను కూర్చోబెట్టి స్నానం చేయించడానికి అది సరిపోదని మేస్త్రీని పిలిచి చెప్పితే ఆయన మళ్ళా కొన్ని డబ్బులు పెంచి, పెద్దగా కడుతుంటాడు.

కడుతున్న రెండు రూములలో నానమ్మ పడుకునే రూమ్‌లో టి.వి. పెడితే అందరు చూడటానికి వస్తారని, అప్పుడు ఆమెకు బోర్ కొట్టదని, ఏదన్న కావాలంటే, మొత్తుకోనక్కరలేదు. ఎవరో ఒకరు అందుబాటులో ఉంటారని అనుకుంటుంది. పని చేయడానికి వస్తున్న వాళ్ళంతా భవాని, అయ్యప్పల మాలలు వేస్తారు. నానమ్మకు ఎండ రాకుండా కిటికీలు కూలింగ్ గ్లాసులు పెట్టాలని, ఇంకా ఏమేమో చేయాలనుకుంటుంది. ఒకరోజు వాళ్ళ నానమ్మ చిన్న కొడుకును తలచుకుంటూ, వాడు నన్ను పలకరించలేదని, వాడిది ఎంత కఠిన హృదయమని బాగా ఏడుస్తుంది. ఇళ్ళు పూర్తి అవ్వగానే ఇంక ఎప్పటికీ బాబాయి ఇంటికి నానమ్మను పంపించకూడదని అనుకుంటుంది.

వాళ్ళ బాబాయి ఇంట్లో ఉన్న నానమ్మ కింద పడిందని తెలియడంతో అందరు ఆందోళనతో వెళ్తారు. నానమ్మ కొన ఊపిరితో కొట్లాడుతుంది. ఇంత పెద్ద వంశానికి మూలమైన ఇద్దరిలో తాతయ్య ఎప్పుడో మరణించగా మిగిలిన నానమ్మ ఇప్పుడు అదే దారిలో ఉందని, అందరు చెంచాలతో ఆమె నోట్లో నీళ్ళు పోస్తున్నారు. వాళ్ల అమ్మ పోస్తున్నప్పుడు ఇంకా పోయమని అతికష్టం మీద సైగ చేసింది. చూస్తుండగానే వాళ్ల నానమ్మ అందర్ని వదిలి వెళ్ళిపోయింది.

నానమ్మ కోసం స్వంత ఊర్లో దర్గా చింతకింద శాశ్వత గృహం నిర్మించారు. కాని మనుమరాలు నానమ్మ కోసమే మూడు నెలల కాలాన్ని ప్రేమని రంగరించి కట్టించిన గూడులో మాత్రం ఆమె ఒక అడుగు కూడా వేయలేదు. ఒక్కరోజు కూడా నివసించలేదు. కనీసం ఒకసారి చూడను కూడా చూడలేదని మనుమరాలు ఏడుస్తుంటది.

ఈ కథలో మనుమరాలు నానమ్మ కోసం రెండు గదులు కడుతుంది. కాని ఆమె ఇల్లు పూర్తి అయ్యేసరికి మరణిస్తుంది. దానితో మనుమరాలు ఎంతో బాధపడి ఏడుస్తుంది. మూడు నెలలనుండి ఆమెకోసం కష్టపడుతుంది. కాని ఫలితం లేకపోయింది. ఆమె చివరి దశలో ఉంటుంది. అదే ముందు

ఆమెను అర్థం చేసుకొని ఆమె కోసం రెండు గదులు కట్టించి ఉంటే బాగుండు. కనీసం ఆమె సంతోషించేదేమోనని అనిపిస్తుంది. సమాజంలో కూడా చాలామంది ముసలివాళ్లను పట్టించుకుంటలేరు. వారిని పట్టించుకోవాలని, వారు మనకోసం చాలా చాలా చేశారని, మనం అర్థం చేసుకోవాలని, కనీసం వారు చనిపోయే దశలోనైనా, పట్టించుకుంటే వారు హ్యాపిగా ఉంటారని మనకు ఈ కథ తెలియజెప్తుంది.

**3. కబూతర్**

ఆడపిల్లకి పెళ్ళి చేయడానికి ఓ పేద తల్లి పడే తాపత్రయం 'కబూతర్' కథ. రచయిత స్కైబాబ 'అధూరె' ముస్లిం కథల సంపుటిలోనిది.

ఫాతిమా భర్త గుండె నొప్పి వచ్చి మరణిస్తాడు. ఆమె ముగ్గురు ఆడపిల్లలను పోషిస్తుంది. పెద్ద అమ్మాయి గౌషియా ఇంటివద్దే మిషన్ కుట్టుతుండటంతో, మిగతా ఇద్దరు చేతికుట్టు కుట్టుకుంటు ఇల్లు నడుపుతుండేవారు. ఆ వచ్చిన డబ్బులు ఇంట్లో ఖర్సులకు సరిపోయేవి. పెద్ద కూతురుకి 'అమీనఖాల' ఒక సంబంధం తెస్తుంది. పిల్లగాడు సెల్‌ఫోన్ల షాపుల పనిచేస్తుంటాడని, మీలాగే వాళ్ళుగూడా పేద కుటుంబమని, గౌషియా గురించి వాళ్లకు చెప్పినానని, యాభైవేలు కట్నం ఇస్తే 20వేలు ఖర్సులకు పోను, మిగతా 30వేలు సొంతంగా సెల్‌ఫోన్ షాపు పెట్టికుంటాడట అని మీ పరిస్థితి చూసి వాళ్ళను ఒప్పించానని చెప్పడంతో, ఫాతిమా చేతిలో డబ్బులు లేకపోవడంతో ఎట్లైన పెండ్లి చేయాలని, బంధువులను సహాయం అడుగుతుంది. తన చిన్న తమ్ముడు, పెద్ద తమ్ముడు, చెల్లెండ్ల భర్తలు, కూతురు గౌషియా వాళ్ల బాబాయిలు, చుట్టాలు, సౌదీ నుంచి వచ్చిన వ్యక్తి తలా కొంత సహాయం చేస్తామని కొందరు ఇవ్వడంతో, అవి 30వేల దాకా జమ అవుతాయి. ఫాతిమా అష్టకష్టాలు పడితే అవి దొరుకుతాయి. ఇంకా 20వేలు కావాలని ఎవరినైనా అడగాలనుకుంటుంది.

ఆరోజు 'అమీన ఖాల' పిల్లగాని తల్లి 'మసూదా' ఇద్దరు ఫాతిమా ఇంటికి వచ్చి యాభైవేలు ఇస్తానికి నీవల్ల అయితదా చెప్పితే తతిమ్మ విషయాలు మాట్లాడుకోవచ్చని అంటారు. ఫాతిమా ఇప్పటికే 30వేలు అయినాయి, నాకు కొద్దిగ టైమిస్తే, నువ్వు చెప్పినట్లే 50వేలు ఎట్లన్న చేస్తాను అంటుంది. పిల్లగాని తల్లి ఆగడం మావల్ల కాదని, అప్పటికే వారం రోజులు ఆగాము. అవతల

50వేలు ఇచ్చి పెండ్లి కూడా చేస్తామంటున్నారు. ఇప్పటికే మూడుసార్లు వచ్చారని, మా పిల్లగాడు తొందర పెడుతున్నాడని, ఇగ ఆగడం మావల్ల గాదని లేసింది. ఫాతిమా వారం రోజులు టైమిస్తే ఎట్లనన్న చేస్తా, లేకుంటే 30వేలు తీసుకొని పెండ్లి కానియ్యమని, దీనంగా బతిమిలాడుతుంది. ఇగ ఆగలేనమ్మ క్షమించుమంటుంది మసూదా. 'బేటి! మన గరీబుల పరేషాన్లు గరీబోల్లు గాకపోతే ఎవరు అర్థం చేసుకుంటారు చెప్పు. మొగుడు సచ్చి, బిడ్డ కన్నకష్టాలు పడుతున్నది. జర అర్థం చేసుకోవాలమ్మ." (పుట: 64) అని అమీన ఖాల సర్ధి చెప్పుతుంది. అయినా వినకుండా బయటకు వెళ్లిపోతుంటే అమీన ఖాల, ఫాతిమాలు ఎంత ఆగమన్నా ఆగకుండా వెళ్ళిపోయింది. అమీన ఖాల 'ఇగ పోనీలే బిడ్డా! ఏం జేస్తం...మన ఖిస్మత్‌ల లేదనుకుందాం. 'అల్లా' యాడ రాసిపెట్టె అణ్ణె జరుగుతుంది. అన్నీ అర్థం చేసుకునేటోడు, ఆడే సూస్కుంటడు. నువ్వేం పరేషాన్ గాకు. నేను మల్ల వస్తబేటి." (పుట: 65) అని వెళ్తుంది.

ఫాతిమా బోరున ఏడుస్తుంటే, కూతుర్లు కూడా మీదపడి బాగా ఏడవడంతో, ఆ ఏడ్పులకు చుట్టుపక్కలవారు, ఆడ, మగవారు వచ్చి ఏమి జరిగిందని, సలీమ్, లతీఫ్ భాయ్, జానియా, ఖాసిమ్ అందరూ అడుగుతారు. పక్కింటి నానీ కండ్లల్ల నీల్లు ఒత్తుకుంట చెప్తుంది. "ఏముందయ్య! ఇయాల్రేపు నియ్యతు యాడుంది? గరీబోల్ల పరేషాన్లు ఎవరు పట్టించుకుంటరు? మొగుడు సచ్చిపోయే-బిడ్డ పుట్టెడు కష్టాల ఉండె...పెద్ద బిడ్డ షాది చేద్దామంటె ఒక్కొక్కలు లక్షలడుగుతుండ్రి. ఇదేమన్న మన ఇస్లాంల ఉన్నదా??? మొన్నొక సంబందపోల్లు యాభైవేలన్న ఇయ్యమన్నరంట, చెప్పులరగంగ తిరిగింది బిడ్డ. తన వల్ల కాలె... ఆల్లొచ్చి కాదని పొయ్యేసరికి తట్టుకోలేకపోతున్నది బిడ్డ.. ఎవరు ఆదుకుంటరయ్య గరీబోల్లను? పాడు దునియాః...!"(పుట:66) అని అంటుంది. తల్లి బిడ్డల ఏడ్పు ఆపడం ఎవరితరం కాలేదు. ఇంకా జనం గుమికూడుతున్నారు. అంతమందిల తెల్లటి పావురం ఏదో కదిలినట్లు సలీమ్ అడుగు ముందుకేసి, ఫాతిమా అప్పా! నేను చూస్కుంట గౌసియాను పైస కట్నం లేకుంట రేపే మసీదుల నిఖా చేసుకుంట, చదివించుకుంట. మీరు ఇగ బాధపడవద్దని అంటాడు. ఫాతిమా కండ్లనుండి కారుతున్న కన్నీళ్ళు ఆనంద భాష్పాలుగా మారినాయి. లేశి సలీమ్ చేతులు అందుకొని కండ్లకు అద్దుకోవడం జరిగింది.

సమాజంలో ముస్లింలలో కూడా పేదవారు ఉన్నారని, అర్థికంగా వెనకబడిన కుటుంబాలు తెలంగాణలో ఎక్కువగానే ఉన్నాయని, వారుపడే బాధలు, కష్టాలు వర్ణణాతీతం అని, కూడుకు, గుడ్డకు ఎల్లక బతుకుతున్నారని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు. మరీ ముఖ్యంగా ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులు కట్నాలు ఇవ్వలేకపోతున్నారని ఈ కథ ద్వారా తెలుస్తుంది.

బిల్లి, దీవారెఁ, కబూతర్ వంటి కథల్లో మైనారిటీ ప్రజల బాధలు, సమస్యలు, వారి జీవన విధానం కనిపిస్తున్నాయి. వాటిని ఇందులో చర్చించాను.

## 4.12. పర్యావరణ కథలు

### 1. మార్నింగ్ వాక్

పర్యావరణాన్ని నాశనం చేసుకుంటే భవిష్యత్ ఎలా ఉంటుందో చూపుతాడు 'మార్నింగ్ వాక్' కథలో రచయిత దేవరాజు మహారాజు వివరించాడు.

విదేశాల నుండి హైదరాబాదుకు వచ్చిన మనవడు తాత, బొమ్మలతో 'మార్నింగ్ వాక్' చేస్తుంటాడు. నాటి రోజులన్ని తలచుకుంటూ ట్యాంక్‌బండు మీద కూర్చొని నీళ్ళలోకి చూస్తూ మాట్లాడుకునే వారి మాటలకు మనవడు ట్యాంక్ బండు ఎక్కడ అంటాడు కనిపిస్తున్న ప్లేగ్రౌండ్‌ను చూస్తూ...

దాన్ని మేమే పూడ్చేసాములే. వినాయక విగ్రహాలు వేసివేసి హుస్సేన్ సాగర్‌ను పూడ్చేసి వినాయక సాగర్ చేశామని వ్యంగ్యంగా మాట్లాడినా నేడు సరైన నిర్ణయం తీసుకోకపోతే భవిష్యత్తులో జరిగేది అదేనని సుతారంగా హెచ్చరిస్తారు ఈ కథలో. అంతే కాదు మనవడు వాకింగ్ గ్రౌండ్స్‌లో సిటీ అపార్ట్‌మెంట్స్ కడితే హాట్ కేక్స్‌లా అమ్ముడైపోతాయి అంటూ తన ఐడియా కూడా చెబుతాడు. నేడు మనిషి వ్యాపార ధోరణి కొంతైనా వదిలి పర్యావరణం, కుటుంబం, సామాజిక భద్రత, బాధ్యతల గురించి ఆలోచిస్తే రేపటి తరంలో పర్యావరణ పరంగా, పిల్లలపరంగా మంచి చేసిన వారమవుతామని రచయిత చిన్న హెచ్చరిక చేస్తారు.

## 2. మా ఊళ్ళో సుత టవర్ పెట్టిండ్రు

గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్ పెట్టడంవల్ల దాని నుంచే వచ్చే రేడియేషన్ కారణంగా పక్షులు ఏ విధంగా అంతరించిపోతాయో రచయిత వెన్నం ఉపేందర్ 'మా ఊళ్ళో సుత టవర్ పెట్టిండ్రు' కథలో విశ్లేషించాడు. ఈ కథ 'కొన్ని వెలుగు నీడలు' కథా సంపుటిలోనిది.

మోరోళ్ళ మురళి తన తల్లిదండ్రులతో కలిసి ఊళ్ళో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుంటాడు. వీళ్ళకు 15 ఎకరాల భూమి నాలుగు అరకలకు సరిపోను పశువులు ఉంటాయి. మురళి వాళ్ళు ఓ మోస్తరుగా ఆర్థికంగా ఉన్నవాళ్ళు. ఇంటి జాగలో చింతచెట్టు చాలా పెద్దగా కొండకు ఆనుకునేటట్లు ఉంటుంది. ఆ చెట్టుమీద వివిధ రకాల పక్షులు, కోతులు చింతకాయలు జీవిస్తాయి. ఒకరోజు సెల్‌ఫోన్ కంపెనీవాళ్ళు ఊళ్ళోకి వచ్చి మురళి వాళ్ళ నాన్నతో మాట్లాడి ఇరవై సంవత్సరాలు అగ్రిమెంట్ కాగితం రాయించుకొని టవర్లు వేసి వెళ్ళిపోతారు. ఆ టవర్ వేసిన మూడు సంవత్సరాలకు రేడియోషన్ వల్ల మురళి వాళ్ల తండ్రికి క్యాన్సర్ వస్తుంది. తల్లి కూడా మరణిస్తుంది. ఊళ్ళో వాళ్ళు కూడా రోగాల బారిన పడతారు. ఆ చెట్టును ఆధారంగా చేసుకొని కాకులు, కొంగలు, రామ చిలకలు, ఊర పిచ్చుకలు, జంట కోతులు మొదలగు జీవరాసులు ఆ రేడియోషన్ తట్టుకోలేక కొన్ని మరణిస్తాయి. కొన్ని అడవికి వెళ్ళిపోతాయి. మురళి వాళ్ళు ఇల్లు వదిలిపెట్టి చెలకలో ఇల్లు కట్టుకొని జీవిస్తుంటారు. తండ్రి మాత్రం తన తాతలు కట్టిన ఇంట్లోనుంచి రానని అక్కడే ఉంటానని ఆ ఇంట్లోనే ఉంటాడు. ఒకరోజు రాత్రి గాలివాన వచ్చి సెల్‌ఫోన్ టవర్ చింతచెట్టుమీద కూలిపోతుంది. ఆ రాత్రి ఇంట్లో ఉన్న మురళి వాళ్ళ తండ్రికి పానం పోయినంత పని అవుతుంది.

ఊర్లో సెల్‌ఫోన్ టవర్ పెట్టడంవల్ల ఆ రేడియోషన్‌కు రోగాలు వచ్చి జనం మరణిస్తున్నారని, పక్షి జాతులన్ని అంతరించి పోతాయి. సెల్‌ఫోన్ టవర్ల వల్ల ఎంత ప్రమాదమో సమాజానికి, పాఠకులకు రచయిత ఈ కథ ద్వారా తెలియజేస్తున్నాడు.

మన చుట్టూ ఉన్న ప్రకృతిని మనం కాపాడుకోకపోతే ఎన్నో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మార్నింగ్ వాక్, మా ఊళ్ళో సుత టవర్ పెట్టిండ్రు అనే కథల ద్వారా నల్లగొండ జిల్లా రచయితలు తెలియజేశారు.

## 4.13. ఇతర సామాజిక సమస్యలు

పైన పేర్కొన్న విభాగాల్లో ఉన్న సామాజికాంశాలు కాకుండా ఇతర సామాజికాంశాలను ఇందులో పేర్కొని విశ్లేషించాను. ఇందులో రకరకాల సామాజికాంశాలు ఉన్నాయి. అవి: పర్యావరణం, ప్రభుత్వాలు ప్రజలకు సంబంధించిన ఏదైనా నిర్ణయం సరిగ్గా లేనప్పుడు, దానికి వ్యతిరేకంగా ఉద్యమాలు(రాస్తారోకో, బంద్) చేస్తారు. అటువంటి సందర్భాల్లో రోడ్లమీద ప్రజలు పడే ఇబ్బందులు, భూముల గొడవలు, పంపకాలు, ప్రభుత్వం రోడ్లు వేసి టోల్‌గేట్ల పెట్టడం వల్ల ప్రజలు పడే రకరకాల ఇబ్బందులు, కల్తీకల్లు వల్ల ఇబ్బందులు, లిక్కర్ వల్ల స్నేహాలు దూరమవడం, వ్యక్తిగత గుర్తింపు మొదలైన అంశాలు ఈ నల్లగొండ జిల్లా కథల్లో స్పృశించబడ్డాయి.

### 1. బంద్

ప్రభుత్వం తమ సమస్యలు పరిషరించాలని, కార్మిక నాయకులు, విద్యార్థి నాయకులు, వివిధ సంఘాల నాయకులు సంపూర్ణ బంద్‌కు పిలుపునివ్వడం వల్ల సామాన్య ప్రజల ఇబ్బందులు, చిన్నచిన్న వ్యాపారులు ఎట్లా నష్టపోతారో 'బంద్' కథలో చిత్రీకరించాడు రచయిత. మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'బొడ్రాయి' కథా సంపుటంలోనిది ఈ కథ.

జీతాలు పెంచాలని ఉద్యోగస్తులు, కూలీరేట్లు పెంచాలని కార్మికులు, ధరలు తగ్గించాలని, గిట్టుబాటు ధరల కోసం రైతులు, ఫీజులు తగ్గించాలని విద్యార్థులు, పెట్రోలు ధరలు పెరిగితే, ప్రాంతాలవారి, జిల్లాలవారి, రాష్ట్రం, దేశం అంతటా సంపూర్ణ బందుకు పిలుపునివ్వడం వల్ల పదిగంటలు దాటుతున్నా ఒక్క షాపు కూడా తెరవలేదు. షాపులన్నీ మూసివేశారు. పోలీసులు జనాన్ని భయపెడుతూ, ఆందోళనకారులను అరెస్టులు చేస్తున్నారు. ఆందోళనకారులు బంద్ పిలుపు విజయవంతం చేయాలని పాలు, కూరగాయలు, మందులు, హాస్పటల్లు అత్యవసర సేవలకు కూడామినహాయింపు ఇవ్వకుండా వారం రోజులుగా ఇదే కార్యక్రమం, ధర్నాలు ఒకరోజు, మరోరోజు రాస్తారోకోలు, ఇంకోరోజు బంద్ ఇలా వరుసగా బందులతో జనం విలవిలలాడుతున్నారు. రోడ్లు అన్ని మూసివేశారు.

బందువల్ల వడ్డికి తెచ్చి కూరగాయలు కొంటే, అవి అమ్ముడుపోక షావుకారికి డబ్బులు ఎట్లా కట్టాలని, ఇంట్లో పూటకెల్లటం లేదని కూరగాయల కోటమ్మ, పాలను అమ్మి డబ్బులు ఆసాములకు కట్టాలని, లేకపోతే తనమీద పడుతుందని పాల వ్యాపారి వెంకులు. సెమిస్టర్ పరీక్షలు జరిగితే ఏదో క ఉద్యోగం చేసి తమ్ముని చదువు, చెల్లి పెండ్లి, తండ్రికి వైద్యం చేయించాలని వెంకన్న. రాస్తారోకోల వల్ల నిన్నటి నుంచి నొప్పులతో బాధపడుతున్న బిడ్డను ఈ రోజు దవాఖానాకు తీసుకుపోదామంటే ఆటోలు కదులనిస్తలేరని, కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందోనని ఏడుస్తున్న సావిత్రమ్మ. కడుపు నొప్పితో బాధపడుతున్న తల్లిని చూపిస్తూ డాక్టర్ ఈ రోజు ఆపరేషన్ చేస్తా తీసుకురమ్మన్నాడని ప్రాధేయపడుతున్న శేఖర్. తన బిడ్డ కూలికి పోకపోతే రేపు ఆ మైక్రో ఫైనాన్స్ వాల్ల వారం కిస్తీ కట్టకపోతే తన గ్రూపోల్లు పీకి పందిరేస్తారని ఆందోళన పడుతున్న శారదమ్మ. ఎరువుల బస్తాలు తెచ్చి పొలానికి వేయాలని దుకాణాదార్ల దగ్గరికి పోతే డబుల్ రేట్లు అమ్ముతున్నారని రైతు దేవయ్య. ఇలా బాధపడుతూ రోడ్డు పక్కన మూసివేసిన షాపుల ముందు పాలబండ్లు, కూరగాయల గంపలవాళ్ళు, దిన కూలీలు, ఆటోలు, సైకిల్ రిక్షావాల్లు నిలబడి, కూర్చొని ముచ్చట్లుపెడుతున్నారు.

సెంటర్‌లో రోడ్డుపక్కన నీడకోసం వేసిన పెద్ద గూడారంలో దానికింద స్టేజిమీద కూర్చున్న నాయకులు ఒకరి తర్వాత ఒకరు బందును విజయవంతం చేయాలని, సర్కారు దిగిరావాలని పెద్ద నాయకుడు మనోహర్, కార్మిక నాయకులు, విద్యార్థి నాయకులు, వివిధ సంఘాల నాయకులు ఒకరిని మించి ఒకరు ఆవేశపూరిత ప్రసంగాలు చేస్తుంటే, పాలవాళ్ళు, కూరగాయల వాళ్ళు, ఆటోవాళ్ళు, రోగాల బారిన పడినవాళ్ళు ఎవరు ఎంత బతిమిలాడినా ఎవరిని రోడ్డు ఎక్కనీయకపోతే నిరాశతో వెనుకకు తిరుగుతున్నారు.

బందులవల్ల సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారస్తులు ఇలా ఎంతోమంది ఈ విధంగా ఇబ్బందులు పడుతున్నారని రచయిత ఈ కథ ద్వారా చూపించాడు.

**2. బహుముఖం**

కలెక్టరు ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగి తన పనిని కూడా జూనియర్ అసిస్టెంట్‌తో చేయించుకొని అతనికి తెలియకుండా ఒక్కొక్క డిసిప్లినరీ కేసు డీల్ చేస్తూ అందినంత లంచం

తీసుకునే విధానం బహుముఖం కథలో కనిపిస్తుంది. రచయిత్రి కోట్ల వనజాత రాసిన 'ఇత్తు కథా సంపుటంలోనిది

రవి జూనియర్ అసిస్టెంట్‌గా జాయినింగ్ రిపోర్టు ఇవ్వడానికి ఏ సెక్షన్‌లో రెండో నెంబర్ సీటు చేస్తున్న సత్తెన్న దగ్గరకు వచ్చి, నేను అటెండర్ బుచ్చయ్య కొడుకుని సార్ అని చెప్తాడు. ఓహో మా బుచ్చయ్య కొడుకువా అన్నాడు. ఏమి చదువుకున్నావు అని అడిగాడు. డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాను సార్ అంటాడు. జాయినింగ్ రిపోర్ట్ రాసివ్వు, సాయంత్రం కలువమన్నాడు.

సాయంత్రం కలుస్తాడు. సత్తెన్న జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి కలెక్టర్ ఆఫీసులో ఎత్రీ సీటుకు పోస్టింగ్ తన పక్క సీటు ఇప్పిస్తాడు. రోజులు గడుస్తున్నాయి. సత్తెన్నకు కళ్ళు బాగా కనబడవు. అదే ఈ మధ్యకాలం నాలుగు సంవత్సరాల నుండే. అంతకు ముందు సత్తెన్న రాసే రూల్‌కు తిరుగులేదు. అమోఘమైన జ్ఞాపకశక్తి ఉండేది. అతని సెక్షన్ల ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు, బదిలీలు, పోస్టింగుల వంటి విషయాలుండేవి. రవి సెక్షన్‌లో ఉద్యోగుల సెలవులు తదితరాలుండేవి. రెండు సీట్లలో పనికి డైరెక్షన్ సత్తెన్నది. యాక్షన్ రవిది. సత్తెన్న చెప్తుంటె రవి రాసేవాడు. ఒక్కొక్క ఫైలు గురించి బాధిత ఉద్యోగులు సత్తెన్నను కలుస్తుండేవారు. వారితో కాస్త పక్కకుపోయి మాట్లాడి వస్తుండేవాడు.

రవి చేసే సహాయానికి ప్రతిగా సత్తెన్న కూడా అతనికి కొన్ని వెసులుబాట్లు కల్పించేవాడు. డిగ్రీ ఫైనల్ ఎగ్జామ్స్ రాశాడు. దూరవిద్య ద్వారా ఎం.ఎ. ఇంగ్లీషు వేస్తే లీవులు పెట్టనీయక చదువుకోమ్మని, మేనేజ్ చేసేవాడు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాసేశాడు. సత్తెన్న వాటి గురించి పట్టించుకోక జూనియర్ అసిస్టెంట్‌గానే మిగిలిపోయానని చెప్పుకున్నాడు. రవి వారంలో ఆరురోజులు సర్వే ట్రేనింగులో ఉండి ఆదివారం మాత్రం సత్తెన్న ఫైళ్ళు రాసిపెట్టేవాడు. ఏ ఫైలుపైననైనా సంతకాలు తప్ప మరే ఇతర రాతలు ఉండేవికావు. అట్లా నాలుగేళ్ళ సహార్యంతో సత్తెన్నతో పాటే రవికి బెస్ట్ వర్కర్‌గా పేరొచ్చింది.

ఆ రోజు పదిన్నరకు ఆఫీస్‌కు వెళ్ళగానే అటెండర్ ‘షఫి, రవి దగ్గరకొచ్చి ‘రాత్రి సత్తెన్నసార్ హార్ట్ ఎటాక్‌తో చనిపోయింటట సారూ, మీకు తెల్వదా” అన్నాడు. ఆఫీస్ బయటకు వచ్చి దొరికిన ఆటో ఎక్కి సత్తెన్న ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే అతనికి అంతిమ యాత్రకు ఏర్పాట్లు చేస్తున్నారు. బంధువులు, భార్యాపిల్లలు ఏడుస్తున్నారు. రవి బాధపడ్డాడు. అక్కడ సూపరింటెంట్ రామారావు కలిసి అట్లా పక్కకు తీసుకెళ్ళాడు. రవిని సత్తెన్న కష్టాల వైతరణి దాటించడానికే నిన్ను అతనిలో జత కలిశాడేమో ఆ భగవంతుడు. కొడుకు చెయ్యని సాయం నువ్వు చేశావు” రామారావు అన్నాడు. “నేను చెయ్యడమేంటి” అందామనుకున్నాడు. దహన కార్యక్రమం అయ్యాక రవి. నేరుగా ఇంటికి వెళ్ళిపోయాడు. మరుసటి రోజు ఆఫీస్‌కు వెళ్తే, ఏవో (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)ఇంకొక్క వర్కింగ్ హాండ్ దొరికేవరకు రెండు స్టీలో పని చెయ్యగలవా? అడిగాడు. తలాడించాడు రవి చేయగలనన్నటు.

పరమేశ్వర్ (డిప్యూటి తహశీల్దార్) పై డిసిప్లీనరీ కేసు పెండింగ్‌లో ఉంటే ఆ ఫైలు రాసి కలెక్టర్‌కు పంచించాడు. రవి సూచన యథాతదంగా ఆమోదించారు. ప్రొసీడింగ్ తయారుచేసి అప్రూవ్ అయ్యాక పరమేశ్వర్‌కు పంపాడు. అందుకు కారణమైన రవిని కలవడానికి వచ్చాడు. కాంటిన్‌కు వెళ్దాం రమ్మని రవిని కిందకు తీసుకెళ్ళాడు. అతని చేతిలో బరువైన కవరొకటి ఉంచాడు. “నాకేమి వద్దుసార్. ఇలా చేస్తే మీరు నన్ను అవమానపర్చినట్టే” మొహమాటం లేకుండా చెప్తాడు రవి. కవరు తిరిగి జేబులో పెట్టుకున్నాడు పరమేశ్వర్, ఇంతలో రామారావు టీ తాగడానికి వచ్చాడు. రామారావు పరమేశ్వర్ మాటల్లో ఏడ్చారు. నేను సెక్షన్‌కు వెళ్తాను అని చెప్పడానికి దగ్గరకు వెళ్ళాడు రవి. వెళ్తాను సార్ అన్నాడు వాళ్ళలో వాళ్ళ సంభాషణ రవి మీదకు మళ్ళింది.

చిన్న వయసులోనే మంచి పెన్‌మన్‌గా పేరు తెచ్చుకున్నావు సంతోషం. ఇంతవరకు ఏ మకిలీ నీకంటలేదు. ఇది ఇంకా సంతోషించాల్సిన విషయం. కానీ కాలం ఎప్పుడూ ఒకలా ఉండదు. సర్వీసులో కొచ్చిన పాతికేళ్ళవరకు సత్తెన్న చాలా నిజాయితీపరుడు. నిక్కచ్చి మనిషి. దాదాపు అతని సర్వీసంతా నిజ్జాయితీగా కాలం నెట్టుకొచ్చాడు. కొడుకుకు ఇంజనీరింగ్ చదివించాడు. కొడుకుకు మంచి ఉద్యోగం పెట్టుకొచ్చాడు. కొడుకుకు మంచి ఉద్యోగం రావడంతో ఇల్లు కట్టుకోవాలనే ఆశతో ఇల్లు కట్టాడు. సందట్లో సడేమియాలాగ మంచి సంబంధం వచ్చిందని కూతురు పెండ్లికూడా చేశాడు.

కొడుకు కూడా సంపాదిస్తున్నాడనే ధైర్యంతో అయినకాడికి అప్పులుచేసి అన్నీ జరిపించాడు. కానీ కూతురు పెళ్ళైన నెలలోపే కొడుకు తనకు నచ్చినట్లు పెళ్ళి చేసుకొని ఇంటికి దూరమయ్యాడు. అప్పులు చేసిన ఆందోళనతోనే కంటిచూపు కూడా మందగించింది. అయినా అధికారుల దగ్గర ఉన్న 'మంచి పనోడు' అనే గుర్తింపుతోనే కలెక్టరేట్‌లో కొనసాగాడు. అప్పట్లో ఆందోళనల్లో ఉన్న అతనికి నువ్వు ఒయాసిస్‌లా తగిలావు. నీకు పని నేర్పించి సత్తెన్న తన తెలివితేటలను అమ్ముకున్నాడు. ఒక్కొక్క డిసిప్లినరీ కేస్ డీల్ చేస్తూ అందినంతా తీసుకున్నాడు. పెండింగ్‌లో ఉన్న వందలాది ఫైళ్ళు నీతో రాయించి, అప్పుల ఊబిలో నుండి బయటపడే లోపే మృత్యుదేవత ఆహ్వానించింది. ఇవన్నీ నీకు తెలుసో లేదో కానీ నీ పనితనం వల్ల సత్తెన్నను ప్రత్యక్షంగా ఆదుకున్నావు. మరెందరికో పరోక్షంగా ఆదుకున్నావు. నీకు భగవంతుడు ఎప్పటికీ మంచే చేస్తాడు రామారావు. రవికి మనసంతా అదోలా అయింది. తనకు తెలియకుండానే సత్తెన్నకు సహాయపడ్డాడా! తన వల్ల సత్తెన్నకు మంచి జరిగిందా? రాత్రంతా కలత నిద్ర అయ్యింది.

ఈ కథలో కలెక్టర్ ఆఫీసులో లంచాలు తీసుకునే విధానాన్ని రచయిత సమాజానికి తెలియపరిచాడు.

**3. మా నాయిన తాడు లెక్కలు**

భూమి కొలతలు, లెక్కలు, చదువు రాకున్న ఎట్లా చేస్తాడో రచయిత ఎలికట్టె శంకర్‌రావు రాసిన 'మా నాయిన తాడు లెక్కలు' కథలో చిత్రించాడు.

తల్లిదండ్రి సంపాదించిన భూమి 'ముప్పై గుంటల పొలంను'ను అన్న, తమ్ముడు ఇద్దరు కలిసి నలుగురు పెద్ద మనుషులను తీసుకుపోయి సమాన భాగాలుగా పంచుకుంటారు. యాడాది తిరగముందే వీళ్ళ ఇద్దరి మధ్య 'రెండుగుంటల' భూమి తేడా ఉందని జానికిరావులు చిచ్చుపెడతాడు. ఇగ గొడవలు మొదలవుతాయి.

ఓనాడు పొద్దున్నే గొల్ల ముత్తులు, ఆల్ల తమ్ముడు పెద్దులు, వాళ్ళ వెనుకాల తండ్రి, తల్లి కూడా లింగయ్యగారి ఇంటికి, శెర్ల బాయికాడ మడికట్టు కొల్వరైతిరి? నీ భాగం ఎక్కువుందంటే, నీభాగం యెక్కువుందని గొడవలు పెట్టుకుంటున్నారు. అని వాళ్ళ అమ్మ లింగయ్యగారితో అంటుంది. ఇద్దరికి గొడవలు ఎవరు పెట్టిస్తున్నారు. వీళ్ళమధ్య పుల్లలు పెట్టేది జానకిరావులు అని తెలుసుకుంటాడు. సరే

ఇప్పుడు ఏమి చేద్దాం అని అడక్కముందే ఆలయ్య "ఆ జానకి రావులుగాడు మొగుడు పెండ్లాల యెడబాపే నాకొడుకయ్యా ఆడొస్తే పచ్చని సంసారాలు బుగ్గిపాలైయితయ్. ఆడొద్దుగాని మీరొచ్చి వోపాలి సూడండ్రి. పోరగాల్లు మీ మాట మీద వుంటమంటుండ్రు" అన్నాడు. ముత్తులు, పెద్దులు గూడా అవునన్నట్లు తల్కాయలూపుకుంటా కూసుండ్రు. పారి అని తువ్వాలు భుజాన వేసుకుండు.

మడిసుట్టూ తంగెడు మండలు యిడ్సుకుంట తాడుపెట్టి కొలిసిండు. ఒరంమీద కూసోని నోట్లెనే గుల్లుకుంట కొద్దిసేపు లెక్కజేసుకొని 'పాతగెట్టే లెక్క దాని మీదనే వుండురి' అని లేసిండు. అది తెలిసిన జానికిరావులు వూల్లెకు రాగానే 'కాయితం లేకుంట యేలు ముద్దెరేస్తోడు నోటిలెక్క జేస్తతేల్తాది? అని మల్లింతా అందెం పోయబోయిండు. ఇదంతా యెటో పోతుందని ఆలోచిస్తుంటే అప్పుడే యెర్రబెల్లి నుంచి యెకరానికింత దీస్కొని లెక్కలేసే సాలె కేశవులు సైకిలు మీదొస్తుండు. ఆయనను యెంట బెట్టుకొని యల్లబాయి టేపుబెట్టి లెక్కలేసిండు. లింగయ్యగారి నోటిలెక్క తప్పుతాది అని నవ్వుకుంట సాలె కేశవులు సైకిలెక్కిండు. అతడు ఈ విధంగా భూమిని సమాన భాగాలు చేసిండు.

ఈ కథలో లింగయ్యకు చదువు రాకున్నా భూమి కొలతలు, నోటి లెక్కలు ఎట్లా చేస్తాడు, సమాజంలో ఇలాంటివారు ఉన్నారని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

**4. బతుకు సంత**

సంతలో కూరగాయలు అమ్మటానికి వెళ్ళి అక్కడ మందు, కల్లుతాగి ఇంటికొచ్చి ఎట్లా మరణించిందో 'బతుకు సంత' కథలో చూడవచ్చు. కోట్ల వనజాత రాసిన 'ఇత్తు' కథా సంపుటిలోనిది ఈ కథ.

అంజమ్మ సంతలో కూరగాయలు అమ్ముకొని సాయంత్రం వచ్చేటప్పుడు కొడుక్కి నోడ్సులు, బిడ్డ తలకి నూనే, రిబ్బన్లు కొనుక్కొని ఆటోల దగ్గరకు వచ్చింది. అక్కడ వాళ్ళు ఊరు ఆమె యాదమ్మ కలుస్తుంది. "పొద్దుగాల అత్తకోడలు జగడమాడినట్లున్నరు" అని యాదమ్మ అంటే "రోజూ ఉండేటివే కదా" అని అంజమ్మ అంటుంది. "పిల్లా ఒక్క సీసా కల్లుతాగి పోదాము రావే" అడిగింది యాదమ్మ. నాకు అలవాటు లేదన్నది అంజమ్మ. నువ్వేమి తాగొద్దులే నేను తాగిందాక నావెంట ఉండు. తర్వాత ఇద్దరం కల్సిపోదాం అంటుంది. సరేనని యాదమ్మ వెంటవెళ్ళింది. వీళ్ళ వెంటనే అల్లం యెల్లిపాయల

సాయెబు కల్లు కాంపౌండ్‌కు వెళ్లిండు. కల్లు దుకానం నిండా జనం, కల్లు అయిపోయిందని, కల్లుతయారు చేసే మనిషి లేడని, గుత్తేదారు మనుషులు చెప్పినగాని కల్లు కావాలని గొడవ చేయడంతో, వాళ్ళకు ఏ మందు, ఎంత కలపాలో, ఎట్ల తయారు చేయాలో తెలియక, కల్లు తయారు చేసి క్షణాల్లో జేబుల డబ్బులు నింపుకుంటున్నారు. జనం కల్లు సీసాలు ఎగబడి తీసుకుంటున్నారు. సాయెబు వెళ్ళి మూడు సీసాలు తెచ్చి రెండు యాదమ్మకు ఇస్తే డబ్బులు ఇచ్చింది.

"అంజీ ఒకమాట చెప్త ఇంటావే. సీసా కల్లు తాగి ఇంటికి పోతే మీ అత్తకన్న ఎక్కువ నోరు జేస్తవు లేదంటే గమ్మున పడుకుంటవ్. ఏదో ఒకటి మేలే అయితది" అని ఉసిగొల్పింది.

అత్తమీద గెలుపంటే అంజమ్మకు హుషారొచ్చింది. కల్లు తాగుతుంటే మొదట తీయగా, గొంతులోకి పోయినంక మెల్లగా మంట మండుతుంది అంటే కొత్తగదా! అట్లానే వుంటది మొదట. అలవాటైతే ఏమిగాదు అని యాదమ్మ కండ్లు మూతలు పడి, కడుపుల తిప్పుతుంటే సీస పక్కకు పెట్టి నేలమీద ఒరిగింది(నిద్రపోయింది).

చీకటి కమ్ముతున్న ఆ ప్రదేశంలో అంజమ్మ నిద్రలో ఉంది. "సాయెబు ఆమె మీదకు వస్తున్నాడు. తనకేదో కావాలన్నట్టు ఆమెనంతా తడుముతున్నాడు. అంజమ్మకు మనిషి మీదకు చేరిన బరువు తెలుస్తున్నది. బలవంతంగా కళ్ళు తెరిచి చూసింది. మీద కూర్చున్న సాయెబు ఏదో వెతుక్కుంటున్నడు. ఒక్కసారి ఒళ్ళు జలదరించింది. బలమంతా కూడదీసుకొని ఒక్కతోపు తోసింది. దూరంగా పడ్డాడు. ఆమె కూర్చొని బట్ట సర్దుకుంటుండగా కిందపడ్డ సాయబు మల్లి లేచి మీదకు రాబోయి బళ్ళున వాంతి చేసుకొని పక్కకు పడిపోయాడు."

ఆటో స్టాండు దగ్గరికి వచ్చి చూస్తే ఎవరూలేరు. చాలా రాత్రి అయిందని మెళ్ళగా ఊరివైపు నడుచుకుంటూ అక్కడ అక్కడ కడుపుల తిప్పుతుంటే, ఆగుతూ వాంతు చేసుకుంటుంది. కళ్ళు మూతలు పడుతున్నాయి. కడుపుల తిప్పి పేగులు కూడా బయట పడేటంత వాంతి చేసుకుంది. కళ్ళు, కాళ్ళు సాధీనం తప్పుతున్నా ఎలాగో ఇల్లు చేరింది.

పందిరికింద పిల్లలిద్దరూ ఒకే మంచంలో నిద్రపోతున్నారు. తృప్తిగా చూసుకొని పుస్తకాలు, నూనే, రిబ్బన్లు వాళ్ళ తలాపుకాడ పెట్టింది. ఇంట్లకు పోతుంటే అత్తలేచి అరుస్తదని బయట అరుగుమీదనే అడ్డం ఒరిగింది. తెల్లారి అత్తలేచి బయట పడుకున్న కోడల్ని లేపబోయింది. అంజమ్మ కొయ్యబారి చాలాసేపయింది. రాత్రి సంతలో కల్లు తాగినోల్లు అరవైమంది చచ్చిపోయిర్రని వార్త దావానలమై వ్యాపిస్తుంది. పొద్దంతా కష్టపడి పొద్దుమూకంగానే కల్తీ కల్లు తాగిన పేదబతుకులు పాకలో ఎలా తెల్లారుతున్నాయో తెలియజేశారు రచయిత.

**5. టోల్ గేట్**

తెలంగాణ ప్రభుత్వం హైదరాబాదు నుండి విజయవాడకు వెళ్ళే హైవే రోడ్డును ప్రైవేటోళ్ళ చేతుల్లో పెట్టడంతో, వారు రోడ్డుపై టోల్‌గేట్‌లు వేసి డబ్బులు వసూలు చేస్తుండటంతో, లారీలు, ఆటోలు, ట్రాక్టర్లు, సుమోలు ఊర్లలో నుంచి అడ్డదారి నుండి వెలుతుంటే మూలమలుపుల కాడ జనాలకు తగిలి ప్రాణాలు పోతున్నాయని రచయిత గాదె వెంకటేశ్ తెలియజేశారు. 'టోల్ గేట్' కథ 'తన్లాట' తెలంగాణ కథ(2014) సంకలనంలోనిది.

మత్సగిరి అతని భార్య ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు సిరిపురం గ్రామంలో నివసిస్తున్నారు. పెద్దకూతురు పదవతరగతి చదువుతుంది. ఆ ఊరిలో పిల్లలకు పరీక్షలు దగ్గర పడ్డాయని బడిలో రాత్రి పదిగంటల వరకు చదివిస్తుంటారు. తర్వాత పిల్లలు అందరూ కలిసి బస్టాండుకు వస్తే, తల్లిదండ్రులు ఎవరి ఇండ్లల్లకు వారి పిల్లలను తీసుకొని వెళుతుండేవారు. ఒక రోజు మత్సగిరి తన బిడ్డను సైకిల్ మీద తీసుకొని ఇంటికి వెళుతుండగా, మబ్బు పెంటయ్య ఇంటి మూలమలుపుకాడికి రాగానే లారోడు వారికి ఎదురుగా స్పీడుగా మీదికి వస్తుంటే కూతురును, సైకిల్‌ను ముందుకు నూకి అరుగు ఎక్కుతాడు. లారివాడు అతనికి గుద్దడంతో తలవెనక గట్టిగా దెబ్బతగిలి రక్తం కారుతుంటే జనం నీళ్ళు తాపించి, రమన్నపేట హాస్పటల్‌కి తీసుకెళ్తారు. లారివాడు చిన్నగా తప్పించుకొని లారిని తీసుకొని వెళ్ళిపోతాడు. డాక్టర్ అతన్ని చూసి పట్నం తీసుకెల్లమంటే, అతన్ని తీసుకొని వెళుతుండగా మార్గమధ్యంలోనే చనిపోతాడు. అయినా హాస్పటల్‌కి వెళ్ళి డాక్టర్‌కి చూపిస్తే చనిపోయాడని చెప్పి,

పోస్టుమార్టం చేసిన పీనిగెను వారికి అప్పగిస్తాడు. పీనిగెను ఇంటికి తీసుకొని రావడంతో భార్య, పిల్లలు అతనిపై పడి బోరున ఏడుస్తుంటారు. జనాలు వారిని ఓదార్చడం ఎవ్వరితరం కాలేదు.

మన ఊరిలో ఎన్నడు యాక్సిడెంట్‌లు జరిగి చనిపోలేదని, పట్నం నుంచి బెజవాడకు పెద్దరోడ్డు వేసిన తరువాత యాక్సిడెంట్లు జరుగుతున్నాయని, లారీలోల్లు, తుపాన్లు, బండ్లోళ్ళు, డిసియం వాళ్ళు చౌటుప్పల దాటంగనే జై కిసారుగూడెం, ఎల్లంకి, సిరిపురం, రామన్నపేట మీంచి పోతూ, చిట్యాలకాడ మళ్ళా హైవే ఎక్కుతుంటారు. పెద్దబండ్లు పోయి, పోయి రోడ్డు అంతా గతుకు గతులుగా అయిందని అనుకుంటున్నారు.

సాయంత్రం పీనిగెను స్మశాన వాటికకు తీసుకెళ్ళి దహన సంస్కారాలు చేయడంతో, ఊరిజనం ఇంటిబాట పట్టి మత్సగిరి సావు గురించి పరిపరి విధాలుగా మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. ఊళ్ళళ్ళకెళ్ళి లారీలు నడుసుడేందీ, గీసావులు ఏంది, సందుళ్లకెళ్ళి నడపాలంటే చాలా కష్టం. టోల్‌గేట్ ఉండడం వల్ల రోడ్డుమీద నుంచి పోయినప్పుడల్లా 200 రూపాయలు కట్టాలని ఊర్లో సందుళ్లకెళ్ళి, అడ్డదారిలో నుండి లారీలు, కార్లు మొదలగు వాటిని తోలే డ్రైవర్లు రోడ్డు టాక్సీలు, పోలీసోల్లకు, ఆర్టీఏ వాళ్ళకు ఎన్నెన్ని టాక్సీలు కడతారు. తన కాళ్ళమీద తాను బతకాలని అనుకుంటారు. కాని ఈ టోల్ గేట్ పెట్టడంవల్ల చాలామంది చిట్యాల నుండి చౌటుప్పల్‌కు నడిచే ఆటోళ్ళు అమ్ముకుంటారు. వారికి రోడ్డు మంచిగా చేసినా ఆనందమే లేదని, అంతకుముందు హైవే ఎన్‌హెచ్ 9 రోడ్డుమీద యాక్సిడెంట్లు ఎక్కువ అయితున్నందున రోడ్డు బాగు చేయాలని దర్నాలు, రాస్తారోకోలు చేస్తే ఆఖరికి సర్కారోల్లు ప్రైవేటోళ్ళ చేత రోడ్డు వేయించడంతో వాళ్ళేమో టోల్ గేట్ పెట్టి, పెట్టుబడి పెట్టి పైసకు పైస వసూలు చేసుకుంటున్నారు. అంతే కాకుండా దురాశతో ఊరూరికి ప్లయ్ ఓవర్ బ్రిడ్జిలు వేయకుండా మట్టికట్ట పోసి రోడ్డు వేశారు. అటు ఊరు ఇటు ఊరు కానరాకుండా ఎడబాపి మరి కట్టడంతో హైవేల మీద కరీదైన కార్లు యాక్సిడెంట్లు తగ్గాయి. కాని యాక్సిడెంట్ల్ ఊర్లళ్లకు పాకినాయి.

నెత్తురోడుతున్న ఊరోళ్ళ ప్రాణాలకు పెద్దరోడ్డు వేసి టోల్ గేట్ పెట్టినప్పుడు తలెత్తె దుష్ఫలితాలను అంచనా వేయాలని అదికారులే ఈ సావులకు కారణం ఒక అభివృద్ధి ప్రాజెక్టు వల్ల పేద ప్రజలపై పడే బారాన్ని జరిగే నష్టాన్ని పరిగణలోకి తీసుకొని గీ ప్రభుత్వమే ఈ యాక్సిడెంట్ చేసిందని, కరెంట్, మైనింగ్, ఇతర ప్రాజెక్టుల వల్ల జరిగే నష్టాలను అంచనా వేసి పరిహారం చెల్లిస్తారు. కాని గీ టోల్ గేట్ రోడ్డు ప్రాజెక్టు వల్ల ఉపాధి కోల్పోయే వారికి ఎందుకు ఇవ్వరు. టోల్ గేట్ వేసినప్పుడు సిన్న సిన్న వాహనదారులమీద పడే బారాన్ని చూపించక చుట్టుపక్కల నుండి పోయే రోడ్డును అభివృద్ధిపరచని గీ ప్రభుత్వమే ఈ హత్య చేసిందని, ఇది ముమ్మాటికీ టోల్ గేట్ హత్యేనని రోడ్డుకు అడ్డంగా మనుషుల రక్తాన్ని వాయిదాలలో మింగే టోల్ గేట్ రక్త పింజర పదినోర్లు తెరుచుకొని ఎదురుపడిందని అంటాడు. (పుట:38).

టోల్ గేట్ పెట్టడంవల్ల వాహనాలు ఊర్లల్లోకి అడ్డదారి గుండా వెళ్ళి మూలమలుపుల వద్ద జనాలకు వాహనాలు తగిలి చనిపోతున్నారని తక్షణమే వీటిపై చర్యలు తీసుకోవాలని, టోల్ గేట్ చార్జీలు తగ్గించాలని, సామాన్య ప్రజల మీద భారం మోపొద్దని, రచయిత ఈ కథలో ప్రభుత్వం చేస్తున్న దోపిడీ గురించి తెలియజేశాడు.

**6. జీవం**

కుటుంబంలో ఒక వ్యక్తి చనిపోతే అతని భార్యా పిల్లలు, తల్లిదండ్రులు, తమ్ముడు, చెల్లెలు, స్నేహితులు, బంధువులు ఏడుస్తూ, బాధపడుతుంటారు. ఆ వ్యక్తి ఆత్మ వాళ్ళ చుట్టూ తిరుగుతూ వాళ్ళను చూస్తూ ఏమి చేయలేకపోతాడు. చివరికి అది కల అయ్యేసరికి దిగ్గున లేచి చూసుకున్న విధానం రచయిత స్కైబాబ 'జీవం' కథలో చిత్రించారు. 'అధూరె' కథా సంపుటంలోనిది ఈ కథ.

యూసుఫ్, షాహీన భార్యాభర్తలు. వీరి పిల్లలు సులేమాన్, కూతురు నస్రీన్. వీళ్ళు హైదరాబాదులో ఉంటారు. యూసుఫ్ తల్లిదండ్రులు, తమ్ముడు, చెల్లెలు స్వంత ఊరు నల్లగొండలో ఉంటారు. యూసుఫ్ రాత్రి నిద్రలోనే చనిపోయినట్లు కల వస్తుంది. తన ఆత్మ భార్య పిల్లలు ఏడుస్తుంటే పక్కనే ఉండి చూస్తూ బాధపడతాడు యూసుఫ్. వీళ్ళు కిరాయికి ఉన్న ఇంట్లో

ఉండనీయరు శవాన్ని. తన స్నేహితుడు స్వంత ఊరు నల్లగొండకి వ్యాన్ మాట్లాడిండు. అందులో భార్యాపిల్లలు, శవం, పక్కన స్నేహితుడు సైదులు ఏడుస్తుంటే యూసుఫ్ ఆత్మ వాళ్లపక్కన ఉండి చూస్తున్నాడు. అతని ఫోను కొడుకు దగ్గర ఉండటంతో ఫోన్ మోగినప్పుడల్లా లిఫ్ట్ చేసి తన తండ్రి చనిపోయాడని బాధగా చెప్తున్నాడు. వ్యాను గ్రామానికి చేరడంతో తన గల్లీలో ఉన్నవాళ్ళు, కుటుంబ సభ్యులు పెద్దగా ఏడుస్తున్నారు. అతడు వాళ్ళ అమ్మకోసం చూస్తున్నాడు. ఆమెను ఎవరో పట్టుకొస్తుంటే పడిపడిపోతూ 'వో బేటో...! వో బేటో..! అని స్పృహ తప్పిపోయినట్లుంది ఆమె. యూసుఫ్ ఊరికి పోయి వాళ్ళ అమ్మను అల్లుకుపోయాడు. కాని ఆత్మ కాబట్టి అల్లుకోలేకపోయాడు. అతని కొడుకు సులేమాన్ దిగి వాళ్ళ అమ్మను అల్లుకొని బోరున ఏడుస్తున్నాడు. అతని బిడ్డను అల్లుకొని చెల్లెల్లు ఏడుస్తున్నారు. అతని శవాన్ని దింపి ఇంటిముందల మంచంలో పడుకోబెట్టడంతో ఇంక ఎక్కువ ఏడుస్తున్నారు. అతని మొఖం పైనుంచి దుప్పటి ఎవరో తీసేసరికి, చెల్లెల్లు, అమ్మ శవం మీద వాలిపోయారు. తమ్ముడు గుండెలు బాదుకుంట ఏడుస్తున్నాడు. తండ్రి ఏడుసుకుంట వచ్చి అతని మొఖాన్ని చేతులకు తీసుకొని 'మేం పోకముందే ఎందుకురా మమ్మల్ని ఇంత పెద్ద బాధపెట్టినవ్ బేటా...! అని అంటూ ఏడుస్తుంటే, అక్కడ ఉన్నవారు బాగా పెద్దగా ఏడుస్తారు.

'మేరే బేటో...మెరే బేటా...! నువ్వు లెవ్వంటే మేం ఎట్ల తట్టుకుంటమనుకున్నవ్‌రా...మేమింక ఎట్ల బతకాల్రా...మమ్ముల్నింత అన్యాలం చేస్తవనుకోలే బేటే...! అని వాళ్ళ అమ్మ తల పట్టుకున్నది. చెల్లెల్లు భూమీ్మద పొర్లాడుకుంట ఏడుస్తుంటే, గల్లీగల్లీ అంతా ఏడుపుల వాగై ప్రవహిస్తుంది. యూసుఫ్ పక్కనే ఉండి చూస్తూనే ఉన్నడు. మధ్యాహ్నం అవుతుంది. సూర్యాస్తమయవేళ చదివే నమాజ్‌ల కలపాలె అనుకుంటున్నరు. సమాధి తవ్వడానికి వెళ్లారు. స్నానం చేయించడానికి ఏర్పాటు చేస్తున్నారు. ఊర్లోవాళ్ళు చుట్టాలు, స్నేహితులు అందరూ వచ్చారు. లేటయ్యిందని అంటూ శవాన్ని స్నానం చేయించారు. వాళ్ళ ఆచారం ప్రకారం చేయించి, శవాన్ని పాడెమీద పెట్టి ఆకుపచ్చని గుడ్డ కప్పి చుట్టు నాలుగు మూలల కట్టేసి, ఇక పాడె లేపడంతో కొడుకు, తమ్ముడు పాడెను ఎత్తకుంట అడ్డుపడుతూ ఏడుస్తుంటే, వాళ్లను వారించుకుంట పాడెను ఎత్తుకున్నారు.

'లాయిలాహ ఇల్లాల్లాహ్... మహమ్మదుర్ రసూలిల్లాహ్' అనుకుంట భుజాలు మార్చుకుంట శవం సమాధి స్థలంవైపు సాగుతున్నది. అతడు వెంటపడిపోతున్నాడు. పక్కన పోతున్నవాళ్ళు గూడా వాహనాలు ఆపి వొచ్చి మరీ శవానికి భుజం ఇచ్చి మల్ల పోయి వాహనాలు తీసుకొనిపోతున్నారు. మజీదుకు చేరింది శవం. పార్థన చేసినంక మళ్ల ప్రయాణం సమాధి స్థలంలోకి వెళ్లింది శవం. బొంద తవ్వి ఉన్న చోటుకు పోంగనే తైలం, తదితర సుగంధ ద్రవ్యాలు చల్లి. చివరిసారిగా మొఖం చూపెట్టినారు. యూసుఫ్ కూడ తన మొఖాన్ని చివరిసారిగా చూసుకున్నాడు.

ఆఖరిసారిగా అతని తమ్ముడు, కొడుకు, వాళ్ళ కక్కయ్యలు, మామలు, చిన్నాయనలు, చెల్లెళ్ల పిల్లలు అందరూ పట్టి అతని శవాన్ని బొందలకు దింపినారు. యూసుఫ్‌కి ఏం చేయాల్నో అర్థమైతలేదు. ఇక అందరూ మట్టి సమాధిలోకి వేయడంతో ఒక్కసారిగా మట్టి అతని మొఖంమీద పడుతున్నట్లు అనిపించింది. దన్న లేసి కూసున్నడు. కొద్దిసేపు ఏం అర్థంకాలేదు. చుట్టూ చూసినాడు చిత్రం. పక్కన షాహిన్ పడుకొని ఉన్నది. హైదరాబాదుల మా కిరాయింట్లనే మంచంపైనే లేసి కూసోనున్న హమ్మయ్య బతికిపోయిన. నిజంగానే చచ్చిపోయిన్ననుకున్న గదా! గుండే ఊటగా కొట్టుకుంటూ సప్పుదు బైటికి అతనికి విపిస్తుంది. ఈ కథలో కుటుంబంలోని వ్యక్తి చనిపోతే ఆ కుటుంబం ఎట్లా ఏడుస్తారనేది రచయిత తెలియజేశాడు.

**7. చిక్కు తెచ్చి పెట్టిన చీప్ లిక్కర్**

ప్రభుత్వం సారాయిని నిషేధించడం వల్ల, ఛీఫ్ లిక్కర్ తెచ్చుకొని ముగ్గురు స్నేహితులు బాగా తాగి ఘర్షణ పడిన ముగ్గురు మిత్రుల కథ 'చిక్కు తెచ్చిన చీప్ లిక్కర్' రచయిత నిర్మల్. వారు రాసిన 'ఆబ్కారి కథలు' సంపుటంలోనిది ఈ కథ.

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో వాల్యా, నన్యా, బిచ్చా ముగ్గురు స్నేహితులు. వీరు ముగ్గురు రోజు పొలాల పనికాగానే సాయంత్రం పాఠశాల ఆవరణంలో తమ వెంట బట్టి సారాయి సీసా తెచ్చుకొని వెళ్ళేవాళ్ళు. వీళ్ళతోపాటు స్కూల్ అటెండర్ జహంగీర్ కూడా కలిసి తాగేవాడు. ఆబ్కారోల్లు బట్టిసారా బందు చేయడంతో, ఊళ్ళో సారాయి తయారుచేసే వారు భయపడి బట్టీలు పెట్టడం మానేయడంతో బిచ్చాను మిర్యాలగూడెం పంపి బ్రాండి షాపులో

'సీప్ లిక్కర్' ఫుల్ బాటిల్ తెప్పించుకుంటారు. జహంగీర్ హెడ్‌మాస్టర్ గారి గదిలో నుండి నాలుగు స్టీల్ గ్లాసులు తెచ్చాడు. వాల్యా నాలుగు గ్లాసులలో మందుపోసి ఇస్తే, ఎవరికి తగ్గట్టు వాళ్ళు నీళ్ళు కలుపుకొని తాగుతున్నారు. కాని జహంగీర్ నీళ్ళు కలుపుకుంటే నిషా ఎక్కదని అట్లనే తాగితే కొద్ది సేపటికి కండ్లు తిరిగి పక్కగదిలోకి వెళ్ళి బెంచిమీద పడుకున్నడు. వీళ్ళు ముగ్గురు మాత్రం ఫుల్ బాటిల్ ఖతం చేయగా అడుగున కొద్దిగా మిగిలితే ఎవరు తాగాలన్న మీదకి వచ్చింది గొడవ. ముగ్గురు ఇష్టం వచ్చినట్లు తాగిన మైకంలో కొట్టుకోవడంతో వాల్యకు తలపగిలింది. నన్యాకు ఎడమకాలు విరిగింది. బిచ్చా ఎడమ చెయ్యి విరిగింది. జహంగీర్‌కి మెలకువ వచ్చింది. లేసి చూసేసరికి భయం వేసింది, వాళ్ళకు కనిపించకుండా సైకిలెక్కి మిర్యాలగూడెంకు వెళ్ళిపోయిండు.

ఆ రాత్రికి రాత్రే వారిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హాస్పటల్‌కి తీసికెళ్ళి కట్టు కట్టిస్తారు. వారిని పొద్దున్నే గ్రామానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు పంచాయితీ పెట్టడంతో గ్రామ సర్పంచ్ రాగ్యానాయక్ వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు వారిని ఏం జరిగిందని వాళ్ళ ముగ్గుర్ని అడిగితే మౌనంగా ఉంటారు. నన్య నాయక్ భార్య జహంగీర్ తీసుకొస్తుంది. అతడు జరిగిన విషయం కొంత వరకు చెప్పగా, మిగతాది వాల్యా చెప్తాడు. "స్టీలు గ్లాసులు కావడం వల్ల ఎవరికి ఎక్కువ వచ్చింది తెల్వలేదు అక్కడే తేడా వచ్చి తన్నుకున్నాం. మాలో ముందు ఎవరు ఎవరని కొట్టారో మాకే గుర్తులేదు" అని చెప్పాడు. విషయం విన్న సర్పంచ్‌కు ఏమి తీర్పు చెప్పాలో అర్థం కాలేదు. వార్డు మెంబర్లను సలహా అడిగాడు. అందులో ఓ మెంబరు చాలాసేపు ఆలోచించి తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

"ఆలోచించి చూస్తే అందులో మనవాళ్ళ పొరపాటు ఏమీ లేదనిపిస్తుంది. తప్పంతా ప్రభుత్వానిదే. అసలే మనవి ఆ మాత్రం సంసారాలు. ఏదో మనకు కొంత ఆసరాగా ఉంటుందని బట్టీలు పెట్టుకొని మన తాగుడు మందం మనమే సారాయిని కాసుకొని తాగుతుంటే దాన్ని కావాలని బలవంతంగా బందు పెట్టించిండ్రాయే. దానికి బదులు గీ "సీప్ లిక్కర్ని' సరఫరా చేసనరు బాగానే వుంది. మరి సీసాలల్లో సరఫరా చేసినప్పుడు ఆ సీసాలమీద కొలతలు ఏర్పాటు చేయకపోయిరి. దవాఖానాలలో మందులిచ్చే జాన్స్ సీసాలమీద ఉన్నట్లు మిల్లిమీటర్ల గుర్తులు వేసి ఉంటే

బాగుంటుంది. లేకపోతే దావతులల్ల ఎవరికి ఎంత పోయాలో లెక్క తెల్వక ఇదిగో ఇలాగే తన్నుకుంటారు. తలకాయలు పగులగొట్టుకుంటరు. అందుకని మన గ్రామపంచాయతీ నుండి తీర్మానం చేసి ఆబ్కారోల్లకు పంపితే వాళ్ళు గవర్నమెంటుకు పంపిస్తారు. ఇక మందు సరఫరా చేసే మందుసీసాల మీద మిల్లీ లీటర్ల గుర్తులు వేసి వస్తయి. ఏమంటరు? అని మిగతా సభ్యుల సలహా అడుగుతూ తన అభిప్రాయాన్ని ముగించాడు. దానికి అందరూ తమ ఆమోదాన్ని తెలిపారు. వెంటనే తీర్మానం రాసి అందరి సంతకాలు తీసుకొని ప్రత్యేక దూత ద్వారా మిర్యాలగూడ ఆబ్కారీ సీఐ గారికి పంపించారు.(పుట: 189).

ప్రభుత్వం సారాయి బందు చేయడం వల్ల చాలామంది 'చీఫ్ లిక్కర్ని' కొనలేకపోతున్నారు. సారా ఉంటే రోజు కొంచెం తాగేవారు. అదే మందు అయితే కొనడానికి డబ్బులేక తాగలేకపోతున్నారు. డబ్బులున్నప్పుడు తాగేవారికి ఇంకా తాగాలనిపించి తాగితే గొడవలు పెట్టుకొని కొట్టుకున్నారు. మందు పెట్టడం వల్ల పేదప్రజలు తాగలేకపోతున్నారని, సారాయిని ఓపెన్ చేయాలని, గవర్నమెంట్ ఈ సమస్యలపై ఆలోచిస్తే బాగుంటుదని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

**8. పిట్టకథ**

దీపావళి పండగకు అందరూ బాంబులు పేల్చడంవల్ల, నిప్పు రవ్వలు చిమ్ముకుంటూ వచ్చి, గడ్డితో కప్పి ఉన్న ఇంటిమీద పడటంతో, ఆ మంటలకు ఆ ఇంటిలో ఉన్న ఇద్దరు చిన్నపిల్లలు మరణించడంతో తల్లిదండ్రులు ఎట్లా బాధపడతారో, ఏ విధంగా రోదిస్తారో రచయిత 'పిట్టకథ'లో పి.చందు రాసిన 'ఆంధ్రజ్యోతి పత్రిక'లో (15 నవంబర్, 2015) విశ్లేషించాడు.

దీపావళి పండగనాడు ఊరంతా టపాకాయలను పేలుస్తుంటారు. ఇంట్లో ఉన్న చిన్నపిల్లలు ఇద్దరు బయపడుతుంటారు. ఒక రాకేట్ బాంబు నిప్పులు చిమ్ముకుంటూ వచ్చి గడ్డితో కప్పిన ఇంటిమీద పడితే ఆ మంటలకు తల్లిదండ్రులు పెద్దవారు కావడంతో బయట పడతారు. అందర్ని పిలుస్తారు. కని ఆ శబ్దానికి వారికి ఇనిపించక ఎవరూ రారు. చిన్న పిల్లలు కావడంతో ఆ ఇద్దరు మంటల్లో బలైపోతారు. తల్లిదండ్రులు బాధపడుతుంటారు. ఎవరి పైశాచిక ఆనందంకోసం తన పిల్లలు బలైపోయారని వాళ్ళ బాధ చెప్పుకోలేని వర్ణనాతీతం. మల్ల కొన్నాళ్ళకు వారికి సంతానం కలిగి మరో ఇద్దరు పిల్లలు జన్మిస్తారు. మళ్ళా దీపావళి పండగ వస్తుంది. పండగ వచ్చిందంటే వాళ్ళ బాధ,

ఆవేదన చెప్పుకోలేనిది. బాంబులు పేలి నిప్పుల రవ్వలు వచ్చి ఆ ఇంటిమీద పడగానే ఆ శబ్దానికి తల్లిదండ్రులు క్రింద పడిపోతారు. వాళ్ళకు ఆ మంటల్లో, పొగ ఎక్కువ రావడంతో పిల్లలు కనిపిస్తలేరు. ఏమైయ్యారో తెలుస్తలేదు ఆ తల్లికి. ఇగ చచ్చిపోతామేమోనని అనుకొని ఆ తల్లి దేవున్ని ప్రశ్నిస్తుంది.

"దేవుడా ఏమిటీ అన్యాయం? అందమైన సృష్టిని చేసి అన్నీ జీవులను కలిసి బతకమని చెప్పావే? మరి మా జీవితాలు ఎందుకిలా... ఇంకెవరో పైశాచిక ఆనందానికి బలైపోతున్నాయి. పండగ అంటే అందరూ కలిసి చేసుకునేది. అంతా చల్లగా ఉండాలని కోరుకునేది. అందరూ కలిసి ఒకచోట ఆడిపాడేది పండుగ. కానీ ఇలా భయంకరంగా టపాసులు కాలుస్తూ...ప్రాణాలు పోయే శబ్దాలు చేసి పైశాచిక ఆనందాన్ని పండుగ అంటారా...? ఈ లోకంలో బలవంతులకే బతికే హక్కుఉందా? బలహీనుల బతుకులు అర్థాంతరంగా తెల్లారిపోవాల్సిందేనా...? ఎవరికి చెప్పుకోలేని బాధ మాది. చెప్పుకున్నా మీకు అర్థంకాని గోస మాది... ఎందుకంటే నేనో పిట్టను కాబట్టి మీకు పిట్ట కథగానైనా పనికిరాని పిట్ట బతుకు మాది. పక్క మనిషినే పట్టించుకోని మనిషి మా బాధ పట్టించుకుంటాడా...? అని అంటుండగానే ఆమె కన్ను మూతపడిపోయింది.

సమాజంలోని చాలామంది ప్రజలు పండుగలప్పుడు టపాసులు పేలుస్తుంటారు. అవి పేలితే ఆ నిప్పు రవ్వలు వచ్చి ఇండ్లమీద పడి ఇండ్లు కాలిపోతుంటాయి. సరే ఎవరో ఒకరు కాపాడతారు. ఎందుకంటే వారు మనుషులు కాబట్టి. అదే పక్షులు కట్టుకున్న గూడు కూడా, ఇల్లేనని మనం అర్థం చేసుకోవాలి. నిప్పు రవ్వలు వచ్చి పిట్టల గూడుమీద పడితే ఆ మంటలకు అక్కడికి అక్కడే మాడి మసై పోయి ఆ పక్షులు చనిపోతాయి. ఈ కథలో కూడా రచయిత్రి మనుషులలాగే పక్షులకు కూడా మనస్సు ఉంటుందని, అవి కూడా బాధపడతాయని, వాటి ఆవేదన వర్ణానాతీతం అని, అవి ఎవరికి చెప్పుకోలేకపోతాయని, వాటిని గూడా ప్రజలు కాపాడుకోవాలని, ఈ కథలో తెలియజేయడం జరిగింది.

**9. పూర్తికాని కథ**

సమాజం ప్రతినిత్యం ఏదోఒక ఒడిదుడుకులకు గురవుతూ ఉంటుంది. ఆ సమయంలో సమాజంకోసం త్యాగం చేస్తూ, సమాజంలో తాము ఒకరమని గుర్తెరిగి తమకోసం తాము పోరాటం

చేయాల్సి ఉంటుందని భావించి ప్రజా సమస్యలకోసం పోరాటాలు సాగిస్తుంటారు. ఆ పోరాటాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉంటాయి. కలం ద్వారా కూడా పోరాటం చేసే వాళ్ళూ ఉంటారు. అలా పోరాడే వాళ్ళు రాజకీయ నాయకుల్లాగా కాకుండా, వ్యక్తిగత లాభాలు, గుర్తింపు కోసం పాకులాడకుండా ముందుకు సాగుతుంటారు. కాని కొందరు వ్యక్తిగత గుర్తింపు కోసం పాకులాడుతారు అని 'పూర్తికాని కథ' అనే కథ ద్వారా కాసుల ప్రతాపరెడ్డిగారు తెలియజేశారు. ఈ కథ 'తన్లాట' అనే కథా సంకలంలో ప్రచురితమైంది.

ఈ కథలో ప్రధానంగా రెండే పాత్రలు కనిపిస్తాయి.'నేను', 'అతను' అనే రెండు పేరులేని పాత్రల మధ్యే ఎక్కువగా సంభాషణ ఉంటుంది. వారి మాటలను బట్టి వారు సామాజిక ఉద్యమాల్లో పనిచేస్తూ రచనలు చేస్తుంటారని అర్థం అవుతుంది. 'నేను' అర్ధరాత్రి వరకు నిద్రపోకుండా డైరీ రాసుకుంటూ ఉన్నాడు. అప్పుడు 'అతను' అనే వ్యక్తి వస్తాడు. 'నేను'ను ఇంకా నిద్రపోలేదా అని అడుగుతాడు. 'నేను' డైరీలో ఎలిజి రాసుకుంటూ ఉంటాడు. ఆ సమయంలో 'అతను' వచ్చి ఆ డైరీ చూస్తాడు. అలా దాని గురించి మాట్లాడుకుంటారు. 'అతను' 'నేను' నీవు ఇంకా మారలేదా అని అంటాడు. ఇలా మాట్లాడుకుంటే వీరిద్దరు పదేళ్ళ క్రితమే పరిచమున్నట్లు మనకు తెలుస్తుంది. కానీ అప్పటినుండి పదేళ్ళ తర్వాత అంటే ఇప్పుడు కలుసుకున్నారు. 'అతను' ఎలాంటి వాడో 'నేను' చెప్తాడు. 'అతను' ఎదుటివారిని ఎలాగైనా ఒప్పించే నేర్పు కలవాడు. అతని సాన్నిహిత్యంలో ఎవరైనా ఉక్కిరి బిక్కిరి అవ్వాల్సిందే. ఏదో ఒకటి చేసి ఎదుటివారిని దారికి తెచ్చుకుంటాడు. వారు మాట్లాడుకున్న తర్వాత మరుసటి రోజు పొద్దున 'అతను' వెళ్ళిపోతాడు.

ఈ 'నేను' ఎప్పుడు వండుకుంటాడో, ఎప్పుడు తింటాడో తెలియదు. నిత్యం చదవడం రాయడమే పని. గదిలో ఒక్కడే ఉంటాడు. 'నేను రహస్య జీవితం కూడా గడిపాడు. అప్పుడు 'సీత' 'నేను'కు పరిచయమయ్యింది. అప్పుడు ఆమెనే 'నేను'కు సంబంధించిన తిండి చూసుకునేది. ఆయన ఎలిజీ రాసుకుంటుండగా హఠాత్తుగా ఏదో గుర్తుకు వచ్చింది. నాకంటే ముందు 'అతను' ఏదైనా రాస్తే ఎలా అని, కవితల పుస్తకం తేవడం కోసం డిటిపి ఇచ్చిన వర్కు గుర్తుకు వచ్చి, అక్కడికి వెళ్తాడు. అక్కడ వర్కు పూర్తి చేసుకుని, ఇంత మంచి పుస్తకం ఎవరు వేసి ఉండరు. "వాళ్ళు చేసే పనులకు నేను రెచ్చిపోతూ వస్తున్నాను. ఆ విషయం నాకు తెలుసు. మీనాక్షికి తెలుసు. ఎంత రెచ్చిపోయినా

రావాల్సినంత పేరు రావటం లేదు. దక్కాల్సిన కీర్తి కిరీటాలు దక్కడం లేదు. నిజానికి నాకు ఒక్క సాహిత్యంలో నోబెల్ బహుమతి రావాలి. ఇది నా గట్టి నమ్మకం." (పుట:123). నేనే వేస్తున్నానని అనుకుంటూ ఇంటికి వెళ్తాడు. అప్పటికే మళ్ళీ 'అతను' వచ్చాడు. వారు మళ్ళీ సంభాషించుకున్న తర్వాత అతను ఒక పుస్తకం సంచిలోంచి బయటికి తీస్తాడు. అది 'ప్రపంచ సాహిత్యం-తెలుగు సమాజం-ఒక తాత్విక దృక్పథం' అనే శీర్షికతో ఉంటుంది. 'అతను' 'నేను'ను నువ్వు పదేళ్ళు రాశావు. నేను పదేళ్ళు తీసుకున్నాను అని అంటాడు. అదేవిధంగా "పదేళ్ళ కృషి-ఎవరూ పట్టించుకోవడం లేదు. అన్నీ మూడు భాగాలుగా చేసి ఇలా తెచ్చాను." అంటాడు. ఈ విధంగా నేనంటే నేను, నాకంటే నాకు గుర్తింపు రావాలని ఆరాటపడతారు.

ఈ కథలో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నవారు వ్యక్తిగత గుర్తింపును కోరుకుంటున్నారని తెలుస్తుంది. కథలో చివరలో "సమాజం నిజంగానే వ్యక్తిగత సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నట్లు అనిపించింది" అని ఉంటుంది. ఈ ఒక్క వాక్యాన్ని బట్టి మనం అర్థం చేసుకోవచ్చు.

బంద్, బహుముఖం, మా నాయిన తాడు లెక్కలు, బతుకుసంత, టోల్‌గేట్, జీవం, చిక్కుతెచ్చిపెట్టిన చీఫ్ లిక్కర్, పిట్ట కథ, పూర్తికాని కథ వంటి కథల్లో వివిధ రకాల సామాకాంశాలున్నాయి. వాటిని ఇతర సామాజికాంశాలు అనే విభాగంలో చర్చించాను.

మొత్తంగా 'నల్లగొండ జిల్లా కథలు-సామాజికాంశాలు' అనే ఈ అధ్యాయంలో ప్రధానమైన సామాజికాంశాలను మాత్రమే చర్చించాను. అవి: మానవ సంబంధమైన కథలు (కుటుంబ, స్త్రీ-పురుష, భార్యాభర్తల, వివాహేతర, స్త్రీల గృహ హింస, ప్రేమ, విషాద మొదలైనవి), వికలాంగుల కథలు, సంస్కృతి సంప్రదాయాలు (ఆహారం, ఆటలు, పండగలు, కళలు, మూఢనమ్మకాలు, విద్య, నిరుద్యోగం మొదలైనవి), రైతు కథలు, భూస్వాములు-వెట్టిచాకిరి కథలు, ఉద్యమ కథలు (తెలంగాణ, విప్లవోద్యమాల కథలు), బహుజన కథలు, దళిత కథలు, మైనారిటి కథలు, ఇతరాలు మొదలైన విభాగాలుగా చేసుకొని నల్లగొండ జిల్లా కథలను పరిశీలించాను.

సమాజంలోని సమస్యలకు, సంఘటనలకు స్పందించి రచయితలు సమాజానికి, సాహితీ లోకానికి వీటిని చూపిస్తూ, తమవంతుగా ప్రజలను చైతన్యం చేస్తూ, సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు. వివిధ ప్రక్రియల్లో ఆ సాహిత్యం వెలువడుతుంది. అలాగే కథా సాహిత్యంలో నల్లగొండ జిల్లా రచయితలు రాసిన కథల్లోని సామాజికాంశాలను పరిచయం చేస్తూ నా పరిశోధనలో ఒక అధ్యాయంగా చేసుకొని చర్చించాను. ఈ అధ్యాయం సమాజానికి, సాహితీ జగత్తుకు ఉపకరిస్తుందని భావిస్తున్నాను.

*****

# అధ్యాయం-5

## నల్లగొండ జిల్లా కథలు-భాషాంశాలు

మానవ సమాజానికి, మానవేతరాలకు ఉన్న ప్రధానమైన తేడా భాష. భాష లేకుండా ఏ ఒక్కరూ కూడా సులభంగా ఒకరితో ఒకరు భావ వ్యక్తీకరణ సులభంగా చేసుకోలేరు. కనుక మానవ సమాజం భాషను సైగల నుంచి నేటి వరకు అనేక రకాల మార్పులతో అభివృద్ధి చేసుకుంటూ ఉంటుంది. ఆ క్రమంలో మాట్లాడే స్థాయికి, మాట్లాడిన దానిని రికార్డు చేసి దాచుకోవడం, ఇతరులకు పేపరు ద్వారా వారి వారి అభిప్రాయాలను తెలుపడానికి భాషకు లిఖిత రూపాన్ని సంతరింపజేశారు. భాషకు లిఖిత రూపాన్ని ఏర్పర్చిన తర్వాత మానవులు తన అభిప్రాయాలను ఉన్నది ఉన్నట్టు కాకుండా కొత్త ప్రయోగాలు చేస్తూ సమాచార మార్పిడి చేసుకుంటూ వస్తున్నారు. దాన్నే మనం సాహిత్యం అంటున్నాం. సాహిత్యం ద్వారా వివిధ ప్రక్రియలు వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రక్రియలు సమాచార మార్పిడిలో భాగంగా సామాజిక అంశాలను చాలా అందంగా, తొందరగా తక్కువ నిడివితో ఎక్కువ సమాచారాన్ని అందిస్తూ, మానవ సమాజాన్ని చైతన్యం చేస్తూ అభివృద్ధి వైపు పయనింపజేస్తున్నాయి.

"భాష సమాజ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. భాషలోని పదజాలానికి సాంస్కృతిక వైశిష్ట్యం ఉంటుంది. భాషా వ్యవహర్తల కార్యకలాపాలు, ఆచారాలు, అభిప్రాయాలు, సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయి. సంస్కృతి భాషను నిర్దేశిస్తుంది. అంటే సంస్కృతికి అనుగుణంగానే భాష రూపుదిద్దుకుంటుంది. సంస్కృతిలో జరిగే క్రమానుగత పరిణామాలు భాషలో చోటుచేసుకుంటాయి." (శైలమ్మ, జి. 2011: 275).

ఇటువంటి ప్రధాన పాత్ర పోషించే భాషను నా పరిశోధనకు ఎంచుకున్న నల్లగొండ జిల్లా కథల్లో రచయితలు తమ తమ స్థానిక భాష, మాండలికాలతో వారివారి శైలిలో తమ రచనల్లో వెలువరించారు. వారి కథల్లోని మాండలికం, నుడికారాలు, జాతీయాలు, సామెతలు, అన్యదేశ్యాలు మొదలైన ప్రత్యేక పదజాలాన్ని 'నల్లగొండ జిల్లా కథలు–భాషాంశాలు' పేరుతో అయిదవ అధ్యాయాన్ని రాసాను.

నేను పరిశోధనకు ఎంచుకున్న కథల్లోంచి సేకరించిన మాండలిక పదజాలాన్ని నామ, క్రియా, ధ్వన్యనుకరణ, జంటపదాలు, అన్యదేశ్య, సామెతలు, జాతీయాలు అనే విభాగాలు చేసి ఈ అధ్యాయం రాసాను. వాటి కూర్పు: మొదట పదం, తర్వాత దాని = అర్థం/విశ్లేషణ, (కథా సంపుటి/సంకలనం–కథ: ప్రచురించబడిన సంవత్సరం: పుట). ఈ విధంగా వరుస క్రమాన్ని పాటిస్తూ, పదజాలాన్ని వింగడించాను.

## 5.1. నామ పదాలు

వస్తువులు, జంతువులు, పండ్లు మొదలైన వాటి పేర్లను కథల్లో మాండలిక పదాలతో వాడారు. వాటిని ఈ విభాగంలో చేర్చాను. వాటికి అర్థాలు లేదా వివరణను కూడా ఇచ్చాను.

అంగడి = సంత (బత్తెం–రంది. 2014: 123)

అంగలార్చు = తీవ్రంగా బాధపడు (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 25)

అగ్గువ = చవక, తక్కువ (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 75)

అట్ట కట్టాలు = అష్ట కష్టాలు, తీవ్రమైన కష్టాలు (ఓ సిన్నోని కత–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 244)

అట్లట్ల = ఆ విధంగా (అమ్మ–తన్లాట. 2014: 131)

అడుగునంగ = అడుగు భాగంలో (రాజన్న–ఇత్తు. 2014: 45)

అడ్డగోలిగ = అడ్డదిడ్డంగా, ఎక్కువగా(మొదటి కథ–నల్లగొండ కతలు–మొదటి సంపుటి. 2011:466)

అడ్డమొరుగు = నిద్రపోవడానికి పక్కకు ఒరగడం (పచ్చీసు–అలుగు. 2015: 47)

అతుకుల బొంత = పాత చీరలను దుప్పటిలాగా కుడుతారు. దానినే బొంత అంటారు. (బతుకు సంత–ఇత్తు. 2014: 79)

అదాటున = ఉన్నట్టుండి, తొందరగా (ఆశిర్కం–దగ్ధం. 2017: 110)

అయిటికి = వాటికి (టోల్ గేట్–తన్లాట: 2014: 28)

అఱ్ర = గది (కలలగూడు–కథల గూడు. 2012: 1)

అవిరేణి కుండలు = మట్టి కుండలను అలంకరించి పెళ్ళిరోజు పూజ చేస్తారు. వాటిని అవిరేణి కుండలు అంటారు. (మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 180)

ఆడికి = అక్కడికి(టోల్ గేట్–తన్లాట: 2014: 31)

ఆత్రం = తొందర (కబూతర్–అధూరె. 2011: 59)

ఆయిటి వాన = తొలకరి వాన (ఆయిటి వాన–పరిగె చేను. 2015: 11)

ఆర్గు = అరుగు(టోల్ గేట్–తన్లాట: 2014: 29)

ఆర్తి = దయ (టోల్ గేట్–తన్లాట: 2014: 31)

ఆళ్ళు = వాళ్ళు (అంటు–రంది. 2014: 185)

ఇంటాయన = ఇంటి మనిషి, ఇంటి యజమాని (మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 182)

ఇంతగనం = చాలా ఎక్కువ

ఇకమతు = తెలివి(టోల్ గేట్–తన్లాట: 2014: 30)

ఇగం ఇగం = చల్ల చల్లగా (ఎర్రెద్దు–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 261)

ఇగురం = ఉపాయం (వాన కురిసిన రాత్రి–నల్లగొండ కతలు–మొదటి సంపుటి. 2011: 519)

ఇనాం = దానం ఇచ్చే వాటిని ఇనాం అంటారు. (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 20)

ఇస్తారి = విస్తారి (మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 182)

ఇస్రం = విశాలంగా (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 75)

ఈ నడుమ = ఈ మధ్య (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 75)

ఈడిదాక = ఇక్కడి వరకు(అమ్మ–తన్లాట. 2014: 127)

ఈపాలి = ఈసారి (సోయి–అలాయి బలాయి. 2015: 42)

ఉంగుటం = కాలి చెప్పుకు ఉండేది. (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 21)

ఉడుకుడుకు = వేడివేడి (బత్తెం–రంది. 2014: 120)

ఉప్పుగల్లు = ఉప్పు రవ్వ (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 232)

ఉల్వ గుగ్గిల్లు = ఉలవలను ఉడకబెట్టి గుగ్గిల్లుగా తయారు చేస్తారు. (జేజి–అవిటి కథలు. 2013: 194)

ఉల్వకట్టు = ఉలవలను నీటితో ఉడకబెట్టగా మిగిలిన నీటినే ఉల్వకట్టు అంటారు. దాన్ని చారు చేసుకొని తాగుతారు. (జేజి–అవిటి కథలు. 2013: 194)

ఎకసెక్కంగా = వ్యంగ్యంగా (బహుముఖం–ఇత్తు. 2014: 48)

ఎచ్చిర్క = వెక్కిరించడం, వ్యంగ్యం (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 232)

ఎనుపక్కన = కంచె పక్కన (టోల్ గేట్–తన్లాట: 2014: 30)

ఏర్జనిగ = వేరుశేనగ పల్లి (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 231)

ఐటెంక = తర్వాత (అంటు–రంది. 2014: 193)

ఐతారం = ఆదివారం (పచ్చీసు–అలుగు. 2015: 50)

కంచరు గజ్జెలు = గజ్జెలల్లో ఒక రకం (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 30)

కమీజు అంగి = చొక్కల్లో ఒక రకం (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 21)

కలి = కూరాడులో నిల్వ ఉంచే నీటినే కలి అంటారు. (మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 182)

కలిమే కాయలు = ఒక రకమైన కాయలు (టోల్ గేట్–తన్లాట: 2014: 31)

కవేల పెంకు = మట్టి పెంకులలో ఒకరకం (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 76)

కామందు = యజమాని (ఈదురు గాలి–దగ్ధం. 2017: 35)

కీసులాట = గొడవ (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 27)

కుంపటి = బొగ్గులతో, ఉనుకతో మంట పెట్టే పొయ్యి(మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 180)

కుమ్మరి సారె = కుండలు తయారు చేసే చక్రం(మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 182)

కూరాడు = గంజినీళ్ళను నిల్వ ఉంచే కుండ. ఆ నీటిని రోజు అన్నం వండేటప్పుడు అందులో పోస్తారు. అప్పుడు అన్నం మంచిగా అవుతుంది. (మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 182)

కొంచెపు గుణం = పిసినారి గుణం/లేకి గుణం (మార్కెట్–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 248)

గటాంకల = అటువైపు

గడగొయ్య = బండికి ఉంటుంది. (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 26)

గడి = దొరల బంగళా (నా కథ–కథల గూడు. 2012: 17)

గపుక్కున = అనుకోకుండా తొందరగా (టోల్ గేట్–తన్లాట: 2014: 30)

గరిగబుడ్డి = పెళ్ళి సమయంలో వాడే మట్టి పాత్రను గరిగబుడ్డి అంటారు. (మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 181)

గిట్ల = ఈ విధంగా(టోల్ గేట్–తన్లాట: 2014: 33)

గిరాకి = వ్యాపారం అధికంగా సాగటం. (అమ్మ–తన్లాట. 2014: 133)

గిల్ల = చక్రం (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 30)

గులాం = బానిస, దాసుడు (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 21)

గూన పెంకలు = మట్టి పెంకులు (ప్రయాస–ఊత కర్రలు. 2012: 16)

గోలి = మాత్ర, టాబ్లెట్ (మీనా–దగ్ధం. 2017: 14)

గోలెం = నీళ్ళు పోసుకునే పెద్ద మట్టి పాత్ర (భూమి పుత్రుడు–బొడ్రాయి. 2016: 88)

చింత తోపు = చింతచెట్ల సమూహం (మొదటి కథ–నల్లగొండ కతలు–మొదటి సంపుటి. 2011:464)

చిప్ప = చిన్న మట్టి పాత్ర (మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 180)

జంకు = భయం (ఏక్ ముసాఫిర్ దో రాస్తే–అలాయి బలాయి. 2015: 99)

జర = కొంచెం (టోల్ గేట్–తన్లాట: 2014: 28)

జాడ = చిరునామా (ఆశ –యక్షగానం. 2016: 42)

జీవాల మంద = గొర్రెల మంద (రాజన్న–ఇత్తు. 2014: 44)

జెమ్మడి పండ్లు = పళ్ళలో ఒకరకం (టోల్ గేట్–తన్లాట: 2014: 31)

డప్పు = వాద్యం(టోల్ గేట్–తన్లాట: 2014: 30)

డోలీ = వాద్యం (టోల్ గేట్–తన్లాట: 2014: 30)

తంగేడు = ఒక చెట్టు (టోల్ గేట్–తన్లాట: 2014: 32)

తనువు = శరీరం (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 30)

తానం = స్నానం (జమ్మి–అలాయి బలాయి. 2015: 71)

తునక = మాంసం ముక్క (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 24)

తులం = గ్రాము (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 93)

తెలంగి = తెలంగాణ (ఓ సిన్నోని కత–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 244)

తెల్లవార్లు = రాత్రి నుంచి తెల్లవారే వరకు(పసువులంటే మా నాయనకు పానం–పరిగె చేను. 2015: 19)

తొక్కు = పచ్చడి (బతుకు సంత–ఇత్తు. 2014: 80)

తొవ్వ = దారి (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 236)

దన్క = వరకు (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 30)

దాపటెద్దు = బండికి కట్టినప్పుడు లేదా నాగలి కట్టినప్పుడు కుడివైపు కట్టే ఎద్దును దాపటెద్దు అంటారు. (పసువులంటే మా నాయనకు పానం–పరిగె చేను. 2015: 19)

దింపుడు కళ్లెం = శ్మశానంలో దహనం, పూడ్చే ముందు కొద్ది దూరంలో శవాన్ని దించి, శవంపై ఉన్న ఆభరణాలను తీసుకొని, ఏదైనా ద్రవ పదార్థాన్ని తాగిస్తారు. ఆ స్థలాన్నే దింపుడు కళ్ళెం /కల్లం అంటారు. (టోల్ గేట్–తన్లాట: 2014: 32)

దిగవాటు = బురదలో దిగబడటం (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 20)

దినాం = రోజూ (లచ్చిమి–అవిటి కథలు. 2013: 55)

దినాలు = రోజులు (చనిపోయినపుడు 9 లేదా 11 రోజులకు దినాలు అంటే కర్మకాండ చేస్తారు) (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 76)

దేవులాట = వెతకటం (ద్రోహం–కథల గూడు. 2012: 29)

దొడ్డి = పశువులను కట్టేసే స్థలం (టోల్ గేట్–తన్లాట: 2014: 28)

దొయ్య = పొలం మడి (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 20)

దోర్దోర = పక్కానికి రావడం (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 229)

నంగాడు = తిరుగాడు, తచ్చాడు (బుగాడ–రంది. 2014: 152)

నడిముద్లు = నడిమధ్యన పిదురుల భావం (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 20)

నాతిరి = రాత్రి (టోల్ గేట్–తన్లాట: 2014: 29)

నిమ్మలం = నెమ్మదిగా (అంటు–రంది. 2014: 186)

నిరుడు = గతేడాది (జేజి–అవిటి కథలు. 2013: 188)

నీరుకంట్లు = నీరు నివసించే ఒక రకమైన నీరుకట్టె. (ఎర్రెద్దు–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 261)

నెత్తి = తల(టోల్ గేట్–తన్లాట: 2014: 30)

పగ్గం = తాడు (ప్రయాస–ఊత కర్రలు. 2012: 15)

పచ్చలు = ముక్కలు(టోల్ గేట్–తన్లాట: 2014: 32)

పటువ = కుండ కంటే పరిమాణం తక్కువగా ఉన్న మట్టి పాత్ర (మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 181)

పతంగి = గాలిపటం (ఉర్సు–అధూరె. 2011: 93)

పసురం = పశువు (బొడ్రాయి–బొడ్రాయి. 2016: 4)

పసులు = పశువులు (టోల్ గేట్–తన్లాట: 2014: 28)

పస్క = పచ్చిక, గడ్డి (రాజన్న–ఇత్తు. 2014: 44)

పిచ్చి ముండాకొడ్క = తిట్టు (యక్షగానం-యక్షగానం. 2016: 21)

పీనుగ = శవం (టోల్ గేట్-తన్లాట: 2014: 30)

పీల = సన్నగా, బక్కగా (ఆనొస్తే... చెరువేది?-నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 230)

పుట్టినిల్లూ మెట్టినిల్లూ = స్త్రీలకు అమ్మానాన్నల ఇల్లు, అత్తమామల ఇల్లు రెండూ ఉంటాయి. (బతుకు సంత-ఇత్తు. 2014: 82)

పుప్పమ్మ = అత్తమ్మ (ఉర్సు-అధూరె. 2011: 96)

పుస్తెల తాడు = తాళిబొట్టు(వీలునామా-బొద్రాయి. 2016: 25)

పూటు = ఎక్కువగా, నిండుగా(అమ్మ-తన్లాట. 2014: 134)

పెయ్యి = శరీరం (ఆడ పాలపిట్టలున్నయా?-నల్లగొండ కతలు-మొదటి సంపుటి. 2011:491)

పొతం = శుభ్రం (ఆయిటి వాన-పరిగె చేను. 2015: 11)

బడి = పాఠశాల(అమ్మ-తన్లాట. 2014: 132)

బత్తీసాలు = ఒకరకం మిఠాయి (చిలుకల దండ-నల్లగొండ కతలు-మొదటి సంపుటి. 2011:502)

బత్తెం = కూలి (బత్తెం-రంది. 2014: 123)

బత్తెల = బరిబాతల, నగ్నంగా (నల్లతేళ్ళు-ఇత్తు. 2014: 77)

బదనాం = చెడ్డపేరు, అపనింద (నల్లతేళ్ళు-ఇత్తు. 2014: 78)

బర్రె పడ్డలు = గేదెలు (బొద్రాయి-బొద్రాయి. 2016: 4)

బల్సి పండ్లు = పండ్లలో ఒక రకం (టోల్ గేట్-తన్లాట: 2014: 31)

బల్సిపండ్లు = ఒకరకమైన పండ్లు (టోల్ గేట్-తన్లాట: 2014: 31)

బాటు = తూకం వేసే సాధనం (నల్లతేళ్ళు-ఇత్తు. 2014: 94)

బీరప్ప = కుర్మల కులదైవం (టోల్ గేట్-తన్లాట: 2014: 31)

బుగోడ = భయం (బుగాడ-రంది. 2014: 157)

బుడ్లు = మట్టి పాత్రల్లో ఒకరకం (మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 182)

బువ్వ = అన్నం(టోల్ గేట్–తన్లాట: 2014: 32)

బొంగులు = మురుమరాలు/పేలాలు (మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 181)

బొంద = శవాన్ని పూడ్చడానికి తీసిన గుంత(టోల్ గేట్–తన్లాట: 2014: 32)

బొంది = శరీరం (వీలునామా–బొడ్రాయి. 2016: 25)

బొక్కల నూకడం = జైలుకు/కారాగారంలో వేయడాం (లచ్చిమి–అవిటి కథలు. 2013: 57)

బొమ్మిడి సాప = చేపలలో ఒకరకం (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 229)

బోగాటం = అక్రమ సంబంధం (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 75)

మంగలం పెంకు = చిరు ధాన్యాలు వేపుకోవడానికి ఉపయోగించే పగిలిన మట్టికుండ పెంకు (ఇత్తు–ఇత్తు. 2014: 65)

మండె కట్టిన వడ్లు = వరి నాటుపోయడానికి నానబెట్టిన వడ్లు (ఇత్తు–ఇత్తు. 2014: 65)

మత్తడి = అలుగు చెరువు నిండినపుడు అదనపు నీరు వెళ్ళే స్థలం (టోల్ గేట్–తన్లాట: 2014: 30)

మద్దానం = మధ్యాహ్నం (లచ్చిమి–అవిటి కథలు. 2013: 61)

మనాది = మనసు (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 76)

మానుడు = మనిషి (టోల్ గేట్–తన్లాట: 2014: 28)

మాయిముంత = మూలాలు, పూర్వీకుల ఆనవాళ్ళు (బుగాడ–రంది. 2014: 152)

మారు మనువు = రెండో పెళ్ళి (రాజన్న–ఇత్తు. 2014: 45)

మారు మునుము = పంటలు కోసేటపుడు రెండో వరుస (మునుం), (యక్షగానం–యక్షగానం. 2016: 18)

మాలేస్ర బుడ్డి = అన్నం వండిన కుండపై ఉంచే మట్టి పాత్ర–బుడ్డి (మూత).(మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 182)

ముంతలు = చిన్న మట్టి పాత్రలు(మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 182)

ముందల = ముందు (టోల్ గేట్–తన్లాట: 2014: 28)

మురిపెం = సంతోషం (ఆయిటి వాన–పరిగె చేను. 2015: 11)

ముస్తాదు = తాటిచెట్టు ఎక్కడానికి గౌడ వృత్తి చేసే వాళ్ళ సాధనం (టోల్ గేట్–తన్లాట: 2014: 30)

మేరాయన = బట్టలు కుట్టే మనిషి (అమ్మ–తన్లాట. 2014: 133)

మొగులు = ఆకాశం/మబ్బు (ఈదురు గాలి–దగ్ధం. 2017: 32)

మొదలారు = ఒక తిట్టు (ఎర్రెద్దు–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 264)

మోజు = కోరిక, ఆసక్తి(అంటు–రంది. 2014: 191)

యవారం = వ్యవహారం (అమ్మ–తన్లాట. 2014: 127)

యవుసాయం = వ్యవసాయం (రాజన్న–ఇత్తు. 2014: 44)

యాట = మేక/గొర్రె (యక్షగానం–యక్షగానం. 2016: 19)

యాడికి = ఎక్కడికి (సోయి–అలాయి బలాయి. 2015: 45)

యాది = గుర్తు (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 75)

యావ = ప్రేమ (ఆయిటి వాన–పరిగె చేను. 2015: 11)

యాసంగి = జనవరి నుంచి మే మధ్యలో వేసే పంటకాలం (రాజన్న–ఇత్తు. 2014: 44)

యిర్వాలు = రెండు సార్లు దున్నడం (పచ్చీసు–అలుగు. 2015: 50)

యెసరు = అన్నం వండే ముందు వేడిచేసే నీళ్ళు, ఆ నీళ్ళను కడిగిన బియ్యంలో పోసి వండుతారు. అప్పుడు అన్నం తొందరగా ఉండుకుతుంది.(ఆయిటి వాన–పరిగె చేను. 2015: 11)

రంకులు = అక్రమ సంబంధ నింద

రిక్కల గోషి = దోవతితో రిక్కల మాదిరిగా ఉండేటట్టుగా గోషి కడతారు. (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 20)

రేకలు బారు = తెల్లవారు (పసువులంటే మా నాయనకు పానం–పరిగె చేను. 2015: 19)

రేగు పండ్లు = చిన్నచిన్నగా ఉండే పండ్లు (టోల్ గేట్–తన్లాట: 2014: 31)

లంజెతనం = అక్రమ సంబంధ నింద(లచ్చిమి –అవిటి కథలు. 2013: 57)

లావుని పట్టా = ప్రభుత్వం బీదవారికి ఇచ్చే భూమి (వలస పక్షులు–యక్షగానం. 2016: 94)

లేత పాదాన = లేత వయస్సులో (ఎర్రెద్దు–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 265)

లైట్ పురుగు = ఒక రకమైన కీటకం (టోల్ గేట్–తన్లాట: 2014: 32)

వామి = కుండలు కాల్చే ప్రదేశం (మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 180)

వొలపటి ఎద్దు = బండి కట్టినప్పుడు లేదా నాగలి కట్టినప్పుడు ఎడమవైపు కట్టే ఎద్దును వొలపటి ఎద్దు అంటారు. (కారెడ్లు–ఎకరం నేల–ఊత కర్రలు. 2012: 105)

సక్కదనాల = చక్కదనం, అందంగా (టోల్ గేట్–తన్లాట: 2014: 33)

సత్తుగిన్నె = అల్యూమినియం పాత్ర (బుక్కెడు బువ్వ–అలుగు. 2015: 102)

సమర్త = రజస్వల (కేన్సర్ గౌరమ్మ–దగ్ధం. 2017: 101)

సరెండ = సరిపడ ఎండ (ఈదురుగాలి–దగ్ధం. 2017: 14)

సస్తి = చచ్చాను (టోల్ గేట్–తన్లాట: 2014: 30)

సాద కాగితం = తెల్ల కాగితం (వలస పక్షులు–యక్షగానం. 2016: 93)

సానా = చాలా (టోల్ గేట్–తన్లాట: 2014: 34)

సాన్పి = కళ్ళాపి (ఆయిటి వాన–పరిగె చేను. 2015: 11)

సాయమాను = వంటగది (రాజన్న–ఇత్తు. 2014: 44)

సారా మామ్లా = సారా కాచుకోవడానికి అనధికార అనుమతి ఇవ్వడంకోసం అధికార్లకు ఇచ్చే లంచం (వలస పక్షులు–యక్షగానం. 2016: 96)

సాలు = చాలు (అమ్మ–తన్లాట. 2014: 132)

సిగం = పూనకం దైవంశలో భవిష్యవాణి చెప్పడం (యక్షగానం–యక్షగానం. 2016: 20)

సిత్రం = చిత్రం, ఆశ్చర్యం (టోల్ గేట్–తన్లాట: 2014: 31)

సిమ్మ సీకటి = కటిక చీకటి, మొత్తం చీకటి (బుగాడ–రంది. 2014: 151)

సేరు = కిలో కొలమానానికి కొంచెం తక్కువగా (ఇత్తు–ఇత్తు. 2014: 65)

సోకాలు = ఒక క్రమబద్ధంగా ఏడ్వటం (టోల్ గేట్–తన్లాట: 2014: 32)

సోకు = అందం (ఎర్రెద్దు–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 263)

సోపతి = స్నేహం (వలస పక్షులు–యక్షగానం. 2016: 95)

## 5.2. క్రియా పదాలు

ఏదైనా పని జరిగేటప్పుడు దానిని క్రియా అంటారు. అటువంటి సమయాలలో ప్రయోగించే పదాలను 'క్రియాపదాలు' విభాగంలో చేర్చాను.

అపోషి = అప్పు చేసి

ఇడ్సి = విడిచి (టోల్ గేట్–తన్లాట: 2014: 30)

ఇవ్వాలె = ఇవ్వాలి (అమ్మ–తన్లాట. 2014: 133)

ఉరుకు = పరుగెత్తు (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 94)

ఉరుకులాడు = అటూ ఇటూ పరుగెత్తూ (చివరి గుడిసెలో గాజు కళ్ళు–ఇత్తు. 2014: 29)

ఒచ్చిను = వచ్చారు (అంటు–రంది. 2014: 185)

ఒస్త = వస్తాను (టోల్ గేట్–తన్లాట: 2014: 28)

గుంజు = లాగు (చివరి గుడిసెలో గాజు కళ్ళు–ఇత్తు. 2014: 29)

గుంజుకుంటూ = లాక్కుంటూ (స్నిగ్ధచ్ఛాయ–బతుకమ్మ వార పత్రిక. 2015: 28)

గెదుము = పొరదోలు (ఆయిటి వాన-పరిగె చేను. 2015: 11)

చూసొస్త = చూసి వస్తాను (అమ్మ-తన్లాట. 2014: 127)

తేనికి = తీసుకురావడానికి (బత్తెం-రంది. 2014: 123)

తొడుక్కోవడం = వేసుకోవడం (ప్రయాస-ఊత కర్రలు. 2012: 15)

తోల్కపోవు = తీసుకెళ్ళు (అంటు-రంది. 2014: 184)

దునుకు = దూకు (మట్టి మనిషి-కొన్ని వెలుగు నీడలు. 2016: 183)

పొర్రి పొర్రి = పదండి (జంట పదం) (టోల్ గేట్-తన్లాట: 2014: 30)

పెయ్యి = శరీరం (నల్లతేళ్ళు-ఇత్తు. 2014: 74)

సర్రున = వేగంగా (నల్లతేళ్ళు-ఇత్తు. 2014: 75)

సలపరం కంపరం = మనసు సతమతమవ్వటం(బహుముఖం-ఇత్తు. 2014: 57)

సోయి తప్పి = స్పృహ తప్పి (టోల్ గేట్-తన్లాట: 2014: 31)

## 5.3. ధ్వన్యనుకరణ పదాలు

మనుషులు, లేదా జంతువులు అరుస్తున్నప్పుడు, ఏవైనా వస్తువులను కదిలిస్తున్నప్పుడు వచ్చే ధ్వనులను ఆ విధంగానే మనం అనుకరిస్తాం. అటువంటి ధ్వనులను ధ్వన్యనుకరణ పదాలు అంటున్నాం. వాటిని ఇందులో చేర్చాను.

అంబా = పశువుల ధ్వన్యనుకరణ పదం(టోల్ గేట్-తన్లాట: 2014: 31)

కణ కణ = నిప్పు ధ్వన్యనుకరణ పదం(మట్టి మనిషి-కొన్ని వెలుగు నీడలు. 2016: 180)

కిస్సు కిస్సు = చెప్పుల ధ్వన్యనుకరణ (ఎర్రెద్దు-నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 266)

కుస్కు కుస్కు = దగ్గు ధ్వన్యనుకరణ (కేన్సర్ గౌరమ్మ-దగ్ధం. 2017: 100)

ఖనిల్లు ఖనిల్లు = గజ్జెలు/మువ్వల ధ్వన్యనుకరణ పదం (కారెడ్లు-ఎకరం నేల-ఊత కర్రలు. 2012: 110)

గడగడ = చలికి వణికే ధ్వన్యనుకరణ (మీనా-దగ్ధం. 2017: 15)

గడగడ = వణుకుడు ధ్వన్యనుకరణ పదం (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 236)

గణగణ = గంట మోగే ధ్వనికి ధ్వన్యనుకరణ(ఎర్రెద్దు–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 263)

గర గర = మైకు ధ్వన్యనుకరణ (ప్రజాస్వామ్యమా వర్థిల్లూ–తెలంగాణ బతుకు చిత్రాలు. 2016: 52)

గలగల = ఎండిన ఆకుల ధ్వన్యనుకరణ (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 234)

గల్ల గల్ల = గంట ధ్వన్యనుకరణ పదం (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 29)

గుట గుట = నీళ్ళు తాగే ధ్వన్యనుకరణ (నీళ్ళెంత రుచి–జీవితం. 2018: 91)

గుప్ప గుప్ప = చుట్ట తాగేటప్పుడు ధ్వన్యనుకరణ (బుగాడ–రంది. 2014: 158)

గుసగుస = చాలా నిశ్శబ్దంగా గుణుగుతూ మాట్లాడటం ధ్వన్యనుకరణ పదం(నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 75)

గొరగొర = ఈడ్చడం ధ్వన్యనుకరణ (మీనా–దగ్ధం. 2017: 14)

ఘుమఘుమ = వాసన ధ్వన్యనుకరణ(బిల్లి–రంది. 2014: 94)

టక టక టకటక = తలుపు గొల్లెం ధ్వన్యనుకరణ (ఆశిర్కం–దగ్ధం. 2017: 107)

డిల్లెం బల్లెం = డోలు ధ్వన్యనుకరణ పదం (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 30)

తుకతుక = ఉడికే ధ్వన్యనుకరణ (బిల్లి–రంది. 2014: 93)

పక పక = నవ్వు ధ్వన్యనుకరణ(జేజి–అవిటి కథలు. 2013: 191)

పట పట = కారడానికి సంబంధించిన ధ్వన్యనుకరణ పదం (టోల్ గేట్–తన్లాట: 2014: 30)

పటపట = పండ్లు కొరికినపుడు ఏర్పడే ద్వన్యనుకరణ పదం(నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 75)

పెటిల్లు = పగిలే ధ్వన్యనుకరణ(మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 183)

బగ బగ = మంట ధ్వన్యనుకరణ (మీనా–దగ్ధం. 2017: 14)

బ్రర బ్రర = ఈడ్చుకెళ్ళే ధ్వన్యనుకరణ పదం (నీళ్ళెంత రుచి–జీవితం. 2018: 95)

బిలబిల = పరుగెత్తె ధ్వన్యనుకరణ (ఎర్రెద్దు–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 263)

భగ భగ = మండే మట ధ్వన్యనుకరణ(మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 183)

సలసల = నీళ్ళూ కాగుతున్న ధ్వని (ఎర్రెద్దు–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 264)

సురసుర = పొద్దు పొడిచే ధ్వన్యనుకరణ(బత్తెం–రంది. 2014: 119)

**5.4. జంట పదాలు**

ఒక దాని తర్వాత ఒకటి ఖచ్చితంగా, ఆ సందర్భంలోనే వచ్చే పదాలను జంట పదాలు అంటాం. అవి ఒక దానిని విడిచి మరొకటి మరో చోట దాదాపుగా రావు. కొన్ని జంట పదాల్లో మొదటి దానికి అర్థం ఉంటుంది. రెండోదానికి ఉండదు. కొన్ని రెండు కలిస్తేనే సంపూర్ణ అర్థం వస్తుంది. అంటువంటి జంట పదాలను ఈ విభాగంలో చేర్చాను.

అడుగు బొడుగు = అడుగున చివరన (నీళ్ళెంత రుచి–జీవితం. 2018: 91)

అదొ ఇదొ = అది లేదా ఇది (సోయి–అలాయి బలాయి. 2015: 45)

అప్పో సప్పో = అప్పు (మీనా–దగ్ధం. 2017: 16)

అష్కలు బుష్కలు = బుదగరించు (కేన్సర్ గౌరమ్మ–దగ్ధం. 2017: 101)

ఆదరా బాదరా = తొందర తొందరగా (బహుముఖం–ఇత్తు. 2014: 57)

ఆర్చు, తీర్చు = బాధలు తీర్చడం (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 24)

ఆళ్ళు ఈళ్ళూ = వారు వీరు (టోల్ గేట్–తన్లాట: 2014: 30)

కూలికి నాలికి = కూలి మొదలైన (అమ్మ–తన్లాట. 2014: 128)

కోడి పిల్ల కొంకనక్క = కోడిపిల్ల లాంటిది(వాన కురిసిన రాత్రి–నల్లగొండ కతలు–మొదటి సంపుటి. 2011: 520)

గార్వం గీర్వం = గారాబం (ఆశిర్కం–దగ్ధం. 2017: 108)

గింత గంత = ఎక్కువ (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 26)

తర్జన బర్జన = బాగా ఆలోచించు (అంతులేని పయనం–ఊత కర్రలు. 2012: 15)

తల్లడమల్లడ = అయోమయం (అంటు–రంది. 2014: 190)

తూలుతూ సోలుతూ = తూలడం జంటపదం– (చర్విత చర్వణం– మనిషి కతలు 2015: 63)

తృణమో ఫణమో = ఎంతో కొంత (తోలు బొమ్మలు–బొడ్రాయి. 2016: 34)

పండగ పబ్బం = పండగ (రాజన్న–ఇత్తు. 2014: 45)

పదో పరకో = ఎంతో కొంత డబ్బు. (టోల్ గేట్–తన్లాట: 2014: 31)

పిల్ల పిసుకు = పిల్లలు లేరని అర్థం. (బత్తెం–రంది. 2014: 119)

పిల్లా జెల్లా = పిల్లలు (అమ్మ–తన్లాట. 2014: 133)

పురుగు బూషి = కీటకాలు, పురుగులు (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 25)

పొల్లు రెల్లు = తాలు, గట్టితనం (అమ్మ–తన్లాట. 2014: 130)

బట్ట బాత = బట్టలు మొదలైనవి (యక్షగానం–యక్షగానం. 2016: 22)

బుగులు బుత్ర = భయం (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 24)

మిగులు తగులు = మిగలటం, తలగటం (బహుముఖం–ఇత్తు. 2014: 57)

రాకల్లు పోకల్లు = రావడం, పోవడం (వలస పక్షులు–యక్షగానం. 2016: 97)

రుషిపశి = రుచి (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 230)

సిన్నదో సన్నదో = చిన్నదో, ఏదో ఒకటి (టోల్ గేట్–తన్లాట: 2014: 32)

సుట్టాలు పక్కాలు = బంధువులు, చుట్టాలు (టోల్ గేట్–తన్లాట: 2014: 31)

## 5.5. అన్యదేశ్య పదాలు

"ఏ భాషలోనైనా పదాలు దేశ్యాలు, అన్యదేశ్యాలు అని రెండు రకాలుగా ఉంటాయి. మూల భాషనుంచి సంక్రమించినవి దేశ్యాలు. తదితరాలు అన్యదేశ్యాలు. భాషలో కొత్త పదాలు చేరడానికి ముఖ్య కారణం ఆదానం. సాధారణంగా ఒక భాషను మాట్లాడే ప్రజలు భౌగోళికంగా సమీపవర్తి భాషలనుంచిగాని, సాంఘిక, రాజకీయ, మత, సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలవల్ల దూరవర్తి భాషలనుంచిగాని కొత్త పదజాలాన్ని గ్రహిస్తారు." (కృష్ణమూర్తి, భద్రిరాజు. 2014: 314). ఒక భాష మాట్లాడేవారు తన భాషలో ఒక వస్తువునుగాని, ఒక భావాన్నిగాని సంబోధించడానికి సరైన పదం లేనప్పుడు తనకు దగ్గరగా ఉన్న భాషనుంచి ఆ భాషాపదాలను తీసుకుంటాడు. వాణిజ్య సంబంధాల వల్ల భాషలు పదాలను పరస్పరం ఇచ్చి పుచ్చుకుంటాయి. పరిపాలన చేసే వాళ్ళనుండి కూడా చాలా పదాలు ప్రజలు వాడతారు. తెలంగాణలో కూడా అటువంటి పదాలు అనగా ఉర్దూ వంటి పదాలు వచ్చి తెలుగులో చేరాయి. ప్రజల వ్యవహారంలో భాగమయ్యాయి. ఆంగ్లం నుంచి కూడా అనేక పదాలు వచ్చాయి. పొరుగున ఉన్న మిత్ర భాషలనుంచి కూడా చాలా పదాలు వస్తుంటాయి. నల్లగొండ కథల్లో ఉన్న అన్యదేశ్యపదాలను కింద పేర్కొన్నాను. ఆంగ్ల, ఉర్దూ పదాలు అని రెండు భాగాలుగా విభజించాను.

**ఆంగ్ల పదాలు:**

అండర్‌లైన్ = కింది గీత (ప్రజాస్వామ్యమా వర్ధిల్లూ-తెలంగాణ బతుకు చిత్రాలు. 2016: 52)

అర్జంటు = తొందరగా (బహుముఖం-ఇత్తు. 2014: 57)

ఆర్టీఏ = రోడ్డు రవాణా సంస్థ (టోల్ గేట్-తన్లాట: 2014: 33)

ఇంటలెక్చువల్స్ = మేధావులు (ఏక్ ముసాఫిర్ దో రాస్తే-అలాయి బలాయి. 2015: 99)

ఇన్‌స్టాల్‌మెంట్ = వాయిదా పద్దతి (బహుముఖం-ఇత్తు. 2014: 59)

ఇవిఎం = ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ప్రజాస్వామ్యమా వర్ధిల్లూ-తెలంగాణ బతుకు చిత్రాలు. 2016: 55)

ఎగ్జాస్ట్ = పెద్దగా, ఎక్కువగా (చివరి గుడిసెలో గాజు కళ్ళు–ఇత్తు. 2014: 28)
ఐడియాలజీ = భావజాలం (ఏక్ ముసాఫిర్ దో రాస్తే–అలాయి బలాయి. 2015: 106)
కరెంట్ ఆఫైర్స్ = సమకాలీన విషయాలు (అమ్మ–తన్లాట. 2014: 138)
కల్లు కాంపౌండు = కల్లు దుకానం (బతుకు సంత–ఇత్తు. 2014: 83)
కెరీర్ కౌన్సిలింగ్ = జీవించడం కోసం శిక్షణ(అమ్మ–తన్లాట. 2014: 139)
జడ్జి = న్యాయమూర్తి (లచ్చిమి–అవిటి కథలు. 2013: 60)
జర్నలిజం = పత్రికా రంగం(గది–నల్లగొండ కతలు–మొదటి సంపుటి. 2011: 480)
టాక్స్ = పన్ను (టోల్ గేట్–తన్లాట: 2014: 33)
ట్రాజెడి = విషాదం (అమ్మ–తన్లాట. 2014: 140)
ట్రాన్ఫర్ = బదిలీ (బిల్లి–రంది. 2014: 93)
డైనమిక్ = గొప్ప (అమ్మ–తన్లాట. 2014: 138)
డోన్టాక్ రబ్బిష్ = కఠినంగా, మర్యాద లేకుండా మాట్లాడవద్దు. (బహుముఖం–ఇత్తు. 2014: 57)
నాన్ బోర్డర్ = ప్రవేశం లేని వ్యక్తి (అమ్మ–తన్లాట. 2014: 138)
నో స్టాక్ = నిల్వ లేదు (ఇత్తు–ఇత్తు. 2014: 66)
పంక్చర్ = రంధ్రం, టైర్లలో పడే రంధ్రం (టోల్ గేట్–తన్లాట: 2014: 29)
పోస్టుమార్టం = శవ పరీక్ష (చివరి గుడిసెలో గాజు కళ్ళు–ఇత్తు. 2014: 31)
ఫ్లడ్ లైట్ = ఎక్కువ కాంతిని ఇచ్చే విద్యుద్దీపాలు (టోల్ గేట్–తన్లాట. 2014: 34)
ఫ్లయ్ ఓవర్ = పై వంతెన (టోల్ గేట్–తన్లాట: 2014: 34)
ఫార్మాలిటీ = పద్ధతి (అమ్మ–తన్లాట. 2014: 138)
ఫ్రెండ్ = స్నేహితుడు (థర్డ్ డిగ్రీ– తన్లాట. 2014: 137)
ఫ్లాష్ బ్యాక్ = గతం (మార్నింగ్ వాక్–మనిషి కతలు. 2015: 76)

బ్యాటరీ = విద్యుత్తు నిలువ ఉండేది (అమ్మ–తన్లాట. 2014: 128)

భీఫ్ బిర్యాని = గొడ్డు కూర/పశువుల కూర(బుక్కెడు బువ్వ–అలుగు. 2015: 106)

మైనింగ్ = తవ్వకం (టోల్ గేట్–తన్లాట: 2014: 34)

మ్యాన్‌పవర్ సప్లయర్ = మానవ వనరులను సర్దేవాడు (చివరి గుడిసెలో గాజు కళ్ళు–ఇత్తు. 2014: 31)

మ్యారేజ్ = పెళ్ళి (అంటు–రంది. 2014: 184)

యాక్సిడెంట్ = ప్రమాదం (టోల్ గేట్–తన్లాట: 2014: 34)

రిలీజ్ = విడుదల (మార్నింగ్ వాక్–మనిషి కతలు. 2015: 77)

రోడ్డు = రహదారి (టోల్ గేట్–తన్లాట: 2014: 28)

వైటు మని = సక్రమమైన డబ్బు (ఆశ –యక్షగానం. 2016: 41)

సజెస్ట్ = సలహా (అంటు–రంది. 2014: 182)

సిటీ = పట్టణం (అంటు–రంది. 2014: 183)

సెక్యూరిటీ గార్డు = కాపాలాదారు (చివరి గుడిసెలో గాజు కళ్ళు–ఇత్తు. 2014: 30)

స్టార్ట్ = ప్రారంభం(టోల్ గేట్–తన్లాట: 2014: 34)

స్ట్రక్ = ఆగిపోవడం (అమ్మ–తన్లాట. 2014: 140)

హార్ట్ = గుండె (మార్నింగ్ వాక్–మనిషి కతలు. 2015: 79)

హియరింగ్ = వినడం (లచ్చిమి –అవిటి కథలు. 2013: 60)

హైవే = రహదారి (టోల్ గేట్–తన్లాట: 2014: 30)

**ఉర్దూ పదాలు:**

అమీన్ సాబ్ = పోలీసు అధికారి (మార్కెట్–ఇత్తు. 2014: 87)

అర్గిజ్ = అస్సలు కుదరదు (ఓ సిన్నోని కత–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 245)

ఆఖరు = చివరి (అంటు–రంది. 2014: 189)

ఇజ్జత్ = గౌరవం (బత్తెం–రంది. 2014: 119)

ఇన్సాఫ్ = (ఓ సిన్నోని కత–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 246)

ఇమ్మతి = బలపర్చు (లచ్చిమి –అవిటి కథలు. 2013: 60)

ఇరామ్ = విశ్రాంతి (టోల్ గేట్–తన్లాట: 2014: 31)

ఈద్గా = ముస్లింలు నమాజు చేసే స్థలం (ఖబర్–అలాయి బలాయి. 2015: 68)

ఎక్రార్ నామా = ఒప్పంద పత్రం (ఓ సిన్నోని కత–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 245)

కఫన్ = గుడ్డ (జీవం –అధూరె. 2011: 125)

కబూతర్ = పావురం (కబూతర్–అధూరె. 2011: 57)

కాంటా = తూకం (కారెడ్లు–ఎకరం నేల –ఊత కర్రలు. 2012: 109)

కీస = జేబు (పచ్చీసు–అలుగు. 2015: 48)

కుష్ = సంతోషం(నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 89)

కోషిష్ = బేరమాడు (అంటు–రంది. 2014: 189)

ఖబురు = ముచ్చట (ఖబర్–అలాయి బలాయి. 2015: 72)

ఖాతరు = లెక్క చేయకపోవడం (బొౝ్రాయి–బొౝ్రాయి. 2016: 5)

ఖుష్కి = మెట్ట (నా కథ–కథల గూడు. 2012: 18)

గడ్ బడ్ = గందరగోళం (అంటు–రంది. 2014: 188)

జల్ది = తొందరగా (టోల్ గేట్–తన్లాట: 2014: 27)

జిందగీ = జీవితం (సోయి–అలాయి బలాయి. 2015: 42)

టంచను = పదే పదే (ఏక్ ముసాఫిర్ దో రాస్తే–అలాయి బలాయి. 2015: 100)

టక్కరి = ప్రమాదం (టోల్ గేట్–తన్లాట: 2014: 27)

డోలా = ముస్లింలు శవాన్ని ఎత్తుకుపోయే పాడె(జీవం–అధూరె. 2011: 125)

తాహతు = సామర్థ్యం (లతీఫ్ మియా శాస్త్రం –అలాయి బలాయి. 2015: 55)

దవాఖానా = ఆసుపత్రి (టోల్ గేట్–తన్లాట: 2014: 27)

దాదీమా = నాన్నమ్మ (దీవారెం–లద్దాఫ్ని. 2016: 114)

| | | |
|---|---|---|
| దావత్ | = | శుభకార్యం(లతీఫ్ మియా శాస్త్రం–అలాయి బలాయి. 2015: 55) |
| దిమాక్ | = | మెదడు (పచ్చీసు–అలుగు. 2015: 50) |
| దిలాసా | = | (ఓ సిన్నోని కత–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 246) |
| దునియా | = | ప్రపంచం (ప్రయాస–ఊత కర్రలు. 2012: 16) |
| దువా | = | ఆశీస్సు (ఖబర్–అలాయి బలాయి. 2015: 65) |
| దోస్త్ | = | స్నేహితుడు (టోల్ గేట్–తన్లాట: 2014: 27) |
| ధీమా | = | ధైర్యం (లచ్చిమి–అవిటి కథలు. 2013: 60) |
| నారాజు | = | దిగులు పడు (సోయి–అలాయి బలాయి. 2015: 45) |
| నిఖా | = | పెళ్ళి (అంటు–రంది. 2014: 190) |
| నిఘా | = | రహస్యంగా గమనించడం (నా కథ–కథల గూడు. 2012: 20) |
| నౌకరి | = | ఉద్యోగం (ఆశ –యక్షగానం. 2016: 40) |
| పట్వారీ | = | రెవెన్యూ (వలస పక్షులు–యక్షగానం. 2016: 95) |
| పయకాన | = | మరుగుదొడ్డి (జేజి–అవిటి కథలు. 2013: 194) |
| పరేషాను | = | ఆందోళన (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 232) |
| పషానత్ | = | గుర్తించు (బుగాడ–రంది. 2014: 153) |
| పుక్కడు | = | ఉచితం (బతుకు సంత–ఇత్తు. 2014: 84) |
| ఫాతెహా | = | ప్రార్థన, మరణించిన వారి పేరిట ఇచ్చే దానం (ఖబర్–అలాయి బలాయి. 2015: 67) |
| ఫికరు | = | ఆందోళన (మట్టి మనిషి–కొన్ని వెలుగు నీడలు. 2016: 181) |
| బందోబస్తు | = | రక్షణ (కలలగూడు–కథల గూడు. 2012: 8) |
| బక్రా | = | కోయడానికి సిద్ధం చేసిన మేక (బహుముఖం–ఇత్తు. 2014: 63) |
| బట్టెబాజ్ | = | తిట్టు (బుక్కెడు బువ్వ–అలుగు. 2015: 106) |
| బడోంకి ఈద్ | = | పెద్దల పండుగ (ఖబర్–అలాయి బలాయి. 2015: 64) |
| బాతాఖాని | = | పిచ్చాపాటి ముచ్చట్లు (భయం–కథల గూడు. 2012: 104) |

బికారి = బీద, పేద (మాయ–బొ(ద్రాయి. 2016: 110)

బిచాణా = మకాం (ఇత్తు–ఇత్తు. 2014: 70)

బుక్కా గులాల్ = ఒకరకమైన రంగుల పొడి (చిలుకల దండ–నల్లగొండ కతలు–మొదటి సంపుటి. 2011:504)

భాయి = సోదరుడు (దీవారెం–లద్దాఫ్ని. 2016: 109)

మగ్ రిబ్ = సూర్యాస్తమయ వేళ చదివే నమాజు (జీవం–అధూరె. 2011: 123)

మజార్ = సమాధి (ఉర్సు–అధూరె. 2011: 101)

మతలబు = విషయం (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 76)

మత్లావ్ = సమాచారం (టోల్ గేట్–తన్లాట: 2014: 29)

మస్కూరు = గ్రామ కాపలాదారు (వలస పక్షులు–యక్షగానం. 2016:93)

మస్తు = ఎక్కువ, అధికం (ఎర్రెద్దు–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 264)

మాత్తర్ చో = తిట్టు (బుక్కెడు బువ్వ–అలుగు. 2015: 106)

మాఫ్ = రద్దు (అంటు–రంది. 2014: 193)

మిలాకత్ = కలవడం(నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 78)

ముష్కిల్ = కష్టం (కబూతర్–అధూరె. 2011: 59)

రివాజు = పద్ధతి (అమ్మ–తన్లాట. 2014: 139)

రిష్తా = సంబంధం (కబూతర్–అధూరె. 2011: 58)

లేన్ దేన్ = కట్నం (కబూతర్–అధూరె. 2011: 58)

లోట = పెద్ద చెంబు /డబ్బా (టోల్ గేట్–తన్లాట: 2014: 28)

షరీక = ప్రవేశం (అమ్మ–తన్లాట. 2014: 128)

షాదీ = వివాహం (లతీఫ్ మియా శాస్త్రం–అలాయి బలాయి. 2015: 50)

షాదీఖాన = కళ్యాణ మండపం (కలలగూడు–కథల గూడు. 2012: 1)

సమజ్ = అర్థం, మనసుకు తట్టడం (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 76)

సలామ్ = నమస్కారం (మజ్బూర్–అధూరె. 2011: 48)

సవాల్ = ఎదుర్కోవడం, పోటీపడటం (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 88)

సుస్తి = అనారోగ్యం, నీరసం (మీనా–దగ్ధం. 2017: 15)

సోంచాయించు = ఆలోచించు (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 76)

హలాల్ = మేకను, గొర్రెను లేదా కోడిని కోసేటపుడు ముస్లీంలు అల్లాకు ప్రార్థించి కోస్తారు. చాలామంది హిందువులు కూడా ముస్లీంల తోటి హలాల్ చేయించుకొని మొక్కి తింటారు. (లతీఫ్ మియా శాస్త్రం–అలాయి బలాయి. 2015: 55)

హాలతు = పరిస్థితి (కబూతర్–అధూరె. 2011: 58)

## 5.6. సామెతలు, జాతీయాలు

### సామెతలు

చెప్పదల్చుకున్న విషయాన్ని ఆకర్షణీయంగా, ప్రభోధాత్మకంగా, శక్తివంతంగా చెప్పడానికి సామెతలు వాడటం పరిపాటి. నిత్య వ్యవహారంలో కూడా ప్రజల సంభాషణలో నోటినుంచి సామెతలు జాలువారుతూ ఉంటాయి. రచయితలు సామెతల్ని ప్రయోగించి తమ రచనల్ని మరింత పటుత్వాన్ని చేకూరుస్తారు. సందర్భానుసారంగా సామెతను ప్రయోగించడం చక్కని విందు భోజనం లాంటిది.

సామెతకు నానుడి, లోకోక్తి, శాస్త్రం, జనశ్రుతి మొదలైన పర్యాయ పదాలు ఉన్నాయి. సామెతలు సంక్షిప్తంగా ఉండడం, వాక్య రూపంగా ఉండటం, అనుభవరూపంగా ఉండటం, ఉపదేశాత్మకంగా ఉండటం, వాఖ్యార్థం కంటే వ్యంగ్యార్థం ప్రధానంగా ఉండటం అనే లక్షణాలు కలిగి ఉన్నాయి.

సామెతలు ఒకరు రచించినవి కావు. ఇవి సమాజ సమీష్ట జీవన మధనంలా పేరిన మీగడవంటివి. నుడికారపు సొంపు తెలిసిన ఏ రచయితయినా సామెతలను తన రచనల్లో పొదుగుకోకుండా ఉండలేడు. జన జీవనంలో కలిసిపోయిన సామెతలను సందర్భోచితంగా రచనల్లో వాడుకోవడం వల్ల వర్ణించే వస్తువుకు సహాయకారిగా ఉండి ఆ రచన పాఠక హృదయానికి హత్తుకోవడమనే ప్రయోజనాన్ని నెరవేరుస్తుంది.

**జాతీయాలు:**

భావ వినిమయానికి సాధనం భాష. భావ వ్యక్తీకరణ అనేది సందర్భానుసారంగా ఉంటుంది. భావాన్ని చాలా సులభంగా, సంక్షిప్తంగా సమాచారాన్ని చేరవేయడంకోసం జాతీయాలు ఉపయోగపడతాయి. మనస్సుకు హత్తుకునేలా చెప్పడానికి జాతీయాలు ఉపయోగపడతాయి. ప్రతి భాషలోనూ జాతీయాలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఏ భాషా రచయిత అయినా ఆ భాషలోని జాతీయాలను ఒంటబట్టించుకొని, సందర్భానుసారంగా ప్రయోగిస్తే ఆ రచన రాణిస్తుంది. పాఠకుల మనసులో నాటుకుపోతుంది.

జాతీయానికి చమత్కారం, నుడికారం, నుడికట్టు, పలుకుబడి, భాషీయం అనే పర్యాయ పదాలున్నాయి. ఏ భాషకైనా తనదైన ప్రత్యేక నుడికారపు సొంపు ఉంటుంది. ఇది ఆ భాషకు పరంపరంగా సిద్ధించిన సాంస్కృతిక లక్షణం. జాతీయాలు భాషకు పుష్టిని, సొగసును ఇస్తాయి. భాషకు తమదైన ప్రత్యేకతను కలిగిస్తాయి. "పదాలకున్న సహజార్థాన్ని మరుగుపరిచి విలక్షణమైన అర్థంలో ప్రయోగించబడే పదాలు లేదా పదబంధాలనే జాతీయాలు" (జి.ఎన్. రెడ్డి. 1995: 421–430).

సామెతలను, జాతీయాలను విడదీయడం కష్టం. అయినా విభజించవచ్చు. కాని రచయితలు కవితాభివ్యక్తులు, లోకోక్తులు మొదలైన రూపాల్లో భిన్న రకాలుగా తమ తమ కథల్లో వాడారు. కనుక సామెతలను, జాతీయాలను, లోకోక్తి, నుడికారం మొదలైన అన్నింటిని కలిపి కింద పేర్కొన్నాను. ఇవన్నీ దగ్గరి సంబంధంతో ఉండి భిన్నతను ప్రదర్శిస్తాయి.

1. అటికెలకు లేదుగాని అట్టాలు కావాల్నట: తినడానికి తిండి సరిగ్గా లేకపోయి, సోకులు పడితే దీనిని వాడతారు. (ఎర్రెద్దు–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 262)
2. అల్లుండ్లు కొడ్కయితరా కోడలు బిడ్డైతదా: మనవాళ్ళు/మనకు బుట్టినవారే మనవారవుతారని అర్థం. (కేన్సర్ గౌరమ్మ–దగ్ధం. 2017: 102)
3. ఆకాశరామన్న ఉత్తరం: ఎవరో ఏదో చెప్పినప్పుడు దీనిని వాడతారు. (బహుముఖం–ఇత్తు. 2014: 58)

4. ఆవును దన్నమని దూడను చీకమని అన్నట్లుంది: గొడవలు పెట్టించడం అని అర్థం. (కాలేకి కథ–తెలంగాణ బతుకు చిత్రాలు. 2016: 52)
5. ఇత్తు చేసిన మాయను ఈశ్వరుడైనా పట్టలేకపోయెను: విత్తిన విత్తనాలు మంచిగా ఉన్నాయని భూమిలో వేస్తే మంచిగా మొలకెత్తలేదు. లేకుంటే మొలకెత్తినా మొక్క మంచిగ పెరగలేదు. అటువంటప్పుడు దీనిని వాడతారు. (ఇత్తు–ఇత్తు. 2014: 72)
6. ఇసుంట రమ్మంటే ఇల్లంత నాదేనన్నట్టు: గౌరవించి, చేరదీసి దగ్గరకు రానిస్తే ఇల్లంతా నాదేనని అంటారు కొందరు. అప్పుడు దీనిని వాడతారు. (ఓ సిన్నోని కత–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 246)
7. ఎండమావుల వెంట పయనం: ఎండమావులు దూరంగా ఉన్నప్పుడు కనిపిస్తాయి. కాని దగ్గరికి వెళ్తే కనిపించవు. (బహుముఖం–ఇత్తు. 2014: 57)
8. ఎడ్లన్కనే ముడ్లు, ముడ్లెన్కనే ఎడ్లు: ఏదైనా వంశపార పర్యం అని చెప్పే సందర్భంలో, ఒకరిని అనుసరించి ఒకరు చెడుపనులు చేస్తే ఇలా అంటారు. (కేన్సర్ గౌరమ్మ–దగ్ధం. 2017: 106)
9. ఎర్గనూర్లె మొరగని కుక్కోలె: ఏమి తెలియని దగ్గర జాగ్రత్తగా, నిశ్శబ్దంగా ఉండాలని దీనర్థం. (కేన్సర్ గౌరమ్మ–దగ్ధం. 2017: 103)
10. ఏడేండ్ల శని ఎంట వడ్డట్టు: చాలా కష్టాలు వచ్చినప్పుడు దీనిని వాడతారు. (లచ్చిమి–అవిటి కథలు. 2013: 61)
11. ఏదోనాడు నిజం నిల్కడగా నీటిపై తేలినట్టు: నిజం నిప్పులాంటిది. అది ఎప్పుడైనా బయటపడుతుందని దీని అర్థం. (బుగాడ–రంది. 2014: 158)
12. ఒంటె పెదాలకు నక్క ఎదురు చూసినట్టు: అందని దాని గురించి ఎదురు చూడవద్దని దీనర్థం. (వలస పక్షులు–యక్షగానం. 2016: 98)
13. కంచం మంచం ఒకటే అన్నంత సోపతి : కలిసి తినడం, కలిసి పడుకొనే స్నేహం చేసే వారికి ఈ జాతీయాన్ని వాడతారు. (చివరి గుడిసెలో గాజు కళ్ళు–ఇత్తు. 2014: 29)
14. కంటినిండ కునుకు లేదు...కడుపు నింద తిండిలేదు: నిద్రలేకుండా పని చేసినా తినే తిండికోసమైనా ఏమీ రావటం లేదని దీనర్థం. (కబూతర్–అధూరె. 2011: 58)

15. కడుపు నిండదూ, కాలం గడవదు: తిండికి లేకుండా ఇబ్బంది ఉన్నప్పుడు దీనిని వాడతారు. (నల్లతేళ్ళు–ఇత్తు. 2014: 91)

16. కడుపుల పేగులుల్లేనోల్లు, కాటికి దగ్గరైనోల్లు: తినడానికి తిండి, మాట్లాడటానికి మాట రానివాళ్ళు, చనిపోవడానికి సిద్ధంగా ఉన్నవాళ్ళు దీనిని వాడతారు. (ఆనొస్తే... చెరువేది?– నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 238)

17. కళ్ళలో ఒత్తులు పెట్టుకొను: నిద్రాహారాలు మాని పనిచేయడం, దేనికోసమైనా ఎదురు చూడటం వంటి వాటికి ఇది వాడతారు. (కారెడ్లు–ఎకరం నేల–ఊత కర్రలు. 2012: 109)

18. కాకున్నది కాకమానదు పోయెటోడు పోకమానడు: జరగాల్సినది ఏదైనా జరుగుతూనే ఉంటుందని దీనర్థం. (మీనా–దగ్ధం. 2017: 21)

19. కాలు గాలిన పిల్లి: ఏమీ తోచక అటూ ఇటూ తిరిగేవారిని ఇలా అంటారు. (ఆయిటి వాన– పరిగె చేను. 2015: 12)

20. కాల్లకు బలపం కట్టుకొను: చదువు చెప్పడంకోసం తిరిగేవారిని ఇలా అంటారు. (అమ్మ వాసన–నల్లగొండ కతలు–మొదటి సంపుటి. 2011: 484)

21. కుండబద్దలు కొట్టినట్టు: ఉన్నది ఉన్నట్టు మాట్లాడే వారికి ఇది వాడతారు. (పిల్లలు–జీవితం. 2018: 126)

22. కుండలు బద్దలు కొట్టినట్టు: ఏదైనా చెప్పేటప్పుడు సూటిగా, స్పష్టంగా చెప్పాలని దీనర్థం. (వలస పక్షులు–యక్షగానం. 2016: 96)

23. కుక్కను చంపాలంటే పిచ్చికుక్క అనాలన్నట్లుంది: ఎవరినైనా మంచివారిని తిట్టాలంటే, అవమాన పర్చాలంటే వారిని పిచ్చివారిగా ప్రచారం చేయాల్సిందే. అలాంటి సమయంలో దీనిని వాడతారు. (కాలేజి కథ–తెలంగాణ బతుకు చిత్రాలు. 2016: 120)

24. కుట్కి సెడ్తి కులాన్కి సెడ్తి: ఏదైనా సమయంలో ఎటుకాకుండా ఇబ్బది పడ్డప్పుడు దీనిని వాడతారు. (జేజి–అవిటి కథలు. 2013: 192)

25. కుడుమంటె పండ్గజేయు: తిండికోసం ఎక్కువ ఖర్చు పెట్టేవారిని ఇలా అంటారు. (కేన్సర్ గౌరమ్మ–దగ్ధం. 2017: 105)

26. గడ్డ ఎక్కితేనే గరత్మంతుడన్నట్టు: పెద్ద పనిని చేసేటపుడు దీనిని వాడతారు. (ఎర్రెద్దు–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 261)

27. గుండె చెరువైతది: చాలా బాధ ఉన్నప్పుడు ఇది వాడతారు. (అమ్మ–జీవితం. 2018: 124)
గుండెలో రాయి పడు: ఏదైనా భయంకర విషయం తెలిసినపుడు దీనిని వాడతారు. (మజ్బూర్–అధూరె. 2011: 64)

28. చింత చచ్చినా పులుపు చావలేదు: చెడువారికి జీవితంలో ఏదైనా పెద్ద ఎదురుదెబ్బ తగిలినా ఇంకా మారకపోతే ఇలా అంటారు. (బొౖడాయి–బొౖడాయి. 2016: 7)

29. చీమ చిటుక్కుమంటే ఒట్టు: నిశ్శబ్దాన్ని తెలియజేసేది (నీళ్ళెంత రుచి–జీవితం. 2018: 94)

30. చెప్పులరగంగ: ఒక పనికోసం చాలాసార్లు ప్రయత్నం చేస్తే ఇలా వాడతారు. (కబూతర్–అధూరె. 2011: 60)

31. టక్కరి బుద్దులు: మంచి బుద్దులు లేనివారిని దీన్ని వాడి తిడతారు. (ఓ సిన్నోని కత–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 246)

32. తలంపానం తోకకు: ఏదైనా పని చేసేటప్పుడు చాలా ఇబ్బంది వస్తే ఇలా అంటారు. (కబూతర్–అధూరె. 2011: 58)

33. తల్లో నాలుక లెక్క మెలిగే: కలుపుగోలుగా మెలగడాన్ని ఇలా అంటారు. (లతీఫ్ మియా శాస్త్రం–అలాయి బలాయి. 2015: 54)

34. తినమర్గినోల్లు సిగ్గుశెరం లేనోల్లు అంతల్కగ బోతరా: ఏ పని చేయకుండా హాయిగా తిని కూర్చునేవాళ్ళు అంత తొందరగా ఆ అవకాశం నుంచి దూరంగా జరగరు. (ఓ సిన్నోని కత–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 246)

35. తిమ్మిని బమ్మిని చేయడం: ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా చేసి, తనకు అనుకూలంగా మార్చుకునేవారిని ఈ విధంగా అంటారు. (వలస పక్షులు–యక్షగానం. 2016: 97)

36. దోసిలొగ్గిన నేలకు దూపదీర్చిన ఆనందం = (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 230)

37. నక్క ఇనయాలొల్కబోసి: కొందరు తప్పుచేసి వినయంగా ఉన్నట్టు నటిస్తారు. నక్క కూడా అలాగే చేస్తుంది. కాబట్టి దీనిని వాడతారు. (ఓ సిన్నోని కత–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 246)
38. నమ్మి నానవోస్తే పుచ్చి పుర్గులైపాయె: నమ్మివాళ్ళు మోసంచేస్తే దీనిని వాడతారు. (ఈదురు గాలి–దగ్ధం. 2017: 35)
39. నల్లేరు మీద నడక: చాలా కష్టమైన పని చేసేటపుడు దీనిని వాడతారు. (బహుముఖం–ఇత్తు. 2014: 57)
40. నియ్యతున్నోన్కి నాయం జర్గుతదన్న భరోసా అదే దిలాసా: (ఓ సిన్నోని కత–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 246)
41. నోట్లె మన్నుబడ: ఇది కూడా స్త్రీలు వాడే ఒక శాపనార్థం. (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 231)
42. నోట్లో నాలుక లేదు: అమాయకులను దీనితో సంబోధిస్తారు. (పిల్లలు–జీవితం. 2018: 126)
43. పదిమంది నడ్సిన తొవ్వన పచ్చగడ్డి మొల్వదట: అందరూ ఒకే మూసదోరణిలో వెళ్ళొద్దనేది దీని అర్థం. (బుగాడ–రంది. 2014: 158)
44. పిల్లకాకి కేం దెలుసువుండేలు దెబ్బ: అనుభవం లేనివారిని ఇలా అంటారు. (బొౖద్రాయి–బొౖద్రాయి. 2016: 5)
45. పుట్టు దొండాకు పసరేంచు: బాగా గొడవ జరిగినప్పుడు, నానా రకాలుగా తిట్టుకున్నప్పుడు దీనిని వాడతారు.(కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 22)
46. పుడితొక్కటి సస్తె రెండు: పుడితే ఒకటి పుట్టినా సాలు, సస్తే రెండు చావనీయ్యి అని అర్థం. (రాజన్న–ఇత్తు. 2014: 47)
47. పునాసొచ్చిన పుటుక్కుమని చినుకు పడలె: వర్షం పునాస కార్తె వచ్చినా ఇంకా పడలేదు. ఎప్పుడో పడాల్సి ఉండే దానికి దీనిని వాడతారు. (రాజన్న–ఇత్తు. 2014: 45)

48. పుష్కరాలకొచ్చి ఏ పాపమెరుగనట్టు: పాపాలు పోవడానికి పుష్కరాలకు వెళ్తారు. కనుక పుష్కరాలకు వెళ్ళి నాకు ఏం పాపం తెలియదు అని నటించవద్దని దీని భావం. (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 238)

49. పూలల్లో పెట్టి ఇవ్వు: గౌరవంగా ఇవ్వటానికి దీనిని వాడతారు. (ఆశ–యక్షగానం. 2016:42)

50. పైస ఆమ్దని లేదు–గడియ పుర్సత్ లేదు: కొందరు పని చాలా చేసుకుంటూ పోతునే ఉంటారు. కాని ఆదాయం మాత్రం ఏం ఉండదు. అప్పుడు దీనిని వాడతారు. (సోయి–అలాయి బలాయి. 2015: 46)

51. పొయ్యే తట్టులేదు, పోకుంట ఊకునెతట్టు లేదు: తటస్థంగా ఉండే సమయంలో ఇది వాడతారు. (లతీఫ్ మియా శాస్త్రం–అలాయి బలాయి. 2015: 54)

52. బతికుంటే బలుసాకన్న తిని బత్తవు: ఏదైనా కష్టమొస్తే చావు పరిష్కారం కాదని దీని అర్థం. (కుష్టాదికిష్టయ్య–అవిటి కథలు. 2013: 26)

53. బత్కుంటే బట్చాకన్న తిని బత్కొచ్చు: బతికుండటం ముఖ్యం. బతికుంటే ఏదైనా తిని బతకవచ్చు అని దీని అర్థం. (బుగాడ–రంది. 2014: 158)

54. బెల్లం సుట్టు ఈగలు ముస్రినట్టు: తినడానికి లేదా అవకాశాలు ఎక్కడ ఉంటే అక్కడ జనం గుమికూడతారని అర్థం. (జేజి–అవిటి కథలు. 2013: 188)

55. భూమ్మీద నూకలు బాకి ఉంటే: ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బతికే అవకాశం ఉంటే, వారిని భూమిమీద నూకలు ఉంటే బతుకుతాడు అని దీన్ని వాడతారు. (రాజన్న–ఇత్తు. 2014: 44)

56. మంకుపట్టు: ఎంత చెప్పినా వినకుంటే దీనిని వాడతారు.(కలలగూడు–కథల గూడు. 2012: 7)

57. మంచోన్ని ఆకిట్లనించెలగొట్టి దొంగోనికి తలుపులు దీసిపెట్టే: మంచివారెవరో, చెడ్డవారెవరో సరిగ్గా గుర్తించనపుడు దీనిని వాడతారు. (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 232)

58. మంత్రాలకు సింతకాయలు రాలవు: ఎవరైనా బెదిరిస్తే దీనిని వాడతారు. (ఎర్రెద్దు–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 267)

59. మన్నుబొయ్య: ఎవరినైనా తిట్టేటప్పుడు స్త్రీలు ఎక్కువగా దీనిని వాడతారు. ఇది ఒక శాపనార్థం. (బతుకు సంత–ఇత్తు. 2014: 80)

60. మింగ మెతుంకలేదుగని సదువుమీద పాణం తీపి గుంజుతుంది: బీదవాళ్ళు చదువుకోసం ఆరాటపడే సమయంలో దినిని వాడతారు. (మీనా–దగ్ధం. 2017: 16)

61. ముడ్డి దడవకుంట తానం జేసినట్టు–పాశివాసన బోకుంట పండ్లుదోమినట్టు: ఏవైనా పనులు సరిగ్గా చేయకపోతే దీనిని వాడతారు. (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 231)

62. మూడు పూవులు ఆరు కాయలు: ఎద్దైనా అనుకున్న పని సజావుగా సాగితే దీనిని వాడతారు. (వలస పక్షులు–యక్షగానం. 2016: 96)

63. రెక్కల కష్టం జేసినోడు బొక్కలు దేలినట్టుంటే–ఎత్కదెంగినోడు ఏడు మేడలు గట్నట్టుంది: కష్టపడి పనిచేసినోని బొక్కలు కరుగుతాయి, ఒళ్ళు అలసిపోతుంది. అక్రమ మార్గాల్లో సంపాదించిన డబ్బుతో సంతోషపడెటోడు మేడలు కడతాడని అర్థం. (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 230)

64. రెక్కలు ముక్కలు జేస్కొను: బాగా కష్టపడే వారిని ఇలా అంటారు. (కేన్సర్ గౌరమ్మ–దగ్ధం. 2017: 102)

65. రెక్కాడ్తె గాని డొక్కాడదు: రెక్కలు వంచి పనిచేస్తేనేగాని, తినడానికి తిండి ఉండదని దీని అర్థం. (జేజి–అవిటి కథలు. 2013: 192)

66. లొట్టెడు తాగి కట్టన పండు: తాగుబోతుని వారిని ఉదేశించేది. (జేజి–అవిటి కథలు. 2013: 190)

67. లోకంతో లొట లొట: అందరితోపాటు మనం అని అర్థం. (ఇత్తు–ఇత్తు. 2014: 69)

68. లోటల రాళ్ళేసినట్టు లొడలొడ మాట్లాడేటోడు: బాగా లొడలొడ మాట్లాడేవాళ్ళు లోటలో రాళ్ళు వేసినట్లు మాట్లాడతారు అని దీనిని వాడతారు. (టోల్ గేట్–తన్లాట: 2014: 28)

69. వచ్చిందే దక్కిందని బుక్కు: ముందు వచ్చిందేదో అనుభవించాలని అర్థం. (వలస పక్షులు–యక్షగానం. 2016: 92)

70. వేడి సున్నంలో పడి రంగరింపబడుతున్నట్లు: వేడి సున్నంలో పడితే మాడిపోతారు. కాబట్టి చాలా కష్టాలు వచ్చినప్పుడు ఇలా అనుకుంటారు. (బహుముఖం–ఇత్తు. 2014: 57)

71. సందకాడ సవాల్ తెల్లార్తె దివాల్: రాత్రంతా లొల్లిపెట్టి తెల్లావారిన తర్వాత నాకేం తెల్వదన్నట్టు ఉంటారు. ఎక్కువ మాట్లాడి పని ఏం చేయకుండా వారిని ఇలా అంటారు. (కేన్సర్ గౌరమ్మ–దగ్ధం. 2017: 102)

72. సందట్లో సడేమియా: ఎవరైనా మాట్లాడుతుంటే మధ్యలో వచ్చి అనవసరంగా మాట్లాడి చెడగొట్టే వారిని సందట్లో సడేమియా అంటారు. (బహుముఖం–ఇత్తు. 2014: 53)

73. సత్తి సంసారె ముత్తి ముండ: మంచివారిని చెడ్డవారిని తిట్టినప్పుడు దీనిని వాడతారు. (జేజి–అవిటి కథలు. 2013: 192)

74. సాపకింద నీల్లొచ్చినట్టు: ఏదైనా ప్రమాదం మనకు తెలియకుండా వచ్చినప్పుడు దీనిని వాడతారు. (ఆనొస్తే... చెరువేది?–నల్లగొండ కథలు: రెండవ సంపుటి. 2015: 232)

75. సూస్తె సుక్క లేస్తె కుక్క: చూడటానికి అందంగా ఉన్నా, గొడవకు సిద్ధం అనేవారిని ఇలా అంటారు. (అమ్మ వాసన–నల్లగొండ కతలు–మొదటి సంపుటి. 2011: 484)

76. హాళ్ళికి హాళ్ళి సున్నకు సున్న: ఏదైనా పని చేసినపుడు ఏమీ మిగలకపోతే అప్పుడు దీనిని వాడతారు. (రూపాయలను అణాలుగా మార్చటానికి ఉపయోగించే ఇప్పటి దశాంశ బిందువు లాంటిది హాళ్ళి. సున్న తెలిసిందే. అంకెలు లేకుండా హాళ్ళి, సున్న మాత్రం ఉంటే మిగిలేది హాళ్ళీ, సున్నాయే, శూన్యం. లాభం లేదు, నష్టం లేదు. (బతుకు సంత–ఇత్తు. 2014: 79)

77. హాళ్ళికి హాళ్ళికి పూజకు పూజ: ఏదైనా పని సరిగ్గా జరగక, లాభం రాకా, నష్టం రాకా తటస్థంగా ఉంటే దీనిని వాడతారు. (వలస పక్షులు–యక్షగానం. 2016: 98)

*****

# ముగింపు

పోరాటాల ఖిల్లా, విప్లవాల పురిటిగడ్డ. ఎన్నో ఉద్యమాలకు ఆయువుపట్టు నల్లగొండ జిల్లా. సాహితీ రంగంలో ఎన్నో ప్రయోగాలకు తెరలేపిన జిల్లా. తొలి కథకురాలు బండారు అచ్చమాంబ నుండి నేటి వరకు నల్లగొండ కథా రాశిలోని, వాసిలోను, శిల్పంలోను, వస్తువులోను అనేకానేక మార్పులు పొందింది. భాష, యాస, మాండలికంలోను తన ప్రత్యేకతను చాటుకుంది. తెలంగాణ నుండి తొలి కథ బండారు అచ్చమాంబ 'స్త్రీ విద్య' (1902). అయితే తెలంగాణ తొలి నవల వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి'. తెలంగాణకు తొలి కథ, తొలి నవల తీసుకువచ్చిన వీరిద్దరు ఈ జిల్లా వాసులు కావడం గర్వకారణం.

నల్లగొండ జిల్లా కథా సాహిత్యం ద్వారా ప్రతిబింబించే అంశాలను, అందులోని సమస్యలను గ్రామీణ జీవితం, ప్రజల జీవన పోరాటం, ఉద్యమాలు, దళితుల సమస్యలు, వ్యవసాయంలో ఆటుపోట్లు, ఫ్లోరిన్ సమస్యలు, ఆర్థిక, రాజకీయ, సామాజిక మొదలగు అంశాలను ఈ పరిశోధన గ్రంథంలో వివరణాత్మకంగా విశ్లేషించాను. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న అనేక మార్పులు ఈ కథలలో నాకు కనిపించాయి. ఇలాంటి కథలను పరిశీలించి, పరిశోధన చేసాను. తెలుగు కథకు ప్రత్యేకతను తెచ్చిన జిల్లాగా నల్లగొండ జిల్లాను చెప్పవచ్చు. ఈ జిల్లా నుంచి అనేకమంది కథా రచయితలు/రచయిత్రులు ఎన్నో కథలు రాసారు. వారు సమాజంలో జరుగుతున్నటువంటి సమస్యలు, సంఘటనలు, వివిధ అంశాలపై ఎవరి ఆలోచనల ప్రకారం వారు రాసారు. జరుగుతున్న సంఘటనలు, చూసిన, విన్న, అనుభవించిన విషయాల వంటివాటిని తమదైన శైలిలో సామాజిక అంశాలను తీసుకొని కథలుగా రాసారు. ఆ కథలను 'నల్లగొండ జిల్లా కథలు–పరిశీలన (2010–2015)' అనే పరిశోధనాంశంగా ఎన్నుకున్నాను. ఆరు సంవత్సరాలలో వచ్చిన కథల్లోని వస్తువును వివరణాత్మకంగా పరిశీలించాను.

నల్లగొండ కథకులు 2010 నుంచి 2015 వరకు చాలా కథలు రాసారు. నా పరిశోధనకు ముద్రితమైన అన్ని కథలను సేకరించాను. వాటిలో కథలు, కథా సంపుటాలు, కథా సంకలనాలు, పత్రికలలో వచ్చిన కథలు కూడా ఉన్నాయి. ఈ కథలన్నీ దాదాపుగా 400 వరకు సేకరించాను.

అందులో ప్రధానంగా నా పరిశోధనకు సంబంధించిన కథలను వందకుపైగా కథలను తీసుకొని సామాజికాంశాలను, భాషాంశాలను వివిధ కోణాలలోను పరిశీలించి, అందులో వివరణాత్మకంగా విశ్లేషించాను.

కొందరు కథకులు రాసినవారే ఎక్కువ కథలను రాసారు. మరికొందరు తక్కువ కథలను రాసారు. నా పరిశోధనలో నేను విధించుకున్న కాలపరిమితిలోకి వచ్చే నల్లగొండ జిల్లా కథా రచయితలందరిని పరిగణలోకి తీసుకొని పరిశోధించాను. నా పరిశోధన గ్రంథాన్ని 5 అధ్యాయాలుగా విభజించుకున్నాను. అందులో చర్చించిన అంశాలను కింద సంక్షిప్తంగా పేర్కొన్నాను.

**పరిచయం**

పరిశోధన అంశాన్ని ఎంచుకున్న తీరు, పరిశోధన చేసిన విధానం వంటి విషయాలను పరిశోధన లక్ష్యం, పరిశోధన పరిధి, పూర్వ పరిశోధనలు, పరిశోధన ప్రణాళిక మొదలైన విభాగాలుగా చేసి వివరించారు.

**1. నల్లగొండ జిల్లా చరిత్ర–భౌగోళిక, సామాజిక అంశాలు**

ఈ అధ్యాయంలో నల్లగొండ జిల్లా చరిత్ర (చరిత్ర పూర్వయుగం, శాతవాహనులు.... అసఫ్ జాహీలు వరకు), భౌగోళిక అంశాలు (హద్దులు, వైశాల్యం.... పరిశ్రమలు మొ.), సామాజికాంశాలు (జనాభా, వేష భాషలు... వినోదాలు మొ.), నల్లగొండ జిల్లాలోని కవులు–పండితుల–రచయితలు సంక్షిప్త పరిచయం, నల్లగొండ జిల్లా జానపద లలిత కళలు మొదలైన అంశాలను ఈ అధ్యాయంలో విశ్లేషించాను.

**2. నల్లగొండ జిల్లా కథా సాహిత్యం**

ఈ అధ్యాయంలో కథావిర్భావ వికాసాలు, తెలుగు కథ–పుట్టుక, కథానిక లక్షణాలు–నిర్వచనాలు, తెలంగాణ కథా క్రమం, నల్లగొండ జిల్లా కథ–ఆవిర్భావ వికాసాలు, నల్లగొండ జిల్లా కథలు–వికాస దశలు, నల్లగొండ జిల్లా కథలలో సాహిత్య పత్రికలు, నల్లగొండ జిల్లాలోని సాహితీ సంస్థలు మొదలైన వాటిని విశ్లేషించాను.

**3. నల్లగొండ జిల్లా కథలు –కథకుల పరిచయం**

ఈ అధ్యాయంలో నా పరిశోధనకు ఎంచుకున్న కథలను (2010-2015) రాసిన కథకుల జీవిత విశేషాలు, రచనలు సంక్షిప్తంగా వివరించాను. అందులో అంబటి వెంకన్న, అనసూయ, ఎం. రత్నమాల, ఎలికట్టె శంకర్ రావు, ఏనుగు నర్సింహారెడ్డి, కంచర్ల సత్యపాల్ రెడ్డి, కాటేపల్లి లక్ష్మీనరసింహమూర్తి, కాసుల ప్రతాపరెడ్డి, కె. కవిత, కొలనుపాక మురళీధర రావు, కోటమర్తి రాధాహిమబిందు, కోట్ల వనజాత, గాదె వెంకటేశ్, గుడిపాటి వెంకటేశ్వర్లు, చందు తులసి, తాయమ్మ కరుణ (పద్మ), తెలిదేవర భానుమూర్తి, దేవరాజు మహారాజు, దేవులపల్లి కృష్ణమూర్తి, నీరుడు సంజీవరెడ్డి, పి. చిన్నయ్య, పిట్టల శ్రీనివాస్, పెండెం జగదీశ్వర్, పెరుమాళ్ళ ఆనంద్, బెల్లి యాదయ్య, బోధనం నర్సింహారెడ్డి, బోయపల్లి నర్సయ్య (నిర్మల్), భూతం ముత్యాలు, ముదిగంటి సుజాతారెడ్డి, మేరెడ్డి యాదగిరిరెడ్డి, మోహన్ రుషి, యెన్నం ప్రభాకర్, రమేష్ హజారి, వి. మల్లికార్జున్, వేణు సంకోజు, వేముల ఎల్లయ్య, శిరంశెట్టి కాంతారావు, షాజహానా, సుజాత సూరేపల్లి, స్కైబాబ మొదలైన వారు ఉన్నారు.

### 4. నల్లగొండ జిల్లా కథలు-సామాజికాంశాలు

ఈ అధ్యాయంలో నల్లగొండ జిల్లా కథల్లోని సామాజికాంశాలైన మానవ సంబంధాలు (కుటుంబ సంబంధాలు, స్త్రీ-పురుష సంబంధాలు, భార్యాభర్తల సంబంధాలు, వివాహేతర సంబంధాలు, స్త్రీల గృహ హింస కథలు, ప్రేమ కథలు, విషాద కథలు), వికలాంగుల కథలు, సంస్కృతి సంప్రదాయాలు, ఆహారం, ఆటలు, పండుగలు, కళలు, మూఢ నమ్మకాలు, విద్య, నిరుద్యోగం, రైతు కథలు, కరువు-వలస జీవిత చిత్రణ కథలు, కుల వృత్తులు, భూస్వాములు/దొరలు-వెట్టిచాకిరి కథలు, ఉద్యమ కథలు, తెలంగాణోద్యమ నేపథ్య కథలు, విప్లవోద్యమ నేపథ్య కథలు, బహుజన కథలు, దళిత కథలు, మైనారిటి కథలు, ఇతర సామాజిక సమస్యలు మొదలైన ఉపవిభాగాలుగా చేసి విశ్లేషించాను.

### 5. నల్లగొండ జిల్లా కథలు-భాషాంశాలు

ఈ అధ్యాయంలో నల్లగొండ జిల్లా కథల్లో కనిపించిన భాషా పదజాలాన్ని కొన్ని విభాగాలుగా చేసి నామపదాలు, క్రియాపదాలు, ధ్వన్యనుకరణ పదాలు, జంట పదాలు, అన్యదేశ్యపదాలు, సామెతలు, జాతీయాలు మొదలనవాటిగా విశ్లేషించాను.

## అనుబంధం

అనుబంధంలో నేను పరిశోధనకు ఎంచుకున్న కథలు, అవి ముద్రితమైన సంపుటులు, సంకలనాల, పత్రికల వివరాలను వరుస క్రమంలో ఇచ్చాను. ఇవి పాఠకులకు, భవిష్యత్తు పరిశోధకులకు ఉపకరిస్తాయి.

నా మొత్తం పరిశోధనలో గమనించిన, వెలువడిన ప్రధానమైన అంశాలను సంక్షిప్తంగా కింద 'పరిశోధన ఫలితాలు'లో పేర్కొన్నాను.

## పరిశోధన ఫలితాంశాలు

నా పరిశోధనకు ఎంచుకున్న అంశం 'నల్లగొండ జిల్లా కథలు–పరిశీలన'. ఈ పరిశోధన గ్రంథంలో ప్రధానంగా వెలువడిన ఫలితాంశాలను సంక్షిప్తంగా ఇక్కడ పేర్కొన్నాను.

మొదటి అధ్యాయం 'నల్లగొండ జిల్లా చరిత్ర–భౌగోళిక, సామాజికాంశాలు'లో ప్రధానంగా నల్లగొండ జిల్లాకు సంబంధించిన పూర్వ చరిత్ర తెలియజేయబడింది. శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు, కందూరి చోడులు, కాకతీయులు, కాకతీయ సామంత రాజులు, బహమనీ సుల్తానులు, కుతుబ్ షాహీలు, మొఘలులు, అసఫ్ జాహీలు మొదలైన రాజ వంశాలు తెలంగాణ ప్రాంతంలోని నల్లగొండ కూడా ఏలిన రాజ వశాల చరిత్ర ఈ పరిశోధన ద్వారా సంక్షిప్తంగా తెలియజేపడింది. అదే విధంగా భౌగోళిక అంశాలైన హద్దులు, వైశాల్యం, నదులు, వాగులు, అడవులు, ఖనిజ సంపద, రవాణా, మండలాలు, ఉష్ణోగ్రత, నేలలు, ఆనకట్టలు, వ్యవసాయం, గ్రామాలు–పట్టణాలు, పరిశ్రమలు కూడా ఇందులో తెలియజేయబడ్డాయి. ఇంకా నల్లగొండ జిల్లా సామాజికాంశాలైన ఆహారం, వేష భాషలు, కుల మతాలు, కుటుంబ విధానం, విద్యా, ఆర్థిక స్థితి, సంస్కృతి, సంతలు, వినోదాలు మొదలైనవన్నీ కూడా విశ్లేషించబడ్డాయి. నల్లగొండ జిల్లాలోని కవులు, పండితులు, రచయితలు, జానపద లలిత కళల గురించి సంక్షిప్తంగా తెలియజేయబడ్డాయి.

రెండవ అధ్యాయంలో కథావిర్భావం మొదలుకొని వికాసం వరకు గల పరిణామాలను, తెలుగు కథ–పుట్టుక, కథానిక లక్షణాలు–నిర్వచనాలు, తెలంగాణ కథా క్రమం సాగిన విధానం,

నల్లగొండ జిల్లాలో కథ–ఆవిర్భవించిన విధానం–వికాసాలు, నల్లగొండ జిల్లా కథలు–వికాస దశలు, నల్లగొండ జిల్లా కథలలో సాహిత్య పత్రికలు, నల్లగొండ జిల్లాలోని సాహితీ సంస్థలు మొదలైనవి విశ్లేషించబడ్డాయి.

మూడవ అధ్యాయంలో నా పరిశోధనకు ఎంచుకున్న కథలను (2010–2015) రాసిన కథకుల జీవిత విశేషాలు, విద్యాభ్యాసం, వృత్తి, అలవాట్లు, అవార్డులు, పురస్కారాలు, రచనలను సంక్షిప్తంగా వివరించబడ్డాయి. అందులో ప్రధానంగా అంబటి వెంకన్న, అనసూయ, ఎం. రత్నమాల, ఎలికట్టె శంకర్ రావు, ఏనుగు నర్సింహారెడ్డి, కంచర్ల సత్యపాల్ రెడ్డి, కాటేపల్లి లక్ష్మీనరసింహమూర్తి, కాసుల ప్రతాపరెడ్డి, కె. కవిత, కొలనుపాక మురళీధర రావు, కోటమర్తి రాధాహిమబిందు, కోట్ల వనజాత, గాదె వెంకటేశ్, గుడిపాటి వెంకటేశ్వర్లు, చందు తులసి, తాయమ్మ కరుణ (పద్మ), తెలిదేవర భానుమూర్తి, దేవరాజు మహారాజు, దేవులపల్లి కృష్ణమూర్తి, నీరుడు సంజీవరెడ్డి, పి. చిన్నయ్య, పిట్టల శ్రీనివాస్, పెండెం జగదీశ్వర్, పెరుమాళ్ళ ఆనంద్, బెల్లి యాదయ్య, బోధనం నర్సింహారెడ్డి, బోయపల్లి నర్సయ్య (నిర్మల్), భూతం ముత్యాలు, ముదిగంటి సుజాతారెడ్డి, మేరెడ్డి యాదగిరిరెడ్డి, మోహన్ రుషి, యెన్నం ప్రభాకర్, రమేష్ హజారి, వి. మల్లికార్జున్, వేణు సంకోజు, వేముల ఎల్లయ్య, శిరంశెట్టి కాంతారావు, షాజహానా, సుజాత సూరేపల్లి, స్కైబాబ మొదలైన వారి గురించి చర్చించబడింది.

నా పరిశోధనకు ప్రధానమైన అధ్యాయం 'నల్లగొండ జిల్లా కథలు–సామాజికాంశాలు'. ఈ నాల్గవ అధ్యాయంలో నా పరిశోధన పరిధిలోకి వచ్చే కథలన్నింటిలో దాదాపుగా ఉన్న సామాజికాంశాలన్నింటిని విశ్లేషించాను. నల్లగొండ జిల్లా కథకులు ఒక్కొక్కరు ఒక్కొక్క భిన్నమైన సామాజికాంశాలను స్పృశిస్తూ కథలు రాసారు. వాటిలోని సామాజికాంశాలు ప్రధానంగా మానవ సంబంధాలలో భాగంగా కుటుంబ సంబంధాలు, స్త్రీ–పురుష సంబంధాలు, భార్యాభర్తల సంబంధాలు, వివాహేతర సంబంధాలు, స్త్రీల గృహ హింస కథలు, ప్రేమ కథలు, విషాద కథలు మొదలైన సంబంధాలు ఏ విధంగా మానవ సమాజంపై ప్రభావం చూపుతాయో ఈ పరిశోధనలో సంక్షిప్తంగా విశ్లేషించబడ్డాయి.

మానవ సమాజంలో అవయవాలు లోపంతో పుట్టినవారు ఏ విధంగా కష్టాలు పడతారో, వారి కష్టాలు, బాధలు మొదలైన విషయాలతో విడివిడిగా కథలు వచ్చినా, అవి తక్కువనే చెప్పాలి. అందులో సంకలనంగా ఇప్పటి వరకు అసలు రాలేదు. కాని కొందరు రచయితలు కొత్తగా ఆలోచించి అవయవ లోపంతో ఉన్నవారి గురించి ప్రత్యేకంగా వికలాంగుల కథా సంకలనంగా తీసుకువచ్చారు. అందులో వారి బాధలు, కష్టాలు, ధైర్యం, తెగువ వంటివి కూడా విశ్లేషించబడ్డాయి. ఆ కథల్లోని విశేషాలను కూడా ఈ పరిశోధనలో విశ్లేషించబడ్డాయి. సంస్కృతి సంప్రదాయాలైన ప్రజల ఆహారం, ఆటలు, పండగలు, కళలు మొదలైనవి నల్లగొండ జిల్లా కథల్లో ఉన్నాయి. అవి పరిశోధనలో విశ్లేషించబడ్డాయి. మూఢ నమ్మకాలలో ప్రధానంగా మంత్రాలు మొదలైన వాటివల్ల ప్రజలు భయపడి నష్టపోతారు. ఒక్కోసారి ప్రాణాలు పోతాయి. దొరలు, నాయకులు గ్రామ దేవతల పేరు చెప్పి వారిచేత బలవంతంగా పండగలు చేయిస్తారు. బీద ప్రజలు డబ్బులేక మళ్ళీఈ ఆ దొరలు, నాయకుల వద్దకే అప్పు తీసుకుంటారు. ఆ అప్పుకు నిత్యం వడ్డీలు కడుతూనే ఉండాలి. దొరల సంపాదన పెరుగుతూనే ఉండాలి. అలా మూఢనమ్మకాల వల్ల దొరల కుట్రలు సాగుతాయి అటువంటి కథలు ఈ పరిశోధనలో విశ్లేషించబడ్డాయి. విద్య లేమివల్ల కలిగే నష్టాలు, నిరుద్యోగంవల్ల యువకుల బాధలు మొదలైన వంటివి నల్లగొండ కథల్లో ఉన్నాయి. అవి కూడా ఈ పరిశోధనలో చర్చించబడ్డాయి.

దేశానికే వెన్నెముక వంటివారు రైతులు. ఆ రైతులు వ్యవసాయం చేసి అన్ని రంగాల, సమస్త ప్రజలకు నల్లటి మట్టిలోంచి తెల్లటి మెతుకులను నోటిదగ్గరికి తెచ్చిపెడతారు. అటువంటి రైతు వ్యవసాయం చేసే క్రమంలో ఎన్నో ఇబ్బందులు, ప్రాణాలు సైతం కోల్పోతారు. ఆ ఇబ్బందుల్లో ప్రధానంగా నీటి వనరుల లేమి, పెట్టుబడుల నిమిత్తం తగిన ఆర్థిక సహాయం అందకపోవడం, విత్తనాలు నకిలివి ససఫరా అవ్వడం, అప్పులు అధికం కావడంవల్ల భూమి మీద ప్రేమతో భూమిని అమ్మకుండా తన అవయయాలైన మూత్రపిండాలు మొదలైన వాటిని అమ్మి అప్పు తీర్చడం, రైతుల పేరు చెప్పి రాజకీయ నాయకులు ఎన్నికప్పుడు మాత్రమే రైతుల దగ్గరికి వచ్చి ఏవేవో వాగ్దానాలు చేస్తారు. ఆ క్రమంలో రైతుల పంట పొటాల్లో హడావిడి చేసి ఫొటోలకు పోజులివ్వడం వల్ల, వారు మేలు చేసేది ఎటూ ఉండదు. కాని ఆ సమయంలో పంటచేను మొత్తం వారు తొక్కడం మూలాన

సర్వనాశనం అవుతుంది. ఇలా మొదలైన అంశాలతో నల్లగొండ జిల్లా రచయితలు రైతును వస్తువుగా తీసుకున్న కథల్లోని సారాంశం ఈ పరిశోధనలో విశ్లేషించబడింది.

అదేవిధంగా వ్యవసాయంపై ఆధాపడి జీవించే ఆశ్రిత వృత్తులవారు వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం, వలసలు వెళ్ళడం వల్ల వ్యవసాయం కుంటుపడుతుంది. తద్వారా కులవృత్తులు కూడా విరిగిపోతాయి. ఇంకో కారణం ప్రపంచీకరణ ప్రభావం వల్ల కూడా కులవృత్తులు నాశనం అయ్యాయి. అందులో కుమ్మరి, కమ్మరి, మగలి, మాదిగ, దాసరి, కళాకారులు మొదలైన వృత్తుల వారి వస్తువులతో నల్లగొండ జిల్లా రచయితలు కథలు రాసారు. అందులోని సామాజిక అంశాలు ఈ పరిశోధనలో విశ్లేషించబడ్డాయి.

దొరలు, భూస్వాములు బీద ప్రజలపై ఏ విధంగా ఆధిపత్యం చెలాయించి, వారిచేత వెట్టి చేయించుకుంటారో వంటి వస్తువుతో కూడా నల్లగొండ జిల్లా కథకులు కథలు రాసారు. అదే విధంగా సమాజంలో రకరకాల సమస్యలు ఉత్పన్నం అవుతాయి. అవి ప్రధానంగా ధనికవర్గాలు, అగ్ర వర్గాలు బీదవారిని, నిమ్న వర్గాల వారిని పీడించడం వల్ల సమస్యలు వస్తాయి. కొన్నింటికి ప్రభుత్వాలు కారణమవుతాయి. వాటిని వ్యతిరేకిస్తూ త్యాగశీలురు ప్రజా ఉద్యమాలు చేపడతారు. ఆ ఉద్యమాలల్లో భాగంగా తెలంగాణ ఉద్యమం, విప్లవోద్యమం మొదలైన ఉద్యమాలను వస్తువుగా నల్లగొండ జిల్లాలో కథలు వచ్చాయి. వాటి విశ్లేషణ కూడా ఈ పరిశోధన పేర్కొనబడింది.

మనదేశంలో ఎన్నో రకాల కులాలున్నాయి. ఆ కులాల పేరుతో అగ్రవర్ణాలకు చెందినవారు బీదవారిని అణచివేస్తారు. అలా అణచివేయబడినవారిలో ప్రధానంగా బి.సి. దళిత, ముస్లిం, మైనారిటీలు ఉంటారు. వీరు విసిగి వేసారి అగ్రవర్ణాల వారిపై ఉద్యమం ప్రకటించాలి అనుకున్నప్పుడు వీరంతా ఏకమవ్వాలి. అందులో భాగంగా వీరందరి సమ్మేళనమే బహుజన ఉద్యమం బయలు దేరింది. దళిత, ముస్లిం, మైనారిటీ ప్రజలు కూడా వారివారి అస్తిత్వం, బాధలు, అవమానాలు మొదలైన వాటితో ఇబ్బందులకు గురవుతారు. వీటన్నీటి వస్తువుగా కథలు వచ్చాయి. ఆ కథల్లోని సామాజికాంశాలు ఈ పరిశోధన విశ్లేషించబడ్డాయి.

అదే విధంగా పర్యావరణం, నీటి సమస్య, సంత, సారాయి, కల్లు, వ్యక్తిగత అస్తిత్వం మొదలైన వివిధ అంశాలపై కూడా కథలు వచ్చాయి. వాటిలోని సామాజికాంశాలు ఇందులో విశ్లేషించబడ్డాయి.

భాష లేనిదే మానవ సమాజ మనుగడ లేదు. ఆ భాష ఏదో రూపంలో ఉంటేనే అభిప్రాయ వ్యక్తీకరణ జరుగుతుంది. అటువంటి భాషను స్థానిక మాండలికం వారి కథల్లో వాడుతూ నల్లగొండ జిల్లా రచయితలు ప్రయోగాలు చేసారు. ఆ విశేషాలైన నల్లగొండ కథల్లోని భాషాంశాలు పరిశీలించి అయిదవ అధ్యాయంలో భాగంగా చర్చించబడ్డాయి. అందులో నామ పదాలు, క్రియా పదాలు, జంట పదాలు, ధ్వన్యనుకరణ పదాలు, అన్యదేశ్యాలు, సామెతలు, జాతీయాలు మొదలైన ఉపవిభాగాలతో మాండలిక ప్రయోగాలు విశ్లేషించబడ్డాయి. వాటిలో కొన్ని నామ పదాలు మనం ఇక్కడ చూస్తే జీవాలు=గొర్రెలు, యాది=గుర్తు, పూటు=ఎక్కువగా, బత్తెం=కూలి మొదలైనవి. ధ్వన్యనుకరణ పదాలు: పటపట, గుసగుస, బిలబిల, కణకణ, డిల్లెం బల్లెం, సుర సుర, తుక తుక, కుస్కు కుస్కు మొదలైనవి. జంట పదాలు: ఆదరా బాదరా, పండగ పబ్బం, పిల్లా జెల్లా, తల్లడ మల్లడ, బట్ట బాత, గార్వం, గీర్వం మొదలైనవి. అన్యదేశ్య పదాల్లో ఉర్దూ పదాలు, ఆంగ్ల పదాలు అనే విభజన చేయబడింది. అందులో ఉర్దూ పదాలు కొన్ని: దోస్త్=స్నేహితుడు, రివాజు=పద్ధతి, మత్లావ్=సమాచారం, ఇరామ్=విశ్రాంతి మొదలైనవి. సామెతలు: లోటల రాళ్ళేసినట్టు లొడలొడ మాట్లాడెటోడు, రెక్కల కష్టం జేసినోడు బొక్కలు దేలినట్టుంటే–ఎత్కదెంగినోడు ఏడు మేడలు గట్నట్టుంది. జాతీయాలు: నోట్లె మన్నుబడ, మంకుపట్టు, గుండెలో రాయిపడు, కాల్లకు బలపం కట్టుకొను మొదలైనవి భాషాంశాలుగా ఈ పరిశోధనలో విశ్లేషించబడ్డాయి.

అదే విధంగా నా పరిశోధనకు ఎంచుకోబడిన కథలను అనుబంధం అకారాది క్రమంలో కూర్చాను. వరుసగా కథ, రచయిత, ప్రచురించబడిన సంపుటం/సంకలనం/పత్రిక, సంవత్సరం వాటి వివరాలతో భవిష్యత్ పరిశోధకుల ఉపయోగార్థం ఈ కూర్పు చేయబడింది.

మొత్తంగా నల్లగొండ జిల్లా కథల్లోని సామాజికాంశాలు ఈ పరిశోధనలో విశ్లేషించబడటం సమాజానికి, సాహితీ లోకానికి ఉపకరిస్తుందని నేను భావిస్తున్నాను. అదేవిధంగా భావి కథా పరిశోధకులకు కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

*****

# ఉపయుక్త గ్రంథసూచి


1. అనసూయ, జిల్లెళ్ళ. 2014. తెలంగాణ బతుకు చిత్రాలు. హైదరాబాదు: తెలంగాణ సోషల్ రీసెర్చ్ సొసైటి.
2. ఉపేందర్, వెన్నం. 2016. కొన్ని వెలుగు నీడలు (కథలు). హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్.
3. ఉమారెడ్డి, మేక. 2015. నల్లగొండ జానపద గేయాలు–సమగ్ర పరిశీలన. హైదరాబాదు: ఉస్మానియా విశ్వవిద్యాలయం.
4. ఎల్లయ్య, వేముల., శంకర్, సంపంగి. 2013. అవిటి కథలు. నల్లగొండ: అవిటి సాహితీ సంస్థ.
5. ఎల్లారెడ్డి, కర్ర (సంపా.). 2007. మన తెలంగాణ (నల్లగొండ జిల్లా ప్రత్యేక సంచిక). వరంగల్: తెలంగాణ సాహితీ.
6. ఎల్లారెడ్డి, కర్ర. 2010. తెలంగాణ–సామెతలు, జాతీయాలు. హన్మకొండ: తెలంగాణ సాహితీ పబ్లికేషన్స్.
7. కరుణ, తాయమ్మ. 2018. జీవితం (కథల సంపుటి). హైదరాబాదు: తెలంగాణ ఎన్నారై అసోషియేషన్.
8. కాంతారావు, శిరంశెట్టి. 2012. ఊత కర్రలు. పాల్వంచ: స్వీయ ప్రచురణ.
9. కృష్ణమూర్తి, దేవులపల్లి. 2012. కథల గూడు. హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్ట్.
10. కృష్ణమూర్తి, దేవులపల్లి. 2016. యక్షగానం. నల్లగొండ: హైదరాబాదు బుక్ ట్రస్ట్.
11. కృష్ణారావు, వై.వి., బలరామకృష్ణమూర్తి, ఏటుకూరి (సంపా.). 1987. ఆంధ్రప్రదేశ్ దర్శిని. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
12. చంద్రారెడ్డి, బొంతల. 2003. నీటి పారుదలలో–నల్లగొండ జిల్లా. నల్లగొండ: శారదా గ్రాఫిక్స్.
13. తిరుపతి, బి. 2006. కథ–తెలంగాణ ప్రాంతీయవాదం. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం.

14. దక్షిణామూర్తి, పోరంకి. 1982. కథానిక స్వరూప స్వభావాలు. హైదరాబాదు విశ్వవిద్యాలయం.
15. దేవరాజు మహరాజు. 2015. మనిషి కథలు. హైదరాబాదు: జీవన ప్రచురణలు.
16. నాగయ్య, జి. 1996. తెలుగు సాహిత్య సమీక్ష. హైదరాబాదు: నవ్య పరిశోధన ప్రచురణ.
17. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. 2007. నల్లగొండ జిల్లా సాహితీ చరిత్ర. ఢిల్లి: మైనర్ రీసెర్చ్ 18. ప్రాజెక్ట్ రిపోర్టు.
18. నిత్యానందరావు, వెల్దండ. 2013. విశ్వవిద్యాలయాలలో తెలుగు పరిశోధన. హైదరాబాదు: ఓం సాయి గ్రాపిక్స్.
19. నిర్మల్. 2014. ఆబ్కారి కథలు. హైదరాబాదు: పద్మశ్రీ ప్రచురణలు.
20. మల్లికార్జున్, వి. 2018. ఇరానీ కేఫ్ (కొన్ని కథలు). హైదరాబాదు: అజ్ పబ్లికేషన్.
21. ముత్యాలు, భూతం. 2017. దగ్ధం (దళిత కథలు). నల్లగొండ: గుంపు సాహితీ సంస్థ.
22. యాదగిరిరెడ్డి, మేరెడ్డి. 2016. బొడ్రాయి కథలు. నల్లగొండ: ధృతి ప్రచురణలు.
23. రజిత కుమారి, బచ్చలి. 2017. 1970కి పూర్వం వరంగల్ కథా సాహిత్యం. వరంగల్: 24. స్వేచ్ఛ పబ్లికేషన్స్.
24. రజిత, అనిశెట్టి (సంపా.). 2017. శతాధిక రచనల సమాహారం–తెలంగాణ రచయిత్రుల కథలు. హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్.
25. రాజారాం, మధురాంతకం. 2008. రాజారాం కథలు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లికేషన్.
26. రాములు, బి.ఎస్. 1998. కథల బడి (కథా అలంకార శాస్త్రం). హైదరాబాదు: విశాల సాహిత్య అకాడమి ప్రచురణ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
27. వనజాత, కోట్ల. 2014. ఇత్తు (కథల సంపుటి). హైదరాబాదు: స్పృహ సాహితీ సంస్థ.
28. వసంతరాయ్. 1989. నల్లగొండ జిల్లా చరిత్ర. మిర్యాలగూడ: ప్రపంచశాంతి పబ్లికేషన్స్.
29. విద్యాదేవి, ఆకునూరు. 2012. ఉత్తర తెలంగాణ మూడు దశాబ్దాల కథ (1970–2000). వరంగల్: విద్యానంద ప్రచురణలు.
30. శంకరరావు, ఎలికట్టె. 2011. నల్లగొండ జిల్లా కథలు (మొదటి సంకలనం). నల్లగొండ: నోముల సాహిత్య సమితి.

31. శంకరరావు, ఎలికట్టె. 2015. నల్లగొండ కథలు (రెండవ సంకలనం). నల్లగొండ: నోముల సాహిత్య సమితి.

32. శంకరరావు, ఎలికట్టె. 2015. పరిగెచేను కథలు. హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్.

33. శంకర్, అనంత. 2020. జాగృతి కథలు–సమగ్ర పరిశీలన (2001–2010, ఒక దశాబ్ది కథలు). హైదరాబాదు: జాతీయ సాహిత్య పరిషత్.

34. శాస్త్రి, బి.ఎన్. 1986. నల్లగొండ మండల సర్వస్వం. హైదరాబాదు: మూసీ పబ్లికేషన్స్.

35. శ్రీనివాస్, సంగిశెట్టి. 2010. బండారు అచ్చమాంబ–తొలి తెలుగు కథలు (కథా సంపుటి). హైదరాబాదు: కవిలె పబ్లికేషన్స్.

36. శ్రీనివాస్, సంగిశెట్టి., శ్రీధర్, వెల్దండ. 2016. అలుగు (తెలంగాణ కథ–2015). హైదరాబాదు: 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం.

37. శ్రీనివాస్, సంగిశెట్టి., స్కైబాబ. 2014. రంధి. (తెలంగాణ కథ–2013). హైదరాబాదు: 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం.

38. శ్రీనివాస్, సంగిశెట్టి., స్కైబాబ., శ్రీధర్, వెల్దండ. 2015. (తెలంగాణ కథ–2014). హైదరాబాదు: 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం.

39. శ్రీహరి, రవ్వ. 1986. నల్లగొండ ప్రజల భాష. హైదరాబాదు: స్వీయ ప్రచురణ.

40. షాజహాన. 2016. లద్దాఫ్ని (ముస్లిం స్త్రీల కథలు). హైదరాబాదు: నసాల్ కితాబ్ ఘర్.

41. సిధారెడ్డి, నందిని. 2008. కులవృత్తులు తెలంగాణ సాహిత్యం. హైదరాబాదు: తెలంగాణ రచయితల వేదిక.

42. సిల్కానాయక్, అజ్మీరా. 2015. నంగార (నల్లగొండ జిల్లా బంజారాల మౌఖిక కథలు–పరిశీలన). హైదరాబాదు: జ్యోత్స్న కళాపీఠం.

43. సుజాతారెడ్డి, ముదిగంటి. 2010. మరో మార్క్స్ పుట్టాలె (కథలు). హైదరాబాదు: 44. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

44. సూర్య ధనుంజయ్, డి. 2009. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం–జీవన చిత్రణ. హైదరాబాదు: శీతల్ పబ్లికేషన్స్.

45. స్కైబాబ. 2012. అధూరె (ముస్లిం కథలు). నల్లగొండ: నసాల్ కితాబ్ ఘర్. 'హర్యాలి' ముస్లిం రచయితల వేదిక.
46. స్కైబాబ. 2015. అలాయి బలాయి (బహుజన కథలు). శ్రీకాకుళం: ఎస్‌బిటి 'సిక్కోలు' బుక్ ట్రస్ట్.
47. స్కైబాబ. 2015. బేచారె (భగ్నమైన ప్రేమ కథలు). హైదరాబాదు: సవాల్ కితాబ్ ఘర్.
నిఘంటువులు:
48. పెరుమాళ్ళ, వేముల. 2011. తెలంగాణ జాతీయాలు. సికింద్రాబాదు: విరాట్ పబ్లికేషన్స్.
49. భాస్కర్, నలిమెల. 2010. తెలంగాణ పదకోశం. హైదరాబాదు: తెలంగాణ రచయితల వేదిక.
50. ముత్యాలు, భూతం. 2013: మాండలీకం (కులవృత్తి పదకోశం). నల్లగొండ: గుంపు సాహితీ సంస్థ.
51. లక్ష్మణ్‌రావ్, పంతంగి. 2010. ఉర్దూ-తెలుగు నిఘంటువు. హైదరాబాదు: ఎమ్మెస్కో.
52. శైలమ్మ, జి. 2011. తెలుగు కథాసాహిత్యం-గిరిజన జీవితం. కుప్పం: ద్రావిడ 53. విశ్వవిద్యాలయం.
53. సత్యనారాయణ, ఎస్వీ. 2019. తెలంగాణ పదకోశం. హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
54. సుజాత, ముదిగంటి. 2018. తెలంగాణ వ్యవహారిక పదకోశం. హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్.
55. Fifth Economy Census-Nalgonda district-2005.
56. Hanad book of statistics- Nalgonda district-2009.

**పరిశోధన గ్రంథాలు**

1. చిరంజీవిరావు, పలివెల. 2016. అమెరికా తెలుగు-సామాజిక విశ్లేషణ. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం.

2. రవి కుమార్, దార్ల. 2005. ఆధునిక తెలుగు కథల్లో ప్రాంతీయ చైతన్యం. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం.

3. రామేశ్వర్, బి. 2011. పాలమూరు జిల్లా కథా సాహిత్యం–కరువు వలస చిత్రణ. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఎం.ఫిల్. పరిశోధన వ్యాసం.

4. విజయ్ కుమార్, బి. 2010. తెలుగు కథా నిర్మాణం. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం.

5. శ్రీను, కందుల. 2018. నల్లగొండ జిల్లా కథలు–ఉద్యమ చిత్రణ (1901–2005). హైదరాబాదు: ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం.

**పత్రికలు:**

1. అరుణతార
2. ఆంధ్రజ్యోతి
3. ఆంధ్రప్రభ
4. ఈనాడు
5. జంబి
6. బతుకమ్మ (నమస్తే తెలంగాణ)
7. వార్త
8. సంతకం
9. సారంగ సంచిక
10. సాక్షి
11. నవ్య
12. పాలపిట్ట
13. ప్రస్థావన
14. సాహితీ ప్రస్థానం

*****

# అనుబంధం

ఈ అనుబంధంలో నా పరిశోధనకు ఎంచుకున్న నల్లగొండ జిల్లా కథలు, వాటి వివరాలను కూర్చాను. ఇందులో వంద కథల వివరాలు ఉన్నాయి. వీటిని కూర్చే క్రమంలో కొన్ని సంక్షిప్త పదాలు వాడాను. అవి: సంక. = సంకలనం, సంపు. = సంపుటి, న.తె. = నమస్తే తెలంగాణ, నవ.తె. = నవ తెలంగాణ.

| **కథ** | **రచయిత** | **పత్రిక/కథా సంపుటాలు, కథా సంకలనాలు** | **తెలువడిన సంవత్సరం** |
|---|---|---|---|
| అంటరాని బతుకమ్మ | పి. చిన్నయ్య | ఆంధ్రజ్యోతి | అక్టోబర్, 2015 |
| అంటు | స్కైబాబ | సారంగ సాహితి పత్రిక | డిసెంబర్, 2013 |
| అడిగేటోళ్ళు | పి. చిన్నయ్య | బతుకమ్మ–న.తె. పత్రిక | మే, 2013 |
| అతడు | స్కైబాబ | నవ్య పత్రిక | జనవరి, 2012 |
| అమ్మ వాసన | వేణు సంకోజు | నల్లగొండ కథలు–సంక.1 | 2011 |
| అమ్మ | తాయమ్మ కరుణ | అరుణతార పత్రిక | అక్టోబర్, 2014 |
| అయిటివాన–మా ఆశ | ఎలికట్టె శంకరరావు | పాలపిట్ట పత్రిక | ఫిబ్రవరి, 2011 |
| ఆడ పాలపిట్టలున్నాయా | తెలిదేవర భానుమూర్తి | నల్లగొండ కథలు–సంక.1 | 2011 |
| ఆనొస్తే... చెరువేది? | అంబటి వెంకన్న | నల్లగొండ కథలు–సంక.2 | ఆగస్టు, 2015 |
| ఆశ | దేవులపల్లి కృష్ణమూర్తి | సోపతి–నవ.తె. పత్రిక | 2015 |
| ఇంద్రవెల్లి | ఎం. రత్నమాల | అరుణతార పత్రిక | 2015 |
| ఇత్తు | కోట్ల వనజాత | నవ్య పత్రిక | నవంబర్, 2012 |
| ఈ పెండ్లి నిలుస్తుందా! | ముదిగంటి సుజాతారెడ్డి | పాలపిట్ట పత్రిక | ఏప్రిల్, 2010 |
| ఈదురు గాలి | భూతం ముత్యాలు | బతుకమ్మ–న.తె. పత్రిక | జూలై, 2015 |
| ఊరవతల ఊడల మర్రి | చందు తులసి (పి. చంద్రశేఖర్) | ఆంధ్రజ్యోతి | అక్టోబర్, 2015 |
| ఎర్రెద్దు | బెల్లి యాదయ్య | నల్లగొండ కథలు–సంక.2 | 2015 |
| ఏక్ ముసాఫర్ దోరాస్తే | స్కైబాబ | పాలపిట్ట పత్రిక | 2010 |
| ఓ సిన్నోని కథ | కంచర్ల సత్యపాల్ రెడ్డి | బతుకమ్మ–న.తె. పత్రిక | జూన్, 2011 |
| కన్నీటి బొట్టు | పెండెం జగదీశ్వర్ | నల్లగొండ కథలు | 2011 |
| కబూతర్ | స్కైబాబ | సాక్షి | జూన్, 2011 |

| | | | |
|---|---|---|---|
| కలల గూడు | దేవులపల్లి కృష్ణమూర్తి | పాలపిట్ట | మే, 2011 |
| కారు చెప్పిన కథ | వి. మల్లికార్జున్ | వాకిలి వెబ్ మ్యాగజైన్ | సెప్టెంబర్, 2014 |
| కాలేజి కథ | జిల్లెళ్ల అనసూయ | ప్రజాశక్తి పత్రిక | ఫిబ్రవరి, 2011 |
| కిర్రు చెప్పులు | వెన్నం ఉపేందర్ | ప్రజాశక్తి పత్రిక | ఫిబ్రవరి, 2012 |
| కుష్టొది కిష్టయ్య | వేముల ఎల్లయ్య | అవిటి కథలు–సంక. | 2013 |
| కేన్సర్ గౌరమ్మ | భూతం ముత్యాలు | ప్రస్థానం పత్రిక | సెప్టెంబర్, 2014 |
| ఖబర్ | స్కైబాబ | బతుకమ్మ–న.తె. పత్రిక | మార్చి, 2015 |
| గది | గుడిపాటి వెంకటేశ్వర్లు | ముబయి వన్–పక్ష పత్రిక | మార్చి, 2011 |
| చర్విత చరణం | దేవరాజు మహారాజు | మనిషి కథలు–సంపు. | 2015 |
| చిక్కు తెచ్చిన ఛీప్ లిక్కర్ | నిర్మల్ (బోయపల్లి నర్సయ్య) | ఆబ్కారి కథలు–సంపు. | 2014 |
| చిలకల దండ | కొలనుపాక మురళిధరరావు | నల్లగొండ కథలు–సంక.1 | 2011 |
| చివరి గుడిసెలో గాజు కళ్ళు | కోట్ల వనజాత | బతుకమ్మ–న.తె. పత్రిక | సెప్టెంబర్, 2013 |
| చివరికి | పెరుమాళ్ళ ఆనంద్ | నల్లగొండ కథలు–సంక.2 | ఆగస్టు, 2015 |
| జమ్మి | స్కైబాబ | బతుకమ్మ–న.తె. పత్రిక | నవంబర్, 2012 |
| జీవం | స్కైబాబ | వార్త పత్రిక | మార్చి, 2011 |
| జీవన మాధుర్యం | కోటమర్తి రాధాహిమ బిందు | ఆంధ్రప్రభ | నవంబర్, 2010 |
| జేజి | భూతం ముత్యాలు | అవిటి కథలు–సంక. | 2013 |
| టోల్ గేట్ | గాదె వెంకటేశ్ | బతుకమ్మ–న.తె. పత్రిక | జనవరి, 2014 |
| తెగిపడ్డ పల్లెలు | సుజాత సూరేపల్లి | బతుకమ్మ–న.తె. పత్రిక | 2013 |
| తోలు బొమ్మలు | మేరెడ్డి యాదగిరిరెడ్డి | ముంబయి వన్ పత్రిక | ఫిబ్రవరి, 2012 |
| థర్డ్ డిగ్రీ | మోహన్ రుషి | కినిగె వెబ్ మ్యాగజైన్ | అక్టోబర్, 2014 |
| దీవారెఁ | షాజహాన | నవ్య పత్రిక | 2011 |
| దృశ్యాదృశ్యం | వి. మల్లికార్జున్ | కినిగె వెబ్ మ్యాగజైన్ | సెప్టెంబర్, 2014 |
| ద్రోహం | దేవులపల్లి కృష్ణమూర్తి | వార్త పత్రిక | అక్టోబర్, 2010 |
| నల్లతేళ్ళు | కోట్ల వనజాత | బతుకమ్మ–న.తె. పత్రిక | సెప్టెంబర్, 2011 |
| నా కథ | దేవులపల్లి కృష్ణమూర్తి | సాక్షి పత్రిక | సెప్టెంబర్, 2010 |
| నీళ్ళెంత రుచి | తాయమ్మ కరుణ | అరుణతార పత్రిక | మే, 2013 |
| పంచనామా | బోధనం నర్సిరెడ్డి | సంతకం పత్రిక | ఏప్రిల్, 2012 |
| పంపకాలు | పి. చిన్నయ్య | అరుణతార పత్రిక | ఏఫ్రిల్, 2010 |
| పచ్చీసు | కాటేపల్లి లక్ష్మినరసింహమూర్తి | బతుకమ్మ–న.తె. పత్రిక | ఏప్రిల్, 2015 |

| | | | |
|---|---|---|---|
| పశువులంటే మా నాయినకు పాసం | ఎలికట్టె శంకరరావు | పాలపిట్ట పత్రిక | మే, 2011 |
| పాలపిట్టల పాట | చందు తులసి (పి. చంద్రశేఖర్) | బతుకమ్మ-న.తె. పత్రిక | అక్టోబర్, 2011 |
| పిట్టకథ | చందు తులసి (పి. చంద్రశేఖర్) | ఆంధ్రజ్యోతి | నవంబర్, 2015 |
| పిల్లలు | తాయమ్మ కరుణ | ఆంధ్రజ్యోతి పత్రిక | మే, 2012 |
| పూర్తికాని కథ | కాసుల ప్రతాపరెడ్డి | పాలపిట్ట పత్రిక | ఆగస్టు, 2014 |
| ప్రజాస్వామ్యమా వర్ధిల్లాలి | జిల్లేళ్ళ అనసూయ | సాహితీ ప్రస్థానం పత్రిక | ఆగస్టు, 2011 |
| బండ్లబాట | ఏనుగు నర్సింహారెడ్డి | జంబి పత్రిక | జూన్, 2014 |
| బంద్ | మేరెడ్డి యాదగిరిరెడ్డి | నెలవంక-నెమలీక పత్రిక | అక్టోబర్, 2012 |
| బడి | మేరెడ్డి యాదగిరిరెడ్డి | ప్రజాశక్తి పత్రిక | ఏప్రిల్, 2012 |
| బతుకు సంత | కోట్ల వనజాత | సాహితీ ప్రస్థానం | జూన్, 2010 |
| బత్తెం | గాదె వెంకటేశ్ | బతుకమ్మ-న.తె. పత్రిక | జూలై, 2013 |
| బహుముఖం | కోట్ల వనజాత | ఇత్తు-సంపు. | సెప్టెంబర్, 2014 |
| బాధ్యత | తాయమ్మ కరుణ | మహిళా మార్గం పత్రిక | డిసెంబర్, 2014 |
| బిల్లి | షాజహాన | సారంగ వెబ్ మ్యాగజైన్ | జూలై, 2013 |
| బుక్కెడు బువ్వ | చందు తులసి (పి. చంద్రశేఖర్) | సారంగ సంచిక పత్రిక | వనంబర్, 2015 |
| బుగాడ | భూతం ముత్యాలు | రంధి-సంక.-2013. | డిసెంబర్, 2014 |
| బెయ్యిమే దయ్యిమంట | ఎలికట్టె శంకరరావు | పాలపిట్ట పత్రిక | జనవరి, 2011 |
| బొడ్రాయి | మేరెడ్డి యాదగిరిరెడ్డి | సాహితీ ప్రస్థానం | నవంబర్, 2012 |
| భయం పెద్ద జబ్బు | తాయమ్మ కరుణ | ఆశాదీపం-సంక. | మార్చి, 2014 |
| భూమి పుత్రుడు | మేరెడ్డి యాదగిరిరెడ్డి | ప్రజా సాహితీ పత్రిక | జనవరి, 2015 |
| మట్టి మనిషి | వెన్నం ఉపేందర్ | చినుకు పత్రిక | మే, 2013 |
| మనిషి పగిలిన రాత్రి | షాజహాన | సారంగ వెబ్ మ్యాగజైన్ | జూలై, 2015 |
| మా ఊళ్ళో టవర్ సుత పెట్టింద్రు | వెన్నం ఉపేందర్ | వార్త పత్రిక | ఏప్రిల్, 2011 |
| మా నాయిన తాడు లెక్కలు | ఎలికట్టె శంకరరావు | పాలపిట్ట పత్రిక | అక్టోబర్, 2010 |
| మాయ | మేరెడ్డి యాదగిరిరెడ్డి | ప్రజాశక్తి పత్రిక | జూన్, 2015 |
| మార్కెట్ | కోట్ల వనజాత | నవ్య పత్రిక | మార్చి, 2011 |
| మార్నింగ్ వాక్ | దేవరాజు మహారాజు | మనిషి కథలు-సంపు. | 2015 |
| మిస్ వహీదా | స్కైబాబ | ఆంధ్రజ్యోతి | అక్టోబర్, 2013 |
| మీనా | భూతం ముత్యాలు | బతుకమ్మ-న.తె. పత్రిక | అక్టోబర్, 2010 |
| మూల మలుపు | ఎన్. సంజీవరెడ్డి | సంతకం పత్రిక | ఏప్రిల్, 2012 |

| | | | |
|---|---|---|---|
| మొదటి కథ | దేవులపల్లి కృష్ణమూర్తి | పాలపిట్ట పత్రిక | జూన్, 2010 |
| యక్షగానం | దేవులపల్లి కృష్ణమూర్తి | సోపతి–నవ.తె. పత్రిక | 2015 |
| రాక్షస క్రీడ | జిల్లెళ్ళ అనసూయ | చినుకు పత్రిక | జనవరి, 2010 |
| రాజన్న | కోట్ల వనజాత | బతుకమ్మ–న.తె. పత్రిక | జనవరి, 2012 |
| రైతు యాత్ర | మేరెడ్డి యాదగిరిరెడ్డి | – | సెప్టెంబర్, 2014 |
| లచ్చిమి | పిట్టల శ్రీనివాస్ | అవిటి కథలు–సంక. | 2013 |
| లతీఫ్ మియాశాస్త్రం | స్కైబాబ | బతుకమ్మ–న.తె. పత్రిక | డిసెంబర్, 2013 |
| లవ్ ఇన్‌ఫెక్షన్ | జిల్లెళ్ళ అనసూయ | సాహితీ ప్రస్థానం | జనవరి, 2011 |
| లోటు | ఎన్. సంజీవరెడ్డి | సంతకం పత్రిక | జూన్, 2012 |
| వలస పక్షులు | దేవులపల్లి కృష్ణమూర్తి | పాలపిట్ట పత్రిక | జూన్, 2015 |
| వాన కురిసిన రాత్రి | రమేశ్ హజారి | బతుకమ్మ–న.తె. పత్రిక | జూలై, 2011 |
| విధ్వంసం | వెన్నం ఉపేందర్ | వార్త పత్రిక | జూలై, 2012 |
| విషపు నీళ్ళు | మేరెడ్డి యాదగిరి రెడ్డి | సాహితీ ప్రస్థానం పత్రిక | సెప్టెంబర్, 2010 |
| వీలునామా | మేరెడ్డి యాదగిరిరెడ్డి | స్థానిక పాలన పత్రిక | సెప్టెంబర్, 2010 |
| సంగీత | కె. కవిత | బతుకమ్మ–న.తె. పత్రిక | మార్చి, 2013 |
| సక్రమ సంబంధాలు | దేవులపల్లి కృష్ణమూర్తి | ద సండే ఇండియన్ పత్రిక | సెప్టెంబర్, 2010 |
| సదువు | భూతం ముత్యాలు | సోపతి–న.తె. పత్రిక | అక్టోబర్, 2015 |
| సోయి | స్కైబాబ | బతుకమ్మ–న.తె. పత్రిక | ఆగస్టు, 2013 |
| స్నిగ్ధచ్ఛాయ | ముదిగంటి సుజాతారెడ్డి | బతుకమ్మ–న.తె. పత్రిక | జనవరి, 2015 |

*****




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 17 - Issue. 10 - October 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Chief Editor*

**PITTA SANTHI**

***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***

**C/o. Dr. Busi Venkataswamy**

Holy Homes Apartment, Postal colony ,

4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

BHAVAVEENA
Vol. 17, Issue. 10, October 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# Contents (విషయ సూచిక)


| | | |
|---|---|---|
| 1. తెలుగు కథ - కమ్యూనికేషన్ వ్యవస్థల చిత్రణ | - డా॥. ఎవివికె. చైతన్య | 5 |
| 2. జానపద కళారూపాలు - వాయిద్య పరికరాలు | - వి. ఆశాజ్యోతి | 11 |
| 3. తెలంగాణలో చర్మకారుల సామాజికార్థిక పరిస్థితులు - ఒక పరిశీలన | - డా॥. బి. కుమారస్వామి | 17 |
| 4. "గుర్రం జాషువా సాహిత్యం - సమకాలీనత : ఒక పరిశీలన" | - డా॥. డి. సహదేవుడు | 26 |
| 5. గురజాడ ఆధునిక దృక్పథం | - డా॥. ఎన్.అంబర్‌సింగ్ | 30 |
| 6. స్త్రీ నవలల్లో 'పునరుత్పత్తి' 'మాతృత్వం' భావనలు | - డా॥. పంతంగి వెంకటేశ్వర్లు | 34 |
| 7. రాచపాళెం కవిత్వం - రైతు - రాజీయం | - డా॥. సింగర వాణి | 38 |
| 8. విమర్శ - విమర్శకుడు - వివేచనాదృక్పథం | - ఎరికంబట్టు రాజేష్ | 43 |
| 9. తెలుగు - మరాఠీ దళిత స్త్రీవాద కథా సాహిత్యం | - కె. రమేష్ | 48 |
| 10. జానపద కళలు | - కడియం అజుబా మమతకుమారి | 54 |
| 11. నందమూరి తారక రామారావు పాత్రపోషణ వైశిష్ట్యం | - టి. కరుణాకర్ | 57 |
| 12. వివిధ రకాల మగ్గాలు - చేనేత ప్రాంతాలు | - కొలిపాక అరుణ | 63 |
| 13. జానపద సాహిత్యం - శృంగార గేయాలు | - డా॥. లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు | 69 |
| 14. 'జాషువా' - ఒక ప్రతిఘటన చైతన్యం | - యం. రామలక్ష్మి | 74 |
| 15. అభ్యుదయోద్య1మ నేపథ్యంలో కన్నడ కథ | - డా॥ మల్లేశప్ప సిద్రాంపూర్ &<br>- డా॥ శ్రీనివాసరావు కాసర్ల | 77 |
| 16. సుషుప్తినుంచి - ఒక మెలకువ లోకిలి | - రవీంద్రసూరి నామాలలి | 82 |
| 17. దేవరకొండ బాలగంగాధర తిలక్ - మానవతావాదం | - పి. ఏడుకొండలు | 85 |
| 18. విశాఖ ఏజెన్సీ కోదు తెగ ప్రజలు-సామాజిక జీవన విధానం | - పెనుమాక రాజశేఖర్ | 89 |
| 19. యం.కె దేవకి గారి కథలు - స్త్రీలపై జరిగే అన్యాయాలు | - జి. శోభన కుమారి | 93 |
| 20. ఓల్గా గారి స్త్రీవాద సాహిత్యం | - రెడ్డి నీలిమ | 95 |
| 21. రాయలసీమ వెతలు - రామకృష్ణ కథలు | - రాళ్ళపాటి లోకనాథం | 98 |
| 22. ఎన్.టి.ఆర్. జానపదచిత్రాలు-సామాజిక స్పృహకు చిహ్నాలు | - డా॥. ఎస్. చిన్నరెడ్డయ్య | 100 |
| 23. బాలవ్యాకరణంలోని ఛందోమయ సూత్రాలు | - గొల్లపల్లి అమృత | 105 |
| 24. లేస్ హ్యండీక్రాఫ్ట్ - నర్సాపురం, పాలకొల్లు అల్లికలు | - ముప్పిడి రాంబాబు &<br>- డా॥. పి. ఆనంద్‌రాజ్‌కుమార్ | 109 |
| 25. శుక్తిమతి కథల్లో సామాజిక స్పృహ | - సయ్యద్ అఫిన్ బేగం | 112 |
| 26. నల్లగొండ జిల్లా కథా సాహిత్యం | - చింతపల్లి దేవయ్య | 117 |
| 27. Theorizing the gap between director's intention and audience's response | - Chandrasekhar Indla | 124 |

BHAVAVEENA
Vol. 17, Issue. 10, October 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# నల్లగొండ జిల్లా కథా సాహిత్యం

- చింతపల్లి దేవయ్య, పరిశోధక విద్యార్థి, తెలుగు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

పోరాటాల ఖిల్లా విప్లవాల పురిటిగడ్డ నల్లగొండ జిల్లా. ఎన్నో ఉద్యమాలకు ఆయువుపట్టు నల్లగొండ జిల్లా. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాటానికి నాంది పలికింది ఇక్కడే. ఆంధ్రమహా సభ, గ్రంథాలయోద్యమాల ద్వారా సాహితీ చైతన్యం వెల్లివిరిసింది. పై సంఘటనలు ఎంతోమంది రచయిత లకు స్ఫూర్తినిచ్చాయి. నాటి జిల్లా తొలి కథకురాలు భండారు అచ్చమాంబ నుండి నేటివరకు వందేండ్లు నల్లగొండ కథ ఎన్నో మలుపులు తిరిగింది. పరిశోధన, నవల, కథ, కవిత్వంలోను తన విశిష్టస్థానం సంపాదించు కున్నది. ఇక్కడ గర్వించదగ్గ రచయితలు ఉన్నారు.

భండారు అచ్చమాంబ మొదటి కథ 1902లో 'స్త్రీవిద్య' హిందూసుందరి పత్రికలో వచ్చింది. తర్వాత 'ప్రేమ పరీక్ష', 'ఎరువు సొమ్ము బరువు చేటు', 'ధనత్రయో దశి', 'బీదకుటుంబం', మొదలగు దాదాపు అరడజను కథలు అచ్చమాంబ నుండి వచ్చాయి. నల్లగొండ జిల్లాలో తొలి కథకురాలు అచ్చమాంబే. వీరి సోదరుడు కొమర్రాజు లక్ష్మణరావు రాసిన 'యాభదివేల బేరము' కథ 1910లో ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో వచ్చింది.

1912లో షబ్నవీసు 'నీలగిరి' పత్రికలో శేషభట్టం రామనర్సింహారావు, కె. రాములు రాసిన కథలు వచ్చాయి. ఈ కాలంలోనే పులిజాల వెంకటరంగారావు చాలా కథలు రాశాడు. నీలగిరి పత్రికా సంపాదకులు షబ్నవీసు వెంకట రామనర్సింహారావు బాల్యవివాహాలను నిరసిస్తు 1921లో 'బాలికా విలాపము' కథ వెలువరించారు. 1926-30 మధ్యకాలంలో బి. వెంకోబారావు చాలా కథలు రాశాడు. వీరి కథలు సుజాత, దేశబంధు పత్రికలల్లో వచ్చాయి. 1927లో కె. రాములు రాసిన చారిత్రక కథ 'విపరీత సాహసము' ఎన్నదగింది. 1927లో నీలగిరి పత్రికలో 'యౌవన భ్రాంతి' కథను కటంగూరి నర్సింహారెడ్డి రాశాడు. 1929లో సుజాత పత్రికలో 'ఎవరు దిక్కు' కథను బి.బిన్. శాస్త్రి రాశాడు. కోదాటి శ్రీనివాసరావు కథ 'నాకల' తెనుగు పత్రికలో అచ్చయింది. మూటుపూరు వెంకటేశ్వరరావు నారదుని యాత్ర పేరిట 'జగడాల కథ' 1935లో 'గోల కొండ' పత్రికలో అచ్చయింది. తెలంగాణాలో నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు ఊపందుకొని రాజకీయ చైతన్యం వెల్లివిరిస్తున్న తరుణంలోనే రెండో ప్రపంచయుద్ధం చోటు చేసుకోవడం వలన కొన్ని పత్రికలు మూతపడటంతో 1930-40 మధ్య నల్లగొండ కథా నిర్మాణం అంతగా జరగలేదు. 1939లో ఎస్.బి. సీతారామారావు రాసిన 'గరీబోన్ని' కథ తెలంగాణా భాషలో రాసిన మొదటి కథల్లో ఒకటి. 1940లో వెలువడ్డ 'కమ్మ బెమ్మెరలు' సంకలనంలో నల్లగొండ రచయితల కథలున్నాయి. చెరుకుపల్లి హరి కృష్ణారావు 1940లో రాసిన 'పల్లెబడి', చెరుకుపల్లి రాఘోత్తమరావు 1940లో వెలువరించిన 'కోవిల్లో, బోయిన పల్లి రంగారావు కథ ఆంధ్రకేసరి పత్రికలో వచ్చిన 'వారం రోజుల అవస్థ' కథలు తెలంగాణా భాషా మాధుర్యాన్ని అందునా నల్లగొండ యాసను ఆ కథల్లో పట్టించారు. ఆనాటి సమాజాన్ని కూడా చిత్రించారు. 1938-40 ప్రాంతంలో సాహితీ మేఖల అంబడిపూడి వెంకటరత్నం కథలు 'మణి' మొదలగు కథలు గోలకొండ పత్రికల్లో వచ్చాయి.

దాదాపుగా ఇదే సమయంలో ఆర్య సమాజ భావా లతో ప్రభావితులైన మంత్రిప్రగడ వెంకటేశ్వర్రావు కోదాటి శ్రీనివాసులు కొన్ని కథలు వెలువరించారు. వీరి కథలు ప్రజల్ని చైతన్యవంతుల్ని జేసి స్వాతంత్ర్యం కోసం పోరాడేం దుకు సిద్ధం చేసినవి ఇదే కాలంలో పి.బి. ఆచార్య దామిడి రంగారెడ్డి ఉన్నవ వెంకటరామయ్య అనే వాళ్ళు కథలు రాశారు.

నైజాం వ్యతిరేక పోరాటం, రజాకార్ల ఆగడాలు, గ్రామాలల్లో దేశ్‌ముఖ్‌లు జమీందార్లు, దొరలు, భూస్వాముల ఆగడాలు, నిత్యం ప్రజల మీద వాళ్ళు చేసే దమనకాండ అంతా ఇంతా కాదు. 1942-43 ప్రాంతాల్లో నల్లగొండలో కమ్యూనిస్టు ఉద్యమం ఊపిరి పోసుకుంది. రావి నారాయణరెడ్డి నేతృత్వంలో భువన గిరిలో జరిగిన ఆంధ్రమహాసభ మొత్తం తెలంగాణా దిశనే మార్చేసింది. ఈ ఉద్యమ స్ఫూర్తితో కథలు రాసిన వారిలో ఆళ్వారుస్వామి, కాంచనపల్లి చినవెంకటరామారావు, ఆవుల పిచ్చయ్యలు ప్రముఖులు. ఆళ్వారుస్వామి 1944లో 'చిన్నప్పుడే' అనే కథను వెలువరించి ఆ ప్రక్రియలో తన రచనా వ్యాసంగాన్ని ఆరంభించాడు. ఆ తర్వాత ముస్లిం జీవితాలను, రజాకార్ల కాలాన్ని, మాల, మాదిగల బతుకులను, స్త్రీల వ్యథభరిత జీవితాలను కథలుగా మలిచాడు. కమ్యూనిస్టు నేతగా నల్లగొండ రచయితల సంఘం పెద్ద దిక్కుగా ఉండిన కాంచనపల్లి చినవెంకటరామారావు 1945లో మానవుళ్లో కూడానా' అనే పేరిట స్వాతంత్ర్యానంతరం తొమ్మిది కథలతో వెలువడ్డ ఈ సంపుటి కూడా పేదల దుర్భరమైన బతుకులను చూపించింది. కాంతం కథల స్ఫూర్తితో కనకం కథలు రాసి ముణిమాణిక్యం నరసింహారావు మన్ననలందుకుంది, ధరణికోట శ్రీనివాసులు 'చల్లపులుసు' కథ, అన్నంలోకి, మా ఇంట్లో సంపుటాల ద్వారా నల్లగొండ కథకు పుస్తకరూపమిచ్చాడు. ప్రజల పేదరికాన్ని నల్లగొండ బతుకులకు అక్షరరూపమిచ్చాడు.

బూర్గుల రంగనాథరావు 1945లో ఉద్యోగరీత్యా నల్ల గొండలో ఉండేవాడు. ఆయన పూనిక మేరకు "ఉషస్సు" కథా సంకలనం వెలువడింది. ఇది నల్లగొండ నుంచి వెలువడ్డ తొలి సంకలనం. మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన వేనెపల్లి ఆంజనేయులు 1946లో పాడియావు లాంటి కథను వెలువరించాడు. సూర్యాపేట ప్రాంతానికి చెందిన ఆవుల పిచ్చయ్య సాయుధ పోరాటంలో స్వయంగా పాల్గొనడమే కాక ఎందరికో శిక్షణనిచ్చి గెరిల్లాలుగా మార్చాడు. వెట్టిచాకిరీకి భూస్వాముల ప్రభుత్వ అధికారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఈయన రాసిన కథలు సాయుధపోరాటం నాటి నల్లగొండ జిల్లా జీవితాన్ని చిత్రించాయి. పిచ్చయ్య కథలు 'ఈతగింజ ఇచ్చి తాటిగింజ లాగిన జమీందారు', 'ఊరేగింపులు', 'చపరాసి దినచర్య' 'వెట్టిచాకిరి దినచర్య మొదలైన కథలన ఒక సంపుటిగా తీసుకొచ్చిన వారు సంగిశెట్టి శ్రీనివాస్.

రేపాలకు చెందిన వెలుగు నాట్యమండలి కె.యల్. నర్సింహారావు రాసిన 'అమరవీరుడు' కథ 1948లో విశాలాంధ్ర పత్రికలో అచ్చయింది. ఈ కాలంలో వచ్చిన కథలన్నీ ఉద్యమాల పోరాటాలు, తిరుగుబాట్ల నేపథ్యంలో ప్రజలను చైతన్యపరిచినవే. సాహితీ మేఖల, నీలగిరి సాహితి, ఆంధ్ర సారస్వత పరిషత్తులు, సాహితీ చైతన్యాన్ని తీసుకువచ్చాయి. లింగగిరి పరిగణాకు చెందిన సి.వి. కృష్ణారావు రాసిన 'నోటీసు', 'గీయని ఆక్షాంశరేఖ' కథలు చెప్పుకోదగ్గవి. గోలుకొండ పత్రికలో రచనా వ్యాసంగాన్ని ఆరంభించిన ధవళా శ్రీనివాసరావు ఆనాటి పత్రికల్లో తన కథల్ని వెలువరించాడు. "నేను ఏడ్వు మానలేదు" 1949లో భాగ్యనగర్ పత్రికలో వచ్చింది. పుల్లబొట్ల వేంకటేశ్వర్లు నల్లగొండలో పుట్టినప్పటికీ ఉద్యోగరీత్యా ఖమ్మం వెళ్ళి అక్కడ్నుంచి తన కథల్ని పలు సంపుటాలుగా వెలువరించారు. 1950లో తొలికథ "పుట్టుమచ్చ" వెలువరించిన ఈయన "జ్ఞానస్రవంతి", మూడు వాక్చిత్రాలు, పుల్లబొట్ల కథలు, పిన్ని చాలా మంచిది, వెన్నెల కిరణాలు, క్రాస్‌చెక్ ద్వారా దాదాపు 50 కథల్ని సంపుటీకరించారు. మధ్యతరగతి మనుషుల జీవితాలు కన్నీటి గాథలు, అంతర్మథనాలే ఈయన కథలకు జీవనాదాలు. 1952లో 'జైలు లోపల' కథా సంపుటి ద్వారా మొత్తం తెలుగు సమాజానికి సంబంధించిన కడగండ్లను కండ్లకు కట్టినట్టుగా చూపించాడు ఆళ్వారుస్వామి. ఒకవైపు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తూ నిరంతరం సాహిత్య సేవకే జీవితం అంకితం చేశాడు. అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేసిన మరో

ప్రతిభావంతమైన కథా రచయిత 'నాయిన గారు' గా పిలువబడ్డ కోదాటి లక్ష్మీనరసింహారావు 1953లో 'శాంతి ప్రకటనలు' కథ రాశాడు. ఆయన ఎన్నో మారుపేరులతో రాసిన కథలు మొదట్లో కమ్యూనిస్టు ఉద్యమాలను, అనంతరం కాంగ్రెస్ పాలనను చిత్రించాయి. 1954లోనే కథా సంపుటి తీసుకురావాలని దానికి 'చీకటి దొరలు' పేరు పెట్టాడు. అయితే వివిధ కారణాల వల్ల అది వెలుగుచూడలేదు.

పైడిమర్రి వెంకట సుబ్బారావు 1956లో 'నౌకరి' అనే కథను రాశాడు. 1961లోనే కథా రచయితగా ప్రాణం పోసుకొని సమాజ శ్రేయస్సుని కాంక్షిస్తూ అనేక కథలు రాసిన వారిలో నిఖిలేశ్వర్ ఒకరు. ఆరంభంలో విరివిగా కథలు రాసిన ఈయన తర్వాత కవిత్వంపై శ్రద్ధ పెట్టడంతో వాటి సంఖ్య తగ్గింది. విరసం వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన ఈయన 22 కథలు 2002తో 'నిఖిలేశ్వర్ కథలు' పేరిట వెలువడింది. మండల్‌రెడ్డి కొండల్‌రెడ్డి 1962లో 'మూసిన తలుపులు' కథను తీసుకొచ్చాడు. అలాగే ఓరుగంటి పురుషోత్తం 1963లో 'అందగత్తె' కథను వ్రాశాడు. ఈకాలం తర్వాత పుల్లబొట్ల వెంకటేశ్వర్లు, నిఖిలేశ్వర్ కొన్ని కథల్ని వెలువరించారు. ప్రపంచంలోని వివిధ భాషల్లో గల కథా సాహిత్యాన్ని తెలుగు వారికి సుపరిచితం చేసిన ముక్తవరం పార్థసారథి కూడా నల్లగొండ వారే. భువనగిరికి చెందిన ఈయన తొలికథ 'చిట్టి ఏడుపు' 1965లో అచ్చయింది. ఆ తర్వాత కాలంలో ఈయన రాసిన కథలు 2002లో 'మిణుగురులు' పేరిట వెలుగుచూసింది. నటువా వెంకటయ్య 1968లో "రామలక్ష్మి" అనే కథను రాశాడు. అదే సంవత్సరంలో ధరణికోట సమీర్‌కుమార్ "ఆడుమారిండు" కథను వెలువరించాడు. పంతంగి లక్ష్మీకాంతం 1968లో వరుసగా 'మెల్టింగ్‌మైండ్', కన్నీళ్ళలో కరుణ, వ్యధిత హృదయం, చెదరిన మమతలు, పసిడి హృదయం మొదలైన కథలను వెలువరించి మంచి కథకుడయ్యాడు. 1968లో కొండపల్లి వెంకట శేషగిరి రావు రాసిన 'సంసార సాగర' కథ ఆయనకు మంచి గుర్తింపు తెచ్చింది. 1968లో మేరెడ్డి యాదగిరిరెడ్డి 'నారాయణరావు' కథ అత్యంత ఆదరణ పొందింది.

1966 ఆ ప్రాంతంలో స్థాపించబడ్డ యువ రచయితల సమితి తరపున దర్పణం, మాలిక, సమర్పణ కథా సంకలనాలను వెలువరించడమే కాకుండా దాని తరపున దర్పణం పత్రికను కూడా తీసుకువచ్చి ఎందరో యువ రచయితలను ప్రోత్సహించారు. ఈ పత్రికకు మారు పేరుతో కూడా కొన్ని కథలు రాసినట్టు యన్.కె. రామారావు చెప్పారు. అంటే ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం తెలంగాణా కథకు అంతగా ప్రోత్సాహం ఆదరణ దొరకలేదు. గోలకొండ పత్రిక మూతపడ్డవే కాకుండా ప్రాంతేతరుల ఆధీనంలోని 'తెలుగు స్వతంత్ర' లాంటి పత్రికలు హైదరాబాదు నుంచి వెలువడ్డా ఆంధ్రా రచయితలకే అగ్రతాంబూలమిచ్చి ప్రచురించేది. దీంతో బయటి పత్రికలు కూడా వీరికి తగిన గుర్తింపు ఇవ్వలేదు. ఈ కాలంలో కథలు వెలువరించిన వారిలో కోలాహలం లక్ష్మణరాజు ముఖ్యులు. ఈయన 25కి పైగా నవలలు రాసి అఖిలాంధ్ర అభిమానాన్ని చూరగొన్నాడు. నవలా కారునిగా వచ్చిన గుర్తింపు కథకుడిగా దక్కలేదు. ఎన్నో సంకలనాలలో కథలు చోటుచేసుకున్నా ఆయన కథల సంపుటి అచ్చుకాకపోవడంతో అవి అందుబాటులో లేకుండా పోయాయి.

1969 తర్వాత నల్లగొండ కథకు పక్కా దారులేసిన సంస్థగా చెప్పుకోదగింది నల్లగొండ యువ రచయితల సమితి. వ్యక్తులుగా బోయజంగయ్య, దేవరాజు మహారాజు, మేరెడ్డి యాదగిరిరెడ్డి, వసంతరామ్, బి. రాములు, యన్.కె. రామారావు, మూటుపూరు కృష్ణమూర్తి, నిఖిలేశ్వర్, చెరబండరాజు, ముక్తవరం పార్థసారథి మొదలైన వారు. వీరంతా ఈ కాలంలో వివిధ పత్రికల్లో కథలు వెలువరించారు.

1970లో టెర్లిన్ చీర, దారితప్పిన బాటసారి కథలతో రచనలకు శ్రీకారం చుట్టిన యన్.కె. రామారావుగా

పిలువబడే నారపరాజు కోదండ రామారావు ఈ మధ్య కాలంలో 'విద్యుల్లత' పేరిట కథల సంపుటాన్ని వెలువ రించాడు. రాజకీయ నాయకుల దాష్టికాలను తెలం గాణా సమాజాన్ని తన కథల్లో చిత్రించాడు.

1970-80 మధ్యకాలంలో యువ రచయితల సమితి సభ్యులు మూటుపూరి కృష్ణమూర్తి 'తప్పు' కథ వచ్చింది. మేరెడ్డి యాదగిరి రెడ్డి చావుకోసం, ఓటన్న ఇంకా తన కథలను కలిపి 2004లో 'మట్టికథలు' అనే పేరిట సంపుటీకరించి వెలువరించాడు. రాహువు 'రాజ్యంలో రాజ్యం చచ్చింది', నిర్మల్ సమాధులపై పునాదులు" శ్రీ క్రాంతి 'నీడలో దాగిన నిజం", అల్లుబెల్లి రాంచంద్రారెడ్డి "విషం కక్కిన సంస్కారం", బోయినపల్లి కిషన్‌రావు 'తీరని కోరికలు', విద్వాన్ నాగం 'అధిక+అరి", యం. కృష్ణమూర్తి "ఎన్నికల రోజు", ఆగ్నేయ 'ఒక గుమాస్తా కథ", కాంచన పల్లి వెంకట కిషన్‌రావు "ఉపమానం-ఉపమేయం", 'చిలక జోస్యం' మొదలైన కథలను వెలువరించారు. విప్లవ భావజాలం కలిగిన చెరబండ రాజు 1971లో 'చిరంజీవి' అనే కథను వెలువరించాడు. కొలనుపాక మురళీధరరావు 1971లో 'బంధుప్రీతి' కథను రాశాడు. తెలంగాణా సాయుధ పోరాట కాలంలో ఉప్పెనలా విరుచుకుపడిన బి.యన్.రెడ్డి 1972లో "ఆయువు పట్టు" కథ అత్యంత ప్రజాదరణ పొందిందిగా ప్రశంసలందుకుంది.

దేవులపల్లి శాంసుందర్‌రావు 1972లో రాసిన 'మనసు ఆంతర్యం' కథ మరియు వివిధ కాలాల్లో రచించిన తన కథలను కలిపి 'సంఘర్షణ', 'గూడు దొరకని పిట్ట' అనే కథ సంపుటాలుగా నల్లగొండ ముంగిట విరబూయిం చాడు. నల్లగొండ కథల వాకిట చిరస్మరణీయమైన ముద్ర బోయ జంగయ్యది. ఆయన వెలువరించిన 1973లో 'లోకం' కథల సంపుటికాగా, ఆ తర్వాత కాలాల్లో 'గొర్రెలు', ఎచ్చరిక, దున్న, రంగులు, చీమలు, తెలంగాణా వెతలు, కొత్తపాఠాలు, బోజ కథలు, ఉప్పునీరు, ఇప్పపూలు మొదలైన సంపుటాలను తీసుకొచ్చాడు. దళితుల జీవితా లను, తెలంగాణా పోరాటకాల స్మృతులను, దౌర్జన్యాలకు బలైన బానిస బతుకుల్ని తన కథల్లో చిత్రించాడు కె. వాస 1974లో రంగువెలసి 'త్రికోణం', పి. సుదర్శన్ అనే సంవత్సరంలో 'అప్పుకోసం', చెన్నూరి నాగరాజు 'పిచ్చి' అనే కథతో పాటు 'ముల్లగులాబి' అనే కథా సంపుటిని తీసుకొచ్చాడు. శేషువి కూడా 1974లో 'చందన', 1975లో బార్యోపహతుడు కథలు రాగా, ఇంకా కొన్ని కథలతో కలిపి 'శేషవాక్యం'గా ఒక పుస్తకం బయటికి వచ్చింది. 1976లో వివిధ రచయితలు తమ కథతో సాహితీ వనంలోకి చొచ్చుకొచ్చారు. నిర్మల్ 'ఓ మామూలు మనిషి కథ', మూటువూరి కృష్ణమూర్తి మల్లీశ్వరి-మల్లెపూలు, బి.రాములు వ్యత్యాసాలు, విద్వాన్ యానాల 'ఆవిడ భర్త పెళ్ళి', కొల్లు మధుసూదనరావు 'మోసం, దారితప్పితే, కొట్ర మల్లికార్జున 'నాగరికం', దేవులపల్లి వెంకట ప్రభాకర రావు 'నా కొద్దు మంత్రి పదవి', ఇంకా భద్రసేన కాశావజ్జల వెంకట నరసింహమూర్తి ఈ కాలంలో కథానికలు వెలువ రించారు. సాంస్కృతిక సాహిత్య చైతన్యంతో మూఢ నమ్మకాలపై వేటుపడేలా కథలల్లిన తెలంగాణా (నల్ల గొండ) కథల రారాజు దేవరాజు మహారాజు 1977లో 'కడుపుకోత' కథల సంపుటి 1991లో బి. విద్యాసాగర్‌తో కలిసి 'పాలు ఎఱ్ఱబడ్డాయ్', 1993లో 'దేవరాజు మహా రాజు' కథల పేరిట పుస్తకాలను ప్రచురించాడు. తెలం గాణా భాషలో కథలు రాసిన వారిలో అగ్రగణ్యుడు దేవ రాజు మహారాజు. ఈయన భువనగిరి వాడు. కె.శ్రీనివాస్ 1982లో కొన్ని కథల్ని వెలువరించాడు. అయితే అవన్నీ పత్రికల పుటల్లోనే ఉండిపోయాయి. సుంకిరెడ్డి నారా యణరెడ్డి 'నాగావళి' పేరుతో 1987లో 'రెండుగా చీలిన మాట' కథను రాశారు. అదే సంవత్సరంలో యస్.యస్. రాహుల్ 'ఒకే గూటి పక్షులు' కథను రాశారు.

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం స్థాపన మరియు అధికారంలోకి రావడంతో పరిస్థితిలో స్పష్టమైన మార్పులు చోటుచేసుకున్నాయి. స్థానికులపై ప్రాంతేతరుల అజమాయిషీ పెరిగి తెలంగాణీయులు తమ ప్రాంతంపైనే పరాయికరణకు గురయ్యారు. 1988 వరకు ప్రాంత స్పృహ

అస్తిత్వ ప్రకటన గుండెల్లోనే దాచుకున్న తెలంగాణ ఆ తర్వాత బహిరంగంగా ప్రకటించింది.

1988 నుంచి కథలు రాసిన పుప్పాల కృష్ణమూర్తి "రైలు ప్రయాణం" కాగా, ఆ తర్వాత 1993లో 'జీవిత చిత్రం' పేరిట సంపుటి తీసుకొచ్చాడు.

1989లో సగటు మనిషి యొక్క భావాలను తెలంగాణాలోని ఆర్తిని, అలజడిని, అనుభవాలని, అనుభూతులను అక్షరీకరించి 'శిలువకు తొడిగిన మొగ్గ", ఆ తర్వాత "ఎల్లమ్మ" కథ సంపుటాల ద్వారా అందరితో పంచుకున్న కథకుడు కాసుల ప్రతాపరెడ్డి. 1990లలో 'ఉదయ' పత్రికలో పనిచేస్తున్నప్పుడే దారితప్పిన తెలుగు కథకు 'నవకథ' సంకలనం ద్వారా బాట తీసిండు.

దొరలు దొంగలై దోచుకుంటున్న వారిని పయిలం గుండమని చెబుతున్న కథకుడు పి. చిన్నయ్య. 1990లో 'వివక్ష' కథ వెలువరించాడు. అటు తర్వాత తాగేందుకు గుక్కెడు నీళ్లులేక, ఫ్లోరోసిస్ వ్యాధితో నడ్డివిరిగిన నల్లగొండను తెలియజెప్పిన కథకుడు పి. చిన్నయ్య 'పయిలం' పేరిట ఒక సంపుటిని తీసుకొచ్చాడు.

నన్నూరి సత్తిరెడ్డి 1993 'వాగొచ్చింది', 'దొంగలు', పోస్టొచ్చింది' వంటి కథలు వెలువరించాడు. అలాగే వీ.ఆర్. నన్నూరి 1996లో 'పైరు', 'గడి', 'పట్నంబాబులు' లాంటి కథలు తీసుకొచ్చిండు. సూర్యాపేటకు చెందిన కొప్పరపు జ్యోతి 1996లో 'మరక' అనే కథను వెలువరించింది. ఆధునికత, అభివృద్ధి పేరిట జరుగుతున్న దోపిడీ, అన్యాయం, అందునా ఆడవాళ్ళు ఇంటాబయట ఎదుర్కొంటున్న అగచాట్లు, వ్యాపారపరమైన మానవ సంబంధాలను తన కథల ద్వారా చిత్రిక కట్టిన నల్లగొండ జిల్లా కథకురాలు ముదిగంటి సుజాతారెడ్డి 1997లో "కబ్జా" అనే కథను తీసుకురాగా,అటు తర్వాత 'విసుర్రాయి', 'మింగుతున్నపట్నం', 'వ్యాపార మృగం' వంటి కథల సంపుటాల ద్వారా తెలంగాణా జీవితంలోని విభిన్న పార్శ్వాలను తెలియజెప్పింది. ఎం. వెంకట్ 1998లో 'వల్లెక్కం' కథను రచించాడు.

ముస్లిం దీనావస్థలు, ధిక్కార స్వరాలు అన్ని కలిపి రచించిన రచయిత్రి షాజహానా 1999లో 'సిల్‌సిలా' కథను వెలువరించింది. అలాగే 2000లో గౌస్ మొహియుద్దీన్, గుంగీదడ్కన్, స్కైబాబా కథలు, చోటిబెహన్, ఖిల్లా కథలు వచ్చాయి. 'ఆక్సిజన్ బార్' తో జీవచ్ఛవంలా ఉన్న తెలంగాణా అణగారిన బతుకులకు, భాషకు ఊపిరి పోసింది తెలిదేవర భానుమూర్తి. తెలంగాణా తల్లి పేగు బంధాన్ని నల్లగొండ గోడుని, గోసని అమానవీయంగా మారుతున్న సంబంధాన్ని అక్షరీకరించిన కథకుడు బోధనం నర్సిరెడ్డి. ఇదే సంవత్సరంలో 'తశ్వ' కథను వెలువరించాడు. ఇటీవలే 'పేగుబంధం' సంపుటి తీసుకొచ్చి ఎన్నో ఏండ్లుగా బాకీ ఉన్న పనిని తీర్చుకున్నాడు. పగడాల నాగేందర్ 2001లో 'ఉసురు' అను కథను వెలువరించాడు. అలి 2001లో "హరేఖ్ మాల్' కథల సంపుటిగా తీసుకొచ్చాడు. మందడి కృష్ణారెడ్డి 2001లో 'మారని సమాజం' కథను రాయగా అటు తర్వాత ఆయన రాసిన కథలు మందడి కథలుగా సంపుటీకరించాడు. ఇండియన్ పోస్టల్ సర్వీసెస్‌లో పాండిచ్చేరిలో ఉద్యోగం చేస్తున్న తెలంగాణాను కన్నతల్లి నల్లగొండను మరిసి పోకుండా కథలు రాస్తున్నది యెన్నం ఉపేందర్. 2002లో వచ్చిన 'రేషన్ కార్డు' కథతో కలిపి 32 కథలను 'ఎండమావి' గా 2003లో తీసుకొచ్చాడు. పల్లెతల్లి అమ్మవడి లాగా వెచ్చంగా ఈయన కథలుంటాయి. జి. అనసూయ 2002లో ఉత్త(మ) ఉపాధ్యాయుడు, పనిపిల్ల కథలు రాశారు. ఆ తరువాత ఆమె రాసిన కథలన్నింటినీ కలిపి 'నిశ్శబ్ద చిత్రాలు' సంపుటిగా తీసుకొచ్చారు. దళిత చైతన్యానికి ప్రతీకగా దొడ్డి రామ్మూర్తి ఆరు కథల సంపుటి 'బొండిగే' (2002) నిలుస్తుంది. అణచివేతకు గురైన అట్టడుగు వర్గాల వారి జీవితాలకి దర్పణం. వేణు సంకోజు 2003లో 'మొరం' కథ వచ్చింది. ఆయన రాసిన కథలు ఆ తర్వాత 'స్పర్శ' కథల సంపుటిగా బయటకు వచ్చింది. నల్లగొండలో కొలనుపాక మురళీధర రావు 2003లో 'ఇరుసు విరిగిన బండి' కథ వెలువరించాడు.

ఆ తర్వాత 'అష్టాదశ కథలు' పేరిట ఆయన కథలు అన్నీ సంపుటీకరించబడ్డాయి.

నల్లగొండ 'వతన్' కథకులు స్కైబాబా, అలీ, నిసార్, గౌస్ మొహియుద్దీన్, షాజహానా, ఒకవైపు, తెలంగాణ మరోవైపు ముస్లిం అస్తిత్వం ఈ పోరాటంలో ఆటుపోట్లు అంచనాలకు అందని అగాథాలు వీటి యొక్క సమగ్ర జీవిత చిత్రాల రూపం 2004లో 'వతన్' కథల సంక లనంగా వచ్చింది. 2004లో కరుణ గారి 'కవులమ్మ ఆడదేనా', పులిపాటి గురుస్వామి 'ఐటికప్ప' కథ లొచ్చాయి. వైవిధ్యంగా తెలంగాణా భాషను, జీవితాన్ని ముఖ్యంగా గ్రామీణ వాతావరణాన్ని స్థితిగతులను చిత్రించిన కథకుడు ఎలికట్టె శంకరావు. 2005లో 'జారుడు బండ' పేరిట వెలువడ్డ ఈ కథల్లో తెలంగాణ మట్టి వాసన స్పష్టంగా కనిపిస్తుంది. పిట్టల శ్రీనివాస్ 'వెలి', 'లచ్చిమి' కథలను రాశారు. పి. చిన్నయ్య 'జీవచ్ఛావాలు' (2006) 'అంటరాని బతుకమ్మ' (2015), అడిగెటోళ్లు (2013) కథలను రాసిండు. నిరుడు సంజీవరెడ్డి 'మసిబారిన నిజాలు (2011), జీవనాడి (2012), 'లంకె' (2013), నా దగ్గర సమాధానం లేదు (2016), ఓ పొద్దు గూక (2017) తదితర కథలు రాశాడు.

జి. అనసూయ 'నాదే కులం' (2007) కథ, గ్రామీణ నేపథ్యం ప్రపంచీకరణ కార్పొరేటికరణల ప్రవేశంతో విధ్వంసమైన చేతివృత్తులు, వ్యవసాయం, సెజ్‌ల రాకతో భూములను భూములతో పాటు, భూమికను ఉనికిని, ఆత్మగౌరవాన్ని పోగొట్టుకున్న రైతులు, రైతుల నిస్సహాయ ఆత్మాహుతులతో రోడ్ల పాలయి కుటుంబాలు ఇవి 'తెలంగాణ బ్రతుకు చిత్రాలు' (2014) కథా సంపుటిలో కనిపిస్తుంది. 'కథల సందుక' 2018లో కథా సంపుటి వెలువరించారు. చిత్రం ప్రసాద్ 'పల్లెరు గాయలు' (2007), మళావత్ బాలాజీ నాయక్ అదే సంవత్సరంలో 'జమిలి', మేరెడ్డి యాదగిరిరెడ్డి 2008లో 'సైజ్' కథ, 'బొడ్రాయి' 2016లో కథా సంపుటిని వెలువరించారు. కందుకూరి దుర్గాప్రసాద్ 2009లో 'దేవుళ్ళు', పున్న అంజయ్య 'పగ', 'పూళ్లోకి అచ్చుమొచ్చింది' కథలను రాశారు.

దేవులపల్లి కృష్ణమూర్తి రాసిన కథలన్నీ తెలంగాణ సాయుధ పోరాట కాలంనాటి కథలె. 2010లో 'మొదటి కథ', 'గథల గూడు' (2012), తారుమారు (2014), యక్షగానం (2016) కథా సంపుటాలను తీసుకొచ్చాడు. అంబటి వెంకన్న 2010లో ఆనోస్తే.....చెరువేది? పెరుమాళ్ల ఆనంద్ అదే సంవత్సరంలో 'చివరికి', 'మమేకం', ముదిగంటి సుజాతారెడ్డి 'ఈ పెండ్లి నిలుస్తుందా!' కథ, 'మరో మార్క్సుపుట్టాలె?' కథా సంపుటిని తీసుకొచ్చారు. గుడిపాటి వెంకటేశ్వర్లు 'గది', వేణు సంకోజు 'అమ్మవాసన', తెలిదేవర భానుమూర్తి 'ఆడ పాటపిట్ట లున్నాయా!' ఆక్సిజన్ భార్, నెమలీక పేరుతో కథా సంపుటాలు వెలువరించారు. కొలనుపాక మురళీధర రావు 2010లో 'చిలకల దండ', భూతం ముత్యాలు 'బేగరి కథలు' (2010), 'బుగాడా' (2014), 'దగ్గం' దళిత కథలు (2017) కథా సంపుటాలను తీసుకొచ్చారు. పెండెం జగదీశ్వర్ 'కన్నీటి బొట్టు' జానపద కథలు, బాలల కథలు రాశాడు. ఎలికట్టె శంకర్‌రావు 'రైతుపుట్క' కథ, 'దుబ్బ చెలక' (2010), పరిగెచేను (2015), కథా సంపుటాలను వెలువరించారు. కోటమర్తి రాధాహిమ బిందు 'యుగాంతం', 'వంశవృక్షం', 'మానవాలి', 'జీవన మాధుర్యం' కథలను, ప్రతాప రవిశంకర్ 'పెళ్లికాని కోడలు', 'అర్థరాత్రి అతిథి', 'మాంగల్య బలం' మొదలగు కథలు రాశారు. కంచర్ల సత్యపాల్ రెడ్డి 'ఓసిన్నోని కథ' (2011), రమేష్ హజరి 'వాన కురిసిన రాత్రి', మాణిక్యం, కర్తవ్యం, కథలను వ్రాశారు. స్కైబాబ 'అధూరె' (2011) ముస్లిం కథలు, 'బేబారె' భగ్న ప్రేమకథలు (2015), 'అలాయి బలాయి' బహుజన కథలు (2015) కథా సంపుటాలను తీసుకవచ్చారు. వెన్నం ఉపేందర్ 2011లో చెత్తోడు, కిర్రుచెప్పులు (2012), గురుభ్యోనమ: (2013), మట్టిమనిషి (2013 మొదలైన కథలను రాశాడు. కోట్ల వనజాత 2014లో 'ఇత్తు' కథ సంపుటిని వెలువరించారు.

శిరం శెట్టి కాంతారావు 'అంతులేని పయనం' (2011) కథ, 'ఊత కర్రలు' (2012), 'చొరబాటు' (2016), 'మా ఫణి గిరి గుట్ట కథలు (2018) కథా సంపుటాలను వెలువ రించారు. గాదె వెంకటేష్ 'బత్తెం' (2013), టోల్‌గేట్ (2014) కథలను, సుజాత సూరేపల్లి 'తెగిపడ్డ పల్లెలు' (2013) కథను, షాజహానా 'బిల్లి' (2013) కథను, 'లద్దాఫ్ని' (2016) (ముస్లిం స్త్రీ కథలు) ఈ సంపుటిలో పేద దూదేకుల, ముస్లిం స్త్రీల జీవితాలను జీవన సంక్షోభాలను మనముందు ఆవిష్కరిస్తాయి. బెల్లి యాదయ్య 'ఎర్రెద్దు (2013) కథను, వేముల ఎల్లయ్య 'కుష్టాది కిష్టయ్య' (2013) కథను వ్రాశారు.

బోయపల్లి నర్సయ్య 2014లో రాసిన 'నిజాయితీ' కథ, ఆబ్కారిశాఖలో జరిగే చిత్రవిచిత్ర సంఘటనలు స్టేషన్ల నిర్వహణ, నేర పరిశోధనకై జరిపే దాడులు, కేసులు కోర్టు వ్యవహారాలు, గుడుంబా మాఫియాలు, ఆఫీసర్ల టార్గెట్లు, కింది తరగతి ఉద్యోగుల సాధక భాదకాలు, కాంట్రాక్టర్లు, అధికారుల మనస్తత్వాలు, అమ్యామ్యాలు అన్నీ కళ్లకు కట్టినట్లు మనకు 'ఆబ్కారి కథలు' కథా సంపుటంలో కనిపిస్తాయి. కాసుల ప్రతాపరెడ్డి 'పూర్తికాని కథ' (2014), తాయమ్మ కరుణ 'అమ్మ' (2014) కథ, 'జీవితం' (2018) కతా సంపుటిని తీసుకు వచ్చారు. మోహన్ రుషి 'థర్డ్ డిగ్రీ' (2014) కథను, దేవరాజు మహరాజు 'స్వర్ణయుద్ధం' (2010) కథ, 'మనిషి కథలు' (2015) కథా సంపుటిని వెలువరించారు. వి. మల్లికార్జున్ 2014లో 'కారు చెప్పిన కథ', 'ఇరానీ కేఫ్' (2018), 'కాగితం పడవలు' (2019), కథా సంపుటాలను వెలువరించారు. ఎం. రత్నమాల 2015లో 'ఇంద్రవెల్లి', కాటేపల్లి లక్ష్మీ నరసింహమూర్తి 'పచ్చీసు' (2015), పి. చంద్రశేఖర్ (చందుతులసి) 2015లో బుక్కెడు బువ్వ, ఊరవతల ఊడల మర్రి, పిట్టకథ, పాలపిట్ట పాట.... కథలను వ్రాశారు.

ఇంకా ఎందరో కథకులు నల్లగొండ జిల్లా భాష, యాస, మాండలికంలోను కథలు రాస్తున్నారు. ఈ వ్యాసంలో ప్రస్తావనకు రాని కథకులు కూడా ఉండొచ్చనే విషయాన్ని పాఠకులు దృష్టిలో పెట్టుకోగలరు. రాశిలోను, వాసిలోను, శిల్పంలోను, శైలిలోను, వస్తువులోను అనేకానేక మార్పులు సంతరించుకుని తెలుగు కథా ప్రపంచంలో నల్లగొండ కథ తనదైన స్థానాన్ని పొందింది.

## ఉపయుక్త గ్రంథ సూచిక :

1. ఎల్లారెడ్డి కర్ర (సం.పా) - మన తెలంగాణ-తెలంగాణ సాహితి నల్లగొండ జిల్లా ప్రత్యేక సంచిక వరంగల్ 2007.
2. వెంకటేశ్వర్లు పంతంగి. (సం.పా) - 'తెలంగాణ తెలుగు కథ'. తెలుగు విభాగం- యూనివర్శిటి ఆర్ట్స్ అండై సైన్స్ కళాశాల కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ 2011.
3. మల్లారెడ్డి తూర్పు (సం.పా) - తెలంగాణ సాహిత్యం-జీవిత చిత్రణం' (జాతీయ సదస్సు సంచిక) - తెలుగుశాఖ - శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళాశాల ఉస్మానియా పట్టభద్రుల సంఘం మరియు ఎగ్జిబిషన్ సొసైటీ వారి సంయుక్త సంచాలితం నల్లగొండ జిల్లా 2007
4. డా. సి. నారాయణరెడ్డి (ప్ర.సం.పా, డా॥ జె. చెన్నయ్య (సం.పా)- 'తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం' (సదస్సుల పత్రాల సంకలనం ఆంధ్ర సారస్వత పరిషత్తు. హైదరాబాద్ 2013.

❀ ❀ ❀

PALAPITTA

# పాలపిట్ట

మాసపత్రిక

ISSN 2582-7294

సంపుటి: 11 సంచిక: 11

**డిసెంబర్ 2020**

సంపాదకుడు

**గుడిపాటి**

కవర్ డిజైన్

**వికర్ణ**

ఆఫీస్ అసిస్టెంట్

**నరేష్**

**చందా వివరాలు**

ఏడాది చందా: రూ.350/-

మూడేళ్ళ చందా: రూ.1000/-

జీవిత చందా: రూ.5000/-

లేఔట్, డిజైన్: అక్షయ డిజైన్ స్టూడియో

Mobile : 9553371056

ప్రకటనలు, చందాలకు మరియు

(రచనలు, అభిప్రాయాలు పంపవలసిన చిరునామా)

**PALAPITTA**

# Flat No.2, Block 6,

MIG-2, APHB, Baghlingampally,

Opp. Sundaraiah Park Gate,

Hyderabad - 500044, Telangana, India.

Phone : 040 - 2767 8430

E-mail : palapittabooks@gmail.com

**Published at**

H.No.16-11-20/6/1/1,403,

Vijaya Sai Residency, Saleem Nagar,

Malakpet, Hyderabad - 500 036,

Telangana, India

## సంపాదకీయం

# ఇవాళ్టి సాహిత్య వస్తువు ఏది?

తమ చుట్టూ ఉన్న జీవితాన్ని గ్రంథస్థం చేసేందుకు సృజనశీలురు చేసే ప్రయత్నం భవిష్యత్ తరాలకీ, చరిత్ర నిర్మాణానికీ దోహదపడుతుంది. కరోనా ఉపద్రవపు మహా సంక్షోభ సమయాన మనుషుల పోకడలు, సమాజ చలనాలు ఏవిధంగా పరిణమించాయో తెలుసుకోడానికి సాహిత్యమే ప్రధాన వనరుగా మిగులుతుంది. 2020 మన జీవితకాలంలో మరచిపోలేని సంవత్సరం. కోవిడ్-19 కల్లోలానికి యావత్ ప్రపంచం అల్లాడిపోయిన సన్నివేశం పెద్ద గుణపాఠం. కానీ దీన్నించి నేర్చుకోడానికి ప్రపంచం సిద్ధంగా లేదని గత పది నెలల పరిణామాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పెట్టుబడి శక్తుల దుర్మార్గం మరింత పెచ్చరేగింది. భూగోళాన్ని తాము అనుకున్నట్టుగా ఆడించాలనుకునే కార్పోరేట్ల పన్నాగాలు కరోనాకాలంలోనూ మరింత చెలరేగాయి. 'అభివృద్ధి'దాహం ధరణి ఉనికి, ప్రధానంగా జీవావరణానికి పెను ప్రమాదంగా పరిణమించింది.

ఈ మౌలికమైన వాస్తవాల్ని అధ్యయనం చేయడంలో, ఆకళింపు చేసుకోవడంలో మన కవులు, రచయితలు ఎక్కడున్నారన్నది ప్రశ్న. కోవిడ్-19 సంక్షోభానికి మూలాలు ఎక్కడున్నాయో, ఈ పరిణామాల ప్రభావం ఎంత కాలం ఉండబోతున్నదో అవగాహన చేసుకోవాలి. ఈ సంధికాలంలో కవులుగా, రచయితలుగా తాము నిర్వహించవలసిన పాత్రపైన నిర్దిష్ట వైఖరిని సంతరించుకోవాలి. వలస కార్మికుల సంవేదనల పైన, కార్పోరేట్ ఆసుపత్రుల దుర్మార్గంపైన కవిత్వమెంతో వెల్లువెత్తింది. కానీ కోట్లాదిమందిని వీధుల పాల్జేసిన వ్యవస్థలోని క్రౌర్యాన్ని, కౌటిల్యాన్ని గమనించాలి. ఈ దృష్టి వైశాల్యం కొరవడితే పెట్టుబడి ప్రపంచపు మూసపాత్రల్లోనే ఒదిగిపోయి ముతక వాదనలు చేసే స్థాయికి జారిపోతారు. కార్పోరేట్ల గుత్తాధిపత్యంలో నడిచే వ్యవస్థలోనే ఏవో వెసులుబాట్ల కోసం, సర్దుబాట్ల కోసం అర్రులు చాస్తారు. ఇది అంతిమంగా ఈ పాశవిక వ్యవస్థని ఆమోదించే స్థాయికి సృజనశీలురని దిగజారుస్తుంది. పాలకవ్యవస్థ వాదనల్ని తలకెత్తుకున్న దరిమిలా మౌలికమైన చింతనాధార లోపిస్తుంది.

ఈ దుస్థితి మార్పుని ఇచ్ఛగించని యథాతథవాదులది పైచేయి అయిన దుష్ఫలితం. దార్శనికత కొరవడిన సృజనశీలుర వైఫల్యం. తక్షణ స్పందనలకే పరిమితమై సమాజ గమనాన్ని వీక్షించలేని భావదారిద్ర్యానికి నిదర్శనం. ఒక్కమాటలో చెప్పాలంటే తాత్విక సంక్షోభం ముంచెత్తిన వైనానికి రుజువు. విపరీతమైన, శరవేగమైన అభివృద్ధి పెట్టుబడిదారీ ప్రపంచానికి కావాలి. ముఖ్యంగా అమెరికన్, యూరోపియన్ అభివృద్ధి నమూనాల్లో తనతనాన్ని కోల్పోయిన, కోల్పోతున్న దేశాలు 'అభివృద్ధి' మాటున దాగిన కౌటిల్యాన్ని అర్థం చేసుకోలేకపోయాయి. దాని పడగనీడలో ఈ భూగోళం క్షేమంగా ఉండదని ఇప్పటికే బోధపడింది.

కరోనా కల్లోలానికి లోనయిన ఈ ధరణి 2120 నాటికి సుభిక్షంగా ఉంటుందన్న నమ్మకం లేదు. ఇప్పటికే జీవావరణం దెబ్బతిన్నది. తమకు అక్కర్లేని అభివృద్ధి వ్యూహాల్లో చిక్కుపడిన దేశాలు పర్యావరణ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ నేపథ్యంలో మనిషిక్షేమానికీ, ధరణీతలానికీ ముప్పుగా పరిణమించే అభివృద్ధి వ్యూహాల్ని ప్రతిఘటించడం తప్పనిసరి. ఈ క్రమాన పర్యావరణాన్ని కాపాడుకోవటమే లక్ష్యంగా సాహిత్యకారుల సృజన సారవంతం కావాల్సిన సందర్భమిది. పర్యావరణం ఎజెండాగా మన రాత, చేత పదునెక్కడం ద్వారానే 'అభివృద్ధి' కుట్రలపై ధిక్కారం సాధ్యం. ఎవరి అభివృద్ధి, ఎవరికోసం అభివృద్ధి అని ప్రశ్నించుకుంటే అభివృద్ధిపై ధిక్కారం ఎందుకో బోధపడుతుంది. అంతేగాక కరోనా కల్లోల సందర్భాన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంకేతిక, సాంస్కృతిక రంగాల్లోని పరిణామాల్ని గమనిస్తే 'అభివృద్ధి'పై నిర్దిష్టమైన దృక్పథం ఏర్పడుతుంది. సాహిత్యసృజనలో రచయితల, కవుల క్రియాశీలత ఎలా ఉండాలో స్పష్టత వస్తుంది. తద్వారా పర్యావరణం కేంద్రంగా సాహిత్యసృజన వికసించడానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. ఈ దిశగా అధ్యయన విస్తృతి ఇవాళ్టి అవసరం.

*palapittamag@gmail.com*

ISSN 2582-7294

## సమాంతర సినిమా సూపర్ స్టార్ - పేజీ: 34

## విషయసూచిక



భారతీయ సినిమా రంగం- చరిత్రలో నిలిచివున్నంతవరకు గుర్తుండిపోయే నటీమణి స్మితా పాటిల్. వెండితెరని వెలిగించిన విలక్షణ నటి. అటు సమాంతర సినిమాలలోనూ, ఇటు ప్రధాన ప్రవంతి బాలీవుడ్ సినిమాలలోనూ విభిన్నమైన పాత్రల్ని పోషించిన స్మితాపాటిల్ వర్ధంతి డిసెంబర్ 13న. 'అర్ధసత్య' సినిమాలో నికార్సయిన పాత్రని పోషించిన స్మితా పాటిల్ ని క్లాసిక్ చిత్రాల్ని ఇష్టపడే వారు ఎంతగానో అభిమానిస్తారు. ఆత్మగౌరవం, ఆత్మస్థయిర్యంతో మహిళలు ముందుకు పోవాలని అభిలషించే స్మిత కొద్దికాలమే జీవించినా ప్రతి తరం ఆమెని తలుచుకుంటుంది. సమాంతర సినిమా సూపర్ స్టార్‌గా ప్రసిద్ధి చెందిన స్మితా పాటిల్ గురించి పొన్నం రవిచంద్ర ప్రత్యేక వ్యాసం.





- శాంతిదళం అన్యాయాలను అడ్డుకున్న ధీరవనిత ప్రపంచ సినిమా 'విజిల్ బ్లోయర్' విశ్లేషణ - కె.పి. అశోక్‌కుమార్... 58


### బాల సాహిత్యం


- మిత్రుడు పంపిన ఉద్యోగి - మల్లారెడ్డి మురళీమోహన్ ...... 47


### పజిల్


- సినిమా పదబంధం - బి. మల్లేశ్వరి......................... 56
- సాహిత్య పదరంగం-11 - డా॥ఆరవిల్లి జగన్నాథస్వామి..... 75


### కథలు


- సన్యాసీ! నువ్వు తిరిగి రావాలి - మల్లిపురం జగదీశ్......... 6
- గోడ - సుంకోజి దేవేంద్రా చారి............................. 10
- నీరాజనం - గంటి రమాదేవి.............................. 22
- అలుకుగుడ్డ - డా॥ దీర్ఘాశి విజయభాస్కర్.................... 54


ఇంకా గట్టు రాధికామోహన్, ఈతకోట సుబ్బారావు, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, సిరికి స్వామి నాయుడు, చిత్తలూరి సత్యనారాయణ, సిహెచ్. ఆంజనేయులు, దర్భముళ్ళ చంద్రశేఖర్, కళ్యాణదుర్గం స్వర్ణలత, డా. ఎన్. గోపి, డాక్టర్ కావడిఎల్లయ్య, అశోక్ అవారి, అన్నవరం దేవేందర్, మంజుల సూర్య, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, కె.హరనాథ్, వనిపాకల లచ్చిరెడ్డి, ఎలనాగ, జుగాష్ విలి కవితలు.

### వ్యాసాలు

పేజీ నెం


- నల్లగొండ జిల్లా రైతు కథలు-వస్తు విశ్లేషణ.................... - చింతపల్లి దేవయ్య................................. 16
- ప్రపంచీకరణ నేపథ్యంలో వృత్తి కళాకారుల స్థితిగతులు - డా॥ జి.డి. జ్యోతీశ్వరీ దేవి..................................... 36
- పాలనాదక్షుడైన విద్యావేత్త, ఉస్మానియా వైస్ చాన్సలర్ ఎం.ఎస్. దొరైస్వామి - వెలుదండ నిత్యానందరావు.............. 40
- కవిత్వామృతధారలు కురిపించిన కవి - గోపగాని రవీందర్.. 48
- తొలితరం భారతీయ నవలల పరిశీలన - రాంబాబు......... 50
- గోలకొండ కథలు-పిల్లలు, బాల్యము - వి.ఆర్. శర్మ ........ 52
- అనుభూతి, అనుభవాల 'అలుకుపూత' - మండల స్వామి .... 71
- అచ్చమైన గ్రామీణ జనజీవన చిత్రాలు - పి. యశోదారెడ్డి కథలు - శీలా సుభద్రాదేవి.................. 72
- పాత్రలు-సంభాషణలు - బి.వి.ఎన్.స్వామి ................. 76
- కర్షకవాణి వినిపించిన కవిత్వం - తాటికొండాల............. 79


### అనువాద కథ


- పోర్ట్రెయిట్ - పుష్పా సక్సేనా, అనువాదం: అమ్జద్........... 60


### సీరియల్


- సమర్థుని జీవయాత్ర - డా॥ ప్రభాకర్ జైని ................ 30
- కనిపించని శత్రువు- గన్నవరపు నరసింహామూర్తి............ 68



# నల్లగొండ జిల్లా రైతు కథలు- వస్తు విశ్లేషణ


- చింతపల్లి దేవయ్య
పరిశోధక విద్యార్థి
హైదరాబాద్ విశ్వవిద్యాలయం,
హైదరాబాద్, ఫోన్.నెం: 9550852502


ప్రపంచ మానవాళికి అన్నం ముద్ద అందించే రైతన్న లేకుంటే ఎవ్వరూ బతకలేరు. ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి నల్లటి నేలలోంచి తెల్లటి అన్నం మెతుకును సమస్త మానవాళికి అందిస్తాడు. ఆ క్రమంలో ఎన్నో ఒడిదొడుకులు, కష్టాలు, కడగళ్ళు, చివరికీ ప్రాణం పోయినా ముందుకే సాగుతారు రైతన్నలు. రైతన్నలే లేకుంటే మనమెవ్వరం బతికి బట్టకట్టలేం కదా! అటువంటి రైతన్నలకు ప్రభుత్వాలు అండగా ఉండాలి. అలా చేయకుంటే, మనం అండగా ఉండి వారి బాధలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్ళే ప్రయత్నం చేయాలి. అటువంటి రైతు కథల్లో వారి సమస్యలు, జీవితం ఎలా ఉన్నాయో ఈ పరిశోధన పత్రం ద్వారా మనం చూడవచ్చు. తెలంగాణలో రైతులకు సంబంధించి చాలా కథలు వచ్చాయి. ప్రధానంగా నల్లగొండ జిల్లా రచయితలు రాసిన కథల (2010-2015) ఆధారంగా ఈ పరిశోధన పత్రం రాసాను.

పోరాటాల ఖిల్లా... విప్లవాల పురిటిగడ్డ నల్లగొండ జిల్లా. ఎన్నో ఉద్యమాలకు ఆయువుపట్టు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి, నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాటానికి నాంది పలికింది ఈ నల్లగొండ జిల్లాలోనే. సాహిత్య రంగంలో ఎన్నో ప్రయోగాలకు తెరలేపిన జిల్లా. తొలి కథకురాలు అచ్చమాంబ నుండి నేటి వరకు నల్లగొండ జిల్లా కథ రాశిలోనూ, వాసిలోనూ, శిల్పంలోనూ, శైలిలోనూ, వస్తువులోనూ అనేక మార్పులు పొంది; భాష, యాస మాండలికం లోనూ తన ప్రత్యేకతను చాటుకుంది.

ఈ జిల్లా నుంచి కథా రచయితలు రైతులమీద చాలా కథలు రాసారు. అందులో కొంతమంది రచయితల కథలు మాత్రమే తీసుకొని, అందులోని వస్తువును ఈ పత్రంలో వివరించాను.

### వీలునామా :

వానాకాలం కూడా వానలు పడక, కరువు రావడం వల్ల పంటలు ఎలాగైనా పండించాలని బోర్లువేస్తే నీళ్ళు పడలేదు. తోటలు ఎండిపోయి అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న రైతు... కొడుకుకు ఆఖరి ఉత్తరం రాసిన తండ్రి 'వీలునామా' కథలో రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి చిత్రించారు.

ఈ కథలో రైతుకు, మట్టికి ఉన్న సంబంధాన్ని తెలుసు కోవచ్చు. ఎంత అనుబంధం లేకపోతే అప్పులు అయినా, చివరకు ప్రాణం పోయేవరకు కూడా భూమిని అమ్మలేదు. తాను మరణించిన తర్వాత భూమి అమ్మమని కొడుక్కి చెప్తాడు. కారణం అప్పు తీర్చడం కోసమే. రైతు ఎవరికీ అన్యాయం చేయడు, కనుక ఎవరికీ అప్పు ఎగ్గొట్టదల్చుకోలేదు. కానీ రైతుకు మాత్రం ఎప్పుడూ అన్యాయమే జరుగుతోంది. కరువు కాటువేస్తుంది, ప్రభుత్వాలు సరిగ్గా ఆదుకోవు. అయినా ఎక్కడో చిన్న ఆశ... ఈసారైనా వర్షాలు సమృద్ధిగా పడి, పంటలు పండుతాయని. నమ్మి పంటలు వేస్తాడు. కానీ చాలాసార్లు ఫలితం తారుమారై, నీటి కోసం రకరకాల ప్రయత్నాలు చేసి విఫలం అవుతాడు. అందరికీ అన్నం పెట్టే రైతన్నకు మాత్రం మెతుకు కూడా దొరకదు అని రచయిత ఈ కథలో తెలియజేశారు

### భూమి పుత్రుడు :

మరో కథ 'భూమి పుత్రుడు'. ఇది కూడా మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసినదే. ఈ కథలో భూలక్ష్మయ్య వ్యవసాయ రైతు, కొడుకు చేసిన అప్పులు తీర్చడానికి తన చిన్ననాటి స్నేహితుడు మస్తాన్‌తో కలిసి బొంబాయి వెళ్ళి, నాలుగు లక్షలు సంపాదించి తెచ్చి, అప్పులు ఎలా తీరుస్తాడో చిత్రించారు రచయిత. ఈ కథ 'బొడ్రాయి' కథా సంపుటిలోనిది.

భూలక్ష్మయ్యకు దగ్గు, జ్వరం వచ్చి రోజు రోజుకు నీరసించి, ఎన్ని మందులు వాడినా తగ్గదు. దీంతో ఆందోళన చెందిన భార్య, కొడుకు హైదరాబాద్ హాస్పటల్‌కు తీసుకువెళ్తారు. అక్కడ రక్తం, మూత్రం ఎక్స్‌రే, స్కానింగ్ అన్ని పరీక్షలు చేయిస్తారు. రిపోర్ట్ చూసిన డాక్టర్ బల్లమీద పడుకోబెట్టి వీపుమీద చూస్తే వెన్ను పక్కన పొడవాటి కోత కన్పిస్తుంది. ఒకటే కిడ్నీ ఉంటది. రాంబాబును "ఈ మధ్య మీనాన్న బొంబాయి వెళ్ళాడా" అని అడుగుతాడు డాక్టర్. "పదిహేను రోజుల కింద మస్తాన్ అంకుల్ అప్పు ఇప్పిస్తాను అంటే వెళ్ళి నాలుగు లక్షలు తెచ్చాడు సార్" అంటాడు. ఈ వార్త చదువు అని పేపర్ రాంబాబుకు ఇస్తాడు డాక్టర్. 'కిడ్నీ బ్రోకర్ మస్తాన్, మస్తాన్ బొంబాయిలో అరెస్ట్ మాయ మాటలతో అమాయకులను మోసం చేసి కిడ్నీ వ్యాపారంలో



కోట్లు కూడబెట్టిన మస్తాన్ జైలుపాలు' (భూమి పుత్రుడు: 86) వార్త పక్కన మస్తాన్ ఫొటో ఉంటుంది. సత్తెమ్మ రాంబాబులకు భూలక్ష్మయ్య డబ్బులు ఎలా తెచ్చాడో అప్పుడు అర్థమైంది.

ఈ కథలో చిన్ననాటి మిత్రులను కూడా నమ్మవద్దని తెలుస్తుంది. రైతుకు భూమిమీద ఎంత ప్రేమ ఉందో కిడ్నీ అమ్మడం చూస్తే అర్థమవుతుంది. ఎందుకంటే అప్పులు తీర్చడం కోసం భూమి అమ్మకుండా కిడ్నీ అమ్మాడు అని రచయిత ఈ కథలో తెలుయజేస్తారు.


### రైతుయాత్ర :

రాజకీయ నాయకులు సత్యం ఊర్లో రైతు యాత్ర సభ ఏర్పాటు చేసి, అందులో భాగంగా ప్రజాపార్టీ నాయకుడు (సత్యం) అతని పత్తిచేనులో అరక దున్నడం వల్ల అది విరిగి, వాడిపోయి ఎట్లా చనిపోయిందో 'రైతుయాత్ర' కథలో చూడవచ్చు. ఈ కథ కూడా మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'బొడ్రాయి' కథా సంపుటిలోనిది.



అంబటి వెంకన్న

*వానాకాలం కూడా వానలు పడక, కరువు రావడం వల్ల పంటలు ఎలాగైనా పండించాలని బోర్లువేస్తే నీళ్ళు పడలేదు. తోటలు ఎండిపోయి అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న రైతు... కొడుకుకు ఆఖరి ఉత్తరం రాసిన తండ్రి 'వీలునామా' కథలో రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి చిత్రించారు. వర్షం వస్తే నీరు నిల్వ ఉండే చెరువులు లేవని, రైతు పడే ఆవేదనను 'ఆనొస్తే చెరువేది' కథలో రచయిత అంబటి వెంకన్న చిత్రీకరించాడు. సరైన రుతువు (కార్తె)లో వానలు పడక వేసిన విత్తనాలు ఎండిపోయి, వానల కోసం ఎదురు చూడడం... ఒకవేళ వానొచ్చినా చెరువులు లేకుండా పోయాయని రైతు ఆవేదనను వ్యక్తపరిచాడు రచయిత.*



మేరెడ్డి యాదగిరిరెడ్డి

సత్యం, సుశీల ఇద్దరూ భార్యాభర్తలు. వీరు వ్యవసాయం చేసి జీవనం కొనసాగిస్తున్నారు. ప్రజాపార్టీ మండల అధ్యక్షుడు రంగారావు రైతుయాత్ర కొనసాగిస్తూ సత్యం ఎడ్లతో పత్తి చేనులో అరక దున్ని యాత్ర ముగించుకొని వెళ్ళి పోతాడు.

మరుసటి రోజు మిగిలిన కాస్త పత్తిచేను గుంటక తోలడానికి భార్యభర్తలు వెళ్ళి చూసేసరికి పచ్చగా ఉన్న పత్తిచేను అంత విరిగి చిత్తడి, చిత్తడి, దుక్కి దుక్కి కాళ్లకింద నలిగి వాడిపోయి, చనిపోయి ఉంటది. తమ అధినాయకుని మోజులో ఇవేవి పట్టించుకోలేదు సత్యం. అమావాస్య చీకటి, మీడియావాళ్ళు, పేపర్లవాళ్ళు, సెక్యూరిటీవాళ్ళు, చిన్నపెద్ద నాయకులు అధినాయకుని దృష్టిలో పడాలని ఒకరిమీద ఒకరు. అంతా చాళ్ళలో నడుస్తున్నారని అనుకున్నాడు. నిన్నటిదాకా ఊరించిన, మురిపించిన పత్తిచేను ఆనవాళ్ళు లేకుండా పనికి రాకుండా పోయేసరికి తట్టుకోలేక కండ్లు బైర్లు కమ్మి భార్యమీద ఒరిగిపోతాడు.

రాజకీయ నాయకులకు ఎన్నికలొచ్చినప్పుడే రైతులు గుర్తుకు వస్తారు. సభలు సమావేశాలు, యాత్రలు మొదలైనవి గ్రామాల్లో పెట్టి, వారి దగ్గరికి వచ్చి నన్ను గెలిపించండి మీకు అది చేస్తాం, ఇది చేస్తాం అని చెప్పి వెళ్ళిపోతారు. వారు ఎన్నికైన తర్వాత ప్రజలను పట్టించుకోరు. ఈ కథలో సత్యంకు చెందిన పత్తిచేనులో అరకదున్ని, రైతుయాత్ర ముగించి రంగారావు వెళ్ళిపోతాడు. రంగారావుతోపాటు ఇతర నాయకులు పత్తిచేను తొక్కారు. పత్తిచెట్టు వాళ్ళ కాళ్ళకు తగిలినాకాని అలాగే తొక్కుకుంటూ వెళ్ళిపోయారేకాని, ఆ చేను నాశనం అవుతుందని కనీసం ఏ ఒక్క నాయకుడూ ఆలోచించలేదు. అలా తొక్కడంవల్ల అది పనికి వస్తుందా? రాదా? అని ఆలోచించలేదు. వారి అవసరానికి మాత్రమే రైతును ఉపయోగించుకున్నారు. వారు గెలిచిన తర్వాత చేసేది ఏమీ ఉండదు గాని, అలా ఊరించడానికి రైతు చేనే కావాల్సి వచ్చింది. ఆ చేను నాశనం కావాల్సి వచ్చింది. రైతులు ఎంత అమాయకంగా జీవనం గడుపుతున్నారో ఈ కథ ద్వారా రచయిత తెలియజేశారు.

**మాయ :**

పంట పొలాల్లో ఫ్యాక్టరీల ప్రవేశాన్ని, దాని పూర్వపరాలను విశ్లేషించిన కథ 'మాయ'. ఈ కథ మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'బొడ్రాయి' కథా సంపుటి లోనిది.

మానవాళికి అన్నం పెట్టే రైతు భూముల్లో ఫ్యాక్టరీలు పెట్టడం వల్ల వ్యవసాయోత్పత్తులు తగ్గిపోతాయి, ఆ ఫ్యాక్టరీలు పెట్టిన స్థలమే కాకుండా మిగతా ప్రాంతాలలోని నీరు, గాలి కలుషితమై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొని, జబ్బుల బారిన పడి మరణిస్తున్నారు. కనుక వ్యవసాయ క్షేత్రాలకు దగ్గరలో ఫ్యాక్టరీలు నిర్మించి, రైతుల్ని, ప్రజల్ని ఇబ్బందులకు గురిచేయవద్దని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

**రైతు పుట్క :**

వ్యవసాయం చేస్తే రైతులు ఎన్ని కష్టాలు పడుతున్నారో స్వర్గానికి వెళ్ళిన ఓ రైతు దేవునికి చెప్పి, ఆ దేవుడిని భూలోకానికి తీసుకొచ్చి చూపించిన విధానాన్ని 'రైతు పుట్క' కథలో రచయిత ఎలికట్టె శంకర్రావు చిత్రీకరించాడు.


రైతు కష్టం రైతుకే తెలుస్తుంది. మరెవరికీ తెలువదు. రైతు పండించిన తిండి తింటారు. కానీ అతని బాధలు అర్థం చేసుకోరు. అందరికీ అన్నం పెట్టే రైతుకే అన్నం లేకుండా పోతుంది. ఎన్నో కష్టాలబారిన పడుతున్నాడు. భూమిమీద ఎవ్వరూ పట్టించుకునే నాథుడు లేడని, రైతు చచ్చిన తర్వాత స్వర్గానికి వెళ్తే అక్కడ దేవుడు "రైతు పుట్క పుట్టడం అదృష్టం కనుక నీవు మళ్ళీ రైతుగానే పుట్టు" అని అనగా, రైతు వెంటనే తేరుకొని "రైతుగా వద్దు, గాడిదగానైనా పుట్టించు" అని వేడుకుంటాడు.

అప్పుడు దేవుడు "అవునా! రైతుకు ఇన్ని కష్టాలుంటాయా!! అని ఆశ్చర్యపడి, వారి కష్టాలు చూడడానికి భూలోకానికి వస్తాడు. రైతు దీనస్థితి చూసి బాధపడతాడు. అంటే దేవునికి కూడా కష్టం తెల్వకుండా పోయింది. సమస్త మానవాళికి ఆహారం అందించే రైతుకు అండగా వుండి వారిని కష్టాల నుండి విముక్తి చేసే దిశగా ఆలోచించాలి. లేకుంటే మన కన్ను మనమే పొడుచుకున్న వాళ్ళమవుతామని ఈ కథ తెలుపుతుంది.

**అయిటివాన - మా ఆశ :**

ఎలికట్టె శంకర్రావుది వ్యవసాయ కుటుంబం. తన చిన్నతనంలో తల్లి దండ్రులు వ్యవసాయం చేసే విధానం, విత్తనాలు భూమిలో వేస్తే మొలవక పోవడాన్ని రచయిత 'ఆయిటి' వాన–మా ఆశ' కథలో చిత్రించారు.


*వ్యవసాయం చేస్తే రైతులు ఎన్ని కష్టాలు పడుతున్నారో స్వర్గానికి వెళ్ళిన ఓ రైతు దేవునికి చెప్పి, ఆ దేవుడిని భూలోకానికి తీసుకొచ్చి చూపించిన విధానాన్ని 'రైతు పుట్క' కథలో రచయిత ఎలికట్టె శంకర్రావు చిత్రీకరించాడు. సమస్త మానవాళికి ఆహారం అందించే రైతుకు అండగా వుండి వారిని కష్టాల నుండి విముక్తి చేసే దిశగా ఆలోచించాలి. లేకుంటే మన కన్ను మనమే పొడుచుకున్న వాళ్ళమవుతామని ఈ కథ తెలుపుతుంది.*





కోట్ల వనజాత

*విత్తనాలను బతుకునిచ్చే దైవంగా భావిస్తూ, ఇత్తు చేసే మాయలో రైతు ఎలా బలవుతున్నాడో చెప్తారు. హైబ్రిడ్ విత్తనాలను కొంటూ, వాటిని కాపాడటానికి ఎరువులు మందులు వేలకు వేలు పోసి కొంటూ రైతులు పడే యాతనను తెలుపుతుందీ 'ఇత్తు' కథ. విత్తన కంపెనీ మాయా జూదమని తెలియజేస్తుంది. 'పంట పని అయిపోతుంది. రేపు మనిషి పని కూడా అయిపోతుందని ఈ కార్పొరేట్ ప్రపంచం ప్రకటిస్తుందని' చెప్పకనే చెప్తారు ఈ 'ఇత్తు' కథా రచయిత్రి కోట్ల వనజాత. కాగా, ప్రభుత్వం రాత్రిపూట కరెంటు ఇవ్వడం వల్ల మిరపతోటకు నీళ్ళు కట్టడానికి వెళ్ళిన రైతు కరెంటు షాక్ తగిలి ఎట్లా మరణిస్తాడో 'కారెడ్లు-ఎకరం నేల' కథలో రచయిత శిరంశెట్టి కాంతారావు కళ్ళకు కట్టారు.*



శిరంశెట్టి కాంతారావు

రైతు 'ఆయిటి వానలు' వర్షాకాలం ప్రారంభంలో పడే వర్షాల కోసం(తొలకరి జల్లులు) ఎదురు చూస్తాడు. వానాకాలం వచ్చే సమయానికి చెట్టుచేమ కొట్టి, దుక్కులు దున్ని వర్షాలకోసం ఎదురుచూస్తాడు. వానలు పడకపోతే భూమిలో వేసిన విత్తనాలు ఎండిపోతాయని బాధతో దిగాలు పడతాడు రైతు. విత్తనాలు వేసేముందు పెట్టుబడికి అప్పుకోసం ఎదురుచూడాలి. విత్తనాలు వేసిన తర్వాత వానల కోసం ఎదురుచూడాలి. బాధలన్నీ తట్టుకొని కష్టపడి పంట పండిస్తే గిట్టుబాటు ధర కోసం ఎదురు చూడాల్సివస్తుంది. అది కూడా రాకపోతే అప్పులు అన్ని మీదపడి ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి రైతుది అని ఈ కథ ద్వారా మనం గ్రహించవచ్చు.

**పశువులంటే మా నాయనకు పానం :**

రచయిత ఎలికట్టె శంకర్రావు. వీరి తండ్రి వ్యవసాయం చేస్తూ, పశువులను కన్నబిడ్డల్లాగా మాహా పావురంగా పెంచి, వాటికి పని నేర్పుతాడు. అరక కట్టి, దున్నిన ముసలి ఎద్దు 'ఎత్తుబడితే' దాన్ని ఏ విధంగా సాదుతాడో 'పశువులంటే మా నాయనకు పానం' కథలో ఎలికట్టె శంకర్‌రావు వివరించారు. వీరి కథా సంపుటి 'పరిగెచేను'లోనిది ఈ కథ.

ఈ కథలో రైతు వ్యవసాయ పనిలో పాల్గొనే ప్రతిదాన్నీ ఎంతో ఆప్యాయంగా, ప్రేమగా, ప్రాణంగా చూసుకుంటాడు. అటువంటి రైతు జీవితాన్ని ఈ కథలో వివరించాడు రచయిత. వ్యవసాయంలో ప్రధాన పాత్ర పోషించేవి పశువులు. ఎడ్లు, బర్లు, ఆవులు మొదలైనవి. అటువంటి పశువులకు ఏదైనా గాయం అయినా, గడ్డి తినకపోయినా రైతు విలవిలలాడుతాడు.

ఒకవేళ చనిపోతే దాన్ని తినేవాళ్ళకు కూడా ఇవ్వడు. దానిని మనిషి మాదిరిగా బొందపెట్టి గౌరవించే స్వభావం గలవాడు రైతు. మూగ జీవాలపట్ల రైతుకు ఎంత గౌరవముంటుందో ఈ కథ ద్వారా తెలుస్తుంది.

**ఆనొస్తే చెరువేది :**

వర్షం వస్తే నీరు నిల్వ ఉండే చెరువులు లేవని, రైతు పడే ఆవేదనను 'ఆనొస్తే చెరువేది' కథలో రచయిత అంబటి వెంకన్న చిత్రీకరించాడు.

నీటికి ఆలవాలమైన వాగులు, వంకలు, కుంటలు, చెరువులు పూడ్చి... పొలాలు, చెలకలు, ఇండ్లు కట్టుకోవడం వల్ల చెరువులు అంతమయ్యాయని, దీంతో నీళ్ళులేక పంటలు పండక రైతులు బాధపడుతున్నారని ఈ కథలో రచయిత తెలిపారు. సరైన రుతువు (కార్తె)లో వానలు పడక వేసిన విత్తనాలు ఎండిపోయి, వానల కోసం ఎదురు చూడడం... ఒకవేళ వానొచ్చినా చెరువులు లేకుండా పోయాయని రైతు ఆవేదనను వ్యక్తపరిచాడు రచయిత.

**ఇత్తు :**

విత్తనాలను బతుకునిచ్చే దైవంగా భావిస్తూ, ఇత్తు చేసే మాయలో రైతు ఎలా బలవుతున్నాడో చెప్తారు. హైబ్రిడ్ విత్తనాలను కొంటూ, వాటిని కాపాడటానికి ఎరువులు మందులు వేలకు వేలు పోసి కొంటూ రైతులు పడే యాతనను తెలుపుతుందీ 'ఇత్తు' కథ. విత్తన కంపెనీ మాయా జూదమని తెలియజేస్తుంది. 'పంట పని అయిపోతుంది. రేపు మనిషి పని కూడా అయిపోతుందని ఈ కార్పొరేట్ ప్రపంచం ప్రకటిస్తుందని' చెప్పకనే చెప్తారు ఈ 'ఇత్తు' కథా రచయిత్రి కోట్ల వనజాత.

వ్యవసాయం మీద ఆధారపడిన రైతులకు వ్యాపారులు, దళారులు హైబ్రిడ్ కల్తీ విత్తనాలను అమ్మి మోసం చేసి వారిని అప్పుల పాలుచేసి, ఎన్నో రూపాలుగా నిత్యం దోచుకుంటూనే ఉంటారు. వ్యవసాయ రంగం ఇప్పటికీ వ్యాపార దళారుల ఆధిపత్యం కింద ఎలా నలిగిపోతోందో ఈ కథ వివరిస్తుంది.

**కారెడ్లు - ఎకరం నేల :**

ప్రభుత్వం రాత్రిపూట కరెంటు ఇవ్వడం వల్ల మిరపతోటకు నీళ్ళు కట్టడానికి వెళ్ళిన రైతు కరెంటు షాక్ తగిలి ఎట్లా మరణిస్తాడో 'కారెడ్లు-ఎకరం నేల' కథలో రచయిత శిరంశెట్టి కాంతారావు కళ్ళకు కట్టారు. ఈ కథ ఆయన కథాసంపుటి 'ఊత కర్రలు'లోనిది.

వ్యవసాయానికి అందించే విద్యుత్ సరఫరా విషయంలో సరైన సమయం పాటించకపోవడం వల్ల ఎంతోమంది రైతులు కరెంటు షాక్ కొట్టి చనిపోతున్నారని, అలాగే నర్సయ్య కూడా చనిపోయాడని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

**తెగిపడ్డ పల్లెలు :**

భూమిలోని పొరల్లో అనేక రకాలైన ఖనిజాలు, ఇంధనాలు మొదలైనవెన్నో ఉంటాయి. అటువంటి భూమి ఎక్కడ ఉన్నా, ఎవరు అడొచ్చినా ప్రభుత్వాలు స్వాధీనం చేసుకుంటున్నవి. కార్పొరేట్లకు కట్టబెట్టి, లంచాలు తీసుకోవడం కోసం ఎంతకైనా తెగిస్తున్నాయి. ఇందులో భాగంగా గ్రానైట్ అనే ఖనిజాన్ని తవ్వి తీయడం కోసం ఏకంగా రైతు భూములనే లాక్కుంటుందని ఈ కథ ద్వారా మనకు తెలుస్తుంది. తవ్వకం చేస్తారని, పొలాలను అమ్ముకొమ్మని పట్వారి చెప్పడంతో ఈ కథలోని పాత్రయైన మల్లేశం తన పొలాన్ని అమ్మలేక ఎట్లా మరణించాడో 'తెగివడ్డ పల్లెలు' కథలో రచయిత్రి సుజాత సూరేపల్లి చిత్రీకరించారు.

మల్లేశం వాళ్ళ ఊర్లో అంజన్న గుట్టకు గ్రానైట్ రాయిని తీయడం కోసం, పట్వారి రైతులందరిని పొలాలను అమ్ముకొమ్మని బెదిరిస్తాడు. దళితులకు పొలాలు ఎందుకని, తమ దగ్గర పని చేసుకొని బతకాలని, దళితులు పొలాలు అమ్మేటట్లు చేసి, పొలాల మీద మట్టి పోసి రోడ్డు వేస్తుంటారు. దీంతో మల్లేశం

తన పొలాన్ని, బర్లను, గొర్లను అమ్మలేక, పొద్దున లేచి పొలం కాడికి పోయి వస్తానని పోయి ఊరి అవతల చెట్ల దగ్గర మరణిస్తాడు. రైతులను పీడించి ప్రభుత్వాలు భూములు ఏ విధంగా లాక్కుంటున్నాయో, తద్వారా వారి బతుకులు ఎలా ఉంటాయో ఈ కథలో చూడవచ్చు.

**ముగింపు :**

నల్లగొండ జిల్లా ప్రాంతంలో రైతులకు నీళ్ళులేక ఎన్నో ఇబ్బందులకు గురి అవుతున్నారు. వీరు పంటలు పండించాలంటే ఎక్కువగా వర్షాలమీద ఆధారపడాల్సిందే. నీటి వసతులు తక్కువగా ఉండటంవల్ల బావులల్లో నీరులేక, భూగర్భంలోనూ నీరు లేకపోవడంతో బోర్లువేస్తే అవి కూడా సరిగా నీటికి పోయకపోవడం జరుగుతుండేది. వర్షాభావం, పంటనష్టం, అప్పులబాధ, వడ్డీ వ్యాపారుల వేధింపులకు రైతులు రోజూ ఆత్మహత్యలు చేసుకుంటూనే ఉన్నారు.

అందరికీ అన్నం పెట్టే చెయ్యి అన్ని చోట్ల చాచలేక, చెయ్యి చాచినా అప్పు పుట్టే దిక్కులేక రోజూ ఉసురు తీసుకుంటూనే ఉన్నారు రైతులు. ఆరుగాలం కష్టపడి అందరి కడుపు నింపుతున్నా, తన వాళ్ళకే పట్టెడన్నం దొరికే దిక్కులేక రోజూ ప్రాణాలు వదులుతూనే ఉన్నారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వేధింపులు, బ్యాంకులు కొత్త రుణాలు ఇవ్వక పోవడం, సర్కారు స్పష్టమైన ప్రకటన చేయకపోవడం వంటి అంశాలే అన్నదాతల బలవన్మరణాలకు కారణాలవుతున్నాయని రచయితలు ఈ కథల ద్వారా తెలియజేశారు.


వ్యవసాయం చేసే క్రమంలో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారు. పెట్టుబడి పెటి, పంటలు పండిస్తారు. కానీ గిట్టుబాటు ధర రాదు. అప్పులు అయినా భూమిపై ప్రేమతో దానిని అమ్మకుండా తన అవయవాలను అమ్మి తీర్చడం. అప్పులు చేయడమంటే వడ్డీ వ్యాపారుల చేతిలో బలవ్వడమే. రైతుల బాధలు తెలుసుకోవడానికన్నట్టు ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు పంట చేనులో తిరగడం వల్ల ఉన్న చేను కాస్త నాశనం అవడం. రైతు చచ్చినా దేవునిక్కూడా రైతు బాధ అర్థం కాకపోవడం. కల్తీ విత్తనాలు, వర్షాలు పడకపోవడం. ఖనిజ సంపద కోసం కార్పొరేట్ శక్తులు రైతు భూమిపై కన్నేయడంతో, ప్రభుత్వం బలవంతంగా రైతుల భూమిని లాక్కుని ప్రైవేటు సంస్థలకు అప్పగించడం మొదలైన వాటితో రైతు జీవితం అల్లకల్లోలం అవుతుందని ఈ కథల్లోని వస్తువు స్పష్టంగా తెలియజేస్తుంది.

నల్లగొండ జిల్లాలో కథా రచయితలకు కొదువ లేదు. రైతును కథా వస్తువుగా తీసుకొని కథలు రాసిన వారిలో ప్రధానంగా మేరెడ్డి యాదగిరి రెడ్డి, ఎలికట్టె శంకరరావు, అంబటి వెంకన్న, కోట్ల వనజాత, శిరంశెట్టి కాంతారావు, భూతం ముత్యాలు, బెల్లి యాదయ్య, దేవులపల్లి కృష్ణమూర్తి, సూరేపల్లి సుజాత మొదలైన వారున్నారు.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. కాంతారావు శిరంశెట్టి-2012. ఊత కర్రలు (కథాసంపుటి) హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్
2. కృష్ణమూర్తి,( దేవులపల్లి. 2012. కథల గూడు (కథాసంపుటి) హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్ట్
3. యాదగిరిరెడ్డి మేరెడ్డి. 2016. బొడ్రాయి (కథాసంపుటి) మిర్యాలగూడ: ధృతి ప్రచురణలు
4. రజిత అనిసెట్టి, 2017. తెలంగాణ రచయిత్రుల కథలు (కథాసంకలనం). హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్.
5. వనజాత కోట్ల. 2014. ఇత్తు-కోట్ల వనజాత కథలు (కథాసంపుటి) హైదరాబాదు: స్పృహ సాహితీ సంస్థ
6. శంకర్‌రావు ఎలికట్టె. 2015. నల్లగొండ కథలు (కథాసంకలనం) నల్లగొండ: నోముల సాహిత్య సంస్థ
7. శంకర్‌రావు ఎలికట్టె. 2015. పరిగెచేను (కథాసంపుటి) హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్


# వరికంకి లాంటి నవ్వు





సిరికి స్వామి నాయుడు


ఎందుకో అనుమానమొచ్చి
పొద్దున్నే లేచి అద్దంలోకి తొంగిచూసాను !
నేను కనిపించలేదు !
కంగారుపడి కళ్లు పులుముకొని మళ్లీ చూసాను !
ఇంద్ర భవనంలాంటి ఇల్లు కనిపించింది !
బీరువాల్లో బుసలుకొడుతున్న
నల్లనాగుల పుట్ట కనిపించింది !
బంగారం గుట్ట కనిపించింది !
రంగుల హరివిల్లు కనిపించింది !
మేలిరకపు టైరుగిట్టల గుర్రాలు కనిపించాయి !
పసిడి సింహాసనపు పాదపీఠం ముందు
సమస్త సేవక పరివారం కనిపించింది !
కానీ .. నేను కనిపించలేదు !

కాసేపు పోయాక తేరుకొని
తేటపడ్డ నీటిలోకి తొంగి చూసినట్టు
లోన అద్దంలోకి చూసాను !
పల్లె గుండెల మీద
నా తొలినాటి పాదముద్రలు కనిపించాయి !
పూరి గుడిసెమీద పున్నమిపొద్దు కనిపించింది !
వెన్నెల్లచెట్టు కింద ఆడుకుంటున్న
ఆనాటి బాల్యం కనిపించింది !
తెంపుకొచ్చిన బంధాల తుంపులు కనిపించాయి !
తొక్కుకొచ్చిన తోవల్లో ..
మనిషితనపు అవశేషాలు కనిపించాయి !
నడిచొచ్చిన దారుల్లో ..
విడిచి వచ్చిన విలువలు కనిపించాయి !
యింకిపోయిన ఆశల సెలయేటి
ఆనవాళ్లు కనిపించాయి !
కూలిన మమతల పందిళ్లు కనిపించాయి !
కూలిపోయిన మట్టిచెట్లూ, రాలిపోయిన పిట్టగూళ్లూ
కుమిలిపోయిన కొండశిఖరాలూ కనిపించాయి !
ఏనాడు పోగొట్టుకున్నానో ..
వరికంకిలాంటి నవ్వు కనిపించింది !
అన్నింటికంటే .. నేనెక్కడ దారితప్పానో .. అక్కడే ..
కాలం ఉరికొయ్యకు ఊగాడుతూ నేను కనిపించాను !!


*కవి సెల్: 94940 10330*

యు.జి.సి. జాతీయ సదస్సు

# తెలుగు కథా వికాసం - సామాజిక ఉద్యమాలు

## తెలుగు & అనువాద అధ్యయన శాఖ

## ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

## ధృవపత్రం

2019 మార్చి 1,2 తేదీలలో తెలుగుశాఖ నిర్వహించిన జాతీయ సదస్సులో

శ్రీమతి/శ్రీ/డా/ ప్రొఫెసర్ చింతపల్లి దేవయని, హైదరాబాద్ విశ్వ.వి. పాల్గొన్నారు.


నల్లగొండ జిల్లా కథలు - దళిత జీవితం.

అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు.

01/03/19

ప్రొఫెసర్ శ్రీకంఠి పెంచలయ్య
కుల సచివులు i/c

ప్రొఫెసర్ కిన్నెర శ్రీదేవి
సదస్సు సంచాలకులు



# DEPARTMENT OF TELUGU
## MADURAI KAMARAJ UNIVERSITY
MADURAI - 625021 TAMILNADU

**INTERNATIONAL WEBINAR ON**

# Telugu Katha - Vasturupa Vaividhyam

7th & 8th September, 2020

## Certificate

This is to certify that ***Ch. Devaiah,*** *Ph.D. Research Scholar, Dept. of Telugu, University of Hyderabad, Hyderabad* actively participated and presented a paper titled *'Nallagonda Jilla Katha Sahithyam – Vasthurupa Vaividhyam'* in the two days International Webinar on ***'Telugu Katha - Vasturupa Vaividhyam'*** organized by the Department of Telugu, School of Indian Languages, Madurai Kamaraj University, Madurai, Tamilnadu held on 7th & 8th September, 2020.

**Dr. J. Venkataramana**
CONVENER

**Dr. V.S. Vasantha**
REGISTRAR i/c

DEPT. OF TELUGU & COMP. LIT.
MADURAI 625 021
M.K.U